MBOIJ200

నిలయాలము

రచన

సురేంద్ర మహాంతి

అనువాదం

తాడిగడప మార్కండేశ్వరరావు



నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా
కొత్త ఢిల్లీ

111

1977 (1899)

© సురేంద్ర మహాంతి, 1974
తెలుగు అనువాదం © నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా, 1977

రూ: 13-50

Original title : NEELASAILA (*Oriya*)
Telugu title : NEELASAILAMU

డిస్ట్రిబ్యూటర్లు:
ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్లు
రాష్ట్రపతిరోడ్డు, సికింద్రాబాదు

Published by the Director, National Book Trust, India, A-5 Green Park, New Delhi - 110 016 and printed at Dakshina Bharat Press, Khairatabad, Hyderabad-500 004

HBOIT200

H:1-8:3
W:1-5:5

భూమిక

ఉత్కళదేశపు సాంస్కృతిక, ఆధ్యాత్మిక చరిత్రలో జగన్నాథుని స్థానము సర్వవిదితము. ఏదో ఒక నిర్దిష్టమైన మతము, మతవాదము లేక సాంప్రదాయక సంకీర్ణ పరిధులలో ఆబద్ధుడు కాడు జగన్నాథుడు. శబర విశ్వాసు మొదలు కొని ఆర్య ఇంద్రద్యుమ్నుడు, శైవ శంకరుడు, పాంచరాత్రిక రామానుజుడు, శుద్ధ భక్తివాద చైతన్యుడు, శూన్యవాదులైన బలరామ జగన్నాథులు, సిక్కు మత గురువైన నానక్ వరకు గల విసిధ ఆచార్యుల విభిన్న మతవాదములు, సంప్రదాయములు శ్రీ జగన్నాథుని మైత్రి సాధనలో ఇమిడి ఉన్నవి. శ్రీ జగన్నాథుడు బౌద్ధదంత గర్భితుడను నమ్మకముతో మహాబౌద్ధుని రూపములో బౌద్ధ మతస్థులు ఆ స్వామిని ఆరాధిస్తున్నారు. ఇస్లామ్ మతస్థుడైన సాల్‌బేగ్, యవన హరిదాసుఏంటి భక్తులుసూడ అనేకమైన భక్తి జఞాణులలో ఆయనను కీర్తించినారు. నిజమునకు సార్వజనీనమైన మానవ మైత్రి సాధనయొక్క ఇష్ట దేవతా రూపములో జగన్నాథుని పరికల్పన ఎంత అద్వితీయమైనదో అంత ఉదారమైనది, విశ్వవ్యాప్తమైనదీను.

ప్రత్యేక ఒరియా ప్రాణియొక్క అంతరంగమందు శ్రీ జగన్నాథునికి ఒక శ్రద్ధాయుతమైన విశిష్ట స్థానమున్నది. నిజమునకు అదొక సుపిస్తీర్ణ శరథి. ఇక్కడ శ్రద్ధ ప్రధానము, భక్తి గౌణము. ఓడ్రజాతికి జగన్నాథుని మించిన ఆంతరంగికుడు, ఆత్మీయుడు మరెవ్వరూ లేరు. అందువల్లనే "సర్వ మంగళ జగన్నాథు"ని స్మరించినంతనే ఒరియా గృహస్థుని సర్వ విపత్తులు, ఆశంకలు దూరమవుతూ ఉంటాయి. ప్రతి ఉత్కళ దేశవాని జగన్నాథుని "తాలాముహా" అని నిందా గర్భితముగ అన్నట్లే "జగా బలిఆ" అని శ్రద్ధాభక్తులతో పలుకు తుంటాడు. "కాలోసకో" అని కోపముతో అంటుంటాడు. 'పహండీ' సమయ

OOS T1084

...ఆయన విగ్రహమును పైకి ఎత్తుతాడు. క్రింద వేసి కొడతాడు. ఈడు సాధు ఇదికూడ ఓఢ్రుని దృష్టిలో ఆరాధనాంతర్భాగమే. ఈ విధముగ స్నేహాశ్రిత దృష్టితో జగన్నాథునిచూసే ఆచారము బహుశః శబరీ నారాయణుని కాలమునుండి ప్రారంభమై ఉండవచ్చును.

యథార్థమునకు జగన్నాథుని సమీపములో దేవతలు మానవులైనట్లే ఆయన సింహద్వారమువద్ద మానవులుకూడ దేవతలయినారు.

2

ఈ సత్యవిషయములన్నీ చాల మందికి తెలిసినవే.కాని ఉత్కళ సామ్రాజ్య రాజకీయ చరిత్రలో జగన్నాథునికి గల మహత్త్వపూర్ణమైన స్థానమునకు సంబంధించి క్రమబద్ధమైన విమర్శ ఏదీ జరుగలేదు. స్మరణాతీత కాలమునుండి ఏ పరిస్థితులలో ఉత్కళదేశ జాతీయ దైవముగ జగన్నాథుడు పూజింపబడుతూ వస్తున్నాడో అది సర్వ విదితము. కాని, 'మాదలా పాంజి' ననుసరించి పరిశీలించినట్లయితే అనంగ భీమదేవుని కాలమునుండి ఉత్కళ సామ్రాజ్య సింహాసనముమీద ఏ రాజునూ అభిషిక్తుని చేసే ఆచారము అమలులో లేదు.

"ఏహాంక (చూడగంగ) పుఅ (పుత్రి) అనంగ భీమదేవ్ ఏహాంక్ (తన) ఇచ్ఛారే కహిలే (అనినారు) అమ్భ నాఅం పురుషోత్తమదేవ్. ఏ నగర్ కర్కే థాయి (ఉండి) శ్రీ పురుషోత్తమదేవ్ శ్రీ జగన్నాథ దేవంకు సమస్త సమర్పి రాఉత్ పణే థా అంతి (సేవకుని విధముగా ఉంటాడు)...ఒడిసా రాజ్య రాజా జగన్నాథ మహాప్రభు ఏమత (అట్లు) కహి అభిషేక నోహిలే" — మాదలాపాంజి.

సూర్యవంశ చక్రవర్తులు కూడ గంగనుండి, గోదావరి వరకు విస్తరించిన ఉత్కళ సామ్రాజ్యాధీశ్వరునిగ జగన్నాథుని అభినుతించినారు. అందువలన సూర్యవంశ చక్రవర్తుల కాలములో ప్రధానమైన ప్రతి రాజ్య ప్రకటన శ్రీ జగ

న్నాథుని సమక్షములోనే ప్రకటింపబడుతుండేది. జయవిజయ ద్వారము వద్ద నున్న శిలా ఫలకము దీనికి నిదర్శనముగ నేటికి కూడ నిలిచి ఉన్నది. ఉత్కళ సామ్రాజ్య మర్యాదను కాపాడుట కొరకు శ్రీ జగన్నాథుడు రత్న సింహాస నాడంబరమును, మహత్తును వదిలిపెట్టి కాంచీ అభియానములో ఒక సామాన్య సేవకుని రూపములో బయలు దేరినాడు. ఈ సంఘటన పురుషోత్తమదాస్ రచించిన 'కాంచి-కావేరీ' కావ్యము మొదలుకొని ఒరియా సాహిత్యములోని అసంఖ్యాకములైన కథోప కథలను, నాటకములను అనుప్రేరితము చేసినది. ఈ కాంచీ యాత్రను చిత్రించనిదే ఒరియా చిత్రకారుల కళా పిపాస శాంతించదు.

పదునారవ శతాబ్దిలో ఉత్కళ స్వాతంత్ర్య వినాశనము తరువాత కూడ అక్బరు సేనాపతి అయిన మానసింహ్ కేవలము జగన్నాథుని కొరకే ఖోర్ధా రాజకీయ స్వాతంత్ర్యమును అంగీకరిస్తూ ప్రకటన చేసినాడు. "ఒరిస్సా భూ భాగము మానవుని ఉన్నతాకాంక్ష లేక విజయ లాలసను చరితార్థము చేయు టకు ఉద్దేశింపబడినది కాదు. అదొక దేవ రాజ్యము- ఒక ప్రాంతము నుండి మరొక ప్రాంతము వరకు నిఖిల మానవాళికి ఒక తీర్థభూమి అది—" స్టర్లీ.

కపిల సంహితలో కూడ ఒరిస్సా "సర్వ పాప హరం దేశం క్షేత్రం దైవైస్తు కల్పితమ్" అని అభివర్ణించబడినది. అందుచేత ఉప కథలలోని రక్త పాపు మొదలుకొని మొగల్ సేనాపతుల వరకు ఎంతమంది విదేశీయులు ఉత్కళ దేశమును లోబరచుకొనవలెనని ఎన్ని దాడులను చేసినారో వాటిలో దేనినుండి కూడ జగన్నాథుడు అసంవృత్తుడుగా ఉండలేక పోయినాడు. ఆ దాడుల సమయములలో ఆత్మ గోపనము చేసికొని ఉత్కళ స్వాతంత్ర్య సమర మును మాటి మాటికి అనుప్రేరితము చేస్తూ వచ్చినాడు. జగన్నాథునితో బాటు ఒరియాజాతి ఆ యుద్ధములలో మాటిమాటికి అజేయముగ నిల్చినది. ఉత్కళ జాతీయ జీవితములో శ్రీ జగన్నాథునికి గల ఈ మహత్త్వపూర్ణ స్థాన మును దృష్టిలో పెట్టుకొని ఈస్ట్ ఇండియా కంపెనీవారు ఓడ్రదేశమును తమ అధి

కారములోనికి తీసికొన్న తరువాత ఫోర్టు విలియమ్‌నుండి ఈ విధముగ ప్రకటించినారు.

"It has been the anxious solicitude and desire of the Commissioners founded upon the express orders of His Excellency the Most Noble Governor-General that no interference or intervention should be experienced at the Pagodah of Juggernath by any act of their authority."

3

పదునెనిమిదవ శతాబ్దిలో ఖోర్ధా భోయి రాజవంశపు రాజు రామచంద్ర దేవ్ (ద్వితీయ) ఇస్లామ్ మతములోనికి మతాంతరులై హాఫిజ్ కాదర్ బేగ్ పేరుతో పరిచితులయినారు. రామచంద్రదేవ్ ముసల్మానులైనప్పటికీ కూడ కటక్‌లోని నాయబ్-నాజిమ్‌గా ఉన్న హిందూ విద్వేషి తకీఖాన్‌యొక్క దాడినుండి జగన్నాథుని, తద్వారా ఉత్కళదేశ స్వాతంత్ర్యమును పరిరక్షించుటకుగాను విశ్వాస ఘాతుకత్వములు, బంధు ద్రోహములు, లోకాపవాదములు, నిందలు మొదలగు వాటి నన్నింటిని ఎదుర్కొంటూ వారు సంగ్రామ రతులయిన విధము ఎంత రోమాంచకరమయినదో అంత ప్రేరణా గర్భిత మయినదికూడ. 'మాదలాపాంజి'లో ఆయనను గురించి ఉల్లేఖించబడినది. గత శతాబ్దిలో పూరి రాజవంశమునకు చెందిన రాణీ సూర్యమణి పాట్ మహాదేయీ రాజా ముకుందదేవ్‌కు స్వీకృతిని ఇవ్వించవలసినదిగ ఆంగ్లేయులను అర్థించినప్పుడు అందులోగూడ హాఫిజ్ కాదర్ పేరును ఉటంకించడము కనబడుతుంది:

"As a precedent I take the liberty to bring to your notice that one of my ancestors named Rajah Rama Chandra Deb who ascended the throne in 1660 Sakabda (1725 A.D.) having been compelled to associate with a daughter of the then Mohammedan Noble was not allowed to perform the services of Jagannath or to enter the

Temple and as he expressed his desire to worship the idol the Patitapaban Dev, a representative of Jagannath was set up at Singhaduar (the Lion Gate of the Temple) in order that the fallen Raja might be able to see and worship it from outside."

రామచంద్రదేవ్ హాఫిజ్ కాదర్ పేరుతో ప్రసిద్ధి చెందినప్పటికిని జగన్నాథుని యెడల ఆయన మనస్సులో శ్రద్ధాభక్తులు ఉండినవి. ఆలయములోనికి రామచంద్రదేవ్ ప్రవేశము నిషిద్ధము కావడము వలన వారికి జగన్నాథ దర్శనము, సేవ లభించగలందులకు సింహద్వార గుమ్మటములో జగన్నాథుని పతిత పావనమూర్తి ప్రతిష్ఠించబడినది.

మత సంప్రదాయములకు అతీతుడై మైత్రీ దేవుడయిన యీ జగన్నాథుని మాన మర్యాదలను కాపాడుట కొరకు ఇస్లాంమత దీక్షితుడైన హాఫిజ్ కాదర్ బేగ్ (రాజా రామచంద్రదేవ్)యొక్క సంగ్రామమే ఈ నవలకు కథా వస్తువు.

రామచంద్రదేవుని వేదనా జర్జిరితమైన నిస్సంగ సంగ్రామములో ఇదొక అధ్యాయము మాత్రమే. తకీఖాన్ దాడినుండి ఓడ్ర జాతికి ఇష్టదైవమైన జగన్నాథుని రక్షించుట కొరకు రామచంద్రదేవ్ (హాఫిజ్ కాదర్) చాల సారులు రాత్రి సమయమందలి బందిపోటు దొంగవలె చిలికా సరస్సులోని అనామక స్థలములు మొదలుకొని ఆర్‌గఢ్ (గంజాము) లోని మేర్దా అరణ్యము వరకు కూడ తిరిగినారు. చివరకు తకీఖాన్‌యొక్క మతాంధత్వ పూరితమైన హఠము ఓటమిని అంగీకరించవలసి వచ్చినది. అది జగన్నాథుని స్పృశించను కూడ స్పృశించలేక పోయినది. దాని వలన ఖోర్దా రాజ్యము కూడ అజేయముగా నిలిచినది. ఈ నవల వాటన్నింటి యొక్క సంపూర్ణ వివరణము కాదు. అందు చేత ఇది అంశికము అసంపూర్ణము అనిపిస్తుంది కాని ఒక దృష్టితో చూసిన ట్లయితే జీవితమువలెనే కళకూడా అసంపూర్ణమైనదే. స్వయం జగన్నాథ విగ్రహము గూడ అసంపూర్ణమైనదే. కావి అభివ్యంజనలో ఆ అసంపూర్ణత యొక్క ఆస్వాదనము లభిస్తుంది. బహుశ: కళాక్షేత్రములో ఇదే నియమము ప్రయోజనీయముగా ఉంటుందేమో."

4

ఫకీర్ మోహన్‌కు తరువాతి కాలములో ఒరియా సాహిత్యములో చారిత్రాత్మిక నవల ఒక ముఖ్య నిధిగా పరిగణింపబడుతుండేది. ఆయినప్పటికి 'లఛ్మా' తరువాత మౌలికమైన చారిత్రాత్మిక నవలలు చాల తక్కువగానే రచింపబడ్డాయి, లేదా రచింపబడనే లేదని అన్నప్పటికీ అందులో అతిశయోక్తి ఏమీ ఉండదు. అట్టి పరిస్థితిలో పదునెనిమిదవ శతాబ్దపు రాజకీయ చరిత్రను ఆధారముగా తీసికొని ఒక చారిత్రాత్మిక నవలను రచించబూనడము నా వంటి వానికి దుస్సాహసమనే చెప్పవలసి ఉంటుంది. ఈ కార్యములో ఎంతవరకు సఫలీకృతుడ నయినానో సుధీపరులైన పాఠక మహాశయులే నిర్ణయించగలరు.

ఈ నవలలో వర్ణింపబడిన తకీఖాన్, రామచంద్రదేవ్, బక్షీ వేణు భ్రమరవర్, దివాన్ కృష్ణనరీంద్ర్, రజియా, లలితా మహాదేయీ మొదలైన పాత్రలు ఒరియా చరిత్రలోని పాత్రలే. మాదలాపాంజి, దానికి సంబంధించిన ఇతర పంజికలు మరియు చరిత్రలో వీనికి సంబంధించిన వివరములు లభిస్తాయి. ద్వితీయ రామచంద్రదేవును, అనేకమంది విమర్శకులు, నాయబ్-నాజిమ్ ముర్షిద్ కులీఖాన్ శాసకకాలములోని వాడని అంటారు. కాని మాదలాపాంజి ప్రకారము మహమ్మద్ తకీఖాన్, రామచంద్రదేవ్ సమకాలికులు. అందుచేత నేను గూడ ఆ విధముగనే అభివర్ణించితాను. ఇక్కడ చరిత్ర ముఖ్యము కాదు, గౌణము.

ఒరిస్సా చరిత్రలోని ఒక ఘోరమైన దుష్కాలములో అజేయముగా నిలిచిన ఒరిస్సా ప్రాణశక్తి యొక్క ఆలేఖనమే ఇక్కడ ముఖ్యము. ఈ యుద్ధము ఒక మతము, జాతి, లేక దేశమునకు విరుద్ధముగా జరిగినది కాదు. మానవ శత్రువుకు విరుద్ధముగా చేసిన ఒక నిస్సంగమైన, వేదనాభరితమైన, మత సంప్రదాయములకు అతీతమైన ఆదర్శనిష్ఠమైన యుద్ధము ఇది. భిన్న భిన్న యుగములలో ఈ యుద్ధము భిన్న భిన్న రూపములలో ఉంటూ వచ్చినది. నా యీ 'అంధ దిగంత' మైన నవలలోని ప్రాణకథ ఇదే.

X

పదిహేడు-పద్దెనిమిదవ శతాబ్దిలోని ఒరియా సాంఘిక, చారిత్రాత్మక వాతావరణమును సృజించుటకుగాను ప్రస్తుతము వాడుకలో లేని అనేక ప్రాచీన శబ్దములను నేను ఇందులో వాడినాను. ఈ శబ్దములు, వాటి ప్రయోగ పరంపర నేటికి గూడ జగన్నాథాలయములో కానవస్తున్నవి. ఈ ప్రాచీన శబ్దములు ఎంత భావద్యోతకములుగా ఉంటాయో, అవి ఎంత విశుద్ధమైన ఒరియా శబ్దములో, వాటి పునరుద్ధరణ, పునఃప్రచలనము వలన ఒరియా భాష ఎంత సమృద్ధము, పటిష్ఠము కాగలదో తెలియజేసే కొన్ని ఉదాహరణలు మాత్రమే ఇవి.

ఈ రకమైన నవలను రచించగలనని నేను ఊహించనైనా లేదు. కాని 1964 వ సంవత్సరములో జరిగిన రథయాత్రా సమయములో అతి సమీపము నుండి విగ్రహముల పహండీ విజయమును సందర్శించగల సౌభాగ్యము నాకు కలిగినది. జగన్నాథుడు ఒరియా జాతికి ఎంత ఆంతరంగికుడో ఆ నాడు ఆ మహాజన సాగరములో నేను చూడ గలిగినాను. యావత్ ప్రపంచములో ఇదొక శ్రేష్ఠమైన, వర్ణాతీతమైన, ప్రేరణాత్మకమైన దృశ్యముగా గౌరవింపబడే హక్కు దీనికి ఉన్నదని మాత్రము నేను చెప్పగలను. కాదంబరీ ప్రమత్తుడైన బలదేవుని దర్పయుతమైన పహండీ, మొగలిపూ కిరీటము (టాహిఆ) యొక్క సుందర భంగిమ, విజయ తూర్య ఘంటానాదములు, నా దృష్టిపథములో ఆ సమయమందు ఉద్భానితమైనవి—చరిత్రలోని అనేక ఋత, విఋత భాగములు, వాటిలో అజేయమైన ఒరియా ఆత్మాభ్యుదయము. అనాటి స్మరణీయమైన అనుభూతినుండి నాకు ప్రేరణ లభించినది—"నీలశైలము" దానియొక్క పరిణామమే. ఆ హృదయావేగ స్పందనము ఈ పుటలలో పాఠకులకు లభించ గలిగినట్లయితే ఈ అకించజ్ఞుని శ్రమ సార్థకమైనట్లే.

సురేంద్ర మహాంతి

ప్రస్తావన

ఒరియా నవలా వికాస ధారలో మొట్ట మొదటి నవల 'పద్మమాలి.' దీని తరువాత 'విభావిని', 'లఛ్మా' మొదలైన వాటిలో కానవచ్చే చారిత్రాత్మక లేక అర్ధ చారిత్రాత్మక రూపములు ఆ యా కాలములనాటి భారతదేశ రాజకీయ, ఆర్థికాది పరివర్తనలచేత ప్రభావిత మయినవని అనడములో సందేహములేదు. భారతీయ భాషలన్నిటిలోనూ ఆ కాలము చారిత్రిక నవలా ప్రారంభకాలమని చెప్పవచ్చును. అప్పటినుండి ఇప్పటి వరకు ఒరియా భాషలో ఈ నవలలేకాక 'కమల కుమారి', 'వీర ఒడియా', 'పద్మని', 'బలాంగి', 'ప్రతిభా', 'సీమాంత్' 'ఆహ్వాన్', మొదలైన నవలలు సుమారు ఏభై వరకు ప్రచురింపబడినవి.

స్వరాజ్యము సిద్ధించిన తరువాత క్రొత్త క్రొత్త పరిశోధనలు, క్రొత్త క్రొత్త జిజ్ఞాసలు, కొంగ్రొత్త కోరికలు, ఆశయములు, వాటి హర్ష విషాదముల ఫలితముగా భారతీయ నవల ఎక్కువ సమస్యా పరముగను, సాంఘిక ధర్మ పరముగను, యథార్థవాదయుతముగను, మనోవైజ్ఞానిక దృష్టితో ఎక్కువ జటిలముగను ఉండి వాటిలో అంతర్జాతీయ నవలా సాహిత్యములోని వేదనా విధురుడైన నిర్లిప్త మానవుని కఠోర జీవిత సంగ్రామము అధికముగ ప్రతిఫలిస్తున్నది. ఆధునిక యుగమునకు సంబంధించిన అనేక వాద వివాదములు, ప్రాచీన విలువల విస్మయకర పరివర్తనల మధ్య గతమునకు సంబంధించిన ప్రేరణలు లేక చారిత్రాత్మక ఉద్బోధనలు, ఆస్తిక భావములు లేత మనస్సులలో ఆశలను ఆశ్వాసించలేక 'హిప్పీజమ్' యొక్క నాస్తికత్వములో విలీనమై పోతున్న తరుణములో 'నీలశైలము' వంటి ఒక భక్తి రసాశ్రితమైన చారిత్రిక నవలా రచనకు శ్రీ సురేంద్ర మహాంతి ఉపక్రమించడము వారి నిర్భయత్వానికి, స్వతంత్ర దృక్పథానికి ఒక చక్కని నిదర్శనము. 'నీలశైలము' యావద్భారత

గౌరవమును, సర్వ జనాకర్షణను అందుకొనుటకు ఈ నిర్భయత్వము, ఈ స్వకీయత విశేషముగ ఉల్లేఖనీయమైనవి.

ఈ గ్రంథకర్త రచించిన మరొక నవల 'అంధ దిగంత్' మరియు ప్రస్తుత నవల 'నీలశైలము' ఏ వ్యక్తిత్వము, ఆత్మ విశ్వాసముతో రచింపబడినవో వాటి బీజము వారి ప్రథమ కథానిక 'బంది'లో దృష్టిగోచర మవుతుంది. అందులో వారి రచనా కౌశలము కథావిధానమును ఆశ్రయించినప్పటికీ అది కేవలము కథా కథనముతోనే సంతృప్తి చెంది ఆగిపోలేదు. ద్వితీయ ప్రపంచ మహాయుద్ధానంతర కాలమందలి అనేక పరిశీలనలను, చిత్ర వైచిత్ర్యములను సంతరించుకొంటూ వారి సృజనాత్మక శక్తి ఒక వృత్తాకార పథములో ముందుకు సాగిపోతూ ఓరియా కథా సాహిత్యమును శోభిల్ల జేసినది. దాని తరువాతి కాలములో వారి సృజనాత్మక శక్తి నవల, జీవిత చరిత్రలను ఆశ్రయించి స్వయం ప్రతిష్ఠితమైన, విపులమైన ఆత్మశక్తి స్రోతస్సుగ రూపొందినది. ప్రాచీన సాహిత్యములోని 'భావోద్రేక కారక శక్తి' లేక 'ఆహ్వాన ప్రవృత్తి' (Evocative aspect) వారి అధికాంశ కథా, నవలా రచనల్లో విద్యమానమై ఉన్నది. 'అంధ దిగంత్', 'నీలశైలము' నవలల్లోని ప్రధాన బిందువు మానవ జీవితములోని చిరంతన సంఘర్షణల నిర్ణివ్రమైన, కరుణాత్మకమైన, వేదనా వ్యథితమైన చిత్రీకరణమే. ఆ చిత్రీకరణము పాఠకుల హృదయములలో కలుగ జేసే భావవైచిత్రి, లేక భావరూపమే ఆ నవలా ద్వయము యొక్క చిరంతనత్వమునకు కొలబద్ద.

'నీలశైలము' సాధారణముగ భక్తి రసాత్మకమైన చారిత్రిక నవలగ పరిగణింపబడుతున్నది. కాని గుణాత్మక దృష్టితో మానినట్లయితే ఇది సంఘర్షణారతుడైన మానవుని కాలోత్తీర్ణమైన సంఘర్షణా చిత్రణముగ గోచరిస్తుంది. సంఘర్షణ యెడల శ్రద్ధే ఇక్కడ భక్తిగ పరిచితమవుతుంది. అపరాజేయమైన ఆత్మయొక్క పవ ధ్వనే ఇక్కడ మహా సంగీతముగ పరిణమిస్తుంది. అందు పలస చరిత్ర లేక ఇతిహాసము ఇక్కడ గౌణముగ ఉంటుంది.

చారిత్రిక దృష్టితో చూసినట్లయితే 'నీలశైలము' యొక్క కథావస్తువు పదిహేడు, పద్దెనిమిది శతాబ్దులకు సంబంధించిన ఘటనల ఆధారముగ వ్రాయ బడినది. ఖోర్ధా భోయీ వంశమునకు చెందిన రెండవ రామచంద్రదేవ్ ఆ కాలములోనే ముసల్మానుడై హాఫిజ్ కాదర్ పేరుతో పరిచితుడైన తరువాత కూడ కటక్ నాయబ్-నాజిమ్‌గా నుండిన హిందూ విద్వేషి తకీఖాన్ దాడినుండి ఒరియా జాతికి అంతరంగ ప్రాణశక్తి అయిన జగన్నాథుని రక్షించుటకుగాను ఆయన నిరవచ్ఛిన్నముగ జరిపిన సంగ్రామపు రోమాంచకర చరిత్రే నీలశైలము యొక్క ఘటనా ప్రవాహములో పరిస్ఫుటమయినది. నవలలో వర్ణించబడిన తకీఖాన్, రామచంద్రదేవ్, వేణుభ్రమరవర్, దివాన్ కృష్ణ నరీంద్ర్, రజియా, లలితా మహాదేయీ ఆదిగాగల చారిత్రిక పాత్రలతో జగుని, సర్దేయీ, సాన్ పరీఛా విష్ణు పశ్చిమ్ కపాట్ మహాపాత్ర మొదలగు కాల్పనిక పాత్రలను మేళవించి రచయిత ఉత్కళదేశ దుర్దినాలను మర్మస్పర్శకంగా చిత్రించారు. స్థూలముగా చెప్పవలెనంటే చరిత్రకు సంబంధించిన అనేక క్షత విక్షత పరిస్థితులలో అపరాజేయముగా నిలిచిన ఒరియా ఆత్మయొక్క ప్రాణ కథే 'నీలశైలము.'

చారిత్రాత్మక నవల నిజమునకు చరిత్రే అవుతుంది. అందువలన ఈ నవలలో చరిత్రకు సంబంధించని మాదలాపాంజి, జనశ్రుతి, కల్పనల ఆధారముగ సృష్టించబడిన ఓలికా తటమందలి పాడుబడ్డ పాయిక్ గ్రామము, సర్దేయీ సత్రము, శూన్యగిరి, పశువల రేవు, గురుబాయీ ద్వీపము మొదలగు స్థలముల విచిత్ర వర్ణనలలో మౌలికమైన ఘటనలు, చిత్తాకర్షకమైన పాత్రల సృష్టితోబాటు రచయితయొక్క అద్భుత సృజనాశక్తి, కల్పనా కౌశలము, కించదంతులు ఒక అపూర్వ చారిత్రాత్మక గౌరవముతో భాసిస్తూ ఉంటాయి. ఇక్కడ వాటి నన్నింటిని విస్తృతముగ చర్చించుటకు అవకాశము లేదు. అయినప్పటికీ మొత్తము నవలలోని కథా వస్తువుయొక్క వ్యూహ రచనలోను, ఘటనా ప్రవాహములోను పరిరక్షించబడిన స్వాభావికత నవలయొక్క చారిత్రిక వికాసమును, నడకను ప్రశస్తము చేసినదని మాత్రము ఇక్కడ చెప్పిన చాలును. ఘటనా ప్రవాహపు స్వేచ్ఛలో ఏది ముఖ్యము, ఎది గౌణము, అన్ని పాత్రల మానసికా

వేగమలు, సంఘాత క్రమములు క్రమ వికాసము చెందుతూ ఏ విధముగ అవు ప్రాణితమ లైనవో అది రామచంద్రదేవ్, జగుని, సర్దేయా, మాల్కుదా గ్రామము లోని విచ్చి పాయిక్ వ్యద్ధరాలు మొదలగు కొన్ని పాత్రలలో మనకు గోచ రిస్తుంది.

నవలలోని కథానాయకుడు రామచంద్రదేవ్ కథా ప్రారంభమునుండి మనకు సంఘర్షణ మయుడుగ కనుపిస్తాడు. పూరీలో జగన్నాథాలయము ముందు ఆక్రోశకుని రూపములోను, స్వర్గద్వారము వద్దకు నిర్జన గంభీర నిశీథిని వచ్చిన ఆగంతుకుని రూపములోను ఆయన ధైర్యము, భక్తి సులభమైన అభిమానము అర్థవంతముగ ఉన్నవి. ఆ తరువాత, చాలా అధ్యాయములలో చదరంగము ఆటద్వారా ఈ భావము ఎక్కువ జటిలముగాను, వేదనావిధురముగాను ఉన్నది. దేశము, ధైవము వీటి రక్షణకుగాను బహిశ్శత్రువులతోపాటు ఆంతశ్శత్రువుల విశ్వాసఘాతుకత్వములను, హీన స్వార్థములను, నీచ కుతంత్రములను ఎదు ర్కొంటూ ఆయన సంగ్రామరతుడుగా ఉండేవిధము నేటియుంత్రణా జర్జరితమైన అసహాయ మౌన సంఘర్షణకు ప్రాతినిధ్యము వహిస్తున్నట్లుగ ఉన్నది. అందు వలన వినేచించబడుతున్న ఈ నవలలోని గతత్వము, గత కాలముతోనే పర్యవ సితము కాలేదు. దీనిలో వర్తమానము గూడ సరిగనే ప్రతిఫలిస్తున్నది. 'The old man and the sea'లో హెమింగ్వే ఏ ఉద్దేశ్య సిద్ధి కొరకు నాయకుని దురంతమైన జీవిత సంగ్రామముయొక్క మూర్తీభూత రూప కల్పనను అంతు లేని సముద్రపు పృష్ఠభూమిలో చేసినాడో ఆదే ఉద్దేశ్యమును, జీవిత సంగ్రామ మును సురేంద్ర మహాంతియొక్క రామచంద్రదేవ్‌కూడ మూర్తీభవింప చేస్తు న్నాడు. ఈ సంగ్రామ నైరాశ్యములో కానవచ్చే ఆశాకిరణపు క్షీణరేఖ శాశ్వత మైనది, మానవతా వాదముతో కూడుకొన్నదీను. అందువలన సమస్త కష్టములు, విపర్యయములు, ప్రేమ, విచ్ఛిలత్వముల పునాదిపైన ఈ పాత్రలు స్వచ్ఛంద ములుగాను, ఆకర్షణీయములుగాను రూపొందినవి. మతమును, సంఘమును త్యజిం చిన రామచంద్రదేవ్ సంగరహితమైన రాత్రినాటి ఏకాంత నక్షత్రమువలె సంపూర్ణముగ రిక్తుడు, ఏకాకి అయిన తరువాతకూడ ఆయనలోని పౌరుషము,

అభిమానము అచలముగ నిలిచి ఉంటాయి. ఇదే బహుశా నేటి యుద్ధరతమైన ప్రపంచమునకు రచయిత యీ పాత్రద్వారా ఇచ్చే ఆశ, ఆశ్వాసనముల సందేశము. రజియాతో 'శబ్-యి-బరాత్' నాటిరాత్రి ప్రథమ సమావేశ ముహూర్తములో వేదనా పీడితమైన మానసికా లోడనములోగూడ ఈ అచలత్వము నిలిచి ఉంటుండి. స్థూలముగా మానవుని అవ్యాహతమైన జైత్రయాత్ర యొక్క రూప కల్పన ఈ నవలలో రామచంద్రదేవ్ ద్వారా జరిగినది.

జాతీయత రామచంద్రదేవ్‌లోని ఉల్లేఖనీయమైన ప్రత్యేకత. చిలికా సరస్సులోని గురువాయీ ద్వీపములో శ్రీ జగన్నాథుని ఆశీసుని చేసిన తర్వాత రామచంద్రదేవుని నోటివెంట రచయిత వెలిబుచ్చిన జాతీయతా బోధ అత్యంత భావపూరితముగను, హృదయ స్పర్శకముగను ఉన్నది.

సంక్షేపముగా చెప్పాలి అంటే నవల మొత్తములో రామచంద్రదేవ్ ఒక భక్తుడు, వీరుడు, దేశభక్తుడు, త్యాగి, కర్మనిష్ఠుడుగ నిలుస్తాడు. ఆయన గుణ శీలములను నవాలాకారుడు అనేక దిశలలో మలచి ఆయన భావాంతరాలను, మానసిక ప్రతి క్రియలను ప్రాసంగిక తాత్త్వికతను పరిస్ఫుటీకరించడములో కృతకృత్యుడైనాడు.

రామచంద్రదేవుని ఈ యథార్థవాద గుణశీలములకు భావావేశముతో గూడిన తాత్త్విక చింతనను చక్కగా రూపొందించి సాటిలేని తన కళానైపుణ్యమును రచయిత ప్రదర్శించినాడు. కరుణ, జిజ్ఞాస, అనంతమైన నైరాశ్యములకు అంతర్వాణి ఉన్నదనుట సత్యదూరము కాదు. అయినను ఆశాపూరిత జీవితమునకు అది ఒక అవ్యక్తమైన లిపి మాత్రమే. మతాంతరుడైన విదప రామచంద్రదేవ్ తన ప్రశ్నలకు తానే చెప్పుకొన్న సమాధానములలో ఆయన పొందిన అనుభూతే ఆయన నిజ స్వరూపమును పరిచయము చేస్తున్నది. మత ద్రోహియైన హాఫిజ్ కాదర్‌గా కాని, దుర్బల మనస్కుడైన రామచంద్రదేవుగా కాని ఆయన చరిత్రకు పరిచితుడై ఉండవచ్చును. కాని, చరిత్రకు ఊర్ధ్వమున నున్న అంతర్యామి దృష్టికి మాత్రము ఆయన ఆనంతమైన సంఘర్షణ, గ్లాని, అంతర్వేదనల మూర్తీభూతమైన చైతన్యముగ కానవస్తాడు.

రామచంద్రదేవ్‌వంటి ముఖ్య పాత్రలేకాక మాల్‌కుదా గ్రామములోని ముసలి పాయిక్‌రాణువంటి ఏక పార్శ్వ పాత్రలను చూసినప్పటికికూడ రచయితయొక్క సృజనా చాతుర్యము స్పష్టముగ కనుపిస్తుంది. ఆ ముసలిది తన అనంతమైన తిట్ల వర్షముద్వారా హాస్యరస సాధనముగ ఉపకరిస్తుంది. ఈ దృష్టితో చూసినట్లయితే ఆ పాత్ర ఫకీర్ మోహన్ సేనాపతియొక్క 'రేవతి'లోని ముసలి తల్లితో తులతూగుతుంది. కాని ఈ రహస్యము చాటున దేశభక్తి జనితమైన వ్యాకులత, తీవ్రమైన కరుణల ఆభాసము దాగి ఉన్నది. అదే ఆ పాత్ర లోని ప్రత్యేకత.

మరొకవంక సర్దేయీ, జగుని ఝంఝూమారుతములో ఎగిరిపోయే ఎండు టాకులవలె గోచరిస్తారు. భూతభవిష్యత్తులు లేని ఈ పాత్రల దైన్యములో హద్దు లేని వైచిత్ర్యమున్నది. రక్తమాంసముల ద్వంద్వాలు, ఆలోడనములమధ్య ఇవి వాస్తవికముగానే కనిపిస్తాయి. విడంబనాపూర్ణుడైన జగన్నాథుని దర్శనోత్కంత, అంతర్మథనము, ఆవేగముల మధ్య సర్దేయీ విడంబనాపూరితమైన నారీత్వపు ఉజ్జ్వల ప్రతిరూపముగ గోచరిస్తుంది. రథయాత్ర అనంతరము జనశూన్యమైన సత్రములో ఆమె ఆంతరంగములో ఉదయించిన ప్రశ్నలు మానవ జీవితముయొక్క చిరంతన జిజ్ఞాస, శోభ, అసంతృప్తుల సజీవ ప్రతీకలు. పాపపుణ్యాముల భయము, జీవితమంతా అంతులేని నిరీక్షణలో నిరర్థకమైన నారీత్వము మరియు ఆదర్శములమధ్య నిత్యమూ జరుగుచుండే ఎనలేని సంక్షోభమే భాగీరథీ కుమారుని చూసిన విధవరాలు సర్దేయీ అంతరంగములో ఆ రాత్రంతా చెలరేగుతూ ఉంటుంది. పర్యవసానముగ ఆమె అనుభూతిలో కానవచ్చే జైవికోత్తాపము, ఉన్మత్త భావములనుండి ఈ నవలలో అనేక అద్భుత పరిస్థితుల కల్పనకు అవకాశము కలిగినది. అందుచేత సర్దేయీయొక్కశూన్య జీవితము, వేదనార్ద్రమైన అనుభూతి ఆమె ఆర్ధచేతనత్వపు విశ్లేషణలో స్పష్టముగ గోచరిస్తున్నవి. ఒక గౌణ పాత్రగా ప్రవేశించి ఆమె నవలను పూర్తిగ ఆక్రమించుకొన్నది. రచయిత భాషలో సర్దేయీ ఆయన "అర్ధ చేతనత్వపు సృష్టి." భాగ్యవిడంబితమైన ఉత్కళదేశము ఆమెలో రూపొందినట్లుగ ఉన్నది.

సర్దేయాకి కార్యశక్తి, ఆలంబన మరియు ఆదర్శములకు అప్రమత్తుడైన కావలివాడు జగుని. సామాన్య మానవుని మోహమాయ ఈ పాత్రను ప్రాణవంతము చేయుటకు సహాయకారి అవ్వతున్నది. నవలయొక్క మిగతా భాగములో సర్దేయాపట్ల అతనికి గల ఔదాసీన్యములో అతని కర్మనిష్ఠ యొక్క పరిచయము లభిస్తుంది. చిలికా సరస్సులోని ఆపదారహితమైన స్థలములో జగన్నాథుని భద్రపరస్తున్నప్పుడు జగునిలోని అనాసక్త భక్తిలో కేవలము సర్దేయా మాత్రమే లేదు. అతని హృదయములో నున్నవి ఒక నిర్భయ కార్యనిర్వహణ. జగన్నాథుడు, జగన్నాథునియొక్క చలాయమానమయిన విష్ణుప్రతిమ, ఖోర్ధా రాజుగారికి సహాయము, తన కర్తవ్య నిర్వహణలోని అస్వస్తికరమైన వాస్తవములను మరచిపోవ్వటకు అజ్ఞాత కృషి. అందువలన నవలలో అతని భూమిక చిన్నదైనను నవలలోని ఘటనల క్రమ వికాసములో అతని పాత్ర ఉల్లేఖనీయమయినది.

ఇదే విధముగ అనేక ప్రధాన, గౌణ పాత్రల ఘటనా ప్రవాహముతో బాటు చారిత్రిక సౌందర్యము వలన కూడ 'నీలశైలము' మహామాన్వితమవుతున్నది. వర్ణనలకన్న ఎక్కువగా సంకేతములు, సూచనలు, ఘటనావర్తనల ద్వారా చరిత్ర సులభమైన అభీప్సు (motive) ఫలవంతముగ ప్రకటితమవుతున్నది.

పుష్కిన్‌వలె ఈ నవలాకారుడు సురేంద్ర మహాంతి తన చరిత్ర విన్యాసములో చారిత్రిక సత్యములు, గుణశీల యోజనా స్వకీయత, సామయిక వాతావరణముల సమత్వమును పరిరక్షించుటలో కృతకృత్యుడయినాడు. నవలలో ఉత్కళదేశపు ఆశాసిరాశలు, వీరత్వ భీరుత్వములు, గౌరవాగౌరవములు అఖండముగ చిత్రాంకితమైనవి. ఒరిస్సా చరిత్రలో మరుగుపడిన అనేక అధ్యాయములను వెలికితీసి వాటిని పునర్జీవింప చేయవలెననే ప్రయత్నములో వ్యాస రచన వంటి వర్ణనాశైలి మరియు దార్శనికత్వముల ఆశ్రయమును నవలలో అక్కడక్కడ రచయిత చేపట్టవలసి వచ్చినది. ఆయన కలము నడచిన ప్రతి అంశములోను

ఆయన స్వకీయ శైలీ ప్రతిభ దృగ్గోచరమవుతున్నది. పదిహేడు పద్దెనిమిది శతాబ్దులనాటి సామాజిక, చారిత్రిక వాతావరణమును సృష్టించుటకుగాను ఆయా కాలములనాటి ఒరియా, యవన పదములను రచయిత వాడినారు. ఆ శతాబ్దుల భావ చైతన్యము నిర్దుష్టమైనది. కథావస్తువుతో తాదాత్మ్యము పొందిన రచయిత శైలి ప్రత్యేకముగా గమనించ తగ్గది. కావ్య భాషలోవలె వారి అభివ్యక్తిలో ప్రతి ఒక శబ్దములోని ధ్వని, సంగతి, వ్యంజనము నవాలాకారుని హృదయము యొక్క బౌద్ధిక విలక్షణతను ప్రకటిస్తున్నవి

కళ స్వభావతః సౌందర్య ప్రధానమయి ఉంటుందన్న విషయాన్ని విశ్వసిస్తున్నప్పటికీ నవలాకారుడు ఉద్దేశ్య మూలమును విడనాడలేదు. అందు చేతనే నవలలోని కథా వస్తువును పాత్రలు, మరియు ఘటనల ప్రవాహములో డి. హెచ్. లారెన్సువలె కొట్టుకొని పోనివ్వలేదు.

దీనికితోడు శక్తిమంతమైన శైలి మరియు ఓజ గుణములతో పరిపూర్ణమైన వాతావరణములో "నీలశైలము"లోనిపాత్రలస్థితి,సంఘర్షణల చిత్రీకరణ అత్యంత వాస్తవికముగ రూపొందినవి. నవలాకారుడు రూపొందించవలసిన సంఘర్షణ కేవలము దేహ సంబంధమైన లేక జగత్ప్రయోజనా బోధకమైన సంఘర్షణ కాదు. అది దేహాత్మల సమ్మిశిత సంగ్రామము. నవలలో భక్తి, దేశప్రేమ ఒక్కొమ్మడిగ సమ్మిశితమై ఉన్నవి. అందువలన 'నీలశైలము' ఎంత జాతీయతా ప్రబోధకమో అంత భక్తిరసాప్లుతము, ఎంత రుద్ర కఠోరమో అంత కాంతా కోమలము. చారిత్రికమైన కథా వస్తువుకు, కథోప కథనాలకు భక్తి శ్రద్ధలను జోడించి ఒక అపూర్వమైన భావ గుంఫనమును రచయిత సృష్టించినాడు. అది భారతీయ నవలా క్షేత్రములోనే అరుదైనది. అందుచేత కుంజగర్ నాయకుడు, సర్దేయా, రామచంద్రదేవ్వంటి పాత్రలు ఆ భావమయ జగత్తులో సంచరించే ఒక్కొక్క సశరీర చేతనా రూపముగా పరిగణింపబడుతున్నప్పటికీ, వాటి తిక్త మధుర స్థితిని, నిర్మితిత జీవన జిజ్ఞాసను పూర్తిగా విస్మరించుట అసంభవము. జీవిత యుద్ధములో అవి కేవలము ఓడ్రదేశపు లేక ఒరియా జాతి

యొక్క అజేయమైన గౌరవాభిమానములకే కాదు. 'నీలశైలము'లోని జగన్నాథునివలె విశ్వ చైతన్యము, నిఖిల మానవాత్మలకు కూడ ప్రాతినిధ్యము వహిస్తాయి. అందుచేతనే అవి జయింపరాని, అణచలేని మహాపూర్ణత్వము యొక్క ఆద్యంతరహితమైన భావ విహ్వలతకు ప్రతిమూర్తులుగ నిలబడతాయి.

కథా వస్తువు, పాత్రలు, వాతావరణము, భాష, భావము, వీటి దృష్టితో పరిశీలించినట్లయితే 'నీలశైలము' ఒక సార్థకమైన నవలేకాక, సరళము, విషాద భరితము అయినచరిత్ర, ఇతిహాసముకూడ. ఇందులో స్వస్తి ఉన్నది, గ్లానికూడ ఉన్నది..... మరి మహా చైతన్యముయొక్క ఒక అపరాజేయమైన ప్రకాశము కూడ ఉన్నది.

పీతాంబర్ ప్రధాన్ "ఉపగుప్త"

మొదటి అధ్యాయము

ఎండలో కాలిన మరుగుజ్జు మర్రిచెట్ల మెలి తిరిగిన మోడలు, భూమిని చీల్చుకొని పుట్టలలోనుండివచ్చి రోగులవలె నిలుచుని ఉన్న ఖర్జూరపు మొక్కలు, తీగెలు అల్లుకొన్న మామిడిచెట్లు, కానుగ, పున్నాగ, మోదుగ మొదలగు వివిధ తరులతాదులు గల చిట్టడివి అది. ఆక్కడొకటి ఇక్కడొకటిగా మధ్యమధ్య నిర్జన సత్రములు. మెలికలు తిరిగిన నిర్జీవమైన కొండచిలువవలె ధూళిధూసరితమైన జగన్నాథ మార్గమున్నది. ఆకాశములోని బూదిదరంగు మేఘములు మాటునుండి మధ్యాహ్నసూర్యుని తెల్లని కిరణములు కాంతిహీనముగ ప్రసరిస్తున్నవి. ధూసరితమైన వెలుగులో నలుదిక్కులు బూదిద పులుము కొన్నట్టుగా ఉన్నవి. ఆ బాటమీద ఒక్కబాటసారికూడ లేడు. బాటకు ఇరువైపులను ఉన్నచెట్లమీది పక్షులుగూడ మౌనముగనే ఉన్నవి. ఒక అస్వాభావికమైన నిశ్శబ్దము చుట్టూ ఆవరించి ఉన్నది. అటువంటి నిర్జన మార్గమున చింతాకుల దృష్టితో పూరీవైపునకే కాటోలు ఆశ్వికుడొకడు గుర్రము మీద నెమ్మదిగా వెళ్లుచున్నాడు.

నేడు భాద్రపద శుక్ల ఏకాదశి, పూరీలో జగన్నాథస్వామివారి పార్శ్వపరివర్తనము జరుగును. రేపు "సుని౽", అనగా వామనజన్మ. దాని తరువాత యదువంశవీరుడు శ్రీ గజపతి గౌడేశ్వర నవకోట కర్ణాట కళ వర్గేశ్వర వీరాధివీర శ్రీ శ్రీ శ్రీ రామచంద్ర మహారాజా వారి ఏడవ అంకము సమాప్తమై ఎనిమిదవ అంకము ప్రారంభము కానున్నది.

ఉన్నట్టుండి ఆ యాశ్వికుడు పెద్దపెట్టున పిచ్చివానివలె నవ్వ నారంభించినాడు. దానితో గుర్రము బెదరినది. అంతేకాదు, దారికి ఇరువైపులను గింజలను ఏరుకొని తినుచుండిన అడవి పావురములుగూడ ఎగిరి పోయినవి. తన నవ్వుకు తానే శంకించి, అకారణ భయముతో అతడు నలువైపులను చూసినాడు.

కాళ్లజోళ్లతో గుర్రమును తేలికగా తట్టి ముందుకు తన ప్రయాణమును సాగించినాడు. గుర్రపుదెక్కల తాకిడికి పైకి లేచిన దుమ్ము, మేఘమా అనే భ్రమను కలుగజేస్తున్నది.

"సునిఆ" లేక వామనజన్మ పండుగ సమయములో పూరి వెళ్లే ఈ మార్గము పంచక్రోశీయాత్రిక బృందములతో నిండి ఉంటుంది. ఒకరు ఇద్దరు ఎడ్లబండ్లమీద పడమటినుండి వచ్చిన, కాలినడకను కొందరు, పల్లకీలలో మరి కొందరు, యీ విధముగా వివిధ విధములుగ ఈ పంచక్రోశీ యాత్రికులు ప్రతియేట వచ్చుచుందురు. మేఘవర్ణపు, నీలపు, ఎరుపు రంగు చీరల వైభవము గాని, సఖుల చెలిక త్రెల హాస పరిహాసములు గాని, యాత్రికుల కేరింతల కోలాహలము గాని, ఈయేడు ఆమార్గమీద లేవు. గౌడదేశమునుండి వచ్చే ఆ ఒకరిద్దరు వైష్ణవులుగూడ ఆ మార్గములో కానవచ్చుటలేదు.

ఒరిస్సాలో మొగలాయీల అల్లరులు, అత్యాచారములు తిరిగి చెలరేగనున్నవని అనుమానము మొలకెత్తిననాటినుండి శ్రీక్షే తమునకు వచ్చు యాత్రికులసంఖ్య ఇంచుమించు శూన్యము. కాని "నాయబ్-నాజిమ్"గా సుజాఖాన్ ఉంటున్నప్పటినుండి 'జిజియా' పేరిట జరుగు దురాగతము అంతమయినది. 'జిజియా' పేరుతో దోచుకొను ఇజారాదారుల భయము లేదనియే చెప్పవచ్చును. సుజాఖాన్ కాలములో జగన్నాథుడు కూడ మొగలాయుల అత్యాచారములనుండి కొంతవరకు నిశ్చింతుడుగనే ఉన్నాడు. కాని 'నాయబ్-నాజిమ్'గ కటక్‌కు తకీఖాన్ వచ్చినప్పటినుండి మొగలాయీల తీవ్రదృష్టి తిరిగి జగన్నాథునిపైన పడినది. మొగలాయీల అత్యాచారముల భయము వలన పూరీ వీధులలో కాకులే వ్రాలకుండ ఎగిరిపోవుచున్న వనిన ఇక యాత్రికులు ఎచ్చట నుండి రాగలరు.

మొగలాయీలు పిపిలీలో మరల టోలుగేటు తెరచినారు. ఒకానొక చెప్పరాని భయముతో ఉద్విగ్నుడైన ఆ యాశ్వికుడు పిపిలీ బజారు దాటువరకు త్వరితగతిలో గుర్రమును దౌడు తీయించినాడు. పిపిలీ దాటిన తరువాత గుర్రపు పరుగు మందమయినది.

ఎదురుగ భార్గవీనది. అందులో సన్నని నీటిపాయ ఒకటి సన్నని త్రీ మధ్యమువలె మెలికలు తిరిగి ప్రవహిస్తున్నది. సాయం సూర్యుని అరుణ కిరణములు మేఘములమధ్య మణులవలె నీటి ప్రవాహములో ప్రకాశిస్తున్నవి.

ఆశ్వికుడు ఒక నిట్టూర్పు విడిచి ఎత్తుమూర్గమును ఎక్కుటకు ప్రారంభించినాడు

భాద్రపద మాసము సగము గడచినను ఒక్క వర్షపు చినుకు గూడ పడలేదు. లోటిచేతి దానమువలె శ్రావణములో పడిన నాలుగు చినుకులతోనే నైతులు కొద్దిగ సాగు చేసినారు. గట్టుచుట్టూ ఆవరించిన నిష్కరణపు నైరాశ్యము మధ్య పచ్చని కలలవలె చిన్నచిన్న వరిమొక్కలు తలలు పైకెత్తి చూచుచున్నవి. "ఝూలన్ ఏకాదశి" గడచిన తరువాత వర్షమన్నదే మరిలేదు. శ్రావణపూర్ణిమ నాడైన నేల తడవలేదు. పొలములలోని పంటలు ఎండలకు మాడిమసి కానున్నవి. జగన్నాథ మార్గమునకు ఇరువైపులను కనుచూపుమేరలో ఈ మాడిన పొలములు తప్ప వేరేమియు కానవచ్చుటలేదు. అస్థిపంజరముల వంటి ఆవులు, గేదెలు ఎండు మట్టిని వాసన చూచుచు ఇటునటు తిరుగుచున్నవి. కంకాళ సదృశులైన నల్లని నీడలవంటి మానవులు అక్కడక్కడ తిరుగుచు ఆ పొలములలో ఏమి వెదకు చున్నారో తెలియదు.

ఇంక కరువు రాక తప్పదు. అన్నట్టున్నది. ఒక "భరణము" ధాన్యము వెల ఎన్ని 'కాహాణము'లో తెలియదు. మనిషిని మనిషి చంపుకు తినే రోజులు వచ్చట్టున్నవి. ఒక జాతినే కబళించివేయవలెనని తన కరాళ జిహ్వా గహ్వరమును బహుళా ప్రకృతి తెరచినదేమో!

పూరీ ఇంకను చాలాదూరమున్నది. భార్గవీధార మరియొకటి ఎదుటనున్నది. ఆశ్వికుడు కళ్లెమును బిగించి గుర్రమును నిలివినాడు.

ఆశ్వికునికి వెనుదిరిగి దండ ప్రణామము చేయుచున్న యాత్రికుడొకడు మార్గమునకు అడ్డముగ నిలుచుని ఉన్నాడు. ఆ నిలుచుని ఉన్నది మానవ రూపమో మానవ ప్రేతమో ఆ యాశ్వికునికి తెలియలేదు. దీర్ఘప్రయాణ

శ్రమవలన కాటోలు ఆ యాత్రికునికి కాళ్ళూ, చేతులు ఉబ్బియున్నవి. వస్త్రము లను చుట్టబెట్టినందు వలన కాటోలు క్షతాక్తమైన అతని మోకాళ్లు వికృతముగ గోచరించుచున్నవి. ప్రయాణ బడలిక వలన చెమటపట్టి దుమ్ము కొట్టుకొనిపోయి నందువలన అతని శరీరము రంగు మారినది. చిక్కులు వడిన అతని కేశములు వీపుపైని వ్రేలాడుచున్నవి.

తన దుర్భరాహారమును ఆ యాత్రికుడు తన వక్షస్థలముపైకి తీసికొని నాడు తరువాత తన చేతిలోని ఒక ఇటుక ముక్కను ముందుకువిసరినాడు అది పడినచోటువరకు ఆ బాటపైని దుమ్ములో పడుకొని దండప్రణామము చేయుచు వెళ్లినాడు. తరువాత లేచి నిలబడి మరల ఆ యిటుక ముక్కను విసరినాడు. మరల దండప్రణామము చేసినాడు.

అనంతకాలమునుండి మానవుడు వేలాది ఉత్థాన పతనములు, సంఘాత విఘాతములు, వేదనా యంత్రణల మధ్య తన జీవితయాత్రను కొనసాగించుచునే ఉన్నాడు. అతని యాత్రకు చరమ లక్ష్యము ఒకే ఒకటి. జనన మరణ రహిత మైన జీవన్ముక్తియే ఆ లక్ష్యము. చిరకాలము ఆ యాత్రా పథములో పయనిం చినకాని ఆ లక్ష్యము అతనికి సిద్ధించదు. అది చిరగమ్య మానమైనది. అయి నను ముక్తి పిపాసతో ఆ లక్ష్యము కొరకు అతడు ఆత్మసంధాన మొనర్చు కొనుచు శ్రమను లక్ష్యము చేయకుండ, కఠిన తపఃక్లేశములను సహిస్తూ, పరాజయములను అధిగమిస్తూ పరుగెత్తునునే ఉన్నాడు. బహుశా యితడు ఆ ఆక్లాంతుడు, అవదమితుడు, అపరాజేయుడు అయిన తీర్థయాత్రికుడే నేమో!

వారించినా ఆగనిది ఈ తీర్థయాత్ర. తకీఖాన్ భయంవలనగూడా తన చంచల గతిని ఇది పోగొట్టుకొనలేదు.

నేడు ఏకాదశి.

శ్రీమందిరములో మహా ప్రదీప దర్శన సమయములో ఖోర్ధారాజును చార ణులు ఇప్పుడు కీర్తించడము లేదు. వారిప్పుడు బక్షీ వేణు భ్రమరవర్ హరిచం దన మహాపాత్రను కీర్తిస్తున్నారు. బక్షీ మనస్సు ఎటువంటిదో! అనేక విష

యములు వినవస్తున్నవి. కనుక రెండు కళ్లు రెండు చెవులు నేడుమూసుకొనక తప్పదు.

అశ్వికుడు తన గమన వేగమును హెచ్చించినాడు

2

"హే జగన్నాథా! నీవు ఎవరి మానమర్యాదలు కాపాడినావయ్యా! మాన రక్షకుడవని కీర్తింపబడుచున్న నీవు నీ మానమర్యాదలనే కాపాడుకొన లేక పోయినావే! రాజూ ఖాన్, కాలా పహాడ్ నిన్ను తోలుపటకాతో బంధించి, ఎడ్ల బండికి వ్రేలాడగట్టి ధాన్యపుబస్తాలాగ గౌడ మార్గముమీద ఈడ్చించినారే! నిన్ను నీవు రక్షించుకొనలేని వాడివి నా మానమర్యాదలను నీ వేమి కాపాడగలవు స్వామీ!

శ్రీమందిర సింహద్వారము ముందు మేఘనాథ ప్రాచీరాన్ని అంటిపెట్టు కొని, చికటిలో నీల చక్రమువైపు దృష్టిని సారించి పైపిధముగా ఆక్రోశిస్తున్న వాని కళ్ళు ఏ అవ్యక్త భావోద్వేగము వల్లనో, ఏ ఆత్మాభిమానము వల్లనో, ఆకస్మికముగా అశ్రుపూరితములైనవి.

ఆనాటి, మధ్యాహ్నము నిర్జనమైన జగన్నాథ మార్గమున పయనించిన ఆ యాశ్వికుడే ఈ ఆక్రోకుశదన్న విషయము అప్పుడు అక్కడ వెలుగుఉండి ఉంటే విదితమై ఉండేది

"కాదు, కాదు; నాకేమీ మానమర్యాదలు ఆక్కరలేదు నీమాన మర్యా దలు నిలిచి ఉంటేచాలు. హే జగన్నాథా! నీ గౌరవము కాపాడడానికే కదయ్యా నేను నీనుండి దూరమయినాను; ఆహా! ఇప్పటికీ నీ శ్రీహస్తమునుండి 'దయనా' పుష్పాల సుగంధము వెలువడుతూనే ఉన్నది! ఇప్పటికి నీ పద్మపలాశ నేత్రాలు నన్ను రమ్మనమని పిలుస్తూనే ఉన్నవే! "నేను మహా మరణాన్ని.....మహా

ముక్తిని.....ఓ ఆమాయకుడా! నీ అభిమానాలన్నీ మరచి తిరిగి రా! ఇక్కడే శాంతి ఉన్నది. మోక్షమున్నది. పునర్జన్మ బంధనాలన్నిటిని త్రెంచుకొని నీల నిర్వాణము ఇక్కడేడిన్నది."నా దారిలో ముళ్ళుఉన్నాయి. స్వామీ! ఆ ముళ్లను, నా చేతులతో నేనే పరమకొన్నానయ్యా! అయినా నాకా బాధలేదు. విచారము లేదు. నేను పతితుణ్ణి అయిన అవుదునుగాక! నీ మాన మర్యాదలు, ఉత్కళ దేశపు గౌరవమర్యాదలు నిలిచి ఉంటే నాకు చాలు".

మబ్బులాటు వెన్నెలలో శ్రీ మందిరపు నీల చక్రాన్ని కన్నార్పకుండా చూస్తున్న అతనికి ఏదో జ్ఞప్తికి వచ్చినది. అది గతకాల విషయము. ఆ రోజులలో అతనికి పదమూడు, పదునాలుగేండ్ల వయస్సు ఉండవచ్చును. ఆ యేడు భయంకరమైన తుఫాను వచ్చినది. ఆ తుఫానుకు దేవాలయములమీది చక్రములు కూడా విరిగి క్రింద పడినవి. నలుగురూ చెప్పుకోగా విన్న ఆ భయంకర విషయాలు ఇప్పటికి బాగా జ్ఞాపకమున్నాయి. ఆ రోజున, ఆ కాళరాత్రిలో శ్రీ మందిరపు చక్రము విరిగి భండ గణపతి ఆలయమువద్ద ఎగిరిపడినది. నీల చక్రము విరిగిపడినదని విని, తన తండ్రితోగూడ గుర్రముమీద సునాఖలాగడ్ నుండి తాను పూరీవచ్చిన విషయము ఇప్పటికింకా జ్ఞాపకమున్నది.

ఈ అమంగళకరమైన అపశకునమువలన, మొగలుల అత్యాచారాలు తిరిగి ప్రారంభము కాగలవన్న భయము దేశమంతావ్యాపించడముతో, "జాగ్రత్తగా ఉండవలసినదోహో!" అన్న హెచ్చరికలు వినవచ్చినాయి.

దివ్యసింహదేవ్ మహారాజావారి ఛాయారూపము ఆ యాక్రోశకుని కండ్ల ముందు కదలాడినది. ఆజానులంబితమైన ఆ రెండు బాహువులలోని అభయము, విశాలవక్షముతో పోటీ పడుచున్న హృదయవైశాల్యము, ఆ ప్రశాంత నేత్రాలలోని గాంభీర్యము అతని ఎదుట మూర్తిభవించినాయి.

ఔను. ఆ యేడు నాయబ్ నాజిమ్ సుజాఖాన్ ఓర్ధామీదకు దండెత్తాడు. కాని దివ్యసింహదేవ్ సుజాఖాన్ సైన్యాన్ని సారంగగడ్ వరకు తరిమికొట్టినాడు. మొగలుల అల్లర్లు అంతమయిన తర్వాత దివ్యసింహదేవ్ మహారాజావారి ఇరవై ఒకటవ అబ్దములో శ్రీమందిరము మీద నీలచక్రము తిరిగి ప్రతిష్ఠితమైనది.

"మహాప్రభో! దివ్యసింహదేవ్ మహారాజా వారిని నీ శంఖములో దాచి, నీ చక్రము చాటున వారిని సురక్షితముగా ఉంచు స్వామీ!" అని ఆనాడు మహా ప్రదీప సమయములో చారణులు స్తుతించారు.

నేడుమూడా మహా ప్రదీప సందర్శనము జరుగుతుంది. కాని నేడు ఐక్షీ వేణు భ్రమరనర్ హరి చందన్ నామమును చారణులు కీర్తిస్తారు.

నేడు ఖోర్ధా మహారాజు తమంతట తామే తమ రాజ్యమునుండి నిర్వాసితు లైనారు.

మేఘావృతమైన వెన్నెలలో తడిసిన సంధ్యాసమయము గబ్బిలము రెక్కలాడించినట్లుగా "బడ్దాండ్" మీదికి నెమ్మడిగా దిగ నారంభించినది. దేవదారు, నారికేళ వృక్షాగ్రములు విరక్తులైన అపధూతల రూక్ష చూలికలవలె దూరముగా 'రథదాండ్' నుండి గోచరిస్తున్నవి. ప్రేతనగరములో వ్యాపించి నట్లు నిశ్శబ్దము నలుదిక్కులా ఆవరించినది. విందామన్నా ఏదీ వినబడదము లేదు. సంధ్యాసమయములోని శంఖారావము కాని, హారతి సమయములోని ఘంటారావము కాని, కనీసము శిఖరోదనమైన కాని, మరి ఇంకేదైనా శబ్దము కాని వినబడదము లేదు.

ఆక్రోశకుడు కట్టి ఉంచిన అశ్వము తన గిట్టలతో నేల గీరుతున్న శబ్దము మాత్రము దక్షిణ దిక్కునుండి వినివస్తున్నది.

"సాన్‌పరిఛా విష్ణు పశ్చిమ్ కబాట్ మహా పాత్ర ఇక్కడే కదా కలుసు కొంటానని మాట ఇచ్చినాడు. తన వాగ్దానాన్ని మరచి పోయినాడా ఏమి?"

ముఖమండప గుమ్మటములో ఎడమవైపు వేదికమీద సిందూరలిప్తమైన ద్వారపాలుడు, వీర హనుమానుని పెద్ద విగ్రహము దీపకాంతిలో భయంకరముగా కనివిస్తున్నది. ఇద్దరు దేవాలయ రక్షక 'పాయిక్'లు భంగుమత్తులో ఘనిగి, వేదిక దిగువను గోడనానుకొని జోగుతూ కూర్చున్నారు. రోజూ కసరత్తు చేస్తూ ఉండడముచేత కాబోలు బలిష్ఠమైన వారి శరీర కందరములు బంతుల్లాగ మెలి తిరిగి ఉన్నవి. వారు లంగోటీలు మాత్రమే కట్టుకొని ఉన్నారు. బొడ్డు

క్రిందిగా కట్టుకొనడం వలన వారి బొజ్జలు మరీ లావుగా కనిపిస్తున్నవి. మిగతా శరీరము అనాచ్ఛాదితముగానే ఉన్నది.

రథయాత్రను చూడవలెనని వచ్చిన యాత్రికులు మొగలాయుల ఆల్లరుల భయముతో శ్రీ క్షేత్రమును విడచి పెళ్లిపోయినారు. రథయాత్రకు వచ్చే దూర ప్రాంత యాత్రికులు "ఝూలన్" తర్వాతనే మామూలుగా వెళుతూ ఉంటారు. కాని హిందూ ద్వేషి అయిన తకీఖాన్ ఏనాడైతే నాయబ్-నాజిమ్‌గా పచ్చినాడో ఆనాటినుండి ఉత్కళదేశపు ఆర్థచేతన మనస్సు ఒకానొక అవ్యక్త భయముతో నిండిపోయినది. అందువలన పంచక్రోశ యాత్రికుడు ఒక్కడుకూడా కనివించ డములేదు. నైమిత్తిక దర్శనాభిలాషులైన క్షేత్రవాసులు తప్ప ఇతరులు ఎవ్వరూ ఆలయములోనికి రావడము లేదు. ఆశరీర ఛాయల్లాగ వారి రాకపోకలు ఆలయ నిశ్శబ్దమును మరింత పెంచుతున్నవి.

ఆలయమునకు వచ్చిన ఏ యాత్రికుని పద సవ్వడినో విని అప్పు డప్పుడు ఆలయ రక్షకులు భంగు మత్తులోనుండి కొంచెము తెప్పిరిల్లి తమ గదలను సరిచేసుకొంటున్నారు. ఒక రిద్ధరు గౌడ వైష్ణవులో, మానభంగ భీతి లేని ఆ క్షేత్రవు వృద్ధనివాసినులో ఆలయానికి వచ్చేవారు. భక్తిభావపూరితమైన కంఠముతో వారు ప్రభునామస్మరణ చేసుకొంటూ''బాయాస్ పావచ్ఛల"పవిత్ర ధూళిని తిలకముగా ధరించి ముఖమండప గుమ్మటములోనికి వెళుతూ ఉంటే ఆ ఆలయ రక్షకుల ముఖములలో చిరాకు స్పష్టముగా గోచరిస్తున్నది.

ఆలయ రక్షకులలోని ఒక మల్లుడు దగ్గుచూ బయటకువచ్చినాడు. సింహ ద్వారమునకు ఎదురుగానున్న "బడ్‌దాండ్" నిర్మానుష్యముగా నున్నది. దారికి ఇరువైపుల నున్న ఇండ్లలో నుండికాని, మఠాలలో నుండికాని దీపరేఖలైనా కాన రావడములేదు. ఆకాశములో నలువైపులా మేఘాలవల్ల చీకట్లు గాఢముగా ఆలుము కొంటున్నవి. మరింత చల్లగా గాలి వీస్తున్నది.

సింహద్వారపు గుమ్మటములో వెలుగుచున్న దీపజ్వాలగాలికి రెపరెపలాడినది. ఆ గ్రుడ్డి వెలుగులో సింహ ద్వారమును ఆనుకొని నిలుచుని ఉన్న ఆక్రోశకుని

నీడను చూసి, "ఎవరక్కడ? మాట్లాడకుండా దీపపు స్తంభములాగ నిలుచున్నా వెందులకు?" అని ఆ మల్లుడు అడిగినాడు.

ఆక్రోశకుని శరీర మంతా శంకతోను, ఉత్తేజముతోను కంపించి పోయినది. సమాధానము చెప్పకుండా అతడు అలాగే నిలుచున్నాడు. ఆ సమయము నకు రెండవ ఆలయరక్షకుడుకూడ బయటకు వచ్చాడు. అతడు నడుము మీది అంగవస్త్రమును బిగించుకొంటూ అదే పనిగా అటుచూస్తూ "ఇతడు కాపాలికుడు మిత్రమా! ఇతనితో లావాదేవీలు ఏమీ పెట్టుకొనవద్దు. 'నాళన మయిపో' అని చెప్పి జోలిలో నుండి ఇంత ధూళి తీసి ఆతడు విసిరాడంటే చాలు, ఒడలంతా అగ్నిజ్వాలలలో చిక్కుకొన్నట్లుగా మండిపోతుంది" అన్నాడు.

ఇటువంటి కాపాలికులు కూడా జగన్నాథుని భక్తులే, కాని వీరు ఆలయములోనికి వెళ్ళరు. అందువల్ల ఆలయరక్షకులు ఇతనిని గురించి ఎక్కువగా పట్టించుకొనలేదు. వారు తిరిగి తమతమ స్థానములకు వెళ్ళిపోయినారు.

ఆక్రోశకుని నొసటి రేఖలు కుంచించుకొని పోయినవి. "...ఔను, నేను కాపాలికుడను గాక మరెవరిని?" అని అతడు మనస్సులోనే అనుకొన్నాడు.

ఆలయము వైపు వస్తున్న కొంతమంది దూరముగా కనుపించారు. సాయం సంధ్యాహారతి చూడడానికి వస్తున్న స్థానికప్రజలై యుండవచ్చు వారు. ఆ నిశ్శబ్ద వాతావరణములో వారి సంభాషణ అస్పష్టముగా వినవస్తున్నది.

"మొగలుల ఆల్లరులు మరింక చెలరేగవు. గజపతి రామచంద్ర దేవు ముసల్మానులైనారు. యవన స్త్రీ చేతి భోజనము!... కల్మా పఠనము! ఇప్పుడు వారు నాయబ్-నాజిమ్ తకీఖాన్‌కు బావగారు అయినారు కదా! మొగలులు మరి ఇంకెందుకు మన ఉత్కళ దేశముపైకి దండెత్తుతారు?" అని వారిలో ఒకడు అన్నాడు.

"సరే; దీనివలన రాజా వారికి విముక్తి కలుగుతుందేమో కాని మరి జగన్నాథునికో...!" అని మరియొకడు అడిగినాడు.

''జగన్నాథుని జయించకుండా, రక్త బాహునుండి కాలాపహాడ్ వరకు ఉత్కళ దేశముపైని దండెత్తిన వారందరూ విజయము సాధించగలిగినారా ? అందుచేత కల్మా పఠించి రామచంద్రదేవు విముక్తిపొందితే పొందియుంగవచ్చును గాక; కాని జగన్నాథునికి శాంతి ఎక్కడిది ;" అని ఇంకొకడు అన్నాడు.

"వేణు భ్రమరవర్ గజపతి అయితే బహుశా జగన్నాథుని గౌరవము నిలబడుతుందేమో ; ఎవరికి తెలుసు ? జగన్నాథుడు కూడ అలాగే చేస్తాడేమో! ఆయన మాయలు ఆయనకే ఎరుక," అని మొదటివాడు అన్నాడు.

ఇలా ప్రసంగించుకొంటూ వారు ఆలయ సింహద్వారము చేరారు. మొదటి ద్వారముపద్ద నున్న సింహమూర్తుల పాదములను స్పృశించి, ధూళిని నొసట ధరించారు. ఆ తర్వాత చెంపలు వేసికొంటూ ముఖమండప గుమ్మటములోని ప్రవేశించారు.

వారు ఆలయములోసికి అడుగుపెట్టగానే, "ఇక్కడొక చిల్లిగవ్వ పడవేసి పొందయ్యా, మేల్కొని ఉన్న ఈ హనుమాన్‌జీకి దక్షిణ సమర్పించకుండా తిన్నగా దర్శనానికి ఎలా వెళుతున్నారు; రథయాత్ర సమయములో ఉన్నట్టుగా పశ్చిమదేశ యాత్రిక బృందం శ్రావణ పౌర్ణిమ వరకూ ఉండి ఉండే సంపాదన బాగానే ఉండేది. ఇప్పుడు బడ్‌దాండ్ మీద కాకులు మాత్రమే ఎగురుచున్నవి. ఈసారి రథయాత్రకు వచ్చినంత మంది దివ్యసింహదేవుని కాలము తరువాత మరి రానేలేదు," అంటూ ఆలయ రక్షకులలో ఒకడు అరిచాడు.

భంగుమత్తులో వేరొకడు, "ఒరే, మిత్రమా ; నీవు గ్రహించలేక పోయావు. ఆ యాత్రిక బృందమంతా వేణు భ్రమరవర్ తయారు చేయించిన గుండిచా ఆలయంలోని జగన్మోహనుని విగ్రహమును చూడగానికి వచ్చినది. జగన్నాథ మహాప్రభుపుని భక్తులింతమంది ఉంటూ ఉంటాగా మ్లేచ్ఛ డొకడు వచ్చి రాజసింహాసనాన్ని అధిష్ఠించాడు...కాని భ్రమరవర్ మాత్రము అలా ఖాళీగానే ఉండిపోయాడు," అని కంపిత సర్వముతో అన్నాడు.

ఆలయ రక్షకులు మళ్ళా భంగుమత్తులో ఊగిసలాడడము ప్రారంభించారు. బయట ఆక్రోశకుడు ఒకసారి మేఘావృతమైన ఆకాశము వైపు చూసి దీర్ఘముగా నిట్టూర్చాడు. ఒక నక్షత్రము మినుకు మినుకు మంటూ మేఘాల మధ్యనుండి కన్పించింది.

వృశ్చికశతము కుట్టినంతగా బాధించే అనేక రాత్రుల దుశ్చింత ఆ నక్షత్రములోనుండి వెలువడి వచ్చినట్లయినది. నేడు వేణు భ్రమరవర్ హరిచందన్ మహాపాత్ర కోసము జయధ్వానాలు ఓడ్ర దేశపు నలుమూలల నుండి వినవస్తున్నాయి. ఖోర్ధా యొక్క భోయీవంశ మానమర్యాదలను బహుశా ఇతడే కాపాడవచ్చునేమో!...జగన్నాథుని ఔన్నత్యాన్ని గూడా ఇతడు నిలబెట్టవచ్చును.

హరేకృష్ణదేవు మహాపాత్ర వద్ద ఈయన తండ్రి భగవాన్ భ్రమరవర్ దివానుగా ఉంటూ ఉండేవాడు. శ్రీ నుందిరములోనికి మహా ప్రసాదమును తీసికొని వెళ్ళడానికి వంటశాలనుండి దేవాలయము లోపలివరకు పరచే 'పాహాడా'లను ఆయనే తయారు చేయించాడు.

ఆయన చిన్న కుమారుడు వేణు భ్రమరవర్ ఇప్పుడు గుండిచా ఆలయములో జగన్మోహనుని ప్రతిష్ఠింపించాడు. జగన్నాథునికి నిత్య 'బక్షిభోగము ఏర్పాటు చేశాడు. ఆయనే గనుక ఇప్పుడు ఉండిఉంటే మూడవ ఇంద్రద్యుమ్న్ని పేరు వచ్చి ఉండేది. ఈ విధమైన ప్రచారమును ఓడ్రదేశములో ఈ మూలనుండి ఆ మూలవరకు యాత్రికుల ఏజెంట్ల ద్వారా ఆయనే ప్రారంభించాడు.

శ్రీ క్షేత్రము నలువైపులా ఎవని నిశితదృష్టి ప్రసరిస్తున్నదో ఆ దుర్దాంతుడు నాయబ్-నాజిమ్ తకీఖాన్ కండ్లలో దుమ్ముకొట్టి గుండిచా ఆలయములో జగన్మోహనుని ప్రతిష్ఠింప జేయడము అంత తేలికైన పనేమీ కాదు. అయినా వేణు భ్రమరవర్ ఈ కష్టమైన కార్యాన్ని చేసి చూపించాడు. 'తెలంగ్ ముకుంబ్' కాలమునుండి నూరు, నూటపాతిక సంవత్సరములపాటు

ఉపేక్షింపబడిన ఒరిస్సాదేశ చరిత్రలాగున పడియున్న చలువరాళ్ళ స్తంభాలను వెలికి తీయించి వాటితో జగన్మోహనుని భ్రమర్‌వర్ తయారు చేయించాడు. పగలంతా అక్కడ నిశ్శబ్దముగా ఉండేది. రాత్రులందు మాత్రమే పనిసాగేది. వందలకొలది పని వాండ్రను నియమించి రాత్రులందు పనిచేయించి కొలది రోజులలోనే ఈ విరాట్ జగన్మోహన విగ్రహాన్ని ఆయన ప్రతిష్ఠింపజేశాడు. ఈ విధమైన ప్రచారము ద్వారా దేశము మొత్తముమీద వేణు భ్రమరవర్ యశోగానము ప్రారంభమయినది.

ఈ యేడు రథయాత్ర సందర్భములో 'ఛేరాపహరా' వేణు భ్రమరవరే చేశాడు. రాజు మ్లేచ్ఛుడు, పతితుడూ అయినాడు. అంచువలన 'ఛేరాపహరా' ఇవ్వడానికి ఆయన పనికిరాడు. ఐతే ఆయనకు బదులు 'జేనామణి' అయిన భాగీరథీకుమార్ ఆ పని చేయవచ్చును గదా! బడా (పెద్ద) పరీఛా అయిన గౌరీ రాజగురుపే ఈ తమాషా లన్నింటికి మూల పురుషుడు. 'జేనామణి' ఇంకా మైనరని ఆయన అన్నాడు. అంతే, దానితో వేణు భ్రమరవర్ 'ఛేరాపహరా' ఇచ్చాడు. 'రాజ సేవకుల' రూపములో ఏ గౌరవనీయమైన స్వాధికారము గజపతులకు ఇప్పటి వరకూ ఉంటూ వచ్చినదో దానినుండి రామచంద్రదేవు ఈ విధముగా దూరము కావలసివచ్చినది. ధూర్తుడైన వేణు భ్రమరవర్ వల్లనే అది జరిగినది.

మేఘావృతమైన ఆకాశములో మినుకు మినుకు మంటున్న ఆ నక్షత్రములో భ్రమరవర్ కండ్లలోని హింసాత్మక విశృంఖలత్వము ప్రతిబింబిస్తున్నట్టుగా ఉన్నది. నాలుకను నలువైపులా త్రిప్పుతూ దంతాఘాతము చేయడానికి అదనుకొరకు నిరీక్షిస్తూన్నట్టుగా ఉన్నది అది. ముఖముమీద విజయగర్వముతో కూడిన నమ్రత, దానిని మించి సహిష్ణుతా భావము, నొసటను హరిచందన తిలకము, ముండిత శిరము, కంఠమందు రుద్రాక్ష, తులసి మాలలు, శ్మశ్రు విహీనమైన ముఖ మండలము, కాని భయంకరమైన నేత్రములు.

నెమ్మది నెమ్మదిగా మబ్బులు విడిపోతున్నవి. ఆ మొదటి నక్షత్రము ప్రక్కనే మరియొక నక్షత్రము. ఖోర్ధా వియత్తలముపైన రెండవ దురాలోచనా నక్షత్రము... భాగీరథీకుమార రాయ్.

జనము పలుచబడుతూ వచ్చారు. సంధ్యాపూజ తాలూకు తూర్యనాదము మరి వినబడలేదు. మొగలాయీలు అల్లరులు మరల చెలరేగుతాయన్న అనుమానము ఏ నాడైతే కలగజొచ్చినదో ఆనాటి నుండి ఏ ఆలయములోనూ ఘంటాది వాద్యాలు హారతి సమయములో ప్రమోగలేదు. ఇంద్రియా గోచరమైన ఒక అవ్యక్త భయము అంధకారపు లోమహస్తాలను చూచి నలువైపులనుండి కంఠమును నొక్కివేయుటకు గాను ముందుకు వస్తున్నట్లుగా ఉన్నది.

ఖోర్ధాకు నలువైలనుండి పురులు విప్పుకొన్న వినాశనము ఇంకా చేరువ అవుతున్నట్లుగా ఉన్నది. దక్షిణమున చికాకోల్ ఫౌజ్‌దారు రఘునాథపురము చెక్కలి నుండి చిలికా సరస్సు వరకూ ఉన్న భూఖండాన్ని కబళించినా అతని ఆకలి ఇంకా తీరలేదు. ఉత్తరదిశనుండి తకీఖాన్ శనిదృష్టి ఖోర్ధామీద పరుగు లిడుతూ సమయము కోసము వేచి ఉన్నది. ఇక్కడ ఇంట్లో ఇద్దరు శత్రువులు ఉండనే ఉన్నారు. ఒకడు వేణు భ్రమర్ వర్, రెండవవాడు భాగీరథీ కుమార్ రాయ్.

ఛోటా (చిన్న) 'పరీఛా' అంటే విష్ణు పశ్చిమ కబాట్ మహాసాధ్వి తన వాగ్దానమునే మరచినాడా ఏమిః ఆక్రోశకుని ధైర్యము సన్నగిల సాగినది.

నిర్వేదగ్రస్తమైన నీరవతను భంగము చేస్తూ అకస్మాత్తుగా శంఖ, తూర్య, మృదంగ, వీణా, ఘంటా నాదములు ఆలయములో ప్రమోగినవి.

ఆలయములో నుండి సమష్టి కంఠధ్వని సముద్రఘోష వలె వినిపించ సాగినది. "మణిమా, మహాబాహు..... చక్రము చాటున పెట్టినావు?".

అది అల్పమైన కోరిక ఏమి కాదు, తుచ్ఛమైన ప్రార్థన కూడా కాదు. మహాశూన్యము యొక్క సీమా రాహిత్యములో విలీనమై పోవుటకు సంత్ ససీమ్ కావించిన ఉత్కటమైన ప్రార్థన ఇదిః 'హేమణిమా, మహాబాహు,....."

ఆక్రోశకుడు ఇంకేమి చూడలేక పోయాడు. అతని చెవులకు ఏదీ వినబడుటలేదు. వ్యర్థమైన భయము, దుశ్చింత, ఆశంకలనెడి పాప పంకిలమునుండి

అతనిని లేవనెత్తి ఒక ఉత్తుంగ తరంగము అభయ లోకము వైపుకు రెక్కలు పట్టుకొని తీసికొని పోతున్నట్లు అతనికి తోచినది.

ఆకాశము మీది మేఘములలో అంధకారము మరింకలేదు. శ్వేత కమల వనములాగ శతభాను కిరణ ప్రకాశముతో అది దీప్తివంతమైనది. అలాటి వెలుక ఆవరణలో బలియార్ భుజుని భుజములు పైకెత్తబడి అభయముద్రలో ఉన్నవి. వారి పాద పద్మముల వద్ద వందలకొలది దుర్గ ప్రాచీరములను భూలుంఠితము కావిస్తూ, శత సహస్ర సింహాసనములను కిరీటములను పైకెత్తుతూ, క్రిందికి దించుతూ ఆ ర్తహర్షనాదముల మధ్య కలనాదము చేస్తున్నట్లుగా కాల ప్రవాహపు జలావర్తము ప్రవహిస్తున్నది. దుర్నివారమైన ఆ ఇతిహాస ప్రవాహములో ఎవరు జయము పొందారు, ఎవరు అపజయము పొందారు, ఎవరు లేచారు, ఎవరు పడ్డారు, ఎవరు విముక్తులయ్యారు, ఎవరు బద్ధులైనారు..... వీటిని గురించి యోచించడము వ్యర్థాశ్రమ. దానికి ఊర్ధ్వమున నున్న ఆ అనంతమైన, ప్రశాంతమైన, అభయ ముద్రాంకితమైన కరపల్లవములలో ఉద్బోధనమున్నది... భయములేదు,..... భయములేదు. ఈ నిసికి కూడ ప్రభాతమున్నది.

"మణిమా! మణిమా!" అని ఆక్రోశకుడు గద్గద స్వరముతో విలపిస్తూ 'బడ్‌దాండ్' మీద దుమ్ములోపడి, స్మృతి కోల్పోయినాడు.

అచేతనుడుగా ఆ స్థితిలో అతడు ఎంతసేపు పడీ ఉన్నాడో తెలియదు. ఆకస్మాత్తుగా ఒకానొక మృదు స్పర్శ వలన ఆతనికి తెలివి వచ్చినది. ఆ సమయమున ఆంధకారము మరల మూర్ఛలాగున నలువైపులా ఆవరించినది.

చీకటిలో ఆ ఆక్రోశకుని వద్ద సాన్ పరిచా విష్ణు పశ్చిమ కబాట్ మహాపాత్ర కూర్చొని, "బాటమీద ఈ విధముగా ఎందుకు పడుకొని ఉన్నారు? వివిలీ ఫౌజ్‌దారుని గూఢచారులు ఎవరైనా మిమ్మల్ని చూస్తే అంతా సర్వనాశనము అయిపోతుంది కదా!" అని మెల్లగా శాంత స్వరముతో అన్నాడు.

సంబాళించుకొంటూ లేచి కూర్చొని, "మహా ప్రదీప దర్శనానికి ఇంకా ఆలస్యముందా?" అని ఆక్రోశకుడు అడిగాడు.

"మొగలాయీల అల్లర్ల ప్రమాదము ఉన్నంత కాలమూ మహాప్రదీప మును వెలిగించే ఏర్పాట్లను ఆపు చేశాము. దీనికి రెండు అర్థాలు ఉన్నాయి. అని సాన్ పరీఛా అన్నాడు.

"కాని ఈ చిన్న విషయానికి మహా ప్రదీపమును వెలిగించడము మాన్పించారా" అని ఆక్రోశకుడు భిన్నుడై అడిగాడు

అక్కడ ఇంకా ఎక్కువసేపు ఉండడము మంచిదికాదు. ప్రమాదము లేకపోలేదు. అందువ్ల ఛోటా పరీఛా "గుర్రము బాలీసాహి మలుపులో కట్టి ఉంది. మీరు సాత్ లహరీ మఠానికి వెళ్లండి. దేవాలయపు పనులు పూర్తి చేసికొని నేను కూడా అక్కడికే వస్తున్నాను" అసి అన్నాడు.

ఆలయ విధులను పూర్తిచేసికొని ఛోటా పరీఛా సాత్ లహరీ మఠము చేరుకునేసరికి బాగా పొద్దు పోయింది.

ఖోర్ధా భోయీ వంశములో అదృష్ట దురదృష్టములు దాగుడు మూతలు ఆడుకొంటున్నట్టుగా ఏకాదశి నాటి అస్తమించనున్న చంద్రుడు మేఘాల చాటు నుండి నెమ్మది నెమ్మదిగా క్రిందకు జారుకుంటున్నాడు.

మొగల్ రాజ్యాధికారానికి విరుద్ధముగా ఉత్తర ఒరిస్సాలో ఆఫ్గనులు తిరుగుబాటు చేసినందు వల్లనో లేక బెంగాల్ సూబా మీదకు అకస్మాత్తుగా దాడి చేయుటకుగాను లేదా ఢిల్లీలోని మొగల్ రాజ్యాధికారమును క్రైససము చేసికొన డానికిగాను సాగుతున్న అవారితమైన స్నాయు యుద్ధము తలవని తలంపుగా తీవ్రతరము అయినందువల్లనో, ఏ కారణము వల్లనైతేనేమి కటక్‌లోని నాయబ్-నాజిమ్‌ను ఒరిస్సా ఉత్తర సరిహద్దు ప్రాంతానికి తరలించడము జరిగి

నది. అతడు ఆ పనులలో మునిగి యున్నందున ఖోర్ధా రాజావారికి కొన్ని క్షణాల పాటు శాంతి వాయువులను పీల్చే అవకాశము కలిగినది. శ్రీ క్షేత్రములోని దేవాలయములకు వెల్ల వేయడము, అలకడము, మొదలగు పనులు జరుగు తున్నవి. పదమూడు పర్వములు, పండుగలు, ఉత్సవములు మొదలైనవి తిరిగి పన్నెండు నెలలూ ఆడంబరముగా ప్రారంభమయినవి. ఇవి జరిగి ఉండక పోయినట్లయితే అజ్ఞాత జనపదములలో సంచార వ్యాపారుల గుడారములవలె ఖోర్ధా రాజధాని యావత్తు స్వీయ రక్షణకొరకు అక్కడకు, ఇక్కడకు మారుతూ ఉండవలసి వచ్చేది.

అయినా జగన్నాథస్వామి వారికి మాత్రము ఈ సంచార వ్యాపారము నుండి విముక్తి లభించలేదు. యవనుల దాడినుంచి ఆత్మరక్షణ పొందడానికి గాను ఒక్కొక్క సారి నావమీద 'దోబంధా' మార్గము ద్వారా చిలికా సరస్సు లోను, ఒక్కొక్క సారి పల్లకీలో దక్షిణ ఒరిస్సా అరణ్య ప్రాంతములలోను ఆయనకు సంచరించక తప్పలేదు. అందుచేత ఆ రోజులలో "దాపదలాయీ ఆరిఆ సేవకులు"అన్న పేరుతో స్వతంత్రముగా ప్రతిఫలము పొందే సేవకులుగా కొందరు శ్రీ జగన్నాథస్వామివారి సేవకుని యుక్తులైనారు. అవసరమైనప్పుడు శ్రీ క్షేత్రమునుండి శ్రీ జగన్నాథస్వామి వారిని తరలించి చిలికా సరస్సులో ఒకానొక రహస్య స్థలానికి మార్చడానికి గాను మాణిక్ పాటణా, ఖాల్‌కాటి పాటణా ముఖద్వారాల వద్ద సంవత్సరము పొడుగునా నావతోగూడ ఈ సేవ కులు సిద్ధంగా ఉండేవారు. సంకేతము అందగానే పరమేశ్వరుని ప్రతిమలను ఈ సేవకులు చిలికా సరస్సులోనికి తీసికొనిపోతూ ఉండేవారు.

ఇక్కడ ఖోర్ధా రాజులు ఒకసారి రణపుర్ సరిహద్దులలో ఉన్న 'మాణ తి', ఒకసారి 'ఖండిఆపాడా', 'బోల్‌గఢ్‌లు'. వేరొకసారి చందనపుర్ మరియొకసారి "దాండ్ ముకుంద్‌పుర్" లేక 'కవిలేశ్వర్‌పుర్ శాసన్' మొదలగు అప్రసిద్ధ గ్రామాలలో తిరుగుతూ ఉండేవారు.

దివ్యసింహదేవుని ఇరుపది నాల్గవ అంకములో నవాబ్ సులాఖాన్ ఓడి పోయినప్పటి నుండి మొగలాయీల ఆల్లర్లు ఇంచుమించు అణిగిపోయినట్లే అని

పించింది. కాని హిందూవిద్వేషి తకీఖాన్ కటక్‌కు నాయబ్ నాజిమ్‌గా వచ్చిన నాటినుండి పరిస్థితులు మారిపోయినవి. అల్లరులు తిరిగి ప్రారంభమయినవి.

సంధ్యాకాల పూజా సమయములో శ్రీ మందిర సింహద్వారము ముందు ఛోటాపరీఛా విష్ణు పశ్చిమ్ కబాట్ మహాపాత్ర కోసము నిరీక్షించిన ఆ యాత్రికుడు ఇప్పుడు సాత్‌లహరీ మఠ సమీపమున నున్న సముద్ర తీరములో ఇసుకపైన నడుస్తూ ప్రస్తుత గతి దుర్గతుల గురించే ఆలోచిస్తున్నాడు.

ఎదుట అంధకారబంధురమైన మహాసముద్రము. పైని మేఘావృతమైన అనంత ఆకాశము. ఆ రెండింటి అంతరాన్ని సూచిస్తూ అంధకారపుటంచున కాంతి కల్పనవలె ఒక నీలాభ వలయ రేఖ ఎదుట నున్న దిఙ్మండలము మీద కనిపిస్తున్నది. చెలియలికట్టను ప్రమింగి వేయడానికా అన్నట్టు నురుగులు క్రక్కుతున్న కెరటాలు ఒకదాని వెనుక ఒకటి మెలితిరిగి వస్తున్నవి. చెలియలి కట్టను తాకి మలి తిరిగి వస్తున్న నురుగులేని వామనకాయపుటలలు ఎదురు వస్తున్న పెద్ద అలల ప్రతిరోధముతో మత్తదిజ్నాగులదంష్ట్రా ఘాతముల వలన మరణాంతకమైన ఆర్తనాదములు చేస్తూ మరల చెలియలి కట్టమీదకు వచ్చి పడుతున్నవి.

దాది...ఆత్మరక్షణ - పరాజయము

దాది...ఆత్మరక్షణ - పరాజయము!

ఖోర్ధా చరిత్రలోని విడంబనయొక్క పౌనఃపున్యము వలె సముద్ర కెరటములు ఉవ్వెత్తున లేవడము, పడడము, ముందుకు వెళ్ళడము, వెనుకకు మరలడము-ఈ క్రమ చర్యలో వాటికి ప్రశాంతే దొరకడము లేదు. చుట్టూ ఒక విషణ్ణమైన పరివేషము.

ఆగంతుకుడు అక్కడినుండి సాత్‌లహరీ మఠము వైపుకు నడిచాడు. కాని అప్పటికింకా ఛోటా పరీఛా అక్కడకు రాలేదు.

మసక వెన్నెలలో సాత్‌లహరీ మఠము ఒక అంధకార స్తూపములాగ గోచరిస్తున్నది.

గజపతి ప్రతాపరుద్రదేవుని ఆదేశానుసారముగా పూరినుండి వితాడితు డైన శూన్యవాద భక్తకవి జగన్నాథదాసు ఈ స్థలములోనే తన సాధనా పీఠ మును ప్రతిష్ఠించినాడు. ఆతని సాధనాబలము వల్లనే సముద్రము ఆనాడు సాత్ల హరీ మఠము వెనుకనుండి తొలగి రాజ్‌దండ్‌కు, నిర్యాతన సీమకు ఆవల ఈ సాగరోద్భూత భూఖండమును సృష్టించిందన్న కింవదంతి ఒకటి వచ్చినది. 'అతిబడి' జగన్నాథదాసు ఈ స్థలములోనే సమాధిపొంది శూన్య ఆకాశములో లీనమయి పోయినాడు.

కాని ఇప్పుడు ఈ 'అతిబడి' వైష్ణవులు సంప్రదాయ సిద్ధమైన శూన్య సాధనను పరిత్యజించి ప్రేమ, భక్తి, మాధుర్యములలో విలీనమయి నట్లుగానే వైష్ణవ సాధకులు, భక్తులు, శ్రీ క్షేత్రపు భోగైశ్వర్య మఠములకు మరలినారు. అందువలన తుమ్మ, నాగజెముడు వనములకు సాత్లహరీ మఠము అంకితమై పోయినది. ఇసుక మేట వేయడము వలన ఆలయ అగ్రభాగము తప్ప మరేదీ కనుపించడము లేదు. విరక్త సన్యాసులు, సంచార భిక్షుకులు మాత్రము అప్పు డప్పుడు అక్కడ విశ్రాంతి తీసికొంటున్నారు.

ఆలయమును సమీపించగానే లోపలినుండి మందముగా వస్తున్న అస్పష్ట కాంతిరేఖను గమనించి ఆగంతుకుడు ఒక క్షణ కాలము మెట్టు మీదనే నిలబడి పోయాడు.

కావచ్చును. ఛోటా పరీఛాయే తన కొరకు లోపల నిరీక్షిస్తూ ఉండి ఉండవచ్చును. కాని ఆలయము లోపలకు అడుగిడగానే ఆగంతుకుడు అదిరి పడ్డాడు. జగన్నాథదాసు సమాధిక్రింద శతథా చినిగి పేలికలై పోయి నామ మాత్రముగా నున్న శయ్యపైని అస్థి పంజరము వంటి వయోవృద్ధుడొకడు దొర్లు తున్నాడు. సమాధిమీద వెలుగుతున్న దీపపు గుడ్డివెలుగులో వృద్ధుని భౌతిక కాయము మరీ భయంకరముగా ఉంది. ఆతని కండ్లలో ప్రతిబింబిస్తున్న ఆ మంద దీపకాంతి వలన ఆతనిలో ఇంకనూ జీవము ఉన్నట్లు తగు మాత్రముగా సూచ నలు కనిపిస్తున్నాయి. ఆతని అస్థిపంజరము ముందుకు ఉబికి వచ్చి ఉంది.

ఆతని కాళ్ళు రెండూ అస్వాభావికముగా వాచి వికారముగా ఉన్నాయి నొసట చందనపు బొట్టు, మెడలో తులసి మాలలు ఉన్నాయి. గోడకు జగన్నాథుని చిత్రము ఒకటి వ్రేలాడు తున్నది. దానికి చేరుగా ఒక ఎర్రని వేము బెత్తము న్నది. ప్రక్కనే ఒక ప్రసాదపు జెండా ఉన్నది. చెదురుమదురుగా పూజా సుమాలు పడి ఉన్నాయి. ఒక చిన్న బాణలిలో మహా ప్రసాద మున్నది.

ఆగంతుకుని పాదముల సవ్వడి విని ఆ వృద్ధుడు వెనుదిరిగి చూశాడు. కఫమిశ్రితమైన గురగురలతో నిండిన ఆతని శ్వాస ధ్వనుల వలన ఆ ఆవరణ మరీ భయానకంగా ఉంది.

"ఛోటా పరీక్షా ఏడీ?...ఈ వృద్ధుడు ఎవరు?" ఈ విధముగా ఆలోచిస్తూ ఏమి చేయవలెనో తెలియక ఆగంతుకుడు అలా నిలుచున్నాడు. ఇంతలో ఎక్కడి నుండి వచ్చాడో తెలియదు, ఒక హోతిక ముప్పై యేండ్ల యువకుడు నిద్రమత్తుతో మత్తిల్లిన కండ్లను నులుముకొంటూ అక్కడకు వచ్చాడు. ముఖాకృతిని బట్టి, ధరించిన దుస్తులను బట్టి అతడు ఒక ఉత్తరాది యాత్రికుని వలె నున్నాడు. ఆగంతుకుడు అతనిని ప్రశ్నించకముందే ఆ యువకుడు పశ్చిమీ 'బోలీ' లో "మే మందరము యాత్రికులము" అని చెప్పాడు.

కాని ఈ వృద్ధుడు ఎవరు? ఇక్కడ, ఈ జనశూన్యమైన పాడుపడ్డ ప్రదేశములో ఈ విధముగా ఎందుకు పడి ఉన్నాడు?

ఆ వృద్ధుడు ఆ యువకుని జనకుడని, వారు ఉభయులు సంవత్సరము పొడుగునా నడచి వచ్చి ఈ 'బాహుగా దశమి'కి శ్రీ క్షేత్రము చేరినాకని, రథముమీద నున్న శ్రీ జగన్నాథస్వామిని దర్శించి ప్రాణములను త్యజించాలనే సంకల్పముతో ఆ వృద్ధుడు శ్రీ క్షేత్రము చేరాడని ఆ యువకుడు చెప్పిన దానిని బట్టి ఆగంతుకుడు గ్రహించాడు.

ఒకటి రెండు రోజులు మించకుండానే ఆ వృద్ధుని ప్రాణహంస ఎగిరి పోవచ్చును. దానిని స్వర్గ ద్వారాల వద్దకు పంపి ఆ యువకుడు మరలి పోతాడు.

దుఃఖ దూరమైన ఈ పవిత్ర భూమి వద్ద కన్నుమూయవలెనన్న అభి లాషతో దూరదూరములనుండి ప్రజలు వస్తూ ఉంటారు. కాని వారిలో ఏ కొద్ది మంది భాగ్యశాలురకో ఆ అదృష్టము లభిస్తుంది. ఈ దేవతలు కూడ కడు విచిత్ర మైనవారు. వీరినుండి మానవులు భోగభాగ్యాలను ఆశించరు. ఈ మానవుల ప్రార్థన కేవలము ఒకే ఒకటి-మోక్షము, మహా మరణము, పునర్జన్మపు నాగ పాశము నుండి విముక్తి.

కాంతి హీనమైన ఆ వృద్ధుని క్లాంత దృష్టి జగన్నాథస్వామి చిత్ర పటము మీద లగ్నమై ఉన్నది. పృష్ఠభూమిగా ఉత్కటమైన సముద్రపు ఘోష వినిస్తున్నది.

జగన్నాథుని పట్ల గల సమస్త హిందూ ప్రజానీకము యొక్క అచంచల విశ్వాసమును, దీనిని ఆశ్రయించుకొని యున్న రాజశక్తికి మూలమైన ఆధార భూమిని చూర్ణా మూర్ణము చేసి వేయవలెనని తకీఖాన్ శపథము పట్టాడు. జగన్నాథుడు ఉన్నంతవరకు ఈ రాజశక్తి జయింపరానిదని అతనికి తెలుసు. అందుచేతనే శ్రీ క్షేత్రము మీద దాడి చేయాలని సంకల్పించు కొన్నాడు. సర్వ వినాశనకరమైన ఆ శపథమునుండి తకీఖాన్ను మరల్చడానికే ఆగంతుకుడు ఇస్లాం మతాన్ని స్వీకరించాడు. అప్పుడు ఖోర్దా, దానితో పాటు జగన్నాథుడు కూడా రక్షింపబడవచ్చును. కాని తకీఖాన్ మహా ధూర్తుడు. ఇది ఆత్మరక్షణో పాయమని అతడు సరిగానే గ్రహించాడు.

ఆగంతుకుడు దీర్ఘముగా నిట్టూర్చాడు. అతడు చింతాక్రాంతునిగా అగు పిస్తున్నాడు. నెమ్మదిగా అతడు బయటకు వచ్చాడు. నిరర్థకత్వము, పరాజయము, విషాదములనుండి దూరముగా పోవలె నని అతడు ఎంత ప్రయత్నిస్తూ ఉనాడో, అవి అంతని అంత వెన్నంటుతున్నవి. బయటకువచ్చి, శంకా సంశయ రహిత మైన, సముద్రపు నురుగుతో కూడిన ఆ స్వచ్ఛమైన ఆ చల్లని నీటి గాలిలో అతడు కొంచెము సంతోషముగా ఊపిరి పీల్చుకొన్నాడు.

ఆగంతుకుడు బయటకు వచ్చేసరికి ఛోటాపరీఛా అక్కడే ఉన్నాడు. "ఈ ఆలయములోపలకు మీరు వెళ్ళుతూండడము ఎవరైనా చూసిఉంటే ఏమయ్యేది! శ్రీ క్షేత్రములో జీలకర్ర వేయిస్తే దాని వాసన కటక్‌లోని తకీఖానుకు వేస్తున్నదే! ఇక్కడ విభీషణులకు కరువు ఏమీ లేదు." అని కొంచెము కోప స్వరముతోనే అతడు ఆగంతకుని చూసి-అన్నాడు.

సాత్ లహరీ మఠమును ఆనుకొని దట్టమైన సరుగుడు చెట్ల అడవి ఉన్నది. వారిరువురు అందులోకి వెళ్ళారు. వెర్రిగాలి వీస్తూ ఉండడం వలన ఝుంయ్ మంటూ ఆ అడవి అంతా ఊపిరి పీలుస్తున్నట్లుగా ఉంది. ఆకులమధ్యనుండి జల్లించబడిన వెన్నెల అడవి నంతటిని రహస్యమయము చేస్తున్నది. వీటివలన ఆగంతుకుని విషాదము, ఛోటా పరీఛా ఉత్కంఠ క్రమక్రమముగా అధికమౌతున్నవి.

''ఛామూ! మీరు మాటి మాటికి శ్రీ క్షేత్రము వస్తున్న విషయము తకీఖాన్ చెవుల వరకు వెళ్ళకుండా ఉండడము మంచిది," అని ఛోటా పరీఛా సంశయ స్వరముతో అన్నాడు.

కాపాలికుని వలె ముఖమునకు గడ్డము తగుల్చుకొని, కాషాయాంబరములు ధరించి శ్రీమందిర సింహద్వారము ముందు ఏ మారు వేషముతో నిలుచుని ఉన్నాడో ఆ మారు వేషమును ఆగంతుకుడు ఒక్కొక్కటిగా తీసివేసి "ఇక ఈ మారు వేషముతో పనిఏమి మహాపాత్రజీ! ఇప్పుడిక వాస్తవ పరిస్థితులను ఎదుర్కొనవలసిన సమయము ఆసన్నమైనది" అన్నాడు.

కృత్రిమ వేషములు తీసివేసిన ముఖముమీద దాంభికత మరియు దృఢ నిశ్చయముతో గూడిన అద్భుతమైన దీప్తి, గంభీరమైన మహనీయత స్పష్టముగా ఉట్టి పడుతున్నవి. చంద్రుని గ్రుడ్డి వెలుగులో అతని నడుముకున్న వెండి పటకా తళతళమని మెరుస్తున్నది. కత్తిమొనవంటి అతని ముక్కు, కొమ్ములాగ మెలితిరిగిన అతని మీసము, శంకాసంశయములు లేని పెదిమలపైని చిరునవ్వు, వీటి అన్నింటిలో అతని అపార శౌర్యనిష్ఠ ప్రకటిత మవుతున్నవి.

సాయం సంధ్యనుండి అప్పటివరకు ఏ ప్రశ్నను అడగాలనుకొంటూ సంశయిస్తున్నాడో ఆ ప్రశ్ననే యిపుడడిగాడు." ఇంతవరకూ ఏమైనా అయిందా మహాపాత్రజీ' అని.

ఛోటా పరీఛా దీక్షంగా నిట్టూర్చి- "ఇంకా ఏమీ కాలేదు" అన్నాడు.

ఆ సమాధాన ప్రభావము ఆగంతుకునిలో వైకి అంతగా ప్రకటితము కాలేదు. కాని సాన్‌పరీఛా ధ్యానపూర్వకముగా పరిశీలించి ఉంటే క్రోధావేశముతో ఎరుపెక్కిన అతని కండ్లను చూసి ఉండేవాడు.

"విశ్వనాథ బాజ్‌పేయీ గారు ఏమన్నారు? అని ఆగంతుకుడు శాంత స్వరముతో అడిగాడు.

"బాజ్‌పేయీ గారు ఒక్కరూ ఏం మాట్లడినా జరిగేది ఏముంది? ముక్తి మండప పండితుల అభిప్రాయములో అధికాంశము వ్యతిరేకముగా ఉంది" అని క్లాంత కంఠముతో ఛోటా పరీఛా సమాధానమిచ్చాడు.

మొత్తము మీద ఘట్టమంతా అప్రీతికరముగా నుండడము వల్లనేమో దానిని ఆద్యోపాంతము వర్ణించి చెప్పడానికి సాన్‌పరీఛా సుముఖముగా లేడు.

"అయితే వారిలో అభ్యంతరము తెలిపిన వారు ఎవరు? హరేకృష్ణ పూర్‌కు చెందిన బలదేవ్ విద్యాలంకార్ సుముఖముగా మాట్లాడినారా లేక వారు కూడ వ్యతిరేకముగా మాట్లాడినారా?" అని తిరిగి ఆగంతుకుడు అడిగినాడు.

"వారు సుముఖముగా మాట్లాడి ఉంటే బాజ్‌పేయీ గారి గౌరవము దక్కేది ఉండేది," అని కటు స్వరముతోనే సాన్‌పరీఛా సమాధానమిచ్చాడు.

"అయితే నా ఆంచనా తప్పు కాలేదన్నమాట. హరేకృష్ణపూర్ శాసన దానము ఎవరు చేశారో మీకు తెలుసుకదా? లేదు, బహుశా మీకు తెలియక పోవచ్చును. వేణు భ్రమరవర్ పూర్వులు ఈ శాసనాన్ని చేశారు. అందుచేత వారి సంకేతముమీదనే ఈ శాసన శాస్త్ర చర్చ జరుగుతున్నది. అయినా గోవింద బాజ్‌పేయీ గారు కూడ తర్కములో ఓడిపోయేటంతటి వారు కారే!"

"బాజ్ పేయీ గారు అనేక తర్కాలను పేర్కొన్నారు. అనేక శాస్త్ర ములనుండి ఉదాహరణలు ఇచ్చారు, అక్బర్ చక్రవర్తి కాలములో అనేకమంది యవన స్త్రీలను తోడర్‌మల్, మానసింహులు వారి అంతఃపురాలలోకి తీసి కొన్నారు. వారి కుమార్తెలకు చెల్లెళ్ళకు అక్బర్, జహాంగీర్ మొదలగు మొగల్ చక్రవర్తుల వంశస్తులతో వివాహాలు జరిపించారు. ఈ విషయాల వరకు చర్చ సాగింది. వారిలో ఎవరినీ శ్రీ మందిరములో ప్రవేశించకుండా ఎవరూ నిరోధించ లేదు. ఆటువంటప్పుడు శ్రీ మందిరములోనికి మహారాజావారు ప్రవేశించడానికి ఇప్పుడు అడ్డు ఏమిటి అని వాదు అడిగారు. దానికి బలదేవ్ ఇలా తర్కించారు: 'తోడర్‌మల్, మానసింహులు విజేతలహోదాలో వచ్చారు. అందువలన వారికి ఏడు రక్తాల మినహాయింపు ఉంది.'

అప్పుడు బాజ్ పేయీ గారు చరిత్రనుండి అనేక ఉదాహరణలు యిస్తూ "సూర్యవంశ రాజు కపిలేంద్ర దేవుని పుత్రుడు పురుషోత్తమ దేవు కూడ జగన్నాథుని పరమసేవకుడే. ఒక నిమ్నజాతి స్త్రీ గర్భాన జన్మించినప్పటికీ జగన్నాథుని శ్రీ అంగములను అతడు స్పృశించడానికి ఎట్టి ఆటంకము లేక పోయింది" అని అన్నారు.

అందుకు బలదేవ్ తర్కాలంకార్ పెద్దపెట్టున నవ్వడము ప్రారంభించారు. ఇప్పుడు బాజ్ పేయీ గారిని తర్కించడానికి అయనకు అవకాశము దొరికినది. బాజ్ పేయీ గారు ఏ సమస్య పక్షాన వాదిస్తున్నారో ఆ సమస్యే ప్రస్తుత పరిస్థితులలో దుర్బలముగా ఉంది. వేయి స్మృతి శాస్త్రముల పాండిత్య ప్రతిభ కూడా నిలబడడము అసంభవముగా ఉంది. ఒక దుర్గమును జయించి నంత అట్టహాసము చేస్తూ "మీరు ఎవరిని ఎవరితో పోలుస్తున్నారో గుర్తించినారా బాజ్ పేయీ గారూ: వీర శ్రీ గజపతి గౌడేశ్వర నవకోట కర్ణాట కలవర్గేశ్వర అభిరాయభూత భైరవ దుస్సహ దుశ్శాసన అనీకరణ రావుత్‌రాయ్ అతుల బల పరాక్రమ సంగ్రామ సహస్రబాహు ధూమకేతు శ్రీశ్రీశ్రీ పురుషోత్తమ దేవ్ ఎక్కడ?.....మరి.....?" అని తర్కాలంకార్ అన్నారు, అని చెప్పి సాన్

పరీచా విష్ణు పశ్చిమ కబాట్ మహాపాత్ర మౌనము వహించాడు. అటు పిమ్మట తర్కాలంకార్ ఇంకా ఏమి చెప్పి ఉంటాడో ఊహించుకొనడము ఆగంతుకు నకు కష్టమేమీ కాదు.

"ఆ తర్వాత ఏ మైనదిఃా" అని ఆయన అవిచలిత స్వరముతో అడిగాడు.

"అప్పుడు బాజ్ పేయి గారు 'మ్లేచ్ఛగణిక కర్మాబాయి చేతి ఖిచడీ భోగము మీద పరమేశ్వరుడైన జగన్నాథునికి మక్కువ ఎక్కువగానే ఉండేది కదాఃా ఇది అందరకు తెలిసిన విషయమేఃా అప్పుడు మహా ప్రభువువారి పవి త్రాంగములు ఆపవిత్రము కాలేదేఃా' అని అన్నారు."

దానికి తర్కాలంకార్ వెంటనే సమాధానమిచ్చారు 'గణిక అన్ని విధముల మ్లేచ్ఛురాలు కాజాలదు. అందువలన కర్మాబాయిని మ్లేచ్ఛురాలనడము ఎలాఃా ప్రభువు వారి శ్రీ అంగాల సేవ చేసే ఇతర దాసీలవంటిది ఆమె కాదన దానికి ప్రమాణము ఏముందిఃా'

"కాని గణికలు మ్లేచ్ఛ యవన భోగ్యలు కాజాలరని చెప్పే ఈ వాదానికి తర్కాలంకార్ గారి శాస్త్రములలో నిరూపణము ఏమైనా ఉందాఃా" అని బాజ్ పేయీ గారు ఆసహాయ స్వరముతో ఆడిగారు."

"పరిహాస సూచకముగా నున్న ఈ ప్రసంగముతో తర్కాలంకార్ ఉత్తే జితులయినారు. 'కాని యవనభోగ్య అయిన గణిక యవన స్త్రీ అని ఏ న్యాయ శాస్త్రములో నిర్దేశించబడి ఉందండీ బాజ్ పేయీ గారూఃా ఈ ధరిత్రే యవన భోగ్య ఆయినది. కాగలదు కూడ! అటువంటప్పుడు ఈ వసుంధర అస్పృశ్య రాలవుతుందాఃా గణిక, గంజిక, నది, మృత్తిక ఇవి స్పర్శదోష రహితములు' అంటూ ఆయన చెవుల కుండలములను ఆడిస్తూ సమాధాన మిచ్చారు."

"భంగుమత్తులో హాయిని అనుభవిస్తూ ఈ ఉత్తేజకరమైన తర్కవాదము అను ముక్తిమండపములో కూర్చుని వింటున్న పదహారు శాసనముల పండితులు

ఒక్కసారి నస్యమును పీల్చి తర్కాలంకార్ గారి వాదమును సమర్థిస్తూ 'సాధు సాధు' అని అరిచారు."

"బాజ్ పేయీ గారు ఆ తర్వాత తత్వముల మీదికి వాదాన్ని మళ్లించారు. 'జగన్నాథుడు సర్వాధారుడు, సర్వ కారణుడు, సర్వ మయుడు, పతిత పావనుడు, శ్రీ క్షేత్రము చాల మహిమాన్వితమైనది. మ్లేచ్ఛులు, యవనులు గూడ మానవులే ; గార్దభములు గూడ చతుర్భుజుని రూపమును ధరిస్తున్నవని పెద్దలు అంటారు గదా: 'అహోతత్ క్షేత్ర మహాత్మ్యమ్ గర్ధభోపి చతుర్భుజః..." ఇటువంటి శాస్త్ర వాక్యములు ఉంటూ ఉండగా జగన్నాథునికి సాంప్రదాయక సంకీర్ణత్వము ఆపాదించడము సబబుగా ఉందంటారా: అని వారు అడిగారు"

"ఈ వాదము ఏ విధముగానూ స్వీకార యోగ్యమైనది కాదు. జగన్నాథుడు పతితులను ఉద్ధరించడము, పతితులు వారి సేవకులు కావడము ఈ రెండూ ఒకే విషయానికి చెందినవి కావు. మత చ్యుతుడైన ఏ వ్యక్తి అయినప్పటికీ- అందులో ముఖ్యముగ యవనులు, మ్లేచ్ఛులు-రత్నసింహాసనము మీది ప్రభువు వారిని స్పృశించడము హిందూమతము సహించదు' అని తర్కాలంకార్ అన్నారు."

"దీనిని విన్న ముక్తిమండపములోని శాసన పండితులు 'అవశ్య' మవశ్య మని అరిచారు. తరతరాలుగా వస్తున్న బాజ్ పేయీ గారి వంశప్రతిష్ఠ ఉత్కళ దేశమంతా విదితమే. వారీ విధముగా ఒక సామాన్య పండితుని చేతిలో అవమానింపబడతారని ఎవరూ ఊహించనైనా లేదు. దెబ్బతిన్న బాజ్ పేయీ గారు అవమానముతో మౌనము వహించారు. అప్పుడు వల్లభపుర శాసన భాగస్తులైన పధిఆరీ గారు కలుగజేసికొని 'ఈ శుష్క వచనాలను వదలిపెట్టండి, తర్కాలంకార్ గారూ: నేను అడుగుతున్నదానికి సమాధానమివ్వండి. యవన స్త్రీ సాంగత్యముతో పురుషుడు పతితుడు అవుతాడా, కాదా: భోయీ పురుషోత్తమ దేవుని 16వ అంకములో కళ్యాణ మల్లుని కటకకు నాయబ్ నాజిమ్‌గా వచ్చాడు. అతడు హిందువుడైనప్పటికీ అతనిలో హిందూ మతాచారము శూన్యము. జహాం

గీరాబాదులో అతడు తన ఉంపుడుకత్తె ఉస్మానాబాయికి అపారమైన భూవసతిని ఏర్పరచాడు. ఇందులో తప్పుకూడా ఏమీలేదు. సమర్థవంతులైన బహు సంభోగ పురుషులకు అది దోషయుక్తము కాదు. వస్తుతః బీజనిక్షేపము పురుషుల ధర్మమని శాస్త్రాలలో నిర్దేశింపబడే ఉన్నది. ఆ సమయంలో కళ్యాణమల్లుడు యవనస్త్రీ అంగస్పర్శ చేసినా పతితుడు కానేలేదు. అతనికి శ్రీ మందిర సింహద్వారము బంధించబడలేదు కదా, రత్న సింహాసనము వద్దకు వెళ్ళి అతడు దేవతార్చన చేసికొన గలుగుతుండేవాడు. అటువంటప్పుడు రామచంద్రదేవుని విషయములో ఈ సంరంభమంతా ఎందుకండీ?" అని అడిగారు. ముక్తి మండపములోని పండితులు వీరినిగూడా సమర్థిస్తూ 'అవశ్య' మంటూ కేకలు వేశారు. పధిఆరీ ఇంకా పూర్తిగా చెప్పకుండానే తర్కాలంకార్ నస్యము ఒక పట్టుపట్టి మాటకు అడ్డువచ్చి, "అరెరే పధిఆరీజీ, ఒక్కమాట చెప్పండి. కళ్యాణమల్లుడు కల్మా చదివి ఉస్మానాబాయిని పెండ్లిచేసికొన్నాడా, లేక ఆమె అతని ఆశ్రితురాలు మాత్రమేనా? ఘోర హిందూ విద్వేషి అయిన అతడు కూడా కల్మా చదివి యవన స్త్రీని వివాహమాడలేదు. రాజావారు కూడ రాణీగారిని తమ రక్షిత అని యుక్తిగా చెప్పిఉంటే....."

"పోనివ్వండి మహాపాత్రజీ, ఈ విమర్శన వలన వచ్చే లాభము ఏమీ లేదు" అంటూ ఆగంతుకుడు ఒక ప్రేలుడు శబ్దమువలె అరిచాడు.

వెర్రి గాలికి రేగిన జుత్తువలె చంచలముగా ఊగుతున్న సరుగుడు చెట్ల మధ్యనుండి కనబడుతున్న మసక చంద్రుని చూస్తున్న ఆగంతుకుని కండ్లనుండి సురమారంజితమైన రెండు నయనాలలోని హద్దులేని వేదన, పండిన దానిమ్మ గింజలవలె ఎర్రనైన అధరాలోని అవ్యక్త ఆవేదన కదలాడినవి. ఆ నయనముల ఆహత దృష్టి వలన గగన భువనాలు క్షణమాత్రములో ఆచ్ఛన్నమైనట్లు అనిపించింది.

"పతితులను ఉద్ధరించడము మాట అటుంచి ఇప్పుడు జగన్నాథుని ఉద్ధరించడము ఎలాగో ఆ విషయము ఆలోచించండి" అని ఆగంతుకుడు అన్యమనస్కునిలా అన్నాడు.

ఆగంతుకుని కంఠములో ఆకస్మాత్తుగా పొటమరించిన ఉద్వేగాన్ని విష్ణు మహాపాత్ర కనిపెట్టలేక పోయాడు. హిందూ మత విద్వేషి అయిన ఔరంగజేబు మరణించిన తర్వాత చాలా కాలమువరకు జగన్నాథస్వామి మొగలుదాడుల నుండినిశ్చింతుడుగాను, నిరాపదుడుగాను ఉంటూ వచ్చాడు. దివ్యసింహ దేవుని ఏడవ అంకములో శ్రీ క్షేత్రము మీద ఇక్రామ్ ఖాన్ చేసిన దండయాత్ర తర్వాత మరి యే యితర నాయబ్ నాజిమ్ దృష్టి పూరీ మీద పడలేదు.ఔరంగజేబు తర్వాత వచ్చిన పాదుషాలలో ఎవరూకూడ ఆంత క్రూరులు, మతాంధులు కారు. ఒరిస్సాలో సుజాఖాన్ నాయబ్-నాజిమ్‌గా ఉన్న కాలములో జగన్నాథుడు పూర్తి నిరాపదుడుగా ఉన్నాడు. సుజాఖాన్ సూఫీ మతస్థుడు. అందువలన అతనికి జగన్నాథుని పైని అపారమైన భక్తి శ్రద్ధలు ఉండేవి. దూరప్రాంత యాత్రికులకు బంది పోటు దొంగలు, ముసల్మాన్ సేనాపతులు, జిల్లాధికారులు మొదలైవవారి భయము లేకుండా చేయడానికి ఆయన జగన్నాథ మార్గముమీద 'డాక్‌చౌక్' లను ఏర్పాటు చేశాడు. ఔరంగజేబ్ కాలములో విధించిన ఆ అసహ్యకరమైన జిజియా పన్నును ఎత్తివేశాడు. అందుచేత అంతవరకూ జగన్నాథుని పైకి ధారా వాహికముగా వచ్చిన దాడులను ఓడ్ర దేశ ప్రజలు వీడకలలుగా భావించి మరచి పోనారంభించారు. ఆ కారణముచేత శ్రీ క్షేత్రములోని అణువణువు మొగలుల దండయాత్రల ఆశంకతో భయపడు తున్నప్పటికీ, జగన్నాథునిపైకి దాడులు రానున్నవని గాని, దురాక్రమణ జరుగనున్నదనిగాని ఛోటాపరీఛా విన్నా వాటిని ఆతడు ఒక్కసారిగా నమ్మలేక పోయినాడు.

"ఉపరాజేయమైన ఓడ్రజాతికే జగన్నాథుడు ఆత్మ. ప్రతి ఓరియా దేశ స్థుని ప్రాణములో ఆయన ప్రతిష్ఠితుడై ఉన్నాడు. అక్కడనుండి ఆయనను ఎవరు తొలిగించగలరు? రక్తబాహు, రాజూఖానులు మొదలుకొని కాలా పహాడ్, ఇక్రామ్‌ఖాన్‌ల వరకు ఎంతమంది హిందూమత విద్వేషులు జగన్నాథుని మీద దాడి చేశారో వారందరు మట్టిలో కలసి పోయారు. కాని నీల శైలము మీద సుదర్శన పతాకము ఆనాడూ ఈనాడూ కూడ ఎగురుతూనే ఉంది."

"సంలాపములాగ మీ మాటలు వీనులకు విందొనరిస్తున్నవి. కాని మీరు ఒక విషయము విస్మరిస్తున్నారు, మహాపాత్రజీ! ఒరిస్సాలో నాయబ్ నాజిమ్‌గా ఇప్పుడు ఉన్నది. సుజాన్‌ఖాన్ కాదనీ, అతని జారజుడు తకీఖాన్ బహదుర్ దిలేర్‌జంగ్ అనీ మీరు గుర్తుంచుకొనాలి. హిందూమతాన్ని, దేవాయతనాలను ధ్వంసము చేయడానికి రాజూ ఖాన్, కాలా పహాడ్‌ల కంటె కూడా ఎక్కువగా చేసి చూపించాలని ఇతడు నడుము బిగించి కూర్చున్నాడు. బాలేశ్వర్ రేవు పట్టణములో ఫౌజ్‌దారుగా ఉంటున్నప్పుడు సువర్ణరేఖ నదికి ఆవలి ఒడ్డునవున్న హిందూ దేవాలయాలలో ఏ ఒక్కదానిని గూడా ఇతడు అక్షతముగా వదలి పెట్టలేదు. ఈ విషయములు మీకు తెలియనివి కావు మహాపాత్రజీ!" అని ఆగంతుకుడు వక్షస్థలము మీద తన చేతులు కట్టుకొని పరిహాస వ్యంజకమైన స్వరముతో అన్నాడు.

"కాని షాహజహాన్‌బాద్, ఢిల్లీలలో మొగలు చక్రవర్తి ఇబ్రహీమ్ పరిస్థితి కూడా స్థిరత్వము కోల్పోతున్నది. రాజపుతానా మీదుగా పదయాత్రికులను తీసికొని వస్తున్నవారు ఏమి చెపుతున్నారంటే ఢిల్లీ దర్బారులో అమీరులు, ఉమ్రావులు, వజీర్లు బక్షీలలో చెలరేగుతున్న కొట్లాటల కారణముగా మొగలాయీల శక్తి మొక్కవోయింది. మహారాష్ట్రులు చౌథ్, సర్దేశ్‌ముఖ్ పన్నులు వసూలు చేసికొనడానికి గాను ఢిల్లీ దర్బారు కవాటాలను గూడా ఖటఖట లాడించడము ప్రారంభించారు. మొగలుల విషాక్తమైన కోరలు ఊడిపోయినవి. ఆత్మరక్షణే అసంభవముగా నున్నవారు జగన్నాథుని మీద దురాక్రమణ ఏమిచేయ గలుగుతారు?" అని సాన్ పఠీఛా విష్ణు పశ్చిమ్ కబాట్ మహాపాత్ర అన్నాడు.

"భంగు త్రాగే యాత్రిక యేజంట్లను మీరు సలహాదార్లుగా ఎంచుకొన్నప్పుడే జగన్నాథుని ప్రతిష్ఠ సంకటపడిందని మీరు తెలిసికొనవలసి ఉంటుంది, మహాపాత్రజీ! ఔరంగజేబు మరణానంతరము ఢిల్లీ చక్రవర్తులకన్నా సూబేదారులే ఎక్కువ శక్తిమంతులైనారన్న విషయము మీరు ఎలా మరచిపోతున్నారు? బంగ్లా, బీహార్, ఒరిస్సాలలో మొగలుల శక్తి సుప్రతిష్ఠితమైంది. మూర్షిదాబాదు

మన్‌సబ్ ఇప్పుడు ఢిల్లీలోని మయూర సింహాసనాన్ని గూడా వెలవెల లాడించ దము ప్రారంభించింది. ఆఫ్గనీయులు తలపై కెక్కి కూర్చునారు. బంగ్లా సూబా విషయములో మహారాష్ట్రీలు మాత్రము ఏమి చేయగలిగారుఁ పెదిమకూడా మెదల్చలేక పోయారు. అటు దక్షిణమున ప్రబల పరాక్రమవంతుడైన నిజామ్ ఉల్‌ముల్క్ ఫతహ్‌జంగ్ మోర హిందూమత ద్వేషిగా వేరు పొందాడు. ఔరంగ జేబు కాలానంతరము ఎత్తి వేసిన జిజియా పన్ను మళ్ళా వచ్చింది. ఇంత జరుగు తున్నా మహారాష్ట్రీలు మౌనముతో చేతులు ముడుచుకొని కూర్చున్నారు. ఇక్కడ కటక్‌లో హిందూ విద్వేషి తకీఖాన్ రాజ్యమేలుతున్నాడు. ఈ తకీ ఖాన్‌తో సంప్రదించి ఫతహ్‌జంగ్ చిలికా సరస్సు ప్రాంతము మీదకు మొదట దాడి వెడలి ఆ ఇలాకాను దఖలు పరచుకొన్నాడు. దానితోబాటే రఘునాథ పురము పెక్కలిగూడా వెళ్ళి పోయింది. ప్రాణాలకు తెగించి పోరాడినప్పటికీ ఫతహ్‌జంగ్ సైన్యాన్ని అడ్డగించడము అసంభవము అయింది," అని ఆగంతు కుడు అసహనభావముతో తీవ్రముగానే అన్నాడు. ఒక దీర్ఘ నిట్టూర్పుతో అతని శరీరము కంపించిపోయింది. ఆ తర్వాత తనని తాను నిగ్రహించుకొని "ఈ దాడుల అభిప్రాయము ఏమై ఉంటుందో మీరు గ్రహించారా?' అని అడిగాడు,

"మంచి ఉప్పు రాబడిని ఇచ్చే చిలికా ప్రాంతము లోని పెద్ద సూబాను సంపాదించిన నైజామ్ దానిని వదలిపెడతాడా?" అని సాన్ ఫరీచా అన్నాడు.

ఈ మాటలకు ఆగంతుకునికి చిరాకు కలిగి "ఉప్పు కాదండీ మహాను భావా! చిల్కా సరస్సు ప్రాంతమే నేటివరకు జగన్నాథస్వామికి ఆశ్రయమిస్తూ వచ్చినది. జగన్నాథస్వామిమీద అంతిమదాడి చేయడానికే ముందుగా ఇప్పుడు ఈ ప్రాంత మార్గములు అన్నీ బంధించబడినాయి. దీనికి తకీఖాన్ మద్దతు కూడా ఉంది. దీని వెనుక అతడు ఉండకపోతే భోర్ధా సేనల మీదికి వెనుకనుండి ఎందుకు దండెత్తే వాడు? ఆఁ, అవును భక్షీ వేణుభ్రమరవర్ గనుక ఆ సమయములో నమ్మక ద్రోహము తలపెట్టకుండా ఉండి ఉంటే..." అని అతడు చిరాకుగా అన్నాడు ఆతర్వాత అతడు ఏమీ చెప్పలేక పోయాడు. ఉత్తేజముతోను, ఆవేశముతోను అతని కంఠము రుద్ధమై పోయింది.

తర్వాత కొద్దిగా సంబాళించుకొని తిరిగి "అందుచేత ఇప్పటి నుండి మీరు తయారుగా ఉండండి మహాపాత్ర గారూ! ఈ పాతిక సంవత్సరముల విరామము వలన రత్నవేదిక మీది నుండి శ్రీ జగన్నాథస్వామిని కదిలించి ఏ సురక్షిత ప్రాంతమునకో తరలించే నేర్పు, కౌశలము అందరూ మరచిపోయే ఉంటారు. మొదటినుండీ మెలకువగాను, అప్రమత్తతోను ఉండకపోతే జగన్నాథస్వామి వారిని తోలు పటకాలతో బంధించి ఈడ్చుకొని వెళ్ళడము అసంభవ మేమీ కాదు."

ఆ సమయములో సముద్రము అస్వాభావికముగా స్తంభించి పోయినట్లయింది. మసకగా నున్న ఆకాశములో మబ్బులచాటున దాగుండిన వికలాంగుడైన చంద్రుని యొక్క స్వప్నాతురమైన వెన్నెలలో ఒక క్షణమాత్రము సముద్రుని నేత్రములపైన నిద్ర ఆవహించినట్లుగా ఉంది. సరిని వనమందలి వెర్రిగాలికూడ ఎందువల్లనో శాంతించింది. సరివి వన మధ్యలో నిద్రపోతున్నట్లుగా నున్న తోరణము వంటి కాలిబాట, దాని మధ్య సముద్రపు టిసుక మాత్రమే కానవస్తున్నవి. సముద్ర తీరానికి సమానాంతరముగా నున్న ఇసుక త్రోవలు.. వాటికి ఆవల నిద్రా జడితమైన సముద్రము !

అలసట, విషాదములతో ఆగంతుకుడు నౌసటిమీద చేతితో చాలసార్లు రాసుకొన్నాడు. ఎడమచేతి ఉంగరపు వ్రేలికి ఉన్న వజ్రముల ఉంగరము ఆ ఛాయాంధకారములో అగ్ని కణమువలె ప్రకాశించింది.

అయ్యో పాపము! ఆ నేత్రములలో ఎన్నిరాత్రుల నిద్ర దాగున్నది? అలసట చెందిన ఆ కనుపూరేకులను సరివి ఆకుల మర్మర ధ్వనులు మరింత భారవంతము చేస్తున్నవి....కాని ఏదీ సమయము?...కళ్ళ ఎదుట అనంత పథము...పయనించక తప్పదు.

ఆగంతుకుడు సాత్‌లహరీ మఠము వద్దకు వచ్చాడు. ఒక్క ఉదుటున బాణములాగ గుర్రము మీదకు దుకాడు."మహాపాత్రజీ!మరి నేను వెళుతున్నాను. బహుశా, త్వరలో మిమ్మల్ని నేను కలుసుకొనలేక పోవచ్చును. సిద్ధంగా ఉండండి, అప్రమత్తులై ఉండండి"అని వెళూతూ వెళూతూ ఆయన హెచ్చరిక చేశాడు.

ఆగంతుకుడు, ఆ తర్వాత సాన్‌పరీఛా ఆ మసక వెన్నెల రాత్రిలో అదృశ్యులైనారు.

వారు వెళ్ళిన తర్వాత వన మధ్యమునుండి ఒక ఛాయామూర్తి మసక వెన్నెలలో బయటకు వచ్చింది.అది మెల్ల మెల్లగా నడచి బడ పరీఛా నిరీక్షిస్తున్న మఠము వద్దకు వచ్చింది. సాత్‌లహరీ మఠములో జరాగ్రస్తుడై మరణశయ్యా వైని పడియున్న వృద్ధుని వద్ద కనుపించిన పిత్సభక్తుడైన పశ్చిమదేశ యాత్రికునిగా ఆ ఛాయామూర్తి రూపొందింది.

"నీవు నీ చెవులతోనే అన్నీ విన్నావు గదా, వివిలీ ఫౌజ్‌దారు ముసిం ఖాన్ జంగ్ బహాదూర్‌తో అన్ని విషయాలు చెప్పు. ఖోర్ధారాజు మెళ విరిగినది. ... పడగ క్రింపకు వ్రాలిపోయినది. అయినా కోరలలో ఇంకనూ విషముంది. అందుచేతనే ఆయన జగన్నాథుని వేరుమీద అక్కడా, అక్కడా తిరుగుతూ ప్రజలను రెచ్చగొడుతున్నాడు. నీవంతా విన్నావు కదా, ఈ బడ వరీఛా రాజ గురు శ్రీ క్షేత్రములో ఉన్నంతకాలమూ నాయబ్-నాజిమ్ తకీఖాన్ ఇష్టాయిష్టా లకు తిరుగుండదని ఖాన్‌సాహబ్‌తో చెప్పు. రామచంద్ర దేపుని గతి విధుల జాడలు ఎప్పటి కప్పుడు ఆయనకు అందుతునే ఉంటాయని తెలియజేయి" అని రాజగురు ఆ ఛాయా మూర్తితో చెప్పాడు.

మారు వేషములో నున్న ఆ ఛాయామూర్తియైన యువకుడు వివిలీ ఫౌజు దారుని గూఢచారి.

"ఈయన రామచంద్ర దేవు ఏమిటి, ఈయన ఖోర్ధా రాజయిన హాఫిజ్ కాదర్ కాదా," అని ఆ యువకుడు అడిగాడు.

''ఇద్దరూ ఒక్కరే సోదరా, మాటిమాటికి కటక్‌లో ముసల్మానుడనని చెప్పుకొంటూ ఎన్ని సారులు కల్మా చదివినప్పటికీ 'వాలి అంతాఘాట్' దాటి వచ్చిన తర్వాత ఈయన రామచంద్రదేవుగా మారుతూ ఉంటాడు. అయ్యో! గజపతి సింహాసనమునకు వారసులైన త్రైలంగ్ ముకుంద్‌ని పుత్రులు, మను

మలు, మునిమనుమలు ఏమయి పోయినారు; కులశీలములు తెలియనటువంటి సునా ఖలాగడ్ నివాసి ఆయిన ఏ నరసింహజేణామణి పౌత్రుడో అయిన రామచంద్ర దేవు మహారాజావారి అన్న కొడుకునని చెప్పుకొంటూ గజపతి సింహాసననునకు పోటి పడుతున్నాడు.

మారు వేషములో నున్న ఆ యువకుడు గుర్రముమీదకు ఎక్కి బయలు దేరడానికి సిద్ధమవుతూ ఉండగా ఆతనిని రాజగురు వెనకకు పిలిచి "నా బహు మతి నా కింకా ముట్టలేదని ఖాన్ సాహబ్‌తో చెప్పు. త్రికాల సంధ్యా సమయా లలో గూడ ఆయనను ఆశీర్వదిస్తూనే ఉంటానని చెప్పు. అతడు కటక్‌లో సాధా రణ నాయబ్-నాజిమ్ ఏమిటి? ముర్షిదాబాద్ నవాబే కాగలడు" అని చెప్పాడు.

మారు వేషములోని ఆ యువకుడు నెమ్మదిగా అదృశ్యుడైనాడు.

గౌరీ రాజగురు తన ముండిత శిరస్సును చేతితో నిమురుకొంటూ ఆకలి గొన్న చూపులతో అతనివైపు చూస్తూ నిలుచున్నాడు.

రెండవ అధ్యాయము

1

భోర్ధా బరుణేయి రాజమందిరములోని అంతఃపురము అసాధారణ నిశ్శబ్దముతో దాలా అస్వాభావికముగా ఉంది. సూదిపడిన చప్పుడు కూడా స్పష్టముగా వినిపిస్తున్నది. కోటకు మూడు వైపులను ఉన్న వేము, వెదురు అడవిలో నుండి వస్తున్న పావురాయి అరుపు తప్ప వేర్రొక ధ్వని వినిపించడము లేదు. దానికి తోడు మసక సంధ్య వెలుగు జడ వాతావరణమును మరింత విషణ్ణము చేస్తున్నది.

హఫిజ్ కాదర్ అనే ఉపనామముతో వ్యవహరింపబడుతున్న రామచంద్ర దేవు కచేరీ చావడిలో ఏనుగు దంతాసనముపైని కూర్చొని ఒంటరిగానే చదరంగము ఆడుకొంటున్నారు. రంగురంగుల ముఖమ్ములో మెత్తలు గల ఇతర ఆసనాలు వారి చుట్టూ ఖాలీగానే ఉన్నవి. నేడు అక్కడ పరిషత్ సభ్యులుకాని, విశ్వాస పాత్రులైన అనుచరులుకాని ఆసీనులై లేరు. రామచంద్రదేవు నిజముగా చదరంగము ఆడుతున్నారో లేక ఆటమిషతో చేతి మీద తలను ఆనించి చదరంగము బల్లను చూస్తూ ఇంక దేనిని గురించైనా లోతుగా ఆలోచిస్తున్నారో చెప్పడము కష్టము. వారి విశాల లలాటము కాంతిహీనముగా గోచరిస్తున్నది. నుదిటి మీదకు వ్రేలాడుతున్న ముంగురుల వల్ల, అప్రయత్నముగా వెరిగిన బిరుసు గడ్డము వలన ముఖము మరింత వికృతముగా కనిపిస్తున్నది. కంఠమందు రుద్రాక్షమాల, నొసట సిందూర తిలకము, శరీరముపైని కాషాయ వస్త్రము, ఇవన్నీ కలిసి వారొక దేశద్రిమ్మరయిన కాపాలికుడనే భ్రమను చూసిన వారికి కలుగజేస్తున్నవి. తెలియని వారెవరైన వారిని అప్పుడు చూస్తే అలాగునే అనుకొంటారు. ఆనాటి సంధ్యా

సమయములో వారిని ఆ వేషములో శ్రీ క్షేత్రములో చూసి చాల మంది అలాగునే అనుకొన్నారు.

రెండువైపులా గుర్రాలు, మూడవవైపు ఏనుగు-వాటి మధ్య చదరంగములో రాజు బంధించబడ్డాడు. రాజుని ఎలా తప్పించడమా అని బహుశా రామచంద్రదేవు ఆలోచిస్తూ ఉండవచ్చును. రాజు తప్పుకొనడానికి వీలు ఒకవైపు మాత్రమే ఉంది. అయినా రెండుమూడు ఎత్తులతో ఆట కట్టిపోతుంది. పెరిగిన గడ్డాన్ని నెమ్మదిగా సవరించుకొంటూ ఆ ఎత్తును గురించే రామచంద్రదేవు ఆలోచిస్తున్నారు.

కాని ఎవరైనా వారిని నిశితముగా పరిశీలిస్తే వారి దృష్టి ఆటమీద లేదని తెలిసికొంటారు. మధ్య మధ్య వారు బంట్లను క్రోస్తున్న తీరును గమనిస్తే వారికి ఆటమీద ధ్యాస ఏమాత్రమూ లేదని స్పష్టముగా అర్థమవుతుంది.

"ఇంకా ఓటమి సంభవించలేదు...సంభవించలేదు." అని మధ్య మధ్య తమలో తాము అనుకొంటున్నట్లుగా ఉచ్చరిస్తున్నారు. ఆనాడు చిలికా సరస్సులోనికి వెళ్ళడానికి ముఖద్వార మార్గములో నావ దొరికి ఉండినట్లయితే మాలుద్ ఫౌజ్‌దారు అంత సులువుగా అడ్డగించడానికి వీలుండేది కాదు.

కాని అలా జరుగలేదు, అలాజరుగలేదు. మాలుద్ ఫౌజ్‌దారుని ఒక్క ఎత్తులో ఆయన ఓడిపోవలసి వచ్చింది.

ఆ తర్వాత ఇనుపబోనులో బంధింపబడిన రామచంద్రదేవు మాటి మాటికి కటక్ రావలసి వచ్చింది.

ఆ విషాద పూరితమైన కటు సంఘటన వారి స్మృతి పథములోనికి రాగానే వారి మెదడులో ఉడుకు రక్తము ప్రవహించినట్లయినది. ఉత్తేజితులై వారు గుప్పిటతో గడ్డాన్ని పట్టుకొని లేచి కిటికీదాక నడచి వెళ్ళారు.

రాణీ హంసపుర్ ప్రాసాదము ఖాళీగా ఉంది. రామచంద్రదేవు హిందూ మతాన్ని విడచిపెట్టి రజియాను వివాహమాడిన తర్వాత మహారాణీ లలితా మహా

దేయి యువరాజు జేనామణి భాగీరథిని తమతో తీసికొని పుట్టింటికి వెళ్ళిపోయింది. ఇక ఖోర్ధా భూమిని మరి ఎన్నటికీ మెట్టనని ప్రతిజ్ఞచేసి మరీ వెళ్ళింది అమె. ఇతర రాణులు ఇద్దరూ కూడ ఆ పనే చేశారు. అలా వదలివేయబడిన రాణి హంసపుర్ ప్రాసాదానికి పశ్చిమ దిశలో మరొక క్రొత్త ప్రాసాదము రజియాకొరకు నిర్మింప బడినది. కాని రజియా కటక్‌లో ఉంటున్నది. ప్రతి వారాంతమున కొకసారి అయినా రామచంద్రదేవు కటక్ వెళ్ళి తమ విధేయతను తకీఖానుకు తెలియజేసి కొనుటకు గాను కటక్‌లోని లాల్‌బాగ్ కోటలో రజియాను బందీలాగ ఉంచారు.

కోటకు నలువైపుల మేఘనాథ ప్రాచీరము, దానిని ఆంటి పెట్టుకొని పేము, వెదురు పెరిగిన వనము రక్షణ శ్రేణుల వలె ఉన్నవి. ఫిరంగి గుండ్లనుండి కోటను ఆ వనము రక్షించడమే కాక శత్రు ప్రవేశమునకు కంటకమయముగాను, దుర్గమముగాను కూడ ఉంటున్నది. ఉత్తరమువైపున నున్న ప్రహారీగోడలో కొంత భాగము మాత్రము ఖాన్-ఏ-దౌరా ముట్టడించినప్పుడు ఫిరంగి దెబ్బలకు పడిపోయింది.

భోయీ ముకుందదేవు కాలమునాటి మాట ఇది. ఆ రోజునుండి నేటి వరకు ఆ గోడను పునర్నిర్మించుటకు ఎట్టి ప్రయత్నము జరుగనే లేదు. ఆ కాలములో మొగల్ ఫౌజ్‌దారు హాసిమ్‌ఖాన్ తరచు దాడి చేస్తూ ఉండడము వలన ఖోర్ధా ఒక సంచార శిబిరములాగ ఉండేది. దుర్గమ గుహలు మొదలుకొని దూరదూరముల లోని పల్లెసీమల వరకు ఖోర్ధా రాజధానిని గుప్పిట పెట్టుకొని వెళుతున్నట్టుగా గజపతులు తిరుగుతూ ఉండవలసి వచ్చింది. నేడు కూడా ఆ దుర్గతి తప్ప లేదు.

దురాక్రమణలు, ప్రజాపీడనల మధ్య కూడ ఒరిస్సా యొక్క అంతిమ స్వాధీనత అన్నము లేక అలమటిస్తున్న అత్యాచార పీడితులైన లక్షలాది ప్రజల ప్రాణములలో విద్యమానమై ఉంది. దుర్గ ప్రాచీరములు అక్కడ నిరర్థకముగాను, అనాంతరముగాను ఉన్నాయి. అయినా దుర్గ ప్రాచీరమునకు కొన్ని ముఖ్యమైన చోట్ల ధనుర్బాణధారులైన రక్షక ఫిరంగి సైనికులు శిలా ప్రతిమల వలె నిలుచుని

ఉన్నారు. ప్రాచీరము మీదనున్న ఇత్తడి ఫిరంగులు సాయం సంధ్యాకాంతిలో తళతళ మెరుస్తున్నాయి.

మేఘనాథ ప్రాచీరమునకు దక్షిణమున కీకారణ్యమైన బరణేయి పర్వత శ్రేణిని విభజిస్తున్నట్లుగా పూరీ వెళ్ళే మార్గము కొండకనుమల మధ్య కొండ చిలువ లాగున నిద్రపోతున్నది. రథీపుర్ విపలీల మీదుగా చుట్టు తిరిగి వెళ్ళన వసరము లేకుండా ఈ కొండ కనుమల మార్గము మీదుగా పూరీ చాల త్వరగా వెళ్ళ వచ్చును. యుర్ధూర్ సింహ, బగణేయిగఢ్ లనుండి పూరీకి వెళ్ళే యాత్రికులు ఈ దారినే వెళుతూ ఉంటారు. అంతేకాదు మొగల్ ఉపద్రవముల వలన కూడ ఈ దారి నిరపాయకరమైనది. కనుమకు పై భాగమున బరణేయి శిఖరము వైపుకు సంకేతములనిచ్చే దిశా సంకేత స్తంభము దిగ్వలయ రేఖను ఛేదిస్తున్నట్లుగా అప రాజేయమైన అచంచలత్వముతో కోటకు కాపలాదారునిలా నిలుచుని ఉంది. ఆ స్తంభము మీదినుండి దుర్భిణి యంత్రము ద్వారా నలువైపులా వీక్షిస్తున్న సిపాయి, ఆస్తమించుతున్న సంధ్యా సమయపు పృష్ఠ భూమిలో ఒక ఛాయామూర్తి పూరీలోని శ్రీ మందిర నీలచక్రమునే కాక దక్షిణ వైపునున్న చిలికా సరస్సులోని వల్లెకనిపిస్తున్నాడు. జల రాశిని కూడ ఆ స్తంభముమీది నుండి సునాయాసముగా చూడవచ్చును.

రామచంద్రదేవు దీర్ఘముగా నిట్టూర్చి చదరంగపు బల్లవద్దకు తిరిగి వచ్చారు. బల్లమీద పావులను కలివివేసి, తిరిగి రెండువైపులా ఏనుగులను, మధ్య రాజును ఉంచి ఆయన మరల ఆడడము ప్రారంభించారు.

కాని ఉన్నట్టుండి వారి కళ్ళ ముందు చెక్కలి రఘునాథపుర యుద్ధము చిలికా సరస్సు తీరమందల మాలకుదా గ్రామము మెరపులా మెరిశాయి.

యుద్ధము జరిగి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది. కాని ఆరోజున యుద్ధము లేకుండానే మాలుద్ ఫౌజ్‌దారు ఆటకట్టించి ఓడించాడు. తత్ఫలితముగా రామ చంద్రదేవ ఇరుపటోనులో బంధింపబడి ఏనుగు మీద తీసికొనిపోబడ్డారు.

వారి మనోనేత్రములో చదరంగములోని ఆ రెండు ఏనుగులు భాలేరి చివరి అంచున ఉన్న మర్డ్‌కోట లోయలాగ ఉన్నాయి.

ఇది మర్ద్‌కోట ఛత్ర ద్వారలోయ, ఇవి భాలేరీ పర్వతపు రెండు ప్రాచీరాలు ప్రాచీరములకు డిగువను మర్ద్‌కోట దుర్గ ఛత్రద్వారము అప్రమత్తుడు, అపరాజేయుడు అయిన కావలివాని వలె నిలుచుని ఉంది. స్వతస్సిద్ధంగా ఏర్పడిన ప్రాచీర గుమ్మటములలో కంటకావృతమైన వెదురు పొదల చాటున విల్లమ్ములు ధరించిన విలుకాండ్రు అతి జాగ్రత్తగా కాపలా కాస్తున్నారు. పర్వత శిఖరము మీదనున్న మందిరములోని ముఖ్యభాగములలో సాయుధులైన సిపాయిలు నియమితులై ఉన్నారు. పర్వతానికి చేరువలోనున్న చిలికా సరస్సులోని నిల జలము సూర్య కాంతిలో తళతళమంటూ కదలాడుతున్నది. మాలుద్ వైపునుండి మొగల్ ఫౌజ్ దారు బషీర్‌ఖాన్ వచ్చికట్టయితే వానిని ఎదుర్కొనుటకు ఆత్‌గఢ్ హుమూర్ గఢ్‌ల 'పాయిక్'లు కూడ సిద్ధముగా నున్నారు. లోయ ప్రవేశ ద్వారము-వద్ద ఏనుగులు లాగే రథములపైన ఫిరంగులు అమర్చబడి ఉన్నాయి, కత్తులు; బల్లెములు ధరించి గుర్రములమీద సైనికులు లోయచుట్టూ తిరుగుతున్నారు. వారి బుజాలపైన తుపాకులు వ్రేలాడుతున్నవి. వారి ఛాతీలపైన ఉన్న 'బదవు ఢాలు' లనుండి ముందుకు మొనదేలి వచ్చినకుంత భాగములు తళతళ మెరుస్తున్నవి.

గతములో కళ్మికోట, హుమా,గంజాగఢ్, పురుణాగఢ్ మహారీల 'పాయికు'లు మొగల్ నాజిమ్ బకీర్‌ఖానును ఈ మర్ద్‌కోట ఛత్రద్వార లోయ వద్దనే తలెత్తకుండా చేశారు. పర్వతారణ్య యుద్ధాలలో మొగల్ సైనికులకు అనుభవము లేనందువలన వారిని ఒరియా 'పాయికు'లు చాలా సులువుగా తొలగించగలిగారు. అందుచేత చికాకోల్ ఫౌజ్‌దారు దాడినుండి ఖోర్ధా దక్షిణ ప్రాంతమును రక్షించడము కోసము రామచంద్రదేవు ఈ లోయను ఒక దుర్భేద్యమైన కోట లాగున బలపర్చారు.

రామచంద్రదేవుని నాలుగవ అంకములో అనగా 1728 శకాబ్దములో జరిగిన ఘట్టము ఇది.

2

ఖోర్ధాను పాదాక్రాంతము చేసికొనాలని తోడర్‌మల్, మానసింహుల కాలము నుండి నేటి వరకు మొగల్ ఫౌజ్‌దారులు దాడులు చేస్తూనే ఉన్నారు. మొగలాయి శక్తిని ఎదిరిస్తూ ప్రజల పరాక్రమముతో యుద్ధముచేసినవారు మహా రాష్ట్రుల తరువాత మరి ఎవరైనా ఉన్నారా అంటే వారు ఒరియా పాయిక్ సైనికులు మాత్రమే.

అందులో కూడ అనేక విశ్వాస ఘాతుక కృత్యములు జరిగినవి. వెనుక నుండి కత్తిపోట్లు తగిలినవి. ఒరియా రాజులు ఒకసారి ఖైదీలుగా చిక్కితే మరొకసారి వారి గౌరవ ప్రతిష్ఠలను కాపాడుకొనడానికి నజరానాలు చెల్లించ వలసి వచ్చినది. అయినా ఇంత వరకూ ఖోర్ధాను మాత్రము మొగలులలో ఎవరూ కైవసము చేసికొనలేక పోయారు.

మానసింహుడు కేవలము జగన్నాథస్వామి భక్తికొరకే ఖోర్ధా స్వాతంత్ర్యమును అంగీకరించి ఉండలేదు. ఆయనవంటి ఆఫ్గన్ విజేత అయిన సైన్యాధిపతికూడ కటక్‌నకు దక్షిణముపైపు పురోగమిస్తున్నప్పుడు కాంజోడి దాటి సారంగగఢ్ వరకు కూడ వెళ్లలేక పోయాడు. అందువల్లనే ఆయన ఒరియా పాయిక్‌ల బల పరాక్రమములను గ్రహించ గలిగినాడు. ఈ అపరాజేయమైన శక్తిని ఢీకొనడముకన్నా స్నేహపూరితమైన సంబంధము కలిగి ఉండడమే ఎక్కువ శ్రేయస్కరమని ఆయన అవగతము చేసికొన్నాడు. దీని వలన ఆఫ్గన్ విద్రోహులకు వ్యతిరేకముగా ఖోర్ధా ఒక సుదృఢమైన రక్షాకవచముగా ఉండగలదనికూడ మానసింహుడు దూరదృష్టితో ఆలోచించ గలిగాడు.

ఒరిస్సాలో హిందూ రాజశక్తికి ఇష్టదైవముగా, నిజమైన రాజుగా లేక చక్రవర్తిగా జగన్నాథుడే పరిగణింప బడుతున్నాడు. ఉత్కళ సామ్రాజ్యాధీశ్వరుడు జగన్నాథుడు. అందుచేతనే అనంగ భీమదేవుని కాలమునుండి ఉత్కళ సింహాసనము మీద ఏరాజును కూడ అభిషిక్తుని చేసే ఆచారము అమలులో లేదు.

అందువలన జగన్నాథునితో పాటు ఖోర్ధా రాజ్యమును కూడ మొగలుల కని దృష్టినుండి సురక్షితముగా ఉంచడానికిగాను మాననింహుడు ఖోర్ధా స్వాతంత్ర్యమును అంగీకరించి దానిని మిత్ర రాజ్యముగా పరిగణించాడు. ఈ రాజ నైతిక స్వాతంత్ర్యమును మాననింహుడు తన దయాధర్మ బిచ్చముగా ఖోర్ధాకు ఇచ్చినది కాదు. దానికోసము ఒరిస్సా వీర పాయిక్‌లు తమ రక్తమును చుక్క చుక్కలుగా కార్చి, నీళ్ళలా ప్రవహింపచేయవలసి వచ్చినది. మొగల్ చక్రవర్తి అక్బర్ బ్రతికి ఉన్నంత కాలమూ ఖోర్థాతోపాటు జగన్నాథుడు కూడా ఒక విధముగా సురక్షితుడుగానే ఉన్నాడు.

ఉదార రాజనీతిజ్ఞుడైన అక్బర్ మరణానంతరము జహాంగీర్ మొదలుకొని ఔరంగజేబ్ వరకు పాదుషాలందరు మాననింహుడు ఒనర్చిన ఈ ఏర్పాటును తిరస్కరించి ఖోర్ధా గజపతుల సింహాసనమును వశము చేసికొనవలెనని ప్రయత్నించారు. హాషిమ్‌ఖాన్, కళ్యాణసింహా, మునిమ్‌ఖాన్-ప్రచండుడైన ఖాన్-ఏ-దౌరా మొదలైన మొగల్ ఫౌజ్‌దార్లు ఖోర్ధా స్వాతంత్ర్యమును అపహరించడానికి మాటి మాటికి దాడులుచేసి ప్రయత్నించారు ఈ యుద్ధాలలో చాలసార్లు ఖోర్ధా ఓటమి కూడ సంభవించింది. కుశభద్ర, బార్గవి, దయ మొదలైన నదులు పాయిక్‌ల రక్తముతో అరుణ రంజితములైనవి. కంకర ప్రాంతరములు శ్మశాన వాటికలైనవి. వాటితో పాటే ఇతిహాస గదా ఘాతమువలన ఆ విజయ వీరుల నామస్మరణలు కూడ ఈ భూమిమీదనుండి తుడుచుకొని పోయినవి. నరికివేసిన చెట్టు మొదలునుండి మర్ల ఒకకొమ్మ మొలచినట్టు ఖోర్ధా రాజశక్తి తిరిగి మొలకెత్తినది.

ఇదే విధముగా మొగలులతో బల పరీక్షల దాగుడుమూతలలో జగన్నాథునితో పాటు ఖోర్ధా రాజశక్తి కూడ అపరాజితముగా నిలిచినది.

కాని ఈ దుస్సాధ్యమైన కార్యమును సాధ్యము చేయవలెనని కంకణము కట్టుకొని కటక్‌కు నాయబ్-నాజిమ్‌గా తకీఖాన్ వచ్చాడు. జగన్నాథుడు ఓడ్రులకు కేవలము ఆరాధ్య దైవమే కాక ఒరియాజాతి అంతటికి రాజనీతి ప్రేరణా స్రోతస్సు అని కూడా అతనికి తెలుసు. ఆయన సేవకుని రూపములో

భోర్ధా గజపతి వేరు ప్రతిష్ఠలతో ఆయన కంటే ఎంతో దిగువ స్థాయిలో ఉన్న ప్పటికి ఒరిస్సాలోని అన్ని రాజ్యములలోను, మొగలాయి ఆధీన ప్రాంతములలోను కూడ దుర్గాధిపతులకు, సామంతులకు, సామాన్య ప్రజలకు అందరకు గౌరవ నీయులుగా ఉంటున్నారు. ఒరిస్సా రాజనీతి యోగసూత్రము కూడ శ్రీ జగన్నా థుడే. అందుచేత భోర్ధాతో పాటు జగన్నాథుని గూడ నాశనము చేయాలని తకీ ఖాన్ సంకల్పము. మొగలు సేనలు ఎంత పరాక్రమ వంతమైనవైనను పర్వతా రణ్య యుద్ధములలో ఆరితేరిన వీరపాయిక్ సేనలను ఓడించడము అసాధ్యమని గడచిన యిద్ధములు నేర్పిన గుణపాఠముల వలన అతనికి తెలుసు. అందుచేత ఇప్పుడు ఉత్తర దక్షిణములు రెండు దిక్కులనుండి ముట్టడించి అడ కత్తెరలో పోకను ఉత్తరించినట్టుగా భోర్ధా మెడను ఉత్తరించవలెనని అతడొక పథకమును తయారు చేశాడు. ఉత్తర దిక్కునుండి తాను స్వయముగాను, దక్షిణ దిక్కు నుండి చికాకోల్ ఫౌజ్‌దారు జుల్ఫికార్‌ఖాన్ నసరత్‌జంగ్ ముట్టడిస్తారు. చికా కోల్‌కు ఉత్తర సరిహద్దులోని పెక్కలి రఘునాథ్‌పుర్‌ను స్వాధీన పరచుకొని వారు తిన్నగా కాలుపడా వరకు సాగి వస్తారు. ఈ సుయోగము వలన తకీఖాన్ భోర్ధాను వశపరచుకొంటాడు. అ తర్వాత పురుషోత్తముని శ్రీ క్షేత్రమును వశ పరచుకొని ఖాన్-ఏ-దౌరాకు కూడా అసాధ్యమైన పనిని చేసి చూపిస్తాడు.

తకీఖాను చేస్తున్న ఈ ప్రయత్నముల సమాచారము రామచంద్రదేవునికి ఎప్పటికప్పుడు అందుతునే ఉన్నది. ఆయన దీనిని ప్రతిఘటించడానికి వలసిన ప్రయత్నములను అన్నింటిని చేసి సంసిద్ధముగానే ఉన్నారు. తమతో గూడ ఆయన కొలదిమంది సైనికులను, అశ్వారోహకులను మాత్రము తీసికొని వెళ తారు. పెక్కలి నుండి వారు వైదొలగి మర్దకోట ఛత్రద్వార్ కనుమవరకూ వస్తారు. చికాకోల్ ఫౌజ్‌దార్ జుల్ఫికార్ ఖాన్ తనకు సునాయాసముగా విజ యము లభించ నున్నదన్న ఉత్సాహములో కాలుపడా వైపుకు అనాలోచితముగా పురోగమించినప్పుడు వెనుకనుండి విజయరాజు తన తైలంగ సేనతో ముట్ట డిస్తాడు. కాశింపేట రాజు బాహుబలేంద్రుడు ఆయనకు సహాయము చేస్తాడు. చికా కోల్ సేన జయంతగఢ్ వై లంఘించి బాహుదా నదిని దాటి వస్తే, జరడా,

సురంగి, ఖేమండి దుర్గాధిపతుల సేనలు వారిని మహేంద్రగిరివద్ద ఢీ కొంటాయి. అక్కడ రామగిరి దుర్గాధిపతి శింగరాజు తన వ్యాఘ్ర చర్మాంబధారులు భీమ కాయులు అయినటువంటి కంధ సైనికులతో వారికి సహాయపడతాడు. అక్కడ నుండి కూడ తప్పించుకొని బయట పడితే చివరకు ఛత్రద్వార కనుమవద్ద హిందూ మొగల్ రాజకుల అంతిమ పోరాటము జరుగుతుంది. అందుకుగాను రామచంద్రదేవు తమ యుద్ధకౌశలమంతటిని ఉపయోగించి వ్యూహరచన చేశారు బక్షి వేణు భ్రమరవర్ యొక్క ప్రత్యక్ష స్వీయ బాధ్యతక్రింద మర్ద్‌కోట్ గఢ్ ఛత్రద్వార కనుమ ఉంచబడింది. గంజాగఢ్ అధిపతి కృపాసింధు మాన సింహా వేణు భ్రమరవర్‌కు బావమరది. ఛత్రద్వారమును ఆయన ముందునుండి రక్షిస్తారు. ఉత్తర దిశను తకీఖాన్ సేనలను కాలుపడా వద్దనే జరిపడాగఢ్ అధిపతి హరిహరరాయ సింహా, నరణగఢ్ అధిపతి శత్రుఘ్ను వైరిశల్య ఎదురిస్తారు. బాణ్‌పుర్ రాజా గోవింద్ హరిచందన్ వారికి సహాయపడతాడు. ఈ విధముగా శిశుపాల్‌గఢ్ నుండి తకీఖాన్ సేనలను ఎదుర్కొనడానికి అడుగడుగునా పాయిక్ సేనలు సిద్ధముగా ఉంటాయి.

రామచంద్రదేవు రక్తము ఉడుకెత్త నారంభించింది. చరిత్రతో జూదమాడుతూ ఆయన తమ చివరి పందెమును ఒడ్డారు.

శత్రువును నిరోధించుటకు వ్యూహ రచనను చేయుట సంభవమే. కాని నమ్మక ద్రోహమును అరికట్టడము అసంభవము-నమ్మక ద్రోహమును ఎదుర్కొని అరికట్టిన సంఘటన ఒక్కటి కూడ చరిత్రలో కానరాదు. ఆనాడు ఛత్రద్వార్ కనుమవద్ద కూడ అది సంభవం కాలేదు. అప్పటివరకు ఈ కఠిన సత్యమును రామచంద్రదేవు గుర్తించలేక పోయినారు.

కాశింపేట అధిపతి బాహుబలేంద్రుని సైనికుల సహాయము తప్ప మరెవ్వరి సహాయము చెక్కలి వద్ద లభించక పోవడము రామచంద్రదేవు గమనించారు. రాజమహేంద్రి రాజు కూడా చివరి వరకు కనబడలేదు. తగు మాత్రముగా ప్రతిఘటించి రామచంద్రదేవు వైదొలగారు. బాహుదా నదినిదాటడము చికా

కోల్ సేనకు సులువైన పనేమీ కాదు. కాని జయంత్‌గఢ్ దుర్గాధిపతి హరిహర విశ్వాసరాయ్‌కూడ ఆఖరు ఘడియలో మోసగించి తన దుర్గములోనుండి బయటకు రాలేదు. తమ స్వీయ స్వార్థముల దృష్ట్యా సామూహిక స్వార్థ స్వాధీనతలు విపత్తుకు ఏ విధముగా లోనవుతున్నవో గుర్తించి వాటిని గురించి చింతించిన వారు ఎవరూ లేరు. చికాకోల్ ఫౌజ్‌దారునికి పదాతి సైనికులు, అశ్విక సైనికులు, బల్లెపు సైనికులు, తుపాకి సైనికులు, ఫిరంగి సైనికులు మొదలగువారు మొత్తము అందరూ కలిసి ఇరవై వేల మంది ఉన్నారు. బాహుబలేంద్రుని చిన్న సేన వారి ఎలా ఎదుర్కొన గలదు? అదేకాక రామచంద్రదేవుకు కూడ తమ శక్తి తగ్గిపోవడము ఇష్టము లేదు. రాజు యొక్క తైలంగ్ సైనికులే కనుక వచ్చియుండే వారితో కలిసి చికాకోల్ మీదకు వెడలడము సంభవించి ఉండేది.

కాని అది జరుగ లేదు. ఏదో విధముగా తమ ప్రాణములను రక్షించుకొని బహుబలేంద్రుడు తన సైన్యముతో గూడ కాశింపేటకు మరలి పోయినాడు. మొదట అనుకొన్న ప్రకారము మహేంద్రగఢ్ వద్ద జరడా, భేమండిల పాయి క్‌లు జుల్ఫికార్‌ఖాన్‌ను ఎదుర్కొన్నారు. కాని రామగిరిగఢ్ అధిపతి శింగరాజు కంధ సైనికులు వ్యాఘ్ర చర్మాంబర ధారులై విల్లమ్ములతోనే యిచ్చిన తీవ్ర ప్రతిఘటనను ఛేదించుకొని మహేంద్రగిరిగఢ్‌ను దాటి ముందుకు సాగడము జుల్ఫికార్‌ఖాన్‌కు చాల కష్టమయింది. కంధులు తమ ప్రాణములనే అర్పించారు. శతాధికముగా వారు చనిపోయారు. అయినా వారు జుల్ఫికార్‌ఖాన్ సైనికులను మూర్కొనకుండా, వారిని గాయపరచకుండా ప్రాణములను విడువ లేదు. అపుడు చేజిక్కిన అవకాశమును వినియోగించుకొని రామచంద్రదేవు ఛత్రద్వార్ వైపు వెళ్ళారు. ఆ సమయములో వెనుక నుండి దండెత్తి చికాకోల్‌ను స్వాధీనపరచుకొనుటకు ప్రయత్నించడము అర్థరహితమైన పని. ఛత్రద్వార్‌నుండి జుల్ఫికార్‌ఖాన్‌ను తరిమి వేయకపోతే భోర్ధాకే ముప్పు వాటిల్లుతుంది.

అందుచేతనే రేయింబవళ్లను ఏకముచేసి రామచంద్రదేవు ఛత్రద్వార్ వైపుకు పరుగెత్తవలసి వచ్చింది. వారికి అందగా కేవలము రెండు వందల మంది

సైనికులే ఉన్నారు. శస్త్రాస్త్రఘాతముల వలన కొంతమంది, ఆకలి వలన కొంత మంది, అలసట వలన కొంతమంది వారిలో చనిపోయారు. మిగిలినవారు "జై జగన్నాథ్" అని నినాదములు చేసికొంటూ ఛత్రద్వార్ వైపు పరుగెత్తారు.

అందరి దృష్టి ఛత్రద్వార్ పైనే ఉన్నది. తెల్లవారలేదు. నిశాంధకారము ఇంకా శేషించి ఉన్నది. ఫూల్టా వద్దకు జుల్ఫికార్‌ఖాన్ సేనలు చేరనున్నవన్న వార్త రామచంద్రదేవుకు ఒక రోజు ముందుగానే అందినది. ఋషికుల్యా నదిని చేరడానికి వారికి ఒక రోజు కన్న ఎక్కువ కాలము పట్టదు. ఎందువల్లనంటే మహేంద్రగిరిని దాటిన తర్వాత అవరోధములు మరి యేవీ లేవు. అందుచేత సాయంకాలమునకు ముందుగానే వారు ఏదో విధముగా ఛత్రద్వార్ కనుమను చేరవలని ఉన్నది. ఆ లక్ష్యముతోనే సైనికులతోపాటు రామచంద్రదేవు ముందుకు సాగిపోతున్నారు.

ఇంక కొద్ది సేపటిలో ఉషఃకాలపు స్నిగ్ధ అరుణ కిరణ కాంతిలో స్నానమాడిన ఋషి మోహిని ఋషికుల్యానది యొక్క నీలజలవేణి ప్రకాశిస్తూ కనిపిస్తుంది దాని తర్వాత గంజా...ఆ తర్వాత ఛత్రద్వార్...అటువిమ్మట...

ఋషికుల్యా నదికి దక్షిణముగా వ్యాపించియున్న అడవి వద్దకు వచ్చేసరికి రామచంద్రదేవు ఆకస్మాత్తుగ నిశ్చేష్టులై నిల్చుండి పోయారు. తూర్పు దిశను ఆత్యల్పముగా కానవస్తున్న పృష్ఠ భూమి మీద మెల్లగా వీస్తున్న గాలిలో శతాధికంగా పతాకాలు ఎగురుచున్నాయి. నిశితముగా పరిశీలిస్తే అదొక సైనిక శిబిరము వలె కనువిస్తోంది. ఋషికుల్యకు ఉత్తర భాగాన అర్ధచంద్రాకారములో వ్యూహము వీర్పడి నట్టుగా కనబడుతోంది.

వీరు ఎవరై ఉంటారు? తకీఖాన్ సైన్యములు ఛత్రద్వార్‌ను ఛేదించుకొని దక్షిణము వైపు పురోగమిస్తున్నవా ఏమి? బక్షీ భ్రమరపర్ యుద్ధములో ఓడిపోయినాడా? గంజాగఢ్ అధిపతి మాన్‌సింహ్ అసలు ప్రతిఘటించనే లేదా? రామచంద్రదేవుని రక్షణ వ్యూహములన్నీ వేక మేడల వలె కూలిపోయినవా?

ఒక పదాతి సైనికుడు "ఈ సైన్యము బక్షీ సామంతునిది. మొగలుల పతాకములు పచ్చ రంగులో ఉంటవి. ఈ పతాకములు కాషాయి రంగులో ఉన్నవి" అని తటాలున అరచినాడు.

ప్రదోష కాంతిలో బక్షీ వేణు భ్రమరవర్ సేనల గైరిక రంగు పతాకములు స్పష్టముగా ఎగురుచున్నవి. వాటిని చూసిన పదాతి సైనికులకు మరల గర్వము, బలము కలిగినవి. కాని రామచంద్రదేవు అస్పష్ట స్వరముతో ఆర్త నాదము వలె చేయనారంభించారు. ప్రభాత మంద సమీరములో ఎగురుచున్న బక్షీ పతాకములు రామచంద్రదేవుని పరాజయమును చాటుచున్నట్టుగా గోచరించినవి.

బక్షీ భద్రద్వారము విడిచి ఏమి చేయాలని ఇక్కడకు వచ్చినాడు? మొలుద్ ఫౌజ్‌దారు ఈ అవకాశమును ఉపయోగించుకొని భద్రద్వార్ కను మను స్వాధీన పరచుకొనకుండ ఉంటాడా? రాజపుర్ ఎడారి ప్రాంతములో గూడ చికాకోల్ సేనలను అరికట్టడము సాధ్యము కాదు. చికాకోల్ సైన్యము ఎంతైనా ఉండుగాక, వారు ఎంత సంసిద్ధులై ఉండిన ఉండుగాక, భద్రద్వార్ కనుమ వద్ద వారిని సునాయాసముగా ఓడించవచ్చును. కాని ఇక్కడ ఈ రాజపుర్ ఎడారిలో రామచంద్రదేవుని సైనికులు బూరుగు దూది పింజల వలె ఎగిరి పోవుటకు ఎంతో సేపు పట్టదు.

ప్రస్తుత పరిస్థితులలో ఆత్మరక్షణకు అనువైన స్థలము గంజాగఢ్ ఒక్కటే. అక్కడనుండి ఏదో విధముగా బాణ్‌పుర్‌లోని గోవింద్ హరిచందన్‌తో సంబంధము ఏర్పరచుకొనగలిగితే చికాకోల్ సేనను నిరోధించడము బహుశా సంభవము కావచ్చును. రామచంద్రదేవు "జై జగన్నాథ్, మా భైః" అని కేకలు వేస్తూ రాజపుర్ ఎడారివైపు గుర్రమును దౌడు తీయించారు.

రామచంద్రదేవుకు స్వాగతము చెప్పి వారిని తీసికొని వెళ్లడానికి బక్షీ వేణు భ్రమరవర్ గుర్రముమీద ఎదురు వైపునుండి వస్తున్నాడు. రామచంద్రదేవు

మార్గ మధ్యమందే బక్షీ గుర్రముయొక్క కళ్ళెమును పట్టుకొని ఆపారు. అక స్మాత్తుగా గుర్రము ఆగిపోవడముతో బక్షీ కొంచెము ముందుకు తూలినాడు.

"బక్షీ! ఇదేమిటి ఇలా చేశావు? ప్రతిఘటన లేకుండానే ఛత్రద్వార్ కనుమను మాలుద్ ఫౌజ్‌దారుకు అప్పగించి వచ్చావా? ఇప్పుడు వెనుకనుండి చికాకోల్ ఫౌజ్‌దారు ఇరవై వేల మంది సైనికులతో సాగివస్తున్నాడు. ఈ ప్రబల మైన మొగల్ శక్తిని నీవు అరికట్టగలవా?" అని రామచంద్రదేవు అడిగినారు.

వెంటనే బక్షీ ఏమీ చెప్పలేక పోయినాడు. రామచంద్రదేవుని సూటిగా చూడగలిగే నైతిక శక్తి అతనిలో మృగ్యమయినది.

సరళ స్వభావుడు, అసహాయుడు అయిన ప్రభువును ఈ విధముగా ఎదురుపడి చూసినప్పుడు ఎంత క్రూరునికైనా, ఎంత విశ్వాస ఘాతకునికైనా కంఠము దాసంతటదే రుద్ధమవక తప్పదు. అతడు తటపటాయించకుండా సమాధానము చెప్పలేడు. సూటిగా చూడలేక చూపును మరియొకవైపు మళ్ళించక తప్పదు. ఆ సమయములో బక్షీ పరిస్థితి కూడ ఇదే విధముగా ఉన్నది.

"బక్షీ, నువ్వేమిటి ఇలా చేశావు?" అని రామచంద్రదేవు అసహాయ స్వరముతో మరల ప్రశ్నించారు.

బక్షీ కరకు ముఖముమీది లలాట రేఖలు కఠోరముగా కన్పించ సాగినవి. పుర్రెవంటి ముండిత శిరస్సు, లలాటానికి క్రిందుగా గహ్వరములవంటి గుంట కండ్లు గొడ్డళ్ళ వలె తళతళ లాడినవి. కాని క్షణమాత్రములో అవి అతని వశములోనికి వచ్చినవి. తనను తాను నిగ్రహించుకొంటూ వశంవదమైన సరళ స్వరముతో "ఎదుట చికాకోల్ సేన ఉంది...వెనుక...ఉంది. ఛత్రద్వార్ కనుమ లోపల ఇరువైపులనుండి వచ్చే దెబ్బలనుండి రక్షించుకొని మనము బయటపడ గలమా?" అన్నాడు.

కాని, మొదటినుండి బాగా ఆలోచించి తయారు చేసిన వ్యూహములు, సలహాలు అన్నిటిని బక్షీ మరచిపోయినాడా? కనుమకు ఉత్తర దిక్కున ఏర్పర

చిన ఫిరంగుల వలన చిలికా సరస్సు ఒడ్డునుండి పైకి ఎక్కివస్తున్న సమయ ములో మాలుద్ ఫౌజ్‌దారు సేన యావత్తూ నాశనమై యుండేది. కనుమ వెనక చిలికా ఒడ్డున విలుకాడ్రు సంసిద్ధులై వేచి యున్నారు. అందువలన చత్రద్వార్ కనుమ సీమలో మాలుద్ ఫౌజ్‌దారుకు కాలూనడముకూడ సాధ్యమయ్యేది కాదు.

బక్షీతో తర్కిస్తూ కూర్చొనడము వలన లాభమేమీ లేదని రామచంద్ర దేవు గ్రహించినారు. కాని బక్షి స్వరములో అభయము ఉన్నది. "ఛాము, మీ రేమీ చింతించకండి. ఈ రాజపుర్ నుండి కూడ సునాయాసముగా చికాకోల్ సైన్యమును మనము తొలగించవచ్చును. మన వెనుకనే గంజాగఢ్‌కు సంబం ధించిన కృపాసింధు మానసింహుడు ఉన్నాడు" అని ఆయన అన్నాడు.

నీట మునిగేవానికి గడ్డిపోచ అసరా అయినట్టు గంజాగఢ్ యొక్క కృపా సింధు మానసింహా నామముతో రామచంద్రదేవుని ఆశ చిగురించినది. గతములో గంజాగఢ్ అనేక విపత్తులను అనాయాసముగ తొలగించినది. కృపాసింధు మాన సింహా తలచుకొంటే చికాకోల్ సైన్యమును ఋషికుల్యకు ఆవలి ఒడ్డునే సులు వుగా నిరోధించగలడు.

"బక్షీ! ఋషికుల్యకు ఉత్తర భాగమున సేనలను ఆయత్తపరచు. నేను గంజాగఢ్‌కు వెళతాను" అని రామచంద్రదేవు బక్షిని ఆదేశించి గంజాగఢ్ వైపుకు గుర్రముపైని దౌడు తీసినారు. మిగిలిన సైనికులు రక్షణ ఏర్పాటులను చేయుటకుగాను బక్షితోగూడ ఋషికుల్యకు ఉత్తరమువైపున ఉండిపోయినారు. దూరముగా పైకి లేస్తున్న ధూళిలో క్రమక్రమముగా అదృశ్యులౌతున్న రామ చంద్రదేవుని వైపు చూస్తున్న బక్షి ముఖ మండలము మీద నవ్వొకటి కుటిలముగా మొలకెత్తినది ఆది అతని భ్రుకుటిలోనే అదృశ్యమై పోయినది.

జ్యేష్ఠ మాసపు చెండ నెత్తిమీద నిప్పులు కురిపిస్తున్నది. దిగంతముల వరకు వ్యాపించియున్న ఇసుక ఎడారిలో దప్పిగొన్న మృగతృష్ణ నీల–నిష్ప రతలో మినుకుమినుకు మంటున్నది.

3

చదరంగము బల్లమీది పావులన్నిటిని రామనంద్రదేవు తిరిగి కలిపి వేశారు. బాధాకరమైన ఒక లోతైన గాయముపైని ఎవరో తిరిగికొట్టి నట్టుగా ఉన్నది.

"ఎవరక్కడ?...సేవకుడా!" అని రామచంద్రదేవు కేక వేశారు.

శూన్యముగా నున్న ఆ గది ఆ కేకకు ప్రతిధ్వనించి మరల శాంతించి నది. ఈ రోజు లోధుమియా! ఖలీఫా రావడము కూడా ఆలస్యమవుతున్నదే! అతడు వచ్చి ఉంటే అతనితో ఒకటి రెండు ఆటలాడి చదరంగములో నిమగ్నము కావడము వల్ల ఆ ధ్యాసలో ఈ బాధాకరమైన స్మృతులు, పశ్చాత్తాపము జ్ఞప్తికి వచ్చేవి కావు. రామచంద్రదేవు బల్లమీద తిరిగి పావులను చేర్చడము ప్రారంభించారు.

ఒక బంటుకు ఎదురుగా ఇప్పుడు రాజు ఉన్నాడు. ఆ బంటును తప్పించు కొని రాజు బయట పడడము ఎలాగ? గుర్రము కదలడానికి వీలు లేకుండా ఉన్నది. ఆ నాటి విడంబనాయుతమైన దృశ్యము ఆయన కళ్ళముందు రూపుదాల్చ నారభించినది.

ఆనాడు గంజాగఢ్ పరిస్థితి కూడా ఈ విధముగానే స్తంభించి పోయినది. ఎదురుగా వస్తున్న శత్రువును ఎదుర్కొనుటకు ఆయన బయలు దేరినారు. కాని అంతర శత్రువును ఎదుర్కొనే వీలు ఆయనకు ఎక్కడిది? అయినప్పటికీ కృపా సింధు మాననింహాతో "చూడు సోదరా! మానమును కాపాడగల మానసింహుడవు నీవు. ఇటువంటి కష్ట సమయములో నీవు ఒక్కడివే నాకు ఆధారము. నేను ఇంకెవరి మీద ఆధార పడగలను? సింహాసనము గురించి ఇప్పుడు ఆలోచించ వద్దు. మొగలులనుండి శ్రీ జగన్నాథస్వామివారిని రక్షించుకొనడానికే మనము ఈ యుద్ధము చేస్తున్నాము. భోర్ధా రాజపరివార మంతా నాశనమయినా నాకు చింతలేదు. కాని శరణాగత వత్సలుడు, ఆశ్రయదాత అయిన ఏ జగన్నాథుని

అభయ పతాకము క్రింద ఒరిస్సాదేశ ప్రజలు ఆబాలగోపాలమూ సురక్షితముగా ఉంటున్నారో, హిందూ విశ్వమునకు ధగద్ధగాయమానమైన కిరీటమువలె ఏ జగన్నాథుడు వెలుగొందుచున్నాడో, ఆ జగన్నాథుని గౌరవం కాపాడవా, మానసింహా?" అని రామచంద్రదేవు అనునయ పూర్వకముగా అర్థించారు.

కాని మానసింహుడు ఏమీ కదల లేదు. కేవలము అనాసక్తుడుగా ఉండిపోయినాడు. అంతేకాదు, రామచంద్రదేవుని కండ్ల ముందటనే గంజాగఢ్ దుర్గద్వారముల నన్నిటిని బంధించివేశాడు. పైగా గాయముపైని కారము జల్లినట్లుగా మొగలులతో సంధి సూచకముగా రామచంద్రదేవుని కండ్ల ఎదుటనే మానసింహుడు తెల్ల జెండాను ఎగుర వేయించినాడు. నిష్ఫలమైన, నిర్వీర్యమైన రోషముతో రామచంద్రదేవుని సర్వాంగములు కంపించి పోయినవి. మానవుని శక్తి సామర్థ్యములు, అసామాన్యత, గొప్పతనము మొదలైనవన్నీ ఏ దుష్టశక్తి ముందో తలవంచి, నీచ కుతంత్రముల క్రింద పడి నలిగిపోయి, నీటి బుడగలవలె విలీనమై పోయే దుస్థితి కూడ ఆప్పుడప్పుడు జీవితములో సంభవిస్తూ ఉంటుంది. అటువంటి విషాద ఘడియలలో ఏ అదృశ్య శక్తి ఆభిశాపమువల్లనో అతడు అసహాయుడు నిర్వీర్యుడు అయిపోతున్నట్లుగా భావించడము జరుగుతుంది. ఆ సమయములో వల్మీకము గిరి శృంగాలను పరిహసిస్తుంది ఆ విధముగనే చీమ ఏనుగుతో పోటి పడుతుంది. అటువంటి విడంబనా పూరితమైన క్షణము, మూసివేయ బడిన గంజాగఢ్ సింహద్వారము ముందు, రామచంద్రదేవుని జీవితములో ఇప్పుడు వచ్చినది. రౌద్రతప్తమైన ఆకాశము వైపు ఆయన అసహాయ దృష్టితో చూశారు. నమ్మక ద్రోహము, బంధు ద్రోహము కలిసి వారిని సర్వనాశనము చేయవలెనని సహస్ర నేత్రములతో వారివైపు చూస్తున్నట్టుగా ఉన్నది. తృషార్తమైన వారి కంఠము నుండి "నిరాశ్రయ మాం జగదీశ రక్ష" అన్నమాటలు వెలువడినవి.

ఇంకేమీ ఆశించుటకు సమయములేదు. చిలికా సరస్సు మీదుగా బాణ్పుర్ ఎలాగునైనా చేరుకొంటే.....

రామచంద్రదేవు ఋషికుల్యా నదికి కుడివైపుగా తిరిగి ఒక నాగదంతి అడవిని దాటి చిల్కా సరస్సువైపు సాగిపోతున్నారు.

గత సంవత్సరము కరువు వచ్చినది. ఈ యేడుకూడ కాటకము రావచ్చును. జ్యేష్ఠమాసము అంతము కానున్నది. అయినప్పటికి ఇంతవరకు నేల తడియలేదు. పొలములు పగుళ్లువారి మైదానములవలె కానవస్తున్నవి. నాగలి చాలు పడుటకు ఆవకాశము లేదు. తీక్షణమైన ఎండలు, ఎండమావులే ఎటు చూసినా కనిపిస్తున్నవి. కంకాళ ప్రాయముగా నన్న ఆవులు, పశువులు ఎండిన మట్టినే వాసనచూస్తూ మందలు మందలుగా తిరుగాడుతున్నవి. ఆకు అలము కొరకు అవి అలమటిస్తూ ఎటు తిరుగాడినను వాటికి మట్టి తప్ప వేరొకటి దొరుకుట లేదు.

ఉప్పు గల్లీలు కూడ ఖాళీగానే పడియున్నవి. ఒకప్పుడు వాటిలో కూలీలు, జాలర్లు శతాధికముగా పనిచేస్తూ ఉండేవారు. ఉప్పు పంటకు ప్రధాన స్థలములలో ఇది యొకటి. 'మలాంగీ' నావలలో వివిలీ, బాలేశ్వర్ మొదలగు సుదూర దక్షిణ ప్రాంతములకు ఇక్కడినుండి ఉప్పు ఎగుమతి అయేది. గంజాలోని దేశవాళీ ఉప్పు వ్యాపారస్తులు ఈ ఉప్పు గల్లీల వలన బంగారము సంపాదించుకొనేవారు. కాని ఏనాడు విదేశీయుల ఆధిపత్యములోనికి గంజా పోయినదో, ఏనాటినుండి ఔరంగజేబు పరిపాలనలో ఉప్పు వ్యాపార అధికార కేంద్రములను మాలుద్, వజ్రకోట మొదగు చోట్ల ఎక్‌రామ్‌ఖాన్ ప్రారంభించాడో ఆనాటినుండి మొగలుల దోపిడీ భయమువలన ఇక్కడి ఉప్పు వ్యాపారము పూర్తిగా నిలిచిపోయినది. ఉప్పునీటిని నిలువ చేయుటకు త్రవ్విన గోతులు ఇప్పుడు భూతములవలె కనుపిస్తున్నవి. ఉప్పు ఉత్పత్తి కొరకు తయారు చేసిన పొయ్యిలు, పగిలిన కుండలు ఆ ప్రదేశములో చెల్లాచెదురుగా పడి యుండడము వలన నేడు ఆదొక శ్మశాన వాటిక వలె కన్పిస్తున్నది.

అలా పరిత్యజింపబడి ఉత్తప్తమై యున్న ఆ ప్రాంతర భూమిలో యిసుక భాగమునకు ఆవల పెద్ద సరివి వన మధ్యము నుండి, శిథిల జీవిత ప్రాణమును మహా మృత్యువు ఆహ్వానిస్తున్నట్టుగా, చిల్కా సరస్సులోని గంభీర జల

ములు రామచంద్రదేవుని సంజ్ఞా పూర్వకముగ ఆహ్వానిస్తున్నట్టుగా ఉన్నవి. రామచంద్రదేవు వాటికి దగ్గరగా వెళుతున్న కొలదీ అవి ఎండమావుల వలె దూరముగా జరిగిపోతున్నవి.

ఆ మండు టెండలో ఆయన ఎక్కడికి వెళుతున్నారో ఆయనకే తెలియదు. చిలికా సరస్సు ఒడ్డు మీది నుండి పాయక్కోల గ్రామము ఏదైనా చేరితే తర్వాత ఏమి జరిగినా కనీసము తమను వెంటాడి వస్తున్న మొగల్ సైనికుల బారి నుండి ఆత్మరక్షణ చేసుకొన వచ్చునని ఆయన తలంపు.

వారికి ఆ దిక్కు తెలియని ఉప్పు పొలాల ఇసుక ప్రాంత భూముల చివర దిగంతము వద్ద ఏదో కానవచ్చినది వెళుతున్నకొలదీ అది యొక చిన్న పల్లె వలె కనపించినది. ఒక చిన్న ఆలయము మీది నీల చక్రము ఆ మధ్యాహ్న వేళ ఎండలో తళతళ లాడుతు కనబడినది. కాని దాని పైన పతాకము లేదు.

అది మాల్కుదా గ్రామము. దానికి ఆవలి వైపున జటిఆ పర్వత శ్రేణి వీనుగు తొండమలాగున చిలికా సరస్సులోనికి చొచ్చుకొని ఉన్నది. జగన్నాథుడు ఆత్మగోపనము ఈ స్థలములోనే చేసికొన్న గత విషయము రామచంద్ర దేవునకు జ్ఞప్తికి వచ్చినది. నవ దివ్యసింహదేవుని ఏడవ అంకములో మొగలులు శ్రీ పురుషోత్తమ క్షేత్రమువైన దాడి చేసినారు గత కాలములో జగన్నాథుని దక్షిణపు వైపుకు మార్చినపుడెల్లా ఇక్కడనే గోపనము చేస్తూ వచ్చారు. కాని ఎప్పటి నుండి ఇక్కడ ఒక చిన్న దేవాలయము వెలసినదో, సేవకుల ఏర్పాటు జరిగి ఒక చిన్న పాయక్కోల పల్లె ఏర్పడినదో తెలియదు. దివ్యసింహ దేవుని కాలానంతరము నేటివరకు జగన్నాథుని వైన ఎట్టి అత్యాచారము జరుగ లేదు. కనక బహుశా ఈ ఆలయము ఇప్పుడు విడువబడిన స్థితిలో ఉండి యుండవచ్చును. సేవకులు వేరొక చోటికి తరలిపోయి ఉంటారు. వారి నివాసములు వానలకు కూలిపోయి చిలికా సరస్సు పాలై అదృశ్యమయి యుండవచ్చును కాని అక్కడి శిథిలములు మాత్రము ఇక్కడ పూర్వమొక పల్లె ఉండినట్లుగా సూచిస్తున్నవి. పాయక్కోల ఇండ్లు కూడా ఇప్పుడు ఒక్కొక్కటే పరిత్యజించబడు

తున్నవి. కాల ప్రభావమునకు లోనైన ఆ యిండ్లు మరమ్మత్తులులేక ధ్వంస మయి చనిపోయిన ఏనుగులవలె పడి ఉన్నవి. వాటిలో దేవాలయమును ఆను కొనియున్న కొన్ని ఇండ్లు మాత్రము చెక్కు చెదరలేదు. పాయిక్ గ్రామములు చాలమట్టుకు ఈ స్థితిలోనే ఉన్నవి. దాడులు, ఆత్మరక్షణ - వీటి మూలముగా గ్రామములలోని ఇండ్లు నిర్జనమై గ్రామము తర్వాత గ్రామము ధ్వంసమై పోయి నవి.

మాల్కుదా గ్రామములోని రహదారి శూన్యముగ ఉన్నది. చిలికా సరస్సు మీదినుండి వీస్తున్న వెర్రిగాలి శ్వాసతప్ప వేరొక శబ్దము వినబడడము లేదు. అప్పటికే రామచంద్రదేవు విపరీతమైన దాహముతో బాధపడుతున్నారు. మంచి నీటికొరకు వారొక ఇంటివైపు వెళ్ళినారు. ఆ యింటి వీథి తలుపు తెరచే ఉన్నది. వర్షములవల్లనో, వాటిని గురించి ఎవరూ శ్రద్ధ తీసికొనక పోవడమువల్లనో ఆ యింటి గోడలకు వెల్లలు ఊడిపోయి గాయపు మచ్చలవలె కనిపిస్తున్నవి.

ఆ యింటిముందు రామచంద్రదేవు గుర్రమువైనుండి క్రిందకు దూకి "లోపల ఎవరండీ :—కాసిని మంచినీళ్ళు ఇస్తారా" అని గట్టిగ కేకవేశారు. కాని లోపలినుండి ఎటువంటి సమాధానము రాకపోవడముతో ఆయన వసారా లోనికి వెళ్ళారు.

కాటికి కాలు చాచుకొని జరాజీర్ణమైయున్న ఒక వృద్ధురాలు ఎవరినో తిడుతున్నది.

"ఓసీ : చిన్న కోడలా : నోటికి హద్దూ పద్దూ లేనిదానా:...ఓ పిశాచీ : ఉక్కుగుండు వంటి నా కొడుకును పొట్టను పెట్టుకొన్నావు కదే...బావగార్లను కూడ పొట్టను పెట్టుకొన్నావు కదే-నీ తోడి కోడళ్లు కూడ నీ నుండి తప్పించు కొనలేక పోయారు. చివరకు మసలి మామగారిని కూడ పొట్టను పెట్టుకొన్నావు. ఐనా నీ కడుపు నింద లేదు. నన్ను కూడ హింసించి నీ పొట్టను పెట్టుకొనాలని చూస్తున్నావు. యముడే నన్ను వదిలివేశాడు. ఇక నన్ను నువ్వెలాగ తినగలవే: ప్రపంచ భక్షకురాలా : సర్వనాశినీ:

"చావండి! చావండి! అందరూ చావండి! ఆ చచ్చిన వాళ్ళకు చెపుతూనే వచ్చాను, యుద్ధానికి వెళ్ళకండర్రా అని. 'ఇక్కడ బక్షీ చంపుతున్నాడు. బక్షీని రాజు నరుకుతున్నాడు. సోదరుని కాలు విరగ గొట్టడానికి సోదరుడు తయారవుతున్నాడు. కొడుకును తండ్రి చంపుతున్నాడు. అందరినీ మొగలులు మింగుతున్నారు. దీనిని యుద్ధమంటారా? ఆ మృత్యువు నోటి లోనికి ఎందుకు వెళతారు? అని అన్నాను. ఆ వదరుబోతు ముసలాయన ఆ చచ్చిన వాళ్ళని రెచ్చ గొట్టాడు. 'మీరు పాయిక్ సంతానమా లేక పాకీ సంతానమా? యుద్ధం ప్రారంభ మయింది. తూర్యాలు మోగుతున్నాయి. ఇప్పుడు ఏ పాయిక్ కొడుకు వెళ్ళి గాగరలో దాక్కొంటాడు?'...శివమెత్తినట్లు గొడ్డలి పట్టుకొని గంతులు వేయసాగాడు— ఇప్పుడు చావు...చావవే సర్వనాశినీ...జగద్భక్షకురాలా...చావు ముందా!"

అసహాయ దృష్టితో రామచంద్రదేవ్ ఇటూ అటూ చూస్తూ నిలు చున్నారు. ఇంతలో ఒక స్త్రీ తలపై ముసుగును సవరించుకొని, ఎడమ చంకను నీళ్ళబిందెను ఎత్తుకొని లోపలకు వెళ్ళుటకు సంకోచిస్తూ వసారాలో నిలబడి పోయినది. కాని అప్పుడు రామచంద్రదేవ్ సంకోచించే స్థితిలో లేరు. ఆయన మోకాళ్ళపైని కూర్చుని, దోసిలొగ్గి "మంచినీరు; మంచినీరు!" అని గట్టిగా అన్నారు. ఆయన కంఠస్వరము ఒక కేక వలె వినిపించింది.

ఆ కులవధువు బిందెను వంచి వారి దోసిలితో నీరు పోయ నారంభించినది. ఆయన కడుపునిండా నీరుత్రాగి కృతజ్ఞతా దృష్టితో ఆమెను చూసేసరికి ఆమె స్థితి "నయయౌ నతస్థౌ"వలె నున్నది. ఆమె బిందె పట్టుకొని ఆలాగుననే నిలబడిపోయినది.

ఆ తీక్షణమైన మధ్యాహ్నవేళ లోపలి తిట్లవర్షము ఇంకా ఆగలేదు.

గాలి తాకిడికి ఆమె తలపైనున్న ముసుగు తొలగిపోయినది. విషాద పూరితమైన లలాటముక్రింద వాడిన పద్మరేకులవంటి రెండు దీర్ఘనేత్రములు సహానుభూతి సంవేదనల స్పర్శవలన మరింత కోమలముగా కనువిస్తున్నవి.

ఆ నేత్రములలో ఛాయావృతమైన సరోవర జలమందలి గాంభీర్య మున్నది. మసక వెన్నెల రాత్రియందలి వేదనా విధురమైన నిశ్శబ్ద మున్నది.

వ్యాఘ్రభీతి చెందిన హరిణి నేత్రములలోని అసహాయత గోచరిస్తున్నది. సూర్యా తపత్ప్రమైన నిర్జన చిలికా సైకతమందలి శూన్యతామూర్తి వలె ఆమె నిలు చున్నది,

జలదాత వయస్సు రామచంద్రదేవుని వయస్సంతే ఉండవచ్చును. కాని ఆమె యౌవనసౌష్ఠవపు ఉజ్జ్వల కాంతిపైని చీకట్లు ఎప్పటినుండి అలుముకొన్నవో తెలియదు. దండలకుగాని, ముంజేతులకుగాని నగలు లేవు. అవి బోడిగాఉన్నవి. పాపిట సిందూరము లేదు. మ్లానవదనము పైన కనుబొమల మధ్య ఒక పుట్టు మచ్చ తిలకమువలె ఉన్నది.

ఆ సర్వనాశిని ముఖమేనా ఇది ?

ఇంద్రియాసక్తుడనే చెడు పేరు ఒకటి రామచంద్రదేవునకు ఉన్నది. బహునాతీ సంభోగాసక్తి ఆయనలో తీరనిదిగా ఉంటున్నది. కాని నేడు వేదనా భరితమైన ఈ లావణ్యమూర్తి రామచంద్రదేవుని హృదయములో ఇంద్రియా సక్తినిగాని, కామపిపాసనుగాని రేకెత్తించలేదు. వారిలో ఒక అతీంద్రియాసక్తి మేల్కొన్నది. ఇందులో కామపిపాస యొక్క ఉద్రేకము లేదు. శ్రద్ధ యొక్క స్నిగ్ధత్వమున్నది. రామచంద్రదేవ్ ఆ కులవధువునకు దారి ఇవ్వవలెనని మరచిపోయినట్లున్నారు. ఆమె వివశురాలై "నాకు దారి ఇవ్వండి" అని భయ కంపిత స్వరముతో అన్నది.

మంత్రముగ్ధుని వలె రామచంద్రదేవ్ దారినుండి తప్పుకొని అసహాయ నేత్ర ములతో చిలికా తట సైకతముల వైపు చూపును మరల్చి నిల్చున్నారు. అక్కడ నుండి మరలి పోవుటకు ఉపాయము కూడ లేదు. ఏ ఉద్దేశముతో భద్రద్వారము నుండి సైన్యమును బక్షీ తొలగించాడో అది వానికే తెలియాలి. ఇక్కడినుండి వెళ్ళి అతనితో సంబంధము పెట్టుకొనడములో ప్రమాదము లేకపోలేదు. గంజా గఢ్ మానసింహుడు రామచంద్ర దేవుని ముఖము ఎరుటనే సింహ ద్వారము మూయించి వేశాడు. మాలుద్ ఫౌజ్‌దారుకు ఈ విషయము తెలియజేయకుండ నోరుమూసికొని ఉండి ఉంటాడా! అయితే వీళ్ళందరినీ ఈ నమ్మక ద్రోహము నకు తగిన బహుమతులతో ఎలా సత్కరించాలి ?

రామచంద్రదేవుని విషయము మాలుద్ ఫౌజ్‌దారు సైనికులు తెలిసికొని వేట కుక్కల వలె ఆయనను వెంబడించుటకు ఈ పాటికే సంనిద్ధులై ఉంటారు. అందుచేత ఆత్మరక్షణకు చిలికా సరస్సు ఒక్కటి మాత్రమే శరణ్యము. రామచంద్రదేవ్ ఈ విషయములను ఆలోచిస్తూ ఉండగా ఆ స్త్రీ తలుపు చాటునుండి తొంగిచూసి "తమరు ఎవరు? పాయిక్‌లా? లేక దోపిడి దొంగలా? దోపిడి దొంగలైతే దయచేసి వెళ్ళండి. మా దగ్గర ఏమీ లేదు" అన్నది.

రామచంద్రదేవ్ దీర్ఘముగా ఆలోచించి "నేను ఖోర్ధా రాజావారి పాయిక్‌ను" అని సమాధానము చెప్పారు.

"ఏమంటున్నారు మీరు? రాజావారు దక్షిణాన చెక్కలివద్ద ఎక్కడనో యుద్ధము చేస్తున్నారని విన్నానే? తమరు వారిని వదలి ఇక్కడ ఏమి చేయ వలెనని వచ్చారు? రాజావారు ఓడిపోయినారా? వారిని వదలిపెట్టి మీ రెందుకు పారిపోయి వచ్చారు?" అని ఆమె అడిగినది.

ఆమెకు ఏమి సమాధానము చెప్పవలెనో ఆయన నిర్ణయించుకొనలేక పోతున్నారు. ఆప్రతిభులై, "లేదు, రాజావారు ఓడిపోలేదు. బాణ్‌పూర్‌వద్ద ఆయన శిబిరము ఏర్పరచుకొని ఉన్నారు. దారిలో వారి కోసమే మాలుద్ ఫౌజ్‌దార్ బషీర్‌ఖాన్ పొంచి చూస్తున్నాడు. చిలికా సరస్సు మార్గము మీదుగా వారికొక ముఖ్యమైన వార్తను అందించుటకుగాను నేను ఇక్కడ నావకోసము వేచియున్నాను" అని ఆయన అన్నారు.

ఆ మాటలకు ఆమె దిలాస చెంది, "అయితే తమరు పాయిక్‌లు అన్న మాట...దోపిడి దొంగలు కారు; ఐతే తమరు పగటి పూట నావలో ఎలా వెళతారు? రంభ నుండి మొదలుకొని చిలికా ఒడ్డున మాలుద్ ఫౌజ్‌దారు గూఢచారి నావలు కాపలా కాస్తున్నాయి. పైగా ఇక్కడనుండి నావలు ఏవీ వెళ్ళకూడదని గంజాగఢ్ రాజావారు ఆదేశించారు." అని అన్నది.

అయితే చిలికా మీదుగా పోయే మార్గము కూడా మూయబడిన దన్నమాట! భయకంపిత స్వరముతో "అయితే...అయితే మరి?" అని ఆయనలో ఆయన అనుకొంటున్నట్లుగా ఆయన గొణిగారు.

"అయ్యో! ఏ దీనురాలి కంటి వెంట నీరు కార్పిస్తూ ఈయవ ఈ నిర్జన ప్రదేశముల వెంట తిరుగాడుతున్నాడు! ఈయన తిరిగి తన ఇంటి ముఖము చూడ గలడా? లేక మృత్యు ముఖములోనికి వెళతాడా? ఎవరికి తెలుసు! నా భర్త కూడ ఈయన లాగునే మంచినీటిచుక్క కోసము అల్లాడిపోయి యుండ వచ్చును," అని ఆ స్త్రీ తలుపు పట్టుకొని ఆలోచిస్తున్నది.

ఆ తర్వాత ఆమె ఆ సంకోచమును మరచి వసారాలోనికి వచ్చి, తమరు పాయిక్‌లే కదా! ఈ యిల్లు కూడ పాయిక్‌లదే. మీరింతవరకు ఏమీ తిని ఉండక పోవచ్చును. రండి, లోపలకు దయచేయండి. ఎంత సేపని ఈ మండుటెండలో నిలుచుంటారు?" అని ఆయనను లోనికి ఆహ్వానించినది.

"ఓసీ! పదరుబోతా! సర్వనాశినీ! చావు...అంతా చావండి!...నీవు చావకపోతే మరెవరు చస్తారు? కేవలం అహంకారం!...తేనె పూసిన కత్తితో పొడవడం! సోదరుని సోదరుడు కత్తితో పొడిస్తే ఏమవుతుంది? దీని వల్ల మొగలులు మింగకపోతే ఈ దేశాన్ని ఇంకెవరు మింగుతారు?" అంటూ ఆ ముసలిది లోపలినుండి శాపనార్థములు పెడుతునే ఉన్నది.

"లోపల ఎవరు ఉన్నారు" అని రామచంద్రదేవు ఆ స్త్రీని అడిగినారు.

''ఆమె మా అత్తగారు, ఆమె ముగ్గురు కొడుకులు యుద్ధములో చని పోవడము వలన ఆమె పిచ్చివారై పోయినారు. ఉదయంనుండి సాయంత్రం వరకు ఉలాగున వాగుతూ మనస్సుకు ఊరట కల్పించుకొంటూ ఉంటారు. ఆమెకు వినబడదు, కనబడదు. మీరు వచ్చిన సంగతి కూడ ఆమెకు తెలియదు" అని విచార స్వరముతో అమె చెప్పినది.

లోనికి వెళ్ళవలెనని రామచంద్రదేవు వసారా ఎక్కుతుండగా నిశ్శబ్దము ఛేదించుకొంటూ ఆ బాటపైనుండి గుర్రపు డెక్కల ధ్వని వినపించినది. ఏడు ఎనిమిది గుర్రములు వస్తున్నట్టుగా ఆ ధ్వనిని బట్టి రామచంద్రదేవు గ్రహించారు. బహుశా వారు మాలుద్ ఫౌజ్‌దారు సైనికులే కావచ్చును. ఆయనకోసమే వారు వస్తూ ఉండవచ్చును.

రామచంద్రదేవ్ ఒక గంతువేసి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంతలో వీడు గురు సైనికులు గుర్రములైన ఆక్కడకు రానే వచ్చారు.

చేరువలో ఒక జీడిమామిడి చెట్టునకు కట్టియున్న గుర్రమును చూపించి "ఈ గుర్రపు యజమాని ఎక్కడ" అని అందులో ఒక సైనికుడు ఆ స్త్రీని అడిగినాడు.

ఆమె ధైర్యము తెచ్చుకొని, "ఏ గుర్రము? ఆ గుర్రము ఎవరిదో నాకేమి తెలుసు? ఎంతమంది మొగల్ సైనికులు ఇటువచ్చి వెళ్ళడము లేదు? వారిలో ఎవరిదైనా కావచ్చును,' అని సమాధాన మిచ్చినది.

ఒక సైనికుడు గుర్రము మీది నుండి క్రిందికి దూకి "ఆపు! ఆపు నీ గడుసు తనము!...ఈ గుర్రము ఖోర్ధా రాజుది. ఆ విషయము మాకు బాగా తెలుసు. అతను ఎక్కడ దాక్కొన్నాడో చెప్పు" అని గట్టిగా అన్నాడు. "రాజు! ఏ రాజు?" అని కంపిత సర్వముతో అంటూ ఆశ్చర్యపోయినది.

"రాజును ఎక్కడ దాదావో చెప్పు, లేకపోతే నీ మానము దక్కదు" అని అశ్లీలమైన కంఠస్వరముతో ఆ సైనికుడు అరిచాడు.

"సరే మంచిది రాజు లేకపోతే రాణీ అయినా సరే. ఎక్కించండర్రా దీనిని గుర్రము మీదికి" అని వేరొకడు రాక్షస స్వరముతో అన్నాడు.

ఆ ఆశ్వికుల ఎగతాళులు ఆ నిశ్శబ్ద వాతావరణములో ప్రతిధ్వనించినవి.

"ఖబర్దార్! ఆమె ఒక పాయిక్ ఇంటి కోడలు? యజ్ఞ శిఖవంటి ఆమెను మ్లేచ్ఛులు స్పృశించలేరు. జాగ్రత్త!" అంటూ రామచంద్రదేవ్ ఒక గొడ్డలి తీసి కొని రంగములోనికి ఉరికారు.

అయన వారిని ఎదుర్కొంటున్న సమయములో ఒక సైనికుడు గుర్రము మీదినుండి రామచంద్ర దేవుని గురిచూసి ఒక బల్లెమును విసరినాడు. క్షణమాత్రములో వారిని రక్షించుటకు ఆడ్డుగా వచ్చిన ఆ స్త్రీ బల్లెపు పోటుకు గురియై ఆర్తనాదము చేస్తూ రక్తపు మడుగులో కూలిపోయినది.

ఆ సైనికులను ఎదుర్కొంటూ రామచంద్రదేవు గొడ్డలి ఎత్తారు. కాని వారంతా ఒకేసారి వారిని కత్తులతో ఎదుర్కొని కొట్టడముతో వారి గొడ్డలి చేతులలో నుండి క్రిందపడినది.

రామచంద్రదేవు ఆసహాయులై "ఇప్పుడు మమ్మలను మీరు బంధించ వచ్చును" అన్నారు.

4

చదరంగములో రామచంద్రదేవు ఒక ఐంటుతో 'త్రోసిరాజు' అన్నారు. మనసులో మళ్ళా ఆదే మాట అనుకొన్నారు. "అయినప్పటికీ ఓటమి సంభవించలేదు. కాని ఆ నాడు ఛత్రద్వార కనుమ నుండి సైన్యమును బక్షీ ఎందుకు తొలగించినట్లు?...ఎందుకని...?"

రాజపుర్ ప్రాంతరములో చికాకోల్ సైన్యమును అడ్డగించవలెనన్న అభిప్రాయము అతనికి ఉండిఉంటే ఆతడు అక్కడ యుద్ధము ఎందుకు చేయలేదు? కాని రామచంద్రదేవు పట్టుబడిన తక్షణము చికాకోల్ ఫౌజ్‌దారు సేనలను తరలించుకొని వెళ్ళిపోయినాడే! అయితే అతను అక్కడ ఎవరితో యుద్ధము చేసినట్లు?

ఈ తర్కవితర్కముల వలన వారి మనస్సునకు సంతోషము కలుగ లేదు, "ఆ రోజున ఛత్రద్వార కనుమను వదలి బక్షీ ఎందుకు వెళ్ళినట్లు?" ఇదే ప్రశ్న మాటి మాటికి వారిని కలవర పెట్టసాగినది.

నరములతో ఉబికిన బక్షీ ముఖము, అతని ముండిత శిరస్సు, గొడ్డళ్ళ వలె మెరిసిన అతని తీక్షణ నేత్రములు ఇవే-రామచంద్రదేవుని కళ్ళముందు కదలాడ సాగినవి.

ఆయితే వేణు భ్రమరవర్ కూడ నమ్మకద్రోహము తలపెట్టినాడా?

క్రూర, కుటిల, భయంకర బక్షీ నేత్రములు ఒక విభ్రాంతిని కలుగ జేసే ప్రశ్నవలె చదరంగపు బల్లవైని గోచరించసాగినవి.

——

మూడవ అధ్యాయము

I

మహా కార్తీకము ప్రవేశించినది.

ఇప్పటినుండి హోళీవరకు దూర ప్రాంతములనుండి వచ్చే యాత్రికులతో సాధారణముగా శ్రీ క్షేత్రము నిండి ఉంటుంది. కాని జిజియా పీడ వలన మొగలుల దాడుల భయము వలన ఆ రోజులలో బడ్దాండ్ పైన కాకులు మాత్రమే ఎగురుతున్నాయి.

నలువైపులను దేవాలయములను పగులగొట్టడము మరల నిత్య కృత్యము వలె తయారయినది. ఎక్కడ దేవాలయమున్నా అది భూమట్టమయి దాని రాళ్ళతో పిపిలీ, కటక్ మొదలగు ఇతర స్థలములలో మసీదులు వెలుస్తున్నవి. పిపిలీ మసీదుతో సరితూగ గల మసీదు వేరొకటి మొగలాయీల ఆధిపత్యముండిన రోజులలో మరెక్కడను నిర్మింప బడలేదని ప్రజలు చెప్పుకొనేవారు.

ఔరంగజేబు కాలమునుండి దేవాలయములను నాశనము చేయడము ఒక మతవిహిత కార్యముగ భావింపబడుతూ వచ్చినది. అంతేకాదు అది ఒక మత కర్తవ్యముగ కూడ భావింపబడుతూ వచ్చినది. ఇక్రామ్ ఖాన్ నాయబ్-నాజిమ్‌గా నుండిన కాలములో అనంగ భీమ దేవుడు నిర్మించిన జగన్నాథ దేవాలయము ఒక పెద్ద రాళ్ళ కుప్పగా తయారయినది. ఆ రాళ్ళతోనే కటక్‌లో జుమా మసీదు నిర్మితమైనది. క్రీ శ. 1635లో దేవాలయ ప్రాకారములలోని రాళ్ళతో కదమ్ రసూల్‌ను సుజాఖాన్ నిర్మించినాడు.

అయినా సుజాఖాన్ పూర్తిగా హిందుమత ద్వేషి కాడు. హిందువులతో అతనికి లోలోన స్నేహ సంపర్కములు ఉండేవి. అందుచేతనే మూర్షిదాబాద్ నుండి అతడు వస్తూ రాయ్ ఆలంచంద్, ఫతేచంద్ జగత్ సేఠ్ మొదలగు హిందువులను తనతోగూడ తీసికొని వచ్చినాడు. వారు సుజాఖాన్‌కు స్నేహితులు, సలహాదార్లుగా ఉండేవారు. అందువలన సుజాఖాన్ నాయబ్ నాజిమ్‌గా ఉన్నంతకాలము ఉత్కళ దేశములోని దేవాలయములు వెనుకటి మహమ్మదీయుల కాలములలో కంటె ప్రమాదరహితముగా ఉంటూ వచ్చినవి. కాని సుజాఖాన్ ఉంపుడుక త్తెకు పుట్టిన తకీఖాన్ కటక్‌కు నాయబ్ నాజిమ్‌గ వచ్చినప్పటి నుండి తిరిగి దేవాలయముల విధ్వంస కార్యక్రమము ప్రారంభమయినది. అందుచేతనే పురుషోత్తమ క్షేత్రము ఒక అవ్యక్త భయముతో కంపించి పోతున్నది.

ఈ భయమునకు తోడుగా క్షామ భయ మొకటి వచ్చి నెత్తిమీద పడినది. పంట పొలము అన్నీ బీళ్లు అయినవి. ఏమైన వ్యవసాయము చేసినను అక్కడి పంట అక్కడనే నాశనమౌతున్నది. వీటికితోడు భూమిపన్ను భారము ఒకటి ఎక్కువయినది. అందువల్ల రైతులు "త్రాహి, త్రాహి" అని అల్లాడిపోతున్నారు.

ఏటా ఆరులక్షల పదిహేను వేల ఆరువందల పదహారు రూపాయలను 'నజరానా'గా ఖోర్ధా దుర్గమునుండి ఖాన్-ఏ-దౌరాకు పంప వలసినదని నిర్బంధమున్నది. కాని ఈ నజరానాను చెల్లించడము ఖోర్టా రాజునకు ఇష్టములేదు. అలా చెల్లించడము ఒక సిగ్గుచేటయిన కార్యముగా వారు భావించినారు. అందువలన ఇప్పుడు ప్రజలను హింసించి అయినా ఆ నజరానాను వసూలు చేయవలెనని వకీలు సయ్యద్ బేగ్ సిపాయిలతో గూడ ఖోర్ధాలో తిష్ఠ వేసికొని కూర్చున్నాడు. ప్రజలను హింసించి, అవసరమైనచో వారిని కొల్లగొట్టి అయినాసరే ఈ నజరానాను దక్షిణ ప్రాంత యుద్ధము కోసము వసూలు చేయవలసినదని ఢిల్లీ నుండి ఉత్తరువులు వస్తూ ఉండేవి. ఇప్పుడు ఆట్టి ఉత్తరువులు మూర్షిదాబాద్‌నుండి వస్తున్నవి.

రామచంద్రదేవ్ బార్‌వాటి దుర్గములో బంధింపబడి, కల్మా వల్లించి, ముసల్మాన్ యువతిని వివాహమాడి హాఫిజ్ కాదర్ యార్‌జంగ్ గా మారినప్పటి

నుండి ఆయన బేడీలు తగిలించుకొన్న వానిలా ఖోర్థాలో కూర్చున్నారు. మునుపటి దంభము ఇప్పుడు పాయిక్‌లలో లేదు. జగన్నాథుని సేవకునిగా ఖోర్ధా రాజు ఉండినంత కాలము ఆయన జాతీయ ఐక్యతకు, ప్రాణ శక్తులకు ఒక నజీవ మూర్తిగా పాయిక్‌ల దృష్టిలో నిలిచిపోయినారు. కాని ఆయన మతాంతురులైన తరువాత వారి యెడల మునుపటి గౌరపము పాయిక్‌లలో లేదు. ఇప్పుడు కేవలము బక్షీ వేణు భ్రమరవర్ మీదనే వారి ఆశలన్ని నిలిచి ఉన్నవి. కాని రామచంద్రదేవుకు విరుద్ధముగ బక్షీ ఏమీ చేయలేక పోతున్నాడు. రామచంద్రదేవుని భార్యకు సోదరుడైన నాయబ్–నాజిమ్ తకీఖాన్ అంటే ఆయన భయపడుతున్నాడు.

2

హనుమాన్ అఖాడా పూరీలోని ప్రాచీన బాలిసాహి రాజప్రాసాదపు శిథిలములలోనే ఉన్నది. వేణు భ్రమరవర్ ఎప్పుడు పూరీ వచ్చినా అక్కడే ఉంటాడు.

మహారాజ్ హరేకృష్ణ దేవుకు దివాను అయిన భగీ భ్రమరవర్ పుత్రుడు వేణు రావుత్‌కు భ్రమరవరుల వంశ వృక్షములో ఎవరుకూడ స్థానమును కల్పించ లేదు. అయినప్పటికి వేణు భ్రమరవర్ చేస్తున్న ప్రచారము ప్రకారము ఖోర్ధా సింహాసనమునకు ఆతడే ఏకైక వారసుడనీ, మానవుడు ప్రకృతి కల్పించిన కుట్రలనుండి ఆయన సమయమునకు బయట పడినారనీ అనివిస్తుంది.

పెద్దగా ఆశించిన కోరికలు తీరనందువలన కలిగే బాధను మించిన వ్యథ మరియొకటి ఉండదు. పెక్కులి యుద్ధ సమయములో రామచంద్రదేవును శత్రువుల ఎదుటకు నెట్టి, తకీఖాన్ గుప్పిటనుండి ఆయన బ్రతికి బయట పడడము అసంభవమని వేణు భ్రమరవర్ తలచినాడు. అటు పిమ్మట ఖోర్ధా సింహాసనాధి

కారము దానంతట అదే తనకు లభ్యము కాగలదని అతడు ఆశించినాడు కాని రామచంద్రదేవ్ ఎకీఖాస్‌కు బావగారయి తిరిగి భోర్ధాకు వస్తారని ఆయనే కాదు మరెవరూ కూడ ఊహించలేదు.

రామచంద్రదేవుని పతనము మీద కేంద్రీకృతమయి యుండిన ఈ తీరని కోరిక లన్నీ అగ్నిత ప్తమైన లోహశలాకల వలె వేణు భ్రమరవర్‌ని దహిస్తున్నవి.

హనుమాన్ అఖాడాలోని ఒక రహస్య మందిరములో కూర్చొని జపమాలను త్రిప్పుతూ, ధైర్యాన్ని జపిస్తూ మనోద్వేగమును కొంతవరకు అదుపులో పెట్టుకొనుటకు బక్షీ వ్యర్థ ప్రయత్నము చేస్తున్నాడు.

గంగవంశ రాజుల కాలములో నిర్మించబడిన ప్రాచీన బాలిసాహి రాజ ప్రాసాదము చారిత్రిక చిహ్నముగా అసంఖ్యాకమైన అనామక గుల్మముల మధ్య మల్ల యుద్ధములో చిత్తయిన వస్తాదువలె రాళ్ళ కుప్పగా పడియున్నది. తూర్పు వైపున నున్న మేడలు తప్ప దర్బారు హాలు, ప్రవేశ ద్వారములు, ఇతర కట్టడములు విరిగి కళావిహీనమై చనిపోయిన ఏనుగులవలె పడి ఉన్నవి. ఏనాడో పాలరాతి పలకలతో నిర్మించబడిన కొలను గతకాల స్మృతి చిహ్నముగ ప్రాసాదము మధ్యను ప్రకాశిస్తున్న సూర్య కాంతిలో వ్యాపించి ఉన్నది. అది రాలిన ఆకులతో నిండి యున్నది. ఆ కుళ్ళిన ఆకుల మధ్యను అక్కడక్కడ వికసించిన కమలము లున్నవి కొలనుకు ఉత్తరమున శ్యామకాళి ఆలయమున్నది. ఆ ఆలయమే హనుమాన్ అఖాడాకు పీఠమైనది. ఉత్తరాదినుండి వచ్చిన సాధువు శ్రీ సీతారామ్‌జీ దీనిని నెలకొల్పినారు. ఆలయమునకు ఆస్తిపాస్తులు ఏమీ లేవు. ఇతర మఠముల నుండి లభించే ఆర్థిక సహాయముతో ఈ అఖాడా పని చేస్తున్నది.

సీతారామ్‌జీ మరణించినప్పటినుండి శ్రీ లచ్మన్‌జీ ఈ అఖాడాకు అధిపత్యము వహించినారు. ఆధ్యాత్మిక, సాధన, భజనల దృష్ట్యా చూసిన యెడల వాటికన్న శారీరక చర్చలే ఇక్కడ ప్రధాన విషయములుగా కనబడుతున్నవి. కాలాపహాడ్ దాడి జరిగిన అనంతరము పురుషోత్తమక్షేత్రము మీద మాటి మాటికి జరిగిన ఆఫ్గన్, మొగల్ దాడుల ఫలితముగనే ఈ రకమైన అఖాడాలు

పూరీలో బహుళా పెలసి ఉండవచ్చును. అఖాడాలోని విద్యార్థులకు మల్లయుద్ధము, కత్తిసాము, గదలను త్రిప్పడము, బల్లెములను విసరడము మొదలగు విద్యలలో రక్షణ ఇవ్వబడుతున్నది. శ్రీ మందిరము మీద గతములో జరిగిన అనేక చిన్న పెద్ద దాడులను ఈ అఖాడాలలోని విద్యార్థులే ప్రతిఘటించినారు. ఈ రకమైన కొన్ని ముఖ్య అఖాడాలను తన ప్రత్యేక స్థావరములుగ ఐక్షీ వేణు భ్రమరవర్ ఏర్పరచు కొన్నాడు. అందుచేతనే ఆయన ఈ అఖాడాలకు ప్రభుత్వ ఆర్థిక సహాయమును అందజేసినాడు.

ఈ మేడలోని ఒక రహస్య మందిరములో కూర్చొని ఐక్షీ నామ సంకీర్తనము చేసికొంటున్న సమయములో హనుమాన్ అఖాడా యువకులు వ్యాయామ సాధన చేస్తున్నారు. శ్యామాకాళీ ఆలయములోని ఒక నాచుపట్టిన వసారాలో ఒక కంబళీ పరచుకొని దానిపైని కూర్చొని లఛ్మన్‌జీ ఇద్దరు యువకుల మల్లయుద్ధమును తదేక ధ్యానముతో తిలకిస్తున్నారు. ఒక నిశిత విమర్శకునివలె ఆ మల్లుల అంగ విన్యాసములను ఆయన తదేకముగా చూస్తున్నారు.

జగు పఢిఆరీ, చేమాలేంకా ఇద్దరూ కుస్తీ కసరత్తులలో ఒకరిని మించిన వారు ఒకరు. లంగోటీలను బిగించి వారిద్దరూ రెండు పెద్ద నల్ల రాళ్ళవలె నగ్న ప్రాయులై కుస్తీ పడుతున్నారు. చేమా ముందుకు పడినాడు జగు పఢిఆరీ వాని మీదకు ఎక్కి, తన రెండు బాహువులను అతని చంకలలోనుండి పోనిచ్చి, తన మోచేతులను భూమిపైని ఆనించి పెదవులను బిగించి అతనిని తలకిందులు చేయవలెనని విఫల ప్రయత్నము చేస్తున్నాడు. కాని అజగరము వలె పడియున్న చేమా తన శరీరమును ఇటు అటు ఊపుతున్నాడు. క్షణమాత్రములో జగు విసరి వేయబడినట్టు కిందపడి మట్టికరచినాడు. అది చూసి వారి చుట్టూ చేరిన వారు ఉత్కంఠ స్వరముతో పరిహాసము చేసి చప్పట్లు కొట్టినారు. జగు సంభాళించుకొని, పట్టును మార్చుకొన దలచినట్టు ఒక విశిష్ట పద్ధతిని లేచి నిలుచున్నాడు. హనుమంతునివంటి ఆ యిద్దరి హుంకారములతో ఆ అఖాడా మారుమ్రోగినది.

ఆలయ మండపమునకు ఎరురుగ దండెములు, బస్కీలు తీస్తున్నట్టుగా నరసింహారి లంగోటీ బిగించి ఒక ఎత్తైన రాతిపైని భంగు నూరుతున్నాడు. దీని తరువాత అతనికి 'నరేంద్ర'లో స్నానమాడినంత ఆనందము కలుగుతుంది. నరసింహారి భంగు నూరుతూ తన కండరములను ఆడిస్తున్నప్పుడు అస్పష్టముగా ఉపేంద్రభంజ్ గీతములను పాడుకొంటున్నాడు.

భంగు నూరే చోట పైనుండి ఒక పంజరము వ్రేలాడు తున్నది. దానిలో కొన్ని గోరువంకలు కిచర్ మిచర్ మంటున్నవి. నరసింహారి పాట విని "నెఐస్, మిత్రమా!" అని భంగు త్రాగిన వాని స్వరముతో ఒక గోరువంక అన్నది.

ఆ సమయానికి చేమాను జగు పధిఆరీ కుస్తిలో చిత్తు చేసినాడు. అందు వలన సందర్శకుల కరతాళ ధ్వనులతో ఆ ప్రదేశము విక్కటిల్లినది.

కాలము చేతిలో కీలు బొమ్మలవంటి వారు అక్కడ కసరత్తు చేస్తున్న వారు. కనుక తమకు అందగా నున్న భ్రమరవర్ శ్రీ క్షేత్రమునకు యవనులను ఆహ్వానించి తీసికొని వచ్చుటకు వేసిన ప్రణాళికల విషయము వారికి తెలియదు కాలాపహాడ్ దాడుల ఫలితముగ ఒరిస్సాలో మూల మూలలో దుమ్ము కొట్టు కొని పోతున్న మందిరముల, దేవాలయముల విషయము గూడ వారికి తెలియదు. అందుకు పగతీర్చుకొనవలెనని గాని ప్రతి క్రియ జరుపవలెనని గాని వారికి లేదు. భంగు మత్తులో కుస్తి కసరత్తులు చేస్తూ తమ్ము తాము మరచి వారు అఖాడాలో ఉంటూ ఉంటారు.

చరిత్ర క్షీణ దశకు వచ్చినప్పుడు దాని అనుష్ఠానపు గుణములలో, నడ కలలో కూడ మార్పు రావడము సహజము. అందువలన హనుమాన్ మఠాధికారి గాని, అతని శిష్యులలో ఏ ఒక్కరు గాని తమ మీద పడుతున్న వినాశమును గ్రహించే స్థితిలో లేరు. దానిని తెలిసికొనాలన్న ధ్యాస కూడ వారికి లేదు.

ఆ శిథిల ప్రాసాదములో చీకటి గుహలవంటి మూడు కక్షల తరువాత ఒక ఆవిందము ఉన్నది. ఆ ఆవిందమునకు చుట్టూ నాచు వేరుకొనిపోయి ఉన్న

గోడల మీది చెక్క సున్నము ఊడిపోయినందువలన సన్నని ఇటుకలు మానవ పుర్రెలోని దంతములవలె కనిపిస్తున్నవి.

ఆ ఆళిందమునకు పశ్చిమమున ఒక నుయ్యి ఉన్నది దాని లోనికి దిగుటకు మెట్లు ఉన్నవి. ఒకప్పుడు అందులో అంతఃపుర స్త్రీలు స్నానము చేసేవారు. దానిలో ఇప్పుడు గాలించిన యెడల కొన్ని మానవ పుర్రెలు దొరకవచ్చును. గతములో ఇందులోనే ఎన్నో ఆత్మహత్యలు జరిగినవి. శత్రు మృత దేహములు ఎన్నో ఇందులోనికి విసరి వేయబడినవి. ఆయిసప్పటికి దీనిలోని నీరు ఇప్పటికీ స్వచ్ఛముగ నిర్మలముగ కనబడుతున్నది.

ఆ నూతికి పశ్చిమముగ ఒక వసారా ఉన్నది. దానిని ఆనుకొని కొన్ని కొట్లు ఉన్నవి. ఒక దానిలో మఖమల్ పరుపు పరచిన ఒక పాత మంచము ఉన్నది. దిండునానుకొని ఒక కంబళిమీద వేణు భ్రమరవర్ కూర్చొని జపమాల త్రిప్పుతున్నాడు. పారలౌకిక ధ్యానములో నిమగ్నమగుటకు జపమాల ఏ విధముగ ఉపయోగకరమో ఇహలోక దుశ్చింతలనుండి ముక్తి పొందుటకు కూడ అది అదే విధముగా అవసరము. ఖోర్ధా రాజ సింహాసనమునకు సంబంధించిన విషయమై బహుళా బక్షీ ఆలోచిస్తూ ఉండవచ్చును.

ఆయన శుష్కించిన ముఖము, ముండిత శిరము, జీర్ణ శరీరము-ఇవన్నీ కలివి ఆ ఛాయాంధకార బంధురమైన కొట్టులో ఒక విశాచమువలె కనిపిస్తున్నవి.

రథీపుర్ గడ్‌లో ఆనాటి ఆఖరు జామున చూసిన భయంకర దుస్వప్న దృశ్యము బక్షీ కళ్ళు మూసికొనే సరికి ఎదురుగ కదలాడినది. దానిని గురించి ఎన్నిసారులు ఆలోచించినను దాని రహస్యమును ఛేదించుట ఆయనకు సాధ్యపడ లేదు. మణి వక్రేశ్వరాలయ సిద్ధుడు బాబా హరిదాసును ఈ స్వప్నమును గురించి ఒకసారి ఆయన అడిగినాడు. దానికి సమాధానముగ ఆ బాబా ఒక మంద హాసము చేసి ఊరుకొన్నాడు.

"ఈ స్వప్నమునకు అంతరార్థమేమైన కలదా స్వామీ:" అని ఒకసారి కాదు పదే పదే వేణు భ్రమరవర్ అడిగినాడు.

కాని, సిద్ధహరిదాసుని వెదవులపైని రహస్యమయమైన ఆ మందహాసము తప్ప వేరొక సమాధానము ఆయనకు లభించలేదు. అనేక పరిప్రశ్నల అనంతరము మొక్కవోయిన మనస్సుతో "రాజ్యలాభము, లేకపోతే ప్రాణహాని-ఇదే ఈ స్వప్నములోని అంతరార్థము "అని చివరకు సిద్ధబాబా చెప్పినారు.

ఇది ఒక కొత్త విషయము ఎలా అయినది! కత్తి-కిరీటము, స్మశానము-సింహాసనము, ఈ పరిణతులు రెండింటి మధ్యనే గదా రాజపురుషుల జీవితములు నిత్యమూ సంచరిస్తూ ఉంటవి!

బాణాఘాతము తగిలినవానివలె బక్షి ఉన్నట్లుండి కళ్ళు తెరచి చూసినాడు.

ఆ గదిలోని మసక చీకటిలో ఆ భయంకర స్వప్న దృశ్యము తుడుతున్నట్టుగ ఆయనకు అనిపించినది.

బల్లెములు బల్లెములు-కత్తులు కత్తులు యుద్ధము చేసికొంటూ తళతళలాడుతున్నవి. కత్తికి కత్తి రాసుకొని చిచ్చుబుడ్డి రవ్వలవలె అగ్ని కణములు ఎగసి పడుతున్నవి. ఒక్కొక్క నిప్పురవ్వ ఒక్కొక్క రక్తపు బొట్టువలె మారిపోతున్నది. ఆ రక్తసిక్తమైన పృష్ఠభూమిలో ఎముకలతో తయారయిన సింహాసనము స్పష్టముగ కనిపిస్తున్నది. నాలుగు పుర్రెల పైన దాని నాలుగు కోళ్ళు స్థాపితమై ఉన్నవి. ఆ పుర్రెల చక్షు వివరములలో కనుగ్రుడ్లు సజీవముగా ఉన్నవి. ఆ కళ్ళు పూర్తి అనాసక్తి భావముతో ఆ ఖడ్గయుద్ధమును చూస్తున్నట్లుగా ఉన్నవి. విశాలమైన రత్నఖచితపు మఖమల్ పరువు ఆ సింహాసనము మీద ఉన్నది. దానిపైని అష్టమణి నిర్మితమైన రాజకిరీటము ఒకటి ఉన్నది. ఆ కిరీటమునకు రక్షకులవలె సింహాసనమునకు ఇరువైపులను రెండు ఏనుగులు నిలిచి ఉన్నవి. అభిషేక జలము వలె వాటి తొండములనుండి వేడి రక్తము వర్షిస్తున్నది. ఇంతలో ఆకస్మాత్తుగ ఒక కబంధుడు ఒక గొడ్డలి పట్టుకొని ప్రవేశించినాడు. ఆ ఖడ్గసమూహమును ఛేదించుకొంటూ అతడు సింహాసనము వరకు వచ్చినాడు. ఆతని పదాఘాతము వలన ఆ కిరీటము, ఆ సింహాసనము మాయమయినవి. ఆ తర్వాత ఆ కబంధుడు గొడ్డలి త్రిప్పుతూ స్మశానములో నలువైపులా నాట్యమాడినాడు.

రథీపుర్‌గఢ్‌లో అరాత్రి ఈ భయంకర స్వప్నమువచ్చిన తర్వాత ఆ ర్త నాదము చేస్తూ బక్షీ వేణు భ్రమరవర్ మంచము మీదినుండి దూకి క్రిందనిలుచు న్నాడు. శరీరమంతా చెమటతో తడిసి ముద్దయి పోయినది. పడక గదిలోని దీపము నిర్వాణ ప్రాయమైనది. అది నయట వాయుచలనము లేని నిర్జనమైన రాత్రి "దుర్గా: దుర్గా" అని అరుస్తూ వేణు భ్రమరవర్ బయటకు పరుగె త్తి నాడు. కోట ప్రాచీరము మీద కావలివాండ్రు నడుస్తున్నారు. వారి చెప్పుల శబ్దము తప్ప వేరొక శబ్దము వినబడుట లేదు. ఒక ఉజ్వల నక్షత్ర కాంతిలో చేరువలో గంగవతీ నదీతటమందున్న మణి వ కేశ్వర ఆలయ శిఖరము ఒక ఛాయాచిత్రమువలె కన్పిస్తున్నది. వేణు భ్రమరవర్ చేతులు జోడించి మణి వక్రేశ్వరుని తలచుకొని ప్రణామము చేస్తున్న సమయములో అతనికి తూర్పు దిశను ఉదయించిన ఒక తోకచుక్క గొడ్డలి ఆకారములో కనుపించినది. చాల రోజులుగ ప్రతి వేకువ జామున ఈ విచిత్రాకృతితో ఈ తోకచుక్క ఉదయి స్తున్నదన్న వార్త అతను కావలివాండ్ర ద్వారా వింటున్నాడు కాని ఆ నాటి వరకు దానిని తన కండ్లతో తను చూడలేదు. ఆ భయంకర స్వప్నము చూసిన తర్వాత మూగవోయిన బక్షీ, ఆకాశము మీద ఈ వెద్ద విచిత్రమైన తోక చుక్కను చూసి అమంగళము రాబోవుతున్నదన్న శంకతో భయపడినాడు.

ప్రభాత పక్షుల మధుర కలకలారవములు భూమి నలవైపులను నెమ్మది నెమ్మదిగా వ్యాపించ సాగినవి. రథీపుర్ దుర్గమునకు కందకమువలె నాలుగు వైపులను పరివేష్టించిన గంగవతీ నదీ పాంశుల జలరాశిలో ఉషస్సూర్యుని అరుణ కిరణములు ప్రకాశిస్తున్నవి. నెమ్మది నెమ్మదిగ తోకచుక్క వెల్లబారి అదృశ్యమైనది. అయినను అప్పటికి కూడ వేణు భ్రమరవరుని భయాకుల దృష్టికి ఆ కబంధుని నాట్యమే కనబడుచున్నది. నాట్యము చేస్తూ ఆ కబంధుడు తన వైపుకు వస్తున్నట్లుగ అతనికి కనివించ సాగినది.

హనుమాన్ అఖాడాలోని ఆ రహస్య మందిరములో జపమాలను త్రిప్పు తున్న వేణు భ్రమరవర్ చేతి వ్రేళ్లు మొద్దుబారి శక్తి హీన మయినట్లుగా ఉన్నవి.

ఆ భయంకర కబంధుడు తనను వెతకుతూ ఆ మందిరము లోనికి ప్రవేశించి నట్లు బక్షీకి అనిపించినది. అతడు భయపడుతూ నాలుగు మూలలను చూసినాడు.

"ఇదంతా ఉద్వేలితమైన మనస్సుయొక్క భ్రాంతి" అని మరియొకసారి, బహుశా నూట ఒకటవసారి, బక్షీ తనను తాను ఆశ్వాసించుకొనినాడు.

అఖాడానుండి ఫుంకార ధ్వనితో పాటలు లయబద్ధముగా బయటకు విన వస్తున్నవి. కనుక ఆయనకు తాను మెలకువగా నన్నట్లు అవగత మయినది. దానితో ఆయన మనస్సులో ఊరట జెంది తిరిగి జపమాల త్రిప్పడము ప్రారంభించినాడు. కాని మనో నివేశమునకు లక్ష ప్రయత్నములు చేయుచున్నప్పటికిని ఆయనకు ఏకాగ్రత దొరకుటలేదు. అంతేకాదు, ఇహలోక భావనలు దుశ్చింతలవలె ఆయనను ఆందోళన పరుస్తున్నవి. ఈ దుశ్చింతలకు మూలకారణము ఆ ఖోర్ధా సింహాసనమే.

గంగానది నుండి గోదావరి వరకు విస్తరించి యుండిన ఉత్కళ రాజ్యపు చివరి స్వతంత్ర గజపతి ముకుందదేవుని అసలు వారసులు ఆనాటి మొగల్ సమ్రాట్ అక్బర్ కుతంత్రముల కారణముగ ఖోర్ధా, ఆలీ, సారంగగఢ్‌ల నుండి నిర్వాసితులైనారు. అసాధారణ సంఘటన వలె, 'దనేయి విద్యాధర్' పుత్రుడు 'రమేయి రావుత్ రా' ఎక్కడినుండో వచ్చి 'రామచంద్రదేవ్' అయి ఖోర్ధా సింహాసనమును అధిష్టించినాడు. ఖోర్ధా సింహాసనమునకు సరి అయిన వారసుడు రామచంద్రదేవ్ అని మానసింహునికి జగన్నాథుడే స్వప్నాదేశము ఇచ్చినాడని అనుకొంటూ ఉంటారు. కాని ఆదంతా తరువాతి చరిత్రకారుల కపోల కల్పిత గాథ మేటి కుతంత్రజ్ఞుడైన మానసింహుడు ఖోర్ధా సింహాసనము పైన రామచంద్రదేవుని కూర్చుండ బెట్టి ఒకే బాణముతో మూడు పక్షులను పడగొట్టినాడు. స్వతంత్ర ఖోర్ధా రాజ్య మిషతో పురుషోత్తమ క్షేత్రపు స్వాతంత్ర్య ప్రతిపత్తులను అంగీకరించి ఒరిస్సాలోని మొగల్ రాజ్యశక్తికి, ప్రబల పరాక్రమశాలైన ఆఫ్గన్ విద్రోహులకు మధ్య మరొక శక్తిని అతడు స్థాపించినాడు. ఒరిస్సాలోని హిందూవుల అభిమానమును పొందడముతో బాటు అతడు గజపతి ముకుంద దేవుని

వారసులను భోర్ధా సింహాసనమునుండి తొలగించ గలిగినాడు. దీనివలన గజపతి వంశీయుల యెడల ఒరిస్సాలోని దుర్గాధిపతులకు, సామంతులకు విశ్వాసము లేకుండ పోయినది.

జ్యేష్ఠుడు అలి అధిపతి అందుచేత జేష్ఠాంశకు వారసుడు కూడ. కాని ఆతడు ఇప్పుడు ఒక జమీందారుడు. కనిష్ఠుడు సారంగ గఢ్ అధిపతి, 'ఛకడీ భ్రమరవర్' వంశజులు ఈ సారంగ గఢ్ అధిపతి సహాయము మీదనే ఆధార పడి ఉన్నారు. అంధారు ఆ, దారుతేంగా, హరిడామడా, బారంగ్, పరిఆ, కాలా రాహాంగ్, దాఢా మొదలగు దుర్గములలోని 'ఛకడీ' వంశజులు అనేక భగ్నాంశ ములుగ విభజింపబడి చారిత్రక పుటల నుండి నెమ్మది నెమ్మదిగ దిగజారి అనామ ధేయులుగా మరుగైపోవ నారంభించిరి. అయినప్పటికి, భోర్ధా కటక్‌ల మధ్య నట్టనడుమను సారంగగఢ్ ఉన్నందువలన అనేకమంది దుర్గాధిపతులు, సామంతులు ఒక కపట నీతిని అవలంబించినారు. వారు ఒకసారి కటక్‌లోని మొగ లాయి నాయబ్-నాజిమ్ పక్షమున భోర్ధాకు వ్యతిరేకముగ యుద్ధ సహాయము చేసిన మరియొక సారి భోర్ధా పక్షమున నాయబ్-నాజిమ్‌లతో యుద్ధము చేయు చుండెడివారు. ఏనైనప్పటికి భోర్ధా రాజవంశము అంటే వారి మనస్సులలో ఒక రకమైన ఈర్ష్య. అసూయ ఉంటూ ఉండేవి. సారంగగఢ్‌తో భోర్ధాను కలిపి గంగనుండి గోదావరివరకు మరల ఉత్కళ సామ్రాజ్యమును ప్రతిష్ఠించవలెనని వారు ఆకాంక్షతో కలలు కనడము ప్రారంభించినారు. కాని మొగలాయీ శక్తి మహా కాలుని వలె ఈ పగటికలలను పరిహసిస్తున్నది.

భోర్ధా మీదకు ఖాన్-ఏ-దౌరా గతములో దండెత్తినప్పుడు ముకుంద దేవ్ మహారాజును వెన్నపోటు పొడవడములో సారంగగఢ్ దుర్గాధిపతి నీల్ భ్రమరవరుని జ్యేష్ఠ పుత్రుడు కపాలీ భ్రవరవర్ సహాయము చేసినాడు. అందుకు సంతోషించి ఖాన్-ఏ-దౌరా అతనిని భోర్ధా సింహాసనము పైకి ఎక్కించినాడు. అప్పుడు ఆయనకు తన చిరకాల వాంఛ నెరవేరినట్లు అనిపించినది. కాని క్షణ మాత్రములో నీటి బుడగలవలె ఆ కల మటు మాయమైనది. ఖాన్-ఏ-ధౌరా

ఒరిస్సా వదలి వెళ్ళగనే ముకుందదేవ్ మహారాజు తిరిగి వచ్చినాడు. విశ్వాస ఘాతకుడైన కవాలీ భ్రమరవర్ ఆత్మరక్షణకు గాను ధేంకానాల్‌కు పారిపోయినాడు. అతనికి వ్యతిరేకముగ అతని తమ్ముడు శ్రీనాథ్ హరిచందన్ ముకుందదేవునకు సహాయపడినాడు. అందుచేత శ్రీనాథ్‌హరిచందన్ శిశుపాల్, భంజలీ, రథీగఢ్‌లకు దుర్గాధిపతి కాగలిగినాడు. హరేకృష్ణదేవ్ మహారాజు కాలములో ఇతని జ్యేష్ఠ పుత్రుడు భగీ భ్రమరవర్ భోర్ధాకు దివానుగా ఉండేవాడు. ఆయన కుమారుడు వేణు రావూత్ ఒకప్పుడు జగన్నాథాలయములో తిరుగాడుతూ మహా ప్రసాద కణములను ప్రోగు చేసేవాడు. మతి స్థిమితము లేని గోపీనాథ్ మహారాజు అటువంటి వానికి 'బక్షీ' తలపాగను చుట్టబెట్టినాడు. ఒక అసాధ్యపు చేనుగును లొంగదీసినందుకు పారితోషికముగ వేణు భ్రమరవర్ రావూత్‌కు ఆ బిరుదును రాజువారు ప్రసాదించ వలసి వచ్చినది.

దానితో భోర్ధా సింహాసనము చేతికి అందు బాటులోనికి వచ్చినట్టయినది. కేవలము కత్తిని పొడవడమే ఆలస్యము. రాజసింహాసన వారసత్వము కోల్పోయిన భ్రమరవరు లందరు ఆ సుముహూర్తము కొరకు ఎదురు చూస్తూ, వేణు భ్రమరవర్ మీద తమ ఆశలను నిలుపుకొని అర్ధ స్వర్గములో వేచి ఉన్నారు.

అకస్మాత్తుగ బక్షీకి ధ్యాన భంగ మైనది. ఆ కబంధుని ఛాయామూర్తి తన పైకి దాడిచేస్తునట్టుగ దూకినది. అప్పుడు బక్షీ శరీరము భయముతో కంపించి పోయినది.

పరమ పితైషి గోపీనాథ దేవుని రూపము కాదుగదా, ఇది కేవలము ఒక తలను తగిలించినంత మాత్రమున ఆ రూపము పూర్ణాంగములతో స్పష్టము కాగ లదు...ఆవే ధవళ సుందర సౌమ్య అవయవములు...వాటినుండి కర్పూర మిశ్రితమైన మృదు మధుర చందన సుగంధము వెలువడుతున్నది...ఆవే బలమైన ఆజానులంబిత భుజములు...కంఠములో వజ్ర వైడూర్యములుగల బంగారు హారము...ఆదే...క్షీరోద్ర పట్టు వస్త్రము.....

క్రీ.శ. 1639వ సంవత్సరములో హరేకృష్ణదేవ్ మహారాజావారి తర్వాత గోపీనాథదేవ్ సింహాసనారూఢులైనారు. ఆయనకు కాసన దండము పట్టుకొన

డము కన్న పూలదండను పట్టుకొనడము ఎక్కువ ఇష్టము. ప్రతిదినము కవి పండితులతో కావ్యగోష్ఠి, కామశాస్త్ర చర్చలు. వేట, రాత్రులందు మోహినీ తంత్ర పద్ధతిలో దేవీ సాధన-నుతము పేరిట సౌరాచారములు-వీటి తోనే ఆయనకు కాలము గడిచిపోతూ ఉండేది. చివరకు మోహినీ తంత్ర పద్ధతిలో సిద్ధి ప్రాప్తించి నట్లయిన మొగలులు వారికి వశీభూతులు కాగలరని ఒక దృఢ విశ్వాసము వారిలో ఏర్పడినది. పురుష సంపర్క మెరుగని వేయినూట ఎనిమిది మంది కన్యలతో సంభోగించిన తరువాతనే ఆ సిద్ధి ప్రాప్తిస్తుంది. ఏ మోహినీ రూపములో మహిషాసురుని దేవి మర్దించినదో ఆ రూపములోనే సాధకుని ముందు ఆమె ప్రత్యక్షమై వరములు ప్రసాదిస్తుంది. మొగలులను నాశనము చేయుటకు గోపీనాథుడు చివరకు ఈ తంత్ర దీక్షను పూనినాడు.

ఆ రోజులలో ఊరూపేరూ లేని, కులశీలములు తెలియని వేణు రావుత్ గురించి ఎవరికి ఎరుక? అంతకు పూర్వము మహారాజావారి కాలములో తన పుత్రుని దేవాలయములో ఒక ఆలయ రక్షకునిగా దివాను భగీ భ్రమరవర్ నియమించినాడు. కాని ఆకాశము నంటేటంత మహత్వాకాంక్ష, అహంకారము గల వేణు భ్రమర్‌వర్‌కు దానితో తృప్తి, సంతోషము ఎలా కలుగుతవి? అదే సమయములో ఆడవిలో కొత్తగా పట్టుకొనబడి ఇంకా లొంగని ఒక మదపుటేను గును ఖాణ్‌పుర్ రాజావారు కానుకగా రాజా గోపీనాథ్‌కు పంపినారు. ఆది చాల అసాధ్యమైన ఏనుగు. దానిని లొంగ దీయుటకు ప్రయత్నించిన ఇద్దరు మావటి వారు తమ ప్రాణములు కోల్పోయినారు. మావటి వానిని చూడగనే అది మీంక రించి మీదకు వస్తున్నప్పుడు కొమ్ములు తిరిగిన మావటివాండ్రు, మల్లులు గూడ దానిని ఎదుర్కొనుటకు భయపడేవారు. ఆ దుస్సాధ్యమైన ఏనుగు భయము వలన మనుష్యుల రాకపోకలు బిడ్‌దాండ్ వైని పూర్తిగ నిలిచిపోయినవి.

ఆ సమయములో ఆ ఏనుగును లొంగదీయుటకు వేణు రావుత్ ఉద్యుక్తు డైనాడు. తన ప్రయత్నములో తన ప్రాణములు పోయిన పోవచ్చును. కాని ప్రతికి ఇట్ట కట్టినట్లయిన రాజావారి దృష్టిలో తనకొక విశిష్ట స్థానము తప్పక లభించగల దనే ఆతని ఆశ.

అతడు ఎనుగును లొంగదీయుటకు ముందుకు వెళుతున్నప్పుడు సందర్శకుల నోటనుండి పరిహాసములు మొదలుకొని శుభాకాంక్షల వరకు అనేక రకములైన ప్రసంగములు అతనికి వినవచ్చినవి.

"నా కొడుకునకు ప్రాణములు చేదు ఆయినవా ఏమి? అరే వేణూ! ఏమిటి సంగతి? చావవలెనని అనుకొంటున్నావా? ఎంతో మంది మావటీలే దాని ముందు నిలువలేక పోయినారు. నీవు ఏపాటి? దాని కాళ్ళక్రింద పడి చావగలవు!" అని అన్న మాటలు గూడ అతని చెవి సోకలేదు.

చేతిలో అంకుశము, నడుముకు కత్తి. 'జై జగన్నాథ్!' అని నినాదము చేస్తూ వేణు రావుత్ ఏనుగ ఎదుట నిలుచున్నాడు. ప్రాసాద శిఖరముపైని ఒక పరివేషణ మండపములో కూర్చుని ఈ దుష్కర దృశ్యమును రాజావారు తిలకిస్తున్నారు.

వేణును చూసి రెప్పపాటు కాలములో ఏనుగు అతని మీదికి తిరిగినది. అతడు కూడ తిరిగినాడు. ఆది చుట్టూ తిరుగుటకు మళ్ళినది. సమయము చూసి వేణు ఒక్క గంతువేసి దాని వెనుకకు వెళ్ళినాడు. అదును చూసి దాని తోక పట్టుకొనుటకు ప్రయత్నించినాడు. అది అతని వైపు తిరిగినది. అతడు తప్పించుకొనినాడు. ఈ విధముగ కొలది సేపు ఏనుగుతో అతడు దాగుడుమూతలాడినాడు. తర్వాత కొద్ది సేపు ఏనుగు స్తబ్ధముగ నిలిచి పోయినది. బహుశా ఆది కొత్త విధముగ తనను ఎదుర్కొనడానికి ఆలోచిస్తున్నదని అతడు అనుకొన్నాడు. అతడు అదను చూసి దాని తోకను పట్టుకొన్నాడు. రెప్పపాటు కాలములో అతడు ఏనుగు మీదకు ఎక్కినాడు.

ఈ దృశ్యమును చూసిన జనమంతా సంభ్రమాశ్చర్యములకు లోనయినారు. శ్రీ మందిరములో ఆక్కడా అక్కడా ఏకో తిరుగాడుతూ మహా ప్రసాద కణములను ప్రోగు చేసికొనే ఒక అస్థిపంజరమువంటి వేణు రావుత్ ఈ మదపు ఏనుగును వశపరచుకొన గలడని వారు ఊహించలేదు.

ఇంతలో ఏనుగు ఘీంకరిస్తూ, పీపుమీదినుండి వేణును క్రిందకు లాగి పడ త్రోయవలెనని తన తొండమును ఇటూ అటూ త్రిప్పుతు విశ్వప్రయత్నము చేస్తు

న్నది. ఏనుగు తొండమును మాటి మాటికి తన కరవాలముతో గాయపరుస్తూ తనను రక్షించుకొంటూ ఏనుగును రక్తపుటేరులో వేణు ముంచెత్తినాడు. దానితో వేణును ఎలాగైనను క్రిందకు పడత్రోయవలెనని ఏనుగు విచ్చెత్తినట్లు ఇటు నటు పరుగెత్త సాగినది. అపుడు వేణు దాని చెవి క్రింద అంకుశముతో పొడిచి పొడిచి పోరాడినాడు. చివరకు ఆ దుర్దాంత గజేంద్రమును ఒక మేషమువలె తూర్చుంద పెట్టుటలో వేణు కృతకృత్యుడయినాడు.

ఆ రోజునుండి కులశీలములు తెలియని వేణు రావుత్ మహారాజా వారి ఆంతరంగికులలో ఒకడైనాడు. ఆ తర్వాత ఒకానొక శుభముహూర్తమున వానికి 'బక్షీ' పదవిని మహారాజా వారు ఇచ్చి సత్కరించినారు. ఈ విధముగ గుణరూపములలో ప్రగతి పథమునందుకొని వేణు రావుత్, బక్షీ వేణు భ్రమరవర్ రాయ్‌గ మారి రాజావారికి అత్యంత విశ్వాస పాత్రుడు, అంతరంగికుడైన సభా సదుడు అయినాడు. బక్షీ లేకుండ రాజావారికి ఒక్క క్షణముకూడ గడచేది కాదు. కవుల కావగోష్ఠి మొదలుకొని పంచ మకార సాధనలో భైరవీ చక్రమందు కూర్చునే వరకు అన్ని విషయములలోను గోపీనాథ్ మహారాజా వారికి బక్షీ భ్రమరవర్ సన్నిహిత సహచరుడైనాడు.

ఇక రాజ్యములో చెప్పరాని దురాగతములు. కత్తి చూపించి పన్నులు వసూలు చేయుట మొదలుకొని దోపిడీల వరకు జరుగుతున్నవి. ఇంతకు మించి గోపీనాథ్ మహారాజా వారి నుండి నజరానా వసూలు చేసే ఉపాయము వేరొకటి మొగల్ అధికారులకు కనుపించలేదు.

దీనికి తోడు పుండుమీద కారము జల్లినట్లుగ సంసారుల ఇండ్లలో కూతుళ్ల కోడళ్ల మాన మర్యాదలు నిలబడదము లేదు మోహినీ తంత్రము కొరకు గోపీనాథ దేవుని భైరవీ చక్రము వరకు కూడ వారిని తీసికొని పోవడము జరుగుతున్నది. నాలుగు వైపుల 'త్రాహి త్రాహి' అని జనులు గగ్గోలు పెట్టే వారు.

గోపీనాథ్ దేవుని సమావేశ మందపములో ఆనాడు కవితాగోష్ఠి ఏర్పాటు చేయబడినది. ధుమసర్ రాజ్యచ్యుతుడైన రాజపుత్ర కవి ఉపేంద్ర భంజ్ ఆ నాటి ముఖ్య అతిథి.

కాని కావ్యాదర్శముల రస వివేచన చేసే ధైర్యముగాని పట్టువల గాని బక్షీకి లేవు. నవనీతము వంటి మృదు స్వభావుడు,మాయా మర్మములు ఎరుగని నిర్మల హృదయుడ ఆయిన గోపినాథుని ఎలా నిశ్శేషము చేయడమని ఆలోచిస్తూ ఆయన ప్రక్కనే బక్షీ కూర్చున్నాడు.

కావ్యరస దృష్టితో చూసినట్లుయిన నూర్యవంశ రాజుల కాలములో ఏ స్వతఃస్ఫూర్తి వంతమైన ప్రాణశక్తి ఒరియా కావ్యములలో ఉంటూ ఉండినదో దాని క్షీణాభాసము కూడ ఈ కావ్యములలో కానరావడము లేదనే ఒక దృఢాభిప్రాయము అతనికి ఉన్నది. "ఒక నిర్వీర్య జాతి యొక్క ఆహత పౌరుషము నేడు కామ యుద్ధములో కందర్ప శరాఘాత వితాడితయై నిజలీలా సంగినినే షత విక్షతము జేసి ఆత్మ తృప్తిని పొందుతున్నట్లుగా గుణ వర్ణిత రీతులలో కావ్య గానము చేయుట వలన ఒక గౌణ మనోవృత్తితో నిండియున్న సమాజపు రస విపాస శాంతిస్తున్నది. దుర్భిక్ష పీడితుడైన నేటి మానవుడు నరమాంసమునే భక్షిస్తున్నాడు. కన్యక యొక్క శంకాకుల పక్షములలో యౌవనపు మొగ్గ వికసించక ముందే పరుగు పుట్టిన పండువలె ఆమె ఎండి వాడిపోతున్నది. అటువంటప్పుడు ఈ కవుల కావ్యగానములలో యువతీ సమున్నత స్తన స్పర్శ వలన కలుగు అనుభూతులను వర్ణించిన ఆది ఏమంత శోభస్కరముగా ఉండగలదు?"

వ్యాకుల చిత్తుడైన బక్షీ తనలో తానే పైవిధముగ ఆలోచించు చుండిన సమయములో దివాను కృష్ణ నరేంద్రుడు ప్రవేశించి, "సుజాఖాన్ వకీలు సయ్యద్ బేగ్ లాతీ పుచ్చుకొని గుమ్మమువద్ద కూర్చుని ఉన్నాడు. ఈ మూడేండ్ల నుండి ఒక గుడ్డి గవ్వ కూడ ఖోర్ధా నుండి వసూలు కాలేదని అతను అంటున్నాడు" అని రాజావారి చెవిలో మెల్లగా అన్నాడు.

విసీ వినసట్లుగ గోపినాథదేవ్ తీరుకొన్నారు. కవులకు పండితులకు పట్టు బట్టలు, మకర కుండలములు బహూకరించి వారిని యథోచితముగ సాగనంపే ఏర్పాట్లలో వారు ఉన్నారు. "సయ్యద్ బేగ్ విషయము ఏమి చేద్దాము?" అని తిరిగి దివాన్ అడిగినాడు.

"ఖోర్ధా మహారాజులు ఎవరికీ నజరానాలు ఇవ్వరు. మేము మొగలులకు ఖానిసలము కాము. ఆలీ, సారంగగఢ్‌ల వలె ప్రతి సంవత్సరము నజరానాలు చెల్లించి సింహాసనపు యోగ్యతా పత్రములను పుచ్చుకొనే వారము కాము మేము" అని గోపీనాథదేవ్ కొలది చిరాకుతోనే సమాధానము ఇచ్చారు.

సారంగగఢ్‌ను గూర్చి అనేకమంది సమక్షములో చేసిన ఈ వ్యంగ్య ప్రసంగము వేణు భ్రమరవర్ అంతరాళములలో నిద్రాణమై యున్న అగ్ని శిఖ దావానలమువలె ప్రజ్వలింప జేసినది. ఈ పరమ హితైషి గోపీనాథుని దయా, సానుభూతుల వలన కులశీలములు తెలియని వేణు రావుత్ ఖోర్ధా రాజ్యపు బక్షి వేణు భ్రమరవర్‌గా మారినాడన్న తలంపు కలుగగానే అతని మనస్సు గోపీ నాథుని యెడల కృతజ్ఞతా భావముతో కాక ఈర్ష్యా దుఃఖములతో నిండి పోయినది.

"సుజాఖాన్‌కు ఆత్మరక్షణ చేసికొనుట కష్టమై పోయినది. మూర్షిదా బాద్‌లో నవాబ్ జాఫర్‌ఖాన్ నాసిర్ మరణ శయ్యా పైన ఉన్నాడు. అతని మనుమడు సర్‌ఫరాజ్‌ఖాన్ పేరిట బెంగాల్, బీహార్, ఒరిస్సా సూబాల పట్టాలను ఇప్పించుటకు ఢిల్లీ, షాహజహాన్ బాద్‌లో కూర్చున్న అతని మనుష్యులు ఎత్తు గడలు వేస్తున్నారు. మూర్షిదాబాద్ పదవి మీద గూడ సుజాఖాన్ దృష్టి కేంద్రీ కృతమై ఉన్నది. వీని వలన మామా అల్లుడు, తండ్రికొడుకుల మధ్య సంఘర్షణ ప్రారంభమైనది. దివాన్‌గారూ! అందువలన ఇతనిని ఏదో విధముగా వదల్చు కొనండి. ఖోర్ధా మహా రాజులు ఎవరికీ నజరానాలు ఇవ్వరని సయ్యద్ బేగ్‌తో చెప్పండి" అని గోపీనాథదేవ్ దూర దృష్టి లేకుండా అనాలోచితముగ గర్వాతిశ యముతో అన్నారు.

దివాన్ కృష్ణ నరేంద్రుని ముఖమండలము గంభీరముగ మారినది. బాధ్యతా రహితమైన ఈ గర్వోక్తుల వలన ఎట్టి పర్యవసానము రానున్నదో ఆయనకు తెలుసు. సయ్యద్‌బేగ్ ద్వారా ఆన్ని విషయములను తెలిసికొని సుజా ఖాన్ ఖోర్ధా మీదకు దండెత్తే అసలుకే మోసము వచ్చి అంతా సర్వనాశనము అవుతుంది.

దివాన్ కృష్ణ నరీంద్రుడు చింతా క్రాంతుడైనాడు. ఆయన నొసటి రేఖలు మరింత కుంచించుకొని పోయినవి ఆయన మండపము విడిచి వెళ్ళి పోయినాడు.

అళిందము వద్ద ఒక పొట్టి గోడను ఆనుకొని శూన్య దృష్టితో బరుణేయి పర్వతమువైనున్న దిక్సూచీ స్తంభమువైపు రెప్పలార్చకుండ చూస్తూ బక్షి వేణు భ్రమరవర్ నిల్చున్నాడు. దివాన్ కృష్ణ నరీంద్ర ఎప్పుడు ఆయన వద్దకు వచ్చి నిల్చున్నాడో ఆయనకు తెలియనే తెలియదు. కృష్ణ నరీంద్ర దీర్ఘముగా నిట్టూర్చినంతనే ఆయనకు ధ్యాన భంగమయినది. ఆయన కృష్ణ నరీంద్రవైపు సాలోచనముగా చూసి "దివాన్‌జీ! ఏమిటి విశేషములు?" అని అడిగినాడు.

కృష్ణ నరీంద్ర బరుణేయి పర్వతము వైపునకే తన దృష్టిని మరల్చి, శూన్యముగా చూస్తూ "శకునములు మంచివిగా కనబడుట లేదు" అని ఆహత స్వరముతో అన్నాడు.

ధూసరపు కనుబొమల క్రింద వేణు భ్రమరవర్ రెండు నేత్రములలో రహస్యమయము, దుర్భేద్యము అయిన కుతంత్రము నెమ్మది నెమ్మదిగా ప్రకటిత మవుతున్నది.

"అయితే ప్రతీకారము-ఉపాయము ఏమైనా చెప్పండి" అని వేణు భ్రమరవర్ అడిగాడు.

"ఆ జగన్నాథునికే తెలియాలి!" అని నిస్పృహతో కృష్ణ నరీంద్రుడు అన్నాడు.

"ఆ జగన్నాథుడు కూడ ఆ ఒకే నావ మీద ఆసీనుడై ఉన్నాడు" అని వేణు భ్రమరవర్ అన్నాడు.

"అదైతే స్పష్టమే...కాని ఉపాయము ఏమిటి?" అని కృష్ణ నరీంద్రుడు అడిగినాడు.

"ఇంత వరకు సాగుతూ వచ్చిన వ్యవస్థను అమలు జరివితే ఏమిటి నష్టము? ఈ ఉపాయము నిరుపయోగమైనది కాదు. లోగడ ఇది పరీక్షకు నిలబడినది!" అని చెప్పిన వేణు భ్రమరవర్ కండ్లు కత్తులవలె మెరసినవి.

శాప గ్రస్తమైన ఒరిస్సా చరిత్రలో సింహాసనము కొరకు జరిగిన అనేక రక్త కళంకితమైన సంఘటనలు కృష్ణనరేంద్రుని కండ్లముందు గోచరించినవి. కృతఘ్నతకు, వెన్నుపోటుకు సంబంధించిన అనేక సంఘటనలు ఆయనకు జ్ఞాపకమునకు వచ్చినవి. ఆయన దీర్ఘముగ నిట్టూర్చినాడు.

ప్రాణములు తీయుటకు సంసిద్ధు డైనట్లుగ ''ఊరుకొన్నా రెందుకు? నా మాటలు నచ్చలేదా?" అని వేణు భ్రమరవర్ అడిగినాడు.

"సూర్యవంశము పతనమైన నాటినుండి ఇదే వ్యవస్థ మాటిమాటికి ఒరిస్సా చరిత్రలో అమలు జరుపబడుతున్నది. కాని దీని వలన వ్యాధికి కొత్త కొత్త లక్షణములు పొడసూపు చున్నవి...ఎప్పుడైనను విశ్రాంతి లభించినదా?" అని కృష్ణ నరేంద్రుడు అన్నాడు.

"ఆ పాత విషయములను వదలి వేయండి. ప్రస్తుత విషయమును ఆలోచించండి. దీనివలన మీకు ఎటువంటి నష్టము రాదు. పైగా మీకు లాభమే కలుగుతుంది. అలాగ కాకపోయినట్లయితే సుజాఖాన్ రాజా వారిని పట్టి ఈడ్చుస్తున్నప్పుడు దివానుగారు కూడా ఈడ్చుకొంటూ కూడా కూడా వెళ్తారా ఏమి?"

కృష్ణ నరేంద్ర చింతా క్రాంతై "లేదు, నాయబ్ నాజిమ్ సుజాఖాన్ యొక్క పకీలు సయ్యద్‌బేగ్ సైనికులతో గూడ వచ్చి బిగిసి కూర్చున్నాడు. మహారాజ్ గోపీనాథదేవ్ పక్షమున వాడు తరువాత మాట్లాడితే?" అన్నాడు.

కృష్ణ నరేంద్రునికి దగ్గరగా వచ్చి "సయ్యద్ బేగ్‌కు అభ్యంతరము ఏమీ లేదు. ఆ విషయము నాకు తెలుసును. మహారాజావారు మెల్లి మెల్లిగా వశము తప్పుతున్నారని వానికి కూడ తెలుసును" అని వేణు భ్రమరవర్ నెమ్మదిగ అన్నాడు.

కృష్ణ నరేంద్రుడు దీర్ఘముగ నిట్టూర్చి హతాశుడై "అప్పుడు నాకు మాత్రము అభ్యంతరము ఎమి ఉంటుంది?" అని అనినాడు.

భోర్ధా, యుంఝూర్‌పుర్, బరుణేయిగఢ్ లలో రోజు ఒక యుగముగ గడుస్తున్నది.

ఆ రోజు అర్ధరాత్రి సమయమున—

అందరు నిద్రాదేవి ఒడిలో అచేతనముగ పడుకొని ఉన్నారు. రాణీ హంస పుర్‌లోని ప్రదీపము లన్నీ ఆరిపోయి ఉన్నవి.

రాజప్రాసాదము ముందు భాగములో నున్న గోపీనాథుని సాధనా కక్షలో వెలుగుచున్న ప్రదీప కాంతి రేఖ తలుపు సందులోనుండి అంధకారమును చీల్చుతూ చురక త్తివలె బయట పడుతున్నది. సాంబ్రాణి ధూప సుగంధము గదిలోనుండి వెలువడు తున్నది. దానితో మూర్ఛిత నిశీధ వాతావరణము స్నేహ పూరిత మైనది.

గదిలోని చామరముమీద మోహినీ యంత్రమును చందనముతో ప్రతిష్ఠించి గోపీనాథదేవ్ ధ్యాన మగ్నులై కూర్చొన్నారు. నివేదించబడిన పాద్యము, చందనము, పుష్పము, తాంబూలము మొదలగు పూజా ద్రవ్యములు యంత్రము పైన ఉన్నవి. గోపీనాథ దేవుని ఎదుట పీనస్తనయైన ఒక నవయౌవనాంగి వివస్త్రయై యున్నది. నేతి దీపపు మంద కాంతిలో తన పీనోన్నత ఉరోజముల మీద లజ్జావనత దృష్టిని నిల్పి కదలకుండ ఆమె కూర్చొని ఉన్నది. గోపీనాథదేవ్ ఎర్రని పట్టు పీతాంబరములను ధరించినారు. విశాల వక్షస్థలము పైన రుద్రాక్ష మాల, ఎడమ భుజము పైన అష్టధాతు నిర్మితమైన కవచము, నొసటను రక్త చందనపు బొట్టు చాల మనోహరముగ కన్పిస్తున్నవి. ఒక రహస్యమయమైన అద్భుత అలౌకికత్వముతో ఆయన ముఖమండలము భాసిస్తున్నది. ఈ గుప్త సాధన కొరకు ఈ అభాగినిని ఏ గృహస్థుని ఇంటినుండి భటులు అపహరించి తెచ్చినారో తెలియదు. ఇటువంటి సాధన సమయములలో బక్షీ వేణు భ్రమరవర్ కూడ చక్రములో కూర్చొని ఉంటూ ఉండేవాడు. కాని ఆయన నేడు రాలేదు. గోపీనాథుని ముందు కొన్ని ఖాళీ సురాపాత్రలు పడియున్నవి. మోహినీ సాధనలో అది పంచ మకార సాధన. పంచ మకారములలోని ప్రవృత్తుల ద్వారా నివృత్తిని

పొందడమే ఈ సాధనకోని రహస్యము. ప్రవృత్తులను జయించి వీరభద్రుడై ఈ సాధనా సిద్ధిని సాధకుడు పొందుతాడు.

గోపీనాథదేవ్ అంగన్యాస, కరన్యాసములు చేసి యువతి నగ్న శరీరము మీద పుష్ప దళములు నిక్షేపించి,

"పద్మాననామ్ శ్యామవర్ణామ్ పీనోత్తుంగ పయోధరామ్
కోమలాంగీం స్మేరముఖీం రక్తోత్పల దశేక్షణామ్
ఓం హ్రీం ఆగచ్ఛ పద్మినీ స్వాహా....."

అని మంత్ర పఠనము చేస్తున్నారు.

పుష్పదళముల కోమల స్పర్శవలన పాషాణ మూర్తివలె కూర్చుండిన యువతి నిశ్చల శరీరము వాత కంపిత కిసలయమువలె అనగా గాలికి కదలాడు చిగురుటాకు వలె కంపించి పోతున్నది. కాని గోపీనాథ దేవుని మనస్సులో స్వల్పాతి స్వల్పముగా నైనను చిత్తచాంచల్యము కలుగుట లేదు. ఆయన స్వయముగా ఒక శిలా విగ్రహమై కూర్చున్నారు.

ఆ సమయములో ఎవరు తీసినారో తెలియదు కాని అకస్మాత్తుగ ఆగది ద్వార కపాటములు తెరచుకొన్నవి. మద్యపానము చేత ఉన్మత్తమైన నేత్రము లతో గోపీనాథదేవ్ బక్షీ వేణు భ్రమరవర్ను చూసినారు. బక్షీ ఒక నుండి కర వాలము తీసి పట్టుకొని నిల్చున్నాడు. వేణు భ్రమరవరుని ఈ భయంకర ఆవిర్భావమును చూసి ఆ యువతి గదిలో ఒక మూలకు వెళ్ళి చీకటిలో దాగొన్నది. బక్షీ ఉద్దేశ్య మేమిటో గోపీనాథ దేవ్ గ్రహించలేక ఏమీ చేయవలెనో తెలియక చూస్తూ ఉండిపోయినారు.

కొద్ది సేపయిన తర్వాత అవిచలిత స్వరముతో "బక్షీ, భైరవీ చక్రములో సాధన చేయుచున్నప్పుడు ఖడ్గము అవసరము లేదోయి. చిత్త సంయమము అనే కరవాలముతో మాయా రజ్జువును, ప్రవృత్తి బంధనములను ఛేదించవలసి ఉన్నది," అని గోపీనాథదేవ్ అన్నారు.

ఆ సమయము లో హింసాత్మకమైన బక్షీ నేత్రములు రెండు నిప్పుకణముల వలె కణకణ లాడినవి. పరిస్థితిని అవగాహన చేసికొని గోపీనాథదేవ్ తన మీదకు దూకకముందే బక్షీ అతని శిరస్సు ఖండించి వేసినాడు. గోపీనాథదేవుని ఛేదిత శిరము ఆఖరి బలిదానముగా మోహినీ యంత్రముపైని నివేదించబడినది.

అయితే, గోపీనాథుని హత్య చేసిన తర్వాతనైనా ఖోర్ధా సింహాసనాభిషిక్తుడు కావడము లో బక్షీ కృతకృత్యుడు కాగలిగినాడా? ఆ మరునాడు ఉదయమునే బక్షీ కొంత మంది పాత్రోలు, సామంతులతో 'చేరినవర్ బాంకియా'కు వెళ్లుతూ ఉండగా వారిని దారి మధ్యలోనే సయ్యద్‌బేగ్ కరవాలముతో ఎదుర్కొన్నాడు. సయ్యద్‌బేగ్‌ను చూసి బక్షీ నిశ్చేష్టుడైనాడు.

సయ్యద్‌బేగ్ సహాయముతోనే గతరాత్రి గోపీనాథుని హత్య జరిగినది. కాని తెల్లవారు సరికి సయ్యద్‌బేగ్ వేరొక విధముగా ప్రత్యక్షము కాగలదని స్వప్నములో గూడ బక్షీ ఊహించలేదు. కాని బక్షీ వంటి విశ్వాసఘాతకుడు ఏదో ఒక రోజున మొగల్ రాజశక్తికి ఎదురు తిరుగగలదని సయ్యద్‌బేగ్‌కు తెలుసు. ఖోర్ధా సింహాసనమునుండి గోపీనాథదేవుని తొలగించుటకు బక్షీవంటి అస్త్రము ఒకటి సయ్యద్‌బేగ్‌కు అవసరమయినది. అంతేకాని తన స్వీయ రక్షణకు బక్షీని విశ్వసించడము తెలివైన పని కాదు. పైగా అతడు లొంగదీసికొనుటకు వీలు కానంత అసాధ్యుడుగా మారవచ్చును. అందుచేత నజరానా బాకీ గురించి గోపీనాథుని తమ్ముడు రామచంద్రదేవునితో ముచ్చటించి ఆతనిని సింహాసనము ఎక్కించి బేగ్ వచ్చాడు. ఈ కారణమే కాదు, భగీరథమరపర్ కుమారుడైన వేణు భ్రమరవర్‌ను ఖోర్ధా రాజుని చేయడానికి దుర్గాధిపతులలో చాలమంది సుముఖులుగాలేరు కూడ.

కింకర్తవ్య విమూఢుని వలె నిల్చున్న బక్షీని చూసి "బక్షీగారూ! రండి. నేను మిమ్ములను క్షమించాను. మీకు ఏ హాని జరుగదు." అని సింహాసనము మీది నుండి రామచంద్రదేవ్ అనినారు,

ఒక బాధ్యతాయుతుడైన సేవకునివలె రామచంద్రదేవుని పాదముల వైన అడ్డము నుంచి ప్రణామము చేసి, తలవంచుకొని బక్షీ నిల్చున్నాడు. దివాన్ కృష్ణ నరీంద్రుడు అపరాధివలె రామచంద్రదేవుని సింహాసనము వెనుక బక్షీని చూస్తూ నిల్చున్నాడు. "సరే, ఈ ప్రయత్నములో కృతకృత్యులము కాలేక పోయి నాము...మరియొక అవకాశము దొరికి తీరుతుంది" అని కళ్లద్వారా మూగ భాషలో చెప్పవలెనని దివాన్ అనుకొన్నాడు గాని బక్షీకి ఆతనివైపు చూసే సాహసము లేకపోయినది.

అనేక నిరీక్షణల అనంతరము ఒక సదవకాశము లభించినది. చెక్కలి యుద్ధమునకు రామచంద్రదేవ్ బయలుదేరి నప్పుడు ఛత్రద్వార కనుమ రక్షణ భారమును బక్షీకి అప్పగించవలసి వచ్చినది. రామచంద్రదేవుని ఆదేశాను సారము ఛత్రద్వార కనుమ వద్ద బక్షీ సిద్ధముగా ఉండి ఉండే చికాకోల్ సైని కులు బ్రతికి బయట పడెకి వారుకారు. మాలుద్ ఫౌజ్‌దార్ కనుక వెనుకనుండి దాడిచేసి యుండిన అతడు నామరూపములు లేకుండ పోయెకివాడు. కాని అనాడు బక్షీ బుద్ధి పూర్వకముగానే ఛత్రద్వార కనుమనుండి సైన్యమును తరలించినాడు. ఆసహాయుడైన రాజును మృత్యు ముఖములోనికి గెంటి ఖోర్ధా సింహాసనమును తన గుప్పిట చిక్కించుకొనవలెనని తలచినాడు. కాని రామచంద్రదేవ్ శిలు వను ఎక్కకుండ నాయబ్-నాజిమ్ తకీఖాన్ సోదరికి భర్తగా కటక్ నుండి తిరిగి వస్తాడని బక్షీ కలలో గూడ అనుకొనలేదు. అదృష్టపు అభిశాపము వలన అతని ఆశలన్నీ గంగపాలైనవి.

జాతి భ్రష్టుడు, మతాంతరుడు అయిన రామచంద్రదేవును అంటే హాఫిజ్ కాదరును గజపతిగా స్వీకరించుటకు పాయిక్‌లు, దుర్గాధిపతులు, అనేకమంది సామంతులు సుముఖులుగా లేరు.

రామచంద్రదేవుని పని సంకేత మాత్రముతో పూర్తి కావించ వచ్చును. కాని ప్రబల పరాక్రమవంతుడైన నాయబ్-నాజిమ్ తకీఖాన్ సోదరికి భర్త అయిన సామంతుడు హాఫిజ్‌కాదర్ యార్‌జంగ్ పైని చేయి చేసుకొనే సాహ

సము ఎవరికి ఉన్నది? కనుక బావ మరదుల మధ్య అనుమానములు, అపనమ్మకములు సృష్టించి ఒకరిని ఒకరు ద్వేషించుకొనే స్థితిని కలుగ జేసిన కాని ఖోర్ధా సింహాసనమునుండి రామచంద్రదేవుని తొలగించడము సంభవము కానేరదు. బక్షీ వేణు భ్రమరవర్ అటువంటి అవకాశము కొరకే ఎదురు చూస్తున్నాడు.

బాలిసాహీ రాజమహల్‌లోని ఒకగదిలో కూర్చుని జపమాలను త్రిప్పుతూ బక్షీ ఈ కూట కౌశలము గురించే దీర్ఘముగా ఆలోచిస్తున్నాడు. బహుశా ఈ పెనుగులాటల నుండి జగన్నాథుడు గూడ విముక్తుడు కాలేడేమో? ఒక వైపు ఖోర్ధా సింహాసనపు టుజ్జ్వలావకాశము వేరొక వైపు మిగిలినవన్నీను.

బక్షీ ఆకస్మాత్తుగ అదరి పడినాడు. అంధకారమైన ఆ గదిలో ఏదో ఒక నీడ అటూ ఇటూ కదలినట్టయినది. బక్షీ నొసటినుండి స్వేద బిందువులు రాలినవి.

లోపలకు ప్రవేశించుటకు బక్షీ అనుమతి కొరకు గదిబయట నిరీక్షిస్తూ వకీలు జయి పట్ట నాయక్ తాను కప్పు కొనిన దుప్పటితో చెమటను తుడుచు కొనినాడు. నాయబ్-నాజిమ్ తకీఖాన్ దర్బారులో ఖోర్ధా తరపున వకీలుగా అతడు కటక్‌లో ఉంటున్నాడు. ప్రౌఢావస్థలోనున్న అతని ముఖమునుండి అదమ్యమైన సామర్థ్యము తొణికిసలాడుతున్నది. బట్టతల, కంఠమందు తులసి మాల, ఉన్నత లలాటము, దానిపైని అంకితమైన హరితిలకము, వీటితో శోభిస్తున్న అతని ముఖములో చిక్కని కనుబొమల క్రిందనున్న అతని లోతైన కండ్లే అన్నిటి కన్న ముందుగ కనిపిస్తున్నవి. శాంతి ప్రియత్వపు నేపథ్యములో దుష్టత్వము, క్రౌర్యము, కుట్ర, ఇవియే అతని కండ్లలో పుంజీభవించి ఉన్నవి.

జయి పట్టనాయక్ కొద్ది సేపటి క్రిందటనే కటక్‌నుండి అక్కడకు వచ్చినాడు. ఆర్ద్రకము బట్టతో కుట్టించిన అతని చొక్కా చెమటతో తడిసి అక్కడక్కడ నల్లగ మాసిపోయినది.

అతనిని చూసి బక్షీ స్థిమితపడి అతనిని లోపలకు పిలచినాడు. అతడు లోనికి వచ్చినాడు. వేణు భ్రమరవర్ ఆసనానికి చేరువలో నున్న కుర్చీమీద అతడు కూర్చొన్నాడు.

"కటక్ వార్తలు ఇంకేమి ఉన్నవి?" అని భ్రమరవర్ పట్టనాయకుని ప్రశ్నించినాడు.

"ఒక ముఖ్యమైన వార్తను తీసికొని వచ్చినాను. చికాకోల్ నుండి రెండు సంవత్సరముల బకాయి నజరానాను అనగా సుమారు మూడు లక్షలను తీసికొని ఫౌజ్‌దారు దివాను అయిన నరసరాజు కటక్ వెళుతున్నాడు." అని చిన్న గొంతుకతో జయి పట్టనాయక్ చెప్పినాడు.

ఇది యొక ముఖ్య వార్తా? ఈ విధముగా లక్షలాది రూపాయలను కటక్ ద్వారా జగత్ సేఠ్ షాజహాన్‌బాద్, ఢిల్లీ వరకు తీసికొని వెళుతూనే ఉన్నాడు. నిజామ్ ఉల్-ముల్క్‌కు అందజేస్తూనే ఉన్నాడు. ఈ వార్తను అందజేయుటకు జయి పట్టనాయక్ ఇంత శ్రమ తీసికొనవలెనా? చికాకోల్ నజరానాతో వేణు భ్రమరవర్‌కు ఏమి సంబంధము? కటక్ లాల్‌బాగ్ దుర్గములోని పరిస్థితులు, అధికారములు, రాజకీయ పరిణామములు, సరఫరాజ్ ఖాన్‌తో సుజాఖాన్ జగదము ఎట్లున్నది; ముర్షిదాబాద్ పదవికి తండ్రి కుమారుల మధ్య యుద్ధము జరుగుట సంభవిస్తుందా సంభవించదా, ఓరిస్సా సరిహద్దులనుండి ఎంత దూరములో మరాఠీ వర్గీయుల గుడారములున్నవి, వీటి అన్నింటిని మించి మహారాజ్ రామచంద్ర దేవుని యెడల తకీఖాన్ వైఖరి ఇప్పు డెట్లున్నది, ఇటువంటి రాజకీయ వార్తలను తెలిసికొనవలెనని బక్షీ తొందర చెందుతున్నాడు. మహారాజ్ రామచంద్రదేవుమీద ఆపవాదులను కల్పించుటకు, ఖోర్ధా మీద దండెత్తుటకు తకీఖానను ప్రేరేపించుటకు జయి పట్టనాయకుని కటక్‌లో వకీలుగా కృష్ణ నరింద్ర్. వేణు భ్రమరవరులు కలిసి నియమించినారు. ఖోర్ధాలో జీలకర్రపాయి వేచిన దాసి వాసస కటక్‌లో వేస్తున్నది. చాలా కాలముగ ఖోర్ధా మీదకు దాడి గాని, జగన్నాథాలయ దోపిడిగాని లేకపోవడము వలన తకీఖాను సైనికులు కూడ విసుగు చెందిఉన్నారు. కాని సుఖాఖాన్ కాలమునుండి నాయబ్-నాజిమ్ దర్బారులో తిష్ఠ వేసికొని కూర్చున్న రాయ్ ఆలమ్‌చంద్, ఫతహ్‌చంద్ మొదలగు హిందువుల ప్రభావము వలన తకీఖాన్ కూడ జగన్నాథునిపైన చేయి వేయుటకు ఇష్టపడుట లేదు.

"చికాకోల్ నజరానాకు మనకు ఏమి సంబంధము?" అని బక్షీ ప్రసన్న స్వరముతో ప్రశ్నించినాడు.

జయి పట్టనాయకుని కండ్లలో ఒక విషపూరితమైన నవ్వు పొటమరించినది. "ఏమి సంబంధమా? అర్థము కాలేదా? ఖోర్ధా రాజ్యముమీదుగా నరసరాజు వెళుతున్నప్పుడు అతడు నిరాపదుడుగాను మధ్యలో దారి దోపిడులు జరుగకుండగను కటక్ చేరుటకు తగిన కట్టుదిట్టములు చేయవలసినదిగ తకీఖాన్ స్వయముగ మహారాజుకు ఉత్తరువులు జారీ చేయుచు గట్టిగా లేఖ వ్రాసి నాకే ఇచ్చినాడు." అని అతడు చెప్పినాడు.

బక్షీ ధైర్యము సన్నగిల సాగినది. "దానివలన మనకు ఇచ్చిపుచ్చుకొనడములు ఏమున్నవి? చేయవలసిన దేదో రాజే చేయగలడు" అని నిరాశతో అన్నాడు.

"తమకు సరిగా బోధపడలేదు. ఖోర్ధా సరిహద్దుల్లో చికాకోల్ దివానుకు ఏమైనా జరిగి, ఆ నజరానా ధనము కాస్తా ఎక్కడికైనను పోయిన యెడల..." అని జయి పట్టనాయక్ శాంత స్వరముతో చెప్పగా అప్పుడు బక్షీకి విషయము అర్థమయినది.

ఆకలిగొన్న భుజంగ నేత్రములవలె అతని కండ్లు మెరసినవి.

"మూడులక్షల రూపాయలు తక్కువ సొమ్మేమీకాదు. డబ్బును గురించి ప్రతిక్షణము మర్షిబాబాద్, ఢిల్లీల నుండి కటక్‌నకు తాకీదులు వస్తూనే ఉన్నవి. అటువంటప్పుడు ఈ మొత్తము చెయి జారిపోయిన తకీఖాన్ ధైర్యముతో నిలువ గలడా?" అని బక్షిని రెచ్చగొడుతూ పట్ట నాయక్ అన్నాడు.

"చికాకోల్‌నుండి నజరానా డబ్బును తీసికొని నరసరాజు ఎప్పుడు బయలు దేరుతాడు? అతని వెంట సైనికులు ఎంతమంది వస్తారు?" అని బక్షీ ప్రశ్నించినాడు.

"సరిహద్దు ప్రాయసకాంద్ర ద్వారా ఆ వివరములను గూడ నేను సేకరించినాను. మాఘమాసములో చికాకోల్ నుండి నరసరాజు బయలుదేరుతాడు. అత

నితో సుమారు యాభైమంది ఆశ్వికులు ఉంటారు. సోంపేట వరకు చికా కోల్ సూబా ప్రాంతమే. అక్కడనుండే ఖోర్ధా ఇలాకా ప్రారంభమవుతుంది. భయము లేదన్న నిబ్బరముతో నరసరాజు సిచ్ఛింతుడుగానే ఉండవచ్చును"

బక్షీ మంచము మీదినుండి దిగివచ్చి జయి పట్టనాయకుని తన దాహువుల లోనికి తీసికొన్నాడు. "మీరు తిన్నగా కటక్‌నకు మరలి పొండి. మహారాజు వరకు ఈ వార్తను చేరవేయ వలసిన అవసరము లేదు. కాని యథా సమయము నకు ఈ వార్త రాజా వారికి తెలియజేయడ మయినదని తకీఖాను కు చెప్పండి. మీరు చేసిన ఈ ఉపకారమును మేము ఎన్నడును మరచిపోము" అని ఆదర పూరితమైన కంఠముతో బక్షీ అనినాడు.

జయి పట్టనాయక్ వెళ్ళి పోయిన తరువాత బాణ్‌పుర్‌గఢ్ మహారాణి లలితా మహాదేయీకి బక్షీ ఈ విధముగ ఒక లేఖ వ్రాసినాడు.

"మహారాజ రామచంద్రదేవు ఉరఫ్ మ్లేచ్ఛ హాఫిజ్ కాదర్ యొక్క ఎని మిదవ అంకము, తులా దినాంకము పంచమినాడు పురుషోత్తమ క్షేత్రమందలి బాలిసాహి రాజ ప్రాసాదమునుండి బక్షీ వేణు భ్రమరవర్ దేవ్‌రాయ్ ఖోర్ధా మహారాణి లలితా మహాదేయీకి ఉత్తరము వ్రాయు అభిప్రాయ మేమనగ, రానున్న మాఘ మాసములో చికాకోల్ దివాన్ నరసరాజు రెండు సంవత్సర ముల బకాయి నజరానా మొత్తము మూడు లక్షల రూపాయలు తీసికొని కటక్‌కు బయలు దేరుతాడు. ఆయనతోగూడ ఏబదిమంది కన్న ఎక్కువ సైనికులు ఉండరు. ఖోర్ధా సరిహద్దుల లోపలనే ఈ వైకమును అపహరించవలెను. దీని వలన మహారాజా వారే ఈ వైకమును కొల్లగొట్టినారని తకీఖాన్ అనుమానించ గలడు. దీని వలన మనకు కలుగు లాభము ఏమనగా అతడు ఖోర్ధా మీద దాడి చేసినప్పుడు ఏ ఒక్క పాయిక్ కూడ వానిని ఎదురించుటకు ముందుకు రాడు. అప్పుడు మనము అతనితో సంధి చేసికొని భాగీరథీ కుమార్‌ను రాజసింహాస నముమీద కూర్చుండ బెట్టవచ్చును. ఇలా జరుగని పక్షములో ఖోర్ధానుండి మ్లేచ్ఛ రాజరికమును తొలగించుట అసంభవమని మాత్రము తెలిసి కొనండి. బరుణేయి

దుర్గమును వదలి మణిమా వెళ్ళిపోయి నప్పటినుండి ఖోర్ధా శ్రీ హీన మైపోయి నది. పథర్‌గఢ్ రాజ ప్రాసాదము మీద ఇప్పుడు రజియా బీబీ రాజరికము నడుస్తున్నది. ఆమె పగటిని రాత్రి అని అంటే రాజావారు కూడ రాత్రి అనే అంటున్నారు. ఈ లేఖ మీకు చేరిన వెంటనే మీరు బాణ్‌పుర్, సాలేరీ కనుమలలో పాయిక్‌లను సిద్ధము చేసి ఉంచండి. నేను ఇక్కడనుండి అత్యంత విశ్వాస పాత్రులయిన రెండువందల సైనికుల వరకు పంపగలను. వారు దివాన్ నరస రాజును ఆ కనుమలలోనే అంతమొందించి పైకమును దోచుకొందురు. మకర పంచదశి నాటికి నరసరాజు బాణ్‌పుర్ చేరగలడు. ఈ ఉత్తరము తీసికొచ్చిన వానికి కత్తి, తలపాగ గుర్తుగా ఇవ్వబడినవి"

ఆ ఉత్తరముపైన రాజముద్ర వేసి అత్యంత విశ్వాస పాత్రుడైన ఒక సేవకుని ద్వారా బక్షీ భ్రమరవర్ బాణ్‌పుర్‌కు పంపినాడు.

ఆ తర్వాత అతడు చేతులు జోడించి ప్రణామము చేసి "హే ప్రభో! బహుశా ఇదే ఆఖరు అవకాశము. ఈ అవకాశము చేయిజారిపోయిన మరొక అవకాశము దొరకడము దుర్లభము. ప్రభూ! నీ కోరిక నెరవేరుగాక!" అని అస్ఫుట కంఠముతో జగన్నాథుని ప్రార్థించినాడు.

3

సంధ్యా సమయపు శీతల ఛాయ బరుణేయి శిఖరము మీదనుండి క్రింది ప్రాంతరము మీదకు నిశ్శబ్దముగ దిగివస్తున్నది. ఒక నిర్వేద గ్రస్తమైన శీతల నైరాశ్యము గద్బిలముల గుంపువలె నెమ్మది నెమ్మదిగ దిగి వచ్చి భూమిపైని వ్యాపిస్తున్నది. దుర్గప్రాచీరమునకు చేరువగా నున్న వెదురు ఆడవిలోనుండి ఒక తోడులేని పక్షి ఆశాంతితో అరచి అరచి ఊరుకొన్నది. బరుణేయీగఢ్ మఠము నుండి ఘంటారావములు విన్పిస్తున్నవి.

రామచంద్రదేవ్ అర్ధ నిద్రావస్థలో రజియా బేగంను గురించి కలలు కంటున్నారు. రజియా స్మృతిలో రామచంద్రదేవ్ ఆ తోడులేని పక్షిపలె తరచు కలత చెందుతున్నారు. రజియా ఒక విస్మృతమైన సంగీత మూర్ఛన వంటిది. ఆ మూర్ఛన ఆందోళనములు, మధుర ధ్వనులు ఆర్ధచేతన మనస్సులో గూడ స్పందిస్తున్నవి.

వేణు భ్రమరవర్ నమ్మక ద్రోహము చేసినాడా? రజియా స్మృతితో బాటు ఈ సమాధానములేని జిజ్ఞాస ఆయనను మథన పరుస్తున్నది. తనకు అన్నదాత, పరమ పితైషి అయిన మహారాజా గోపీనాథదేవుని హత్య గావించిన వేణు భ్రమరవర్ విశ్వాసఘాతుకత్వము తప్ప వేరొకటి ఏమి చేయగలడు? కాని ఖోర్ధా రాజసింహాసన ప్రాప్తిని ఆకాంక్షించిన రామచంద్రదేవునిలో ఒక శిష్ట బోధకమైన విశ్వాసము లేకపోలేదు. ఖోర్ధా రాజ్యము యొక్క కళ్యాణమును కోరి గోపీనాథ్‌దేవుని వంటి దుర్బలుడు, ఇంద్రియాసక్తుడైన వానిని తొలగించి తనను సింహాసనము మీద కూర్చుండ బెట్టుట కొరకే వేణు భ్రమరవర్ రాజ హత్య చేసి ఉండవచ్చును. దివాన్ కృష్ణ నరేంద్రుడు కూడ ఆయనలో అటు వంటి భావమును కలుగజేసి ఉత్సాహపరచి ఉండవచ్చును. అందుచేత ఆనాటి చెక్కలి యుద్ధములో ఆ సంకటాపన్నమైన మహూర్తములో బక్షీ వేణు భ్రమరవర్ ఛత్రద్వార కనుమను వదలి వెళ్ళుటను విశ్వాసఘాతముగ భావించవలెనో, యుద్ధ కౌశలము క్రింద పరిగణించ వలెనో రామచంద్ర దేవునకు అవగతము కాలేదు. ఇప్పుడు గూడ ఆ బాధాకరమైన ప్రశ్నే ఆయన హృదయమును వేధిస్తున్నది.

పథర్‌గఢ్ రాజమందిరమును ఇప్పుడొక అనాసక్తమైన శూన్యత ఆవరించినది. రామచంద్రదేవ్ మతాంతరితుడైనప్పటినుండి అనేక మంది సామంతులు, విశ్వాస పాత్రులైన రాజోద్యోగులు చివరకు ఆయన ఆత్మీయులైన స్వజనులు గూడ ఆయనను హీన దృష్టితో చూస్తున్నారు. జగన్నాథ ద్రోహిగా రాజు మ్లేచ్ఛుడైనాడని ప్రజలు గూడ ఆయన యెడల శ్రద్ధా భక్తులను కనబరుచుట

లేదు. ఉత్కళ దేశమునకు శిరోమణి యైన జగన్నాథుని సేవకుడైన గజపతి ముసల్మానుడైనా డన్న తలంపే జగన్నాథ భక్త ప్రజాకోటికి హృదయ శూలము వలె నున్నది.

కాని, పరమహిందూ ద్వేషి అయిన నాయబ్-నాజిమ్ తకీఖాన్ ని దృష్టి నుండి జగన్నాథుని తప్పించుట కొరకే రామచంద్రదేవు మతాంతరితుడైనాడని ఏ విధముగ ఎవరికి తెలియజేయవలెను? రెండు శతాబ్దులుగ జరిగిన దాడులు, ఆత్మరక్షణలు, రక్తపాతములు, ఏపర్యుములు, నిష్ప్రయోజనములు, విడంబనలు మొదలగు వాటి వలన ఓడ్రజాతి ఆత్మశక్తివిహీనమై పోయినది. వైగా యవన రక్త బాహునుండీ ఆప్గనుల వరకు ఒరిస్సామీద దాడి చేసిన వారందరకు జగన్నాథుని అవమానించనిదే దాహము తీరలేదు. ఇప్పుడు మరల తకీఖాన్ దాడి చేస్తే జగన్నాథుని రక్షణకు మార్గము ఏమున్నది? చెక్కలి యుద్ధము జరిగిన తరువాత రామచంద్రదేవ్ ఈ విషయములను ఆలోచించినారు.

ఒక అణచబడిన జాతియొక్క ఆత్మగా ఏ జగన్నాథుడు ఇంత వరకు ఆపరాజేయుడుగా ఉన్నాడో ఆ జగన్నాథునికి తకీఖాన్ చేతులలో అవమానము కలంగడమన్న తలంపే రామచంద్ర దేవునికి సహింపరానిదిగా ఉన్నది.

మతాంతరుడైన రామచంద్ర దేవుని ఇప్పుడు అందరు విడిచి వెళ్ళినారు. అయినా రామచంద్రదేవుని మనసులో విచారమన్నది లేదు. ఎందువల్లనంటే జగన్నాథుడు ఇప్పుడు ఆపద రహితుడుగా నున్నాడు. హాఫిజ్ కాదర్ బేగ్ అయిన రామచంద్రదేవుని మీద తకీఖాన్‌కు నమ్మకము ఉన్నంతకాలము జగన్నాథుని మీద దాడి జరిగే భయము లేదు. రామచంద్రదేవ్ ఒక మిథ్యాంగీకారము కూడ చేసినారు. జగన్నాథుని యొక్క ఏ బ్రహ్మపిండమును స్పృశించుటకు కాలాపహాడ్‌కు కూడ వీలుపడలేదో ఆ దుర్లభమైన మణిమయ పిండమును తకీఖాన్ చేతులలో పెట్టుటకు ఆయన అంగీకరించినాడు. అందుచేత తకీఖాన్ ఖోర్ధాను గురించి, జగన్నాథుని గురించి పట్టించు కొనకుండ ఇతర దేవాలయము

లను దేవాయతనములను పడగొట్టించడము, ఇతర జమీందారులను, దుర్గాధిపతు లను బాధించడములో మునిగిపోయినాడు.

జగన్నాథు డింతవరకు నిజముగ నిరాపదుడుగానే ఉన్నాడు ఏ నాడు రఘునాథపురము చెక్కలిని ఖోర్ధా దక్షిణ సరిహద్దు నుండి విడదీసి చికాకోల్‌లో కలిపినారో ఆ నాటినుండి ఖోర్ధాకు మొగలాయి దాడుల భయము లేకుండ పోయినది.

గంగ నుండి గోదావరి వరకు ఒకనాడు విస్తరించి యుండిన ఉత్కళ సామ్రాజ్యము విచ్ఛిన్నమై తగ్గుతూ వచ్చి ఇప్పుడు ఖోర్ధాలో పరిమితమై నిలిచి ఉన్నది. ఏ ఉత్కళదేశ గజపతుల పేరు చెప్పినంత మాత్రమున గౌడనుండి గోల్కొండ వరకు ఉండిన ప్రబల పరాక్రమవంతులైన సుల్తాను లందరకు ఒక నాడు గుండెబెదురుగా నుండెడిదో నేడు ఆ గజపతులుగాని, వారి వీరపాయిక్‌లు గాని నేటి ఉత్కళ దేశములో లేరు. అయినప్పటికి ఈ చిన్న ఖోర్ధా భూభాగ మును దఖలు పరచుకొనుటకు ఆఫ్గన్ సూబేదారు దావూద్‌ఖాన్ మొదలుకొని మొగల్ ఫౌజ్‌దారు ఖాన్-ఏ-దౌరా వరకు అందరూ ప్రయత్నించి హతాశులై నారు. కాని దాని కొరకు ఒరిస్సా దేశమున చాల మూల్యము చెల్లించ వలసి వచ్చినది. నూట ఏబది సంవత్సరములకు పైబడి నిరంతరము యుద్ధములు జరుగు చుండుట వలన ఉత్కళ దేశము శ్మశానమైనది. సస్యశ్యామల మైన క్షేత్రములు ఎడారులైనవి. జనపదములు నిర్జనమై పాడుపడినవి. ఇంటింట విధవల ఆక్రందనలు విన్పించసాగినవి. ఈ జాతి మరింక ఎంత కాలము యుద్ధము చేయగలదు?

రామచంద్రదేవ్ పతితుడైన అవుగాక? మ్లేచ్ఛుడైన అవుగాక? ఒరిస్సాలో శాంతి నెలకొన్న చాలును జగన్నాథుడు నిశ్చింతతో నిరుపద్రవ స్థితిలో నుండ దము అత్యంత అవసరము. ఉత్కళ దేశ చరిత్రలో ఎప్పుడు ఆ శుభసమయము వచ్చునో? దీర్ఘమైన, అంధకార మయమైన రాత్రి తరువాత ఎప్పుడు మరల ఖోర్ధా పైన సూర్యకాంతి ఉద్భానితమవగలదో తెలియదు. ఈ ముగ్ధ భావనే

రామచంద్రదేవుని సహస్ర సంకటముల మధ్య కూడ ఆశావాదిగా నిలుపు తున్నది.

మహారాష్ట్రుల శక్తి దక్షిణమున మేల్కొన్నది. చౌథ్ వసూలుకు ఢిల్లీ కవాటములను గూడ వారు ఖటఖటలాడించుట ప్రారంభించినారు. ఢిల్లీ షాజహాన్ బాద్‌లో మొగలుల దినములు గూడ అంత్యదశకు చేరుకొంటున్నవి. అంతర్కలహముల, విశ్వాసఘాతముల మధ్య మొగలాయి శక్తి కూడ ఎంత కాలము నిలువ గలదు?

ఒరిస్సాకు కీడు ఢిల్లీ నుండి ఎంత తక్కువో ముర్షిదాబాద్, బంగ, బీహారు మరియు ఒరిస్సా రాజధాని నుండి అంత ఎక్కువగ కలుగుతున్నది. కాని ముర్షిదాబాద్ పదవికి అంతర్యుద్ధము ప్రారంభమైనది. సుజాఖాన్ తన జార పుత్రుడు తకీఖానును కటక్‌లోని నాయబ్-నాజిమ్ గద్దెపైని కూర్చుండ బెట్టి తాను స్వయముగా ముర్షిదాబాద్ అధికారమును చేపట్టినాడు. కాని తన పుత్రుడు సర్‌ఫరాజ్‌ఖానును బీహార్–అజిమాబాదులకైనా నాయబ్‌గా పంపించ లేదు. తన కృపా పాత్రుడైన అలివర్దీఖాన్‌కు అజిమాబాద్‌ను అతడు ఇచ్చినం దున తండ్రీకొడుకుల మధ్య అంతర్యుద్ధము ప్రారంభమైనది. అది రోజు రోజుకు ప్రజ్వరిల్లుతూ వచ్చినది. ముర్షిదాబాద్ అధోగతికి చేరువయినది. అందువలన రామచంద్రదేవ్ ఈ పరిస్థితులను స్వప్రయోజనమునకు వినియోగించుకొని పోయిన శౌర్య గౌరవమును పునరుద్ధరించ వలెనని సంకల్పించు కొనినారు. అందుకు ఒరిస్సాలో సంపూర్ణమైన శాంతి అవసరము.

శరీరములోని చివరి రక్త బిందువు కాలేవరకు యుద్ధము చేయుటకు రామచంద్రదేవ్ కూడ సంసిద్ధముగా ఉన్నారు. కాని ఉత్కళదేశమునకు ప్రధాన శత్రువు మొగల్ నాయబ్-నాజిమ్ కాడు. తన ఇంటనున్న విశ్వాస ఘాతకులే. అందుచేత నేడు బక్షీ వేణు భ్రమరవర్, దివాన్ కృష్ణ నరేంద్ర, ప్రధాన దుర్గాధిపతులలో అధికాంశులు, గఢ్ నాయకులు ఎవరిని నమ్ముటకు వీలు లేకుండ ఉన్నది. చివరకు తన నీడను తానే నమ్మలేని స్థితిలో రామచంద్ర

దేవ్ ఉన్నారు. ఏమరుపాటున ఉన్నయెడల ఏ సమయములో నైన వారు వెన్ను పోటు పొడవ వచ్చును.

విశ్వాస ఘాతకులకు జయము లభించడము మాత్రము ఒరిస్సా చరిత్రలో కానరాదు. విశ్వాసఘాతకులు ఒకదాని వెంట ఒకటి విషపూరితమైన కుట్రలను పన్నుతునే ఉన్నారు. ఆ కుట్రలు చివరకు వారినే కబళించిడము జరుగుతున్నది.

ఈ పరిస్థితులలో నాయబ్--నాజిమ్ సత్సంకల్పము రామచంద్రదేవుకు రక్షాకవచమయినది. కాని తకీఖాన్ అదునుకోసము వేచి యున్నాడని రామచంద్ర దేవునికి కూడ తెలుసును. రామచంద్రదేవ్ ఒక యవన స్త్రీని వివాహమాడి, తన దర్బారులో రాయ్ ఆలమ్‌చంద్, ఫతేచందులవలె కూర్చుంటాడని తఖీఖాన్ అనుకొన్నాడు. ఆ విధముగా ఖోర్ధా సింహాసనము ఖాళీ అయితే ఖోర్ధాను కటక్‌తో కలివివేసి ఒరిస్సా సూబాను సువర్ణరేఖ నుండి చికాకోల్ వరకు ఏస్తరింప జేయ వలెనని తకీఖాన్ ఆశించినాడు. అందుచేతనే రామచంద్రదేవ్ చేత కల్మా చదివించి, సోదరి రజియాను ఇచ్చి పెండ్లిచేసి ఆయనను ఒక ముసల్మాన్‌గా మార్చి వేసినాడు. మత సంబధమైన ఒక కర్తవ్యమును నిర్వహించుటయే కాక దాని వెనుక ఒక నిర్దిష్ట మైన కపట రాజనీతికి అంకురార్పణ కూడ తకీఖాన్ చేయ గలిగినాడు. ఈ విధముగా రజియా వంటి ఒక కోమలకన్యకను తన కూట రాజ నీతికి ఒక బలిపశువుగ చేయడములో ఆతడు నిష్ప్రయోజకుడు కాలేదు.

కాని, రాయ్ ఆలంచంద్, జగత్ సేఠ్‌లవలె లోభవశులై లాల్‌బాగ్ కోటలో బంధములతో ఒక బంగారు పంజరములో కూర్చునే వ్యక్తికాదు రామ చంద్రదేవ్. ఆయన ఖోర్ధాకు తిరిగి వచ్చినారు. ఆయన అలా తిరిగి వెళ్ళడములో అంతరార్థము తకీఖాన్ సరిగ గ్రహించక పోలేదు. ఆతని దృష్టి రామచంద్ర దేవుని వెన్నంటుతూ ఆయన పైన చివరి దెబ్బ తీయుటకు అదనుకొరకు శనిలా నిరీక్షిస్తూనే ఉన్నది. ఇక్కడ విశ్వాసఘాతకుల కుట్రల మూలముగ ఖోర్ధా రాజసింహాసనము రామచంద్రదేవునకు ఒక ముండ్ల పరుపు వలె తయారయినది.

చివరకు మహారాణి లలితా మహాదేయీ కూడ విశ్వాసఘాతకులతో చేరి పోయినది. యవన స్త్రీ రజియా బీబి ఖోర్ధాకు మహారాణి కాసున్నది. ఆమె కుమారుడు ఖోర్ధా సింహాసనమునకు వారసుడుగ తన హక్కులను కోరవచ్చు నన్న తలంపే ఆమెను ఒక దెబ్బతిన్న త్రాచువలె భయంకరముగా మార్చివేసి నది. రామచంద్రదేవ్ ఖోర్ధా తిరిగి రాక పూర్వమే ఆమె తన గాజులను పగుల గొట్టుకొని తన వైధవ్యమును ప్రకటించి పుట్టింటికి చేరుకున్నది. భాగీరథీ కుమార్‌ను ఖోర్ధా సింహాసనముపైన కూర్చుండ చేయునంతవరకు ఖోర్ధా భూమి మీద అడుగుపెట్టనని ఆమె ప్రతిన పూనినది.

తోడులేని ఒక నక్షత్రమువలె రాఘవచంద్రదేవ్ నేడు పూర్తిగ ఏకాకి. ఖోర్ధా శాంతిరక్షణ, జగన్నాథుని మానరక్షణ-వీటి కొరకే ఆయన తమ మత మును గూడ త్యాగము చేసినారు. సంఘము, సంస్కారము, అన్నింటికి గూడ ఆయన తిలోకదములు ఇచ్చినారు. ప్రాణసమానమైన ఖోర్ధా నేలనుండే వారు నిర్వాసితులైనారు. జగన్నాథుని ద్వారమునుండి గూడ వారు వితాడితులైనారు.

క్రూర కుతంత్రములు వలన బహుశా వారు భావిలో అన్నిటిని పోగొట్టు కొనవచ్చును...అయినప్పటికిని....ఒక నూతన దృష్టి కోణముతో దేనినో చేయ వలెనన్న స్వలాభాపేక్షా రహితమైన అధికారమునుండి వారు దూరము కాలేదు. వారిని ఆ అధికారమునుండి స్వయముగ జగన్నాథుడు కూడ దూరము చేయ లేడు ఎందుచేల్లనంటే అది ఒక్కటే ముక్తి కోసము ఏకైక సాధన. అది మానవునికి పుట్టుకతో సంప్రాప్తమైన అధికారము. అదే రామచంద్రదేవుని మనస్సుకు ధైర్యము చేకూరుస్తున్నది.

రామచంద్రదేవ్ ఊహిస్తున్నారు....దుర్గమమైన...అంధకార మయ మైన మార్గము...వారొక కరదీపికను తీసికొని ఒంటరిగ ఆ మార్గమున బయలు దేరినారు. ఇంతలో ఆకస్మాత్తుగ తుఫాను వచ్చినది. ఝంఝా మారుతములో ఆ కరదీపిక ఆరిపోయినది. వెనుక ఆశ్రయము లేదు, ముందు ఆలంబనము లేదు. కేవలము అంధకార పథము మాత్రమున్నది. ముందుకు పయనించడమూ లేక

ఆక్కడనే మూసుకొని పోవడమా? ఇక్కడనుండి వెనుకకు మరలిపోవలెనా ఏమి? ముందుకు సాగిపోవుటకు వీలు లేదా?

రామచంద్రదేవుని క్లాంత నేత్రములు మూతలు పడుతున్నవి. వారి కండ్లు ముందు జెక్కలి యుద్ధములో బందీ అయిన తరువాత జరిగిన ఆ విడంబనా యుతమైన, అపకీర్తి కారకమైన దుర్మహూర్తముల స్మృతి కదలాడినది,

బార్వాటి దుర్గములోని తొమ్మిది భాగముల ప్రాసాదములో ఎనిమిదవ భాగమందు రామచంద్రదేవుని కారాగారము ఏర్పరచబడినది. జెక్కలి యుద్ధ ములో వారు చిలికా సరస్సు తీరమున బందీగ చిక్కిన తరువాత ఒక ఇనుప బోనులో వారు ఇక్కడకు తరలించబడినారు.

కటక్ నాయబ్-నాజిమ్ బార్వాటి దుర్గములో ఉంటున్న కాలములో ఈ ఎనిమిదవ భాగములోనే వారి అంతర్గృహ మంటూ ఉండినది. తొమ్మిదవ భాగపు ప్రవేశ మార్గము వద్ద సరిగ దుర్గమునకు మధ్యస్థముగ ఒక పెద్ద స్తంభము ఉన్నది. శత్రువు జాడ తెలిసికొనుటకు దానిపైని ఒక దుర్బిణి అమర్చ బడినది. మహానదికి ఉత్తర దిశకు శత్రువులు చేరువలో ఉంటే ఈ స్తంభముపై నుండి వారు స్పష్టముగ కనుపించగలరు. ఇతర భాగములలో అతిథి గృహము, దర్బారు, వంటశాల, దుర్గరక్షకుల, మరియు సేనల ఆవాసములు, శస్త్రాగారములు ఏనుగు శాలలు, ఒంటెశాలలు, అశ్వశాలలు మొదలగునవి ఉండినవి. కాని ఆగా ఖాన్ జామస్ నాయబ్-నాజిమ్‌గా ఉండిన కాలములో అతని కుమారుడు కాఫి రులు నిర్మించిన ఇంటికప్పు క్రింద నివసించనని చెప్పి లాల్‌బాగ్‌లో ఒక నూతన దుర్గమును నిర్మించుకొనినాడు. ఆ రోజునుండి లాల్‌బాగ్ దుర్గము నాయబ్-నాజిమ్‌లకు ఆవాసమైనది. బార్వాటి దుర్గము ప్రధానముగ చెరసాలగ, సైన్య శిబిరముగ ఉపయోగపడ జొచ్చినది. అంతేకాదు, నాయబ్-నాజిమ్‌ల పూర్వ అంతఃపుర వానిసులు గూడ ఈ తొమ్మిదవ భాగములోనే తమ పూర్వ సౌభాగ్య స్మృతిని స్మరించుకొంటూ కాలము గడుపుతున్నారు. ఇప్పుడు సుజాఖాన్ హయాములో గూడ చాలమంది బేగమ్‌లు తమ ప్రత్యేక దాసి జనముతో ఇక్క డనే కాలము వెళ్ళబుచ్చుతున్నారు.

రామచంద్రదేవ్ ఉంటున్న భాగము ఒక చెరసాలగ మారినది. సరైన సమయములో భూమిపన్ను చెల్లించని నేరమునకుగాను శతాధికముగ జమీందారులు,ఇజారాదారులు దర్గాధిపతులు అక్కడనే బంధించబడేవారు. ఆ రోజులలో వారి ఆర్తనాదములతో మూర్ఛిత భార్యాటీ వాతావరణము కంపించి పోయేది. ఇదే కారాగారములో నాయబ్-నాజిమ్ ఖాన్-ఏదౌరా కాలములో ఏడు వందలమంది ఒరియా జమీందారులు హత్య కావింపబడినారని అనుకొంటూ ఉంటారు. ఇప్పుడు ఖైదీలుగ ఉంటున్న వారికి ఏనాటికైనా తాము బయటపడి బంధనా రహితమైన దివాలోకమును చూడగలమన్న ఆశ లేదు. ఖైదీ రామచంద్రదేవ్ గూడ ఆ స్థితిలోనే ఉన్నారు

అంత్య పరిణతికి సిద్ధమౌతున్న సమయములో ఏ ఆత్మార్పణ భావన యొక్క స్థిర ప్రశాంతత మనస్సును స్పృశిస్తుందో ఆది యిపుడు రామచంద్ర దేవుని చింతారహితునిగ చేసినది.

రామచంద్రదేవ్ ఒక అప్రశస్త గవాక్షములో నుండి బయటి నీలాకాశము వైపు చూస్తూ కదలకుండ కారాగారములో నిలుచున్నారు. గులాము కొట్టాలలో నుండి కొజ్జాల, బానిసల, మరియు యితర పరిజనుల భూతు కూతలు, తాగుబోతు సైనికుల కోలాహలము నిర్వేద గ్రస్తమైన బార్యాటీ వాతావరణమును ఉండుండిచంచల పరుస్తున్నవి.

శీతల ఛాయాంధకారము కారాగారమును ఆవరించి యున్నది. ఉత్తరము వైపు నున్న కిటికీలోనుండి సంజ వెలుగు లోపలిభాగమును ఈషణ్మాత్రము కాంతివంతయు చేయుటకు వ్యర్థ ప్రయత్నము చేస్తున్నది. రాతి గోడలపైని, స్తంభముల పైని ఉన్న ఉత్కళ శిల్పకళా కౌశలము ఆ గుడ్డి వెలుగులో అస్పష్టముగ కానవస్తున్నది. స్తంభములపైని చెక్కబడిన కన్యా ప్రతిమల లాస్యభంగిమలు ఆ నిర్జీవ వాతావరణములో ఆ సమయమందు అసందర్భముగ కనిపిస్తున్నవి.

రామచంద్ర దేవుని గౌరవార్థము కాబోలును ఒక మంచమువైన జరీ దుప్పటి పరచబడి ఉన్నది. దానికి చేరువలో ఒక రాతి బల్లపైన నీళ్ళకూజా

ఒకటి ఉన్నది. దాని ప్రక్కను పశ్చిమములో తినగా మిగిలిన ఎండు రొట్టె ముక్కలు ఉన్నవి.

కిటికీలో నుండి జనానా మహలు తాలూకు గులాబి తోట కనిపిస్తున్నది. కాని ప్రస్తుతము జనానా అక్కడ లేకపోవడము వలన ఆ తోటకు ఆలనా పాలనా లేక అందులో గడ్డి మొక్కలు, ముళ్ళ మొక్కలు మొలచినవి. అలంకరింప బడిన నీటి బుగ్గలు ఎండిపోయినవి. అయినను ఆ పరిత్యక్తమైన శుష్క వాతావరణములోనే కొన్ని సాధారణ గులాబి మొక్కలు, కొన్ని మఖమల్ గులాబి మొక్కలు పూవులతో, ఆకులతో నిండుగా ఉన్నవి. చెరసాలకు బయట నుండి ఆఫ్గన్ కాపలాదార్ల కాలిజోళ్ళ కిర్రు శబ్దములు స్పష్టముగా వినవస్తున్నవి.

ఆకాశము నెమ్మది నెమ్మదిగ మలినము కాజొచ్చినది. భయపడుతున్న ట్టుగ సంధ్యాఛాయలు తోటలోని గులాబుల పైని వ్యాపించ సాగినవి. అయినా రామచంద్రదేవ్ ఇంకను శిలా ప్రతిమవలె అక్కడనే నిలుచుని ఉన్నారు. అనేక గతకాలపు చారిత్రాత్మక స్మృతులు ఆయన శూన్య దృష్టిపథములో జల భారములేని మేఘములవలె తిరుగాడుతూ పీలీకము కాజొచ్చినవి.

స్మరణాతీతమైన ఆ గతములో...మహా నదికి దక్షిణ తీరమున నున్న బార్వాటి గ్రామము పేరు 'కోడింద దండపాట్'. అక్కడ ఒకనాడు ఒక దెబ్బ తిన్న డేగపైని ఒక కొంగ ఎక్కి నిలుచున్నది. ఉహాతీతమైన ఆ విచిత్ర దృశ్యములో అనంగ భీముదేవునికి ఏ శుభ శకున ఛాయలు గోచరించినవో తెలియదు. కాని ఆయన వెంటనే ఆ స్థలములో బార్వాటి దుర్గ నిర్మాణమునకు శంకుస్థాపన చేసినాడు.

అది ఏదైన చారిత్రిక సూచనా గర్భితమైన శకునమా ?

ఆనాటినుండి చాల కొంగలు అనేక డేగలను కబళించుటకు మొదలిడినవి. మరి అలాగే అయిఉంటే ఖోర్ధా మహారాజు రామచంద్రదేవ్ ఇక్కడ ఎండు రొట్టెముక్కలతో బందీగా కూర్చుండేవారేనా ?

రామచంద్రదేవ్ మత్తెక్కిన కుతూహలంతో అక్కడ ఎవరి కోసమై నిలుచుని నిరీక్షిస్తున్నారో ఆమె రానే లేదు.

ఈ తోటలోనికి రావడమే నేడు ఆమె మరచిపోయినదా? ప్రతి దినము ఈ చెరసాలనుండి రామచంద్రదేవ్ తనను నిశిత దృష్టితో చూస్తున్నారన్న విషయము ఆమె గ్రహించినదా? అందుచేతనే ఆమె సంకోచముతో ఈ తోటలోనికి రావడము మానివేసినదా?

బయటకు శూన్య దృష్టితో చూస్తున్న రామచంద్రదేవ్ పైనిధముగ ఆలోచించ సాగినారు. వారి ఘటనావిహీనమైన అనిశ్చిత నిస్సంగ కారాగార జీవనము ఈ క్షణకాలపు ఉత్తేజనము, కుతూహలము మూలముగా కించిత్ సహన యోగ్యమైనది.

దాటరాని భవితవ్యమువలె ఆ స్త్రీ రామచంద్రదేవుని పూర్తిగ ప్రభావితుని గావించినది.

నల్లని ముఖమల్ బురఖా ఆనాడు కొద్దిగ వైదొలగినప్పుడు ఆమె యెడల రామచంద్రదేవు ఉత్సుకత చెందినారు. ఆ బాధాకరమైన నిర్జీవ ఆవరణలో మూర్తిమంతముగ ఆమెను చూసే అవకాశము కలుగుతుందని రామచంద్రదేవ్ కలలో గూడ ఊహించలేదు.

ఆమె ఒక అశరీర ఛాయామూర్తియో లేక ఉత్పీడితమైన మనోవికారమో అధవా జాగత్ స్వప్నపు టింద్రజాలమో, దీనిని నిర్ధరించుట రామచంద్రదేవునికి ఆనాడు సాధ్యపడలేదు. ఈ కారాగారములో వారిని బంధించిన కొలది దినముల లోనే తలవని తలంపుగ ఈ సంఘటన ఘటిల్లినది.

చిలికా సరస్సు తీరమున గంజాగఢ్ వద్ద ఆ పాడువడిన గ్రామములో ఆనాడు యుద్ధము చేయకుండానే లొంగి పోయి బందీ ఆయిన దుఃఖము ఆయనను బాధిస్తున్నది దెబ్బ తిన్న సింహమువలె విక్షుబ్ధమైన మనస్సుతో ఆయన ఆ కారాగారములో ఇటునటు తిరుగుతున్నారు. వర్తమానపు బాధజ్వాలలో ఆయన భావి దుశ్చింతల నన్నిటిని మరచిపోయినారు.

ఆ జ్వాలామయ ముహూర్తములో ఆ నాడు ఆ తోటలో బురఖా మాటున ఆ స్త్రీ మూర్తి ఆవిర్భవించినది. ఆ తోటలోని ఒక గులాబి మొక్క వద్దకు ఆమె వెళుతుండగ ఆమె ముఖముపైనుండి బురఖా అప్రయత్నముగ వైదొలగినది. ఆమె చెవులకు వ్రేలాడు చుండిన మణిముక్తాజడితమైన కర్ణాభరణములతోపాటు ఆమె ఎర్రని లలాటము సంధ్యారుణ కిరణములలో తటిల్లున మెరసినది. మేఘముల మాటుననున్న చంద్రునివలె బురఖా చాటున ఆమె లలాటాంశము శోభిల్లినది. ఒక మొక్కనుండి మరియొక మొక్క వద్దకు ఆమె సీతాకోకచిలుక వలె తిరుగుతున్నది. కొమ్మలకు కొత్తగా వికసించిన మొగ్గలను ఒకసారి ఆఘ్రాణించిన, మరియొక సారి విచ్చిన పూలను ఆమె చెక్కిళ్ళకు తాకిస్తున్నది.

క్రమముగ ఈ నైమిత్తిక దృశ్యము దైనందిన దృశ్య మైనది. కారాగృహములో రామచంద్రదేవ్ దినమంతా ఆమెను చూడవలెనని నిరీక్షిస్తూ గడిపేవారు. ఈ కుతూహలము క్రమక్రమముగా ఉత్కంఠగా మారినది.

ప్రతిదినము సరిగా అదే సమయములో అదే దృశ్యము ఆయనకు గోచరమగుతున్నది... ఎవరీ రహస్యమయ ఛాయామూర్తి, జనానామహల్ నివాసినియా, లేక ఓకానొక ఉత్పీడిత, ఆత్మవ్రత ఆత్మయొక్క ఛాయా ప్రతిమయా, ...ఆదియేదో రామచంద్రదేవ్ నిర్ధరించుకొన లేకపోతున్నారు.

రామచంద్రదేవ్ నిశితముగా పరిశీలించి ఉన్నట్లయితే ఆమెను తాను చూస్తున్నప్పుడు తన చర్యలను వేరొక వ్యక్తి గమనిస్తున్నట్లు గ్రహించి ఉండేవారు. కాని వేరొక వ్యక్తి ఆ ప్రాంతములో ఉన్నట్టే వారికి తెలియదు. పొద్దు వాలిన తరువాత దీపములను వెలిగించుటకు నెమ్మదిగ కొందరు వచ్చేవారు. వారి కాలి జోళ్ల అలికిడి ఆయనకు వినిపించేది. కారాగారపు భారీ తలుపులను తెరచి మూసిన శబ్దములు గూడ వారికి వినవచ్చేవి. ఆ దుర్గములోని రెండవ భాగము నందున్న ఫతేఖాన్ మసీదునుండి వచ్చే నిర్జీవ ధ్వనులతో నిస్తరంగ సంధ్య కంపించే సమయమున ఆ స్త్రీ మూర్తి అదృశ్య మవుతూ ఉండేది...సంగీతములోని మూర్ఛనవలె ఆమె ఎక్కడనో లీనమయేది.

"ఎవరీమె!...ఎందుకు వచ్చినది?" అని తరచుగ రామచంద్రదేవు అనుకొనెడివారు.

ఆ నాడు ఆమె రాలేదు...ఎందువలన! ప్రతి దినము వలెనే దీపమును వెలిగించేవాడు ఆనాడు వచ్చినాడు. కొవ్వువత్తి వెలిగించినాడు. ఒక్కసారి వెలుగు రావడముతో చీకటిలో పైకప్పు క్రింద నుండిన గబ్బిలములు కొన్ని ఎగిరినవి. కాని ఆ తరువాత రోజూవలె తలుపులు మూయబడలేదు. దీపమును వెలిగించేవాడు ఒకమరబొమ్మవలెవచ్చి దీవమును వెలిగించివెళ్ళినాడు. తరువాత "సలామ్-అలైకుం" అంటూ ఎవరో లోపలకు వచ్చినారు.

అవచ్చినతను జబర్దస్ఖాన్. తకీఖాన్‌కు విశ్వసనీయమైన సభాసదులలో అతడొకడు.సుజాఖాన్ కాలమునుండి అతడు నాయబ్-నాజిమ్‌ల అంతఃపురముల అజ్మాయిషీ చేస్తున్నాడు. జనానా మహల్‌లోని బేగమ్‌ల ఆదరాభిమానములను కూడ అతడు చూరగొనినాడు. జబర్దస్త్ ఖాన్ నవ ముసల్మానుడు. అంచే క్రొత్తగ ఆ మతమును స్వీకరించినవాడు. అయినప్పటికిని అతడు మొగలులవలె జుత్తును పొట్టిగ కత్తిరించుకొన్నాడు. ముఖముమీద నాచువంటి గడ్డము, నెరసిన మీసపు ఛాయలు ఉన్నవి. క్రొవ్వువత్తి కాంతిలో అతని ముఖము కోమలముగ కానవస్తున్నది. అతడు ఎర్రమఖమల్ చొక్కాను ధరించినాడు. దానికి కుడివైపున వెండి కుచ్చులు త్రాడుకు వ్రేలాడుతున్నవి. నడుముకు కట్టుకొన్న పటకాలో దంతపు విడిగల కత్తి ఉన్నది. తలవైని టోపీ ఉన్నది.

సమయము కాని సమయములో అక్కడకు జబర్దస్ఖాన్ రావడము చూసి రామచంద్రదేవ్ కొద్దిగ ఆశ్చర్యపడినారు. కాని అతడు ఆత్మీయతను ఒలకబోస్తూ "దీన బాంధవులకు క్షేమమే గదా!" అని బోసి నోటితో అడిగినాడు.

మొగలుల సంభాషణా పద్ధతి రామచంద్ర దేవునికి బాగుగ తెలియును. కొంచెము అయిష్టముగనే 'ధన్యవాదములు, దయచేయండి' అని వారు అన్నారు.

"హుజూరు వారిని దర్శించుకొనవలెనని అనుదినము అనుకొంటున్నాను. కాని తీరుబడి లేకపోయినది. నేడు మా హుజూరివారి ఆజ్ఞ అయినది, 'మహారయా! వెళ్లండి, మా బంధువులు ఖోర్దా పాదుషా వారిని కలిసికొని రండి' అని. 'చిత్తము మహాప్రభో' అని వారితో అన్నాను" అని జబర్దస్త్ ఖాన్ అటూ ఇటూ తిరుగుతూ అన్నాడు.

జబర్దస్త్ ఖాన్ పట్టి బడాయికోరు మనిషి. ఆతడు లాల్‌బాగ్‌నుండి ఎప్పుడు ఎలా వచ్చాడో, అతడు వస్తున్నప్పుడు త్రోవలో గుర్రము ఎక్కడెక్కడ ఎలా అదిరి పడ్డదో మొదలగు విషయములనుండి తన హుజూరి వారి వంట శాలలోని పులావ్ సువాసనల వరకు అతడు వర్ణించి చెప్పుతూ ఉండే వినేవాడు విసుగుచెంది చివరకు అసలు విషయము కొరకు ఆత్రుత పడతాడు. కాని ఆ రోజున జబర్దస్త్‌ఖాన్‌నుండి ఇటువంటి ప్రసంగమును వినే ఓపికకాని, శక్తికాని రామచంద్రదేవునికిలేవు. అతని ఆకస్మిక రాకకు కారణము తెలిసికొనవలెనన్న ఉత్సుకత గూడ వారికి లేదు. అందువలన ఆయన పరిహాస స్వరముతో, "మాదండీ! నేను ఒక సాధారణ ఖైదీని. నాయబ్-నాజిమ్‌లతో సంబంధము నాకు ఎలా సంప్రాప్త మవుతుంది?" అని అన్నారు.

"పాపము శమించుగాక! పాపము శమించుగాక! ఎటువంటి మాటలను వినవలసి వచ్చినది! ఖోర్ధాపాదుషావారిని ఖైదీఅనేసాహసము ఎవరికిఉంటుంది! భగవంతుని సృష్టిలో కష్టదినములూ వస్తవి, అదృష్టదినములూ వస్తవి. నేడు సింహాసనము అయితే రేపు కొయ్యబల్ల..." అని ఆతరువాత స్వరమును తగ్గించి "ఓరియా సూబా యొక్క నాయబ్-నాజిమ్ తకీఖాన్, మరియు మర్షిదాబాద్ యొక్క షాహమ్‌షాహ్, దీన జనపాలకులునగు సుజాఖాన్‌లతో బంధుత్వము సామాన్యమైన అదృష్టము కాదు ప్రభూ!" అని జబర్దస్త్‌ఖాన్ అనినాడు.

నిగూఢమైన అతని మాటలు రామచంద్రదేవ్‌కు సరిగ అర్థము కాలేదు. జబర్దస్త్‌ఖాన్ అన్నిటిని విప్పి చెప్పవలెనని ప్రయత్నిస్తున్నాడు—కాని చెప్పలేక పోతున్నాడు. ఏమి ఆనవలెనో నిర్ణయించుకొనలేక రామచంద్రదేవ్ నిశ్శబ్దముగ శిలా ప్రతిమవలె నిలుచుండి పోయినారు.

ఉన్నట్లుండి జబర్‌దస్త్‌ఖాన్ బయటకు వెళ్ళిపోయినాడు. కొద్ది క్షణములలో అతడు ఒక బురఖా వేసికొన్న స్త్రీ చేయి పట్టుకొని తీసికొని వచ్చినాడు. అతడు వస్తూ సహానుభూతితో నిండిన స్వరముతో "రా, అమ్మా రా! లోపలకు రా తల్లీ!" అన్నాడు.

బురఖాలో నుండి ఆమె తెల్లని చేతులు తప్ప మరి యేమీ కనబడుట లేదు. ఆలోకపు చిగుళ్ళవంటి ఆమె చేతి వ్రేళ్ళను చూచి ముసుగులో నున్న వ్యక్తి మంచి అంగ సౌష్ఠవముగల ఒక అందమైన స్త్రీ అని గ్రహించ వచ్చును.

తాను నిద్రపోతున్నారో లేక మేల్కొనే ఉన్నారో రామచంద్రదేవ్ తెలిసికొనలేక పోతున్నారు.

"ఎవరీ రహస్య సుందరి!" ఇదే ఆలోచనతో అయన విస్మయాభిభూతులయినారు.

జబర్‌దస్త్‌ఖాన్ ఆ స్త్రీ ముసుగును తొలగించినాడు. మేఘముల చాటు నుండి బయల్పడిన చంద్రునివలె ఆమె ముఖ బింబము బంగారు కాంతితో భాసించినది. విల్లువంటి కనుబొమ్మలక్రింద సుర్మారేఖాంకితమైన ముకుళిత నేత్ర ద్వయము...ఇది స్వప్నము కాదు కదా! అనుదినము సంధ్యా సమయములో గులాబి తోటలోనికి వచ్చి రామచంద్రదేవుని నేత్రములలో ఇంద్రజాలమును వెదజల్లుతున్న ఆ రహస్యమయ సుందరే ఈమె. అయితే ఇక్కడకు, ఈ చెరసాల లోనికి ఈమె ఎందుకు వచ్చినది?

జహాంగీరీ అత్తరు సువాసనతో చెరసాలంతా ఘుమఘుమలాడి వాతావరణము రోమాంచితమైనది. జబర్‌దస్తుఖాన్ ఆమె ముసుగును వాల్చినాడు.

"ఈమె హుజూర్‌వారి మనసా దేవి. ఈమెను హుజూర్‌వారు పరిణయ మాడితే ఖోర్దా కటక్‌లు ఒకటి కాగలవు. ఈమె ముర్షిదాబాద్ నవాబ్ సుజాఖాన్ వారి పుత్రిక, నాయబ్-నాజిమ్ తకీఖాన్ గారి సోదరి" అని అతడు చెప్పినాడు.

ఈ విచిత్ర విషయమును విని రామచంద్రదేవ్ విస్మయులైనారు. సంబంధము నిశ్చయమైనప్పుడు వధువు ఇంటివారు తాంబూలము ఇవ్వడము ఒక సదా

చారము. ఇక్కడ వడువు తరపున జబర్‌దస్త్‌ఖాన్ తప్ప అన్యులు ఎవరూ లేరు. అందువలన అతడే జేబులోనుండి ఒక పచ్చని తమలపాకు తీసి రామచంద్రదేవుని చేతిలో ఉంచుతూ "అయ్యా! ఆలోచించండి. నవాబ్ సుజాఖాన్ నేడు బంగాల్, బీహార్, ఒరిస్సా సూబాలకు అధిపతి. ఖోర్ధా కటక్‌ల మధ్య యుద్ధము జరుగుతూ ఉండడము ఒక సాధారణ విషయముగా పరిణమించినది. ఇరువైపులను రక్తపాతము సంభవిస్తున్నది. దీని వలన ఖోర్ధాకు తీరని నష్టము కలుగుతున్నది. అందువలన ఈ అనుచిత పోరును ఇంతటితో అంతముచేసి, ఖోర్ధా కటక్‌లను ఏకము చేసి, ఒరిస్సా సూబాలో శాంతిని నెలకొల్పవలెనని నేడు నాయబ్-నాజిమ్ బహాదుర్ వారు ఆశిస్తూ తమరిని వారి ఖావమరది కావించుకొనవలెనని కోరుకొంటున్నారు," అని చెప్పినాడు.

రామచంద్రదేవు చేతిలోనుండి ఆ తమలపాకు నేల జారినది. ఈ విధమైన అసంభవమైన, ఊహాతీతమైన ప్రస్తావనలోనిబెదరింపు విని ఆయన కొద్ది భీతిచెందినారు. ఎంత ఆకస్మికముగా జబర్‌దస్తుఖాన్ వచ్చినాడో అంత ఆకస్మికముగానే అతడు వెళ్ళిపోయినాడు.

అతడు వెళుతూ వెళుతూ "హుజూర్‌వారు దీనిని గురించి శ్రద్ధగ ఆలోచించగలనిదని మనవి షాహంషాహ్ వారి కుమారుల స్నేహ హస్తమును ఈ విధముగ జారవిడుచుట..." అని అన్నాడు.

జబర్‌దస్త్‌ఖాన్ వెళ్ళిన తరువాత ఆ బురఖాలోని స్త్రీ ప్రతిమ నిశ్చల జలరాశిపైని క్షీణ తరంగము వలె వణికి పోయినది, తిరిగి నిశ్చలమైనది. జబర్‌దస్త్‌ఖాను ఆ ధవ్య ప్రసంగము వెనుక పరోక్షమైన బెదరింపు, దాని పరిణామము గురించి ఆలోచిస్తూ రామచంద్రదేవ్ విచలిత మనస్కులైనారు.

నాయబ్-నాజిమ్ తకీఖాన్ దయాదాక్షిణ్యముల మీదనే ఇప్పుడు ఖోర్ధా ఆధారపడి నట్టుగ ఉన్నది. ఈ అభిప్రాయము ఎవరికీ కలిగినా కలుగక పోయినా రామచంద్రదేవ్ మాత్రము ఆలాగే అనుకొంటున్నారు. దీనికికారణము తకీఖాన్‌ను ఎదుర్కొనే శక్తి ఒరియా పాయిక్‌లకు లేకకాదు, బాహ్య శత్రువులు ఎంతటి శక్తిమంతులో అంతకు మించి అంత శత్రువులు ఉన్నారు. ఖోర్ధా స్వాతం

త్యము పైననే జగన్నాథుడు పూర్తిగ ఆధారపడి ఉన్నాడు. ఖోర్ధావారి అభిమానము ఇంకా కొద్దిగ మిగిలి ఉన్నది. అందుచేతనే ఇటీవలి నాయబ్-నాజిమ్‌లు శ్రీ జగన్నాథ ఆలయమును తాకలేదు. కాని ఖోర్ధాయే లేకపోయినట్లయిన శ్రీ మందిరమును కూల్చి శ్రీ క్షేత్రములో ఒక మసీదును నిర్మించుటకు ఎంతసేపో పట్టదు. వందలాది దురోగములు, పరాజయములు, అవమానముల మధ్య ఏ జగన్నాథుని అక్షతుడుగా ఉంచవలెనన్న దీక్షతో భోయీవంశ మహారాజులు ఇక్కడకు అక్కడకు తిరుగాడినారో, ఆ జగన్నాథుడే తకీఖాన్ హస్తములలో నిర్యాతనుడైతే!

బురఖాలోని స్త్రీ నెమ్మది నెమ్మదిగ తన ముఖముపై నున్న ముసుగును తొలగించినది. ఆమె వేదనాభరితమైన వాడిన కమలరేకులవంటి నేత్రములు "నన్ను విశ్వసించండి, నేను ఈ కుట్రలో లేను. నేను నిరపరాధిని" అని మూగభాషలో రామచంద్ర దేవునికి చెప్పుచున్నట్లుగా ఉన్నవి.

శిశిర జలబిందువులవలె పాపరహితమైన ఆమె ఉజ్జ్వల నేత్రములు రామచంద్రదేవుని క్షణమాత్రములో ఎట్లు సమ్మోహితుని చేసినవో తెలియదు.

ఆనాడు చిలికా తటమందు ఆ పాడువడ్డ గ్రామములో తమకు మంచి నీటిని ప్రసాదించిన ఆ ఆశ్రయదాయిని, హతభాగిని సర్‌దేయీ కండ్లలోని పీడితదృష్టి వారి స్మృతిలో కదలాడ సాగినది.

"ఎవరు నీవు?" అని రామచంద్రదేవ్ కొద్దిగ ఆవేశముతోనే అడిగినారు.

"నేడు 'జహా'ను, అమ్మ నన్ను అలాగే పిలిచేది. కాని వీరు నాకు రజియా అని పేరు పెట్టారు"అని ఆమె నిశ్చలస్వరముతోనే సమాధానమిచ్చినది.

"కాని నీవు...సుజఖాన్ పుత్రికవు, నాయబ్-నాజిమ్ సోదరివే కదా?" అని రామచంద్రదేవ్ ఆశ్చర్యముతో అడిగినారు.

"మూర్షిదాబాద్‌లో ప్రఖ్యాత నర్తకి మా అమ్మ. 'కంచన్ మూర్షిదాబాదీ' అని ఆమెను అందరూ పిలిచేవారు. నవాబ్ సుజాఖాన్ అంతఃపురములోనికి

ఆమె ఎలా వెళ్ళినదో నాకు తెలియదు. కాని ఆమె నన్ను 'జవా' అనే పిలిచేది. నేను హిందూ బిడ్డనని...జవానని ఆమె నాతో చెపుతూ ఉండేది."

మనసులో పేరుకొనిపోయిన తన కష్టసుఖములను మనసు విప్పి చెప్పుకొనడానికి తన మనిషి అనుకొన తగ్గ వ్యక్తి బహుశా ఆమెకు అనేక సంవత్సరముల తరువాత లభించినట్టున్నాడు. అందువలన ఆమెలో సంకోచము కాని జడత్వముకాని లేదు. శిశిర బిందువుల వంటి ఆమె పాపరహితమైన చూపులు ఆయన పైన నిలిచినవి.

"నా తల్లి ఇక్కడనే మరణించినది. ఆమె సమాధి కూడ ఇక్కడనే ఈ కటక్‌లోని కదమ్‌రసూల్‌లో ఉన్నది. ఆమె చివరి క్షణములవరకు నేను ఆమెతోనే ఉన్నాను. చనిపోయేవరకు ఆమె పురుషోత్తముడైన జగన్నాథస్వామిని దర్శించాలని కోరుకొంటూ ఉండేది. చివరకు 'హే జగన్నాథ్! జగన్నాథ్!' అంటూనే ఆమె ఆఖరి శ్వాస విడచినది," అని చెప్పి జవా దీర్ఘముగ నిట్టూర్చి కళ్లు క్రిందకు వాల్చినది. తిరిగి రామచంద్రదేవునివైపు తిరిగి, "తమరు జగన్నాథ దేశ చక్రవర్తులు కదూ! నేను తమరిని గురించి అలాగుననే విన్నాను" అని ఆడిగినది.

ఎయట నుండి జబర్‌దస్‌ఖాన్ చెప్పుల చప్పుడు వినిపించినది. జవా బురఖా మాటున తన ముఖము దాచుకొన్నది. రామచంద్రదేవుని శరీరము నారి సాధించిన విల్లుపలె బిగిసికొన్నది.

మరి కొన్ని నాళ్ల తరువాత ఒకనాడు జవాతో అనగా రజియాతో రామచంద్రదేవుని వివాహము జరిగినది. ఈ నవదంపతుల చేత కాజీ కల్మా చదివించి ఇద్దరి పేర్లను చిట్టాలో నమోదు చేసినాడు. ఆ తరువాత రామచంద్ర దేవ్ హఫిజ్ కాదర్‌బేగ్‌గ మారినారు. రజియా ఖోర్ధా బేగము అయినది.

మహారాజా రామచంద్రదేవ్ జాతిభ్రష్టులై ఒక మ్లేచ్ఛురాలిని వివాహ మాడుతారని, జగన్నాథస్వామి ద్రోహిగా మారుతారని ఏవ్వరును ఊహించనైనా లేదు. దీనివలన ఉత్కళ దేశమంతా అట్టుడికిపోయినట్లయినది.

ఆ తర్వాత ఆయన ఖోర్తా మరలి వెళ్ళుటకు ఎటువంటి ఆటంకము లేకపోయినది. కాని రజియాబేగమ్‌ను తీసికొని హాఫిజ్‌కాదర్ బేగ్‌గా ఏ ముఖముతో ఖోర్తాలో తిరిగి అడుగు పెట్టగలనన్నది వారి కొక సమస్యగా తయారయినది. తకీఖాన్ బావమరదిగా సంబంధము ఏర్పరచుకొన్న తరువాత ఒక నూతన బంధములో చిక్కుకొని బార్వాటీ దుర్గములో బందీ అయినారు.

ఆనాడు ముసల్మానులకు శబ్-ఏ-రాత్ పండుగ. ఆ పర్వదినము నాడే హాఫిజ్‌కాదర్ రజియాల మధుయామిని.

ఆ కాలము నాటికే ముసల్మానులు హిందూ సంస్కృతికి సన్నిహితులైనారు. అనేక హిందూ పండుగలను పబ్బాలను ముస్లిమ్ సమాజము తనలో యిముడ్చుకొన్నది. శబ్-ఏ-రాత్ కూడ అటువంటి వాటిలో ఒకటి. శ్రావణ కృష్ణ చతుర్దశి నాటి రాత్రి ఈ ఉత్సవము జరుగుతుంది. ఈ పండుగ ముస్లిము లకు హిందువుల దీపావళి వంటిది ఆనాటి గాఢాంధకారములో జీవుడు బ్రహ్మలో లీనమయిపోతాడని, మానవుల భావి భాగ్యములు నిర్ణయింపబడతవని వారి నమ్మకము. అందువల్ల ముసల్మాను లందరు ఆనాటి రాత్రి జాగరముచేస్తూ నియమ నిష్ఠలతో కొరాను పఠిస్తారు. కాని అది రాను రాను హిందువుల దీపావళివలె దీపావళులతోను, టపాకాయలతోను, అగ్నిక్రీడలతోను కోలాహలముగ జరుపుకొనే పండుగగ మారినది.

శబ్-ఏ-రాత్ పండుగతోపాటు తకీఖాన్ సోదరి, సుజాఖాన్ కుమార్తె అయిన రజియా వివాహ సందర్భము కూడ కలిసి వచ్చినది. బార్వాటీ దుర్గము ఆనాడు దీపములతో విశేషముగ అలంకరింపబడినది. దుర్గ మధ్యమందున్న ఫతేఖాన్ మసీదు కాంతి పుంజములతో దేదీప్యమానముగ వెలుగొందినది. దాని గుమ్మటము ఒక కాంతిచక్రము వలె దూరమునుండి గోచరించినది. దుర్గము నలువైపుల నుండి ఆకాశమునకు దీపములతో మెట్లు నిర్మించినట్లుగ భాసించినది. దుర్గ ప్రాచీరముల వైని వెలుగుచుండిన దీపములు ఏదోరూపకథలోని స్వప్నలోకమువలె భ్రమను కలిగించినవి. దుర్గములో కాల్చిన బాణసంచాల వెలుగును తిలకించుటకు తండోపతండములుగ ప్రజలు బయట గుమిగూడినారు.

కాని దేశమంతటను హాహాకారములు చెలరేగినవి. జగన్నాథునికి శిరోమకుటాయమానమైన సేవకుడు, ఖోర్ధా మహారాజు రామచంద్రదేవ్ సుజాఖాన్ జారజ కన్యను వివాహమాడి మతభ్రష్టులైనారు....

రాత్రి రెండవ జాము గడచినది. దీపములు ఒక్కొక్కటిగా ఆరిపో నారంభించినవి. కాని ఉత్సవ అవశేషములవలె అక్కడక్కడ కొన్ని దీపములు మాత్రము వెలుగుచున్నవి.

రజియాను వివాహమాడిన తరువాత హాఫిజ్‌కాదర్‌బేగ్‌గా నామంతరులైన రామచంద్రదేవ్ దుర్గములోని ఎనిమిదవ భాగము నుండి తొమ్మిదవ భాగమునకు మారినారు.

ఇరానీ తివాసులు, సమర్‌కంద్ పట్టు బాలీసులు, ముర్షిదాబాద్ తెరలు, పూలకుండీలు, ధూప స్తంభములు, మొదలగు వాటితో ఆ మధుయామినిలో వారి కేళికా మందిరము అలంకరింపబడినది.

ఆ మందిరములో ఒక మూలను నతమస్తకయై కూర్చుండి రజియా కురాన్-షరీఫ్ చదువుతున్నది. రాత్రి చివరి జామునందు చలుపరాతి కిటికీలలో నుండి శీతల వాయువు వీచుతూ పర్దాలను విచ్చి ఫకీరులను చేసి ఆడిస్తున్నది. రజియా నల్లరంగు కాశ్మీరు శాలువను కప్పుకొన్నది.

ఆ సమయములో గూడ సైనికుల భాగములో శబ్-ఏ-రాత్ ఉత్సవము జరుగుతున్నది. ఆ ఏకాంత రాత్రిలో మద్యపాన మత్తులైన వారి గజల్ స్వరములు, ఖేమటా నర్తకుల కాలి అందెల రవళులు ఇంకను వినిపిస్తున్నవి. ఆ సమయములో రామచంద్రదేవ్ ఫానూస్ దీపము క్రింద చిత్ర ప్రతిమవలె నిలుచుని గవాక్షపు జాలీలలోనుండి మహానదిని కన్నార్పకుండా చూస్తున్నారు. అస్తమిస్తున్న కృష్ణపక్ష చతుర్దశి చంద్రుడు మహానది వక్షముపైకి వాలుతున్నాడు. ఆ చంద్రుడు మేఘముల చాటున ముఖముకప్పుకొనబోతున్నాడా, లేక మహానది జలరాసిలో మునిగి ఆత్మహత్య చేసికొనబోతున్నాడా తెలిసికొనడానికి మధుపాన

మత్తులోనున్న రామచంద్రదేవ్ కష్టపడుతున్నారు. బహుళా ఈ సమస్యను పరిష్కరించుటకే కంపిత హస్తములతో మధుపాత్రను పట్టుకొని కన్నార్పకుండా అటువైపునకే చూస్తూ ఆలోచిస్తున్నారు.

రామచంద్రదేవ్ ఒక్క గుటకలో మధుపాత్రను ఖాళీచేసినారు. వారి కంపిత హస్తాలలో నుండి జారిపడిన మధుపాత్ర ఆ నిర్వేదగ్రస్త మూర్ఛిత వాతావరణమును కంపింపజేసినది.

కూర్చున్న చోటునుండి మెల్లగ లేచి రామచంద్రదేవునికి దగ్గరగా వచ్చి రజియా నిలబడినది. రాజతంత్ర యూపస్తంభమునకు బంధింపబడిన ఆ అమాయక కన్యను చూడగనే రామచంద్రదేవుని హృదయము సానుభూతితో నిండిపోయినది. ఆమె ఎర్రని గోరింట చేతులను అయన తన చేతులలోనికి తీసికొన్నారు. ఆ సమయమందు అంధకారాచ్ఛన్న మహానదీ జలరాశిలో అస్తమించిన చంద్రుడు మత్తెక్కిన రజియా నేత్రములలో మరల ఉదయించి ప్రకాశిస్తున్నట్లుగ ఉన్నాడు.

"నేడు నవ వధువుకు ఏదైనా కానుకను ఇచ్చే ఆచారమున్నది. మరి నాకేమి ఇస్తున్నారో సెలవియ్యండి" అని రజియా రామచంద్రదేవుని చెవిలో రహస్యము చెప్పుతున్నట్టు మెల్లిగ అడిగినది.

రామచంద్రదేవ్ ఆమె కళ్ళలోని లోతులను గమనిస్తూ "ఇహ పరలోకములలో నాది అన్నది ఏమి ఉన్నదో అదంతా ఇప్పుడు నీదే రజియా" అని అన్నారు.

"అయితే ఒట్టువేయండి" అని చిలిపిగా వారి కన్నులలోనికి చూస్తూ రజియా అన్నది.

''నిజము, నిజము రజియా! మూమ్మాటికీ నిజము" అంటూ ఆమెను తమ బాహువులతో రామచంద్రదేవ్ బంధించారు.

వారి బంధమును కొద్దిగ సడలించుకొని రజియా కొంచెము సాగి నిలుచున్నది. "నాకు జగన్నాథస్వామివారి దర్శనము చేయించగలరా స్వామీ!

అన్నిటిని పొందలేదన్న వ్యథను పోగొట్టుకొనుటకు ఆ స్వామివారి దర్శనము ఒక్కసారి చేసికొంటే చాలునని అమ్మ అంటూ ఉండేది. అంధకారమును రాత్రి విలీనము చేసికొంటున్నట్లుగ, ప్రాప్తి-అప్రాప్తి, దుఃఖము-ఆనందము, నవ్వు-కన్నీరు వీటి నన్నింటిని జగన్నాథస్వామి ఏకీభూతము చేసి తనలో లీనము చేసికొంటున్నాడు. ఆమె 'జగన్నాథుడు, జగన్నాథుడు" అంటూ సమాధిని చేరినదే కాని, పాపము! ఆ జగన్నాథుని చూడలేకనే పోయినది," అని అన్నది రజియా.

రామచంద్రదేవుని బాహుబంధము అకస్మాత్తుగ సడలిపోయినది.

అంధకారాచ్ఛన్నమైన మహానది జలరాశిలో అప్పటికే చంద్రుడు అస్తమించినాడు. ఆ రాత్రికి చరమాంకమా అన్నట్టుగా నాలుగు వైపులనుండి ధూసరగ్రస్తమైన పొగమంచు తెర వ్రాల నారంభించినది.

పథర్‌గఢ్ రాజమహలులోని ఏకాంత స్థలములో మూగన్నుగ నిదురించిన రామచంద్రదేవుని హృదయమును ఆ శబ్-ఏ-రాత్ స్మృతి ఒక రూపకథా దృశ్యమువలె సమ్మోహ పరచినది. ఎవరివో పాంకోళ్ళ కటకట ధ్వనివలన వారికి నిద్రా భంగమయినది. వారు లేచి మంచము మీద కూర్చున్నారు.

ఖోర్ధా రాజవంశ పురోహితుడు గోదావరీపర్థన్ లక్ష్మి పరమగురు మహాపాత్రకు తప్ప ఈ విధముగ రాజమందిర నీరవ గాంభీర్యమును తన పద ధ్వనులతో ఆహతము చేసే సాహసము అన్యులకు ఎవరికి ఉన్నది? తకీఖాన్ వకీలు సయ్యద్‌బేగ్ కూడ గౌరవ సూచకముగ తన పాదరక్షలను ఒకింత దూరమున వదలినస్తాడు.

లక్ష్మి పరమగురు పదముల అలికిడితో రామచంద్రదేవుని ఆర్ధచేత నత్వము తొలగిపోయినది. మిత్రరహితుడు, అసహాయుడు స్వజనవర్జితుడు అయిన రామచంద్రదేవునికి ఈ ప్రపంచ మొత్తములో అయన ఒక్కరే ఆలంబనము, స్వాంతనము. గంభీరమైన సహానుభూతితో రామచంద్రదేవుని మతాంతరమును ఆయన ఒక్కరే సహించినారు ఖోర్ధా రాజ్యములో శాంతి నెలకొనుటకు,

స్త్రీల మానరక్షణల కొరకు మాత్రమే రామచంద్రదేవ్ పతితుడు, అపాంక్తేయుడు అయినారని భావించినవారు ఆయన ఒక్కరే. లక్ష్మీ పరమగురు ఆయనను తకీఖాన్ బంధము నుండి ఆనాడు విముక్తులను చేసి తీసికొని రాకపోయినట్లయిన వారు నేడు కూడ బార్వాటీ దుర్గములో బంధితులై పడిఉండేవారే.

రజియాను వివాహమాడి రాజాతిథిగా, రాజకీయ ఖైదీగా బార్వాటీ దుర్గములో ఉంటున్నప్పుడు ఖోర్ధాలో వారిని గురించి తలచుకొన్నవారే లేరు. ఖోర్ధా విషమ పరిస్థితులకు లోనైనప్పుడు కూడ ఖోర్ధా సింహాసనము కొరకు వారసులు, పరిజనుల మధ్య కుట్రలు జరుగుతునే ఉన్నవి. ఆ సమయములో రామచంద్రదేవుని విముక్తులను చేయవలెనన్న విషయము ఆటుంచి, కనీసము వారి యోగక్షేమములు విచారించుటకు కూడ కటక్‌లో ఎవరును అడుగుపెట్ట లేదు.

హాఫిజ్ కాదర్ బేగ్‌గా మారిన రామచంద్రదేవ్ బార్వాటీ దుర్గములో పంజరములోని పక్షివలె ఉండవలసి వచ్చినది.

శాశ్వతముగా ఖోర్ధా మార్గము వారికి మూసివేయబడినదని వారప్పుడు అనుకొన్నారు.

ఆ రోజున దీవాన్-ఏ-ఖాస్‌లో తకీఖాన్ కొలువుతీర్చి ఉన్నాడు. వజీరులు, మహతాసీబులు, కాజీలు, నివాన్ నవీసులు, వాకియా నవీసులు, ఫౌజ్‌దారులు మొదలగు కర్మచారులందరు స్వర్ణకంబళాచ్ఛాదితమైన చలువరాతి వేదిక క్రింద తమ తమ స్థానములలో ఆసీనులైనారు. వట్టివేళ్ల, నెమలికన్నుల విసనకర్రలతో సేవకులు విసరుతున్నారు. మధుపాన మత్తుడైన తకీఖాన్ దిండు నానుకొని కూర్చున్నాడు. రామచంద్రదేవ్ ఒకమూల వశవర్తి అయిన సామాన్యునివలె ఒదిగి కూర్చున్నారు.

ఆ విధముగ దర్బారులో కూర్చొనడము రామచంద్రదేవునకు చాల తలవంపుగ మొదటిసారి అనిపించినది. నరపశువైన తకీఖాన్‌ను ఉద్దేశించి చేయబడే అర్థములేని పొగడ్తలు, ముఖస్తుతులో పాల్గొనడము రామచంద్రదేవు

నకు సహించరానిదిగా ఉండెను. కాని వారు నిరుపాయులు. ఆ నరాధముని దయాదాక్షిణ్యముల మీదనే భోర్డా భవిష్యత్తు ఆ సమయములో ఆధారపడి ఉన్నది.

తకీఖాన్ సహజముగ తురుష్కుడు కాడు. మతాంతరితుడైన నవ ముసల్మానుడు. అయినప్పటికిని సుజాఖాన్ జారజ పుత్రునిగా అతనిని అందరు ఎరుగుదురు. తకీఖాన్ వద్ద మొగలాయీల పరిమార్జిత రసికత్వము లేదు. అతని రసవిహీన హృదయములో మతాంధత్వమే ఏక్కువ స్థానమాక్రమించు కొన్నది.

ఆ దర్బారులో తెచ్చి పెట్టుకొన్న రసికత్వమును జోడించిన వ్యంగ్యమును తకీఖాన్ ఎవరి మీదనో ప్రయోగించినాడు. పరిహాస వ్యంజకమైన ప్రసంగము తకీఖాన్ నోటినుండి రాగా ఎవరును వినియుండలేదు. అందువఁన ఇప్పుడు ఈ పరిహాసమును దర్బారులోని వారంతరును విని, తమ జీవితకాలములో ఇంతటి రసవత్తర పరిహాసము అంతవరకు వినినట్టుగా ఒక్కసారి పెద్ద పెట్టున గొలుమనినారు.

ఓహో, సమర్థవంతుని కొలువు కూటములో దీనత్వము ఐశ్వర్యముక్రింద, ఆత్మగ్లాని ఆత్మస్తుతి క్రింద మారుతూ ఉంటవి. పలలేహనము కూడ అక్కడ పౌరుషముగ ఎన్నబడుతుంది.

సభికుల ప్రతిమాటలోను నిండి ఉండే ముఖస్తుతి, క్షణక్షణము వంగి వంగి సలాములు చేసే వారి తీరు చూడని వారికి యివి తెలియడము అసంభవము. రామచంద్రదేవునికి ఇవేవీ అర్థమగుట లేదు. అంతేకాదు. తన హృదయములోని విరక్తిని అదుపులో పెట్టుకొనడము ఆయనకు కష్ట సాధ్యమనిపిస్తున్నది.

సభికుల అర్థములేని హాస్య కౌతుకములో పాల్గొనకుండా రామచంద్రదేవ్ నిశ్చలముగా శిలా ప్రతిమవలె కూర్చున్నారు. వారి ఈ అవిధేయతను ప్రక్కనే కూర్చున్న జగత్‌శేర్ ఫతేచంద్ చూసి, "నవ్వండి, నవ్వండి, రాజా బహాదూర్!" అని మంద స్వరములో హెచ్చరించాడు.

దర్బారు ఆచారములను నేర్పుతూ ఆయన ఆ తర్వాత ఒక ఫారసీక కవి తను వినిపించాడు.

"అగర్ షా రోజ్ రా గోయేద్ షాబ్ అస్తుమన్
బేవాయద్ గుఫ్ త్ ఇనక్ మా వా పరవీన్"

"పాదుషావారు పగటిని రాత్రి అంటే" ఔను మహారాజా! చంద్రుడు, నక్షత్రములు కనిపిస్తున్నవి" అని జవాబు ఇవ్వాలి. తెలుసునా?' అని ఫతేచంద్ హితబోధ చేశాడు.

తకీఖాన్ దర్బారులో "అద్భుతం! అద్భుతం! "అని పోటి పడుతూ సభికులు అరుస్తున్నారు. నవ్వులు ఆగడము లేదు. ఇట్టి గ్లానికర పరిస్థితిలో లక్ష్మీ పరమ గురు పాంకోళ్ల శబ్దముతో లాల్‌బాగ్ అంతా ప్రతి ధ్వనించినది. ఒక కొజ్జావాడు ప్రవేశించి. వంగి వంగి సలాములు చేసి, "ఎవరో కాఫిర్ ఫకీర్ ఏలిన వారిని దర్శించి వందనము చేయుటకు వచ్చి ఉన్నారు" అని మనవి చేశాడు.

"ఎవరా కాఫిర్ ఫకీర్?" అని సభికులందరు ఒక్కసారి అడిగినారు.

"ఖోర్దా రాజావారి ముల్లాని వారు చెప్పమన్నారు" అని కొజ్జావాడు విన్నవించినాడు.

తకీఖాన్ అనుమతితో లక్ష్మీ పరమగురు ఆ నాడు దీవాన్-ఏఖాస్ లోనికి ప్రవేశించినారు.

తకీఖాన్‌కు ఆయన వంగి సలాము చేయలేదు. వారి బలిష్ఠమైన శరీరము కొద్దిగ కూడ వంగలేదు. వారు తలను గూడ వంచలేదు. ఇంతటి అవిధేయతను ప్రదర్శించేవారు ఏ ఒక్కరైన ఉందురని ఆ దర్బారులోని వారెవరును ఊహించనైనా లేదు. గజపతి పురుషోత్తములు కాంచీ విజయానంతరము మరలి వస్తున్న ప్పుడు ఎవరు తమ మంత్ర బలముతో గోదావరి నదిలో తుంగ గడ్డిని ఆకాలములో సృష్టించి కాంచీ సేనను గోదావరి నదిని దాటుటకు వీలు లేకుండ నిరోధించినారో, ఎవరు ఆ కారణముగ 'గోవావరీ వర్ధన్ మహాపాత్ర' బిరుదును పొందినారో

ఆ మహా గౌరవనీయులు శ్రీ జగన్నాథస్వామి ముందు తప్ప అన్యుల ఎదుట శిరము వంచరు.

ఈ అవిధేయతకు కాఫిర్ ఫకీర్‌కు ఏ శిక్ష విధించ బడుతుందో తెలిసి కొనుటకు సభికులందరు ఆత్రుతతో ఎదురు చూస్తూ కూర్చున్నారు. కాని లక్ష్మీ పరమగురు ఉన్నత లలాటము మీద వెలుగొందుతున్న సిందూర తిలకము, శ్మశ్రుల ముఖమండలము మీద దీప్తిమానమైన ఉజ్జ్వల నయనములు, విశాల వక్షస్థలము పైని శోభిల్లుచున్న రుద్రాక్షమాల, దక్షిణ హస్తములోని దీర్ఘ త్రిశూలము తకీ ఖాన్‌ను సమ్మోహితునిగా చేసినవి.

"దయచేయండి" అని వినమ్ర స్వరముతో తకీఖాన్ వారిని ఆహ్వానించి నాడు.

మ్లేచ్ఛ సింహాసనమునకు క్రిందుగా ఏసాధకుడైనను ఆసనము అధిష్ఠించుట శాస్త్ర నిషిద్ధము" అని లక్ష్మీ పరమగురు సగర్వముగ సమాధానము చెప్పినారు.

అప్పుడు తకీఖాన్ వారి రాకకు కారణము అడిగి "మీరు ఏది కోరితే దానిని ఇచ్చుట మాకు సమ్మతము" అని అన్నాడు.

తమ అగ్నిదీప్తమైన సమ్మోహక నేత్రములను తకీఖాన్ అర్ధనిమీలిత నేత్రములపైన నిల్పి "ఖోర్దా సింహాసనము ఇప్పుడు శూన్యముగా ఉన్నది కనుక నేనిప్పుడు రామచంద్రదేవ్‌ను తీసికొని వెళ్లుటకు వచ్చినాను" అని లక్ష్మీ పరమ గురు కఠోర స్వరముతో అనినారు.

సమ్మోహితునివలె తకీఖాన్ "నాకు సమ్మతమే" అని సమాధాన మిచ్చి నాడు.

ఒక అబోధ బాలకుని రెక్క పుచ్చుకొని ఒక తెలియని మార్గమునుండి వెనుకకు మరల్చినట్లుగ లక్ష్మీ పరమగురు రామచంద్ర దేవుని తకీఖాన్ వ్యూహమునుండి తప్పించి తీసికొని వచ్చినారు. చేష్టలుడిగి, నోట మాట రాక తకీ

ఖాన్ అలా చూస్తూ కూర్చున్నాడు. విస్మితులైన సభికులు ఒకరిముఖము ఒకరు చూసుకొన్నారు.

ఆ లక్ష్మీ పరమ గురే రామచంద్రదేవునికి ఏకైక శుభాకాంక్షితుడు, మంత్రదాత.

లక్ష్మీ పరమగురు గదిలోనికి ప్రవేశించగనే రామచంద్రదేవ్ ఆసనము నుండి లేచి వచ్చి వారికి పాదాభివందనము చేసినారు. లక్ష్మీ పరమగురు చేయి పైకెత్తి అభయముద్రతో ఆశీర్వదించినారు.

"రత్న వేదికనుండి నేను జగన్నాథస్వామి వారిని దర్శించుటకు వీలు లేదని ముక్తి మండప పండితులు నిర్ణయించినట్లు తమరు వినే ఉండవచ్చును" అని రామచంద్రదేవ్ విషాద స్వరముతో అన్నారు.

"ఔను, నేను దానికి వేరు ఏర్పాటు చేసినాను. మిమ్ములను జగన్నాథుడు మాత్రము వేరు చేయుట లేదు హృదయమును రుద్రభూమిగ చేసికొనినంత కాలము అక్కడ మహా భైరవుడు ఎలా మేలుకొంటాడు? ఆయినను ఎవరు పట్టు కొందురో వారే మునిగి పోదురు," అని లక్ష్మీ పరమ గురు నవ్వుచు అనినారు.

"అయితే నేను మునిగి పోతానా?" అని అసహాయ స్వరముతో రామ చంద్రదేవ్ అడిగినారు.

పరమ గురు అధరములపైని రహస్యమయమైన చిరునవ్వు మొలకెత్తినది.

"మునిగి పోవుటన్నది ఇప్పుడింకను మిగిలి యున్నదా?" అని వారు అన్నారు.

నాలుగవ అధ్యాయము

I

సింహల బ్రహ్మపుర్‌లోని దధివామశాలయపు మేఘనాథ ప్రాచీరములోని పశ్చిమ భాగము పూర్తిగ పగులగొట్టబడినది.

స్తూపాకారముగ పడియున్న రాళ్ళగుట్టలు ఒక ప్రాచీన భగ్నావశేష భ్రమను కలిగిస్తున్నవి. బయటి గోడ శిథిలమయిన తరువాత గర్భగుడివైన దురాక్రమణ ప్రారంభమయినది.

ఒక తట్టు పైని కూర్చుని ఇటూ అటూ తిరుగుతు గాజీసుల్తాన్‌బేగ్ ఈ ఆక్రమణ కార్యక్రమమును పర్యవేక్షిస్తున్నాడు. సుమారు వందమంది కూలీలు దేవాలయ గోడలను సమ్మెటలతో కొట్టి కొట్టి అలసిపోయినారు. దేవాలయ నిర్మాణము ఇంక గట్టిదని గాజీమియా కు ముందుగనె తెలిసియుండి నట్లయిన వివిలీ నుండి ఫిరంగులను రప్పించి ఉండెడివాడు. ఒకేసారి వందమంది కూలీలు దేవాలయమును పడగొట్టితే అది ఎంతసేపో నిలవలేదని అతడు ఊహించినాడు.

అలసిపోయినకూలీలు కొంచెము సేపు ఆగినట్లయిన "అల్లాహో అక్బర్!" అని విచ్చివానివలె గాజీమియా అరుస్తున్నాడు. ఆ అరుపులకు కూలీలు ఉత్సాహము చెంది సమ్మెటలతో మరింత ఉద్ధృతముగా దెబ్బలు కొడుతున్నారు. వెదురు ఆదవులతో నిండిన ఆ సింహల బ్రహ్మపుర్ నిస్పంద వాతావరణము ఆ దెబ్బలకు ఆర్తనాదము చేస్తున్నట్లుగ ఉన్నది.

వందలాది మూగ సందర్శకులు అసహాయులై ఈ విచ్ఛేద కార్యక్రమమును సురక్షితమైనంత దూరమునుండి భయముతో చూస్తూ నిల్చున్నారు. మీది నుండి ఏ విగ్రహము విరిగిపడినను దానిని ఒకరి కొకరు చూపించి విచారిస్తున్నారు. దేవాలయము మీద పడుతున్న ప్రతి ఒక సమ్మెటపోటు వారి హృదయము మీద పడుతున్నట్లే వారు బాధపడుతున్నారు. దుర్భర మానసిక వేదనతో వారి ముఖమండలములు కుంచించుకొని పోతున్నవి. వారి నేత్రములు దుఃఖాశ్రువులతో నిండిపోతున్నవి. కాని వారిలో ఏ ఒక్కరుగూడ ఆ దుష్ట కార్యక్రమమును నిరోధించుటకు సాహసించలేక పోతున్నారు. ధైర్యముచేసి ఎవరైనా వేలెత్తి నిరోధించి యుండినట్లయితే గాజీమియాతోసహా అతని అనుచరులు అందరు పలాయనము చిత్తగించి ఉండేవారే. కాని ఒక అకారణ భయము వారిని అవిటివారిని, అసహాయులను చేసివేసినది.

దత్తలా పర్వతమునకు దిగువనున్న సింహల బ్రహ్మపురి గ్రామములోని గధ్‌నాయకుని మఠము, ధధివామనాలయము ఖోర్ధా రాజ్యములో ప్రఖ్యాతమైనవి. ఒరిస్సా చరిత్రలోని ఒక విడంబిత అధ్యాయము వాటి వెనుకనున్నది. అది నేడు ఒక స్మృతి పథములో మాత్రము నిలిచియున్నది. అది పరాక్రమవంతుడైన ఒక మహారాజుని వీరగాథ కాదు. సాహసవంతుడైన ఒక సేనాపతి కథ కాదది. ఒక సామాన్య రైతు కత అది. యవనుడైన కాలాపహాడ్ నుండి జగన్నాథస్వామిని రక్షించుటకు బిశర్ మహాంతి సహించిన క్లేశముల వీరగాథ అది—విస్మృత శిలాశాసనములవలె నాచుపట్టిన ఆ దేవాలయ గోడలపైని శాశ్వతముగ నిలిచి ఉన్నది.

గౌడ దేశమునుండి జగన్నాథుని తీసికొని బిశర్ మహాంతి బ్రహ్మపురి తిరిగి వచ్చిన తరువాత క్రొత్త మూర్తిని తయారు చేయుటకు దారువు కొరకు అన్వేషించినప్పుడు శాస్త్రోక్తలక్షణ సమన్వితమైన దారువు ఇక్కడనే దొరికినది. ఆ ఘటనా సంస్మరణ చిహ్నముగ ఈ స్థలములో దధివామన దేవాలయము నిర్మించబడినది. గాజీమియా మతోన్మాదము వలన ఇప్పుడు ఆ దేవాలయమే నాశనమవుతున్నది.

ఒక దగ్గర గ్రామములో గాజీ సుల్తాన్‌బేగ్ మసీదు నొకదానిని నిర్మిస్తున్నాడు. ఆ మసీదు పునాదులకు ఈ దేవాలయ రాళ్లు అవసరమయినవి.

గాజీ సుల్తాన్‌బేగ్ ప్రబల పరాక్రమవంతుడు. దొంగిలించబడిన వస్తువుల ఉనికిని తెలిసికొనగల మంత్రబలము అతనికి ఉంది. దొంగల జాడను తెలిసికొనడము, అసాధ్య రోగములను నయము చేయడము మొదలగు అలౌకిక సిద్ధులలోగూడ అతడు ఘటికుడు. అల్లా కోరిక ప్రకారము, నాయబ్-నాజిమ్ తకీఖాన్ ఆదేశానుసారము అతడ ఆ మసీదును నిర్మిస్తున్నాడు. మతాంతరుడైన హాఫిజ్ కాదర్‌బేగ్ ఖోర్దాకు రాజు. అందువలన గాజీమియాకు ఎదురు చెప్పగల వారు ఎవరున్నారు? సందర్శకులలో అయ్యో అని తమ బాధను పైకి వ్యక్తము చేయగలవారు గూడ లేరు.

త్రైలంగ్ ముకుంద్ హరిచందన్ రాజత్వపు పదవ అంకములో అనగా 1488 సంవత్సరములో జరిగిన దుస్సంఘటన ఇది.

కాలాపహాడ్ భయంకర స్మృతి, ఆ సందర్భములో బిళర్ మహాంతి ప్రదర్శించిన నిర్భయత్వము ఇవి నేటికి కథలుగ మిగిలిపోయినవి. కాని ఆ రోజులలో ఈ యదార్థ గాథలు ఉత్కళ దేశములో మూల మూలలా ప్రళయమును సృష్టించినవి. అయినా ఆ రోజులలోగూడ నీచ విశ్వాస ఘాతుకత్వమునకు ఒడిగట్టిన క్షుద్రస్వార్థముతో కూడిన దేశద్రోహ కరవాలము అఖిల ప్రమైన ఉత్కళదేశ ఇతిహాసములో స్వైర విహారము చేసినది. రాజూఖాన్ కాలాపహాడ్ ప్రదర్శించిన వీరత్వము ధైర్యసాహసముల వలన కాదు, కేవలము సారంగగఢ్ దుర్గాధిపతి రామచంద్రభంజ్ యొక్క హీన విశ్వాసఘాతుకత్వము వలననే ఒరిస్సా చరిత్రలో దుర్యోగపుటవనిక జారినది. కాలాపహాడ్‌తో యుద్ధముచేస్తూ గజపతి ముకుందదేవు వీరస్వర్గమును అలంకరించియుంటే విచారించవలసిన పని ఉండేదికాదు. కాని చారిత్రిక విడంబనము వలన ఆతతాయి రామచంద్రభంజ్ వెనకనుండి దెబ్బతీయడము వలన ఆయన మరణించినాడు.

కటక్‌లో అధికారమును చేజిక్కించుకొన్న తరువాత కాలాపహాడ్ దృష్టి పూరీక్షేత్రము మీదకు మరలినది. శ్రీమందిరము మీద దాడి, జగన్నాథునికి అవమానము తప్పవని పరీఛా దివ్యసింహదేవ్ గ్రహించి మొదటనే జాగ్రత్త వహించినాడు. కాంచీనదీ మార్గమున చిలికా సరస్సు ముఖద్వారము వద్దనున్న ఛపాలీ హాథీపడా గ్రామమునకు దైవ విగ్రహములను ఆయన తరలించి 'పాతాళి' చేసినాడు కాని దానపహాంతానింహా సహాయముతో కాలాపహాడ్ ఆ రహస్యమును తెలిసికొని ఆ విగ్రహములను స్వాధీన పరచుకొని, వాటిని ఏనుగుమీద వ్రేలాడదీయించి గౌడ మార్గమున తీసికొనిపోయినాడు. హిందూ జగత్తుకు శిరోమకుటమైన ఆ విగ్రహమును ఒక కర్రముక్కను కాల్చినట్టు కాల్చి బూడిద చేయవలెనని అతడు అభిప్రాయపడినాడు.

ఆ రోజులలో స్వతంత్ర శక్తిగల రాజు ఒరిస్సాలో లేడు. ప్రజాశక్తి కుంటుపడినది. కాలా పహాడ్‌ను నిరోధించుటకు గాని, జగన్నాథుని ఉద్ధరించుటకు గాని నిర్భయుడైన పురుషుడు ముందుకు రాలేదు. 'అయ్యో, అయ్యో!' అన్న వ్యర్థ ఆర్తనాదములు ఒరిస్సాలో ఇంటింటా చెలరేగినవి. ధాజూఖాన్ కాలాపహాడ్ తోలు పటకాతో జగన్నాథుని ఏనుగుకు బంధించి బడ్‌దాండ్‌మీద తీసికొని పోతూ ఉంటే వితంతువుల అసహాయ ఆర్తనాదములవలె అవి నిష్ప్రయోజనములు అయినవి.

కాని ఆనాడు అసహాయుడు, అజ్ఞాతుడు, కంకాళసమశరీరుడు, శుష్క-విషాదవదనుడు అయిన బిశర్ మహాంతి ఒక క్షుధిత బిక్షుకునివలె జగన్నాథుని అనుసరిస్తూ మొగల్ సేన వెనుక గౌడ మార్గము మీద నడచి వెళ్ళినాడు. పొడుగుపాటి కాషాయరంగు చొక్కా తొడుక్కొన్నాడు. నుదుట నామము పెట్టుకొన్నాడు. తలకు దుప్పటిని పాగగ చుట్టుకొన్నాడు. మెడలో ఒక మృదంగమును వ్రేలాడవేసికొన్నాడు. ఇదీ ఆయన వేషము. ప్రసన్న చిత్తముతో ఆయన భజన సంకీర్తనలు పాడుతూ, మృదంగము వాయిస్తూ వారి వెంట నడుస్తున్నాడు.

'దేఖో శూన్యదేహీ హుయే శూన్యరే
శూన్య మందిర్‌తో నిద్రిత్ పడా హై
శూన్యమే లగీ హై లీలారే.....
మన్.....దేఖ్ రే.....'

"చూడుమురా! అంతా శూన్యమురా!
ఆత్మ శూన్యమైనదిరా! ఆది మాయమైనదిరా!
శూన్య మందిరము నిద్రిస్తున్నదిరా!
శూన్యములోనే లీలలు జరుగుతున్నవిరా!
చూడుమురా! మనసా, చూడుమురా!"

ఇలా పాడుతూ నడుస్తున్న బిళర్ మహాంతిని గురించి పఠాన్ సైనికులు ఏమి పట్టించుకొనలేదు. వైష్ణవు డెవడో ఇంటికి తిరిగి వెళుతున్నాడని వారు భావించినారు. అందులన వారికి అతనిని గురించిన కుతూహలమే కలుగలేదు.

"బిళర్ మహాంతికి మతి చెడినదా?" అని అతనిని ఎరిగినవారు అనుకొన్నారు.

"ఇది కూడా ఆ యిచ్ఛామయుడైన శూన్య పురుషుని ఇచ్ఛే. తన ఇచ్ఛతోనే, తనంతట తానే తోలు పటకాతో బంధితుడయినాడు. గౌడ మార్గమున తన ఇచ్ఛాపూర్వకమగానే ఈడ్పించుకొంటున్నాడు. అయినా ఇచ్ఛ కలిగిననాడు తనంతట తానే తిరిగివస్తాడు" అని పిచ్చివానిలాగ ప్రజలతో చెప్పుతూ వెళుతున్నాడు.

మఠం మృదంగము వాయిస్తూ పాడనారంభించినాడు.

"శూన్య మఠ్‌కే ఘర్ మచీహై
చహల్ అనాహత ధ్వనినాద్ రే
మన్ సునో రే!....."

"శూన్యము మథించినదిరా
సంతోషము ఆవరించినదిరా
అనాహత ధ్వని నాదమురా
ఆలకించుమురా ; మనసా
ఆలకించుమురా !....."

బిశర్ మహాంతి ఈ విధముగా పాడుతూ, మృదంగము వాయిస్తూ భజన చేస్తూ ఉంటే ఆ దుఃఖపూరిత వాతావరణములో గూడ ప్రజలు నవ్వకుండా ఉండలేకపోయినారు.

"నిజమే! బిశర్ మహాంతి నిజముగా పిచ్చెత్తిపోయినాడు," అని ప్రజలు వారిలో వారు అనుకొనడము ప్రారంభించినారు.

ఆ తరువాత వారి దృష్టి జగన్నాథునిమీద పడినది. తోలు పటకాతో జగన్నాథుడు ఏనుగుమీద ప్రేలాడుతున్నాడు ఓడ్రప్రజల ఇష్టదైవమైన జగన్నాథుడు గౌడ మార్గమున అత్యంత శోచనీయమైన విధముగ కొనిపోబడితే ప్రజలు మొగల్ రాజశక్తిని అంచనా వేసికొనగలరని కాలాపహాడ్ భావించి నాడు.

దారి కిరువైపుల ఆబాల వృద్ధులు సురక్షితమైనంత దూరములో గుంపులు గుంపులుగ నిలుచుని ఆ హృదయ విదారకమైన దృశ్యమును అసహాయులై చూస్తున్నారు. ఎదురు చెప్పే ధైర్యముకాని, అడ్డు నిలిచే శక్తికాని వారికి లేవు. కండ్లలో అశ్రువులుకూడ ఇంకిపోయినవి. హృదయావేదన మాత్రము వారిలో నిలిచిపోయినది. వారి కోమల హృదయ తంత్రులను ఎవరో ఇనుప గదలతో మోదుచున్నట్లు, ఛిన్నాభిన్నము చేస్తున్నట్లు బాధపడసాగినారు. ఏనుగు మలుపు తిరిగి కనుమరుగై పోతున్నప్పుడు ప్రజలు మెదలు వైకెత్తి చూడడము మొదలుపెట్టినారు. బహుళా అది ఆ శ్యామసుందరుని అంతిమ దర్శనము కాబోలును.

కాని బిశర్ మహాంతి వెళుతూ "మథురా మార్గమ్ మీద శ్రీకృష్ణుని అక్రూరుడు ఇదే విధముగ ఈడ్చుకొని వెళ్ళలేదా? శ్రీరామచంద్రుడు వనవాసము చేయలేదా?" అని అందరకూ వినిపించేటట్టు అంటున్నాడు.

గౌడలో గంగాతీరమున ఆ దారు విగ్రహమును అగ్నికి ఆహుతి చేయ వలెనని కాలాపహాడ్ మంట పెట్టించినాడు. అదేమి విచిత్రమైన దారువో కాని మంటలో అది కాల లేదు. ఏడు తాటిచెట్ల ప్రమాణములో మంటలు ఎగసినవే కాని విగ్రహము దగ్ధము కాలేదు. దానితో వివశుడైన కాలాపహాడ్ మండిపడి ఆ విగ్రహమును గంగపాలు చేసినాడు.

ఆ సదవకాశము కొరకే బిశర్ మహాంతి అక్కడ వేచియున్నాడు అర్ధ దగ్ధమైన జగన్నాథ విగ్రహమునుండి బ్రహ్మమూర్తిని వేరు చేసి అతడు దానిని తన మృదంగ సంచీలో దాచిపెట్టినాడు.

ఆ తర్వాత అతడు భూమార్గమున తిరిగి వెళ్ళుటకు సాహసించలేదు. ఇంత కష్టపడి సంపాదించిన దానిని శత్రు సైనికులు పసికట్టి బలవంత ముగ లాగుకొనిపోతే; ఎన్నో యుగముల దుర్లభ సంపదవంటి ఆ బ్రహ్మ మూర్తిని మృదంగ సంచిలో భద్రపరచి ఓఢ్ర దేశమునకు మరలిపోతున్న ఒక 'బోయిత్'లో ఎక్కి చాల రోజుల తరువాత ఎక్కడో కుజంగ్ చేరుకొన్నాడు. అక్కడనుండి ఒక దస్యునివలె ఖోర్ధాకు బయలుదేరినాడు.

చాలా కాలము ఆరాచకత్వము ప్రబలిన తర్వాత భోయీ వంశమునకు చెందిన రామచంద్రదేవుని ఒరిస్సా నాయకునిగ పాత్రోలు ఎన్నుకొని అతనిని సింహాసనారూఢుణ్ణి చేసినారు. మానసింహుని అభయముతో ఉత్కళదేశములో మరల శాంతి నెలకొన్నది.

రామచంద్రదేవ్ నిజముగ ప్రభు సేవకుడే. కాని సింహాసనము మీద ప్రభువు ఏడి? జగన్నాథ ప్రభుని సింహాసనము శూన్యముగ సున్నదే? ఇకి ఉత్కళ దేశములో రాజత్వము ఎలా ఉంటుంది? భగ్న పరిత్యక్తమైన

దేవాలయములోని ప్రతిధ్వనివలె ఉత్కళ హృదయాంతరాళములో "జగన్నాథ్ ! జగన్నాథ్!" అన్న ఆక్రందనమే ప్రతిధ్వనించినది.

ఆ సమయములోనే జగన్నాథుని బ్రహ్మమూర్తిని తీసికొని బిశర్ మహాంతి రహస్యముగ భోర్డా చేరుకొన్నాడు. జగన్నాథుడు తన ఇచ్ఛాను పూర్వకముగ ఒరిస్సాకు మరలివచ్చినాడు. ఇంటింటా వేడుకలు, ఉత్సవములు జరిగినవి.

ఇంతటి చారిత్రాత్మక కార్యమును నిర్వహించిన బిశర్ మహాంతి మనస్సులో గర్వము కాని అహంకారము కాని లేవు. ఆ ఇచ్ఛామయుడు తన ఇచ్ఛానుసారము సాధువుల బోయిత్‌లో ప్రయాణము చేశాడు. ఆ తర్వాత ఎంతో మంది రైతుల ఇండ్లలోను, గృహస్థుల ఇండ్లలోను, గోడల మేకులకు ఆయన వ్రేలాడి వచ్చినాడు. అదంతా ఆయన ఇచ్ఛ ప్రకారమే జరిగినది. బిశర్ మహాంతి కేవలము ఒక నిమిత్తమాత్రుడు. అతనికి ప్రతిఫలాపేక్ష ఏమైనా ఉన్నట్లయితే మృదంగ గలీబుకు, బోయిత్‌కు, ఇండ్లపై కప్పులకు, గోడ మేకులకు గూడ ప్రతిఫలము లభించవలసి ఉంటుంది.

సరి క్రొత్తమూర్తిని ఏర్పరచి, శూన్యమైన రత్న సింహాసనముపైని దేవతా విగ్రహములను ప్రతిష్టించ వలెనన్న ఉద్వేగముతో ఆ చివరినుండి ఈ చివరి వరకు ఉత్కళ దేశమంతా ఆలోడిత మయినది. కాని ఎన్ని పరిశోధనలు కావించినా శాస్త్రోక్త లక్షణ సమన్వితమైన దారువు లభించలేదు. చివరకు ఇప్పుడు దధివామనాలయమున్న చోట కొద్దిగ నీలవర్ణములో నున్న దారువు జాడ కనుపించినది. నిర్జనమైన ఒక అడవిలో పంచ శాఖలుగల మహా నింబ వృక్షము ఒకటి ఉన్నది దానిపైన శంఖ చక్ర చిహ్నములు ఉత్కీర్ణమై యున్నవి. ఆ వృక్షము క్రింద పురాణ వల్మీకము ఒకటున్నది. అది చాల ఎత్తైనది. ప్రతి ఉదయము ఒక మహానాగము ఆ పుట్టలోనుండి వచ్చి పడగ విప్పి ఆడుతూ ఉండేది. అందువలన దాని స్మృతి చిహ్నముగ అక్కడ దధివామనాల యమును, బ్రహ్మపుర్ గ్రామమును రామచంద్రదేవు నిర్మించినారు. బిశర్ మహాం

తిని 'గఢ్‌నాయక్' బిరుదుతో రామచంద్రదేవు సత్కరించినారు. ఆ ఆలయ నిర్వహణ భారమును బిశర్ మహంతికి ఆయన అప్పగించినారు. మూడు వందల అరువది బీఘాల భూమిని ఆ ఆలయ నిర్వహణకు ఏర్పాటు చేసినారు.

సింహల బ్రహ్మపురి, దధివామనాలయముల సంగ్రహ చరిత్ర ఇది.

ఆ నాటి నుండి నేటివరకు ఐదు తరములవారు సింహాల బ్రహ్మపురి మఠములో భోగము సమర్పిస్తూ వస్తున్నారు. బిశర్ మహంతి మొదలుకొని కుంజ గఢ్ నాయక్ వరకు ఐదు తరముల కాలములో గడచిన ఆ సుదినములు అస్తమించినవి. మొగల్ నాయబ్-నాజిమ్‌ల కాలము ప్రారంభమయిన నాటినుండి ఖండాయత్‌గఢ్ నాయకులను అనేక విధములుగ హింసిస్తూ, ఒరియా పాయిక్‌ల నడుముల విరుగగొట్టే ప్రయత్నములు కొనసాగుతూనే వున్నాయి.

హిందూ జనవాసములను మట్టుపెట్టి ముస్లిం జనపదములు తలలెత్తడము ప్రారంభమయినది. పఠాను సైనికులకు భూవసతులను కల్పించి వారు సుఖముగ జీవించుటకు వ్యవసాయ సదుపాయములు గూడ వారికి ఏర్పరచబడినవి. అందువలన శిస్తులేని దేవాలయ భూములను వీరికి పంచి ఇవ్వడము జరిగినది. ఈ విధముగనే సర్ధాపుర్, ముకుందపుర్, దివ్యసింహపుర్, రధీపుర్, బోల్‌గఢ్, బలరామ్‌గఢ్, కాయిప్‌దర్ మొదలైన శాసనములను, చౌపాఢీలను చుట్టుముట్టి ముసల్మానులు వారి జనపదాలను నిర్మించుకొన్నారు. ఈ కారణముగ దేవాలయ భూములలో చాల భాగము గఢ్ నాయకుల ఆధీనమునండి చెయ్యి జారిపోయినది. కుంజగఢ్ నాయకుని కాలమందుండిన మూడు వందల అరువది బీఘాల భూమిలో ఇప్పుడు ఏబది బీఘాల భూమి మాత్రమే మిగిలియున్నది. అందువలన ద్వాదశ పర్వములను, ఇతర ఉత్సవములను దేవాలయములో నిర్వహించడము కష్టముగనున్నది. అయినప్పటికిని కుంజగఢ్ నాయక్ తాను పస్తుండి అయినా ఆ ఉత్సవములను ఏదో విధముగ నిర్వహిస్తూ వచ్చినాడు.

దధివామనాలయ నిర్మాణము ఫలకముల పద్ధతిలో జరిగినది. ఈ పద్ధతిలో ఆలయ భాగములు ఒక దానిపైని ఒకటి నిర్మింపబడుతవి. దీనిలో శిల్పికళ

సూక్ష్మ పద్ధతిని ఉండదు. ప్రధానముగ సూర్యవంశ రాజుల కాలములో ఆలయ నిర్మాణము పట్ల ఆంత శ్రద్ధ లేకుండెను. కోణార్క్ దేవాలయ నిర్మాణానంత రము ఓడ్ర రాజులలోను, శిల్పులలోను ఉండిన ఆ తీరని తపన తగ్గుముఖము పట్టినట్లయినది. సూర్యవంశ రాజుల కాలములో నూతన ఆలయ నిర్మాణమునకు అవసరము ఎంత ఉండినను ప్రాచీన దేవాలయములను మత విద్వేషుల దాడుల నుండి రక్షించుటకు జాగ్రత్త వహించ వలసిన అవసరము ఎక్కువయినది. అయినప్పటికిని సింహల బ్రహ్మపురి దధివామనాలయ నిర్మాణమునందు చూపిన ప్రకారమే ఇతర దేవాలయ నిర్మాణములలో కూడ రాజులు కళాత్మక పద్ధతికన్న వ్యావహారిక పద్ధతినే ఎక్కువగా ప్రదర్శించ వలసి వచ్చినది. దధివామనాలయము కూడ ఫలకముల పద్ధతిలోనే నిర్మించబడినది. దాని ప్రాచీరముల మీది జంఘా, సాకర్ బాదండి, నికర్, సప్రకాస్ మొదలగు వాటిమీద ఏ విధమైన సూక్ష్మ శిల్పకళ కూడలేదు. పునాదులలో నుండి నిర్మింపబడిన స్తంభముల ఎత్తు సుమారు ముప్పది మూరలు ఉంటుంది స్తంభముల మధ్య భాగములో పూవులు, నృత్యాంగనలు వనలతల శిల్పములు అసంపూర్ణముగ నిలిచిపోయినవి. కాని కాలక్రమేణా నాచు పేరుకొని పోయినందున అవి కూడ మరుగు పడినవి. ఫలకముల మీద కేవలము సింహములు, ఏనుగులు, ఆశ్వములు, మర్కటములు, వృషభములు, మకరములు, ఆక్కడక్కడ అలసత్వపు కన్నెల శిల్పములు ఉన్నవి. శ్రీ నుండి కలశము వరకు ఉన్న విభిన్న అంశములలో కర్పూరి, డోరీ, పత్రలత, ఆమ్లా బేకీ మొదలగు శిల్పములు పరంపరాగత పద్ధతిలో ఉన్నవి. స్థూలముగా చెప్పవలెనన్న ఈ ఆలయము నిర్మాణ కౌశల దృష్టితోను, శిల్పకళా నైపుణ్య దృష్టితోను చూసిన యెడల ఉల్లేఖనీయ మైనది మాత్రము కాదు. ఆలయ విమానము నంటి 'జగ్‌మోహన్' మూర్తి ఉన్నది. ఆలయ నిర్మాణము జరిగిన చాల కాలము తర్వాత కుంజగ్ధ్ నాయకుని ముత్తవ్వ ఈ ఆలయములో నృత్యాలయమును నిర్మించుటకు పునాది వేసినది. కాని అది కూడ అసంపూర్ణముగ నిలిచి పోయినది. జగ్ మోహన్ ఆలయమునకు వెళ్ళే మార్గములోనే ఈ పునాది ఉన్నది. ఆలయమునకు నలుదిక్కులను విభిన్న స్థలములందు వివిధ దేవీ దేవతల విగ్రహములను

ప్రతిష్ఠించిన గూళ్లు ఉన్నవి. వాటిలో అష్టభుజ దుర్గాదేవి, గణపతి, కార్తికేయుడు, కంకాళి, వరాహుడు మొదలగు దేవీ దేవతల నల్ల చలువరాతి విగ్రహములు సిందూర లిప్తమై ఉన్నవి. కాని ఈ విగ్రహములను ఇతర స్థలములనుండి సంగ్రహించి ఇక్కడ స్థాపించినట్టుగా సాధారణులు గూడా గ్రహించగలరు. ఎందువల్లననగా వాటిలోనున్న సూక్ష్మ కళా విశిష్టత ఆలయములో మరి యెక్కడను కానరాదు. ఆ సుందర ఆలయ ప్రాచీరము విశాలమైనది. దానికి ఉత్తర దిక్కున ఒక సురక్షిత పుష్పోద్యానవనము ఇప్పటికీ ఉన్నది. జగన్నాథ వల్లభము అని దానిని స్థానిక నివాసులు అంటూ ఉంటారు. ఈ తోటలోని పూవులను స్వయముగ తన చేతులతో సేకరించి, మాలగ్రుచ్చి పూజాసమయములో దానిని దధివామనునికి సమర్పించడము కుంజగర్ నాయకుని నిత్యకృత్యము అయినది. ఆలయమునకు దక్షిణమువైపున పుష్కరిణి ఉన్నది. దాని సమీపములోనే సరకుల కొట్టు, వంటశాల శిధిలావస్థలో నున్నవి. కుంజగర్ నాయకుని కాలములో రాజా యొక్క భాగ్య విపర్యయముతో బాటు ఈ దేవాలయ స్థితి కూడ జరాగ్రస్తమయినది. కాలానుగతమయిన ఘాత ప్రతిఘాతముల వలన కుంజగర్ నాయకుని జీర్ణ, దుర్బల శరీరము విల్లువలె వంగి పోయినది. ఆ విధముగనే ఆలయము కూడ గుల్మాచ్ఛాదితము, శైవలాచ్ఛన్నము అయి దానివైన జరాగ్రస్త చిహ్నములు స్పష్టముగ గోచరిస్తున్నవి. కాని భక్తి విశ్వాసముల మేరువు వలె ఆ దేవాలయము ఒక అచలాయతనము వలె నిల్చుని ఉన్నది.

మఠము పరిస్థితికూడ ఆ విధముగనే ఉన్నది. ఏనుగువంటి ఎత్తైన మట్టిగోడ అనేక చోట్ల కూలిపోయినది. ఆశ్రద్ధ వలన సంరక్షణ లేక అది సగమునకు పైగ కూలిపోయినది. స్నానముల చెరువు ఆకులతో నిండిపోయినది. అది ఒక కూపమువలె ఉన్నది. ఆ చెరువుకు నలువైపులా ఉన్నతోట అనేకమైన పనికిరాని చెట్లతోను, మొక్కలతోను ఒక అడవిలాగ తయారయినది రథమును లాగుటకు గాను ఏనుగులు ఉన్నవి. దేవతలకు, గర్ నాయకునికే తిండి కొరత ఏర్పడినప్పుడు ఆ రెండు ఏనుగులకు తిండి ఎక్కడ లభిస్తుంది? అందువలన ఆ రెండూ కూడ తిండిలేక అస్థిపంజరములవలె తయారయినవి. అయినప్పటికిని

రథ యాత్ర సమయములో వాటికి జరీవస్త్రములు, అలంకారములకు లోపము లేదు. రథము దారిలో ఎక్కడా ఆగ వలసిన అవసరము లేదు. కనుక వాటికి రథమును లాగ వలసిన పని తగలడము లేదు.

కుంజ్‌గఢ్ నాయకునికి కుమారులు లేరు. ఏకైక పుత్రిక దుర్గేశ్వరి తప్ప వేరొక సంసార బంధనము ఆయనకు లేదు. యమునా ఝుండ్‌పడా వైరీశల్స్ కుటుంబముతో ఆమెకు ఎంతో ఆడంబరముగ వివాహము జరిగినది. కాని ఒక సంవత్సరమైన గడవకముందే ఆమె తన మాంగల్యమును కోల్పోయి తిరిగి పుట్టింటికి వచ్చినది. తన ఏకైక గారాబు పట్టి యొక్క శోకాకులాక్రందనము అతడు భరించలేక దధివామనాలయములో మూడు పవళ్ళు మూడు రాత్రుళ్ళు నిరశనుడై ఆకలిదప్పులతో గడిపినాడు. అతని హృదయము స్పందించినది. "హే జగన్నాథా! చివరకు నీవు బిశర్ మహంతి వంశమునే నాశనము చేసినావా!" అన్నాడు. అది ఒక ప్రార్థనకాదు. అది యాచనకాదు .అది యొక అభియోగము. "బిశర్ మహంతి నీ మానమును రక్షించినాడు కదా! అందుకని పరలోకములో అతనికి ఒక నీటిబొట్టును ఇవ్వడానికైనా నీవు ఎవరిని మిగల్చకుండా చేసినావు, " అని అతడు అన్నాడు.

, చివరకు మూడవనాటి రాత్రి కుంజగఢ్ నాయకునికి ఒక స్వప్నాదేశము వచ్చినది ఆ దారుమూర్తి ఆయనముందు ఆకలిలో ఆవిర్భవించి "నా ఆశ్రయము పొందినవారు ఏడు తాళ్ళలోతు గల నీటిలో మునిగిపోతారు నీవైతే మునిగిపోయే ఉన్నావు. ఇంక ఈ క్షోభ దేనికి? వెళ్ళు, నీ మఠమునకు మరలిపో!" అని ఆదేశించాడు.

ఆ తరువాత కుంజగఢ్ నాయకుడు తన దుఃఖమును విస్మరించి మరలి వచ్చినాడు. కాని ఆయన మూగవాడైనాడు. ఆయనకు బ్రహ్మచెవుడు వచ్చినది. చేరువలో పిడుగు పడినా ఆయనకు వినిపించేది కాదు. దుర్గేశ్వరి హృదయ విదారకమైన రోదనము కూడ ఆయన చెవులకు సోకేది కాదు. ఆయన భార్య గతించి చాలాకాలమయినది దధివామనుని కొరకు పూలమాలలను తయారు చేయడము,

ఆలయమును శుభ్రము చేయడము తప్ప ఆయనకు వేరుపని లేదు. ఆయన నేత్రములు శిశు నేత్రములవలె ప్రకాశవంతముగను, నిర్మలముగను తయారైనవి. ప్రభాత భాస్కరుని కిరణ కాంతివలె ఆయన కండ్లలో ఆనంద స్పర్శ ఉన్నది. నొసటి కుంచిత రేఖలు కూడ కోమలముగకనబడుతున్నది. ఆయన పూర్తిగ శోక సంతాప రహితుడైనాడు.

ఇప్పుడు దధివామనాలయ ప్రాకారముమీద పడుతున్న సమ్మెట పోటుల ధ్వనులు యావత్ సింహల బ్రహ్మపురి గ్రామ ప్రశాంత నిశ్శబ్ద వాతావరణమును ప్రతిధ్వనింప జేస్తున్నప్పటికీ కుంజగర్ నాయకుని మనస్సులో ఏ విధమైన ప్రతిక్రియ లేదు. బహుశా ఆయనకు ఆ ధ్వనులు వినబడి ఉండవు. ఆయనకు ప్రియాతి ప్రియమైన ఆ ఆలయము ముక్కలు ముక్కలుగ ధ్వంసమౌతున్నప్పటికీ ఆయన ముఖములో విషాద చ్ఛాయలు గోచరించలేదు. అసలు ఏమి జరుగుతున్నది ఆయనకు ఆర్థమయినట్టు లేదు. బధిరత్వపు అగాధ ప్రశాంతిలో ఆయన నిమగ్నుడైనట్టు ఉన్నాడు. ఆయన తన నిత్యకృత్యముగ మఠము వద్ద కూర్చుని దవనపు మాలలు కడుతున్నాడు.

2

పశ్చిమాద్రిలో సూర్య భగవానుడు అస్తమిస్తునాడు. ఆలయమును కూల గొడుతున్నవారు అలసిపోయినారు. నైరుతి మూలలో కర్పూరీవద్ద పాముల వలె వంకరగా ఏర్పడిన పగులు వద్ద అనేక సమ్మెట వేటుల మూలముగ కొన్ని రాళ్ళు ఊడివచ్చినవి. ఆలయమును ఆక్రమించుకొని ఉన్న శతాధికము లైన కపోతములు సమ్మెట ధ్వనులకు భయపడి నరేంద్ర పుష్కరిణిచుట్టూ ఆలయ గుమ్మటముపైన, దూరముగా నున్న పొలములపైని, చేరువుగ నున్న అడవి చుట్టూ విహరించి తిరిగి వచ్చి ఆలయ శిఖరము పైని వాలుతున్నవి. లక్షలాది

ఆహూతమఁ ను తిన్నప్పటికీ భక్తి విశ్వాసములకు ఆలవాలమైన ఆ ఆలయము కూలిపోదన్న నమ్మకము వాటికి బహుశా ఉన్నదేమో! ఆకపోతముల కుహూ కుహూ నాదము ఆ ఆలయ వినాశకుల తుచ్ఛ ప్రయత్నమును పరిహసిస్తున్నట్టుగ ఉన్నది. ఆలయమునకు చేరువగ రెండు వృద్ధ వృక్షముల మధ్యను పంకిలమై ఆచంచలముగ నిద్రిస్తున్న చందన పుష్కరిణిని మేల్కొలుపు తున్నట్టుగ దానిపైన రెండుమచ్చరంపూపక్షులు విహరిస్తున్నవి. ప్రాచీరమును పగులగొట్టకేక దానిప్రక్కనున్న విగ్రహములను పగులగొట్టుటకు కూలీలు ప్రారంభించినారు. అష్టభుజదుర్గనాలుగు భుజములను పోగొట్టుకొన్నది. లంబోదరుని బొజ్జ పలుచోట్ల గాయపడినది. తొండము విరిగి నేల రాలినది. వరాహుడు ఎత్తిన కాలు రెండు ముక్కలైనది.

సంధ్యాపూజకు వేళ ఆయినది ఆలయ విధ్వంస కార్యక్రమము కొనసాగుతున్నప్పటికిని ఆ నాటి ప్రభాత పూజాదులు సింహద్వారమును బంధించి నిర్వర్తించ బడినవి. కాని సంధ్యాసమయములో ఆలయములోనికి ప్రవేశించుటకు అర్చకులు సాహసించలేక పోయినారు. వారు కూడ ఇతర జనముతోకలసి కింకర్తవ్యమూఢులై దేవాలయ విధ్వంసపు నిష్ఠుర దృశ్యమును శూన్యదృష్టితో చూస్తూ నిలబడి పోయినారు.

గాజీ సుల్తాన్ బేగ్ తన పొట్టి గుర్రము మీద కూర్చుని "గట్టిగా కొట్టండి - ఇంకా గట్టిగా కొట్టండి - పగుల గొట్టండి - - - అల్లాహో అక్బర్!" అని అరస్తున్నాడు.

తట్టుమీద అసీనుడైన గాజీమియా బేగ్ భయంకర రూపమును చూచి ప్రజలు భయభ్రాంతులైనారు. కంఠమునుండి పాదములవరకు తొడుగుకొన్న నల్లని చోగాలో గాజీమియా సాక్షాత్తు యమునిలాగ కనిపిస్తున్నాడు. నలుపు, నీలము, ఎరుపు రంగుల రాళ్ల మాలను ధరించినాడు. సంధ్యా కిరణములలో అది మెరుస్తున్నది. తలమీదనుండి పాములవలె అతని శిరోజములు జడలు జడలుగ వ్రేలాడుతున్నవి. అతని నడుముపటకాలో ఒక ఖడ్గము వ్రేలాడు

తున్నది ఆ యమని గర్జనలకు అలసిపోయిన సైనికులు క్షణమాత్రము వేగ ముగ ప్రహరిస్తున్నారు. దినమంతయు సమ్మెటతోను, గునపములతోను వంద లాదిమంది కూలీలు ఆ ఆలయమును కూలగొట్టుటకు ప్రయత్నించినను అది నిశ్చలముగ నిలువబడి యుండుటను చూచి గాజీమియాఁ కిఁకర్తవ్యమూఢుడై ఆలయ శిఖరమును ఎక్కి అక్కడ నుండి పగులగొట్ట వలసినదిగా ఆదేశించుట ప్రారంభించినాడు. గాజీమియాఁ ఆదేశాన్ని అనుసరిస్తూ జహాఁబాజ్‌పుర్‌కు చెం దిన వకీరామియాఁ ఆలయగోడలకు ఉన్న గూళ్లలో కాళ్లను ఆన్చుకొంటూ పైకి ఎక్కడము ప్రారంభించినాడు ఆతనిని మరిద్దరు ముగ్గురు అనుసరించి ఆలయము పైకి ఎక్కనారంభించినారు. గోడలకు వేరుకొనిపోయిన నాచువలన వారి పాద ములు జారిపోతున్నవి. పైకి ఎక్కడమునకు వారు కష్టపడ జొచ్చినారు.

చివరకు ఎటులనో వకీరామియాఁ పైకి చేరుకొన్నాడు. ఆతనిని చూచి గాజీమియాఁ 'శబాష్-శబాష్" అని సంతోషముతో ఆతనిని అభినందించినాడు.

వకీరామియాఁ దృష్టి దేవాలయ కర్ప్పూరీ మీదనున్న కలశము పైని పడినది.

శిఖరపు ఆఁవలా బేకినుండి కర్ప్పూరీ...దాని తరువాత కలశము... సీమా రహితుడు, అనంతుడు, నిరాకారుడు అయిన ఈశ్వరుని పాదపద్మముల యందు విశ్వాసాక్తమైన హృదయపు ఉత్కట ప్రార్థన వలె ఒక సుకుమార మైన సరళత్వముతో అవి పైకి లేచి ఉన్నవి. చరిత్రలోని వందల కొలది దుర్గ తులు, విలయముల మధ్య ఈ అపరాజేయ జాతి యొక్క విజయధ్వజము వలె కలశము పైని నీలచక్రము, సుదర్శన పతాకము మంద పవనాహతికి తరంగా యిత భంగిమలో ఆనందముతో నృత్యము చేస్తునట్టుగ ఉన్నవి. క్షణ మాత్ర ములో ఆ కలశము నీలచక్రము విరిగి క్రింద పడనున్నవన్న ఊహా మాత్రము చేతనే ప్రజల హృదయములు శతశూలాఘాతముల వ్యథను పొందసాగినవి.

ప్రథమముగ కలశమును పగులగొట్టిన ఆలయమును పడగొట్టడము సులువు కాగలదు. ఆ ఆలోచనతోనే వారు ఆలయముపైకి ఎక్కి కలశముపైపు

వెళ్ళినారు. వారి పదసవ్వడికి నాచుతో నిండిన పిట్టగోడలమీది పావురములు తమ నెలవులను వీడి ఆకాశములో ఆలయముచుట్టూ ఎగుర సాగినవి. కాని ఆ అనిశ్చిత సంధ్యాకాంతిలో అవి ఎగిరి ఎగిరి అలసిపోయి మరల వాటి స్థానము లకు చేరుకొంటున్నవి.

ఆలయముమీదను త్రికోణాకారములో పెరిగిన లతలవైన కాలూని కొంద ముచ్చువలె కర్పూరీ వైపు ఫకీరామియా ఎప్పుడు ఎగప్రాకడము ప్రారంభించి నాడో అప్పుడే అతడు కలశము వద్దకు చేరుకొన్నట్లు ప్రేక్షకులు భావించినారు. అతడు గొడ్డలితో కలశమును కూలగొట్టినయెడల ; క్షణమాత్రములో ఆలయము కుప్పగ కూలిపోతుంది. అందుకు సందేహము లేదు.

ఫకీరామియా చివరి దాడిని కింకర్తవ్యమూఢులైన ప్రజలు ప్రాణములను బిగబెట్టి క్రిందినుండి చూస్తున్నారు. ఉత్తేజితుడైన గాజీమియా 'అల్లాహో అక్బర్ !' అని అరవడము మరచి చూస్తున్నాడు. దర్శకుల శూన్య దృష్టిలో ఉద్వేగపూరితమైన భయము గూడుకట్టుకొంటున్నది. కాని ప్రేలు ఎత్తి ఫకీరా మియాను ఆగమని చెప్పేసాహసము వారిలో ఎవరికిని లేదు. గతములో అనేక అత్యాచారములను, ప్రపీడనలను సహించి సహించి ఉన్న వారి మనోబలము అసంఖ్యాకములైన దేవాలయములు, దేవతా విగ్రహముల వలె కుప్పకూలి ఉన్నది.

అంతేకాదు, గొడ్డళ్లు, సమ్మెటలు ధరించి ఆలయముచుట్టూ ఉన్న గాజీ సుల్తాన్‌బేగ్ అనుచరులు ఏక్షణములోనైన మతోన్మాదులై నిచమునకు పాల్పడ తారన్న ఊహకూడ అక్కడున్న ప్రజలకు కలుగలేదు. ఈనాడు ఈ విధముగ ఆలయమును విధ్వంసము చేస్తున్నవారే రెండుమూడు తరముల క్రింద హిందువు లతో కలిసి మెలిసి ఉంటూ ఈ భూమి, దీని జనశ్రుతులు, దీని ప్రవాదములు, దీని పరంపరలు, దీని విశ్వాసములు, దీని పరివేశములతో ఒకటిగా కలిసి పోయి ఉంటూ ఉండెడివారు. వేషములో హిందువులకన్న కొంచెము భిన్నముగ ఉంటున్నప్పటికి హృదయములోమాత్రము మతాతీతులుగ ఉంటూ ఉండెడివారు.

కాని ఈనాడు, ఇప్పుడు, ఇక్కడ వారే గొడ్డలి, సమ్మెటలను ధరించి చీమల వలె దేవాలయమును చుట్టుముట్టినారు. కాని వారిలోకూడ ఎంతమంది వారికి తెలియకుండానే జగన్నాథస్వామివారి భక్తులయినారో తెలియదు. ముసల్మాను డైనప్పటికిని సాల్‌బేగ్ నమస్కరింప దగినవాడు. ఈ సింహల బ్రహ్మపురి గ్రామములోగూడ ఇంటింట విశేషమైన ఆనంద తన్మయత్వముతో "ఆహే నీల శయిల ప్రభల మత్తవారణ..." అని పాడుకొంటూ ఉండేవారు. యవనుడైన హరిదాసుడుకూడ ఆ రోజులలో వందనీయుడే కద?

అచ్యుతానంద గోస్వామి ప్రాసిన 'శూన్య సంహిత' లోని "తుర్కభజే అలఫ్, హిందూభజే అఖ్' అన్న పదము కేవలము గ్రంథములవరకే పరిమితము కాలేదు. అది ప్రతి ఒక ఓడ్ర పౌరుని చిత్తమునందు ప్రసారితమైనది. ముసల్మానుల అల్లా ఎలాగున నిరాకారుడో అలాగునే హిందువుల జగన్నాథుడు అలఖ్‌నిరంజనుడు. అంతా ఆ అలఖుని అంటే ఆ అగోచరుని లీల. జగన్నాథుడు అన్నా, అల్లాఅన్నా ఒక్కరే. ఈ విధమైన సమన్వయ భావన మతాంధత్వము కన్న వైకి లేచి హిందువులను ముసల్మానులను ఏకము చేసినది. ఏ కాలములోగూడ ఉత్కళదేశము మతాంధత, ధర్మాంధత, అనుదారతలకు ఆధారభూమి కాలేదు.

నాయబ్ - నాజిమ్‌లకు రాజధానియైన కటక్‌లోను ఇంకా యితర ప్రదేశములలోను పుట్టిన్న ధార్మిక ప్రతిహింసలు, మతము పేరిట జరిగిన అత్యాచారములకు సంబంధించిన హృదయ విదారకమైన గాథలు వినవస్తూ ఉండేవి. కాని వెడురు, మొగలి అడవులతో నిండి సస్యశ్యామలమై, ప్రాంతరపరివేష్టితమైన పల్లె ప్రాంతముల వరకు ఈ గాథల ప్రభావము సోకలేదు.

అంతవరకు అంతా సరిగానే ఉండినది. కాని ఏనాడైతే గాజీమియా తాను ప్రవక్త పుత్రుడనని చెప్పుకొంటూ పొట్టి గుర్రముమీద ఈ ఇలాకాకు వచ్చినాడో, ఆ తర్వాత ఒక మహమ్మదీయ పాఠశాలను స్థాపించినాడో, ఆటు పిమ్మట ఒక మసీదునుగూడ నిర్మించవలెనని భావించినాడో, అందుకుగాను

ఏనాడైతే నాయబ్ - నాజిమ్ తకీఖాన్ సమర్ధన, పిపిలీ ఫౌజ్‌దార్ సహాయమును పొందినాడో ఆనాటినుండే ఉత్కళదేశములోని పరిస్థితులు మారజొచ్చినవి. అంతవరకు సౌమ్యముగా నుండిన ఆ ముసల్మానుల మమతాభరితమైన నేత్రములు పంకిల తటాకమునలె, శ్యామలవర్ణపు వెదురుపొదలవలె అకస్మాత్తుగ కఠోరము, ప్రాణరహితము అయినవి. ఇవ్వుడు ఆర్యకళను విచ్ఛిన్నము చేయనెంచిన ఈ ఫకీరామియా ప్రతి యేడు చందనయాత్ర సమయములో అగ్ని క్రీడలో పాల్గొని అంపరి ప్రశంసలను చూరగొన్నవాడే. దధి వామనుని చందన యాత్ర సందర్భములో ఇతడు తయారు చేయుచుండిన బాణాసంచా ప్రేక్షకులను ఎంతగానో ఆకర్షించేది.

ఫకీరామియా ఆలయ శిఖరముమీదకు ఎక్కి, "ఆబే నీచే ఇదా హోకే క్యా దేఖ్‌తామ్. సావేరీ ఏక్‌తోలే ఆమ్' అని ఒరియా మిశ్రితమైన ఉర్దూలో అరిచాడు. అతని కేకలను విని ఫయాజ్‌మియాకూడ ఒక గునపమును చేత బుచ్చుకొని పైకి ఎక్కుటకు ప్రయత్నించ సాగినాడు.

ఆ సమయములో ఎవరు ఎక్కడ ఉన్నదీ వారికే తెలియుటలేదు. ఆకాల వజ్రపాతమువలె ఎక్కడనుండియో ఒక బాణమువచ్చి ఫకీరామియా శరీరములోనుండి దూసుకొనిపోయినది. ఒక క్షణము క్రితము గునపము కోసము అరచిన ఫకీరామియా చెట్టులాగ క్రిందకు కూలిపోయినాడు. అప్పటికే తట్టు మీదనుండి గాజీమియా నెత్తుటి మడుగులో నేలపైని ఉన్నాడు. ఏమైనదో, ఎట్లయినదో ఎవరికిని తెలియదు. క్షణమాత్రములో అంతా తారుమారైనది. నలు వైపులనుండి శరవర్షము కురిసినది. వాటితో బాటు 'జై జగన్నాథ్! జై జగన్నాథ్' అని నినాదములు దిక్కులు పిక్కటిల్లినట్లు ప్రతిధ్వనించినవి. వీటితో అక్కడ ఉండిన ప్రేక్షకులందరి జడత్వము వదలినది. వారు కూడ వజ్రగంభీర కంఠముతో భూనభోంతరాలు దద్దరిల్లునట్లు 'జై జగన్నాథ్' నినాదములు చేసినారు.

క్షణ కాలములో ఆలయ విధ్వంసకుల భూలుంఠిత శరీరములతోను, రాళ్ల కుప్పలతోను ఆలయ ప్రాంగణము నిండిపోయి ఒక శ్మశానమువలె తయారయి

నది. ఆలయ శిఖరముపైన ఎగురుచున్న పావురములలో మాత్రమే జీవమున్నట్లు ఆ శ్మశాన భూమిలో కనుపించినది. నిశ్శబ్ద ప్రశాంత వాతావరణములో నున్న. తన మఠమునుండి కుంజగఢ్ నాయకుడు ఆక్కడకు ఎప్పుడు వచ్చినాడో ఎవరికిని తెలియదు. ఆయన గరుడ స్తంభమువద్ద నిమీలిత నేత్రుడై నిలుచుని ఉన్నాడు. ముడుతలు పడిన ఆయన గండస్థలము పైనుండి అశ్రుధార ప్రవహిస్తున్నది. దుర్గేశ్వరి పసుపు కుంకుమలను పోగొట్టుకొని ఇంటికి తిరిగి వచ్చిన తరువాత ఆయన కంటినుండి నీరు ఎవరును చూచి యుండలేదు.

ఆశ్వికులు ఆకస్మాత్తుగ వచ్చి అసంభవమైన విషయము వలె క్షణ మాత్రములో దేవాలయమును రక్షించి, గుర్రముల మీద దౌడు తీసి సూర్యునితో పాటు పశ్చిమాద్రిలోనికి మాయమైనారు.

ఆ రాత్రి ప్రతి ఇంటా దీనినే ముచ్చటించుకొన్నారు. బిళర్ మహాంతి గౌరవ మర్యాదలను రక్షించుటకుగాను ఆ జగన్నాథుడే స్వయముగా తెల్లని గుర్రము పైన వచ్చినాడని, ఆయన వెంట బలరాముడు నల్లని గుర్రము పైని వచ్చినాడని నరి ఫఢిఆరీ ఇంటి వసారాలో భంగు నూరుతున్నవారు. చెప్పుకొన్నారు. శంఖ, చక్ర గదాధారియైన సాక్షాత్ జగన్నాథస్వామి వారిని తన కండ్లతో చూసినట్లు భంగునూరుతుండిన పఢిఆరీ అందరితోను అన్నాడు.

తన ప్రక్కనున్న వానికి చిలుము గొట్టము అందిస్తూ "అప్పటికి ఏ మాత్రము నల్లమందు పడినది పఢిఆరీజీని" అని జగు పట్టనాయక్ అతనిని ప్రశ్నించినాడు.

దానితో పఢిఆరీ ముఖము కోపముతో కంది పోయినది. అతడు భంగు నూరడము నిలివివేసి, "ఈ గంజాయి త్రాగుబోతు నేను నల్లమందు తింటానని వెక్కిరిస్తున్నాడు. ఓ వైకుంఠ! నీవు చెప్పు, ఆ నల్లనయ్యని నీవు చూడలేదూ?" అని అడుగుతున్నట్టు అన్నాడు.

భంగు నూరడము ఎప్పటికి పూర్తి అవుతుంది, ఎప్పుడు దానిని త్రాగ వచ్చునా అని ఎదురు చూస్తూ ఆక్కడ వైకుంఠ మేకాప్ ఎప్పటినుండో స్థిర

దృష్టితో కూర్చుని ఉన్నాడు. నేడు ఇంతవరకు ఒక గుక్క కూడ అతనికి లభించలేదు. గ్రామములో సంభవించిన ఆ సంఘటనల వలన అతని తల బ్రద్ద లవుతున్నది. అతడు దానిని భరించలేకపోతున్నాడు.

"అరే! ఆసలు విషయము అదే! నిజము చెప్పడానికి భయమెందుకు?" అని అతడు అన్నాడు.

"కాని మరికొందరు ఇలా కూడా అన్నారు, హాఫిజ్ కావర్‌బేగ్‌గా మారిన ఖోర్దా రాజు రామచంద్రదేవే ఆశ్వికులందరి వెనుకా ఉండి ఆలయ విధ్వంసకుల పైన శర పరంపరలను కురిపించారని" అని వైకుంత్ మరొక మాట అన్నాడు.

"కట్టిపెట్టవోయి ఈ అసందర్భపు మాటలు...రామచంద్రదేవ్ మ్లేచ్ఛ యవనుడు. అతని పేరు ఉచ్చరిస్తేనే మహాపాపము వస్తుంది...అతడెందుకు ఈ పని చేస్తాడు! స్వయముగా జగన్నాథ బలభద్రులు ఇద్దరూ స్వయముగా వచ్చి మానరక్షణ గావించారు. లేకపోతే ఆసలుకే మోసము వచ్చేది" అని పది ఆరీ అరచినాడు.

3

చికాకోల్ నుండి కటక్‌నకు వెళ్ళే మార్గమునకు ఇరుప్రక్కలా అనేక సత్రము లున్నవి. వాటిలో బాలూగాఁవ్ (గ్రామము)లోని సత్రము ఆ రోజులలో చాల ప్రసిద్ధి గాంచినది. దాని సంచాలిక సర్దేయీ పేరిట అది 'సర్దేయీ సత్రము'గ పేరు వడసినది. ఆ మార్గము వెంబడి పయనించే వ్యాపారులు, కళాసులు, తీర్థ యాత్రికులు, సిపాయీలు, ఫౌజ్‌దారు, వారూ వీరే కారు అందరూ ఆ సత్రము లోనే బస చేయవలెనని కోరుకొనేవారు.

ఆ సత్రము రోడ్డుకు కూతవేటు దూరములో ఉన్నది. అది అంత గట్టి ఇల్లు కాకపోయినా దక్షిణ ముఖముగా దానికి మూడు నాలుగు గదులున్నవి. దానికి

ముందు వైపున చికాకోల్-కటక్ మార్గము కొండచిలువవలె వంకరటింకరలు తిరిగి ఉన్నది. సత్రానికి కొద్ది దూరములో మార్గమునకు ప్రక్కగ ఒక చెరువు ఉన్నది. దాని గట్టున ఒక వట వృక్షమున్నది. బాని పేరు "హాండిభంగాబట్". వెనుక వైపున సరివి. మొగలి తరవులు, చిలికా యిసుక ప్రాంతము ఉన్నవి.

ఈ సత్రము గురించి తెలియని ప్రయాణీకులు ఎవరినైన ఏదైనా సత్రమును చూపమని అడిగినట్లయిన "అదిగో! అక్కడ హాండిభంగా బట్ ఉంది చూడండి, దాని ఎడమ ప్రక్కన సర్దేయీ సత్రమున్నది వెళ్ళండి" అని సమాధానము వస్తుంది.

చిలికా సరస్సు ఒడ్డున ఉన్న కాలికాయి దేవి దర్శనము చేసికొనుటకు వచ్చే యాత్రికులు పగటి పూటనే వస్తూ ఉంటారు. వారు ఈ వట వృక్షము క్రిందనే విశ్రాంతి తీసికొంటూ ఉంటారు. ఆందువలన అక్కడ, పొయ్యిలు, సగము కాలిన కట్టెలు, బొగ్గు, బూడిద, పగిలిన కుండలు కనబడుతూ ఉంటవి.

చిలికా సరస్సు బాగా పొంగినప్పుడు అది బాగా తగ్గే వరకు యాత్రికులు ఈ సర్దేయీ సత్రములోనే బస చేస్తూ ఉంటారు. ఇక్కడ లభించే ఆదరణ వలన, సౌకర్యములవలన ఇతర సత్రములకన్న ఈ పత్రమునే యాత్రికులు అభిమానిస్తూ ఉంటారు. ఎవరైనా సరే అక్కడ ఒక్క రాత్రి బస చేస్తే చాలును. పెద్దవారిని 'బాబుగారూ, పెద్ద నాన్నగారూ, చిన్నాన్నగారూ, మామయ్యగారూ అని, సమవయస్కులైతే బాబుగారూ, అన్నయ్యగారూ అని, చిన్నవారైతే తమ్ముడూ, అల్లుడూ, బిడ్డా, కొడుకా అని సంబోధిస్తూ యాత్రికుల నందరిని తన వారినిగా సర్దేయీ చేసికొంటూ ఉండేది. ఆడవారిపట్లకూడ ఇదే విధమైన ఆదరమును చూపుతూ ఉండేది.

బాటసారులు వంట చేసికొనుటకు, నీళ్ళు తెచ్చుకొనుటకు వలసిన పాత్రలను ఆమె ఇస్తూ ఉండేది. బియ్యము కూరలు, కట్టెలు మొదలైన వంట సామగ్రి బాటసారులకు వెలకు లభ్యమయ్యేవి. ఈ సహాయముతో పాటు ఆమె అమూల్యమైన ఆదరాభిమానములను అంద జేసేది. ఇతరుల కంటె ఆమె తక్కువ అద్దెను

పుచ్చుకొనేది. పాత్రసామానులకు, వసతికి ఆమె ఒకే ఒక కౌడీ తీసికొనేది. ఒకే ఒక కౌడీకి పాత్ర సామానులే కాక సర్దేయీ ఆదరాభిమానములు, సేవా సౌకర్యములు బాటసారులకు లభించుచుండుట వలన ఈ సత్రము ప్రశంసాపాత్ర మైనది.

కాలిజాయీ యాత్రికులే కాక అన్య గ్రాహకులు కూడ అక్కడ బస చేసెడివారు ఒక రాత్రికి ఒక కౌడీ కాదు ఎనిమిది కౌడీలు అనగా ఆ నాటి మొగ లాయీ రూపాయ వరకు ఇచ్చుటకు కూడ వారు వెనుకాడెడి వారు కారు వారి నేత్రములు ఎరుపెక్కి ఉండెడివి. వారిశ్వాస, గుండె చలనము తీవ్రముగ ఉండె డివి. దూరమునుండే సర్దేయి వారిని గుర్తించి నిండు ఆదరముతో ఆహ్వానించె డిది. ఆ గ్రాహకులలో వ్యాపారస్తులు, సాహుకార్లు, జాలర్లు నుండి సిపాయీ ల వరకు విభిన్న వ్యక్తులు ఉండెడివారు. వారు తరుచుగ గుర్రములపైన వచ్చి చేరెడివారు. వారి గుర్రములకుకూడ వసతి సౌకర్యములు, సత్కారములు లభించు చుండెడివి.

పరిచితుడైన ఏ గ్రాహకుని ఆమె చూసినా "అరే! ఇప్పుడెలా వచ్చినారు? దారితప్పి వచ్చినారా? ఈ రాత్రి పూట కూడ నా సత్రము మీకు జ్ఞాపకమున్నదే!" అంటూ ఆదరపూర్వకముగ స్వాగత మిచ్చుచుండేది. దీనితో వారిగుండె మరింత వడిగా కొట్టుకొనేది.

గ్రాహకుల సౌకర్యములను చూచుటకు ఆమె వద్ద జగుని నాయక్ అనే ఒక నౌకరు ఉండేవాడు. సత్రము వెనుక ఇసుక దిబ్బ చాటున నున్న ఒక సారా ఖట్టి నుండి అతడు సారాను తెచ్చి వీరికి విక్రయించేవాడు. వారికి వలసిన ప్రత్యేక మైన పిండివంటలు, మిఠాయిలు అతడే తయారు చేసేవాడు. దానివలన వచ్చే రాబడి అంతా అతనిదే. ఆ రాబడితో సర్దేయీకి ఏ ప్రసక్తి లేదు.

మద్యము సేవించిన వారి కండ్లు ఉల్లిపాయ రేకులవలె ఎర్ర బడేవి. నోటి వెంట నురుగు వచ్చేది. శ్వాస శీఘ్ర గతిని ఉండేది. గుండె దడ పెరిగేది. ఆ సమ యములో అవసరమును బట్టి సర్దేయీ బిందె చంక నిడుకొని హాండిభంగా బట్

చేరువనన్న చెరువుకు వెళ్లవలసి వచ్చేది. ఒక్కొక్కసారి ఎవరైనా అతిథి ఏదో కోరికతో ఆమె వెంటపడితే సర్దేయీ వెనుకకు చూడకుండానే విషయమును గ్రహించి "జగునీ! ఒరే జగునీ!" అని మామూలు ధోరణిలో పిలిచేది.

మొగలి పొదల చాటునుండి జగుని ముందుకు వచ్చి "నన్ను పిలిచావా దేయీ..." అని అన్నప్పుడు అతని వంకరటింకర పళ్ళు బయట పడేవి. ఆ భీమకాయుని చూసి ఆమెను వెంటాడే మనిషి మరి ముందుకు వెళ్ళుటకు సాహసించలేక సత్రము చేరుకొనేవాడు. అంతగా ఎవడైనా సాహసించి జగునిని లక్ష్యము చేయకుండ తన బాహుబలము మీద ఆధారపడి ఆడుగు ముందుకు వేస్తే అతడు మొగలి రేకుల ముండ్లపొద శయ్యపైని చాలసేపు పడి యుండిన తర్వాత "సర్దేయీ కుసుమము కాదని ఆమె ఒక కంటక"మని గ్రహించేవాడు.

ఒకని కంటె ఎక్కువమంది ఆమె వెంటబడితే సర్దేయీ జగునిని కేక వేసేది కాదు. ఒక్కొక్కరినే చూసి ఆదోరకముగ నవ్వేది. ఎవరికి వారే తనను చూసి నవ్వినదని భావించేవారు. ఆమె తనకొరకే నిరీక్షిస్తున్నదని భావించేవారు. ఆ పగటి కల ఉత్తేజములో ఆ తర్వాత మద్యపాత్రలు అసంఖ్యాకముగా ఖాళీ అయ్యేవి. ఆ తర్వాత వారిలో వారికి యుద్ధము జరిగేది. వారిని తిరిగి శాంతింపజేయడానికి జగుని రాక అవసరమయ్యేది.

"సర్దేయీ, జగుని-పూవు, మల్లు. వ్రేలికి మల్లు గుచ్చుకొని కూడ పూవు త్రెంచబడలే"దని రసికులు అనుకొనే వారు.

ఆ నాటి మధ్యాహ్నము సూర్యాతపతప్తులైన రామచంద్రదేవ్ నిర్జన చిలికాతటమందు పరిత్యక్తమై పాడు వడిన ఆ కుగ్రామమందు తనకు జల దానము చేసి తన ప్రాణములను కాపాడిన సర్దేయీ మ్లాన నీలోత్పల నేత్రముల నుండి ఏవేదనా భరిత దృష్టిని వీక్షించి సమ్మోహితులైరో ఆ దృష్టి నేడు కూడ కోమలముగనే ఉన్నది...మలినము కాలేదు. జీవిత నిదాఘములో నిస్సందేహముగ ఆమె దేహలత కొంత వడలినప్పటికిని సుకుమార శరీరములోని శ్యామ లత్వము మాత్రము కాంతి విహీనము కాలేదు. నాటి ఆ సర్దేయీయే నేడు ఈ సత్రమునకు ప్రత్యేక ఆకర్షణ అయినది.

చిలికా తీరమున ఆ పాడువడిన కుగ్రామములో గ్రుడ్డి, చెవిటి అయినఅత్త గారి కోసమే అమె ఉండిసది. ఆమె మరణించిన తరువాత ఆ పల్లెతో సర్దేయీ కుండిన ఆకాస్త ప్రాపంచిక సంబంధము తెగిపోయినది. ఆ రోజున శాంతి వాయువులను పీల్చి జీవితముతో యుద్ధము చేయడానికి సంసిద్ధమై బయలుదేరినది. ఆమె బాలూ గ్రామము ఎప్పుడు వచ్చినది. వచ్చి జగుని నక్షత్రములో ఎప్పుడు ఆశ్రయము పొందినదీ ఇప్పుడు సరిగా జ్ఞప్తియందు లేదు. సంసార బంధనాలను త్యజించి త్యాగి అయిన జగుని కూడ ఆమెను చూడగనే ఏ అజ్ఞాత ఆకర్షణ వల్ల ఆమెను 'దేయీ' అని సంబోధించినాడో ఆది కూడ తెలియదు.

కాని ఆ ఆర్ద్ర విస్మృత గాథను, యాత్రికులు ఎవ్వరూ లేని ఏకాంత సమయములో నక్షత్రము వసారాలోనో, 'హాండీభంగా టీ' వృక్షము క్రిందనో, చెరువు గట్టునో కూర్చుని జ్ఞాపకము తెచ్చుకొనుటకు సర్దేయీ ప్రయత్నిస్తుంది... కాని ఆమెకు ఏమీ అర్థము కాదు.

ఎక్కడనుండి, ఎప్పుడు తుపానులో కొట్టుకొని వచ్చినట్లు వచ్చి బాలూ గాఁన్‌లో జగుని పడినాడో ఆతనికి కూడ ఏమాత్రము జ్ఞప్తియందు లేదు. ఆ చరిత్ర కూడ ఆతని మనస్సులో అస్పష్టముగానే నిలిచి ఉన్నది.

"ఓరేయ్ జగునీ! నీ యిల్లు ఏ ఊళ్లో ఉందిరా? నీకు కొంచెమైనా జ్ఞాపకముందా?" అని సర్దేయీ అప్పుడప్పుడు అడుగుతూ ఉంటుంది. అప్పుడు జగుని కండ్లముందు చిలికా సరస్సులోని ఉప్పునీరు లాగ విస్మృతి యొక్క నీలవైశాల్యము ఈదులాడుతుంది.

అదే విధముగ సర్దేయీని అప్పుడప్పుడు జగుని వివరములు అడుగుతూ ఉంటాడు. అప్పుడు చిలికా సరస్సులోని అగాధ జలములమీద తేలియాడుతున్న ఏక మాత్రపు నావయొక్క చిత్రమువలె ఎదో సర్దేయీ కండ్లముందు కదలాడుతుంది. పరస్పర జీవితములకు సంబంధించిన వివిధ ప్రశ్నలకు సంబంధించిన సమాధానములు ఇద్దరి మధ్యను ప్రశ్నార్థకముగనే నిలిచిపోతున్నవి. సర్దేయీ దీర్ఘముగ నిశ్వసించేది. కాని జగుని తన పృథుల శరీరమును సర్దేయీ ఒడితో

ఇటునటు దొర్లించి "లే, దేయీ! నడు. నాకు బాగా ఆకలి వేస్తున్నది. ఇంక ఈ రోజున ఇంకెవరూ రారు." అని ఒక గారాబు బిడ్డవలె అనేవాడు.

ఆ సమయములో తన్నుతాను మరచినట్లుగా సర్దేయీ ఎదుటి రోడ్డు వైపు చూస్తూ కూర్చుండేది. జగుని మాటలు ఆమె చెవికి ఎక్కినట్టే ఉండేది కాదు. ఆప్పుడు జగుని మరింత ఆదరముతో తన తలను ఆమె ఒడిలో ఆదిసూ "విన బడలేదా? లే, నాకు బాగా ఆకలి వేస్తున్నది." అనేవాడు.

సర్దేయీ అతని కేశములను సవరిస్తూ "గంతులు ఎందుకు వేస్తావు?" అని ఆదరంగా అని "ఒరేయ్! చూడు నీ కోసమని ఒక చేపను నిప్పులో వెట్టి మరచిపోయాను. అది ఈపాటికి మాడి బొగ్గయి ఉంటుంది" అని వాస్తవ ప్రపంచములోనికి వచ్చేది.

సర్దేయీ, జగుని ఇరువురు రెండు ఎండు టాకులు. జీవితమనే వైశాఖ మాస ఝంఝూ మారుతములో ఎగిరి వచ్చి ఈ బాలూగాఁవ్‌లో పడ్డారు.

పుష్యమాసపు చెంద సాలేరీకొండ ఆవలివైపుకు దొర్లిపోయినదో లేక ఆకాశములో ఈదులాడుతున్న ధూమ్ర మేఘముల చాటున దాగున్నదో తెలియడం లేదు. పుష్య మాసపు బంగారు వన్నెపు చెంద వరి పొలములమీద కదలాడడం లేదు. అలసత్వము చెందిన నేత్రములలో నిద్ర మత్తును కలిగించడము లేదు.

ఆ కాలమందు అరణ్య సమీపములోని సస్యశ్యామల క్షేత్రములలో స్వర్ణి పుష్పములు నయనానందకరముగ ఉంటాయి. చిలుకల, అడవి పావుర ముల యితర పక్షుల కాకలి స్వరములతో నిండిన ఆ సస్యక్షేత్రములు సంగీత ముతో ప్రతిధ్వనిస్తూ ఉంటాయి. అందరు ఒక సుదినము కొరకు వేచి వుంటారు. ఆ సుదినము వచ్చిన వెంటనే గుంపులు గుంపులుగ స్త్రీ పురుషులు వరి కోత ప్రారంభిస్తారు.

కాని ఈ సంవత్సరము అవేమీ లేవు. పొలములన్నీ శూన్యముగ నున్నవి. రఘునాథపురము చెక్కలి ఏనాడు చికాకోల్ సూబాలో చేర్చబడినదో ఆ నాటి నుండి ఈ సరిహద్దు ప్రాంతములో మొగలాయి లష్కరులు, సిపాయిలు, ఆమీ

నులు మరియు ఇజారాదారుల అత్యాచారములు పెరిగిపోయినవి. ఈ ఇలాకా ఖోర్ధా రాజ్యపు చెల్లలలోనే ఉన్నది. అయినప్పటికిని మొగలాయీ లష్కరులు, యిజారాదారుల దోపిడీలను అరికట్టుటకు పాలకులలో శక్తి సామర్థ్యములు లేవు. బీడువోయిన పొలముల మధ్య చిత్రములవలె అక్కడక్కడ కనువించే గ్రామ ములు పాడు పడినవి. పొలములలో సస్యములు లేవు. రైతులు లేరు. పక్షి సమూ హములు లేవు. ఖోర్ధా రాజ్యములో సైనికవిన్యాసములు తిరిగి ప్రారంభమయినవి. మాన్యములు, వేతనములు పొందే పాయిక్‌లు ఖోర్ధా, రథీపుర్, గంజాగఢ్, శిఖపాల్ గఢ్ మొదలగు కనుమప్రాంతములలో సైనిక శిబిరములను ఏర్పచినారు. అటువం టప్పుడు వ్యవసాయము చేసేదెవరు? ఒక భరణము ధాన్యము ఖరీదు ఇప్పుడే ఇరువది కాహాణసు లైనవి. పొలములమీద దుర్భిక్షపు రెక్కలు నాడిస్తూ గ్రద్దలు ఎగురుతున్నవి.

చిలికా సరస్సు వైపు నుండి రివ్వుమంటు శీతల వాయువు వీచి వచ్చి హృదయమును కదలించి సమీపమందలి అరణ్య ప్రాంతము లోనికి పోయి దాగు కొంటున్నది. మార్గము వైన ఒక యాత్రికుడు కాని, ఆశ్వికుడు కాని, బాటసారి కాని కనబడడం లేదు. తిరిగి యుద్ధము చెలరేగ నున్నదన్న వదంతి వ్యాపించి నప్పటినుండి సాధారణ జన జీవన ప్రవాహము స్తంభించి పోయినది. ఇళ్ళు వాకి ళ్ళను వదలి పెట్టి రాజవాడలలో ప్రజలు నివసించ మొదలిడినారు. యజమానులు విడిచి పెట్టిన ఆవులు, గేదెలు అక్కడా అక్కడా సంచరిస్తూ ఎండిన మట్టిని వాసన చూస్తున్నాయి.

అందువలన కాలిజాయికి యాత్రికులు రావడము లేదు. మొక్కుబడు లున్న ఏ ఒకరిద్దరో ఏ కోడినో, మేకనో తీసికొని బాలూగావ్ నుండి నావలో వెళ్ళుతున్నారు.

మామూలుగ ప్రతి సంవత్సరము ఈ రోజులలో బాలూగావ్ యాత్రికు లతో నిండి ఉంటుంది. సత్రములోను, హాండిభంగా బట్ వృక్షము క్రిందను, ఇంకా ఇతర ప్రాంతములలోను యాత్రికులు ఎక్కువగా బస చేస్తూ ఉంటారు.

ఆ ప్రాంతములనుండి బృందములుగ యాత్రికులు ఆశ్వయుజ, కార్తీక మాసములలో బయలు దేరుతూ ఉంటారు. బాణ్‌పుర్, కళ్ళికోట, గంజాములనుండి పూరీ వెళ్ళుటకు యాత్రికులు ఈ దారులూ గ్రామములోనే శతాధికముగ ప్రోగవుతు ఉంటారు. ఇక్కడనుండి నావమీద మాణిక్‌పాటణా వెళ్ళి, అక్కడనుండి కాలినడకను వెళ్ళి శ్రీ లోకనాథస్వామి వారిని దర్శించి పూరీ చేరుకొంటారు. కంజీరా, మృదంగ వాద్య సమ్మేళనముతో కూడిన భజనలతో, నీరవమైన ఆ ప్రాంతము నూతన జీవముతో స్పందించి చైతన్యవంత మవుతుంది. కాని ఈ సంవత్సరము 'పంచక' దినములలో గూడ జరాగ్రస్తులైన కొద్ది మంది వృద్ధ విధవరాండ్రు తప్ప అక్కడ యాత్రికులే కానరావడము లేదు.

ఆ సమయమందు దేశములో ఎక్కడను యుద్ధములు లేవు. గాలివానకు ముందుండు స్తబ్ధతవలె నిశ్చల ప్రశాంతత అన్నివైపులను వ్యాపించి యున్నది. యుద్ధము రానున్నదన్న వదంతి ఎట్లు వ్యాపించినదీ, ఎవరు వ్యాపింపజేసినదీ ఎవరికిని తెలియదు. గత నూటయాభై సంవత్సరములుగ యుద్ధములను, దురాక్రమణలను, ఒత్తిడులను ప్రజలు తరుచు ఎదుర్కొంటున్నందు వలన వారి షష్ఠేంద్రియము పని చేయుట ప్రారంభించి, అర్ధచేతన మనస్సునకు భావి సూచనలు గోచరిస్తూ ఉండవచ్చును. ఆయితే రఘునాథపురము దెక్కలి యుద్ధములో రామచంద్రదేవ్ పరాజితులై హాఫిజ్ నామధేయులైన నాటినుండి యుద్ధ భయమన్నది లేనేలేదు.

సత్రము తలుపులు మూసి యున్నవి. మొగలి వనములలో ముంగిసను పట్టుకొనుటకు జగుని ఉదయమే వెళ్ళినాడు. నీళ్ళు తెచ్చుకొనుటకు చెరువుకు వెళ్ళిన సర్దేయీ బద్ధకముతో చెరువు ఒడ్డున కాళ్ళు చాచుకొని కూర్చున్నది. మేఘాచ్ఛన్నమైన ఆకాశము, మైదానములవంటి పొలములు, నిర్జన మార్గములు, చిలికా సరస్సులో మేఘముల ప్రతిబింబములు, వీటిని కదిలిస్తున్న శీతల వాయువు సర్దేయీ హృదయమును అకారణ భయముతో చలింప చేస్తున్నవి. ఒక కపోతమూ, ఒక 'డాహుక' పక్షి తమ అకారణమైన కూతలతో అరణ్య

హృదయమును ప్రతిధ్వనింప జేస్తున్నవి వాటి కూతలవలన సర్దేయాకి ధ్యాన భంగమయినది. ఆమెకూడ అకారణముగనే "...జగుసీ! ఓరే! ఓ జగుసీ...." అని పిలువ నారంభించినది. కాని ఆమెకు ఆ పరిచితమైన "నన్ను పిలుస్తున్నావా డేయీ!" అనే సమాధానము మాత్రము రాలేదు.

మార్గమునకు ఆటువైపునుండి డెక్కల అలికిడి కాళ్లు ఏదో విని వించినది.

ఆ నిర్జన మార్గమున సాధారణముగ డెక్కల ధ్వని వినిపించినంతనె సర్దేయా లేదివలె సత్రము వైపు పారిపోయేది. కాని నేడు ఎందువలననో ఆ అప రిచిత అశ్వపు టడుగుల ధ్వనికి ఆమె భయపడలేదు. ఆమె ధీర్ఘముగ నిశ్వ సించి ఆ ఆశ్వారోహకుని రాక కొరకు ఎదురు చూస్తున్నట్టుగ కూర్చునది. బహుశ: ఈ ఆస్థారహిత సంధ్యలో ఏ మానవుని వెచ్చని ఉపస్థితి నైనా ఆమె వెదకు చున్నదేమో తెలియదు.

ఆ వచ్చిన ఆశ్వికుడు సైనికుడో, సిపాయో కావచ్చును. అతడు గుర్రము పై నుండి దిగి "బాణ్‌పుర్‌కు పోయే మార్గము ఇదేనా!" అని కర్కశ స్వర ముతో అడిగినాడు.

హాండిభంగా ఒట్ వద్ద కుడివైపున పాములవలె మెలికలు తిరిగిన ఆ మార్గము బాణ్‌పుర్ వైపునకు వెళుతుంది. బాణ్‌పుర్, ఖోర్ధా అరణ్య ప్రాంతము ఆక్కడనుండే ప్రారంభమవుతుంది. సర్దేయా తలవంచుకొని నిలుచున్నది. ఆమె తన మేలి ముసుగును సంకోచముతో సరిచేసికొని "అవును" అన్నది.

ఆశ్వికుడు నెమ్మదిగ ఆమె వద్దకు వెళ్ళి "దాహము వేస్తున్నది, కానిని నీళ్లు త్రాగుటకు ఇవ్వవా!" అని అడిగినాడు

ఆ అపరిచత ఆశ్వికుని దోసిలో ఆమె ఒక చిత్రప్రతిమవలె బిందెలోని నీటిని పోయసాగినది. నీళ్లు త్రాగి ఆ ఆశ్వికుడు దౌడు తీసి వెళ్ళిపోయినాడు. గుర్రపు డెక్కల తాకిడికి రేగిన దుమ్ము ఆడవిలోని చెట్లపైన మేఘము వలె కనుపించినది. ఆ పశ్చిమ దిశను ఆకాశము రక్త వర్ణము కాజొచ్చినది.

సాయం సంధ్య మెల్ల మెల్లగ చీకటి కాజొచ్చినది. "ఒరేయ్ జగనీ!... ఓ జగనీ!" అని ఆమె పిలుస్తూ సత్రమునకు మరలినది.

"దేయీ! నేను ఎటువంటి ముంగిసను పట్టుకొని తెచ్చినానో చూడు!" అని సత్రము చేరుకొంటున్న సర్దేయీని దూరము నుండి చూసి సత్రము వసారాలో నుండి జగుని అరవడము ప్రారంభించినాడు.

జగుని లోగడ ఒక ముంగిసను పెంచినాడు. సర్దేయీ తరువాత తనది అనుకొని సంపూర్ణ విశ్వాసముతో చేరదీసిన ప్రాణి జగునికి అది ఒక్కటె. సర్దేయీ విషయములో ఎప్పుడైనా అతనికి అనుమానము కలిగినదేమో కాని ఆ ముంగిస విషయములో ఎప్పుడూ అతడు శంకారహితుడు గానే ఉండేవాడు. ఒకనాడు ఆ ముంగిస అనుకోకుండా తప్పించుకొని ఎక్కడికో పారిపోయినది. ఆ నాటినుండి మరియొక ముంగిసను పట్టుకొన వలెనని అతడు ప్రయత్నిస్తున్నాడు. నేడు తిరిగి తిరిగి ఒక ముంగిస పిల్లను పట్టుకొని అతడు దానిని ఒక పంజరములో బంధించినాడు. దానిని సర్దేయీకి చూపించవలెనన్న ఆత్రుతతోనే అతడు వసారాలో బయట కూర్చొని ఉన్నాడు. కంటకాకీర్ణమైన సహజ శ్యామలత్వములో స్వేచ్ఛానుసారము విహరించిన ఆ ముంగిస ఒక్కసారి పంజరములో బంధింపబడుట వలన అది 'చీఁ చీఁ' అని అరుస్తూ స్వేచ్ఛ కొరకు పంజరమును కొరికివేయ వలెనని పెనుగులాడుచున్నది. పంజరపు ఇనుప ఊచలను కొరుకుట వలన పండ్లకు నొప్పి కలిగి అది ఉండి ఉండి చీత్కారం చేస్తూంటే, ఊచల గుండా పచ్చి పెంటను దానికి అందిస్తూ "తినికోవే నా ముద్దుల ముంగీ!" అని దానిని జగునీ బుజ్జగిస్తున్నాడు.

కాని ఆ బుజ్జగింపును అత్యాచారముగ ముంగిస భావించినది కాబోలు అది మరింత ఆర్తనాదము చేయ నారంభించినది.

మేఘావృతమైన ఆ రోజున సర్దేయీ మానసికాకాశమున గత స్మృతులు క్రమ్ముకొంటున్నవి. ఆ స్మృతులలో ఆమె తనను తాను కొంతవరకు మరచిపోతున్నది. చెరువునుండి తిరిగి వస్తున్నప్పుడు కూడ ఆమె మానసిక స్థితి ఆవిధ

ముగనే ఉన్నది. అందువలన బహుళా ఆమెకు జగుని మాటలు వినబడకపోయి యుండవచ్చును.

చాలనేపు దూడను విడిచియుండిన ఆవు దానిని చూడగనే "అంబా! అంబా!" అనిఆరచినట్టు సర్దేయీ జగునిని చూసి "ఉదయమునుండి ఎక్కడికి వెళ్ళినావు? తిండి తిప్పలు లేకుండ ఎక్కడ తిరుగుతున్నావు? పొద్దుపోయిన తర్వాతనా తిరిగి రావడము?" అని అడిగినది.

పాకవద్ద సరివి వనములో హిమ బిందువులతో తడిసినట్లుగా ఉన్న ఆ శీతలవాయువు రిక్తప్రాణముల హాహాకారముల వలె కోలాహలము చేస్తున్నది. దానిలో కలిసిపోయిన సర్దేయీ కంఠస్వరము ఎక్కడో లీనమై పోయినది.

"ఈ దిక్కుమాలిన చలిగాలి కూడ శత్రువు వలె ఇప్పుడే తయారయినది" అని సర్దేయీ తనలో తానే అనుకొన్నది.

సత్రము చూరు క్రిందకు ఆమె తలవంచినదో లేదో "చూశావా దేయీ! నా ముంగిస ఎటువంటిదో!" అని అన్నాడు జగుని.

ఆ సమయములో అతడు పచ్చి పెంటను ముంగిస నోట్లో పెడుతూ దానిని పట్టుకొని ఉన్నాడు. నిండు నీళ్ళ బిందెను వసారాలో పెట్టి, "అరేరే! ఏం చేస్తున్నావురా? నిష్కారణంగా దానిని చంపి వేస్తావురా! ఈ చిన్న ముంగిస పిల్ల ఆ పచ్చి పెంటను తినగలదురా?" అని సర్దేయీ అతనిని మందలించినది.

"ఆయితే మరేమి తింటుంది?" అని సర్దేయీ ముఖమును చూస్తూ జగుని అడిగినాడు.

"పెద్ద ముంగిసను నీవు పట్టుకొని ఉంటే ఆ విషయము వేరు. దీనిచేత పాలు త్రాగిస్తూ ఎన్నాళ్లు పెంచగలవు? దీనికి సరిగా పాలు త్రాగడమైనా వచ్చినదో లేదో. ఒక చిన్న గుడ్డముక్కను పాలలో తడిపి ఒక్కొక్క బొట్టు దాని నోటిలో పిండితే తప్ప అది పాలనైనా త్రాగలేదు. అది చచ్చి ఊరుకొంటుంది." అని సర్దేయీ చెప్పినది.

సర్దేయా మాటలు విన్నాక చేతిలోని పచ్చి పెంటను జగుని జారవిడిచి నాడు. అది గాలికి దొర్లుకొంటూ నాగజెముడు మొక్కలవరకు పోయినది. కొన్ని క్షణములపాటు ముంగిసను మరచి మసక చీకట్లలో మసీభూతమవుతున్న ఆకాశము వైపు జగుని చూస్తూ ఉండిపోయినాడు. పశువుల నేత్రములవలె అభి వ్యక్తరహితమైన అతని సజల నేత్రములు అస్వాభావికముగా కరుణామయముగా నున్నవి. నెమ్మది నెమ్మదిగ ఇసుకలోనుండి పీతలు వాటి ముఖములను చూపిస్తు న్నట్టుగ విస్మృతులు అతని ఆర్ద్రచేతన మనస్సులోనుండి ఒకదాని వెంట ఒకటి తలలెత్తు తున్నవి. ఒకానొక దుర్భిక్ష సమయమందు ఏదో ఒక బాటవైని నిరాశ్ర యుడై వదలివేయబడిన ఒక అమాయక శిశువు...మానవుని మానవుడు చంపి అతని మాంసమును భక్షించే దినములలో ఎవరికి ఎవరు సహాయ పడతారు?

అయినప్పటికిని నిస్సంతులైన వారి ప్రాణములలో ఒకానొక అనాథ శిశువు పట్ల వాత్సల్యమును చూపగల పచ్చని ప్రేమ గలవారు ఎవరో ఒకరు తప్పకుండా ఉండగలరు. ఎవరో కథగాచెప్పగా విన్న జ్ఞాపకము. ఆ శిశువు చావు బ్రతుకులమధ్యను ఊగిసిలాడుతున్నాడు. పాలుకూడ సరిగ త్రాగలేకు న్నాడు. కొన్ని అపరిచిత ముఖములు, కొన్ని అజ్ఞాత ఉత్సంగముల వెచ్చదన ములు కూడ జ్ఞాపక మున్నవి...ఆ శిశువు'బా...బా...మా...మా'అనివచ్చీరాని పదములను ఉచ్చరిస్తున్నాడు.

ఆ దినములలో దుర్భిక్షమునకు నిత్య జీవితమునకు సన్నిహిత సాహచర్య ముంటూ ఉండినది. అందువలన కొన్ని ఏండ్లలోనే తిరిగి కరువు ప్రత్యక్షమయి నది. మొగలుల దాడులకు కరువు ఒక్కటే తోడు తక్కువయినట్లుగా ఉన్నది. కరువు యొక్క భయంకరమైన ఆకలి, మొగలుల దుండగములు-వీటి వలన ఎటు చూసినా మానవ కంకాళములే కుప్పలు కుప్పలుగ పడి యుండినవి. ఆటు వంటి దుర్భర కాలములో ఆ శిశువును చేరదీసి పెంచినవారి శరీరములు గూడ ఆ కంకాళములలో కలిసిపోయినవి. మరల ఆ బాలుడు నిస్సహాయుడైనాడు. ఆ పరిస్థితులలో ఏ దయార్ద్ర హృదయుడు ఆ బాలకుని తీసికొని వచ్చి బాలూ గావ్‌లోని ఆ సత్రపు ముదుసలి యజమానురాలికి విక్రయించినాడో తెలియదు.

అప్పుడు ఆ కుర్రవాడు పది పన్నెండేండ్లవాడు. ఆ కరువు రోజుల్లో ఈ విధముగా కుర్రవాళ్ళను కొని విదేశములకు బానిసలుగ పంపడము ఒక లాభదాయకమైన వ్యాపారముగ కొనసాగుచుండినది.

బాలూగాఁవ్ లోని ఆ సత్రపు ముసలి యజమానురాలు కూడ ఈవ్యాపారము చేయుచుండినది. ఆ సత్రములోని ఒక గదిలో శ్రామ పీడితులైన బాలబాలికలు శల్యావశిష్టులై నరమాంస భక్షకులైన వర్తకుల కొరకు వేచి యున్నారు. ఆకలికి అలమటిస్తూ, విప్పారిన శూన్య నేత్రములతో విదేశ ప్రయాణము కొరకు ఎదురు చూస్తున్నారు. ఆ వద్దురాలి రాక్షస ముఖము నేటికికూడ జగునికి జ్ఞాపకమున్నది. ఆమెది బోడితల. గుహలవలె లోతుగనున్న ఆమె కండ్లపైన పండిన కనుబొమలు, పై పెదిమ వెనుక ఒకటి రెండు వ్రేలాడుతున్న పచ్చని వంకర టింకర పండ్లు, సాలీడు గూడువలె అసంఖ్యాకములైన ముడతలు గల ముఖము, గ్రద్ద ముక్కువంటి ముక్కు, ధనుస్సువలె వంగిన శరీరము, నరములు కనివిస్తూ వాడిన కాడలవలెనున్న బాహువులు, డేగ గోళ్ళవంటి చేతి వ్రేళ్ళు ఈ ఆకారముతో నుండిన ఆమెను పచ్చి మాంసము తినే విళాచి అని అనేవారు.

చిలికా సరస్సు తీరముననున్న మానసింహా గ్రామములోని అత్తవారింటికి ఆమె మొదటిసారి వచ్చినప్పుడు ఆమెను చూసిన వారిలో కొందరు నేటికిని జీవించి ఉన్నారు ఆమె తనభర్త, పిల్లల రక్తమును పీల్చి వేసినదట. అది నిజమయినను, కాకపోయినను ఆమె అత్తా ఆడుబిడ్డ ఆ విధముగా అపవాదును వ్యాపింపజేసినారు.

అమావాస్యనాటి రాత్రి నలువైపులా నిశ్శబ్దము ఆవరించి ఉన్నప్పుడు, చిలికా సరస్సులోని శ్యామల జలములలో తరంగములు తలలెత్తుతున్నప్పుడు, వాయు తరంగముల తాకిడికి సరుగుడు వనము సణుగుతున్నప్పుడు, మృతుని నేత్రములవలె గగన వీథిలో నక్షత్రములు మెరుస్తున్నప్పుడు, ఆ ముసలిది ఆ హాండి భంగా బట్ వృక్షము క్రింద రెండు మార్గముల కూడలి వద్ద పొయ్యిపెట్టి పగిలిన కుండపెంకులో మానవ రక్తమును వేడి చేస్తూ ఉండేదని ఇప్పటికీ చెపు

కొంటూ ఉంటారు. ఆమె ఆ పొయ్యిలో నిప్పు రాజవేసేది కాదట। కట్టెలకు బదులు తన కాళ్ళనే పొయ్యిలో పెట్టేదట। ఆ సమయములో ఏ బాటసారి అయినా ఆమెను చూసినట్లయిన అతడు రక్తమును కక్కుకొని చనిపోయే వాడట। అందువల్ల నిశ్శబ్దముగా నున్న రాత్రులందుగాని, నిర్జనముగా నున్న మధ్యాహ్న సమయములందుగాని ఆటువైపు ఎవ్వరూ వెళ్ళేవారు కారు. ఇప్పటికినీ ఆ స్థలమన్న ప్రజలకు ప్రాణభీతి. ఇప్పుడు కూడ ఆ ముసలిది అప్పుడప్పుడు కనబడుతూ ఉంటుందని తాత్రికులు అంటూ ఉంటారు.

ఆమెకు ప్రపంచము పట్ల దయలేదు. ఆమెలో సానుభూతి, మమతలు శూన్యము. సత్రములో బస చేసే బాటసారులకు కావలసిన నీళ్ళు చెరువు నుండి తేవడము మొదలుకొని అడవినుండి కట్టెలు కొట్టి తెచ్చేవరకు ఎటువంటి పని నైనను సరే కంకాళసములైన ఆ బాల బాలికల చేత చేయించుటకు ఆమె సంకోచించేది కాదు. ఆ బాల బాలికలలో అమ్మ్మలైనవారు, ఆకలికిగాని ఆమె కసికిగాని బలి అయినవారు మాత్రమే ఆరౌరవాది నరకబాధ నుండి విముక్తులవుతూ ఉండేవారు. ఏదో విధముగ ఆ నరకమునుండి విముక్తులైనవారు పోగా చివరకు జగుని ఒక్కడే మిగిలిపోయినాడు.

జగుని అదృష్టము ఎటువైపు అతనిని తీసికొని పోయి ఉండేదో తెలియదు. ఎడతెరిపి లేని కొన్ని సంవత్సరముల కరువు అనావృష్టి తరువాత ఆ యేడు వర్షములు బాగా పడినవి. దేశములో మొగలుల దుండగములులేవు. దేశములో సస్యలక్ష్మి తాండవించినది. నిరుపద్రవమైన శాంతి దేశమంతటా వెల్లివిరిసినది. ప్రజలు ఊరట చెందినారు.

ఇంతలో హఠాత్తుగ మహామారి ఎక్కడనుండి వచ్చినదో తెలియదు అది గ్రామగ్రామములను శూన్యము చేయనారంభించినది. దానిబారినుండి తప్పించుకొని బ్రతికి బయట పడినవారు, ఈ ముసలిదాని ప్రాణములు కాలిజాయిలో ఏడు తాళ్ళ లోతున ఒక చిన్న డబ్బాలో మూయబడి ఉన్నాయని, దానిని ఒక రోహూ చేప కాపలా కాస్తున్నదని, అందు వలన ముసలిదానిని ఆ మహామారి కూడ ఏమీ

చేయలేక పోతున్నదని అంటూ ఉండేవారు. మహామారికి ఈ ముసలిది సోదరి అనీ, ఇదే ఆ మహామారిని వెలుచుకొని వచ్చినదనీ ఆ ప్రజల విశ్వాసము. ఈ ముసలిది మరణిస్తే కాని వారికి మహామారి నుండి రక్షణ లేదని వారు భావించారు.

ఈ నాటికి కూడ ఆ భయానక దృశ్యము జరుగునికి జ్ఞాపక మున్నది. ఒక నాడు ప్రజలందరు ఆ హాండీభంగా బట్ వృక్షము చుట్టూ గుమిగూడినారు. వారక్కడ ఒక పెద్ద మంట వేసినారు. మంటలు ఆకాశము నంటుతున్నవి. ఆ సమయములో ఆ ముసలిది ఏ మూలికను వెదకు కొంటూ వెళ్ళినదో గాని ఆమె శ్మశానములో బూరుగుచెట్టు క్రింద ఉన్నది. ప్రజలు ఆమెను బలవంత ముగ మోసుకొని వచ్చి ఒక వంకాయను పడవేసినట్టు ఆ మంటలో పడవేసి నారు.

ఆది చూసి జగుని భయముతో పరుగెత్తి పారిపోయి ఒక మొగలి పొద చాటున దాగొని ఆ రాత్రంతా గడిపినాడు. ఉదయమే వెళ్ళి అతను ఆ సిప్పులను ఆర్పినాడు. అప్పటి కింకా ఆ గ్రామస్థులు అక్కడకు రాలేదు. ఆ ఆరిపోతున్న నిప్పులోనుండి పొగ వస్తున్నది. అప్పటికి కూడ మాంసము కాలుతున్న కమరు కంపు కొడుతున్నది.

జగుని సత్రమునకు తిరిగి వచ్చినాడు. మహామారి నుండి ప్రజలకు ముక్తి లభించినది.

పంజరములోని ముంగిసపిల్ల జగునిని చూసి చేఁ చేఁ అంటూ ముఖము తప్పించుకొనడానికి ప్రయత్నిస్తున్నది. ఈ ముంగిసపిల్ల జగునికి అతని అనావృత, ఉపేక్షిత శైశవమును స్మరణకు తెస్తున్నది. అందువల్ల దానిని ఎక్కడ నుండి తెచ్చినాడో అక్కడ వదిలి రావలెనని అతడు ఉండి ఉండి అనుకొంటు న్నాడు. కాని ఇంతలోనే దానికి పాలు త్రాగించమని సర్దేయా చెప్పిన మాటలు జ్ఞప్తికి వచ్చినవి. సత్రములో పాలులేవు. దగ్గరలోనున్న గేదెల సాల నుండి పాలు తేవలెనని అతడు బయలుదేరినాడు.

లోపల సంధ్యా దీపమును వెలిగించి బయటకు సర్దేయా వచ్చే సరికి అక్కడ జగుని లేడు. సరివి వనములో రివ్వుమంటు గాలి వీస్తున్నది. వసారాలో ముంగిస పిల్ల చేఁ చేఁ మంటున్నది. సరివి వనమునుండి రెక్కలాడించుకొంటూ గబ్బిలములు గుంపులు గుంపులుగ వస్తున్నవి. ఇంకొక వైపునుండి వివిధ పక్షులు తమ గూళ్ళను చేరుకొనుటకు మౌనముగ ఎగిరి వస్తున్నవి.

"ఒరేఁ జగునీఁ...ఒరేయ్ఁ" అని సర్దేయా పిలిచినది. కాని ఆమె పిలుపు తిరిగి సత్రమునే చేరుకొన్నది. సరివి వనములో వీస్తున్న ఈదురుగాలి విడుస్తున్న దీర్ఘశ్వాశ తప్ప నేరు సమాధానము రాలేదు.

ఒక తెల్లని దుప్పటి కప్పుకొని వసారా గోడను ఆనుకొని సర్దేయా కూర్చున్నది. ఆమె బాగా అలిసిపోయినది. సాయం సంధ్య మెల్లగా నల్లబడుతున్నది. బాణ్‌పుర్ అడవి నొసటిమీద ఎవరో బుక్కాపొడి చల్లినట్లున్నది. జుట్లు విరబోసికొన్న పిశాచములవలె సరివి, తాడి, ఖర్జూరపు చెట్లు రానున్న తుఫాను రాత్రిని ఆహ్వానిస్తున్నట్లుగా దూరమునుండి కనబడుతున్నవి. సాయంకాలపు అంధకారమంతా, నిశీథపు గబ్బిలముల గుంపులన్నీ, పెను తుఫాను గాలులన్నీ ఆ సమీపములో నున్న హాండీభంగా బట్ ఊబలలోనికి దిగుతున్నవి. మొగలి పొదల మాటునుండి వస్తున్న నక్క ఊళలు ఆ వాతావరణమును మరింత భయావహము చేస్తున్నవి.

బాణ్‌పుర్ వెళ్ళుటకు దారి అడిగిన ఆ రౌతు ఆ అరణ్య మార్గములో ఇప్పుడు ఎక్కడ ఉండి ఉంటాడో! ఆ రౌతు ఎవరుఁ ఎక్కడనుండి పచ్చినాడుఁ ఈ చీకటి రాత్రిలో అతడు బాణ్‌పుర్ ఎందుకు వెళ్ళుతున్నాడుఁ

సర్దేయా స్మృతి పథములో ఆ నాటి ఆ మూర్తి కదలాడినది. చిలికా సరస్సు తీరమునందు ఆ పాడుపడిన గ్రామము, ఆ ఆశ్వికుడు, ఆ నిశ్శబ్ద మధ్యాహ్న కాలము. అతనికి కూడ ఇలాగుననే దాహము వేసినది. అతడు కూడ మోకాళ్ళపైన కూర్చునే ఎండిన వెదవులముందు దోసిలి పట్టినాడు. ఇదే విధముగ ఒక్క గుక్కలో అరబిందెడు నీళ్ళు త్రాగినాడు.

తన దుఃఖమయ జీవితము, మొగలుల దుండగములు, దుర్భిక్షము, ఈ అంధకారము ఇవి అన్నీ కలిసి ఏకాకృతిని దాల్చినట్లు ఉన్నవి. ఒకదాని నుండి మరియొక దానిని విడదీయుట అసంభవము. ఆ అపరిచిత ఆశ్వికుడు. అతని దాహము, నిప్పులు చెరుగు తుండిన ఆ మధ్యాహ్న సమయము-ఇవన్నీ కలిసి అతని చేతనత్వములో ఏకాకారమును పొందినవి.

ఆ నాడు కూడ మాల్‌ఖడా గ్రామములో తన యింటిముందు నిలుచుని బాణ్‌పుర్‌కు పోయే మార్గమును గురించే అతడు ఆడిగినాడు. ఆ బాణ్‌పుర్ ఎక్కడ ఉన్నది? ఏ రాజ్యములో ఉన్నది. ఇవన్నీ తనకు ఏమి తెలుసు? కేవలము బాణ్‌పుర్‌లోని భగవతిని గురించే ఆమె విని ఉన్నది. ఆమె పిలిస్తే వింటుంది, సమాధాన మిస్తుంది. తన నూమగారు మ్రొక్కులు తీర్చుకొనుటకు బాలసార్లు అక్కడికి వెళ్ళి ఉండిరి కూడ. శక్తిమంతమైన సుగఠిత సుందర వదనము ఎక్కడనో దాగున్నది. నల్లచలువరాతి విగ్రహమువలె నిగనిగలాడే ఆ ముఖాకృతి, ఆ బుగ్గ మీసములు, ఆ నిడుపైన కుంచిత కేశములు...తన పతిదేవుడు; తన ప్రత్యక్ష దైవము; తన జీవితస్వామి తన మరదులతో గూడ ఎక్కడనో లయమై పోయినాడు.

వారి వివాహములు నిశ్చయింపబడినవి. ఏవేవో తెలియని గ్రామముల నుండి తోడికోడళ్లు వచ్చినారు. ఇల్లు నిండుగా ఉండెను. అత్తగారు ఆ శుభదినముల కొరకే కలలు కనినారు. ఆమె కలలు యదార్థ రూపము పొందినవో లేదో ఇంతలోనే అకస్మాత్తుగ తుఫానువలె మొగలుల దుండగములు ప్రారంభమైనవి. మొగల్ సేనలు భోర్డా రాజ్యము మీదికు దండెత్తి వచ్చినవి. దేశమంటే ఏమిటో, స్వాతంత్ర్యమంటే ఏమిటో ఆనాటి కింకా తనకు సరిగ తెలియదు. కాని తన జన్మ భూమి మీదకు శత్రువులు దండెత్తి వచ్చినప్పుడు వీరుడైన ఏ పాయిక్ యువకుడు ఇంట్లో చేతులు ముడుచుకొని కూర్చొనగలడు; ఏ పాయిక్ యువతి అతనిని నిలివి ఉంచుటకు ఇచ్ఛగిస్తుంది?

"ఓరే! వీరికి పందల్లాగ ఇంట్లో కూర్చొని ఏమి చేస్తున్నారురా? మీరు అందరూ పాయిక్ వీరుల సంతానమా? లేక పాకీవారి సంతానమా? మ్లేచ్ఛులు

జగన్నాథ స్వామిపైని చేయి చేసికొనడానికి సిద్ధముగా ఉన్నారు. ఆ జగన్నాథ స్వామే లేకపోతే ఇంక ఉత్కళ దేశములో మిగిలేది ఏముందిరా ;'' అని తన మామగారు దయ్యము పట్టిన వానివలె చిందులు త్రొక్కి అందరిని రేకి త్తించి నారు.

చుట్టు ప్రక్కల భేరీలు, తూర్యములు, నగారాలు మారు మ్రోగడము ప్రారంభించినవి. తన పతికి, మరదులకు నొసట సిందూరమును దిద్ది వారిని రణరంగమునకు సంతోషముతో తనే సాగనంపినది. మరి వారు తిరిగి రానేలేదు. శత్రువులు తొలగినారు. శాంతి పునఃప్రతిష్ఠితమైనది. అయినా వారు రానేలేదు. వారి కొరకే తను ఎదురు చూస్తూ ఉండి పోయినది.

ఆ నాడు నిప్పులు కురుస్తున్న ఎండలో దాహముతో అలమటించి పోయి తనను నీళ్లు పోయమని ఎవరు అర్థించినారో వారేనా ఉత్కళ దేశమునకు శిరో మకుటమైనఖోర్ధా మహారాజుగారు? ఆయన తమను తాము ముందుగ పరిచయము చేసికొనలేదు. కాని సైనికులు స్త్రీ అయిన తనపైన చేయి చేసికొనవలెనని ప్రయ త్నించినప్పుడు ఆయన ఇంక సహించలేక వారి మీదకు దూకినారు. తనే రాజు నని వారికి తొంగిపోయినారు.

మాల్‌కుదా రోడ్డుపైని కిరాతకులవలె ఉండిన ఆ సైనికులు జ్ఞప్తికి వచ్చే సరికి సర్దేయీ రోమాంచిత అయినది...'ఆ మహారాజుగారు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? ఏ దేశములో ఉన్నారు?'

తన నిరాభరణ బాహువులపై నున్న క్షత చిహ్నములను సర్దేయీ ఒక సారి చూచుకొన్నది. మసక చీకటిలో ఆ చిహ్నములు స్పష్టముగ కనబడుట లేదు. కాని స్పర్శవలన ఆమె గు ర్తించ గలుగుతున్నది.

అప్పటికి ఇంకను జగుని తిరిగి రానేలేదు. "జగునీ!...ఓరే జగునీ.... ఓరే!" అని ఆమె మరల పిలచినది. జగుని ఆప్పటికి మరలివస్తున్నాడు.

రాత్రి ఒక జాము గడచినది. ఆనాటి పగలంతా కలిగిన ఉత్తేజము, అల సటల వలన పామువలె చుట్టచుట్టుకొని కూర్చుని అతడు నిద్రపోతున్నాడు.

పొయ్యిలోకట్టెలు మండతున్నవి. అందులోనుండి పొగవస్తున్నది. ఆ మంట వలన పొయ్యి లోపల కొద్దిగ వెలుగు కానవస్తున్నది. సరివి వినము లో తుఫాను గాలికి ప్రళయ తాండవము జరుగుతున్నట్లు ధ్వనులు వినివిస్తున్నవి. జగుని తలవద్దనున్న పంజరములో ముంగిసకూడ నిద్రపోతున్నది. చలికి వణుకుతున్న జగునిపైన దుప్పటిని కప్పి సర్దేయీ తుఫాను గర్జనలను వింటూ కూర్చున్నది. పెనుగాలికి సత్రము తలుపులు అనిశ్చిత భయముతో ఇటునటు కదలాడుతున్నవి.

ఇంతలో ఎవరో తలుపును తడుతున్నట్లు ఆమెకు అనివించినది. కాని గాలికి అలా అనివించినదేమో నని ఆమె తలచి "ఈ కాళరాత్రి మరి గడచునో లేదో" అని తనలో తాను ఆమె గొణగనారంభించినది.

"ఎవరు లోపలఁ తలుపు తియ్యండి" అంటూ ఎవరో తలుపు తట్టి పిలిచినారు.

సమయము కాని సమయములో ఈ కాళరాత్రి పూట ఒక అపరిచిత కంఠ స్వరమును విని సర్దేయీ భయముతో వణికిపోయినది. 'ఎపరితడుఁ దొంగాఁ దొరాఁ' అని ఆలోచించినది. ఇంతలో తలుపు చప్పుడు ఎక్కువయినది.

సర్దేయీకి ఏమి చేయడానికి తోచక "జగునీఁ జగునీ!" అని అస్పష్టస్వరముతో లేపుతూ అతనిని ఆటు ఇటు ఊపినది. జగుని కళ్ళు నులుముకొంటూ లేచి కూర్చున్నాడు. జగుని లేవడముతో సర్దేయీకి కొద్దిగ ధైర్యము వచ్చినది. అతని ధైర్య సాహసములపైని ఆమెకు గట్టి విశ్వాసమున్నది.

"జగునీఁ ఎవరో తలుపు గొళ్ళెము చప్పుడు చేస్తున్నారు, విను. బహుశా ఏ దొంగో, ఏ సైనికుడో వచ్చి ఉంటాడు" అని భయ కంపిత స్వరముతో ఆమె అన్నది. జగుని తలుపు చప్పుడును, అపరిచిత పిలుపులను విని, ఒక మండుతున్న కట్టెను, ఒక గొడ్డలిని పట్టుకొని జాగ్రత్తగ తలుపు గొళ్ళెమును తీసినాడు. పెనుగాలికి ఆ తలుపులు గట్టిగ గోడకు కొట్టుకొన్నవి. కట్టెమంట వల్ల క్షణ మాత్రము వెలుగు వచ్చినది.

కానెపోని ధోవతులను బిగించి. కవచములు ధరించిన ఇద్దరు పాయిక్‌లు జగుని యెదుట ప్రత్యక్ష మైనారు. నడుము పటకాలలోనుంచి వారి క్రైజారులు ప్రవేలాడుతున్నవి. నీలచక్రముల ముద్రలతో నున్న పతాకములు వారి ఛాతీలపై నున్నవి. వాటినిబట్టి వారు ఖోర్ధా పాయిక్‌లని గుర్తించవచ్చును. కుంచిత శిరోజ ములపైని తలపాగలు ఉన్నవి. బుగ్గమీసములనుండి వారి ధైర్యసాహసములు ఉట్టిపడుతున్నవి. వారి పిపులపైని డాళ్ళు ప్రవేలాడుతున్నవి. చేతులలో బల్లెము లున్నవి. వసారాలో కట్టి వేసిన వారి గుర్రములు దెక్కలతో నేలను దాదు తున్నవి.

సర్దేయీ ఎదుట జగుని ఎంత శాంతముగ ఉంటాడో ఇతరుల ముందు అంత కఠోరముగా ఉంటాడు. "ఎవరు మీరు? మీకు ఏమి కావాలి?" అని అతడు వారిని రూక్ష స్వరముతో అడిగినాడు.

"ఖోర్ధాకు సంబంధించిన ఐక్షి పాయిక్‌లము మేము. బాణ్‌పుర్ వెళు తున్నాము. ఈ ఒక్క రాత్రి ఈ సత్రములో ఉండుటకు వచ్చాము" అంటూ అల సటతో ఒక పాయిక్ సమాధానము చెప్పినాడు.

కలత నిద్రలో లేచి జగుని అసలే చికాకుగ ఉన్నాడనీ, కనుక వారితో అతడు దెబ్బలాడ వచ్చుననీ సర్దేయీ తలచినది "వారిని లోపలకు రానివ్వు జగునీ!" అని ఆమె మందస్వరములో జగునికి ఆదేశ మిచ్చినది.

చలికి గజగజ వణుకుతూ "...రండి లోపలకు, గుర్రములను అక్కడే ఉంచుతారా ? లేక ఆ పాకలో కట్టివేస్తారా ?" అని ఆవలిస్తూ వారిని అడిగి చేరువలో నున్న ఒక పాకను వారికి చూపించినాడు జగుని. తరువాత గాలికి కట్టె ఆరిపోకుండా జాగ్రత్త పడుతూ వారిని ఒక గదివరకు తీసికొని వెళ్ళినాడు.

గాలి చాలా జోరుగా వీస్తున్నది. సర్దేయీ తలుపులను మూయడము మరచిపోయి "వీరు కూడా బాణ్‌పుర్ వెళుతున్నారా? వీరుకూడా ఖోర్ధా పాయిక్ లేనా? మళ్ళా ఖోర్ధావైని ఏదైనా విపత్తు విరుచుకు పడినదా ఏమి?" అని ఆమె ఆలోచించ సాగినది.

హాఫీజ్ కాదర్ నేడు రావచ్చును, రేపు రావచ్చును అని లాల్‌బాగ్‌లోని వాండరు ఎదురు చూస్తున్నారు. కాని ఆయన రానేలేదు. అసలు విషయము ఏమిటో తెలిసికొని వచ్చుటకు లోధుమియా వద్దకు వెళ్ళిన గూఢచారి సైనికుడు తిరిగి వచ్చినాడు. ఖోర్దాలో ఈద్-ఉల్-ఫితర్ పండుగకు ఏర్పాట్లు వైభవోపేతముగ జరుగుచున్నవని, హాఫిజ్ కాదర్ త్వరలో నాయబ్ నాజిమ్ బహదుర్ వారిని కలవడానికి వస్తున్నారని అతడు చెప్పినాడు. ఆ వార్తను విన్న తకీఖాన్, అతని సభాసదులు కొంత ఊరట చెందినారు. కాని ఈద్-ఉల్-ఫితర్ పండుగ దగ్గరపడుతున్న కొలది హాఫిజ్ కాదరు కటక్ వచ్చే అవకాశము దూరము కాజొచ్చినది.

లాల్‌బాగ్‌లోని ప్రత్యేక సభాభవనమందు జరీతో కూడిన మఖమల్ తివాసీపైన సింహాసనమును అధిష్ఠించి తకీఖాన్ కూర్చునివున్నాడు. అతని కండ్లు సగము వాలిఉన్నవి. సింహాసనము ఒక విమానమువలె కన్పడుచున్నది. దాని నలుమూలల స్తంభములపైని సువర్ణపత్రములు పొదగబడినవి. వాటిపైని గుమ్మటాకారములో మణిముక్తఖచితమైన కప్పు నిర్మించబడినది. అది ఢిల్లీలోని మయూరసింహాసనమువంటిదికాదు. అయినను తకీఖాన్ దీనిపైని కూర్చున్నంత సుఖముగ, నిశ్చింతగ, ఆడంబరముగ ఢిల్లీ పాదుషాలు ఆ మయూర సింహాసనము పైని కూర్చుండలేక పోయెడివారు.

నాయబ్ - నాజిమ్ కూర్చున్న ఆ సింహాసనమునకు ఇరు ప్రక్కలను మఖమల్ కుర్చీలు ఉన్నవి. దర్బారులోని ముఖ్యులు, అత్యంత విశ్వాస పాత్రులు మాత్రమే వాటిపైని కూర్చొనుటకు అర్హులు. సింహాసనము వెనుక నిల్చున్న సేవకులు నెమలికన్నుల విసనకర్రలతో విసరుచున్నారు. ఎదుట మఖమల్ తివాసీలపైన సితార్, తబలా, సరోద్, సారంగి, తాన్పూర మొదలగు సంగీత వాద్యములు విస్మరించబడిన అంతఃపురదాసీలవలె చెల్లాచెదురుగ పడియున్నవి. గతరాత్రి వెలిగించిన దీపములలో కొన్ని ఇంకను వెలుగుచున్నవి. నూనె ఆయిపోతున్నందువలన అవికూడ మినుకు మినుకు మంటున్నవి. దినామార్‌లోని తెల్లదొరలవద్ద కొన్న గుబురు దీపగోళము భవనపు

పైకప్పునుండి వ్రేలాడుచున్నది. దానిలో వెలుతురుకూడా మందముకాలేదు. సభాభవన పర్దాలోనుండి వడియకట్టి వచ్చిన మందమైన దీపకాంతిలో అక్కడక్కడ చెదురుమదురుగ పడియుండిన సామగ్రి ప్రకాశిస్తున్నది. గతరాత్రి నాట్యమాడిన నర్తకిల కొప్పులనుండి తివాసీలపైని జారిపడిన మల్లెపూల మాలలు వాడి చెదురుమదురుగ కన్పించుచున్నవి. తెల్లదొరలవద్ద కొన్న ఎరుపు, నీలపు వర్ణముల మద్యపు సిసాలు ఖాళీయి మృతిచెందిన సిపాయిలవలె దొర్లి ఇక్కడా అక్కడ పడియున్నవి.

ఇవి అన్నీ ఎన్నో ఉన్నప్పటికిని ఎవరి మనస్సులోను ఉత్సవ ఉత్సాహము కానరావడములేదు. ఖోర్దానుండి రామచంద్రవ్ వచ్చియుండినట్లయితే వారిని ఇక్కడ బంధించి ఖోర్దామీదకు దాడివెడలు సన్నాహములను జేయు ఉత్తేజములో బహుళః వారికి ఈద్ - ఉల్-ఫితర్ పండుగయొక్క సంపూర్ణానందము లభించియుండెడిదేమో ! కాని రామచంద్రదేవ్ అసలు రానే లేదు. వారు వస్తారో, రారోకూడ ఎవరికి తెలియదు. జుల్ఫికార్ఖాన్ మొదలగు ముసాహబ్‌లకు ఈ విషయము చాల విచారమును కలుగజేస్తున్నది సింహాసనము మీద కూర్చుని తకీఖాన్ కూడ ఈ విషయమై ఆలోచిస్తున్నాడో లేక ఆలోచిస్తూ ఆలోచిస్తూ నిద్రపోతున్నాడో చెప్పడము సాధ్యపడదములేదు.

అతనిని అభినందించుటకు ఎవరైనను వచ్చినయెడల ఆ వచ్చినవారి పేరును, యోగ్యతను సేవకుడు విన్నవించగనే బరువెక్కిన కండ్లను తెరవకుండ జరీ చెప్పుతోసహా తకీఖాన్ ఒక కాలును ముందుకు జాచుచున్నాడు. ఆ ఆగంతుకుడు ఆతని పాదమును చుంబించి, మూడు అడుగులు వెనుకకు వేసి "ఆదాబ్‌అర్జ్" అని మూడుసార్లు ఉచ్చరించి వంగి ప్రణామము చేస్తున్నాడు. ఆ తరువాత అతనిని కూర్చొనమని అనుజ్ఞను జారీచేయుటకు తకీఖాన్ గాయపడిన పక్షిరెక్కలవలె వణుకుచున్న తన చేతి మొరుచూపుల్ను ఆడించి సంజ్ఞ చేస్తున్నాడు. ఆక్కడ ఎదురుగానున్న ఏదో ఒక కుర్చీలో ఆగంతుకుడు ఆశీనుడైన తర్వాత అతనికి ఇష్టమైన మద్యపానము అతని ఎదుటకు వస్తున్నది.

మద్యపానమ్ముఅలవాటు లేనివారికి షర్బత్ కాని మేవా (ఎండుపండ్లు) కాని అందివ్వబడుతున్నది. తినడము, త్రాగడము పూర్తి అయిన తరువాత తకీఖాన్ వేళ్ళు కంపిస్తూ తిరిగి లేచి ఆగంతుకునికి సెలవు మంజూర్ చేసినట్టు సూచిస్తున్నవి. ఆగంతుకుడు కోశాధికారివద్దనుండి బహుమతులుస్వీకరించి వెళుతున్నాడు. వారిలో ప్రధానులైనవారికి నాయబ్ -- నాజిమ్ సమక్షములోనే బహుమతులు ఇవ్వబడుతున్నవి.

ఈ కార్యక్రమము కొనసాగుచుండగనే సేవకుడు ఒకడు వచ్చి "పటిఆ ఇలాకానుండి రాజాపద్మనాభదేవ్ వచ్చారు" అని తెలియజేసినాడు.

నాయబ్ – నాజిమ్‌కు అభినందనలు తెల్పుటకు రాజాపద్మనాభదేవ్ తనతోకూడ ఇద్దరు ముఖ్య వ్యక్తులను వెంట తీసుకొనివచ్చినాడు.

కంఠమునుండి మడమలవరకు కప్పుతున్న ఎర్రరంగు సిల్క్‌చోగా, నడుముకు జరీపటకా, దానిలో వ్రేలాడుతున్న దంతపు ఒరలలో కత్తులు, చెప్పులులేని పాదములు, తలపైని ఆడంబరమైన తలపాగ, మూడు కచ్ఛల ధోవతి, దానిపైని బంగారపు జరీ అల్లిక కలిగిన పొడుగుపాటి తెల్లని మఖమల్ చొక్కా, కుడివైపు వ్రేళ్ళాడుతున్న జరీతో కూడిన త్రాళ్ళు, ఛాతీవరకు వ్రేలాడుతున్న మోటైన బంగారపుకంఠమాల, పెదలైనా ముఖముపైన లావుపాటి చెంప మీసములు, ముక్కుక్రింద మెత్తని గుబురుమీసములు, హుందాతనమును తెలియ బరుస్తున్న ఆ మీసములలో అక్కడక్కడ తెల్లని వెండ్రుకలు, భుజములవరకు వ్రేలాడుచున్న కుంచిత శిరోజములు-ఇవీ ఆయన వేషధారణ మరియు రూప రేఖాను.

చుట్టూఉన్న వాతావరణమును గ్రహించి ఒక ముసల్మాను టోపినిధరించి ఆయన నాయబ్ – నాజిమ్‌కు ఏధేయతను తెలియజేసికొన్నాడు. మానసింహా, తోడర్‌మల్‌ల కాలమునాటినుండి ఈ ఉడుపులు వారింట్లో భద్రముగ పదిలపరచ బడి ఉన్నవి. అనేక పర్యాయములు నాయబ్ - నాజిమ్‌లను కలుసుకొనుటకు

లాల్‌బాగ్‌కు వచ్చేటప్పుడు పీటినిధరిస్తూ వస్తున్న ఆయన దైన్యగ్రస్త ఇతిహాసము ఈ శిథిల దుస్తులలో ప్రోగుప్రోగున అంకితమై ఉన్నది.

సారంగగఢ్ అధిపతి కనిష్ఠుడే 'పటిఆ' అధిపతి. అక్బర్ సేనాపతి మానసింహుని నిర్ణయము, ఆ తరువాత తోడర్ మల్లుని బందోబస్తు, పీటి ఫలితముగ ముకుంద దేవుని వారసులు ఖోర్ధా సింహాసనమునుండి ఏ విధముగ తొలిగించబడిరో, ఆలీ సారంగ్ గఢ్ మొదలగు దుర్గముల ఆధిపత్యము మాత్రము పొంది వారెట్లు ముఖములను ప్రేలాడ వేసికొనవలసి వచ్చినదో అది ఇదివరకే వర్ణించ బడినది.

కనిష్ఠుడైన చకడీ భ్రమరవర్‌కు ఇందు మూలముగ సారంగగఢ్ లభించినది. దానిలో కనిష్ఠ అంశమే'పటిఆ'. అంతయు కలిసి ఇది పన్నెండుగ్రామముల సీమ. ఇదికాక మొగల్ అధీన ప్రాంతమందలి 'సాయీవిరీ' పరగణా కూడ దీనిలో చేరినది. అయినప్పటికిని పద్మనాభ దేవ్ ప్రాత కోతలలోను దస్తావేజులలోను, ఉత్తర ప్రత్యుత్తరములందు అన్నింటిలోను గూడ "వీరశ్రీ గజపతి గౌడేశ్వర కర్ణాటోత్కళ వర్గేశ్వర వీరాధి వీరవర శ్రీ శ్రీ శ్రీ పద్మనాభదేవ్" అని తన పరిచయమును ఆయన తెలియపరచు కొంటూ ఉంటాడు.

ఖోర్ధాయెడల అతని వాత్సల్యము ఎంత ప్రచండమైనదో, జ్యేష్ఠ అంశపు 'సారంగ గఢ్' యెడల అతని ఈర్ష్యకూడ అంత ఉగ్రమైనది. ముండ్ల వెదురు గుబురులతో ఆవరింపబడి 'గఢ్' అని పేరు పొందిన తన మట్టి ఇంటి యొక్క ఎత్తయిన వసారాలో ఆయన కూర్చుని ఖోర్ధా వంశమును వినరాని భాషలో దూషిస్తూ తిట్ల వర్షము ప్రారంభించినప్పుడు లేదా పురుషోత్తమదేవ్ తన యువరాజిని పల్లకీలో కూర్చుండబెట్టి జహాంగీర్ జనానా మహలులోనికి ఢిల్లీ ఏ విధముగ పంపినాడో ఆ విస్తృత గాథను గోరంతను కొండంతగ జేసి వర్ణించి చెపుతున్నపుడు ఆయనను విశేషముగ స్తోత్రముచేసేవారు ఆయన అనుచరులైన రైతులు. పదేపదే ఆ కథను విన్నవారు పద్మనాభ దేవే ఖోర్ధాకు సిజ

మైనవారసుడని, ఆయన పంచింపబడినాడని అప్పుడప్పుడు అనుకొంటూ ఉండ వచ్చును.

"ఏమి యదువంశము? అవన్నీ నిరర్థకపు ప్రసంగములు. వీరు మా వంటి సూర్యవంశ క్షత్రియులా? కారు. వీరు భోయీలట భోయీలు.! గజ పతుల గ్రామములను వీరు చూచుచుండేవారు. వారి చిట్టా ఆవర్జాలను వ్రాసేవారు. పంచాంగము చెపుతూ ఉండేవారు. మానసింహ ఉత్కళ దేశమునకు వేంచేసి నప్పుడు పూరీలో చందనయాత్ర జరుగుచున్న సమయమందు, భంగు త్రాగే కొంతమంది పండాలతోవచ్చి భోయీ రమేయీ రావుత్ రామచంద్రదేవ్‌గమారి, మానసింహునికి విన్నవించుకొని ఖోర్ధా రాజసింహాసనమును సంపాదించుకొని నాడు. అంతేగాని వారు మావంటి సూర్యవంశ క్షత్రియులా? వీరంతా కేవలం 'పాంజిత' మహాంతులు. ఆలీ సారంగగఢ్ అధిపతులే నిజానికి గజపతి వంశీ యులు," అని పద్మనాభదేవ్ తన అనుచరులముందు చీదరించుకొనెడి వాడు.

ఆ సమయములో వసారా మెట్లపైనున్న రాళ్లపైన కూర్చుని వింటున్న వారు ఆయనను మరింత ప్రోత్సహించెడివారు.

విశ్వాసఘాతకత్వముతో భోయీలను ఖోర్ధా రాజసింహాసనమునుండి పెల్లగించి దానిని అధిష్ఠించ..లెనన్న ఆకాంక్ష వేఱుభ్రమరవర్‌కు ఉన్నట్లే పద్మనాభ దేవునకు గూడ మనసులో నున్నది. కాని భుజబలముతో ఖోర్ధాను జయించడము ఆయనకు సంభవమైన విషయముకాదు. అందుచేత ఖోర్ధా - పటిఆ సరిహద్దుల్లోని గ్రామములను ఒకదాని వెంట ఒకదానిని జబరదస్తీగ దఖలు పరచుకొని తన రాజ్య సరిహద్దును విస్తరింపజేసికొనడములో అతడు నిమగ్నుడై యున్నాడు.

ఈకారణముల వలన పద్మనాభ దేవ్ నాయబ్-నాజిమ్‌లపట్ల విశ్వాస పాత్రుడుగాను, అనుచరునిగను ప్రవర్తించుచున్నాడు. కటక్ - ఖోర్ధా సరి హద్దు ప్రాంతములో 'పటిత' ఉన్నది.. దాని వలననే దీనికి భౌగోళికముగ కూటనీతికి ప్రాధాన్యము కలిగినది. ఆయన ఐదు సంవత్సరముల నుండా

బకాయి ఉన్నాడు. 'పటిఆ' లోని కొంతమంది రైతులను చావగొట్టి శిస్తు వసూలు చేసినను ఆది గడ్ ఖర్చులకే సరిపోకున్నది. దీనికితోడు రెండు ముసలి ఏనుగులు, కొన్ని అరబ్బీ అశ్వములు, పల్లకీబోయీలు, కొంత మంది ప్రత్యేక పరిచారకులు గజపతి హోదాచిహ్నముగా ఉన్నారు. వీరి జీతబత్తెములు భరించవలసి ఉన్నది. అందువలన నజరానా బకాయి సొమ్ము రోజు రోజుకు పెరిగిపోతున్నది. ఈద్-ఉల్-ఫితర్ సమయములో నాయబ్-నాజిమ్‌ను కలిసి కొని నజరానా బకాయి చెల్లించుటకు వాయిదాను పొడిగించుటకు ప్రయత్నించ వచ్చుననే ఆంతర్యముతోనే ఆయన నేడు వచ్చినాడు.

పద్మనాభ దేవ్ తకీఖాన్ పాదములను చుంబించి వెనుకకు జరిగి వంగి సలామ్ చేయుటకు ముందుగనే తకీఖాన్ సింహాసనము నుండి లేచివచ్చి ఆయనను బాహువులతో బంధించి "రా మిత్రమా! రా! నీ ఆరోగ్యము ఎట్లున్నది?" అని అడిగినాడు. తకీఖాన్ యొక్క ఈ వింత ప్రవర్తనకు అక్కడ ఉన్న వారందరితో బాటు పద్మనాభ దేవ్ కూడ చకితుడైనాడు.

ప్రస్తుతము భోర్ధా రాజు స్వభావము అనిశ్చితముగ ఉన్నందువలన ఇటు వంటి అమాయకులను తన గుప్పిట యందుంచుకొనడము ఎంత అవసరమో తకీఖాన్‌కు బాగుగ తెలుసును.

పద్మనాభదేవ్ కుర్చీపై కూర్చున్నంతనే ఒక కొజ్జా సేవకుడు ఆయన తీసికొని వచ్చిన బహుమతుల జాబితాను చదువసారంభించినాడు. "నవాబ్ గారి భోగపులావ్ నిమిత్తము ఒక బండెడు పులావ్ బియ్యము, నాలుగు మేకలు, ఒక కుండెడు నెయ్యి....." రైతులను చావగొట్టి వారివద్ద నుండి వసూలు చేసిన ఈ విధమైన అనుచిత వస్తువుల జాబితాను నాయబ్-నాజిమ్ వారి నిండు కొలువులో చదువుతుంటే ఆ సేవకునికి సంకోచము కలుగు తున్నట్లుగా ఉన్నది.

జాబితాను చదివిన తరువాత ఆ సేవకుడు ఒక మధుపాత్రను తీసికొని వచ్చి పద్మనాభ దేవునకు అందజేయుటకు వంగి నిల్చున్నాడు. "నేను మద్య

మును ముట్టినైన ముట్టను" అని హీన స్వరములో అని మధ్యము యెడల తన విముఖతను తెలియజేసినాడు. ఆ మెల్లని ముక్కుమాటలను విని ఆ సేవకుడు షర్బత్, మేవా (ఎండుపండ్లు) తీసికొనివచ్చి ఇచ్చినాడు. పద్మనాభ దేవ్ ఒక్క గుక్కలో ఆ షర్బత్‌ను త్రాగి, మేవా తినడము ప్రారంభించినాడు. ఈమధ్యలో నాయబ్-నాజిమ్ వారి సంకేతానుసారము సేవకుడు ఒక వెండి పళ్ళెములో ఒక తాను పట్టు వస్త్రము, పాదుషాహీ దుస్తులు, నూరు నూర్జహాన్ నాణెములు తీసి కొని వచ్చి పద్మనాభ దేవునకు కానుకగా ఇచ్చినాడు. తాను తెచ్చిన అల్ప వస్తు వులకు ఇంత పెద్దఐహుమతి లభించగలదని పద్మనాభ దేవ్ ఊహించనైనా లేదు. ఆ వస్త్రములను చూసి ఆయన కళ్ళు ప్రకాశించినవి. తన చేతులతో తానే వాటిని మూటగట్టి కొనవలెనని ఆయన మనసులో ప్రబలమైన కోరిక చెలరేగి మనస్సు విచలితమై చేతులు చలించినవి.

అతి కష్టముతో ఆ కోరికను మనస్సులోనే అణచుకొని "జహాఁపనాహ్! సూర్యచంద్రులున్నంత కాలము కటక్ సూబాలో తమ రాజ్యము నిలుచుగాక!" అని వినీత స్వరముతో ఆయన అన్నాడు.

కాని ఆ సమయములో తకీఖాన్ ఈ మాటలను వినివించుకొనే స్థితిలో లేడు. "రామచంద్ర దేవ్ ఇంతవరకు ఎందుకు రాలేదు? ఇది బాహాటమైన తిరుగు బాటు కాక మరేమి టవుతుంది?" అని ఆలోచిస్తున్నాడు. సమయము గడు స్తున్న కొలది ఈ అనుమానము పేళ్లూనుకొంటున్నది.

నిద్రనుండి హఠాత్తుగ మేల్కొన్నవానివలె, ప్రలాపిస్తున్నట్లుగ "హూఁ" అని తకీఖాన్ హుంకరించినాడు. సభికులు ఉలిక్కిపడి ఆయన వైపు చూసినారు.

ఏదైన కఠోర నిర్ణయమును తీసుకొన్నప్పుడే తకీఖాన్ ఈ విధముగ గర్జిస్తాడు.

ఆ ఉత్తేజనలో ఆతడు పద్మనాభ దేవుని ఉనికినే మరిచినట్లున్నాడు. యాంత్రికముగ అతని చేతివ్రేళ్లు పద్మనాభ దేవునికి సెలవు ఇస్తున్నట్లుగ సంజ్ఞ

చేసినవి. అప్పుడు పద్మనాభ దేవ్ తన బహుమానములను తన సేవకుల చేతికి ఇచ్చి మూడు అడుగులు వెనకకు వేసి వంగి వంగి సలామ్ చేస్తూ వెళ్ళిపోయినాడు.

తకీఖాన్ తన సింహాసనమువైన నిటారుగ కూర్చున్నాడు. నీరుల్లి రేకుల వలె ఎరుపెక్కిన కండ్లను తెరిచి ఒకసారి అతడు నలుదిశలను పరికించినాడు. తర్వాత లేచి లోపలి మహలులోనికి వెళ్ళినాడు.

ఇదంతయు రానున్న భయంకర తుఫానుకు సూచన.

ఆ ఉత్కంఠ పూరితమైన ఉత్తేజ వాతావరణములో సభికులందరు ఒకరి నొకరు అర్థవంతముగ చూసుకొన్నారు.

లాల్‌బాగ్ దక్షిణభాగమందున్న తన ప్రత్యేక మహలునందలి ఆళిందమ్‌లో నుండి కాఁజోడీ యందలి నీలజలరాశిలోని సుడులను లెక్కించుచు రజియా కూర్చున్నది. ఆ ఆళిందపు ప్రవేశ మార్గమువద్ద ఒక కొజ్జా కావలివాడు శిలాప్రతిమ వలె నిల్చుని యున్నాడు. భవనముకు బయట దేవదారు వృక్ష పంక్తితో శోభిలమైన గులాబి తోటలోని పత్రకుంజములో నుండి ఆహత జీవి ఆక్రందనమువలె డాహుక పక్షి కూత వినిపిస్తున్నది. నింపుకుండనుండి ఒలకిన నీళ్ళధ్వని వలె ఆ పక్షికూత నిలిచిపోవగనే ఎక్కడ నుండియో ఒక కపోతము వచ్చి తన క్రందన ధ్వనితో ఆ వాతావరణమును ప్రతి ధ్వనింపజేస్తున్నది. మహల్‌లోని కపోతముల మధుర స్వరముతో బాటు దూరముగానున్న నౌఖత్‌ఖానానుండి శహనాయి మీద విలంబిత వాగేశ్వరీ మధురరాగాలాపన శాంత శీతల వాయు వులో ఈదులాడుచు వస్తున్నది.

కాఁజోడీ మీదనుండి వీచుచున్న మంద మంద శీతలఆర్ద్ర వాయువు యొక్క మృదుమధుర స్పర్శవలన రజియాయొక్క సుర్మారంజిత విశాల పద్మ నయనములు మూసుకొని పోతున్నవి. ఆ సమయములో "ముతామిన్-ఉల్-ముల్క్ ఆల్లా ఔదౌలా మహమ్మద్ తకీఖాన్ నసీర్‌జంగ్‌ఖాన్ బహాదుర్ ఆసద్‌జంగ్ ..." అంటూ కొజ్జా సేవకుని కంఠస్వరము మార్మ్రోగినది.

ఈ సమయముకాని సమయములో రజియా మంజిల్ వైపు తకీఖాన్ ఎందుకు వస్తున్నట్టు? ఈ విధముగ యోచించు సరకి నిరాధారమైన భయసందేహములతో రజియా హృదయము కంపించిపోయినది. గతకొన్ని రోజులనుండి ఖోర్ధారాజు రామచంద్రదేవునిపై అతనికి కలిగిన క్రోధమును మరియు ఆయనను బంధించి ఖోర్ధాను తనవశము చేసికొన వలెనని అతడు పన్నుచుండిన ఎత్తుగడలను గురించి రజియా వినకపోలేదు. తకీఖాన్ యొక్క ఈ ఆకస్మిక రాక వలన ఈ శంకలన్నియు దేవదారు వృక్షము పైనున్న గబ్బిలములవలె రెక్కలు దాచి ఎగురుటకు ప్రారంభించినవి.

తకీఖాన్ అకారణ దర్పముతోను, మదముతోను నిండిన ఒక బంతివలె వస్తున్నాడు. అప్పటికి నెమ్మదిగ అడుగులు వేసికొంటూ ప్రాంగణములను దాటి ఆళిందము వరకు అతడు వచ్చినాడు అకస్మాత్తుగ అతనిని చూసి భయ కంపిత స్వరముతో రజియా స్వాగతము పలికినది.

"దయచేయండి జహాఁపనాహ్ ! అదృష్టవంతురాలిని. ఆలీజావారు సమయము కాని సమయములో ఈ దానిని అనుగ్రహించినారు!" అని అంటూ తకీఖాన్ యొక్క సునిత దృష్టిని తప్పించుకొనుటకు రజియా శయన కక్షలోనికి వెళ్ళి మఖమల్ ఆసనము వైన కూర్చుని తమలపాకులకు సున్నముదాని, ఈనెలుతీయ ప్రారంభించినది.

రజియా వెనువెంటనే తకీఖాన్‌కూడ వచ్చినాడు. విషయ ప్రసక్తిని ఎలా ప్రారంభించ వలెనని కాబోలు అతడు ఆలోచిస్తున్నాడు. అందువలన అతడు గదిలోపల అటు నిటు పచారు చేస్తూ చివరకు ఒక ఎర్రరాతి స్తంభపు మేకనకు వ్రేలాడుచున్న పంజరములోని చిలుకను చూస్తూ నిలబడినాడు.

తకీఖాన్‌ను చూసి పంజరములోని చిలుక తన రెక్కలను విదలించసాగినది. తమలపాకులకు సున్నము రాస్తున్న రజియా, "పలుక వేమే చిలుకా ?- జహాఁపనాహ్ ? - జహాఁపనాహ్ ? అను" అని చిలుకను మందలిస్తున్నట్టుగ అన్నది.

కాని నేడు ఆ చిలుక ఆమె మాటలను వినిపించుకొన దలచుకొన లేదేమో; అదేమీ మాట్లాడ లేదు. తకీఖాన్ ఆక్కడనుండి వెళ్ళి ఒక శ్వేత 'మమేర్' ఆసనముపై కూర్చున్నాడు.

మరొక అమంగళకరమైన గడియ గడచినది. ఉన్నట్టుండి, "ఈద్ అయిపోవచ్చినది. ఇంతమంది రాజులు, మహారాజులు వచ్చినారు కాని హాఫీజ్ భైయా ఇంతవరకు రానేలేదు" అని గర్జించినట్టుగా తకీఖాన్ అనినాడు.

ఇంక ఇప్పుడు నాటకము ఆడవలసిన సమయము ఆసన్నమైనదని రజియా తలపోసినది. లేకపోయిన ఎన్నో అప్రీతికరమైన ప్రశ్నలకు తను సమాధానము లివ్వవలసి వస్తుంది. తకీఖాన్ లేని సమయములందు హాఫిజ్ కాదర్ వస్తున్నాడా లేదా ? రజియా హాఫిజ్ కాదర్‌ల మధ్య ఉత్తర ప్రత్యుత్తరములు నడుస్తున్నవా లేదా ? ప్రస్తుతము హాఫిజ్ కాదర్ ఏమి చేస్తున్నాడు. మొదలగు అనేక ప్రశ్నలకు ఆమె జవాబు లివ్వవలసి రావచ్చును. అయితే రజియా కూడా మనసులో అనుకొంటున్నది, "హాఫిజ్ కాదర్ కటక్ విడచి వెళ్ళిన తరువాత బహుశ: నన్నుగూడ మరచినట్లున్నారు." అని బాధాకరమైన ప్రశ్నలన్నింటికి సమాధానము లివ్వకుండ తప్పించుకొన వలెనని గోరంట రంగుతో రంజితమైన తనచేతులతో ముఖమును కప్పుకొని ఆమె విలపించ సాగినది.

రజియా వలెనే తకీఖాన్‌కూడ హిందూనారీగర్భ సంజాతుడు. ఇద్దరూ సుజాఖాన్ సంతానమే. కాని తకీఖాన్ ఎంతనిష్ఠురుడో, ఎంతకఠినుడో, రజియా అంత కుసుమ కోమలి. సున్నీలకంటె కూడ తకీఖాన్ ఎక్కువ మతాంధుడు. దీనికితోడు భయంకర స్వభావము, కూటబుద్ధి, బూటకత్వములలో సుజాఖాన్ స్వంత కుమారుడు సర్‌ఫరాజ్‌ఖాన్‌ను మించినవాడు. ఆందుచేతనే ఇతనిని ఒరిస్సా సుబాలో తన ఉత్తరాధికారిగ సుజాఖాన్ నియమించినాడు. తకీఖాన్, రజియాల స్వభావముల మధ్య ఇంత మౌలిక భేదమున్నప్పటికిని రజియా అంటే తకీఖాన్‌కు మంచి అభిమానమున్నది. రజియా ఏడుస్తూ ఉండగా చూసి

ఆమెను ఆశ్వాసిస్తూ "రాకుమారీ వీడవకు, దుష్టుడైన హాఫిజ్ కాదర్ రాక పోయినందున నీకుగూడ చాలా దుఃఖము కలుగు చున్నదని మాకు తెలుసునమ్మా! ఇంత పెద్ద పండుగ ఇక్కడ జరుగుచుండగా అతను రాకపోవడ మేమిటి?" అని అన్నాడు.

తన నాటకాభినయము పని చేసినదని రజియా గ్రహించినది. ఆమె కన్నీరు తుడుచుకొంటూ, "నామాట విడిచిపెట్టండి జహాపనాహ్! నేను ఎలాగూ నిర్భాగ్యురాలినే! తమరు ప్రభువులు! ఒరిస్సా సూబాకు నాయబ్-నాజిమ్‌లు ఖోర్ధారాజావారు తమసేవకు రాలేదన్న అది దుస్సాహసమే కాగలదు. హుజూర్‌వారు ఫౌజుదారుని పంపిన అతడు ఆయనను బంధించి తీసికొని రాగ లడు" అని రుద్ధకంఠముతో అన్నది.

రజియావైపు అర్థవంతమైన నేత్రములతో తకీఖాన్ చూసినాడు పాపము! అమాయకురాలు. ఈమె కేమి తెలుసు ఒరిస్సా సూబాలోని రాజకీయ ములు అంటే ఏమిటో? ఆఫ్గనులు తిరుగుబాటు చేయుటకు సిద్ధమగుచున్నారు. సర్పరాజ్ ఖాను శనివీక్షణము కూడ కటక్ మీదనే ఉన్నది. ఒరిస్సాలోని రాజులు, మహారాజులు, జమీందారులు, సామంతులు అందరి మతిగతులు కూడ అనిశ్చితముగ నున్నవి. ఆటువంటి సమయములో ఖోర్ధా మీద దాడి చేయ కుండ ఏదో విధముగ హాఫిజ్ కాదర్‌ను కటక్‌నకు రప్పించి బంధించినట్లయిన —కాని ఫౌజుదారుని ద్వారా పంపిన వర్తమానము వలన అతడు శంకించి అసలు రావడమే మానివేసిన? రాకపోవడమే నైజముగ కన్పిస్తున్నది. ఈ సమయములో ఖోర్ధామీద దాడిచేయుట కూడ అసంభవమే!

"హాఫిజ్ భైయా మన బంధువు. ఈ వంటి పండుగ సమయములో ఫౌజ్‌దారుని పంపి అతనిని బంధించి రప్పించుట అంత మంచిదిగ కనబడుట లేదు. అతనికి నీవు ఒక లేఖ వ్రాయుట మంచిది, రాకుమారీ. హాఫిజ్ భైయా తప్పకుండ నీవద్దకు వచ్చునట్లు వ్రాయి. పండుగ పూర్తి కావస్తున్నది. అతని రాక చాలా అవసరము." అని తకీఖాన్ అన్నాడు,

వారిద్దరి సంభాషణలో మాటి మాటికి హాఫిజ్ కాదర్ పేరు వినిపించుట వలన పంజరములోని చిలుక గంతులు వేస్తూ ఇటునటు చూడసాగినది. హాఫిజ్ కాదర్ బార్యాటిలో నున్నప్పుడు ఈ చిలుక ఆయనకు అత్యంత ప్రీతి పాత్రముగ నుండెడిది. దానికి "ఖుదా హాఫిజ్ ! ఖుదా హాఫిజ్!" అని అనడము రజియాయే నేర్పినది. హాఫిజ్ కాదర్‌ను అదిచూచినంతనే "ఖుదా హాఫిజ్! ఖుదా హఫిజ్ ! " అని వల్లెవేయుచుండెడిది. ఇప్పుడు ఆ పేరు విన్నంతనే ఆ పనినే చేయసాగినది.

చిలుకను చూసి నవ్వుచు, "నా లేఖ ఈ చిలుకే! దీనిని చూడగనే ఆయన ఎక్కడ ఉన్నా, ఎలాఉన్నా, తప్పక బయలుదేరి నా వద్దకు వస్తారు. తమరు ఏ కొజ్జా నౌకరు చేతనైనా ఈ చిలుకను ఖోర్దాకు పంపండి" అని రజియా అన్నది.

హాఫిజ్ - రజియాల మధ్య ఈ చిలుక ఎటువంటి రహస్యమయ ప్రేమ సంకేతమో తెలియదు. ఉత్తరముకన్న ఈ చిలుక ఎక్కువ సంవేదనాశీలి, శక్తిశాలి అనుటలో తకీఖాన్‌కు ఎటువంటి సందేహము లేదు.

పంజరములోని చిలుక సందిగ్ధ దృష్టితో ఒకసారి రజియావైపు మరి యొకసారి తకీఖాన్‌వైపు చూసి "ఖుదా హాఫిజ్ ! ఖుదా హాఫిజ్ !"అని వల్లించి నది. మరల మౌనము వహించినది. తమ తమ ఆలోచనలలో మునిగి ఉన్న రజియా తకీఖానులు గూడ మౌనముగా ఉన్నారు. ఆ సమయములో శహనాయి వైని వాగేశ్వరీ మందర సంగీతము, దానికి తాళము వేయుచున్నట్లుగా కపోత స్వరము తప్ప మరియే ఇతర శబ్దము వినబడడం లేదు. నలువైపులా గహనమైన శాంతి...అశేషమైన నీరవత వ్యాపించినది.

2

సింహల బ్రహ్మపుర్ గ్రామములో గాజీమియా పీర్ చంపబడిన వెను వెంటనే బాణ్‌పూర్ సాలేరి కనుమలలో చికాకోల్‌నుండి తీసికొని వెళ్ళుచుండిన నజరానా సొమ్ము దోపిడి కాబడినవన్న వార్త ఖోర్ధా నలుమూలల భయాందో నలను వ్యాపింపజేసినది.

ఏనుగుపైన నజరానా సొమ్మును తీసికొని చికాకోల్‌నుండి ఫౌజ్‌దార్ ఒకడు కటక్ వెళ్ళుచున్నాడు. అతనితోగూడ సుమారు ఏబదిమంది సైనికు లున్నారు. ఢిల్లీనుండి మడియమడియకు ఈ సొమ్ముకొరకు ముర్షిదాబాద్‌కు కబురు వెళుతున్నది. అదేవిధముగ ముర్షిదాబాద్‌నుండి కటక్‌నకు తాకీదులు వస్తున్నవి. అటువంటి సమయములో ఇంత పెద్ద మొత్తము దోపిడీ చేయబడిన దనిన యింతకన్న భయంకరమైన ప్రమాదకరమైన,విషయము ఏముండగలదుఁ

ఖోర్ధామీద మొగల్ దాడులు తిరిగి ప్రారంభము కాగలవన్న భయాందోళ నలు ఖోర్ధాయావత్తు ఆతంక పరచినవి. ఇంచించికి నిప్పు అంటించబడుతుంది. గ్రామగ్రామము ధ్వంసము కాగలదు. ఆత్మరక్షణకొరకు ప్రజలు అడవులలోనికి పరుగెత్తికొనిపోయి తలదాచుకొందురు వెళ్ళలేనివారి గౌరవము మట్టిపాలుకాక తప్పదు....మొదలైన గత భయానక స్మృతుల వలన ఖోర్ధా నివాసులు భయ కంపితులైనారు. త్రాహిత్రాహిఅని ప్రజల ఆర్తనాదము తిరిగి నలువైపులా వ్యాపించసాగినది.

కాని ఈ ఆతంకము, ఆళంకలమధ్య కూడ ఖోర్ధారాజ్యము మొత్తముపైన వ్యాకులరహితులు ఎవరైనా ఉన్నారంటే ఆయన ఖోర్ధా రాజు రామచంద్రదేవ్ ఒక్కరే కాని తకీఖాన్ ప్రతినిధి లోధుమియా మొదలుకొని ఆయన ఖలీఫా గదాధర్ మంగరాజ్‌వరకు రామచంద్రదేవుకు సంభవించనున్న విపత్తును గురించి ఆలోచించి చింతితులుగనున్నారు. కానిరామచంద్రదేవునకు స్వయముగ మనసులో ఏవిధమైన చింత కూడ లేదు.

ఈద్ ఉత్సవ సంతోషములో హాఫిజ్‌కాదర్ అనగా రామచంద్రదేవ్ తెల్ల దొరలమద్యమును సేవించడములో లీనమైయున్నారు సభాభవనములో మఖమల్ తివాసీలమీద రంగు రంగు దిండ్లను అనుకొని పడుకొనిఉన్న రామచంద్రదేవ్ సంతృప్తులుగ కనిపిస్తున్నారు వారి ఎదుటనే లోధుమియా,గదాధర్ మంగరాజ్ కూర్చుని ఉన్నారు. వారికి చేరువలో గ్రహవిప్రులు, కుశనాయకులు కూర్చొని గ్రహకుండలిని తయారుచేసి రామచంద్రదేవుని జన్మపత్రికను పరిశీలిస్తున్నారు. అనేక జ్యోతిషగ్రంథములను ఇటుసటుత్రిప్పి వారి కటక్ ప్రయాణమునకు సుముహూర్తము నిర్ణయించుటకు ప్రయత్నిస్తున్నారు కాని వారికి అవి సంభవము కావడములేదు.

తకీఖాన్ ముర్షిదాబాద్‌నుండి తిరిగి వచ్చినప్పటినుండి రామచంద్రదేవ్ ప్రయాణమునకు తగిన ముహూర్తము దొరకలేదు. అందువల్ల ఆయన కటక్ వెళ్ళలేకపోయినారు. ఈ విషయమై లోధుమియాకు ఎట్టి అనుమానము లేదు. ఆరోజులలో యోగలగ్నము లేక శుభముహూర్తము పట్ల పింపువుకన్న ముస ల్మానులకే ఎక్కువ నమ్మకము ఉండెడిది. సయ్యాద్ తేక మహేంద్ర ముహూ ర్తము వచ్చేవరకు మొగల్ ఫౌజ్‌దార్లు యుద్ధములకుగాని, దోపిడులకుగాని బయలుదేరేవారు కారు. ఆ మహేంద్ర ఘడియ ఇంకనూ రాకపోవడము వలననే రామచంద్రదేవ్ తకీఖాను కలినికొనుటకు వెళ్ళలేకపోతున్నారు. చివరకు ఆ నమ్మకము లోధుమియాకు బలముగ ఏర్పడినది. ఇందులో ఏదో వన్నుగడ ఉండిఉండవచ్చుననన్న అనుమానము లేశమైన అతనికి కలుగలేదు. అందుచేతనే ఆ విషయమును వార్తాహరులద్వారా కటక్‌కు అతడు కబురు చేసినాడు.

"ఇన్నాళ్ళయినను ఆ శుభముహూర్తము కలినిరానేలేదా ? రామచంద్ర దేవుని జాతక చక్రమే తప్పయి ఉండవచ్చును, లేదా జ్యోతిషులు లెక్కించడ ములో పొరబడి ఉండవచ్చును. ఇవేవీ కాకపోతే లోధుమియా కండ్లలో దుమ్ము కొట్టుటకు ఇదొక ప్రయత్నమైనా కావచ్చును," ఈవిధమైన ఉత్కంఠ వారము దినములపాటు జరుగుతున్న పండుగ దినములు గడుస్తున్నకొలది తకీఖాన్ మనస్సులో పెరగజొచ్చినది.

రామచంద్రదేవుని పాత్రలో వణుకుచున్న చేతులతో లోధుమియా మధువును నింపుచున్నాడు. మద్యపానమును సేవించువానివలె రామచంద్రదేవ్ నటించుచు" చాలు, చాలు ఆపండి లోధుమియాజీ! మీరు త్రాగండి నాకు త్రాగవలెనని లేదు. నజరానా డబ్బు దోపిడిచేయబడినప్పటినుండి నాకు మనశ్శాంతి లేకుండా పోయినది. తకీఖాన్ మనకు దగ్గర బంధువాయె. ఆయన ఎమనుకొంటున్నారో: జరుగక జరుగక ఈ దోపిడి మన యిలాకాలోనే జరిగినది. లోకరక్షకులు, ప్రభువులు, కటక్ సూబా శాసకులు అయిన నాయబ్-నాజిమ్‌వారు మనకు ఆత్మబంధువులు. అందువలన నాకు దుఃఖము మరింత ఇనుమడిస్తున్నది. ఇంత పెద్దపండుగ సమాప్తమవనున్నది. అయినా ఆయనకు మా ముఖము చూపించు యోగ్యత సంప్రాప్తించలేదు." అనినారు.

లోధుమియా తన గుమ్మడికాయవంటి శరీరమును అనేక భంగిమలలో ఆడిస్తూ రామచంద్రదేవుని పాత్రలో మధువును నింపుటకు ప్రయత్నిస్తూనే ఉన్నాడు. పరుపుమీద వాలి "మీరు ఏమీ చింతించకండి రాజాబహదుర్‌గారూ: అల్లాహుజూర్‌వారి సంకల్పము వలన ఆ దోపిడిగాండ్రు నరకమునకు పోగలరు. వందసారులు, లక్షసారులు, నరకమునకు పోదురు." అని లోధుమియా రామచంద్రదేవును ఓదార్చుట ప్రారంభించినాడు.

"నిస్సందేహముగా, నిస్సందేహముగా: అని దిండుమీద కొడుతూ ఖలీఫా గదాధర్ మంగరాజ్ అరచినాడు.

మరొకసారి గ్రహకుండలిని తయారుచేసి, లెక్కలు కడుతూ కడుతూ ఏదో మరచినట్లు ఆగి, మధుపానమత్తులైన రాజావారివంక గ్రహవిప్రులు కుతూహలముతో చూసినారు.

రామచంద్రదేవ్ వారివైపు సంకేతపూర్ణదృష్టితో చూసి, చీవరించుకొని "ఏమిటిది: ఏడురోజులు గడచినా మీరింతవరకు ఒక శుభముహూర్తమును నిర్ణయించలేకపోతున్నారు," అని అన్నారు.

13

తయారుచేసిన కుండలిని చేతితో తుడిచి, ఒక్కొక్క తాళపత్ర గ్రంథమునే తీసి దాని పుటలు తిరుగవేసి, "నిర్ణయిస్తున్నాను నిర్ణయిస్తున్నాను ఛామూ! ఇది నా చేతిలోని పనికాదుకదా! ఛామూ! మీది మేషరాశి, భరణీ నక్షత్రము... దానినించా బుధుడు వీక్షిస్తున్నాడు.ధనుస్సుకు రెండు రోజులు ముందు ఏవిధముగా చూసినను ముహూర్తము బాగుండలేదు. నేనుఏమిచేయగలను? ఇంకాకొంత ఆలస్యము తప్పదు" అని కుళనాయకుడు కంపిస్తున్న స్వరముతో చెప్పి, చింతితుడై మరల కుండలిని తయారుచేయనారంభించినాడు.

లోధుమియా, తన ప్రయత్నములో కృతకృత్యుడయినాడు. రామచంద్ర దేవుని మధుపాత్రను నింపి "సయీద్ దొరుకుతుంది, మహారాజా! ఈనాడు కాకపోతే రేపు...మీరు త్రాగండి... త్రాగండి మహారాజా!" అని ఆనందముతో అనినాడు.

నలుగురికి కనబడేటందుకు మాత్రమే రామచంద్రదేవ్ ఉత్సవ భోగ విలాసములలో పాల్గొంటున్నారు. ఏదో ఒక అమంగళపు పదధ్వని వినుట కొరకే ఆయన ప్రతిక్షణము చెవియొగ్గి కూర్చున్నట్లుగా ఉన్నారు. అందువల్ల అడుగులో అడుగు వేసికొంటూ, భయపడుతూ భయపడుతూ సభా భవనములోనికి ప్రవేశించిన ప్రతిహారి రాకను, అతడు తొంగిచూడడమును లోధుమియా, గదాధర్ మంగరాజ్‌లు గమనించకపోయినను రామచంద్రదేవ్ మాత్రము కనిపెట్టినారు. వారు ఆ వైపునకు ఆశంకిత మనసుతో మాడ సాగినారు.

"కటక్ లాల్‌బాగ్‌నుండి ఛామూవారిని దర్శించుటకు ఒక కొజ్జా వచ్చియున్నాడు" అని ప్రతీహారి మనవి చేసినాడు.

తమ గుండె దడదడ కొట్టుకొనడము రామచంద్రదేవునకు వినిపించినట్లయినది. కాని ఈ విధమైన పరిస్థితిని ఎదుర్కొనుటకు వారు చాల దినముల నుండి నిరీక్షిస్తూనే కూర్చుని ఉన్నారు.

కటక్‌నుండి వచ్చిన ఆ కొజ్జాను లోనికి ప్రవేశపెట్టనలసినదిగ రామచంద్రదేవ్ సంకేతమూలముగ ఆదేశించినారు. ఒక గుక్క-లో తమ మధుపాత్రను ఖాళీ చేసివేశారు. ఆ వ్యాపారములన్నిటిలో సంపూర్ణ నిస్పృహతోను, ఉద్వేగ రహితముగను, అనాశక్తితోను ఉన్నట్టు తిరిగి దిండుగానుకొని పడుకొనినారు రామచంద్రదేవ్.

మరి కొద్దినేపటిలో పంజరమును పట్టుకొనివచ్చిన కొజ్జా సభాభవనములో ప్రవేశించి రామచంద్రదేవుకు వంగి సలాముచేసి "రాకుమారి రజియా బేగంజీ హుజూరువారి సేవలో ఈ చిలుకను పంపినారు. తమరిని కటక్ దయ చేయమని కబురు పంపినారు." అని విన్నవించినాడు.

ఆ వాతావరణమును చూసి చిలుక పంజరములో రెక్క-లను విదలించి కర్కశ స్వరముతో అరవసాగినది. రామచంద్రదేవువారి సౌంజ్ఞానుసారము ఆ కొజ్జా ఆ పంజరమును వారికి చేరువగ ఉంచినాడు. లోధుమియా, గదాధర్ మంగరాజ్ మద్యముతో మత్తెక్కిన కండ్లను నులుముకొంటూ రాకుమారి పంపిన చిలుకను విస్మిత నేత్రములతో చూడసాగినారు ఈ అమ్భ సమస్య యొక్క సాంకేతికార్థము వారికి అర్థము కాలేదు. రామచంద్రదేవ్ కూడ దానిని వెంటనే గ్రహించలేపోయినారు

ఆ చిలుక ఇటునటు చూసినది. అకస్మాత్తుగ రామచంద్రదేవుని చూసి "ఖుదా హాఫిజ్ !" అని పలుకనారంభించినది.

ఆ పరిచిత సంబోధనను విన తరువాత రామచంద్రదేవ్ కండ్లముందు తమ బార్వాటి దుర్గ కారాగార జీవితములోని దృశ్యములన్నియు కదలాడినవి. ఈ చిలుకవలెనే ఆయనకూడ ఒకనాడు మాల్‌కువా గ్రామములో బంధింపబడి బార్వాటికి కొనిపోబడినారు.

"ఖుదా హాఫిజ్, ఖుదా హాఫిజ్" అని చిలుక పలుకుతూనే ఉన్నది.

"రాకుమారిగారి చిలుక పెద్దమనిషితరహా గలది, చాల తెలివైనది" అని లోధుమియా దానిని ప్రశంసించినాడు.

రామచంద్రదేవ్ ఆసనంమీద లేచికూర్చున్నారు. ఆయన లోధుమియాను చూసి "మీరు నాయబ్ - నాజిమ్ బహాదుర్ వారికి కబురు చేయండి మంచి మహూర్తము లభించినను లభించకపోయినను మేము రేపే కటక్‌కు బయలు దేరుచున్నాము" అని అన్నారు.

పంజరములోని చిలుక అప్పుడుకూడ "ఖుదా హాఫిజ్ ఖుదా హాఫిజ్" అని అంటూనే ఉన్నది.

రజియా బేగం పంపిన ఆ ప్రియమైన చిలుకను రామచంద్రదేవ్ చేతిలోనికి తీసికొని, దానిని ప్రేమతో నిమురుతూ వదిలివేసినారు. ఆ చిలుక ఇటు నటు చూసి తుర్రుమనుచు ఎగిరిపోయినది.

కొజ్జా తన రెండు చేతులను ఆశ్చర్యతతో ఆడిస్తూ "ఎగిరిపోయినది. ఎగిరిపోయినది, రాకుమారి రామచిలుక ఎగిరిపోయినది' అంటూ ఆరవ నారంభించినాడు.

లోధుమియాఁ అతనికి వంతపలికినాడు.

అప్పటికి భీతర్‌గఢ్ ప్రాసాదమునకు బయటనున్న ముండ్ల వెదురు పొదలను దాటి ఎగురుకొంటూ ఆ చిలుక ఎక్కడికో అదృశ్యమయినది.

రామచంద్రదేవ్ పెద్దపెట్టున ఒక్కసారి వెర్రి నవ్వు నవ్వినారు. ఆయనకు మత్తు పూర్తిగ వదలినది. వారి వెర్రినవ్వుతో భీతర్‌గఢ్ ప్రాసాదపు మూర్ఛిత వాతావరణము ప్రతిధ్వనించినది. ఆ ప్రతిధ్వని నలువైపులను మారు మ్రోగినది.

ఆ మరుసటి ఉదయమునకే రామచంద్రదేవ్ భీతర్‌గఢ్ ప్రాసాదములో కనబడలేదు. వారు కటక్ చేరనేలేదు. రాకుమారిచిలుకవలెనే వారుకూడ అరణ్యములు, పర్వతములలో ఐది ఎక్కడికో ఎగిరి వెళ్ళిపోయినారు.

3

లాల్‌బాగ్ దీవాన్-ఏ-ఖాస్ దర్బారులో తకీఖాన్ బాలీసును పరివేష్టించి ఫౌజ్‌దారులు, వజీరులు, మహతాసీవులు తమ తమ ఆసనములపై కూర్చుని ఉన్నారు. హిందువుడైన అమీన్ చంద్ మొదలగు ఇతర సభాసదులుగూడ ఆ దర్బారులో నున్నారు అన్యులు ఆ దర్బారులోనికి ప్రవేశించుటకు వీలులేకుండ బయట గట్టికాపలా ఉన్నది. ఈగ కూడ అందులోనికి చొరడానికి వీలులేదు.

సింహాల బ్రహ్మపుర్ గ్రామములో మతయోధుడు గాజీసుల్తాన్ బేగ్‌ను పట్ట పగలు కాఫిరులు హత్యచేయుట, చికాకోల్ ఫౌజ్‌దారుపైన సాలేరి కను మలవద్ద దాడి సలిపి నజరానా సొమ్మును కాజేయుట, ఆ పైని తకీఖాన్ ప్రభుత్వ ఆదేశములను నిరసించి ఖోర్ధా రాజు ఈద్ సందర్భములో తకీ ఖానును దర్శించకపోవుట మొదలైన విషయములన్ని నవాబ్ సుజాఖాన్ వారి వరకు వెళ్లినట్లయిన ఓరిస్సా నాయబ్-నాజిమ్ పదవినుండి తకీఖాన్ బర్తరఫ్ కావడము నిశ్చయము. తకీఖాన్‌లోని దౌర్బల్యము వలననే ఓరిస్సాలోని మొగల్ చక్రవర్తుల ఆధిపత్యము విపత్తులకు లోనయినదని సుజాఖాన్‌తో చెప్పుటకు ముర్షిదాబాద్‌నుండి ఢిల్లీవరకు తకీఖాన్‌కు శత్రువులు తక్కువగా లేరు.

మూర్ఛరోగివలె తకీఖాన్ కంపించి పోతున్నాడు ఆ సమయములో సభా సమంలో కొందరు తకీఖాన్‌కు మధు పాత్రలను అందిస్తున్నారు. కంపన తీవ్రత తగ్గుటకు తకీఖాన్ ఉండి ఉండి ఒకటి రెండు గుక్కల మధ్యమును సేవిస్తున్నాడు, దుష్టుడైన రామచంద్ర దేవుని బంధించి ఆతనికి ఎటువంటి కఠిన శిక్ష విధించవలెనన్న విషయముపై ఆనాడు తీవ్ర సమాలోచనలు జరుగు తున్నవి.

కొజ్జా చిలుక సందేశమును తీసికొని వెళ్లినాడు. రామచంద్రదేవ్ లాల్ బాగ్‌కు ఎప్పుడు వస్తారా అని అందరు ఉత్కంఠతో అక్కడ నిరీక్షిస్తున్నారు,

ఖోర్ధా రాజునుండి ఇంకను ఏ వర్తమానమురాలేదు. కొజ్జావాడు ఏ వార్తను తీసికొని తిరిగి రాలేదు. వారిరువురిలో ఏ ఒక్కరూ ఇంకా రాలేదన్న విషయమును కొత్వాల్ జబార్‌ఖాన్ పదే పదే వచ్చి చెప్పి వెళుతున్నాడు.

ఉన్నట్టుండి "ఆ నికాకోల్ ఫౌజ్‌దారును ప్రవేశ పెట్టండి" అని తకీఖాన్ గర్జించినాడు.

సాలేరీ కనునులవద్ద దారిదోపిడిగాండ్ర చేత దెబ్బతిని తనతోగూడ వచ్చిన సైనికులను వెనకకు పంపివేసి, ఆ దుర్వార్తను తకీఖాన్‌కు తెలియ జేయుటకు ఫౌజ్‌దార్ ఒంటరిగ లాల్‌బాగ్ వచ్చినాడు. వెంటనే అతనిని బంధించి తకీఖాన్ ఖైదులో పెట్టించినాడు ఈ ఫౌజ్‌దారుని అసమర్థతవల్లనే మొగల్ ప్రభుత్వ గౌరవమర్యాదలే దోపిడి చేయబడినవి. ఆ ఫౌజ్‌దారే నజరానా సొమ్మును కాజేసి ఈ దోపిడీ కథను కల్పించినాడేమో!

ఆ రోజులలో మొగల్ అధికారులు ఇతరులను నమ్మడముమాట అటుంచి వారి నీడను వారే నమ్మేవారు కారు, ఉన్నత పదవికోసము ఆదర్శములను, ఆత్మగౌరవములను విడనాడిన ఆ అధికారులలో స్వార్థము, అధికారవాంఛ పెరిగి పోయినవి. వాటికొరకు జరుగుచున్న కుక్కల పోరాటములవలన వారిలో ఎవరికిగూడ ఆత్మ విశ్వాసము లేదు. తమ్ము తాము విశ్వసించడము అసంభవ మయినది.

మొగల్ శక్తి క్షీణించుచుండిన ఆ కాలములో ఢిల్లీనుండి ముర్షిదాబాద్, ఆజిమాబాద్‌నుండి కటక్‌వరకు ప్రతిచోట ఈ అవలక్షణములు పెచ్చు పెరిగినవి.

దారిదోపిడికి సంబంధించిన వివరములను ఆదినుండి అంతమువరకు ఫౌజ్‌దార్‌నుండి తకీఖాన్ విననేలేదు. అతనికి వినే ఓపికకూడ లేదు. చేతులకు బేడీలు, కాళ్లకు సంకెళ్లు తగిలించి చికాకోల్ ఫౌజ్‌దారును సభాభవనము లోనికి ప్రవేశ పెట్టగనే తకీఖాన్ తన కాళ్లను నేలపైన గట్టిగాకొట్టి "నీవు చికాకోల్ నుండి బయలుదేరినప్పుడు నీతో ఎంతమంది సైనికులు ఉండిరి?" అని గర్జించి అడిగినాడు.

ఫౌజ్‌దార్ వణికిపోతూ "మహాప్రభూ! వంద మంది ఆశ్వికులుండిరి. రెండు ఏనుగులపైని సొమ్మును భద్రపరచి, మేము పర్వతమయమైన అరణ్య మార్గమున వస్తుంటిమి ఆశ్వికులు ఆ ఏనుగులకు ముందు, వెనుకకూడ ఉండిరి. వారందరి వెనుకనే నేను ఉంటిని."

"ఊఁ, ఆ తరువాత ?" అన్నాడు తకీఖాన్.

"దయామయులైన మహాప్రభూ! శీఘ్రాతి శీఘ్రముగ లాల్‌బాగ్ చేరు కొనవలెనని దారిలో ఎక్కడను మజిలీ చేయకుండ రాత్రింబగళ్లు ప్రయాణము చేస్తూ ఎలా వస్తూ ఉంటిమో ఆ ఖల్లాకే ఎరుక, మేము ఎక్కువగా భయపడి నది ఆ ఛత్రద్వార కనుమవద్దనే. కాని అక్కడ ఏ ప్రమాదము జరుగలేదు. బాణ్‌పుర్ దాటి సాలేరీ చేరేసరికి సాయంత్రమయి ప్రొద్దు వాలిపోతూ ఉండెను. అరణ్యమార్గము కావడముపలన పగటి వెలుగుకూడ అక్కడ మందము గనే ఉండెను. చీకటి పడులోపల ఎట్లయినను 'కుహుడీగఢ్' చేరవలెనన్న సంకల్పముతో ఆశ్వికులను త్వరితగతిని పొమ్మని హుకుం జారీచేసినాను. 'కుహుడీ గఢ్' ఏలినవారి ఇలాకాలోనే ఉన్నది. ప్రాతఃకాల నమాజ్ ముగించుకొన్న తరువాత కుహుడీ నుండి బయలుదేరితే త్వరలో ఖోర్ధా చేరుకొనవచ్చును. మరు నాటికి కటక్ చేరుతాము..." అని ఇంకా ఏమో ఫౌజ్‌దారు చెప్తూన్నాడు.

"ఏమిటీ ఈ ఆసందర్భపు వాగుడు! దారిదోపిడి ఎవరు చేసినారు! శత్రు సైనికులు ఎంతమందిఁ ఈ వివరములను తెలియజేయి" అని తకీఖాన్ ఒక్కసారి అరిచినాడు.

"ప్రభూ! సాలేరీ కనుమలలో పదిహేను ఇరవై అడుగుల ముందున ఏమున్నది మాకు కనుపించలేదు. మేము ఆ మార్గమున పోతూ ఉండగ మాపైని శరవర్షము కురిసినది దీనికితోడుగ "జై జగర్‌నాత్!" అన్న ప్రతి ధ్వనులతో సైతాన్ ఆరుపులవలె అడవి అంతా మారుమ్రోగినది. మా గుర్రములు రౌతులను నేల పడవేసి చెల్లాచెదరయినవి. నేను కత్తితీశాను..." ఫౌజ్‌దార్ ఇంక చెప్పలేక తన రెండు చేతులతో గాయపడిన ముఖమును కప్పుకొని విలపించ సాగినాడు.

"ఆడదానిలా ఏడవడము ఆపు మీరు, ఆ తరువాత" అని తకీఖాన్ గర్జించినాడు.

ఖోర్ధా రాజుపైన కని తీర్చుకొనటకు సమయముకొరకు ఎదురు చూచు చుండిన మహతాసీవ్ జుల్ఫికార్‌కు తగినసమయము దొరికినది "కాఫిరులు 'జయ్ జగర్‌నాత్!' అని అరుస్తూ నజరానా డబ్బును లూటీ చేసినారు, మహా ప్రభూ! దీనికి ఖోర్ధా రాజు కాక ఇంకెవరు బాధ్యులు? ఈ సొమ్ము సురక్షిత ముగా కటకము చేర్చవలసిన బాధ్యతను తీసికొనవలసినదని అయనకు తగి నంత ముందుగనె తాకీదులు పంపడమయినది కదా. ఆయన తప్ప అక్కడ ఈ దోపిడీ మరెవరు చేయగలరు? పీర్ ముజాహిద్ హత్య నైనా తమరు సహించ వచ్చునేమో గాని దీనిని సహించుట అసంభవము" అని జుల్ఫికార్‌ఖాన్ తకీ ఖాన్‌ను రెచ్చగొట్టినాడు.

తకీఖాన్ తిరిగి కోపముతో కంపించిపోయినాడు, "ఈ దరిద్రుడు హాఫిజ్ కాదర్ చర్మమునుండి ఒక్కొక్క రోమమే పటకారుతో పీకించి ఈ సొమ్మును అతని దగ్గరనుండి వసూలు చేస్తాను. అతరువాత ఖోర్ధా మన సొంత మవుతుంది. అటు పిమ్మట జగన్నాథుని ముక్క ముక్కలు చేసి మట్టిలో కలివి వేస్తాను" అంటూ తకీఖాన్ అరచినాడు.

కోపముతో వణికిపోతుండిన తకీఖాన్ ఇంక ఏమీ చెప్పలేక పోయినాడు. రామచంద్ర దేవునిపై నుండిన కని అంతటితో తీరలేదు. అతని యోచన అంత టితో ఆగలేదు. ఖోర్ధా రాజుకు ఎటువంటి శిక్షను విధించవలెనని అతడు ఆలో చింపసాగినాడు.

ఇంతలో గజగజ వణుకుచున్న చేతులతో ఖాళీ పంజరము పట్టుకొని కొజ్జా సభాస్థలములోకి ప్రవేశించినాడు. అందరి చూపులు అతనివైనే నిలిచినవి.

"హాఫిజ్ కాదర్ ఎక్కడ? ఎక్కడ ఉన్నాడు?" అన్న ప్రశ్నలే అందరి నోటివెంటా ప్రతిధ్వనించి నట్లయినది.

"ఖోర్ధా రాజు ఎటు పరారి అయినారో తెలియదు, ఖోర్ధా కోటలోగూడ ఎవరికిని తెలియదు" అని కంపిస్తున్న స్వరముతో కొజ్జా బదులు చెప్పినాడు.

"మరి మా రాకుమారి చిలుక ఏదీ?" అని పట్టరాని కోపముతో గర్జిస్తూ తకీఖాన్ అడిగినాడు.

"పంజరమును తెరచి ఖోర్ధా రాజావారే చిలుకను ఎగుర గొట్టినారు" అని కొజ్జా చెప్పినాడు.

"రాకుమారి చిలుకను ఎగురుగొట్టుటేకాదు, తకీఖాన్ శాసనమునే ప్రేలెత్తి చూపించి ఎగతాళి చేసినాడు అతడు," అని తకీఖాన్ భావించి వెంటనే లేచి నిలుచున్నాడు. విపరీతమైన కోపమువలన తకీఖాన్ జ్ఞాన శూన్యుడైనాడు, దీవాన్-ఏ-ఖాస్‌లోని ఒక నల్లచలువరాతి స్తంభమువైన తన కత్తినిదూసి అతడు ఒక వ్రేటు వేసినాడు. కత్తివ్రేటుకు స్తంభము ఖంగున మ్రోగినది. కత్తి మధ్యకు రెండు ముక్కలైనది. తన చేతిలోని కత్తిముక్క రామచంద్ర దేవుని శిరస్సుగ భావించి దానిని గట్టిగ పట్టుకొని అతడు చూసినాడు.

తకీఖాన్ క్రోధావేశము సభాసదులను దిగ్భ్రాంతులను చేసినది. సైన్యము వెంటనే ఖోర్ధాకు ప్రయాణము కావలెనని అతడు ఆజ్ఞాపించినాడు.

సర్కారు వారు స్వయముగా సైన్యము తీసికొని ఖోర్ధాకు ప్రయాణమవు తున్నారని కటక్ హవేలీలో గగ్గోలు ప్రారంభ మయినది.

అర్ధ చంద్రాంకితమైన జండాను ఎగురవేసికొంటూ తుపాకి సైనికులు, పదాతిసేన, అశ్విక సైన్యమును వెంటబెట్టుకొని పరమ విక్రమశ్రైన తకీఖాన్ యుద్ధయాత్రకు బయలుదేరినాడు.

అదే సమయములో బాంకీ సరిహద్దు ప్రాంతములో కీకారణ్యముల మధ్య నున్న చాండిమాల్ పర్వతములలో ఒక శిఖరముపై కూర్చొని, ఆవరణహీన మైన వనభూమియొక్క పుష్యమాసాంతపు ఉదాస సౌందర్యమును ముగ్ధమోహన దృష్టితో రామచంద్రదేవ్ తిలకిస్తున్నారు. "ఇన్ని రకములైన పక్షులు, ఇంత

అవ్యక్త మధురధ్వని, ఇంత చక్కని కాంతి, ఇన్ని రంగుల పూవులు, ఇంతటి శీతల ఛాయ, ఇంత ప్రశాంతి-ఇవన్నియు అశంకాపీడితయైన ఈ పృథ్వీలో మరెక్కడైనను లభించుట సంభవమా?" అని వారు ఆలోచిస్తూ తమలో తామే ఆశ్చర్యముతో మురిసిపోతున్నారు. నవవసంత కిసలయ సుషమా మండిత యగుటకు ముందు వనలక్ష్మి తపోక్లిష్టమైన అపర్ణరూపమును ధరించినట్లున్నది ఆ దృశ్యము. రాసులు రాసులుగ ఎండుటాకులు వాయు ప్రవాహములో మృదు సంగీత ఝంకారముతో చెట్లపైనుండి భూమి మీదకు తిర్యగ్రేఖలవలె రాలుచున్నవి. జీవన వృక్షము నుండి రాలిపోవుటలో గూడ ఇంత ఆనందమున్నదా? శూన్యతలో గూడ ఇంత ఐశ్వర్యమున్నదా?...ఈ అనుభవము రామచంద్ర దేవునికి అర్ధానుభవము మాత్రమే! వారి ఆశంకాదగ్ధ లలాటముపైన కలుగుచున్న దక్షిణ పవన మంద శీతల స్పర్శవలన వారి నేత్రములు తంద్రాచ్ఛన్నమగుచున్నవి.

ఇన్ని పక్షులు...ఇంత కాకలి స్వరము...పరస్పర భిన్నములు... స్వతంత్ర మైనవి....అన్నిటికిని స్వీయ ప్రత్యేకతలున్నవి.

రామచంద్ర దేవ్ ఆ ఒక్క క్షణము తకీఖాన్ దాడిని గురించి, ఖోర్ధా భవిష్యత్తును గురించి మరచి పోయినారు.

భీతర్ గఢ్ ప్రాసాదమును వీడి ఈ విధముగ పర్వతారణ్యముల లోనికి పారిపోవుట రామచంద్ర దేవునకు ఇదిప్రథమ పర్యాయముకాదు. గతములో అనేక సారులు ఇట్టి పరిస్థితులు ఖోర్ధాలో ఏర్పడినవి. అవే మాటి మాటికిని పునరావృత్తమగుచున్నవి. ఇది పలాయనము కాదు. ఇదికూడ ఒక విధమైన రణ కౌశలమే! శిశుపాల్ గఢ్, ధవులిగఢ్, రథీపుర్‌గఢ్ మొదలగు దుర్గములలో పోరాడి ఖోర్ధా చేరుకొనే సమయమునకు మొగల్ సేన అలసిపోవును. అప్పుడు ఖోర్ధాలోను, దాని నలువైపులను పరివేష్టించి యున్న పాయక్ సేనలు ఉత్తాలపు టలలవలె వెనకనుండి వచ్చి పడుదురు. వీరి ధాటికి మొగలు సేనలు నిలువ లేక పోవును. ఇందువలననే గతములో మొగల్ సేనలు మాటి మాటికి పరా

జయమును పొందినవి. ఈ పర్యాయము గూడ తకీఖాన్ సేన ఈ విధముగనే పరాజయము పొంది వెనుదిరిగి పోక తప్పదు. ఈ విషయములో రామచంద్ర దేవునకు ఎట్టి సందేహము లేదు. దోచుకొన్న నజరానా సొమ్ముతో పాయక్ లకు వారికి యివ్వవలసినది పూర్తిగ చెల్లించడమైనది. తత్ఫలితముగా వారిలో నూతన శక్తి కల్గినది. స్వభావానుసారముగా వారు పున్సంఘటిత మయినారు. మొగల్ సమ్రాట్ అక్బర్ మరణానంతరము నుండి నేటివరకు ఖోర్ధా సైనికులతో మొగల్ సేనకు ఈ విధమైన దాగుడు మూతలు జరుగుచునే ఉన్నవి. కాని ప్రస్తుతము తకీఖాన్‌తో సంభవించిన ప్రత్యక్ష శత్రుత్వము వలన ఖోర్ధా రాజ్యములోని శాంతికే కాక జగన్నాథ స్వామివారికి గూడ ముప్పు వాటిల్లగలదు. జగన్నాథుడు తిరిగి చిలికా సరస్సు ప్రాంతమునకు రావలసి వచ్చును. ఆత్మరక్షణ కొరకు మరల అడవులలో తిరగ వలసిన అగత్యము ఏర్పడ వచ్చును. ఈ సమస్యలే రామచంద్ర దేవుని చింతకు కారణ భూతమయినవి. అయినా వారు కొద్దిసేపు వాటినిగూడ మరచి పోగలిగినారు.

తాబేటి పీపుసంటి లతాగుల్మరహితమైన పర్వతము. వెనుకకు దుర్గమ మైన ముండ్ల వెదురు పొదలు; వాటిమధ్యను చెదురు మదురుగా ఆకాశవల్లీ, శ్రీవల్లీ లతలు పెనవేసుకొన్న నల్లచేష, మద్ది, వేప మొదలగు వృక్షములు. వీటివలన కొండ దిగువనుండి వైకి చూసినట్లయిన కొండ శిఖరము కనబడదు. ఆ కొండ చుట్టూ తూర్పు, దక్షిణ, పడమర దిశలందు దాండ్‌మాల్ పర్వత శ్రేణి ఉన్నది. దక్షిణ దిశను మణినాగ్ పర్వతమున్నది. పశ్చిమ దిక్కున ఒక కొండను వేరొక కొండనానుకొని ఒక శైలావర్తనము వలె ఖాండ్‌పడా పర్వతమాల కన్పిస్తున్నది. ఆ శైలశ్రేణి ఒకానొక అపూర్వ శోభాశాలిని, నీల వసన ధారిణి అయిన జవ్వనియొక్క తనూలత మరియు పీకోన్నత స్తనముల వలె దూరమునుండి గోచరిస్తున్నది. కాని రామచంద్ర దేవ్ నిలుచుండిన పర్వతము పైనుండి మాత్రమది కీకారణ్యముగను, భయంకరముగను కనిపిస్తున్నది. ఆ పర్వతమును అర్ధచంద్రాకారములో రణనదీ శాఖ యొకటి పరివేష్టించి దక్షిణ దిశగా ప్రవహించి మహానదిలో కలియుచున్నది. శైల దంతురితమైన నదీగర్భ

మును విదర్భము చేయుచు ఆక్కడక్కడ జలపాతము లున్నవి వాటిలో నుండి పుష్కలమైన క్షీణ స్రోతస్సొకటి నర్తిస్తూ ప్రవహిస్తున్నది. ఆదొక ప్రకృతి దత్తమైన కందకమువలె పర్వతమును ఒక వైపు సంరక్షిస్తున్నది.

రెండు వందల సంవత్సరముల పూర్వము పురుషోత్తమ క్షేత్రములో శూన్యవాద బౌద్ధ సన్యాసుల వైన జరిగిన అకథనీయమైన ప్రతిహింస నుండి బ్రతికి బయట పడినవారు బాంకీ వద్దనున్న కొండల మీద తమ సాధనా-భజన పీఠములను నెలకొల్పినారు.

ఈ కొండలలోని గుహలన్నియు ఆ రోజులలో వారి ఆత్మరక్షణకు ఆశ్రయస్థలములైనవి. అందుచేతనే ఈ పర్వతము శూన్యగిరిగా ప్రజలలో ప్రసిద్ధి కెక్కినది. ఘోర కలియుగ అవతరణానంతరము శూన్యదేహుడైన జగన్నాథుడు నీలకందరమును వీడి ఈ శూన్యగిరి వైని విరాజిల్లగలడని ప్రజల విశ్వాసము. ఏ నిరింజనదాసుని మాలికా గ్రంథములోనో ఈ విషయములన్నియు లిఖింపబడినవని ప్రజలు చెప్పుకొను చుందురు.

నిజమే! జగన్నాథుడు కొంతకాలముపాటు ఈ శూన్యగిరి వైకి వచ్చి విరాజిల్లినాడు. ఇది భోర్ధారాజు పురుషోత్తమదేవుని ఇరవైఒకటవ అంకము నాటి మాట! మొగల్ ఫౌజ్‌దార్ మక్రాంఖాన్ కటక్ వైపునుండి భోర్ధా మీదకు దండెత్తివచ్చినప్పుడు పూరినుండి జగన్నాథుడు చిలికా సరస్సు ప్రాంతమునకు తరలింపబడకుండ ఆ మార్గములో అప్రమత్తులైన కావలి వాండ్రను ఏర్పరచినాడు. అప్పుడు పురుషోత్తమ దేవ్ ఆలయ విగ్రహములను గుప్తమార్గమున ఈ పర్వతము మీదికి తరలించినారు. ఇప్పటికికూడ ఒక గుహలో జగన్నాథ, బలభద్ర సుభద్రల విగ్రహము లుండిన శిలా వేదికలు పడిఉన్నవి. అందుచేత త్రిపయేటా దూర దూరములనుండి యాత్రికులు ఆ దుర్గమారణ్య గిరి పథములను దాటివచ్చి ఆ శూన్య శిలావేదికలను పూజించు చుందురు ప్రతి కార్తీక పౌర్ణమినాడు ఈ శూన్యగిరి పాదప్రాంతము ప్రకారణ్యముగ కనపడుచుండును. శిలాదంతురితమైన రణదీ గర్భము ఆనాడు ఉత్సవ

కేంద్రమగుచుండును. వెనకటి రోజులలో శ్రీ జగన్నాథస్వామివారి ప్రముఖ కావలివానిగ రాజా పురుషోత్తమదేవ్ స్వయముగ మారురూపములో అనేక దినములు ఇతరసేవకులతోబాటు నివసించిరి. ఆసమయములోనేమ్రాంఖాన్ ఖోర్ధాను ఆక్రమించుకొని దానిపై తన అధికారమును చలాయించినాడు. తరువాత ఆతడు బాణ్‌పుర్‌పైపు సాగిపోసాగినాడు. అప్పుడు పురుషోత్తమదేవ్ వెనకనుండి అతని పైన దాడిచేసి ఓడించినారు. ఆ నాటి నుండి మరల జగన్నాథుడు అక్కడకు కొనిపోబడనేలేదు. కాని ఖోర్ధారాజులలో అనేకమంది మొగల్ దాడులకు భయపడి అక్కడ ఆత్మరక్షణ చేసికొనినారు.

రామచంద్రదేవ్ కూడ తకిఖాన్ దాడిచేయ వచ్చునన్న శంకతో ప్రస్తుతము ఆక్కడకు కొంతమంది సేనాపతులతోను, సర్దార్లతోను చేరుకొనినారు. యుద్ధదృష్టితో తిలకించినట్లయిన ఆ స్థలము ఆపదారహితమైనది. అంతేకాదు అక్కడనుండి ఇతర సంస్థానాధీశులతో సులభముగా సంబంధములు పెట్టుకొన వచ్చును.

అన్యమనస్కులైన రామచంద్రదేవ్ పచారుచేస్తూ ఆ శూన్య గుహను చేరుకొనినారు. గుహ దక్షిణ ముఖముగ నున్నందువలన మధ్యాహ్నపు సూర్యకాంతివలన లోపలి భాగమునందు వెలుగు బాగుగ నున్నది. గుహముందు ఒక దట్టమైన పనస వృక్షమున్నది. దాని ఆకుల మధ్యనుండి భూమిపై పడుచున్న సూర్యకాంతి చిత్ర విచిత్రమైన ఛాయాలోకపు ముగ్గులను వేయుచున్నది. గత సంవత్సరము భక్తులు సమర్పించిన పూజా నైవేద్యముల శేష భాగముల రూపములో ముగ్గులు కన్పించు చున్నను వేదికలు మాత్రము శూన్యముగనే ఉన్నవి. అనేక పత్ర పుష్పములు ఋష్కించి చెల్లాచెదురుగ గుహలో పడియున్నవి.

ఆ శూన్య వాతావరణము క్షణ మాత్రములోనే ఒక అచింతనీయమైన, అవర్ణనీయమైన పూర్ణత్వముతో ఐశ్వర్యవంతమయిట్లనయినది. దానిని చూసి ఆవేశముతో రామచంద్రదేవుని క్లాంత నేత్రములు మూతపడినవి. వారికి హృదయములో ఒక అభినవ పులకాంకురానుభవము కలిగినది,

కాని తాము మతాంతరులైనట్లు, ధర్మచ్యుతులైనట్లు, జగన్నాథుని రత్న సింహాసన పదతలమునుండి నిర్వాసితులయినట్లు రామచంద్ర దేవునికి ఉన్నట్లుండి స్మరణకువచ్చినది. లోపలకు ప్రవేశించ వలెనన్న ప్రబలమైన కోర్కె వారికి కలిగినప్పటికిని వారు లోనికి వెళ్ళలేదు. కండ్లు మూసికొని వారు ఆ పనస చెట్టుకిందనే నిలబడిపోయిరి ఆ సమయమందు వారి హృదయములో ఎటువంటి ప్రార్థన లేదు. దేనినైనను పొంద వలెనన్న అభిలాష కూడ వారి మనసునందు లేదు. అంధకారవలయముల మధ్య తమ హృదయ సింహాసనము శూన్యముగ వారి మూసినకండ్ల ఎదుట గోచరించినది. ఆ సింహాసనము ఇక వారి జీవితములో మరి భర్తీ కానేకాదేమో!

ఊహ కందని శూన్యత నాలుగు చెరగుల వ్యాపించి యున్నది. పైన మేఘరహితముగ నున్న ఆకాశమందుగూడ ఆ శూన్యత నిండుకొని ఉన్నది. నువ్వుగింజలో సగము మేరకు కూడ ఖాళీలేదు. ఆ శూన్యతే పుష్యమాసపుపత్ర విరళ వృక్షములనుండి ఆకుల రూపములో రాసులు రాసులుగ రాలిపోతున్నది.

ఆత్మ విస్మృతులై వారు ఆ స్థితిలో ఎంతసేపు ఉన్నారో తెలియదు. ముండ్ల వెదురు డొంకలలోనుండి ఎండుటాకులపై పడిన మానవ పద సవ్వడి వారి భావ తన్మయత్వమును భంగపరచినది అప్రయత్నముగనే వారు మొలనున్న కరవాలమును స్పృశించినారు. పద సవ్వడి వినవచ్చుచున్న దిక్కుగా వారు మెల్ల మెల్లగ వెళ్ళ నారంభించినారు.

మలిపడాగఢ్‌కు చెందిన నరసింహ బిశోయీ ఆయాసపడుతు పైకి వస్తున్నాడు, అతడు రామచంద్ర దేవుని చూసి "తకీఖాన్ సైనికులు శిఖపాల్ గఢ్‌ను వశపరచుకొని, ధవళీగఢ్ వైపుకు సాగిపోతున్నారు. బక్షీ వేణు భ్రమరవర్ జాడతెలియకుండ ఎటికో పరారయినాడు. పాయిక్‌లు గూడ తిరుగుబాటును ప్రకటించినారు" అని వార్తను అందించినాడు.

రామచంద్రదేవ్ ముఖమండలము మీది కోమల రేఖలు ఆ వార్తతో ఒక్కసారి కఠోరమైనవి. మాంస కందరములు బిగ్రబిగుసు కొన్నవి. "తకీ

ఖాన్‌ను శిశుపాల్ గఢ్‌లో బక్షీ ఎదురించనే లేదా?" అని కఠోర స్వరముతో ఆయన ప్రశ్నించినారు.

పుష్యమాసపు శీతల వాయువులో గూడ తన శరీరముపైన పొటమరించిన శ్వేద బిందువులను ఎడమ చేతితో తుడుచుకొనుచు "బక్షీ, అతని పాయిక్‌లు తిరుగుబాటు ప్రకటించినారు ఛామూ!" అని బిశోయీ అన్నాడు. ఆతరువాత అతడువిషణ్ణ స్వరముతో సవిస్తరముగ అంతయు రామచంద్ర దేవునికి విన్న వించినాడు.

తకీఖాన్ సైనికులు శిశుపాల్‌గఢ్ ప్రాంతములో అడుగు పెట్టుటకే మొదట సాహసించలేకపోయినారు. మహామహా పరాక్రమవ తులైన ఫౌజ్ దారులు అనేకమంది శిశుపాల్‌గఢ్ పాయిక్‌ల ముందు గతములో శిరము వంచి నారు. ఈ శిశుపాల్‌గఢ్ పాయిక్‌లవలననే కాలాపహాడ్ లింగరాజ్ ఆలయ మును కన్నెత్తి చూడలేకపోయినాడు. అందుచేతనే ఈసారి తకీఖాన్ సైనికులు శిశుపాల్‌గఢ్‌వైపు అతి నెమ్మదిగ వెళ్ళినారు. ముండ్ల వెదురు పొదలనుండి శిశుపాల్‌గఢ్ మట్టి ప్రహరీగోడ పైనున్న శిఖరములు తప్ప ఇంకేమియు కాన రావకములేదు. ఆ ప్రాచీరములమీద ఒక్క పాయిక్‌కూడ విల్లుతోగాని, తుపాకితోగాని, కనుపించుటలేదు. అసలు ఎవరైనను తనను ఎదిరించి ఉండిన తన శత్రువు శక్తిసామర్థ్యములను తకీఖాన్ అంచనా వేసికొని భయపడి ఉండే వాడు. కాని అతనిని ఒక విల్లుకూన కూడ ఎదిరించలేదు. వెదురుపొదల వేష్టన ములో అపరిచిత శిశుపాల్‌గఢ్ ప్రాచీరములు తకీఖాకే హూంకారమును మౌన ముగ పరిహసిస్తున్నట్లు నిలిచి యున్నవి. 'గంగుఆ' నదీ జలములలోని ఒక్క-క్షీణతమ తరంగములోగూడ వెదురు గుబురుల మౌనఛాయ కదలాడుటలేదు.

ఆ పరిస్థితులలో ఫౌజ్‌దారులందరు అకారణభయముతో కింకర్తవ్యమూఢు లైనారు. వారు గఢ్ వైపు సాగిపోవుటకు సాహసించ లేకపోయినారు.అప్పుడు తకీఖాన్ తన ఫిరంగి సైనికులను ఆదేశించి కాల్పులను జరిపించినాడు. ఒంటె బండ్లమీద నున్న ఫిరంగులతో విచక్షణారహితముగ కాల్పులు జరిగినవి. అయినా మనుష్యజాతగాని, ఎదుర్కొను శత్రువుజాడగాని తకీఖాన్‌కు కనుపించలేదు.

తకీఖాన్ సైనికులు 'గంగుఆ' జలకందమును దాటుతున్నప్పుడు కూడ పాయిక్ విలుకాండ్ర బాణవర్షము కురియలేదు. శిశుపాల్‌గఢ్ సింహద్వారము తెరచియున్నది. సైనికులు 'అల్లాహో అక్బర్!" అని నినాదములు చేసికొంటూ వరద ప్రవాహమువలె లోపలకు ప్రవేశించినారు. వెదురు వనములో ఆగ్ని రగుల్కొని, ముందుకు దట్టముగ అలుముకొన్నది. వెదురు కణుపుల ప్రేలుడు శబ్దములు తప్ప అన్య శబ్దము వినబడుటలేదు. ఆంతకు తగినంత ముందుగనే వేణుభ్రమరవర్ ఆ గఢ్‌ను తన పాయిక్‌లతో కలసి వదిలి వెళ్ళిపోయినాడు.

"ధవులిగఢ్‌కూడ పడిపోయినదనుకొనవచ్చును. తర్వాత రథీపుర్, దాని తరువాత ఇంకేమున్నది? "భోర్ధా!" అని బిళోయా అనినాడు.

అతని మాటలను విన్న రామచంద్రదేవ్ "దానితరువాత భోర్ధాను వశ పరచుకొని. వివిలీమీదుగ పూరీ వైపుకు తకీఖాన్ సాగిపోతాడు" అని తమలో తాము మాట్లాడుకొంటున్నట్టుగ అనినారు.

బక్షీ వేణుభ్రమరవర్ తకీఖాన్‌ను ఎదుర్కొనకుండ శిశుపాల్‌గఢ్‌ను ఈ విధముగ వదిలిపారిపోవునని స్వప్నములోగూడ రామచంద్రదేవ్ తలంచ లేదు.

"తకీఖాన్‌ను ఎదురించుటలో బక్షీ చనిపోయినను మంచిదే, అతనిని జయించినను మంచిదే. బక్షీ బ్రతికేఉన్నట్లయిన సంధి ఒప్పందములో తక్కీఖాన్ తప్పక బక్షీ శిరస్సునే కోరుతాడు బక్షీ చనిపోయినయెడల ఒక కృతఘ్న్ని వైన విశ్వాసఘాతకుని అనుచిత లాలసనుండి భోర్ధాకు విముక్తియైనను లభించ గలదు," అని రామచంద్రదేవ్ తలపోసినారు.

శిశుపాల్‌గఢ్ ప్రతిఘటన తరువాత ధవులీగఢ్, తరువాత రథీపుర్, ఈ విధముగ ప్రతి కనుమవద్దను అడుగడుగున ప్రతిఘటనను ఎదుర్కొంటున్న తకీఖాన్‌పై వెనుకనుండి తాము దెబ్బతీయవచ్చునని కూడ రామచంద్రదేవ్ తలపోసినారు.

కాని బక్షి ధూర్తత్వమువలన వ్యూహమంతా పేకమేడవలె కుప్పకూలి పోయినది. ఈవిధముగ జరిగే అవకాశమున్నదని రామచంద్రదేవ్ మనస్సులోనైన అనుమానించలేదు

"మరి ఇక్కడ నిరీక్షించి లాభములేదు. తోర్ధా వెళ్ళకతప్పదు. కాన్నది కాకమానదు," అని రామచంద్రదేవ్ బిళోయ్‌తో అనినారు.

కొండకు దగ్గరలోనే ఒక మోదుగు వృక్షమునకు రామచంద్రదేవ్ తమ గుర్రమును కట్టిఉంచినారు. కనుక అటువైపునకే నెమ్మదిగ అడుగులో అడుగు వేసికొంటూ వెళ్ళినారు.

శిశుపాల్‌గఢ్‌కు రెండుక్రోసుల దూరములో నైరుతి దిశను సర్దేయాపుర్ గ్రామమున్నది. జగన్నాథ మార్గములో దయానది ఒడ్డున ఈ గ్రామము ఉండుటవలన జగన్నాథము వెళ్ళే యాత్రికులకు ఇదియొక ప్రధాన విశ్రాంతి కేంద్రమయినది. సంవత్సరము పొడుగునా ఇక్కడి సత్రములో యాత్రిక సమూహములు ఉంటూంటవి. ఆ గ్రామముమీదుగా పోవు జగన్నాథ మార్గము పైన, నిత్యము గుర్రములు, పల్లకీలు, ఎద్దుబండ్లు పోతూ కనిపిస్తూండేవి. కాని ఇప్పుడు ఆ గ్రామము పూర్తిగా నిర్జనమైయున్నది. ఆ గ్రామవాసులు ఆత్మరక్షణ కొరకు తమ గ్రామమును గహన నిశ్శబ్దము మధ్యలో వదలి వెళ్ళిపోయినారు. గ్రామములో ఆవులు మొదలగు పశువులు తప్ప ఇంకేవియు లేవు. అవికూడ ఏ అవ్యక్త భయమువలననో పచ్చికను వాసన చూచుచున్నవేకాని తినుటలేదు. అవి ఛాయల వలె ఇటునటు తిరుగాడుచున్నవి. గోశాలలలో ఇంకను బంధింపబడియున్న ఆవులు, దూడల 'అంబా' రవములు తప్ప అన్యస్వరము వినబడుటలేదు. పరిత్యక్తమైన, నిర్వేద గ్రస్తమైన ఆ మూర్ఛిత పరివేషముమీద పుష్యమాసపు శీతల వాయువు నైరాశ్యపు తూలికతో తుది మెరుగులు దిద్దుతున్నట్లు ఉన్నది.

సర్దేయాపుర్ గ్రామము దాటి వెళ్ళిన ధవళీ గ్రామము చేరుకొనవచ్చును. నిర్దయ పూరితమైన దయానది వరద, నిష్ఠురతుఫాను, దారిద్ర్యపు గదాఘాత

ములవలన శిథిలమైన ఆ గ్రామపుటిండ్లు మట్టిలో కలియుటకుముందు, నాని చివికిపోయిన ఒకటిరెండు వెదురు బొంగుల ఆధారముతో ఎట్లో వ్రేలాడుతూ ఉండిపోయినవి. వర్షములవలన వసారాలలో చాలాచోట్ల మట్టి దిగబడిపోయినది. వాటిని కొత్తమట్టితో నింపి అలుకుట సంభవించలేదు. మట్టి, పేడ ఏమంత దుర్లభమైనవస్తువులు కనుక ; కాని సమయములేదు. పైగా ఇండ్లను అలికి శుభ్రము చేసి కొనవలెనన్న ధ్యాసకాని కోరికకాని ఎవరికిని కలుగలేదు. మొగల్ సైనికుల దాడికి భయపడి ప్రజలు గ్రామమును వీడి వెళ్ళినారు. సర్దేయీపుర్ గ్రామము వలెనే ఇదికూడ జనశూన్యమైనది. ధవుళీ కొండ దిగువనే ధవుళీ గ్రామము ఉన్నది. ఆ కొండ కూడ తరులతాగుల్మ శూన్యమై ఒక బోడి రాతికొండవలె నున్నది. కాని కొండ దిగువను దట్టమైన వెదురు, పేము ఆడవులు ఉన్నవి. వాటి మధ్యనుండి కొండపైనున్న ధవలేశ్వరుని ఆలయమువరకు కదలాడుతున్న పాములవలె ఒక కాలిబాట ఉన్నది.

ధవుళి గిరికి దక్షిణ భాగమందు అశ్వత్థామ పర్వత మున్నది. రెండు పర్వతములకు మధ్య దట్టమైన అడవి ఉన్నది. అశ్వత్థామ పర్వతముపైన అనేకమైన అశోకుని శిలా శాసనములు ఉన్నవి. వాటిని ఏ మహాపురుషుని భూత భవిష్యత్ లిపియోనని స్థానిక ప్రజలు భావిస్తూ ఉంటారు. కలియుగ అంతమునందు ఆ శిలలపైనున్న లిపిని మానవులు తెలిసికొనగలరని ప్రజాభిప్రాయము. ఆ తరువాత సత్యుగము ప్రారంభము కాగలదు. ఆ సత్యుగము కొరకే అందరూ ఆశతో ఎదురు చూస్తూ కూర్చుని ఉన్నారు. ఇది కలియుగము ...ఘోర కలియుగము.

ఖోర్ధా సరిహద్దులలోనే ధవుళీగఢ్ ఉన్నది. అందుచేత యుద్ధ ప్రాముఖ్యము దానికున్నది, భోయీ రామచంద్ర దేవుని కాలములో ఖోర్ధా చుట్టు నిర్మితమైన అనేక దుర్గములలో ధవుళీగఢ్ ఒకటి. గట్టి ఇటుకలతో అది నిర్మించ బడినది. అందువలన దాని స్థాపత్యములో చెప్పుకొనదగిన ప్రత్యేకత ఏమీలేదు. అయిదు వందలమంది అశ్వికులు, సుమారు రెండు వేలమంది సైనికులు అక్కడ ఉంటూ ఉండేవారు. అక్కడి దుర్గపాలకుడు నవధన్ సామంత్

రాయ్ బక్షీ వలలో పడి తన సైనికులతో గూడ ఈ గఢ్‌ను ఖాళీచేసి వెళ్లిపోయి నాడు.

ధవులిగిరి, అశ్వత్థామ పర్వతముల మధ్యను గహనారణ్యమయమైన సంకీర్ణ లోయ ఉన్నది. ఆ కీకారణ్యము మధ్యను ధవ్రలీగఢ్ యిష్ట దేవత మహిషాసురమర్దిని ఒక ప్రాచీన ఆలయమందున్నది. భోర్ధారాజులు విష్ణుభక్తులు. అయినను వారు ప్రతి సంవత్సరము రజ సంక్రాంతి, దసరా పండుగ దినము లలో ఆ దేవిని పూజిస్తూ ఉండేవారు. అవ్వుడప్పుడు ఆ దేవికి నరబలులు కూడ ఇచ్చేదివారు. ఆ భయము వలన సర్దేయాపుర్ గ్రామ అర్చకులు, సేవ కులు తప్ప అన్యులు ఆ ఆలయము వద్దకు వెళ్లెడివారు కారు. పొడవైన వేము, వెదురు పొదల మధ్య ఆ ఆలయము మరుగుపడి ఉన్నది. అందువలన దాని పైని ఎవరి దృష్టి సులభముగ పడే అవకాశము లేదు.

తకీఖాన్ శిశుపాల్ గఢ్‌ను లంకాదహన మొనర్చి ధవ్రలీ గఢ్ వైపు సాగిపోవు చుండిన సమయమందు బక్షీ వేణు భ్రమరవర్ ఈ దేవాలయములోనే తలదాచుకొని, తన అభీష్టము సిద్ధించవలెనని దేవిని పూ-జిస్తున్నాడు, ఒక పుర్రెలో వత్తి దీపము వెలుగుతున్నది. ఆ దీపకాంతిలో దేవీ స్వరూపము అత్యంత భయంకరముగ గోచరిస్తున్నది.

వేదిక క్రింద యూపకాష్ఠము ఆ క్షీణ దీపకాంతిలో ఒక రక్తలోలుప వలె కాన్పిస్తున్నది. గతములో జరిగి అసంఖ్యాకమైన బలుల రక్తము వలన ఆ యూపకాష్ఠము రక్త కాంతులను వెదజల్లుతున్నది. దర్భాసనము మీద కూర్చున్న దేవీ తాంత్రిక అర్చకుడు గోవింద బ్రహ్మచారి మంత్రములను పఠిస్తూ ఆహుతు లను వేస్తున్నాడు. అతడు వృద్ధుడు. ఆతని స్వాభావిక ముఖ మాలిన్యము మీద యజ్ఞజ్వాల తీవ్రముగా పడి ముఖమును కాంతిహీనము చేస్తున్నది. ముఖముమీది నరములు, ఎముకలు ఉబ్బియుండుటవలన అదొక మానవ కపాలమును భ్రమను కలుగ జేస్తున్నది. శిథిల వక్షస్థలము మీదనున్న శుష్క చర్మముపైన రుద్రాక్ష మాల వ్రేలాడుచున్నది. ఆయనకు దక్షిణ భాగమన దర్భాసనము పైన

కూర్చుని బక్షీ వేణు భ్రమరవర్ జప మాచరిస్తున్నాడు. ముండిత శిరము, లలాటము, దట్టమైన కనుబొమలతో అతని ముఖము ఆ దీపకాంతిలో జీవరహిత ముగ కనిపిస్తున్నది. అతడు నిశ్చలముగ కూర్చుని బీజ మంత్రము జపిస్తున్నాడు. అతని అధరముల కదలిక వలన మాత్రమే అతనిలో జీవమున్నట్లు తెలియుచున్నది.

ఆలయము లోపల అకస్మాత్తుగ నీడ పడినంతనే బక్షీ మెల్లగ కండ్లు విప్పి గర్భగృహము దిగువన న్న ద్వారము వైపు చూసినాడు. కృష్ణ నరీంద్ర్, ఆయన వెనుక నవధన్ సామంత్‌రాయ్ అతనికి కన్పించినారు. అతడు ఉద్వేగముతో వెంటనే బయటకువచ్చి వారి రాకకు కారణము అడిగినాడు.

రథీపుర్ పాయిక్‌లు కూడ తమలో చేరినారని కృష్ణ నరీంద్ర్ తెలియ జేసినాడు. తకీఖాన్‌ను అక్కడ ఎదిరించుటకు ఎవరును రారనియు, భీతర్‌గఢ్ ప్రాసాదమును వదిలి రాజావారు ఎక్కడికో పరారయినారనియు నవధన్ సామంత్‌రాయ్ సమాచారమును తెచ్చినాడు.

"భీతర్‌గఢ్ ప్రాసాదమును రాజావారు వదిలి వెళ్ళినారన్న వార్త నిజమేనా? ఖోర్ధాలోని పాయిక్‌లుకూడ మనతో కలిసి పోయినారా?" అని ఉల్లాసముతో బక్షీ అన్నాడు.

"నేను ఖోర్ధానుండి కాలిబాటను అరణ్యమార్గమున వచ్చినాను. భీతర్ గఢ్ ప్రాసాదములో రాజావారు లేరు. ఖోర్ధా వీథులలో కాకులు మాత్రము ఎగురుచున్నవి" అని నవధన్ సమాధానము ఇచ్చినాడు.

"జైమాతా! భవానీ!" అని ఉత్తేజముతో బక్షీ అరచి, "ఇదే స్వర్ణావకాశము- ఖోర్ధా సింహాసనము ఖాళీగా ఉన్నది. మనము ఇప్పుడే వెళ్ళి దానిని స్వాధీనము చేసికొన్నట్లయిన తకీఖాన్ వచ్చిన వెంటనే ఎట్టి షరతుల పైనను అంగీకరించి అతనితో సంధి చేసికొనవచ్చును. ఆ తర్వాత ఖోర్ధా సింహాసనము మన పిడికిలిలో నుండగలదు. రాజావారికి తకీఖాన్ చేతులలో మరణము తప్పి

నను సింహాసన భ్రష్టులు కావటంమాత్రం తప్పదు. ఇది ఖాయము," అని అనినాడు.

ప్రస్తావన చెడుగా ఏమీలేదని కృష్ణ నరీంద్ర్, నవధన్ అనుకొనినారు. ఇక్కడ ఈ అడవిలో దాగి ఉండుట కంటె భీతర్ గఢ్ మహల్‌లో ఉండి తకీ ఖాన్‌కు స్వాగత సన్నాహములు చేయుట మేలు అని వారు అనుకొనినారు. కూట రాజనీతి దృష్ట్యా అది ఎక్కువ లాభదాయకమని వారు తలంచినారు.

"ఆయితే ఇంక మనము కాలయాపన చేయుటవలన లాభమేమి? తకీ ఖాన్ సైనికులు ఈ పాటికి సర్దేయీపుర్ చేరుకొనే ఉందురు. మనము ఇప్పుడే ఖోర్ధాకు బయలుదేరుట మంచిది. ఆ తరువాత మనకు అవకాశము రావచ్చును, రాకపోవచ్చును," అని కృష్ణ నరీంద్ర్ అనినాడు.

కృష్ణనరీంద్రుని మాట పూర్తి అయినదో లేదో ఇంతలో దీపము వెలుగు చుండిన కపాలము అత్యధిక వేడిమివలన పగిలి భయంకరముగ ధ్వనించినది పూజలో ఏదో పెద్దలోపము తప్పక జరిగి ఉండునని గోవింద బ్రహ్మచారి తలపోసినాడు. కాని అతడు వైకి ఏమిగూ అనలేదు. ఆ కపాల అవశేషమునందు మరొక వత్తిపేసి, నూనెపోసి అతడు దీపమును మరల వెలిగించినాడు. తిరిగి మంత్రపఠనము ప్రారంభించినాడు. కపాలము పగిలిన ఆ భయంకర ధ్వనికి బక్షీ లోపలకు వచ్చినాడు. అతనిని అనుసరిస్తూ కృష్ణనరీంద్ర్, నవధన్‌లు గూడ వచ్చినారు.

అదే సమయమునకు దేవి కిరీటమునుండి సంపెంగ పూవొకటి క్రిందపడినది. నవధన్ దానిని తీసి, నాసటను దాల్చి "దేవి ప్రసన్నురాలైనది, అందుకే ఈ పూవు క్రిందపడినది. బక్షీ సామంతులవారికి ఖోర్ధా సింహాసనము లభించుట తథ్యము, ఇది తప్పదు," అని అనినాడు.

దేవికి బక్షీ సాష్టాంగ ప్రణామము లాచరించి, అభీష్టసిద్ధి పొందగనే దేవీ చరణములవద్ద నరబలిని ఇచ్చుటకు ప్రొక్కుకొనినాడు.

గోవింద బ్రహ్మచారి కళ్లు తెరిచి ఒకసారి దేవివంక, ఒకసారి బక్షీవంక చూసి, తిరిగి మంత్రోచ్చారణ చేస్తూ, ఆహుతి ఇవ్వడము ప్రారంభించినాడు.

బక్షీ, అతని అనుయాయులు దేవికి సాష్టాంగ దండప్రమాణములు చేసి బయటకు వెళ్ళిపోయినారు.

వారు ఖోర్ధాలోని భీతర్‌గఢ్ మహల్ చేరుకొనేసరికి అది వదలివేయ బడినట్లున్నది. తకీఖాన్ అప్పటికి ధవుళీగఢ్ వశపరచుకొని, రథీపుర్‌లో విడిసి యున్నాడు. ఖోర్ధాలో వీథులు నిర్జనముగ నున్నవి. యుద్ధభయమువలన ప్రజలు ఖండ్‌పడా, నయాగఢ్, రణ్‌పుర్ మొదలగు అడవులలో తలదాచు కొనినారు.

తకీఖాన్ ఖోర్ధాను వశపరచుకొన్నచో అతని అధికారము ఖోర్ధాశరీరము పైన ఉండగలదు కాని దాని ఆత్మపైన కాదు. గతములో ఇట్టి అనుభవములు కలిగినవి. ఇప్పుడు కూడ అట్టి అనుభవమే పునరావృత్తము కాగలదు. ఖోర్ధా ప్రజలకు ఇది పరిపాటి.

బక్షీ ప్రభృతులు భీతర్‌గఢ్‌ను జయించవలెనన్న ఉద్వేగముతో సింహ ద్వారము మందు గుర్రములపైనుండి దిగినారు. సింహద్వారపు కంచు కవాటముల మీద కొట్టినంతనే అవి తెరచుకొన్నవి. బక్షీ గర్జిస్తూ లోనికి ప్రవేశించినంతనే ఆకలిగొన్న బెబ్బులివలె రామచంద్రదేవ్ అతనిపైకి ఉరికి, "వీరిని బంధించి చీకటి కొట్టులో పడవేయండి" అని ఆజ్ఞాపించినారు. రామచంద్రదేవుని పాయిక్‌లు చీమలవలె వచ్చి వారిని చుట్టు ముట్టినారు.

ధవుళీగఢ్ శిథిల ప్రాచీరములను అకారణ దర్పముతో నేలపాలు చేసి తకీఖాన్ అతిశయముతో రథీపుర్‌లో కూర్చున్నాడు. అక్కడ అయిదువేల అశ్వికులు, పదివేలమంది పాయిక్‌లు నివసిస్తూ ఉండేవారు. ఖోర్ధా రాజుల నివాస స్థలము భీతర్‌గఢ్ కాని రథీపుర్ ఖోర్ధా రాజ్యమునకు ప్రధాన రాజకీయ సైనిక కేంద్రము. అందుచేత అక్కడ చివరి యుద్ధము తప్పక జరుగగలదన్న తలంపుతో తకీఖాన్ సకల సన్నాహములను చేసికొనినాడు.

కాని ఖోర్డా పాయిక్‌లు శిశుపాల్‌గఢ్, ధవులీగఢ్‌ల వలెనే రథీపుర్‌ను గూడ వదిలి వెళ్ళిపోయినారని, అక్కడ కాకులు మాత్రమే ఎగురుచున్నవని గూఢచారులద్వారా తకీఖాన్‌కు తెలిసినది. అయినా తకీఖాన్‌కు వెంటనే పూర్తి నమ్మకము కలుగలేదు. ఏ ఖోర్డా పాయిక్‌లు మాననింహుని కాలమునుండి నేటి వరకు నూటపైబది సంవత్సరములపాటు మొగులులతో మాటిమాటికి యుద్ధము లకు తలపడుతూ వారిని ముప్పుతిప్పలుపెడుతూ వచ్చినారో ఆ పాయిక్‌లు ఇప్పుడు ఏ ప్రతిఘటన లేకుండ దుర్గమువెంబడి దుర్గమును ఖాళీచేసి వెళ్ళిపోయెద రని తకీఖాన్ కలలోగూడ తలచలేదు.

అందుచేత రథీపుర్ సమీపమునకు చేరిన తరువాత ప్రత్యక్ష ప్రతిఘట నను ఎదుర్కొనవలసి వుంటుందన్న ఆశంకతో తకీఖాన్ ముందడుగు వేయ లేదు. ఒక మామిడితోటలో శిబిరము నేర్పాటుచేసి ఒకరోజు అక్కడ అతడు గడవి, వేచి చూసినాడు. కాని ప్రతిఘటన సూచనలు ఏవీ అతనికి కను పించలేదు.

రథీపుర్‌గఢ్ వెలుపలి ప్రాకారములు దర్పముతో అచలముగా నిలబడి ఉన్నవి. తకీఖాన్ ఆదేశానుసారముగ తుపాకి సైనికులు ప్రాకారమువరకు తమ తుపాకులను కాల్చుకొంటూ వెళ్ళినారు. కాని ప్రతిఘటన కానరాలేదు. దుర్గమే నిర్జనమైనప్పుడు ప్రతిఘటన చేసేదెవరు ?

రథీపుర్‌గఢ్ మౌన ప్రాచీరముల పైన మొగల్ రాజద్రోహి హాఫిజ్ కాదర్ యొక్క రూపము సవాలు చేస్తున్నట్లుగా స్పష్టముగ తకీఖాన్‌కు కన బడసాగినది. వెంటనే ఆ ప్రాకారములను ఫిరంగి గుండ్లతో పగులగొట్ట వలసి నదిగా తకీఖాన్ ఆదేశించినాడు.

వెంటనే ఫిరంగులు గర్జించినవి. ఉత్తరపు దుర్గ ప్రాచీరము నేల కూలి నది. ఎగసిన దుమ్ము వలన, తుపాకి మందు పొగల వలన కొంత సేపటి వరకు దుర్గము కనబడలేదు. దుర్గము ఖాళీగానే ఉన్నదన్న నమ్మకము అప్పుడు

తకీఖాన్‌కు కలిగినది. వెంటనే అతడు తన సేనతో దుర్గమును ఆక్రమించు కొనినాడు.

"ఖోర్ధా రాజు భీతర్ గఢ్‌ను వదలి పరారయినాడు. ప్రాసాదము నిర్జన ముగ నున్న" దన్న వార్తను తకీఖాన్ ప్రతినిధి లోధుమియా, తీసికొని వచ్చి నాడు. కనుక కష్టపడి ఖోర్ధా వెళ్ళుట నిరర్థకమని కూడ అతడు తెలియ జేసి నాడు.

అందువలన ఖోర్ధాకు సైన్యములను తరలించుటకు బదులు అక్కడనే అగి, హాఫిజ్ కాదర్‌ను ప్రాణములతో తీసికొని రావలసినడని తకీఖాన్ తన ఫౌజ్‌దార్లను నలుదిశలకు పంపినాడు. కాని హాఫిజ్ కాదర్ జాడ ఎవరికిని తెలియలేదు. గ్రామ గ్రామము నిర్జీవముగా జనశూన్యమై యున్నది. దుర్గ దుర్గము పరిత్యక్తముగ పడియున్నవి. నిర్జన నిశిలో దిగ్భ్రాంతులై దారి తప్పి తిరిగి నట్లుగా ఆ ఫౌజ్‌దార్లు నిరర్థకముగ తిరిగి తిరిగి రథీపుర్ చేరుకొన్నారు.

కింకర్తవ్యమూఢుడైన తకీఖాన్ యొక్క హృదయము నిష్ఫల క్రోధ ముతో కంపిస్తూ ఉండగ ఒకనాడు సైనికుడు ఒకడు వచ్చి, "హాఫిజ్ కాదర్ స్వయముగ ప్రభువుల దర్శనము చేసి కొనుటకు వచ్చినారు" అని చెప్పి నాడు. తకీఖాన్‌తో గూడ సభాసదు లందరు విస్మితులైనారు. అందరి స్తిమిత క్లాంత నేత్రములు ఒక్కసారి ఉత్తేజముతో స్పందించినవి. హాఫిజ్ కాదర్‌కు ఇప్పుడు ఏమి శిక్ష విధించబడుతుందో తెలిసికొనవలెనని సభికులందరు ఉత్కం ఠితులై కూర్చొన్నారు.

ఆ వార్తను విన్నవెంటనే తకీఖాన్ తన చెవులను తానే నమ్మలేక పోయినాడు.

ఇంతలోనే రామచంద్రదేవ్ అనగా హాఫిజ్ కాదర్ బేగ్ మద్యపు మత్తుతో తడబడుచున్న అడుగులతో తకీఖాన్ ఎదుటకువచ్చి, అతనిని తన బాహువులతో బంధించి ప్రస్తావనా రహితముగ అరవ నారంభించినాడు.

"నేను దోషిని, అపరాధిని, నన్ను క్షమించకండి ప్రభూ, మీరు నా బంధువులు, నాకు అన్నగారు అయినను ప్రభువుల యెడల నేను అవిధేయతను కనబరచినాను. తమరు నన్ను శిలువ నెక్కించండి. నాకు కొరత వేయించండి " అని రామచంద్రదేవ్ ప్రలాపిస్తూ ఉంటే తకీఖాన్‌కు విషయమేమిటో అరము కాలేదు.

"అయ్యో! రజియా బేగమా! శిలువ నెక్కుటకు ముందు ఆఖరుసారిగ నైన నిన్ను చూసే భాగ్యము నాకు కలుగలేదు. రజియా !..."అంటూ రామచంద్రదేవ్ నిగూఢ దృష్టితో తకీఖాన్ వంక చూసినారు. తమ నాటకీయత తకీఖాన్‌పైన పని చేసి అతనిని విభ్రాంతుని కావించినదని వారు గ్రహించినారు. మరల మరింత బిగ్గరగ "ఇంకను ఆలస్యమెందుకు ప్రభూ! నేను ఆ హాఫిజ్ కాదర్‌నే, మీతప్పుడనే, మీ ముందు హాజరుగ ఉన్నాను. మీరు మీ స్వహస్తములతో నా తలకాయను నరికి వేయండి. నేను అవిధేయుడను, దోషిని, పాపిని" అంటూ ప్రలాపించ సాగినారు.

తకీఖాన్‌కు ఏమియు అర్థముకాక రామచంద్ర దేవుని ఒక ఆసనము పైన కూర్చుండ బెట్టి, "తెలివి తెచ్చుకో హాఫిజ్ కాదర్ !" అని అన్నాడు.

తన మందు సరిగనే పనిచేసినందుకు రామచంద్రదేవ్ లోలోన సంతోషించి, తిరిగి మద్యపాన మత్తును అభినయించుచు, ఛాతీని బాదుకొంటూ "నేను తెలివిగానూ లేను, తెలివితక్కువగానూ లేను. ప్రభువుల వారి శత్రువులలో ఏ ఒక్కడు జీవించియున్నా ఈ హాఫిజ్ కాదర్‌కు తెలివి ఉండ జాలదు" అని అన్నారు.

తకీఖాన్ చీత్కారము చేసి, "హాఫిజ్ కాదర్! నీవే నా శత్రువు. సింహల బ్రహ్మపుర్ గ్రామములో పీర్ ముజాహిద్ గాజీ సుల్తాన్ బేగ్‌ను హత్య చేసినది ఎవరు ?" అని గర్జించినాడు.

రామచంద్రదేవ్ ఛాతిని బాదుకొని, ''అల్లా అనుగ్రహించిన పీర్ ముజా హిద్ గాజీ సుల్తాన్ భేగ్ బలి దానము వలన స్వర్గములో మరొక షహిద్‌కు స్థానము లభించినది. కాని నరకములో ఏ ఒక్క సైతాను కూడ తగ్గలేదు ..." అని అరవ సాగినారు.

ఈ అస్పష్టమైన అనిర్దిష్టమైన సమాధానము తకీఖాన్‌కు అర్థము కాలేదు. అందుచేత దేనిని ఎలా అడగవలెనో నిశ్చయించు కొనలేని పరిస్థితిలో తకీఖాన్ పది "చికాకోల్ ఫౌజ్‌దార్ నుండి నజరానా సొమ్మును దోచుకొన్నది ఎవరు? దానికి బాధ్యులు ఎవరు? ఈ హత్య ఈ దోపిడిలో నీ ప్రమేయము లేక పోయి నట్లయిన ఈద్ రోజున నీవు తప్పక కటక్ వచ్చి ఉండేవాడివి. నీవు ఎందుకు పరారి అయినావు?" అని క్రోధముతో అడిగినాడు.

రామచంద్రదేవ్ ఈ సదవకాశము కొరకే ఎదురుచూస్తున్నారు. వెంటనే ఆయన నాటకాభినయపు తీరులో తమ చొక్కా జేబులోనుండి బక్షీ వేణు భ్రమ రవర్ లలితా దేయీకి వ్రాసిన లేఖను బైటకు తీసి, దానిని తకీఖాన్ కండ్ల ముందు ఆడించుచు "ప్రభూ! మీరు దీన బాంధవులు. నజరానా సొమ్ము దోపి డికి నన్ను శిలువ వేయించండి. ఏ దుష్ట శత్రువో దానిని దారిదోపిడి చేసినాడు. కాని దాని బాధ్యత నా పైననే ఉన్నది. ఆ దోపిడి దొంగకు కూడ తగిన శిక్ష పడి తీరవలెను. ఈ లేఖలో దానికి సంబంధించిన విషయ వివరము దాఖలాలతో ఉన్నది. సొమ్ము ఎవరు దోపిడి చేసినారు? ఎవడు శత్రువు? ఎవడు మిత్రుడు?... అన్నియు ఈ ఉత్తరమునందె ఉన్నవి" అని చెప్పినారు.

ఈ భూమికను ముగించి, ఉత్తరము విషయమై తకీఖాన్‌లో ఆసక్తి పెంచు టకు దానిని ఆడించుచు రామచంద్రదేవ్ నిలబడినారు తకీఖాన్ ఇంక ఉండబట్ట లేక ఒక్క గంతులో వెళ్ళి రామచంద్ర దేవ్ చేతిలోనుండి ఉత్తరమును లాగు కొనినాడు.

ఉత్తరము ఒరియా భాషలోనున్నది. దానిని చదివి తకీఖాన్ అర్థముచేసి కొనలేదు. జాగీర్‌దార్ మున్షి అమీన్ చంద్ ఒరిస్సాలో ఉండి ఒరియా భాషను వ్రాయను చదువను నేర్చుకొనినాడు. అందుచేతనే అతడు తకీఖాన్ దర్బా

రులో ఖోజా ముస్తీ కాగలిగి నాడు. ఆ లేఖను అమీన్ చంద్‌కు అందించుచు "ఈ ఉత్తరములో ఏమున్నదో చదివి వినిపించండి ముస్తీ గారు," అన్నాడు.

అమీన్ చంద్ తడబడుతూ, ఒక్కొక్క అక్షరమునే గుర్తించుచు ఉత్తరమును చదువ సాగినాడు.

"...అప్పుడు భాగీరథీ కుమార్‌ను సింహాసనారూఢుని చేసి, తకీ ఖాన్‌తో సంధి చేసికొనబడును...."

ఒకసామాన్య సైనికుని లేక ఒకవ్యక్తిని గురించి వ్రాసినట్లు అమర్యాదకర ముగను, అగౌరవనీయముగను తకీఖాన్ పేరు ఆ ఉత్తరములో వ్రాయబడి నది. అంతేగాని 'ఖాన్ బహాదుర్, అసద్‌జంగ్,' మొదలగు పల్లవిత ప్రశంసలు లేవు. అందువలన తకీఖాన్ కోపముతో జేవురించినాడు.

"...ఆ విధముగ జరుగక పోయిన ఖోర్ధాలో మ్లేచ్ఛ పరిపాలన అంత మొందదు..." అని అమీన్ చంద్ చదువ సాగినాడు.

రామచంద్ర దేవ్ ఆ సమయములో శిరమువంచి "మహాప్రభూ! దీనిని బట్టి ఖోర్ధా నుండి మ్లేచ్ఛ పరిపాలనను తొలగించుటకు ఎవరు కత్తికట్టినారో, పీర్ పైగంబర్ గాజీ సూల్తాన్ బేగ్‌ను ఎవరు హత్య గావించినారో, ఎవరు నజ రానా సొమ్మును దోపిడి చేసినారో, ప్రభువుల వారికి మిత్రులు ఎవరో, శత్రు పులు ఎవరో తెలియగలదు... తమరే గ్రహించండి ప్రభూ..."

తకీఖాన్ ఆసనమునుండి దిగ్గున దిగివచ్చి రామచంద్ర దేవుని అభి మానపూర్వకముగ తన రెండు బాహువులలో బంధించి, నిట్టూర్చుతూ, "నన్ను మన్నించు సోదరా! నేను యదార్థ విషయమును తెలిసికొనకుండ నిన్ను ఖైదు చేయమని హుకుం జారీ చేసినాను. నేను నిన్నెంత హృదయపూర్వకముగ ప్రేమించుచున్నానో ఆ అల్లాకే తెలుసు. నీ మన్సూబేదారీ ఐదు వేల నుండి పది వేలకు చేయమని మూర్షిదాబాద్ నవాబ్ సాహబ్‌కు చెపుతాను. సరైన అవకాశమున నీకు 'యార్‌జంగ్' బిరుదు కూడ లభించ గలదు. ఇంతకూ బక్షీ ఎక్కడ

ఉన్నాడు? అతనితో ఈ కుట్రలో చేతులు కలిపిన వారు ఎక్కడ ఉన్నారు?" అని ఆడిగినాడు.

"పాయిక్‌లను వారు మీ మీదకు రెచ్చగొట్టినారు. అప్పుడు నేను వారం దరిని బంధించి, ఖైదులో పెట్టినాను. ఖోర్ధా నేల ఇస్లాం రక్తముతో కళంకితము కారాదని పాయిక్‌లకు నేను తాకీదు నిచ్చాను. నేను బ్రతికి ఉండగా ఖోర్ధా ముసల్మానులపైకి ఎవరైనను కత్తి దూస్తారా?"అని రామచంద్రదేవ్ సమాధానము చెప్పినారు.

"శబాష్! శబాష్!" అంటూ సభాసదులందరు రామచంద్రదేవ్‌ని పొగడినారు.

రామచంద్రదేవ్ తమ నిర్దోషిత్వమును అభినయించుచు, "అందుచేతనే ఖోర్ధాలోని ప్రతి దుర్గము ఖాళీగానే ఉన్నది. భీతర్‌గఢ్ దుర్గములో కూడ మిమ్మలను ఎదిరించువారు ఎవ్వరును లేరు." అని అన్నంతనే తకీఖాన్ సందేహములన్నియు పటాపంచలయినవి.

"తిరుగుబాటుదారులందరి శిరములను ఖండించి నా యెదుట నుంచండి. ఆ బక్షి శిరమును నా కన్నులార చూసేటంతవరకు ఇక్కడినుండి నేను కదలను. ఈ శిబిరము కదలదు" అంటూ విన్నపము వలె అరచినాడు.

తకీఖాన్ ఆజ్ఞానుసారము అతనికి విశ్వాసపాత్రులైన ఫౌజ్‌దార్లను కొంత మందిని తీసికొని రామచంద్ర దేవ్ రథీపుర్ గఢ్‌నుండి ఖోర్ధా వైపుకు బయలు దేరినారు.

బక్షి వేణు భ్రమరవర్, దివాన్ కృష్ణ నరీంద్ర తదితర సర్దారుల ఖండిత శిరములు తకీఖాన్ సమక్షములో యథా సమయమునకు ఒక సంచిలోనుండి తీసి ముందుంచ బడినవి. ఇక మొగల్ ప్రభుత్వము ఉత్కళ దేశములో నిష్ఠంటక మైనదని తకీఖాన్ భావించినాడు. ఖోర్ధాకాశములో ధూమకేతువులలె ప్రకాశిస్తూ, ప్రతి ముహూర్తమందును రామచంద్ర దేవునకు ఉత్కంఠను కలుగజేస్తూ

వచ్చిన కోటరగత నేత్రములు శాశ్వతముగ మూసికొని పోయినవని రామచంద్ర దేవ్ ఊరట చెందినారు.

ఆ తరువాత తకీఖాన్ సేన బాణ్‌పుర్ దిక్కుగ పయనించుటకు సన్నాహములు పూర్తి అయినవి. బాణ్‌పుర్ తిరుగుబాటుదార్లకు మరియొక కాణాచి. అందువలన అక్కడ ఉన్న రాజా సామంత్ జగన్నాథ్ మానసింహ్‌ను శిక్షించ వలెనని తకీఖాన్ సంకల్పము. కాని బాణ్‌పుర్ వారికి ఎడమ చేతి ఆట అనీ, పిచ్చుకమీద బ్రహ్మాస్త్రము అనవసరమనీ రామచంద్ర దేవ్ తకీఖాన్‌కు నచ్చ చెప్పినారు. ఈ ఆశ్వాసముతో ఫౌజ్‌దార్ హాషింఖాన్‌ను బాణ్‌పుర్‌కు పంపి తకీ ఖాన్ రథీపుర్‌గఢ్ నుండి సైనిక శిబిరమును తరలించి కటక్ చేరు కొన్నాడు.

తిరిగి ఖోర్ధా స్వస్తిని పొందినది.

ఆరవ అధ్యాయము

1

ప్రజావాణికి వేయి ముఖములు. ధులియా యాత్రికులు. పల్లవింప జేసిన ప్రచారము వలన జగన్నాథ స్వామివారు ఇప్పుడు శ్రీ మందిరములో లేరన్న ఆశ్చర్యకరమైన వార్త దేశములో నలుమూలలా వ్యాపించినది. అక్కడ లేక పోయినట్లయిన స్వామివారు ఎక్కడకు వెళ్ళినారు? ఆయన ఖోర్ధా అరణ్యము లలో ఉన్నారని కొందరు అన్నారు. ఈ రకమైన అనేక వార్తలు ప్రచలిత మయినవి. కాని స్వామి వారిని ప్రత్యక్షముగ తమ కండ్లతో చూచినట్లు ఎవరూ చెప్పలేదు. జగన్నాథుడు తన రత్న సింహాసనము మీదినుండి త్రిభువన ఆధిపత్యమును వదలి ఎక్కడకు ఎందుకని వెళతాడు? ఇప్పుడు ఖోర్ధా రాజ్యములో మొగల్ దాడుల భయముకూడ లేదు. ఖోర్ధారాజు నవాబుల మధ్య సఖ్యము ఏర్పడినది. ఇప్పుడు మొగలులు, పఠానులు మోకాళ్ళపైన తలలు వంచుకొని కూర్చొంటున్నారు. అటువంటప్పుడు జగన్నాథుడు శ్రీ మందిరమును వదలి వెళ్ళవలెనని ఎందుకు అనుకొంటాడు?

దీనికి ఒక తాత్త్విక సమాధానము వినవస్తున్నది- 'అరే, భక్తుడు విలిచిన మీదట గూడ రత్న సింహాసనము పైని బలియారీభుజుడైన జగన్నాథుడు ఎలా స్థిరముగా కూర్చొన గలడు?' 'హరిబోల్! హరిబోల్' అనెడి ఆనందదాయకమైన ధ్వనిపలన అన్ని ఆలోచనలు, వితర్కములు సమసిపోతవి.

ఇది రామచంద్ర దేవుని తొమ్మిదవ అంకము మేఘ మాసమునాటి సంఘటన.

కుసున్ సాహూ తన ఎద్దులతో గూడ కొంద చరియ ప్రాంతములలో కంచు, యిత్తడి మొదలైన అనేక రకములైన లోహపాత్రల వ్యాపారము చేయుటకు ప్రతి సంవత్సరము వెళ్లుచుండెడివాడు.మిధున మాసములో రథయాత్ర సమయమందు ఆ ఎడ్లపైని పెసలు, మినుములు, బియ్యము, ఉప్ప బస్తాలను వేసి కొనివచ్చి తన వ్యాపారమును చేసికొని తిరిగి వెళ్ళుచుండెడి వాడు. ఆ కుసున్ సాహూయే శ్రీ మందిరములో జగన్నాథుడు లేడని చెప్పినవాడు. కాని ఇప్పుడు ఆ వార్త ఆ ఒక్క సాహూ నోటివెంట ఎవరు వినుచున్నారు? ఇప్పుడు ఆ మాట ఆ నోట ఆనోట కాదు. వేలకొలది నోళ్ళలో పడి, పల్లవించి దేశములో మూల మూలలా ప్రాకిపోయినది.

యాత్రిక ప్రతినిధులు కంత్‌మే కాప్, పాలిఆ గోవింద్ మహాపాత్రలను తీసికొని మొగలుల ఆధీనమందున్న 'ధోయూములక్' లోని మంగళ్‌పుర్ గ్రామము వెళ్ళినారు. వారు తలపాగాలను ధరించి శ్రీ వారి నిర్మాల్యమును, అన్న ప్రసాదమును ప్రజలకు పంచిపెడుతూ, జగన్నాథుని కీర్తనలు పాడుతూ. తిరిగి వచ్చేసరికి శ్రీ వారిని గురించి సరైన వృత్తాంతమును తెలిసికొనుటకు ఆ గ్రామము నడిబొడ్డున ఉన్న మహాపురుష వటవృక్షము క్రిందను, భాగవత గృహమునకు నలువైపులను జనులు గుమిగూడినారు.

ఆ మంగళ్‌పుర్ గ్రామము తరుచుగా వరదలకు గురవుతూ ఉంటుంది. దానికి నలువైపులా నదులు, కాలువలు, ఒకదానితో ఒకటి కలసి యున్నవి. మొగలి వనము, తాడివనము కొబ్బరి, మామిడి తోటలు, వెదురు గుబురుల మధ్యనుండి చెదురు మదురుగా పంట పొలములు కనిపించుచుండును. అక్కడ తరచుగ సుడిగాలులు నాట్యమాడుచుండును. ఇప్పుడు పొలములను దున్నవలసిన కాలము. కాని పురుషోత్తము క్షేత్రము నుండి యాత్రిక ప్రతినిధులు వచ్చినారన్న వార్త విని, చుట్టు ప్రక్కల గ్రామముల నుండి అనేకమంది ప్రజలు మంగళ్‌పుర్ నడచి వచ్చుచున్నారు.

మహాపురుష వటవృక్షము గ్రామము నడిబొడ్డులో నున్నది. మహాపురుష్ భజహరిదాస్ చాల ఏండ్ల క్రితము ఈ వట వృక్షము క్రిందనే జీవసమా

ధిని పొందినారు. పరిశుభ్రముగా అలంకరించబడి వేడపూసిన వేదిక ఒకటి మహాపురుషుని స్మృతి రూపములో నున్నది. దానిమీద చిత్రించబడిన నేత్రములు రెండు ఉన్నవి. ఆ మహాపురుషుని పాదుకలు వేదిక క్రింద స్థాపితమై ఉన్నవి. మహాపురుష్ భజహరిదాస్ తమ మహిమతో ఆ పాదుకలను ధరించి త్రిభువనములు తిరిగి వచ్చేవారని ప్రజలు చెప్పుకొందురు. ఇచట ఆయన సమాధి చెందిననాడే పూరీ ఆలయములో 'బాయాస్ పావచ్చల' వద్ద ఆయన తిరుగు చుండగ చూసినట్లు కొందరు, వివిలీ అంగడిలో తిరుగుచుండగ చూసినట్లు మరికొందరు చెప్పుచుందురు. కొందరు బలిఆంతా లో చూసినట్లు, మరికొందరు బార్వాటీకటక్ లో చూసినట్లు చెప్పుకొనుచుందురు. ఈ విధమైన అనేక మాటలు ప్రజలనోట వినిపించుట కలదు. కాని భజహరిదాస్ సమాధిస్థులు అగుటకు ఏడుదినములు ముందుగనే ఈ వటవృక్షము క్రింద వారు యోగాసనము వేసి కొని కూర్చుండెనని మంగళ్పుర్ గ్రామ పెద్దలు అనుచుందురు. ప్రజల కంటికి అపుడు కనబడుచున్నది కూడ అదే. కాని నిజమునకు ఆ సమయములో వారు త్రిభువనములు యాత్రలు చేయుచుండిరి. అందుచేత భజహరిదాస్ సమాధి వేదిక కన్న ఎండలకు ఎండుచు, వానలకు తడియుచు అక్కడ ఉన్న పాదుకలే ప్రజలకు ఎక్కువ రహస్యమయము, పవిత్రవంతము. అయినవి. ఆ తరువాత నెమ్మదిగ సమాధికి సమీపములో ఒక భాగవత గృహముకూడ నిర్మింపబడినది. సమయముకాని సమయములో గాని భాగవత శ్రవణమునకు గాని వచ్చు అతిథులు బసచేయుటకు, లేదా గ్రామ సమస్యలను పరిష్కరించుటకు గ్రామ పంచాయతి సమావేశములు జరుపుకొనుటకు లేక గుత్తదారులు, ఆమీనాలు, పన్ను వసూలుదారులు మొదలగు హిందూ కర్మచారులు బసచేయుట కొరకు ఆ గృహము వసతిగా నుండెడిది ఇప్పుడు ఈ యాత్రిక ప్రతినిధులు గూడ అచటనే విడిసినారు.

భాగవత గృహ వసారాలో ఒక చాపమీద కంబళీకాప్ కూర్చున్నాడు. ఆయనకు కొద్ది దూరములో గోవింద్ మహాపాత్ర కూడ కూర్చున్నాడు. వారి తలల పైన పాగాలు, ఒంటి మీద కాషాయరంగు మీర్జయీ చొక్కాలు. భుజము

వైని నామావళి శాలువలు ఉన్నవి. మంగళ్‌పుర్, దాని పరిసర ప్రాంతములలో నున్న యితర గ్రామములలోని ప్రముఖుల వారిచుట్టూ కూర్చున్నారు. వారిలో కొందరు భక్తి పారవశ్యము వలననో, గంజాయి ప్రభావము వల్లనో అర్ధనిమీలిత నేత్రులై చేతులు జోడించి ఆ ప్రతినిధుల వచనామృత పానము చేస్తూ ఉంటే మరి కొందరు ధ్యానమగ్నులై కూర్చుని ఉన్నారు. ప్రోవ తప్పిన ఎద్దు లాగ చుట్టూ తిరుగుచు మాటి మాటికి కంఠ్‌మేకాప్ చేతులలోనికి గంజాయి చిలుము గొట్టము వస్తున్నది. వసారా క్రింద ఆబాల గోపాలము తలలెత్తి ప్రతినిధులు ఏమి చెపుతారా అని ఉత్సుకులై చూస్తూ ఉన్నారు. అక్కడ వంట శాలలో ఒకరిద్దరు వ్యక్తులు ప్రతినిధుల కొరకు అన్నము, ప్రసాదము వండుతున్నారు. కొందరు ఏ పనీ లేక పోయినను వంటశాలవైపు వెళ్ళి వారిని వీరిని అనవసరముగ విసుస్తూ, చెమట తుడుచుకుంటూ మధ్య మధ్య కంఠ్ మేకాప్ చెపుతూ ఉండిన దానిని ఒకటి రెండు క్షణముల పాటు విని వెళుతున్నారు.

గత సంవత్సరము పూరీ మార్గములు నిర్మానుష్యముగ కనబడు చుండినవి. మొగల్ దాడుల భయము వలన పంచక్రోశ యాత్రికులుతప్ప దూరదేశ యాత్రికులు ఎవరూ కనిపించేవారు కారు. పండాలు చేతులు ముడుచుకొని కూర్చుండ వలసి వచ్చేది. దేవస్నాన పూర్ణిమనుండి శ్రీ గుండిచా యాత్ర వరకు పర్వాలు, పండుగలు అనేకముగా ఉన్నవి కనుక యాత్రికులు బాగా వచ్చినట్లయిన గత సంవత్సరపు నష్టము పండాలకు ఈ ఏడు భర్తీ కాగలదు.

ఆ పండాలందరూ ఈ ఆశతోనే ఎదురు చూస్తూ ఉన్నారు. జగన్నాథుడు పతితపావనుడైనాడు యాత్రిక ప్రతినిధులు ఈ వృత్తాంతమునే వర్ణించి చెప్పుచుండుట వలన, మొగల్ దాడుల భయము లేకపోవుట వలన ప్రజలు పూరీ వెళ్లుటకు ఉవ్విళ్ళూరు చున్నారు.

కంఠ్ మేకాప్ గంజాయి దమ్ము గట్టిగా పీల్చి, మరల ఆధ్యాత్మిక గాంభీర్యముతో, అర్ధనిమీలిత నేత్రములతో, నాసికా రంధ్రములద్వారా పొగను మెల్ల మెల్లగా వదులుతూ, "మీకు అసత్యము...మాకు సత్యము...విషయము

ఆ విధముగానే యున్నది. ఇప్పుడు ఘోర కలియుగము ప్రవేశించినది. దీని వల్ల జగచ్చక్రవర్తికి కాళ్ళూ చేతులూ బంధింపబడినట్లయి కండ్లతో చూస్తూ కూర్చుండి పోయినారు. ఆ జగన్నాథ బలరాము లిద్దరూ సోదరులు. వారు భక్తుల మానరక్షణకు గాను తెల్లని, నల్లని గుర్రాలపై కాంచీ ప్రయాణము నకు బయలువెడల లేదా ? --" అన్నారు!

"హరి బోల్ హరిబోల్ !" అద్భుత నాదముతో మహాపురుష్ వట వృక్షము క్రింద జనపూర్ణమైన వాతావరణము ప్రకంపిత మైనది.

చిలుము గొట్టమునుండి ఒక గంజాయి దమ్ముపీల్చి, పాలిఆ గోవింద్ మహాపాత్ర "అరే భాయీ ! ఎక్కడనో దూరముగా నున్న విషయము ఇప్పుడు ఎందుకు ? దివ్య సింహ మహారాజావారు దీన కృష్ణదాస్ కవిని కారాగారములో ఉంచినారు. శ్రీకృష్ణుని వేరతప్ప అన్యుల పేరుమీద కవిత్వము చెప్పనని కృష్ణదాస్ కవి అనినందుకు రాజావారు ఆయనను కారాగారములో బంధించి నారు. అప్పుడు జగన్నాథుడు ఆ కవి మొరనాలకించి ప్రతి దినము బండి ఖానాకు వెళ్లు చుండేవాడు కాడా ? ఒకనాడు రాజావారు ప్రభువువారి దవన మాలను కారాగారములో చూసి వెంటనే దాస్‌ను కారాగారము నుండి విముక్తుణ్ణి చేసి, అపూర్వ సన్మానముతో తీసికొని వెళ్లినారు. ఇది అందరకు తెలిసిన విష యమే కదా !" అని అనినాడు.

ఈ మాటలు ముగియునంతలో గంజాయి చిలుము గొట్టము ఒక చుట్టు తిరిగి మరల గోవింద్ మహాపాత్రవద్దకు వచ్చినది. అందువలన మంగళ్‌పుర్ గ్రామపెద్ద హరిశతపథి, "అన్నిటిని మించినది దైవభక్తి. ఎవరి మనస్సు ఎంత ఉన్నతముగ నుండునో వారి ప్రభువుకూడ అంత ఉన్నతముగా నుండునని శాస్త్రములలో ఉన్నది." అని చెప్పినాడు.

ఆయన తరువాత కంఠమేకావ్ చెప్పుటకు ప్రారంభించి, "ఇది అంద రకు తెలిసిన విషయమే,ఒకసారి పరమేశ్వరుని 'పొడ్‌పిఠాలో' ఒక తలవెంట్రుక వచ్చినది. అప్పుడు రాజా వారికి కోపము వచ్చి "ఓయి సూపకారుడా! ఇంత మహా

పరాధమును చేసెదవా? అమృత తుల్యమైన భోగములో వెంట్రుకను వేసెదవా? ఎవరక్కడ? ఇతనిని తీసికొనిపోయి కారాగారములో బంధించండి''అని అన్నారు. సూపకారుడు బంధింప బడినాడు. ఆ తరువాత బలియార్ భుజుడు రాజా వారికి స్వప్నములో దర్శన మిచ్చి "నా వంటవానిని బండిఖానా నుండి విడిచిపెట్టుము. లేకపోయినట్లయిన నీవు సమర్పించు భోగమును తాకనైనా తాకను" అని చెప్పి నాడు. ఈశ్వరుడు భోజనము మానివేసి ఉపవాసము చేయ ప్రారంభించినాడు. అప్పుడిక జరిగెడిదేమున్నది? అందుచేత రాజావారు స్వయముగా కారాగారము నకు వెళ్ళి, ఆ వంట బ్రాహ్మణుని కలసికొని, "నా అపరాధమును మన్నించుము. నేను పాతకుడను" అని క్షమాపణ చెప్పుకొని తమ స్వహస్తములతో అతనిని విముక్తుని చేసి తీసికొని వచ్చినారు ఆ నాటినుండి పరమేశ్వరునికి 'బాల్‌భోగ్' (వెంట్రుక భోగము) ఏర్పాటు చేయబడినది," అని చెప్పినాడు.

అతని మాటలు వినినంతనే 'హరిబోల్!' అని వసారా క్రింద కూర్చున్న జనులందరూ ఒక్కసారిగా అరచినారు. చాటున కూర్చుండిన స్త్రీజనము కూడ కంఠములను కలిసినారు.

కంత్ మేకావ్ గంభీర ఆధ్యాత్మిక భావముతో పైకి చూచుచు నెమ్మది నెమ్మది పొగ వదల నారంభించినాడు.

మేఘ్‌కు ఎడమవైపున మంగళ్‌పుర్ గ్రామములోని ధనవంతుడైన పలుకుబడిగల రైతు పహలీ విశ్వాల్ ఆసీనుడై ఉన్నాడు. ఆయన వయస్సు అరువదికి పైబడీ ఉండవచ్చును. అయినను ఆయన శరీరము బలిష్ఠముగానే ఉన్నది. ప్రతి సంవత్సరము రథయాత్రకు పూరీ వెళ్ళగలనని ఆయన ఆను కొనుచుండెనివాడు. కాని సమయమునకు మొగల్‌దాములు సంభవించడము వలననో, కుటుంబ సమస్యలు ఎదురు కావడము వలననో పూరీ శ్రీ క్షేత్రము నకు ఆయన వెళ్ళుట సంభవించెడిది కాదు జీవితములో ఆయనకు కలిగిన లోటు ఇది ఒక్కటే, దీని వలన ఆయన మనస్సునకు నెమ్మది చేకూరుట లేదు. అందు వలన యాత్రిక ప్రతినిధులు వచ్చినారన్న వార్తను ఆయన ఎప్పుడు వినినను

జగన్నాథుని గురించి తెలిసికొనుటకు తప్పక అక్కడకు వచ్చుట ఆయనకు అల వాటు. నేడుకూడ ఆయన వచ్చినాడు. కాని ఆయనకు పుట్టెడు చెవుడు. ప్రతి నిధులు అత్యధిక భక్తి భావోద్రేకముతో గట్టిగ చెప్పి నప్పుడు మాత్రము ఆయన కొద్దిగ వినగలడు. ఆయనకు విన్నది అర్థమయినను కాకపోయినను నొసటను రెండుచేతులు జోడించి నమస్కరిస్తూ ఉంటాడు, ఆ తరువాత కాంతిహీన మైన కండ్లతో ప్రతినిధుల వైపు చూసి, నిశ్చలముగా కూర్చుంటాడు. ఆయన తల బోర్లించిన కుండవలె ఉంటుంది. దాని అంచులవద్ద కుటిలములైన తెల్ల వెంట్రుకలు ఉన్నవి. వాటిలో కొన్నిటిని కలిపిపిలకముడి వేసికొన్నాడు. కర్ణా భరణముల భారమువలన చెవితమ్మెలు సాగి వ్రేలాడుతున్నవి ముఖముమీద ముడుతలు స్పష్టముగా గోచరిస్తున్నవి. చేతులకు ఉన్న వెండిమురుగులు అతని ఐశ్వర్యమును చాటుతున్నవి. మెడలో కొయ్య పూసల మాల వ్రేలాడుచున్నది. కంఠమ్మీద చందనపు బొట్టు ఉన్నది. కాని నొసటను బొట్టు ఏమియు లేదు. భుజముపైనుండి ఒక కొల్లాయి అంగవస్త్రము వ్రేలాడుచున్నది. అతడు తదేక దృష్టితో ప్రతినిధులను చూస్తూ కూర్చున్నాడు.

విశ్వాల్ ధనవంతుడు, వ్యవసాయదారుడు వడ్డీ వ్యాపారస్థుడు, వర్తక వ్యాపారస్థుడు. ఇటువంటివాడు పూరీ వచ్చినట్లయిన దక్షిణ బాగా ముడుతుంది. అందుకని మేకావ్ అతని వంక చూసి "ఈ యేడు రథయాత్రకు పూరీ వచ్చె దవా తాతా? ఈ కలియుగములో మానవ శరీరము సీటిమీది చంద్రబింబము వంటిదని శాస్త్రములు చెప్పుచున్నవి. నేడు ఉన్నది రేపు ఉండదు కనుక ఒక్క సారి ఆ జగచ్చక్రవర్తిని చూసివచ్చినావంటే మోక్షప్రాప్తికలుగునుకో! ఇక్కడ నుండి అనేకమంది వస్తారు. నీవు కూడ అవ్వను వెంట బెట్టుకొని ఆబాలగోపాల ముతో రమ్ము!" అనినాడు.

విశ్వాల్‌కు అతని మాటలు సరిగా వినబడక అతను చిరునవ్వు నవ్వి ఊరుకొనినాడు. ఆ ప్రక్కను కూర్చుండిన ఒక వ్యక్తి "ఆయన చెవిటివాడు. గట్టిగా చెప్పినగాని వినబడదు. కనుక బిగ్గరగా చెప్పండి" అని సంజ్ఞ ఇచ్చి

నాడు. అంతట మేకావ్ ఆ మాటలనే బిగ్గరగా చెప్పి,

"అహో తత్ క్షేత్ర మహాత్మ్యమ్, గర్భ భోఒవి చతుర్భుజః
యత్ర ప్రవేశ మాత్రేణ నకస్యాపి పునర్భవః"

అని ఒక శ్లోకమును పఠించినాడు. "శ్రీ క్షేత్ర మహాత్మ్యము అటువంటిది. ఆక్కడ మానవులు, మానవులేకాదు, గార్భభములు కూడ చతుర్భుజులైపోవుదురు" అని వ్యాఖ్యానించినాడు. మేకావ్ చెప్పిన మాటలు వినినంతనే విశ్వాల్ తిరిగి నొసటను చేతులను జోడించి అనేకానేక నమస్కారములు చేసినాడు. ఆ తర్వాత తన బోసి నోటిని తెరచి "ఆ చక్రవర్తి స్వయముగ నన్ను లాగుకొని పోతే తప్ప నా అంతట నేను శ్రీ క్షేత్రము వెళ్ళడము అసంభవము. అక్కడికి వెళ్ళవలెను, వెళ్లవలెను అని అనుకొంటూనే ఈ భూమినుండే వెళ్ళి పోయే స్థితికి వచ్చినాను" అని అనినాడు.

"ఈ యేడు అనేక మంది రథయాత్రకు వస్తున్నారు. శ్వేత ద్వీపము, మగ ద్వీపము, నేపాలము, కాశ్మీరము, రాఢ్, గౌడ, అంగ, వంగ, అవంతి, కాశి, బృందావన్, కయిలా, మహారాష్ట్ర, బీహార్, ద్వారక, మధుర... ఇక్కడనుండి అక్కడనుండి అని ఏమిటి, దూరదూరములనుండి యాత్రికులు రానున్నారు. జగన్నాథుడు తిరిగి పతిత పావను డైనాడు," అని మేకావ్ చెప్పినాడు.

"జగన్నాథుడు తిరిగి పతిత పావనుడైనాడు" అన్న మాటలు విని "హరి బోల్" ధ్వనితో ఆ స్థలమంతా తిరిగి ప్రతి ధ్వనించినది.

ఆ తరువాత అందరకు జ్ఞాపకము వచ్చినది, జగన్నాథుడు శ్రీ క్షేత్ర మందిరములో లేడు అన్న విషయము.

"పరమేశ్వరుడు ఆలయములో లేడని విన్నామే!" అని అయింతుదాస్ అడిగినాడు.

పాలిఆ గోవింద్ మహాపాత్ర అంతవరకు కళ్ళుమూసుకొని సంచీలోని జపమాలను త్రిప్పుతూ ఉన్నవాడల్లా అయింతుదాస్‌ని మాటలువిని ఆకాశము మీదినుండి ఊడిపడిన వానిలా కండ్లు తెరచి "కొండచరియ వాసులు అంటున్న మాటలు ఇవి. వారికి ఏమీ తెలియదు, వైగా అంతా అస్తవ్యస్తముగా అంటూ ఉంటారు. ఆ ఆలయము శ్రీ వత్సాల ఆలయము. పరమేశ్వరుడు ఆ ఆలయ మును వదలి వెళ్ళినట్లయిన ఈ పృథ్వి ఈ విధముగా నిలబడుతుందా? కలియు గాంతమునకు ఆ పరమేశ్వరుడు రత్నవేదికను వదిలి వెళుతాడు. ఎంత దొడ్డ మాటలను నెలవిచ్చినారు బేయిప్‌లు!" అని అన్నాడు.

ఆయింతుదాన్ అపరాధివలె "చెవులతో మేము విన్నమాట అది. అనాడు సాఆంతరాపుర్ సంతలో మానఖిఆమా యొక్క భావగారితో కుసున్‌సాహూ అన్నమాటలు అవి. సాహూ ఎంత పెద్దమాట చెప్పినాడు!" అని హీనస్వరముతో క్షమాపణ చెప్పుకొంటున్నట్టు అనినాడు.

మేకావ్ కంఠమును సవరించుకొని "జగన్నాథుడు పతితపావనుడై, గుమ్మట శిఖరములో విరాజమానుడై ఉన్నాడు. ఆలయమును వదలి ఆయన ఎలాగు వెళతాడు?" అని పరిస్థితిని స్పష్టము చేస్తూ చెప్పినాడు.

"జగన్నాథుడు తిరిగి పతిత పావనుడు ఎట్లయినాడు?" అని ఒకేసారి అనేక కంఠములు ప్రశ్నించినవి.

"ఒకనాడు సాస్ పరీచా విష్ణు పశ్చిమకపాట్ మహాపాత్రకు పరమేశ్వ రుడు స్వప్నములో దర్శనమిచ్చి, "నా పరమభక్తుడైన ఖోర్ధారాజు యవనుడై నందున అతడు నా రత్న సింహాసనము వద్దకు వచ్చుటకు వీలులేక పోయినచో నేను ఆ సింహాసనముపైన కూర్చుండలేనని, ఖోర్ధారాజు నన్ను ఎక్కడినుండి దర్శించగలడో అక్కడనే నేనుండగలననీ' చెప్పినాడట!" అని మేకావ్. విశదీకరించినాడు.

"అప్పుడు!" అని అందరూ ఒక్కసారిగ ఆతురతతో అడిగినారు.

మేకావ్ ఆర్ధనిమీలిత నేత్రుడై మరల వృత్తాంతమును చెప్పుటకు ప్రారంభించి "మీ కది అసత్యముగా గోచరించవచ్చును. కాని మాకు అది సత్యము. ఆనాడు చైత్ర శుక్ల దశమి. ఒకజాము రాత్రి ఇంకను మిగిలియున్నది. అప్పుడు ఆలయద్వారము తెరచుకొన్నది. శంఖములు, నౌబత్తులు, కొమ్ములు, తూర్యములు, వీణలు, గంటలు, మృదంగములు మొదలగు వాయిద్య ధ్వనులు వినిపించినవి. వెంటనే ఇద్దరు మహాపాత్రలూ లోపలనుండి కాగడాలను తీసికొని వచ్చి జయ విజయ ద్వారమువద్ద గడియలను పరీక్షించినారు ద్వారమును తెరచినారు. వెంటనే సాన్ పరీఛా, వారి వెనువెనుకనే యితర సేవకులు "మణీమాఃమజీమాఃమ" అని పిలుస్తూ లోనికి ప్రవేశించినారు. ప్రధానద్వారము వద్దకు వారు వెళ్ళినంతనే జయవిజయ ద్వారమునుండి ప్రధాన ద్వారమువరకు వాడిన దవనం, నాగకేసర పుష్పాలు చెల్లా చెదురుగ పడియుండడము ఆ మసక కాంతిలోనే సాన్ పరీఛా గమనించినారు.

"ఎంత ఆశ్చర్యకరమైన విషయముఃమ అని పాన్ పరీఛా ఆశ్చర్యపోయి క్షణమాత్రము స్తబ్ధుడై పోయినాడు.

"గతరాత్రి 'పహడ్' సమయమందు ఆయన ఉండనే ఉన్నాడు. 'పహడ్'కు ముందు ఆలయ పరిశోధన జరగనే జరిగినది. ఇప్పుడు ఈ దవనము, ఈ పూరేకులు ఎక్కడనుండి వచ్చినట్టుఃమ"

"ఎలా వచ్చినవి," అని ఉత్కంఠతో శ్రోతలు ప్రశ్నించినారు.

ఆప్పటివరకు ఎడమకాలి మడమపైని కుడికాలి మడమను ఉంచి కూర్చున్నవాడున కాళ్లు నొప్పిపుట్టి మేకావ్ సర్దుకొని కూర్చున్నాడు. "సేవకులందరు లోపలకు వచ్చినారు. శ్రీవారి శయనాగారపు 'మేకావ్' శ్రీవారి శయ్యను సరిచేయవలెనని చూసేసరికి శ్రీమస్తకమువద్ద ఉండవలసిన దిండు, శ్రీపాదపద్మముల వద్ద ఉండవలసిన దిండు, శ్రీఅంకపు దిండు, ఇరు ప్రక్కల ఉండవలసిన దిండ్లు వాటి వాటి స్థానములలో లేవు. అవి ఇటు నటు చెల్లాచెదరుగ నున్నవి. పవళింపు సమయములో అన్నీ యథావిధిగా జరిగినవి. పురాణ పఠనము, తాంబూల సము

ర్పణము, హడప్‌లాగి, సింహోర్ పితా, కాంచి బాటుకా, పఖాల్ భోగ్ ఆదిగాగల విధులన్నియు యథావిధిగా నెరవేర్చబడినవి. శయన సామగ్రి అంతా తీసికొని రాబడినది.సువర్ణ అర్ధనారీ నారాయణదేవునకు పుష్పమాలను సమర్పించి,దీపము, అగరువత్తి, చందనము, చామరము, ఆరట్‌ఖదీ, వీణావాదనము, గీతాపారాయణము, వేత్రము మొదలైన సేవలన్నిటిని చేసి, సింహారి జగ్‌మోహన్ ద్వారము వద్ద స్వర్ణపీఠము పైని శ్రీవారిని విరాజితుల చేసి, జయ్-సింహోర్ భోగమును పంచోపచారములతో సమర్పించి పూజ ముగించడమైనది. హారతి ఇవ్వడమయినది.లోపల భాండారపు మేకాప్ దీపము తీసికొని సింహాసనమునకు నలువైపులా పరీక్షించినాడు. ఛాము ఆఖండమను ఇతర దీపములను గొనివచ్చిన తరువాత ప్రభువు వారికి 'పహాడ్' చేయడమయినది. మరి ఇప్పుడింత వేకువనే దిండ్లు అన్నీ చెల్లా చెదురు ఎట్లయినవిఃజరుగరానిది ఎట్లు జరిగినదిఃఁ అని చెప్పి మేకాప్ శ్రోతలను ఒకసారి చూసినాడు. శ్రోతలలో ఉత్కంఠ పెరుగుచుండెను. దానికి అనుగుణముగనే మేకాప్ వర్ణనశైలి కూడ రహస్యమయము కాజొచ్చినది.

మేకాప్ చిలుము నుండి మరొకసారి గంజాయిని పీల్చి "వేళ మించి పోవుచుండెను. పరమేశ్వరుని కాఠిలాగి. ఆద్య సంబోధనీ పూజలు ప్రారంభించుటకు ముందు శ్రీ కాపడా లాగి, చున్ లాగి మొదలైన అనేక కార్యక్రమములు పూర్తికావలసియుండెను. ఆ తరువాత సూర్యపూజ, గరుడ పూజ, ద్వార పాల పూజ, వాటి తరువాత ప్రభాత పూజ జరుగవలసి ఉండెను. శ్రీ వారి సేవకులు అలా ఆశ్చర్యముతో ఒకరినొకరు చూసికొంటూ ఎంతవరకు ఉండగలరుఃమనస్సులోని మాటను మనస్సులోనే ఉంచుకొని తమ తమ పనులలో నిమగ్నులు కాకతప్పలేదు." అని చెప్పినాడు.

"ఆ తరువాతఃఁ" అని శ్రోతలందరు ఏక కంఠముతో ప్రశ్నించినారు. మేకాప్ మరల ప్రారంభించి, "ఆ నాటి నుండి ప్రతిదినము ఏదో ఒక ఆశ్చర్యకర సంఘటన జరుగుతూనే వచ్చినది. చివరకు జయవిజయ ద్వార గడియలు సాన్‌పరీచా స్వయముగా తన చేతులతో వేయడము ప్రారంభించినాడు. అయి

నప్పటికిని వేకువ జామున ద్వారము తెరచే సరికి ఒకనాడు తెల్లగులాబి పూల మాల అయితే వేరొకనాడు దవనము, నాగకేసరమాల క్రింద పడి ఉండేవి. చివరకు సాన్‌పరీచా నిర్జలోపవాసము ప్రారంభించినాడు. ఆలయములోనే పడియున్నాడు. ఆ రాత్రి మహాప్రభువు స్వప్నములో దర్శన మిచ్చినారు....." అనిచెప్పి అతడు చిలుము నుండి మరొక దమ్ములాగినాడు. ఆయన ప్రసంగము అక్కడనే ఆగిపోయింది.

అప్పటికే శ్రోతలకు ఓపిక సడల నారంభించినది. స్వప్నములో ఏమి జరిగిదని ఒకరిద్దరు ప్రశ్నిస్తూ ఉండగా మిగిలినవారు 'హరిబోల్' ధ్వనితో మహాపురుష్ వటవృక్ష సభాస్థలమును ప్రతిధ్వనింప జేసినారు.

మేకాప్ నెమ్మది నెమ్మదిగా పొగను వదలుతూ మరల తన ప్రసంగమును ప్రారంభించి "నా రాజసేవకుడైన ఖోర్ధారాజును నీవు రత్నసింహాసనము వరకు రానిచ్చుట లేదు. అతనిని అస్పృశ్యుడు అంటున్నావు. అందుచేత నేను రత్న సింహాసనమును వీడి ఆలయ గుమ్మట శిఖరములోనికి వచ్చి విరాజమానుడను కావలెనని అనుకొంటున్నాను. అప్పుడు నా రాజ సేవకుడు నా దర్శనము చేసికొన గలుగుతాడు అని శ్రీవారు నెలవిచ్చినారు" అని చెప్పినాడు.

మేకాప్ మాటలు పూర్తి అయినవో లేవో "హరిబోల్" ధ్వనితో మంగళపుర్ గ్రామములోని ఆనాటి మసక వెన్నెల రాత్రి కంపించి పోయినది. మేకాప్ చెప్పిన మాటలలో కొన్ని పహలీ విశ్వాల్ వినగలిగినాడు. కొన్ని వినలేక పోయినాడు. కాని బ్రహ్మాండమైన 'హరిబోల్' ధ్వని వినప్పుడల్లా ఆయన చేతులు వైకెత్తి నొసటను పెట్టుకొని ప్రభువును తలచుకొని ప్రణామములు చేసినాడు.

ఆనాటి సభలో తాత్త్వికుడు ఒక్కడూ లేడు. అందువలన 'జగన్నాథుడు ఎవరు ఏమిటి?' అన్న విషయము వారికి అనవసరము. ఆ విషయము తెలిసికొన వలెనన్న ప్రయత్నము గూడ వారు చేయలేదు. వారంతా సామాన్య సంసారులు. వారిలో మూడువంతుల మంది జగన్నాథుని దర్శించ నైనా

దర్శించలేదు. జగన్నాథ మార్గములో ప్రతి చౌకువద్ద జిజియా పైసలు చెల్లించుచు పూరీ వెళ్లుటకు వారియొద్ద ప్రయాణ ఖర్చులు కూడా లేవు. దీనికి తోడు తమ కుటుంబ జంజాటములను వదలి వెళ్ళే సమయము కూడా వారికి లేదు. ఆపద మ్రొక్కులు మ్రొక్కి కొనడము వారికి అలవాటే. కాని వాటిని వారు బలేశ్వర్ మహాదేవ్ వద్దనో లేక ఉతేయిశుణి ఠాకురాణీ వద్దనో తీర్చు కొంటూ ఉంటారు. పెద్ద మ్రొక్కులయితే ధవళా లింగము ఉండనే ఉన్నది. ఆధి వ్యాధులకు గ్రామదేవత లున్నారు. ఒక నల్ల చీరను, ఒకటి రెండు మేక పోతులను బలి యిస్తే సరిపోతుంది. ఆటువంటి వారికి జగన్నాథుని వద్ద మ్రొక్కికొన వలసిన అవసర మేముంటుంది? ఆ అమర ధూళిలో కన్ను మూయవలెనన్న అభిలాష ఉన్నవారు తప్ప వేరు కోరికతో అక్కడకు ఎవరు వెళతారు? అయినను వారికి జగన్నాథునితో సంబంధమున్నది. ఆ జగన్నా థుడు మహారాజు. ఒక్కసారి ఈ చర్మ చక్షువులతో వారిని వీక్షించి నట్లయితే జీవన్ముక్తి లభిస్తుంది. ఆయన చాలా దూరములో ఉన్నప్పటికిని ప్రతి ఒక్కరి ఏకాంత అంతరంగములో గూడ ఆయన ఉండనే ఉన్నాడు. దుర్లభు డవుతూ గూడ ఆయన అనుగతుడు.

ఇప్పుడు ఆ జగన్నాథుడే భక్త మాన రక్షణార్థము ముల్లోకములకు గూడ సర్వోన్నత మైన తన రత్న సింహాసనమును వదలి సింహ ద్వారమువద్ద నున్న గుమ్మట శిఖరము క్రిందకు వచ్చి, యాత్రికుల పదధూళి వద్ద విరాజ మానుడైనాడు. భక్తి అనే సింహద్వారము వద్ద ప్రభువు స్వయముగా భక్తుడై ఆసీనుడైనాడు. మిక్కుటమైన ఆవేగము వలన భక్తుల చేతన ఆర్ద చేతన మనస్సులను ఈ విషయము ఏకీకృతము చేస్తున్నది.

'హరిబోల్' హర్షధ్వని శాంతించిన తరువాత అప్పటివరకు వసారాలో కూర్చుని పాన్‌దాన్ తీసికొని తమలపాకులను చుట్టుచున్న నాథ్‌మిశ్ర సందేహ ముతో "రాజా వారయితే మతమును వదలిపెట్టి పతానులైనారు. అటువంట ప్పుడు వారు ఏ విధముగా జగన్నాథునికి రాజసేవకు లవుతారు? బక్షీ వేణు

భ్రమరవర్ అయితే వధించ బడినాడు. రాజుగారి కొరకు జగన్నాథుడు ఎందుకు పతిత పావను డయినాడు ? అని అడిగినాడు.

నాథ్ మిశ్రయొక్క ఈ సందేహము విశ్వాసపరులైన ఇతర భక్తుల మనస్సులలో గూడ సందేహ పూరితమైన జిజ్ఞాసను రేకెత్తించినది. అందువలన వారు 'ఔనౌను; అదెలాగున ?" అని అడిగినారు.

'అందుచేతనే తాను పతిత పావనుడనవు చున్నాననీ, లేకపోయినట్లయిన తన పరమ సేవకుని ఎవరు పవిత్రునిగా చేయుదురనీ, అతనికి ముక్తి ఎవరి వలన లభించుననీ బలియార్ భుజుడు అడిగినాడు" అని మేకావ్ సమాధానము ఇచ్చినాడు.

ఆ తరువాత ఇంకేమి అడుగవలెనో నాథ్ మిశ్రకు తోచలేదు.

అయితే ఖోర్ధా రాజైన ఏ రామచంద్ర దేవ్ కొరకు జగన్నాథుడు స్వయ ముగ పతిత పావన జండాను ప్రతిష్ఠించినాడో ఆ రామచంద్రదేవ్ ఎంత గొప్ప ప్రభుభక్తులో కదా !

అక్కడి వారందరూ ఏక కంఠముతో "జయ్ !జగన్నాథ్‌కీ జై ! జయ్ ! ఖోర్ధా రాజా రామచంద్రదేవ్‌కీ జై !" అని జయ జయ ధ్వానము చేయ నారం భించినారు.

జగన్నాథుడు పతిత పావనుడై సింహద్వార గుమ్మటము వద్దకు వచ్చి కూర్చుండిన ఫలితముగ మొగలి పొదలు, వెదురు దొంకలు, నదులు, కాలువలు మొదలగు వాటితో ఆవరింపబడిన ఆ కొండచరియ గ్రామము మంగళ్‌పుర్‌లో రామచంద్ర దేవుని జయ జయ ధ్వానములు ఆనాడు ఎలా ప్రతిధ్వనించినవో, అదే విధముగ ఉత్కళ దేశపు నలుమూలలా రామచంద్రదేవుని జయజయ ధ్వాన ములు ప్రతిధ్వనిస్తున్నవి. దానివలన సామాన్య ప్రజానీకములోగూడ వారి పట్ల ఒక క్రొత్త అనుచర సంబంధము మెల్ల మెల్లగ జాగృతము కాజొచ్చినది.

"జగన్నాథుని అనుగ్రహము ఎవరిపైన ఉండునో వారి కుల వంశ విశేషములతో పనిలేకుండ వారికే ఓరిస్సా సింహాసనము చెందుతుంది. స్పర్ధ, క్షమ అహంకారముల పైన కాక జగన్నాథుని సేవ, అనుగ్రహాభాజనత్వముల మీదనే ఓరిస్సా సింహాసనము ప్రతిష్ఠితమై ఉన్నది. దానిపలననే "ఖోర్ధా రాజు రామచంద్రదేవ్ మతమును వదలి ముసల్మాను లైనారు" అన్న ప్రచారము జరిగినంతనే వారియెడల పాయక్‌లకు, దుర్గాయకులకు, సామాన్య పౌరులకు నెమ్మది నెమ్మదిగ అనుచర సంబంధము సన్నగిల సాగినది. రామచంద్రదేవ్ నానాటికి సామాన్య జనులకుగూడ దూరమగుచున్నారని తెలిసి నాయబ్-నాజిమ్ తకీఖాన్ ఊరటచెంది కటక్‌లో కూర్చున్నాడు. ఖోర్ధా సింహాసనమును అభిలషించిన రామచంద్రదేవుని శత్రువులలో ఆశలు చిగురించినవి. కాని పూరీ ప్రభుత్వ జగన్నాథుడు రామచంద్రదేవ్ కొరకు సింహద్వారము వరకు వేంచేసి పతిత పావనుని రూపములో విరాజిల్లిన నాటినుండి రామచంద్ర దేవుని ప్రతిష్ఠ నెమ్మది నెమ్మదిగ పునర్జీవితము కాసాగినది. ఖోర్ధా మరియు మొగల్ అధిపత్యములో ఘటిల్లిన యీ ఆశ్చర్యజనకమైన ఘటన వలన రామచంద్రదేవుని పట్ల సాధారణ జనులు ఆకృష్టులవుతూ వచ్చినారు.

2

అక్షయ తృతీయ గడచినది. స్నాన పూర్ణిమ తరువాతనుండి బాణ్‌పుర్ నీలాద్రి - ప్రసాద్‌గఢ్‌లో ఆణసర్ విధి పురుషోత్తమపురీ క్షేత్రములో వలెనే ప్రారంభమవుతుంది. ఆ తరువాత ఆషాఢ శుక్ల విదియనుండి రథయాత్ర ప్రారంభమవుతుంది. సాధారణముగ అక్షయ తృతీయ మొదలుకొని శ్రీ గుండిచా బాహుదా యాత్రవరకు నీలాద్రి - ప్రసాద్‌గఢ్ ఉత్సవము ముఖరిత మవుతుంది. బాణ్‌పుర్ రాజులు క్షత్రియులు అయినప్పటికీ నీలాద్రి - ప్రసాద్

గఢ్‌లో రథయాత్ర పరంపరాగత విధి ప్రకారము పెద్దపెట్టున జరుపబడు తుంది. కాని ఈ సంవత్సరము బాణ్‌పుర్ పైకి ఫౌజ్‌దార్ హాషింఖాన్ దాడికి తయారవుతున్నాడన్న కారణముగ నీలాద్రి ప్రసాద్‌గఢ్ కూడ సుడిగాలిలో కొట్టుమిట్టాడుతు పరిత్యక్తవలె కనిపిస్తున్నది.

త్వరలోనే మొగల్ దాడి జరుగుతుందన్న భయముతో ఇండ్ల తలుపు లకు తాళములు వేసి, తలుపులు లేని ఇండ్లకు ఏవో బిగించి మూసివేసి ప్రజలు అడవులలోనికి పారిపోయినారు. గత నూరు నూటపాతిక సంవత్సరముల నుండి మాటి మాటికి ఇక్కడ ఇదే దృశ్యము పురావృత్తమవుతూ వస్తున్నది. రాజా జగన్నాథ ప్రసాద్ మానసింహా కూడ ప్రసాద్‌గఢ్‌ను విడిచి బాలేరీలోని ఏదో దుర్భేద్యమైన గుహా దుర్గమునకు పారిపోయి తల దాచుకొనినాడు. ఖోర్ధా మహారాణి లలితా మహాదేయీ గూడ తన సేవికాసేవకులతో గూడ పీర్జాయీ విలాస్ గఢ్‌కు తరలి పోయినది. మొగల్ ఫౌజ్ దార్ హాషింఖాన్ బాలేరీలోని ఆ దుర్భేద్య దుర్గమును దుస్సాహసముతో పగులగొట్ట ప్రయత్నించిన యెడల గతమ్‌లో బాణ్‌పుర్ కంధ పాయక్‌ల పర్వత దాడులవలన మొగల్ ఫౌజ్ దార్లు ఏవిధముగా చెల్లాచెదరయినారో ఇప్పుడు అతడుకూడ ఆలాగుననే కాగల దని మాన సింహా ఊహించినాడు.

ఈ గత చరిత్ర హాషింఖాన్‌కు తెలియనిది కాదు. అందువలన అతడు కొన్నాళ్లపాటు నీలా ది - ప్రసాద్ గఢ్‌లో సైనిక శిబిరమును ఏర్పరచి కొంత వరకు దానిని లూటీచేసి, రాజా గోవింద మానసింహా కాలములో నిర్మింప బడిన శ్రీ జగన్నాథ ఆలయమును పగులగొట్టించి మరియు అక్కడ కొంత సేనను నిలుపుచేసి, దక్షిణమున బంకాడ్ వైపుకు తిరిగి వెళ్ళినాడు. కాని మొగల్ దాడి భయము మాత్రము ఆలాగుననే నిలిచి యుండినది. అందుచేత రాజుగాని ప్రజలు గాని నీలాద్రి ప్రసాద్ గఢ్‌కు మరలి రానేలేదు.

నీలాద్రి - ప్రసాద్ గఢ్ వీథులు శూన్యముగా పడి ఉన్నవి. విపత్తు లకు అంతులేనట్టున్నది. గతరాత్రి సుడిగాలితో తుఫాను వచ్చినది. ఆ తుఫా

నుకు వీధులకు ఇరుప్రక్కల నున్న పురాతన కానుగు, చింత, మామిడి మొద లైన వృక్షములన్నీ ఇంచుమించుగా నేలకూలినవి ఇండ్ల పైకప్పులు ఎగిరి పోయినవి. వర్షపు నీటికి కరిగి పోయిన మట్టి గోడలు స్థూపములవలె పేరుకు పోయినవి. జగన్నాథ ఆలయము మీది నీల చక్రము విరిగి ప్రక్క నున్న మట్టి గుట్టపైన పడినది.

ఉదయమునుండి తుఫాను లేదు. మేఘములు లేవు. వర్షము వలన కడగ బడినట్లుగానున్న ఆకాశము, భూమి శాంతముగాను, నిర్మలముగాను ఉన్నవి. రాత్రి సంభవించిన భయంకర దుర్యోగము నుండి తప్పించుకొని బయట పడిన భూదేవి నవోదిత సూర్యభగవానునికి, ఆకాశమునకు ప్రణమిల్లు తున్నట్టుగా ఉన్నది.

గఢ్ మార్గములపైన మొగల్ సైనికులు కొందరు బల్లెములను ఊపు కొనుచు గుర్రముల పైన విహరిస్తున్నారు. ఖోర్ధా మహారాణి లలితాదేయీని, యువరాజు భాగీరథీ కుమార్‌ను బంధించ వలసినదిగా హుకుం జారీచేసి, హాషిమ్‌ఖాన్ అక్కడనుండి వెళ్ళినాడు. ఎందువల్ల ననగా, రామచంద్రదేవ్‌కు, ఆయన మూలమున మొగల్ శక్తికి వ్యతిరేకముగా కుట్రలు ప్రారంభ మయి నట్లును, వాటిలో లలితా మహాదేయీ మరియు యువరాజు భాగీరథీ కుమారుల చేయి యున్నట్లును బక్షీ వేణు భ్రహర్‌వర్ లలితా మహాదేయీకి వ్రాసిన ఉత్త రము వలన స్పష్ట మయినది. కాని సైనికులు ఎంత వెదికినను వారి జాడ దొరకలేదు.

హాషింఖాన్ సైనికులు బాణ్‌పుర్ పర్వతములు అడవులలో వారి కొరకు వెతుకు చుండిన సమయములో ఖాలేరీ కొండచరియలో నున్న వీర్జాయీ - ప్రసాద్ గఢ్‌లోని వీర్జాయీ ఆలయములో ఆకలి గొన్న ఆడ పులి వలె మహా రాణి బగలాముఖీ మంత్రము జపిస్తున్నది.

లలితా మహాదేయీ మహారాజ్ గోవింద్ మానసింహుని కుమార్తె. కాని ఆమె ఒక బ్రాహ్మణ స్త్రీ గర్భమున జన్మించినది. బాణ్‌పుర్ రాజవంశ

సంప్రదాయానుసారము రాజు ఒక బ్రాహ్మణ కన్యను వివాహము చేసికొన వలయును. బూణ్‌పుర్ రాజ్య ప్రతిష్ఠాపకుడైన యదురాజ్ మానసింహ్ ఏదో రాజ్యమునుండి నిర్వాసితుడై పలాయితుని వలె ఆశ్రయము కొరకు ఒకప్పుడు ఇక్కడ అక్కడ తిరుగుచుండెను. ఆ సమయములో కంధరాజ్యమందలి వీర్ జాయీ ప్రాసాదములో కంధుల 'దిగాల్' లేక రాజు అయిన బలభద్ర రణా అతనికి ఆశ్రయ మిచ్చినాడు. ఆ రాజు దేవీ ఉపాసకుడు. ఆ రాజుయొక్క ఆశ్రయములో నుంటున్న సమయమందు యదురాజ్ మానసింహ్ నెమ్మది నెమ్మదిగా యువరాజు మరియు వీర్‌జాయీ ఉపాసకుడు, సాధకుడు అయి నాడు. కాని అతని చిత్తము దేవి పాదపద్మముల మీదకన్న రాజ్యసింహాసనము మీదనే ఎక్కువగా ఉంటూ ఉండినది.

కంధుల నియమాను సారము ప్రతి సంవత్సరము పుష్య పూర్ణిమనాడు 'థడాపాను' లేక ధరిత్రికి నరబలిని ఇచ్చే ఆచారముండినది. ఆ విధముగ నర బలిని ఇవ్వకపోయినట్లయిన భూమి ఇక పంటల నివ్వదనీ, దేశములో కరువు కాటకములు వస్తవనీ, మహామారి వ్యాపిస్తుందనీ ఆ రోజులలో కంధులకు బల మైన మూఢ నమ్మకము లుండినవి. ఏ భూమాత కరుణవలన వసుంధర సస్య శ్యామల మవుతున్నదో, అరణ్యములు ఛాయా ఘనము లవుతున్నవో, నెల యేళ్లు శీతలజల ప్రవాహినులవుతున్నవో అట్టి తల్లికి మానవుడు ప్రతి సంవ త్సరము తన శ్రేష్ఠమైన కృజ్ఞతార్ఘ్య సూచకముగా నరబలిని సమర్పిస్తున్నాడు. మృత్యువులో నుండి మహాజీవన పల్లవము అంకురిస్తున్నట్లు ప్రతియేడు ఏరు వాకకు ముందు ఈ నరమేధ యజ్ఞము ఏర్పరచ బడుతూ ఉండినది. వీర్జాయీ ఆలయములో నరబలి లేక 'మేరి ఆ బలి' ని సమర్పించుట ఒక్కటే రాజుగా నున్న బలభద్ర రణాయొక్క రాచకార్యము. ఆదొక్కటే ఆయన బాధ్యత. ఆ యేడు కూడ పుష్యపూర్ణిమనాడు 'మేరి ఆ బలి' సమర్పించుటకు మాల్‌దేశ సరిహద్దు నుండి ఒక అనాథ బాలుని పట్టుకొనివచ్చి ఆలయములో కంధులు బంధించి ఉంచినారు. దేవతలను పూజించునట్లుగానే ఆ 'బలి మనుష్యుని' గూడ యథావిధిగా సర్వోపచారములతో కంధులు పూజించేవారు పుష్య పూర్ణి

మకు ఏడు రోజులు ము దునుండి కంధ్రగామముకో నృత్యము, వేట, మద్యము మైథునములతో గూడిన ఉత్సవము జరుగుతుంది. అటువంటి ఉత్సవ సమయ ములో అచను చూచుకొని యువరాజు యదురాజ్ మాననింపుడు ఆ అనాథ బాలుని రహస్యముగా తీసికొని పోయి బాణ్‌పుర్ సరిహద్దులలో విడిచి వచ్చి నాడు. బలిరోజున ఉదయమే మద్దెలలు, తప్పెటలు ట్రమోగించు కొంటూ కంధ ప్రజా సమూహము ఆలయము వద్దకు వచ్చి చూసేసరికి ఆ 'బలి బాలుడు' కానరాలేదు.

'మేరి ఆ' అంతర్ధానమైనాడన్న సంగతి తెలియగానే తలలపైని నెమలి పింఛములతోను, మద్దెల తూర్యనాదములతోను చేయుచుండిన కంధుల ఉన్మత్త నృత్యము క్షణమాత్రములో విస్మిత చకితమై నిలిచి పోయినది. మృత్యువు, మహామారి, దుర్భిక్షము, మొదలైనవి రాగలవని ఆ ప్రజాసమూహము భయ పడి పోయినది. 'థాడా పాను' మాయవలన ఈ యేడు "మేరి ఆ బలి" అగి పోయిన యెడల కంధభూమి యావత్తు పాడువడి పోవుట థాయమనీ, మేరి ఆ సమర్పించుట తప్ప వేరు గత్యంతరము లేదనీ వారు గట్టిగా నమ్మినారు.

రాజపుత్ర యువరాజు మాననింహా అటువంటి అవకాశము కొరకే వేచి యున్నాడు.

విచారములో మునిగియున్న కంధ దళపతులు కొందరు ఒక వృద్ధ ఆమ్ల వృక్షము క్రింద సిందూర లిప్తమైన వీర్జాయీ విగ్రహమునకు ఎదురుగా నున్న పురాతన యూప స్తంభమునకు నలువైపులను మోకాళ్ల మధ్యను తల లాన్చుకొని కింకర్తవ్యవిమూఢులై కూర్చుని ఉన్నారు. ఆ సమయములో యదురాజ్ వచ్చి "మేరి ఆ" ఎక్కడికో మాయమయి పోతే బలభద్రునే తీసి కొని వచ్చి బలి ఇవ్వండి. అతనివలననే ఈ పరిస్థితి సంభవించినది. అతని కోసము మీరందరు నాశనమవుతారా?" అని సలహా ఇచ్చినాడు.

ఆ ఉత్తేజపూరితమైన వాతావరణములో ఆ ఆలోచనా రహితమైన మడియలో యదురాజ్ సలహా వారందరికి నచ్చినది. అంతవరకు భయ

సందేహములకు లోనైయుండిన కందులు ఆ ఆలోచనను కార్యరూపములో పెట్టుటకు క్షణమాత్రమైనను ఆలసించలేదు. వారంతా ఒక్కమ్మడిగా వెళ్ళి కోటలోనుండి రణాను లాగుకొని వచ్చి బలాత్కారముగ ఆయనను యూప స్తంభమునకు కట్టివేసినారు. యదురాజ్ క్రొత్త 'దిగాల్' రూపములో వచ్చి తన ఆశ్రయ దాత అయిన బలభద్ర రణామీద గండ్ర గొడ్డలితో మొదటి వ్రేటును వేసినప్పుడు కాళ్ళనుండి ఛాతీవరకు బంధింప బడిన రణాకు దానిని నిరోధించుట ఏ విధముగను సాధ్యముకాని పని. ఆయన అందుకు ప్రయత్నిం చను కూడ లేదు. దయారహితమైన మృత్యువు చేరువవుతున్నట్లు గ్రహిం చిన ఆయన ముఖము నిజముగ తేజో విహీన మయినది. కాని భయ సందేహ ముల ఆభాసము రేఖామాత్రముగనైన ఆయనలో గోచరించలేదు. సహింప రాని బాధలో గూడ ఆయన ముఖమండలము ప్రశాంతితో భాసించినది. మెల్ల మెల్లగ రక్తహీనమై పోతున్న వెదవులను ఆడిస్తూ ఏదో మంత్రమును గాబోలు ఆయన పఠిస్తున్నాడు. యదురాజ్ గండ్ర గొడ్డలి వ్రేటుతో దక్షిణ బాహువు నుండి తాజామాంసము, వేడి రక్తము ఉబికి వచ్చినది. క్రిందబడిన రక్తము మట్టితో కలిసి నేలను ఎరుపు చేసినది. 'మేరి ఆ' ను ఒక వ్రేటుతో చంపు అచారము కందులలో లేదు. ప్రాణమున్నంత వరకు 'మేరి ఆ' శరీరము కండ కండలుగ కోయుట వారి ఆచారము. ఆ బలి మాంసము అత్యంత పవిత్ర మైనది. దానిని పొలములలో వేసినట్లయిన ఫలసాయము మెండుగా ఉండగల దని, గ్రామ సరిహద్దులలో పాతిపెట్టిన గ్రామములో సుఖశాంతులు నిలిచిఉండ గలవని కందుల విశ్వాసము. అందువలన 'మేరి ఆ' బలభద్రుని శరీరమునుండి మాంసమును కండ కండలుగా కోయుటకు యూప స్తంభమునకు నలువైపులా ఉన్మత్త కంధ ప్రజాసమూహము ఆత్రుతతో వేచియున్నది మేరిఆ శరీరము లోని మాంసమును మూర్తిగా కోసివేసిన తరువాత చివరకు మిగిలిన అస్థిపంజర మును మద్దెలలు మ్రోగిస్తూ, నాట్యము చేస్తూ ఆడంబరముగా తీసికొని వెళ్ళి మట్టిలో పూడ్చివేసెదరు.

మేరి ఆ వాయిద్యములతో బాటు నాట్యము చేస్తూ బలభద్రుని శరీరము నుండి మాంసమును క్షణమాత్రమైన ఆలశ్యము లేకుండ వారు కోసి వేసినారు.

చివరివరకు బలభద్రుని ముఖ మండలము అక్షతముగానే ఉండినది. కంధుల ఆచారము ప్రకారము మేరిఆ బలి ముఖముమీద మాత్రము ఏ విధమైన ఆ ఘాతము పడరాదు. బలభద్రుని ముఖమండలముపైని క్షమాయుతమైన దర హాసము రేఖామాత్రముగ పొటమరించినది.

'దిగాల్' ఆసనము కొరకు ఈ విధమైన కుయుక్తితో యదురాజ్ బల భద్రుని బలి గావించినాడు. తరువాత అక్కడ ఒక దుర్గమును నిర్మించి కంధు లకు రాజయినాడు. కాని తన హితైషి, ఆశ్రయదాత అయిన బలభద్ర రణా యొక్క కబంధముపైన నిర్మించిన ఆ గఢ్‌లో అనేకమైన అశుభములు, అక్రమ ములు కలుగ నారంభించినవి. అందువలన యదురాజ్ బ్రాహ్మణుల సలహాల నను సరించి తన గఢ్‌ను బంకాడ్‌కు మార్చినాడు. తరువాత నీలాద్రి ప్రాసాదమునకు తన స్థానమును మార్చుకొనినాడు.

ఏ స్థలములో పూర్వము వీర్జాయీ స్థానముండినదో, ఏ స్థలములో బల భద్రుడు బలి అయినాడో, ఆ స్థలములోనే మొదటి బాణ్‌పుర్ దుర్గము వీర్జా విలాస్ నిర్మించబడినది. అది నెమ్మదిగా కాలములో కరగిపోయి ఒక భగ్న స్తూపముల మిగిలిపోయినది.

యదురాజ్ వంశము క్షయమయిపోవునని, బలి కాబోయేముందు బల భద్రరణా శపించినాడు. ఆ శాపము ఫలించకుండా తన వంశరక్షణోద్దేశ్యముతో బ్రాహ్మణుల సలహాప్రకారము యదురాజ్ ఒక బ్రాహ్మణ కన్యను వివాహమాడి నాడు. ఆనాటినుండి బాణ్‌పుర్ రాజులు బ్రాహ్మణ కన్యలను వివాహమాడుట అస్ఖలితమైన ఆచారముగ పరిణమించినవి.

ఈ కారణమువలన ఇతర క్షత్రియ రాజులు బాణ్‌పుర్ రాజకన్యలను వధువులుగ స్వీకరించుటకు వెనుకాడ జొచ్చినారు. బాణ్‌పుర్ రాజు జాతికి మాలి అనీ, తన సోదరుని హత్యచేసి సింహాసనారూఢుడైన వాడనీ ఒక వదంతి విన వస్తున్నది. తెలంగ్ ముకుందదేవ్ కాలములో కాలాపహాడ్ ఒరిస్సా మీదకు దాడి చేసినప్పుడు యదురాజ్ తన కంధపాయిక్‌లతో ముకుందదేవ్‌కు సహాయపడి

నాడు, దానివలన ఆయనకు 'మాన్‌సింహ్ హరిచందన్' బిరుదు లభించినది. అంతే కాని ఆయన క్షత్రియుడు కాడు. ఈ కారణమువలననే ఖాణ్‌పుర్ రాజులు తమ ఆడపడుచులను క్షత్రియ వరులకిచ్చి వివాహాలు చేయలేక వారిని చిరకాల కన్యలుగ తమ ఇండ్లలోనే ఉంచుకొనవలసి వచ్చేది.

గోవింద్ మాన్‌సింహ్ హరిచందన్ కుమార్తె లలితా మహాదేయీ కూడ ఆ విధముగా కన్యగానే ఉండిపోవలసి వచ్చేది. కాని ఆమె రూపలావణ్యములను గురించిన ప్రశంసలను ప్రజలనుండి విన్న ఖోర్ధారాజు గోపినాథ్‌దేవ్ తన తమ్ముడైన కేశవ్‌రాయ్‌తో ఆమె కళ్యాణము జరిపించదలచి గోవింద్‌మాన్‌సింహ్ హరిచందన్‌కు ప్రస్తావన పంపినాడు.

బలభద్ర రణా అభిశాపము వల్లనైతేనేమి, స్వాభావిక కారణ మూలముగనైతేనేమి ఖాణ్‌పుర్ రాజులలో ఏ ఒక్కరూ దీర్ఘాయువులు కాలేదు. కాని గోవింద్ మానసింహ్ హరిచందన్ మాత్రము బలభద్ర రణా అభిశాపమును, దైవ కూటములను అధిగమించి ఎనభైయేండ్ల వరకు రాజ్యపాలన చేసినాడు. ఇది ఆయన డెభ్భై ఏండ్ల వయస్సునాటి మచ్చట. ఆయన స్థూల శరీరము వయోభారముతో క్రుంగిపోయినది. కాని ఆయన ముఖమండలము పైన ముడతలు పడలేదు. భుజములపైకి వ్రేలాడుచున్న కుంచిత కేశములు, బుగ్గమీసములు పండి తెల్లబడినవి. అయినప్పటికిని ఆయన విశాల లలాటము, దట్టమైన కనుబొమ్మల క్రింద కనులు దుర్దాంతమైన యౌవన దీప్తితో భాసిస్తున్నవి. ముడతలు లేని నొసటిపైన సిందూరతిలకము అగ్ని శిఖవలె దేదీప్య మానముగ ప్రకాశిస్తున్నది. మెడలోని రుద్రాక్షమాల కేశాచ్ఛన్నమైన విశాల వక్షస్థల మాంస కందరములను రేఖాంకితము చేస్తున్నది.

ఖోర్ధారాజు గోపినాథ్‌దేవుని సోదరుడు కేశవరాయ్‌తో తన కుమార్తె వివాహ ప్రస్తావన విని గోవింద్ మాన్‌సింహ్ క్రోధావేశముతో జ్ఞానశూన్యుడైనాడు. కీర్తి ప్రతిష్ఠలు లేని అజ్ఞాత కేశవరాయ్‌ని తన అల్లునిగా స్వీకరించుట ఆయన అవమానముగా భావించినాడు. ఖోర్ధా కుండి ఈ ప్రస్తావనను తీసికొని

వచ్చిన పురోహితుని హస్తములనుండి నారికేళమును లాగుకొని, నేలపైని విసరి వేసి, "మీరు బ్రాహ్మణులు, అవధ్యులు. లేనియెడల ఈక్షణములో ఇక్కడే మిమ్ములను బలిగావించెడి వాడను" అని గోవింద్ మానసింహ అవమానకరముగ ఆ బ్రాహ్మణుని పంపించి వేసినాడు.

ఈ అవమానమునకు తగిన సమాధానము చెప్పవలెనని కేశవ్‌రాయ్ ఖోర్ధా పాయిక్‌లను వెంట తీసికొని ఖాణ్‌పుర్ ప్రయాణమయినాడు. గోవింద్‌సింహా కూడ ఇందుకు సంసిద్ధమై కుహుడిగఢ్‌లోని చండేశ్వర్ మహాదేవ్ వద్ద సైనిక శిబిరమును నెలకొల్పి ఎదురు చూస్తున్నాడు.

ఆ పరిస్థితిలో ఒకనాటి ఉదయము తన శయ్యపైని కక్షి గ్రుచ్చబడిన ఒక లేఖను గోవింద్ మానసింహ కనుగొన్నాడు. "నిన్ను హత్య చేయవలెనని నేను వచ్చాను. నీవు అచేతనుడుగ అసహాయస్థితిలో నుండుట చూచి నిన్ను వదలి వచ్చాను. నవయౌవన కన్యను ఇంటియందు ఉంచుకొనుట వికసించుచున్న మొగ్గను పొగమంచులో మూడ్చి వేయడము వంటిది. ఈ పాపకర్మనుండి నీవు విముఖుడవు కాగలవని ఆశిస్తున్నాను." అని లేఖలో ఉన్నది. దానిపైని వ్రాసిన వారి చేవ్రాలు లేదు.

ఆ లేఖను స్వయముగా కేశవరాయ్ వ్రాసినాడని గోవింద్‌మాన్‌సింహ గ్రహించినాడు.

యథా సమయములో కేశవరాయ్‌తో లలితా మహాదేయీ వివాహము వైభవముగ జరిగినది. ఒక శుభముహూర్తమున శుభ శంఖారావముతో లలితా మహాదేయీ ఖోర్ధా భీతర్‌గఢ్ ప్రాసాదమునకు బయలుదేరి వెళుతున్నప్పుడు, అనంత యుగ వందిని అయినటువంటి ఒకానొక రాజకన్య ఒక అపరిచిత దాకుమారునితో ఏ గంధర్వదేశమునకో ఎగిరి వెళుతూన్నట్టుగ ఆమె భావించ సాగినది. లలితా మహాదేయి సర్వాంగములు రోమాంచితములైనవి. పుట్టినిల్లు విడిచి వెళ్లుచున్నందు వలన కలిగిన బాధ వలన కాదు, ముందున్న అనంత జీవిత యాత్ర యొక్క ఉత్తేజము వలన ఆమె విశాలనయనములు ఆశ్రుపూరితములైనవి.

గోపీనాథ్ అనంతరము కేశవరాయ్ రామచంద్రదేవ్ నామముతో ఖోర్ధా సింహాసనముపైన అభిషిక్తుడైనాడు.

కాని ఖోర్ధా మహారాణిగ లలితా మహాదేయీకి మోహభంగము పొందుటకు ఎంతో కాలము పట్టలేదు. రామచంద్రదేవ్ కటక్‌లోని బార్వాటీలో యవన స్త్రీ రజియాను చేపట్టి మతచ్యుతులై పతితులైన తరువాత లలితా మహాదేయీ ముండమాలిని రుద్రాణియై తన చేతులనుండి గాజులు మురుగులు మొదలగు ఆభరణములను తీసివేసి, నొసటను, పాపటను ఉన్న కుంకుమను తుడిచివేసి, వైధవ్యమును ప్రకటించుకొని తన పుట్టినింటికి మరలిపోయినది.

ఈర్ష్యకు మారుపేరు స్త్రీ.

యవన స్త్రీ యొక్క దయాదాక్షిణ్యముల మీద మహారాణి లలితా మహాదేయీ జీవించవలసి వస్తుందన్న ఊహ మాత్రము చేతనే ఆమె వజ్రపాతము వలన కలుగు బాధకన్న మిక్కుటమైన బాధను పొందినది, ఏ అవనత కమనీయ నేత్రములలో ఒకప్పుడు రోమాంచకరమైన ఆనందభాష్పములు నిండి ఉండినవో ఆ నేత్రములలోనే ఇప్పుడు ప్రతి హింసాగ్ని ప్రజ్వలించినది. ఆమె యొక్క స్నిగ్ధమైన బంగారు వన్నె శరీరము ఈర్ష్యానలములో తపించి రాగి రంగు దాల్చినది.

తంత్రబలముతో, మంత్రబలముతో రామచంద్రదేవుని స్తంభితునిగా, పిచ్చివానిగా చేయవలెనని లలితా మహాదేయీ వ్రత ధారిణి వలె వీర్జాయీ విగ్రహము ముందు దర్భాసనముపై కూర్చుండి, "రామచంద్రదేవస్య బుద్ధినాశాయ, నాశాయ జిహ్వా కిలయ కిలయ హ్రీం ఫట్ స్వాహా..." అంటూ బగలాముఖీ బీజమంత్రము జపిస్తున్నది.

కాని నేడు రుద్రాక్షమాల త్రిప్పుచూ మంత్రము జపించుచుండిన సమయములో లలితా మహాదేయీ ధ్యాన నేత్రములో ముద్గర ధారిణి బగలాదేవి స్థానములో నానావిధములైన చింతలు ఉద్భానితము కాజొచ్చినవి. వీటికితోడు రామచంద్రదేవుని విషణ్ణ నేత్రద్వయము ఆమెకు గోచరించినవి. పూరీనుండి బాణ్

పుర్‌కు వార్తలు తెచ్చిన చారుడు 'జగన్నాథుడు పతితపావన రూపమును ధరించి మహారాజా రామచంద్రదేవుకు దర్శనమిచ్చినాడు. అందుచేత దేశములో నలుదిశలా రామచంద్రదేవుని జయధ్వానములు మిన్నుముట్టుచున్నవి. రామచంద్రదేవ్ మతాంతరులైన తరువాత, ఏకాదశినాడు రాత్రి శ్రీ మందిరపు శిఖరముమీద మహా ప్రదీపమును వెలిగించు సమయమందు ఆయన పేరును ఉచ్చరించడము చారణులు మానివేసినారు. కేవలము 'హరిబోల్! హరిబోల్!' అని మాత్రమే వారు అనుచుండేవారు. కాని ఇప్పుడు 'మహాప్రభో! ఖోర్ధా మహారాజు రామచంద్రదేవుని నీ శంఖములో ఉంచి, చక్రము వెనుక దాచు. మహాప్రభో!...హరిబోల్!' అని ఇప్పుడు కీర్తిస్తున్నారు" అని విన్నవించినాడు.

ఒరిస్సాలోని సాధారణ జనుల, సామంతుల, దుర్గాధిపతుల సహచరత్వమును రామచంద్రదేవ్ తిరిగి పొంది, పునఃప్రతిష్ఠితులవుతున్నారన్న వార్త లలితా మహాదేయీకి అశుభవార్త కాదు. కాని రామచంద్రదేవ్ ఈ సంవత్సరము రథయాత్ర సమయములో రథములపైని 'ఛేరాపహరా' చేయడమే కాక ఇతర రాజవిధులనన్నింటిని నిర్వహించబోతున్నారని, అందుకు ముక్తిమండప సభా పండితులు, బ్రహ్మచారులు అనుమతించినారని విన్న వార్త మాత్రము ఆమె మనఃక్లేశమునకు కారణ భూతమయినది. రథారూఢుడైన జగన్నాథునికి స్పృశ్యులు, అస్పృశ్యులు అన్న భేదభావము లేదు. పైగా రామచంద్రదేవుని భక్తికి ఆయన ప్రసన్నుడైనాడు. అందుచేత మతాంతరులైనప్పటికీ రాజ సేవాధికారములనుండి ఆయనను ఎవరు ఎలా తొలగించగలరు? స్మార్త పండితులు ఎవరు కూడ ఈ ప్రశ్నలకు సమాధానము చెప్పలేక పోయినారు. అంతే కాదు, రామచంద్రదేవ్ ప్రాయశ్చిత్త రూపములో ఉభయముఖీ-రామచంద్రపుర్ శాసనమును దానము చేసి తిరిగి హిందువులు అయినాగన్న వార్తకూడ వినవస్తున్నది. ఇది కనుక నిజమయిన యెడల భాగీరథీ కుమారునికి ఖోర్ధా సింహాసనము లభించడము కేవలము ఆశా మాత్రముగనే నిలిచిపోతుంది.

లక్ష్మీ వేణు భ్రమరవర్ జీవించి యుండినట్లయిన రామచంద్రదేవుని ఆయన ఏనాడో పదభ్రష్టుని చేసి ఉండేవాడు. తన ఆభరణముల నన్నింటిని తీసివేసి వైధ

వ్యమును ప్రకటించుకొన్ననాడే మహారాణి లలితా మహాదేయీ బక్షీకి మాట యిచ్చినది రామచంద్రదేవుని ఖండిత శిరస్సును చూసిన వెంటనే తాను తన స్వహస్తములతో పూజా పళ్లెరమును తీసికొని భక్షిని పూజించగలనని.

నొసట వ్రాలిన కుంతల రాశిని ఎడమ చేతితో సవరించుకొనుచు విర్జాయీ దేవిని ప్రార్థనా పూరిత నేత్రములతో లలితాదేయీ చూసినది. కాని, కస్తూరికా సిందూర లిప్తమైన దేవి ముఖమండలమువైన ప్రసన్నతా కిరణము ఆమెకు గోచరించలేదు.

ఆమె రుద్రాక్షమాలను ఆసనముపై నుంచి అస్థిర చిత్తముతో బయటకు వచ్చినది.

ఈ యేడు రథయాత్ర సమయములో జరుగవలసిన రాజకార్యములను భాగీరథీకుమార్ చేత చేయించుటకు సముచితమైన ఏర్పాటులను బడా పరీచా గౌరీ రాజగురు ద్వారా లలితా మహాదేయీ చేయించి ఉంచినది. ఖోర్ధా సింహాసనాధికారమును హస్తగతము చేసుకొనుటకు ఇది ప్రథమ సోపానము రామచంద్రదేవ్‌కు ఐదులు భాగీరథీ కుమార్ ఛేరా పహరా చేసినట్లయిన ప్రస్తుతము ఖోర్ధాకు రాజు ఎవరు అను మీమాంస ప్రజల ముందుకు రాగలదు. కాని అంతా తారుమారు అయినది. ఈ పరిస్థితులలో పాయక్‌లను తీసికొని భాగీరథీ కుమార్ పూరీ వెళ్ళుటయే ఉచితమైన పని అన్న దృఢ నిశ్చయమునకు లలితా మహాదేయీ వచ్చినది.

సింహాసన ప్రాప్తికొరకు తీరని వ్యామోహము భాగీరథీ కుమార్‌లో ఉన్నది. అయితే అందుకు తగిన మనోధైర్యము కాని, సాధనా ప్రవృత్తి కాని అతనిలో లేవు. లలితా మహాదేయీ వలెనే అందమైన సన్నని శరీరము కలిగి బలిష్ఠుడైనవాడు భాగీరథీకుమార్. కాని అతని నేత్రములు రామచంద్ర దేవుని కండ్లవలె కోమలముగాను, ఉదాసీనముగాను, విషణ్ణముగాను కనుపించును. అతనిని ఎంత కట్టుదిట్టముగ అదుపు ఆజ్ఞలలో ఉంచవలెనని లలితా మహాదేయి ప్రయత్నించుచున్నదో అతడు అంత వినోదలోలుడు అగుచున్నాడు. సంగీత

నృత్య, మృగయా వినోదముల తోడనే అతడు తన జీవిత కాలమును వెచ్చించు చున్నాడు.

ఆలయము వెలుపల నిర్మానుష్యముగ నున్నది. దిగువున గుల్మలతా కీర్ణమయిన పర్వత పాద ప్రదేశపు వన శీర్షముపైన మహావృక్షముల మంద ఛాయలు వ్యాపించి యున్నవి. ఎండ వేడిమికి పక్షులు నిశ్శబ్దముగ చెట్లపైన కూర్చున్నవి. ఏదో ఒక కొమ్మపైనుండి ఏ కపోత కరుణాలాపమో వినిపించిన, వేరొక కొమ్మపై నుండి మరొక కపోతపు క్లాంత ధ్వని దానికి సమాధానముగ వినివించుట తప్ప మరే ఇతర ధ్వని వినివించుటలేదు. ఆలయములో కామానంద బ్రహ్మచారి అనునాసిక స్వరముతో మంత్రోచ్చారణ చేస్తున్నాడు. ఆ స్వరము ఆ మధ్యాహ్నపు నిర్జన నిస్సంగత్వమును మరింత గంభీర పరుస్తున్నది.

భాగీరథీకుమారుని వెదకికొనుచు లలితా మహాదేయీ జీర్ణ ప్రాంగణమును, మేడల భగ్నస్తూపములను, పశ్చిమ దిశలోని ప్రాసాద అవశేషములను దాటుకొనుచు వెళ్లి, నాగకేసర వనముచేత ఆవరింపబడిన ఒక పుష్కరిణికి సమీపములో నున్న మండపము వద్దకు వెళ్ళినది. పదమటి ఆంతస్తును దాటగనే మధ్యాహ్నకాల నీరవతను భంగముచేస్తూ మృదంగ ధ్వని ఒకటి ఆమెకు వినవచ్చినది.

ఆమె అనుమానము నిజమైనది. మండపములో నిర్లక్ష్యముగ కూర్చుని భాగీరథీకుమార్ మృదంగము వాయిస్తున్నాడు. నర్తకి వేషములో నున్న 'గోటిపుఅ' నర్తకుడొకడు ఎడమకాలిపైని శ్రోణీభారమును నిలిపి, పారాణి రంజితమైన కుడికాలును నృత్యభంగిమలో ముందుకుచాచి నాట్య కరణమును ప్రదర్శిస్తున్నాడు. మరియొక 'గోటిపుఅ' చక్కని వేషములో సమీపముననే నిలబడి "తాధిమి ధిమితా దత్తా ధీతా తోం కిట తక" అంటూ తాళానుగుణ్యముగ కాలి గజ్జెలను ఆడిస్తున్నాడు.

భాగీరథీ కుమార్ తన్మయత్వముతో మృదంగము వాయిస్తున్నాడు.

ఒక పుష్పించిన నాగకేసరపు నీడలో నిలుచుని లలితా మహాదేయి చూచినది. ఆమె కుమారుని లజ్జాహీనమైన నాట్య విలాసమును చూస్తూ ఉండగా ఆ నాగకేసరపు కొమ్మవైన పడగవిప్పి నాగకేసర సౌరభమును తన్మయత్వముతో ఆఘ్రాణిస్తూండిన ఒక నల్లత్రాచు మరియొక కొమ్మవైకి జరజరా ప్రాకుతూ వెళ్ళినది. ఆ చప్పుడుకు లలితా మహాదేయి హఠాత్తుగ తలపైకెత్తి చూచినది. పడగవిప్పి ప్రాకుచుండిన ఆ నల్లత్రాచు ఆమెకు కనిపించినది. భయముతో ఆమె "కుమార్ !...."అని ఒక పెద్దకేక వేసినది. వెంటనే ఆమె పరుగెత్తుకుంటూ వెళ్ళి మండపమును చేరుకొన్నది.

ఆ సమయములో అటువంటిస్థితిలో తనతల్లి తనను చూస్తుందని భాగీరథీ కుమార్ ఊహించనైనా లేదు. తల్లి ముందు భాగీరథీ కుమార్ అపరాధిలాగ తలవంచుకొని నిలుచున్నాడు. అతడు తల్లికి సంజాయిషీ ఇవ్వనవసరము లేదు. తల్లి దానిని ఆశించనూ లేదు. కాని అతని మౌనములో కట్టడి, నియంత్రణ, అనాధికారిక ప్రవేశములకు విరుద్ధముగ ఒక సంకోచరహితమైన అహంకారము ప్రస్ఫుటించినది. తీరుతెన్నులు లేని అతని కేశజాలము తల మీదనుండి ఎడమ కంటిమీదకు పడుతున్నది. ఇటువంటి ఆకస్మిక సంఘటనలు కాని దృశ్యములు కాని వారిద్దరకు క్రొత్తవి కావు.

లలితా మహాదేయీ స్వరములో నేడొక అస్వాభావికమైన, అసాధారణమైన గాంభీర్యము కానవస్తున్నది. ఆమె మాటి మాటికి దీర్ఘముగ నిశ్వసిస్తూ "కుమార్ , నీరక్త నాళములలో ఖోర్ధాపంకపు విషాక్తమైన రక్తము ప్రవహిస్తున్నదని నాకు తెలుసు. ఇది నిజము. కాని దానితోపాటు బ్రాహ్మణి యొక్క సంయమము, సాధన కూడ ఉన్నవి ఇప్పటి నీ ఈ చర్య వాటి పరిచయమునే ఇస్తున్నదా ?" అని లలితా మహాదేయీ ప్రశ్నించినది.

ఇదే ప్రశ్నను శతాధిక పర్యాయములు భాగీరథీ కుమార్ గతములో విన్నాడు. ఆమె అడిగినదే కాని, ఆ ప్రశ్నకు సమాధానము ఆమె ఆశించలేదు. హంస తన శరీరము పైనుండి జల బిందువులను రెక్కలాడించి దులిపి వేసి

కొన్నట్లు భాగీరథీ కుమార్ తల్లి వేసిన చీవాట్లను తుజములను ఆదిస్తూ మౌనము గానే దులివి వేసికొనినాడు.

అంతటితో రసభంగము సమాప్తము కాలేదు.

"ఖోర్ధా రాజు ఈ సంవత్సరము స్వయముగ ఛేరా పహరా చేస్తారట. ఇందుకు పూరిలో ప్రయత్నములు జరుగుతున్నవి. కనుక నీవు వెంటనే బయలు దేరి చంపాగఢ్ వెళ్ళు. అక్కడనుండి పాయక్‌లను తీసికొని అంధారీ గఢ్ మీదుగా చిలికా సరస్సు దారిని పూరీ వెళ్లు. ఖోర్ధాలో ఈ సంగతి ఎవరికిని తెలియకూడదు జాగ్రత్త. పూరీ వెళ్ళిన తరువాత గోవింద బాజ్‌పేయీ గారిని కలుసుకో. వారు ఎలా చెప్పితే అలా నడుచుకో తెలిసినదా? నీవు ఆలాగ చెయ్యకపోయి నట్లయిన ఖోర్ధా రాజ సింహాసన ప్రాప్తి నీకు కలలోని మాట" అని లలితా మహాదేయీ కుమారునికి చెప్పి, ఆ కాలనాగము తనను వెంటాడు తున్నదా అన్నట్టుగా వడి వడిగా అడుగులు వేసుకొంటూ తిరిగి వీర్జాయీ ఆలయమును చేరుకొన్నది. కాని ఆమె సర్వాంగములు అకారణ భయముతో కంపించి పోతున్నవి.

——

ఏడవ అధ్యాయము

I

కటక్ లాల్‌బాగ్‌లోని దీవాన్-ఎ-ఖాస్ సభా భవనములో తకీఖాన్ రహస్య సమాలోచనలు చేస్తున్నాడు. అవి అత్యంత రహస్యమైనవి. ఆత్యంత విశ్వాస పాత్రులైన వ్యక్తులే ఆ సమావేశములో ఉన్నారు. ఆ భవనము వెలుపల, కోట సింహద్వారము వద్ద, నౌబత్ చౌకీ వద్ద కాపలాదార్లు మామూలు కన్నా రెట్టింపు ఉన్నారు. ఈ ఏర్పాట్లను గావించిన సేనా నాయకునికి గూడ ఈ సమాలోచనా విషయములు తెలియవు. దుర్గాధిపతి సలహాను అనుసరించి కట్టుదిట్టమైన ఏర్పాట్లను అతడు గావించినాడు...స్వయముగా వజీర్ ఖాన్‌బహాదుర్ ముస్తఫా అలీఖాన్ ఆ విధముగా హుకుమ్ జారి చేసినాడు. సమాలోచనలలో దుర్గాధిపతి గాని, సేనానాయకుడు గాని పాల్గొనడము లేదు. వారు ఆహ్వానించబడలేదు సరిగదా వారు లోనికి వెళ్ళుటకు కూడ నిషేధించబడినారు. నాయబ్-నాజిమ్ తకీఖాన్‌ను దర్శించడానికి వచ్చిన జమీందారులు, ఇజారాదారులు, వారి అనుగ్రహము పొందుటకు వచ్చిన ఇతరులు, పనిపాటలు లేని సభాసదులు వారి ప్రత్యేకతను ప్రదర్శించుకొనుటకు ఆ పరిసరములలో తచ్చాడు తున్నారు. అప్పుడప్పుడు సభా భవన ద్వారములకు వ్రేలాడుచున్న నీలి తెర వరకు వెళ్ళి అత్తరు వేసికొన్న రుమాళ్ళతో ముఖములను, గోరింట రంగు గెడ్డములను 'ఉష్' అని తుడుచుకొంటూ తిరిగి వస్తున్నారు.

సభా భవనములో తకీఖాన్ బాలీసుమీద తన ఎడమ మోచేతిని ఆన్చి, తన ఐశిష్ఠమైన ఆరచేతి పైన తన తలను ఆనించి గుర్రుపెట్టి కూర్చునే నిద్రపో

తున్నాడు. అతని మగ్గురు వజీరులు, ముస్తాఫా ఆలీఖాన్. ఫౌజ్‌దాక్ దీన్ మహమ్మద్, అత్యంత విశ్వాసపాత్రుడైన జాగీర్దార్ అమీన్‌చంద్, తమ తమ స్థానములలో కూర్చుని ఒకరి ముఖము ఒకరు చూసుకొంటున్నారు. బహుళా వారికి అసలు విషయము తెలియక, దానిని గురించి ఊహాగానము చేస్తూ ఉండి ఉండవచ్చును.

ఏ సంప్రతింపుల కొరకు వారిని రమ్మనమని తకీఖాన్ తాకీదులు పంపించినాడో, ఎందుకొరకు ప్రత్యేక దూతను పంపి మాహోంగా పరగణానుండి జాగీర్దార్ అమీన్‌చంద్‌ను అతడు పిలిపించినాడో వారిలో ఎవరికినీ తెలియదు. తకీఖాన్ ఎప్పుడు మేల్కొంటాడా అని శిలా విగ్రహములవలె కూర్చుని ఎదురు చూస్తున్నారు. తకీఖాన్ కొద్దిగ కదలినప్పుడు, పెద్దపులి పంజావంటి అరచేతితో నిద్రలోనే ముఖము తుడుచుకొన్నప్పుడు, గురక శబ్దము కొంచెము తగ్గినప్పుడు, బొద్దుమీసాలు కదలాడినప్పుడు నెమలికన్నుల పంకాలతో విసురుతున్న సేవకులు కంగారు పడుతున్నారు. మోతుబరులైన సభాసదులు ఆ సమయాలలో నిటారుగా సర్దుకొని కూర్చుంటున్నారు

తాను ఎందుకు హఠాత్తుగా రావలసివచ్చినదో అమీన్‌చంద్‌కు తెలియదు. అనిశ్చితమైన అశుభమును శంకిస్తూ అతడు మనస్సులోనే విష్ణు సహస్రనామము జపించుకొంటున్నాడు.

కొంతసేపటికి అతడు ఉత్కంఠను అణచుకొనలేక అరచేతితో ముఖమును కాస్త కప్పుకొని అస్పష్ట రహస్య స్వరముతో ప్రక్కనున్న వజీరును "ఏమి సామీ, ఈ సేవకుని హఠాత్తుగ ఎందుకు పిలిపించినారో మీరు కాస్త సెలవీయగలరా?" అని అడిగినాడు.

వజీర్ గూడ తన విషయమై అదే ప్రశ్నవేసికొని తర్కించుకొంటున్నాడు. అమీన్‌చంద్‌కు అతడు ఏమి సమాధానము చెప్పగలడు? అయినా అతడు సగము మూసికొన్న కండ్లను తెరచి అమీన్‌చంద్ వంక గంభీరముగ చూసినాడు. నిస్సందేహముగా ఏదో ముఖ్యమైన విషయమై తనను పిల్చినట్లు ఆ చూపుకు అమీన్‌చంద్ వ్యాఖ్యానము చెప్పుకొన్నాడు.

గతములో సుజాఖాన్ కృపాదృష్టిలో పడి తగినన్ని ఐహుమతులను, జాగీర్లను పొంది ఉత్కళదేశములో జాగీర్దార్లుగా నివసిస్తున్న కొద్ది మందిలో అమీన్చంద్ అగ్రగణ్యుడు. అతడు ఉత్తరాది భారతీయుడు. మంచి వస్తాదు. కత్తి సాములో అతనిని ఎదిరించగల వీరుడు మొగల్ సైనికులలో ఎవ్వడూ లేడు. ఈ యోగ్యత వల్లనే అతడు ముర్షిదాబాద్నుండి తకీఖాన్తో వచ్చినాడు. ఆ రోజులలో దుర్దాంతులయిన ఖండాయతులను అణచివేసి వారిని వశము చేసి కొనుటకు గాను, నిష్కరవృత్తి భోగులైన ఖండాయత్ చక్రపాఢీలను తొలగించి వారి స్థానములలో మొగల్ అభిమానులైన జాగీర్దార్లు నియమింపబడుతూ వచ్చినారు. అప్పుడు విరూపాకు దక్షిణ తటమున నున్న సువిశాల మాహాంగా పరగణాకు జాగీర్దారుగా అమీన్చంద్ నియమింప బడినాడు. తకీఖాన్కు అతడు అనేక యుద్ధములలో ఎడమ భుజముగ నిలబడినాడు. అంతేకాక రణ కుశలులైన ఖండాయత్లను వశపరచుకొని వారిని తన అనచరులుగా చేసికొన డములో అతడు ఎక్కువ సఫలీకృతుడైనాడు.

కాని ఇప్పుడు హఠాత్తుగ హుజూర్వారి నుండి ప్రత్యేక దూత ద్వారా హుకుమ్ రావడము వలన అతని మనస్సులో అనేక శంకలు దురాలోచనలు చోటు చేసికొంటున్నవి. అతడు ఒక విధమైన మానసిక అశాంతినే అనుభవిస్తు న్నాడు.

ప్రస్తుతము ఒరిస్సా సూబాలోని రాజకీయ పరిస్థితి సక్రమముగానే ఉన్నది. ఈ మధ్య హాఫిజ్ కాదర్ కూడ అనేకసారులు కటక్లో తకీఖాన్ను కలిసికొని తన స్నేహమును, అభిమానమును రుజువు చేసికొంటూనే ఉన్నాడు. నిరర్థకమైన మతాంధత్వమును వీడి, జగన్నాథుని ధ్వంసము చేయవలెనన్న కోర్కెను గూడ తకీఖాన్ చంపుకొన్నాడు. ఆసేతుహిమాచల పర్యంతము జగన్నాథుడు హిందువులకు మోక్షదాత అయినట్లుగానే వాస్తవమునకు ఒరిస్సా లోని మొగల్ రాజ్య ఖజానాకు ఒక ఆధారభూతమైన పట్టుగొమ్మ కూడ అయి నాడు. సుజాఖాన్ కాలములో జగన్నాథ యాత్రికులనుండి సాలీనా అయిదు లక్షల రూపాయల జిజియా పన్ను వస్తూ ఉండినది. ఆ ఆదాయమును తకీఖాన్

ఏడు లక్షలకు పెంచినాడు ఇది సర్కారువారి లెక్క. ఇది కాక జగన్నాథ మార్గములలో చౌకీలమీద కూర్చుని తమ వాటాలను వసూలు చేసికొనకుండ యాత్రికులను ప్రభుత్వోద్యోగులు వదిలిపెట్టేవారు కారు. గత సంవత్సరము కటక్-ఖోర్ధాల మధ్య యుద్ధము జరగడము వలన యాత్రికుల సంఖ్య తగ్గిపోయినది. దానివలన తగినంత జిజియా రాబడికూడ తగ్గిపోయినది. దానితో మూర్షిదాబాదు నుండి తకీఖాన్‌కు తాకీదులు వచ్చినవి. అందువలన మొగల్ ప్రభుత్వ రాబడికి మూలమైన జగన్నాథుని నష్టపరచకుండా జగన్నాథునిపైన తన విద్వేషమును ఎలా సాధించుకొనవలెనని తకీఖాన్ ఆలోచిస్తున్నాడు.

జగన్నాథ విగ్రహము అమూల్యమైన ఇంద్రనీల మణులతో పొదగబడి యున్నదని యితర నాయబ్-నాజిమ్‌ల వలెనే తకీఖాన్‌కూడ వినియున్నాడు. గతములో గంగనుండి గోదావరి వరకు విస్తరించి యుండిన ఉత్కళ సామ్రాజ్య సంపద అంతా కేవలము జగన్నాథునికే సమర్పింపబడుచుండెడిది. అందువలన షాజహాన్‌బాద్ ఢిల్లీ పాదుషాలకన్నా, మూర్షిదాబాద్ నవాబులకన్నా, నిజామ్-ఉల్-ముల్కకన్నా పూరీ జగన్నాథుడు ధనవంతుడుగా ఎంతో వైభవముతో ఉండెడివాడు.

జగన్నాథుని సంపదను కొల్లగొనుటకే కాలాపహాడ్ కాలమునుండి నేటి వరకు అనేకమైన మొగల్ దాడులు జరిగినవి జహాంగీర్ కాలములో హిందూ ఫౌజ్‌దార్ కేశవదాసు జగన్నాథ ఆలయమును మూసివేసి కొంత బంగారమును, కొన్ని రత్నములను కాజేసినాడు. హాషిమ్‌ఖాన్, మక్రామ్‌ఖాన్, ఇక్రామ్‌ఖాన్ మొదలగు ఫౌజ్‌దార్లు కూడ జగన్నాథుని మీద దాడిచేసి బాగా కొల్లగొనినారు. అయినచు ప్రస్తుతము ఆలయములో మిగిలియున్న ధనముతోనే బంగ్లా, బీహార్, ఒరిస్సా సూబాలను కలిపి ఒక్కసారిగా కొనవచ్చును. మిగిలియున్న ఈ సంపదను కొల్లగొట్టవలెనన్న కోరిక తప్ప తకీఖాన్‌కు వేరు కోరిక లేదు.

ఆలయమునైన దాడిచేసి దేవతా మూర్తులను నాశనముచేసి తన కోరికను నెరవేర్చుకొనడము అసంభవమని తకీఖాన్ గత అనుభవములను బట్టి గ్రహించి

నాడు. అందువలన ఆ విధానమును విడనాడి వంచనతో, మోసముతో కొంత సంపదను సంపాదించగలిగిన అతనికి చాలును. ఈ ఎత్తుగడతోనే రామచంద్రదేవును హఫిజ్‌కాదరుగ తకీఖాన్ మార్చినాడు. ఖోర్ధారాజును తన గుప్పిటలో ఇరికించుకొన్న యెడల జగన్నాథుని సంపదను కాజేయవచ్చును అని తకీఖాన్ భావించినాడు. ఒక దెబ్బతో రెండు పిట్టలను కొట్టవలెనని ఆతని ఆలోచన. రామచంద్రదేవ్ మతాంతరులైన తర్వాత వద్దెనిమిది సంస్థానముల సామంతులు, దుర్గాధిపతులు, జమీందారుల ఆనుగత్యమును వారు పోగొట్టుకొనడమే కాక సామాన్య ప్రజల సదభిప్రాయ సానుభూతులను కూడ కోల్పోగలరనీ, దానివలన ఖోర్ధారాజు తనను ఆశ్రయించి ఉండక తప్పదనీ తకీఖాన్ అనుకొనినాడు. కాని జగన్నాథుడు పతితపావనుడై తకీఖాన్ ఆశలను వమ్ముచేసినాడు.

నిద్రపోయిన తకీఖాన్ ఈ విషయమే ఆలోచిస్తున్నాడో లేక ఆలోచిస్తూనే నిద్రపోయినాడో తెలియదు. కాని తకీఖాన్ అలాగే నిద్రపోతూ ఉన్నాడు. ఇంతలో ఎక్కడినుండో ఒక ఈగ వచ్చి ఎక్కడా స్థలము దొరకనట్లుగ తకీఖాన్ ముక్కుపైన మాటిమాటికి వ్రాలదము ప్రారంభించినది. తకీఖాన్ ముక్కుపైన ఆ ఈగకు మక్కువ ఎందుకు కలిగినదో తెలియదు. వెనుకనుండి పంకా విసురుతున్న సేవకుడు ఆ ఈగను పారదోలుటకు ఎంతగా ప్రయత్నిస్తున్నాడో, తకీఖాన్ తన అరచేతితో ముక్కును ఎంతగా పామకొంటున్నాడో ఆ ఈగ అంతగా ఆ ముక్కునే ఆశ్రయించ ప్రయత్నిస్తున్నది.

ఆ సమయములో అమీన్‌చంద్ విష్ణు సహస్రనామ జపములో మునిగి ఉన్నాడు. ఫౌజ్‌దార్లు కండ్లుకూడ మూతలు పడుచున్నవి. వజీర్ ముస్తఫా అలీఖాన్ మాత్రము ఆ ఈగ చేస్తున్న సాహసము చూసి దరహాసము చేస్తున్నాడు. రేఖాంకితమైన ఆయన గంభీర ముఖమండలము క్షణ కాలము కుతూహలముతో కోమలము, ఉజ్జ్వలము అయినది.

తకీఖాన్ హఠాత్తుగ నిద్రనుండి లేచి "దౌర్భాగ్యులారా! నా ఖడ్గము తీసికొని రండు" అని అరవ నారంభించినాడు. తకీఖాన్ ఖడ్గమును అడిగిన తీరును చూసి అమీన్‌చంద్, వజీర్లు, ఫౌజ్‌దార్లు కంగారు పడినారు. సేవకులు

వేగముగ 'పంకాలను విసర నారంభించినారు. ఆ గది విసురుకు యీగ తకీ ఖాన్ ముక్కును వదలి వజీర్ ఎడమ బుగ్గను ఆశ్రయించినది. అది చూసి తకీఖాన్ పకపక నవ్వ ప్రారంభించినాడు.

ఆ తరువాత తకీఖాన్ బాలీసును ఆనుకొని, ఆవలించి "ఇంషా అల్లా ! ఇంషా అల్లా ! " అని ఉచ్చరించినాడు.

బంగారు రేకుతో చేసిన హుక్కా గొట్టమును సేవకుడు అందిచ్చినాడు. తకీఖాన్ కండ్లు మూసికొని గుడ గుడ హుక్కాను పీల్చ నారంభించినాడు. సుగంధ ద్రవ్య మిశ్రితమైన పొగాకు వాసనతో సభాభవనము ఘుమ ఘుమ లాడినది.

ఉన్నట్టుండి తకీఖాన్ కడ్లుతెరచి 'సివాన్ నవీస్‌ను ప్రవేశపెట్టు" అని కేక వేసినాడు.

వెంటనే ఇద్దరు సేవకులు సివాన్ నవీస్ కొరకు పరుగెత్తినారు.

సివాన్ నవీస్ కరామత్ అలీఖాన్ సభాభవనము వెలుపల కూర్చుని లోపల జరుగున్న మంతనములను గురించి అంచనా వేస్తున్నాడు.

రాజ్యములోని రహస్య సమాచారములను సేకరించి నాయబ్ - నాజిమ్‌కు నివేదించడము సివాన్ - నవీస్ పని. ఢిల్లీ, షాజహాన్‌బాద్, ముర్షిదాబాద్, ఆజిమాబాద్ ఆదిగాగల ప్రదేశములలో సివాన్-నవీస్‌లు నియుక్తులై యున్నారు. సూబా మొత్తములో ఏమి జరిగినను సివాన్ - నవీస్ చెవిని పడక తప్పదు. కాని నేడు అంతటి వానికి సభామందిరములో ఏమి జరుగుచున్నది తెలియక, అంచనా వేయలేక బయట కూర్చుని వ్యాకులము చెందుతున్నాడు. హుజూర్ వారి పిలుపు కొరకు ఎదురు చూస్తూ వేచి ఉన్నాడు.

ఇంతలో పిలుపు రానే వచ్చినది. తన కార్య నిర్వహణలో పండిపోయి, ఛాతీవరకు పెరిగిన గడ్డమును సవరించుకొంటూ, పాయజామాలో మిడత కాళ్ళ వలె కనబడుతున్న తన కాలివిక్కలను మెల్లగ రుద్దుకొంటూ, లంబోదరమును నిమురుకొంటూ సభామందిరములోనికి కరామత్ అలీఖాన్ ప్రవేశించినాడు.

నాయబ్-నాజిమ్ బహాదుర్ వారికి సలాములు చేసిన తరువాత, హుక్కా గొట్టముతో తకీఖాన్ చేసిన సంజ్ఞానుసారము కరామత్ అలీ, తన షేర్వాని అంచును సరిచేసికొంటూ, ఒకదిండు కుర్చీలో ఆసీనుడైనాడు.

తకీఖాన్ హుక్కా గొట్టమును వదలివేసి, ఆసనములో సరిగా సర్దుకొని కూర్చుని "ఊఁ చెప్పు, వార్తలు" అని కరామత్ అలీని ఆజ్ఞాపించినాడు. తరువాత తిరిగి మోచేతిపైన ఆనుకొని అరచేతిలో తలను పెట్టుకొని కళ్ళు మూసికొన్నాడు. క్షణ మాత్రములో గుర్రుపెట్ట నారభించినాడు తకీఖాన్.

అంతమాత్రము చేత కరామత్ అలీఖాన్ నిరుత్సాహ పడలేదు. ఒరిస్సా దేశములోని వార్తా విశేములను చెప్పనారంభించినాడు-నాయబ్-నాజిమే వారైన హుజూర్ వారియొక్క మరియు ముర్షిదాబాద్ సింహాసనా రూఢులు, బీదల పాలిటి వెన్నిధి, దీన రక్షకులు అయిన సుజాఖాన్ వారియొక్క ఉప్పు తింటున్నాను. నాసర్వస్వము తమ అనుగ్రహాధీనమే !..."

తకీఖాన్ గుర్రు రెట్టింపు అయినది. అయినా కరామత్ అలీఖాన్ చెప్పడము ఆపకుండా "ఒరిస్సా సూబాలో మూలమూలలా జరుగుతున్న విషయములు ఈ దాసునికి తెలియనివి లేవు...."

తకీఖాన్ గుర్రు హఠాత్తుగ ఆగిపోయినది. అతడు లేచి సరిగ్గా కూర్చున్నాడు. అతడు కళ్ళు పెద్దవి చేసి అలీవంక చూసినాడు. దానితో కరామత్ కంఠము ఆగిపోయినది.

"మేము అడుగుచున్నది వార్తలు" అని కర్కశ స్వరముతో తకీఖాన్ అనినాడు.

కరామత్ తనని తాను సంభాళించుకొని "పద్దెనిమిది సంస్థానముల సామంతరాజులు తిరిగి ఖోర్ధా వస్తున్నారు. ఈ ఏడు రథ యాత్రలో వారందరూ పాల్గొంటారు. అందుకుగాను నేటినుండి సంరంభము ప్రారంభమయినది. ఖోర్ధారాజావారు ముసల్మాను లైనప్పటినుండి ఛేరాపహరా చేయుటకు వీలులేక పోయినది..."

17

"ఛేరాపహరా" అనేపదమునకు అర్థము తకీఖాన్‌కు తెలియక పోయి నందున అమీన్‌చంద్ దాని అర్థము వివరించ సాగినాడు. "రథయాత్ర సమయ మందు రథము మీదకు జగన్నాథుడు వచ్చుటకు ముందు ఆయన యొక్క రాజ సేవకుడుగా ఖోర్ధా రాజావారు బంగారు చీపురు తీసికొని రథముపైన నాలుగు వైపులను ఊడుస్తారు. ఆ సేవకావృత్తిని 'ఛేరా పహరా' అని అంటారు," అని ఆయన వివరించినాడు.

తకీఖాన్ ఆపహాస పరిహాసముతో తన పృథుల శరీరమును ఇటునటు కదిలించి "అయితే అతడు పాదుషా ఎలా అవుతాడు, అతడు పాకీవాడు అవు తాడు!" అని అన్నాడు.

"అంతే మరి, కాకపోతే మరేమిటి," అని కరామత్ తన గడ్డము సవ రించుకొంటూ అనినాడు.

అమీన్‌చంద్ ఆశ్చర్యముతో "ఇందుకు పండాలు ఎలా సమ్మతించి నారు," సివాన్ ననీన్‌ను ప్రశ్నించినాడు.

"కాఫిరుల మౌలవీ లందరు ముక్తి మండప సభలో కూర్చుని ఇచ్చిన తీర్పు ఇది. ఖోర్ధా పాదుషా హాఫిజ్‌కాదరుమీది అనుగ్రహముతో జగన్నాథుడు పతితపావనుడు అయినాడట, అందువలన హాఫిజ్‌కాదర్ ఈ కార్యమును చేయు టకు వారు అనుమతించినారు. అంతేకాదు. రథయాత్ర రోజులలో జగన్నాథ స్వామిని ఎవరు ముట్టుకొనినను తప్పు లేదుట, కనుక ఖోర్ధా రాజావారిని ఈ పని నుండి ఎందుకు నిషేధిస్తారు," సివాన్ నవీన్ సమాధాన మిచ్చినాడు.

ఏదైన ఒక క్రొత్త ఉపాయము దొరక గలదేమోనని వజీర్ తన గోరంట రంగు గడ్డమును సవరించుకొనినాడు. జగన్నాథుడు పతిత పావనుడైనట్టు ప్రతి నిధుల ద్వారా ఒరిస్సా దేశపు మూలమూలలా వార్త ప్రసారితమైనది. దానితో ఖోర్ధాలోని సామాన్య ప్రజలకు తమ రాజావారి యెడల శ్రద్ధా భక్తులు మరల కలిగినవి. ఈ విషయము వజీర్‌కు ఆంతకుముందుగనే తెలుసును, అయితే జగ న్నాథుడు నిజముగా పతితపావనుడైనాడా లేక దీనిలో ఏదైన మోసమున్నదా

అన్న విషయమును తెలిసికొనవలెనని వజీర్ కోరిక. కాని నివాన్ నవీస్ చెప్పిన విషయములో దానిని గురించి ఏమీ లేదు.

క్షణ మాత్రము దీవాన్-ఏ-ఖాన్‌లోని ఉత్తేజమంతయు స్తంభించిపోయి నట్లయినది. బాలీసులమీద ఆనుకొనియే తకీఖాన్ తన నిర్ణయమును "రథ యాత్ర సమయములో ఏ విధమైన తగవులను పెంచుకొనడము ఉచితమైన పని కాదు. రథయాత్ర ముగిసిన వెంటనే ఆమీన్‌చంద్ పూరికి నాయబ్‌గా నియుక్తు డవుతాడు. జగన్నాథ ఆలయము మీదనుండే సర్వ హక్కులను ఆయన ఖోర్ధా రాజునుండి తీసికొంటాడు. ఆ తరువాత ఆ ఆలయములోని పూజాదికములు, సేవలు అమీన్‌చంద్ హుకుంతోనే జరుగుతవి," అని తెలియ జేసినాడు.

"కాని అక్బర్ పాదుషా కాలమునుండి జగన్నాథ ఆలయమునకు సంబం ధించిన పాదుషావారి సనద్‌లో ఖోర్ధా రాజావారి హక్కు నిర్దిష్టమై యున్నది. అమీన్‌చంద్‌ను ఖోర్ధారాజుగా ప్రజలు అంగీకరించ కుండిన యెడల?" అని వజీర్ తన తల పంకించుచూ అడగనున్న ప్రశ్నను మధ్యలోనే తకీఖాన్ కోపముతో ఆపు చేసి అపస్మార రోగిలవలె వణికిపోతూ" ఖోర్ధారాజు మా హుకుమ్‌ను మన్నించని పక్షములో ఖోర్ధా పైన దాడులు జరుపుతాము. ఖోర్ధా రాజుకు కారా గారమే గతి కాగలదు" అని తన నిర్ణయమును తెలియజేసినాడు.

"తమరి హుకుమ్‌ను కాదనే సాహసము ఖోర్ధా రాజావారికి ఎక్కడ ఉన్నది? కాని ఆలయ పండాలు ఒప్పుకొనని..." అని వజీర్ తన సందేహమును పూర్తిగ వెలిబుచ్చక ముందే తకీఖాన్ బాలీసుల మీద గట్టిగా కోపముతో కొట్టి, "ఆలాగయితే మేము ఆలయమునే మట్టి పాలు గావిస్తాము" అని చెప్పినాడు.

దానితో వజీర్ ముస్తాఫా అలీఖాన్ తన కంఠస్వరమును మార్చి, తకీ ఖాన్‌ను సమర్థిస్తున్నట్లుగ" హుజూర్! అక్కడ ఒక మసీదును నిర్మించినట్ల యిన తమ యశస్సు మరింత శోభిస్తుంది. కాని జిజియా పన్నువలన వస్తున్న ఏడెనిమిది లక్షల రూపాయల రాబడి మరి రాకపోయినట్లయిన హుజూర్ వారికి చాల ఇబ్బంది కలుగవచ్చును," అని అనినాడు.

మదమెక్కిన ముఖమును ముడుచుకొని పెదవులను చప్పరించుచు "జగన్నాథుని వద్దనున్న రత్న వజ్రవైఢూర్యములతో షాజహాన్‌బాద్ వరకు మనము దేశమును కొనివేయ వచ్చును. ఇంక చింత దేనికి?" అని తకీఖాన్ ధీమాతో అనినాడు.

లాల్‌బాగ్ దుర్గములో అంతటితో రహస్య సమాలోచన సభ ముగిసిన తరువాత వజీర్‌ను, సివాన్ నవీస్‌ను లాల్‌బాగ్‌లోనే వదిలిపెట్టి, అమీన్‌చంద్ చింతాకులమైన మనస్సుతో గుర్రమెక్కి రాజవీథిలో వెళ్ళుతునప్పుడు అతని నొసటినుండి శ్వేత బిందువులు నేలజారినవి. జగన్నాథ ఆలయము తన గుప్పిటలోనికి రాగలదన్న సంతోషము ఒక వంక, ఒక విధమైన భయసందేహములు మరొకపంక అతని మనస్సును చికాకు పరచజొచ్చినవి.

చీమల బారువలె ప్రజలు నగర రాజమార్గముమీదుగ పూరీ వెళ్ళుతున్నారు. కాఁజోడీ నదీఘాట్ యొక్క గడిముండ్ ముఖద్వారము మీదుగా వారు తిరిగి జగన్నాథ్ మార్గము మీదికి వచ్చెదరు. కటక్ పట్నము చూచుటకు వారికి ఇది అవకాశము ఆ ప్రజలలో భిన్న భిన్న ప్రాంతములవారు, విభిన్న భాషలవారు, విచిత్ర దుస్తులవారు, రకరకములైన వాహనముల పైని పయనిస్తూ ఉంటే, ఒక సప్త వర్ణముల స్రోతస్సు వీధిలో ప్రవహిస్తునట్లుగ ఉన్నది. నదులన్నీ సముద్రము వైపుకు ప్రవస్తున్నట్లుగ ఈ యాత్రిక ప్రజలందరు పురుషోత్తమ క్షేత్రపు బడ్‌దాండ్ వైపుకే పయనిస్తున్నారు. నీలగిరి మీది సుదర్శన చక్ర మండితమైన శిఖరమును దూరమునుండి దర్శించి, శిరములను వంచి ప్రణామములు చేయవలెనని ప్రతివారి కండ్లు దవ్వికొని యున్నవి. కాని దానికి ఇంకను వ్యవధిఉన్నది. జగన్నాథ మార్గమునైన మట్టిలో పొర్లాడవలెనని ప్రతివారి మనస్సు ఉవ్విళ్ళూరు చున్నది. వారి కంఠములనుండి ఉద్వేలితముగ వచ్చుచుండిన భజన సంకీర్తనలు మొగల్ సైనికుల, హవల్దారుల కఠోర వీక్షణముల ముందు హఠాత్తుగ నీరవమయినవి. కాని కాఁజోడీ నదిని దాటి వెళ్ళిన తరువాత జగన్నాథ మార్గము భజన స్వరములతో తిరిగి ముఖరిత మవుతుంది.

పశ్చిమ యాత్రికుల 'భలే విరాజో జీ' గీతము, గౌడీయ వైష్ణవుల 'జగన్నాథస్వామీ నయన్ పథగామీ భవతుమే' భజన, మృదంగనాదముతో

ఓరియా యాత్రికుల జణాణలు కలిసి మిశ్రిత రూపములో ఒక మహా సంగీత మును సృష్టిస్తున్నవి. ఈ దుస్తర పథములో అరణ్యములు, పర్వతములు, జిజియా పన్ను, బందిపోట్ల దోపిడులు, ఇజారాదార్ల అత్యాచారములు, అలసట, వ్యాధులు, ఆకలి, దప్పిక, మృత్యువు మొదలగు అనేక బాధలను తుచ్ఛముగ భావించి అపరాజేయమైన మానవ ఆత్మయొక్క నిజయయాత్ర నిరాఘాటముగ సాగుచునే ఉంటుంది.

ఇప్పుడు యాత్రికులు కటక్‌మీదుగా పూరీ వెళుతున్నారు. ఆందువలన వారు భయసందేహాలతో మౌనంగా సాగిపోతున్నారు. వారు కార్‌ఖోడీనది వైపుగా వెళుతున్నారు. ఆమీన్‌చంద్‌కూడ గుర్రంమీద వారితో పాటే సంతోషంగా వెళుతున్నాడు.

సభా భవనమునుండి అందరూ నిష్క్రమించిన తరువాత తకీఖాన్ హఠాత్తుగ రజియా బేగమ్‌ను పరదా చాటున చూసినాడు.

రజియా ముఖముమీదనుండి బురఖాను తొలగించినది. తన చంచల మృగ నయనములతో తకీఖాన్‌ను చూసి, "హుజూర్ ప్రభువులు ఖోర్ధా యుద్ధము నుండి సురక్షితముగ తిరిగి వచ్చిన తరువాత గాజీపీర్ సమాధి వద్దకు వెళ్ళి వారి ఆశీస్సులను పొందిరావలెనని నేను మ్రొక్కుకొన్నాను. నిన్న రాత్రి నేను గాజీ పీర్‌ను స్వప్నములో దర్శించినాను. కనుక తమరు వెంటనే నా ప్రయాణమునకు ఏర్పాటులను గావించండి" అని రజియా అన్నది.

ఇతరులపై నిర్భయముగ అత్యాచారములను చేసేవారు కూడ ఏదో ఒక దానికి భయపడుట కద్దు. అది వారి వివేకము కావచ్చును. పీరులు, ఫకీరులు, ఖుదా, భగవాన్ ఆదిగాగల విభిన్న నామములతో ఆ వివేకము అనేక రూపము లను ధరిస్తూ ఉంటుంది. ఈ కారణము వల్లనే కాబోలు పీరులు, ఫకీరులు అన్నచో తకీఖాన్‌కు శ్రద్ధకన్న భయము ఎక్కువ.

తకీఖాన్ తన బొజ్జను చేతితో నిమురుకొంటూ, "తప్పకుండా, నిస్సం దేహముగ" అన్నాడు.

ఈ అభయ వచనములను విన్నంతనే రజియా ప్రపుల్లమైన కాటుక కండ్లు, దరహసితమైన అధరములు బురఖా చాటున దాగొన్నవి. ఆమె పర్దా తొలగించి, జనానా మహల్ వైపుకు సాగిపోయినది.

తకీఖాన్ గుర్రు తిరిగి ప్రారంభమయినది.

——

ఎనిమిదవ అధ్యాయము

1

కురులోవిశే సింహలబ్రహ్మపుర్ గ్రామ'దధివామన్‌జీఉ' ఆలయములో స్నాన పూర్ణిమనుండి 'అణసర్ విధి' ప్రారంభమయినది. స్నాన పూర్ణిమ నుండి ఆషాఢ అమావాస్య వరకు అణసర్ నియమముల ప్రకారము విధులన్నియు నిర్వర్తింపబడుతవి.

ఆ సమయములో సింహల బ్రహ్మపుర్ గ్రామమునకు ఒక వార్త వచ్చినది. ఢిల్లీ నుండి అమురా పాతిషాహ్ శ్రీ జీఉ ఆలయ మున్నచోట మసీదును నిర్మించుటకు గాను లష్కర్ సైన్యమును తీసికొని వస్తున్నాడన్నదే ఆ వార్త. శిఖపాల్‌గఢ్‌కు చెందిన కుఖుకుంటా గ్రామములోని తన వినతల్లి ఇంటికి వెళ్ళి తిరిగి వచ్చిన నాథ్ ముదులీ ఈ వార్తను మోసికొని వచ్చినాడు. కాజోడీ నది దక్షిణ తీరమున నున్న దలేయాబాగ్ గ్రామమునుండి ఈ కుఖుకుంటా గ్రామమునకు అతిథులు వచ్చి ఈ విషయము అక్కడ చెప్పినారు. కటక్‌లో జీలకర్ర పాయ వేగితే దాని వాసన తమ వరకు వస్తుందని వారు అన్నారు. కాని ఆ తరువాత రథీపుర్‌నుండి వచ్చిన దలేయా ఖుంటి ఆ, "అమురా పాతిషాహ్ రావడము లేదు, స్వయముగ నాయబ్-నాజిమ్ తకీఖానే మసీదు కట్టించుటకు వస్తున్నాడు" అని చెప్పినాడు.

ఈ వార్తలు విన్నవెంటనే సింహల బ్రహ్మపుర్ గ్రామవాసులు ఇండ్ల తలుపులను బిగించి ఆడవులలోనికి ప్రయాణ మయినారు. కొద్దిగ ధైర్యసాహసము లున్నవారు, ఢిల్లీనుండి అమురా పాతిషాహ్ వస్తున్నాడో, కటక్‌నుండి

నాయబ్-నాజిమ్ వస్తున్నాడో తెలిసికొనవలెనని ముంగిసలవలె వెదురు డొంకల వెనుక, మొగలి పొదల చాటున దాగొని జాగ్రత్తగా చూస్తూ కూర్చున్నారు.

ఆ నాడు అణసర్ పంచమి,

శ్రీ జీడి మీద నువ్వులు, నూనె. చూతి, కర్పూరము, ఇతర సుగంధ ద్రవ్యములు నైవేద్యముగ సమర్పింప బడతవి.

దురాక్రమణ దారుల రాకను కనిపెట్టుట కొరకు ఒకడు ఊరి వెలుపల ఒక బూరుగు చెట్టునెక్కి ఎదురు చూస్తూ కూర్చుండినాడు. దూరముగ ఒక సమతల ప్రదేశమును దాటుచుండిన ఒక ఆశ్విక దళము అతనికి దూరముగా కనివించినది. అతడు వెనువెంటనే చెట్టును దిగి వచ్చి, పొదల వెనుక దాగుండిన తన మిత్రులకు..."వినండి...వినండి.... అమురాపాతిషాహ్ వచ్చి వేసినాడు" అని తెలియజేసినాడు. ఆ వచ్చినది తకీఖాన్ మాత్రము కాజాలదనీ, ఎందువల్ల ననగా అన్ని గుర్రములు తకీఖాన్ వద్ద లేవనీ, ఆ విషయములన్నీ తనకు బాగుగా తెలుసుననీ నిజముగా తనకు తెలిసినట్టు వర్ణించి చెప్పి అతడు తన ప్రతాపమును దాటుకొన్నాడు.

ఇంతలో ముందు వెనుక ఆశ్విక దళముల కాపలాతో పల్లకీ వచ్చినది. ఆ పల్లకీ 'గంజేయిసా' పీర్ సమాధివైపు వెళుతూ ఉండడము గ్రామస్తులు చూచి నారు. 'అమురా పాతిషాహ్' నిజముగ వచ్చినాడనుటలో వారికి ఏమాత్రము సందేహము కలుగలేదు. ఆ వచ్చినవాడు నాయబ్-నాజిమ్ అయినట్లయిన అతడు గుర్రమ మీదనే వచ్చి ఉండేవాడు. భయ సందేహములతో గ్రామస్తులు పొదల చాటునుండి వచ్చిన వారిని గమనించ సాగినారు.

మఖమల్ పర్దాను తొలగించుకొని పల్లకీలోనుండి బురఖా తగిలించు కొన్న రజియా ఒక ఆకారీర ఛాయవలె దిగివచ్చి గంజేయిసా పీర్ముందు ఆగరు వత్తులు వెలిగించి ఆశీర్వాదము పొందుటకు కూర్చున్నది. చూపరులకు ఇదేమీ అర్థము కానేలేదు. ఆశ్చర్యముతో ఒకరి నొకరు చూసుకొన్నారు.

ఆశీర్వాదము పొందిన రజియా బేగమ్ లేచి వెళ్ళి పల్లకీలో కూర్చున్నది వచ్చిన దారినే పల్లకీ తిరిగి వెళ్ళినది. క్రమేణా ఆ పల్లకీతో గూడ ఆ యాశ్విక దళము క్షితిజములో అదృశ్య మయిపోయినది. గ్రామస్తులు ఒక్క దీర్ఘ నిశ్వాస మును విడిచి 'అమ్మయ్య' అనుకొనినారు. గంజేయిసా సమాధి చుట్టూ వారు గుంపుగా చేరినారు. కాలిన అగరువత్తుల బూడిద సమాధిపైన పడి ఉన్నది. అప్పటికి కూడ ఆ స్థలము సువాసనతో ఘుమఘుమ లాడుతున్నది.

చివరకు ఒక పఠాను ద్వారా అసలు విషయము అంతా వెల్లడయినది. ఝోర్ధా రాజ్యపు మ్లేచ్ఛ మహారాణి రజియా బేగమ్ 'గంజేయిసా పీర్' సమాధి వద్ద తన మ్రొక్కు చెల్లించుకొనుటకు వచ్చినది. ఆమె వ్రజపుటుంగరము స్నానముల గదిలో పోయినదట. గంజేయిసా పీర్ మహిమ వలన అది తిరిగి ఆమెకు లభ్యమయినదట. అందుకనే ఆమె అక్కడకు వచ్చినదట.

ఆక్కడ నిలుచుండిన గ్రామస్తులందరూ 'గంజేయిసాపీర్' పేరుతో జయ జయ ధ్వానములు చేయ ప్రారంభించినారు.

2

రజియా బేగమ్ తిరిగి కటక్ వెళుతున్నది. రథీపుర్ ఇంకను చేరనైనా లేదు. ఇంతలో ఆకాశము కారు మబ్బులతో నిండినది. జడలు విప్పుకొన్న పిచ్చి ఫకీరుల వలె తుఫాను ఆకాశములో నాట్యమాడ ప్రారంభించినది. వివశు రాలైన రజియాబేగమ్ రథీపుర్‌గఢ్‌లో మకాము వేయవలసి వచ్చినది. ఝోర్ధానుండి పూరీ వెళుతూ ఉండిన రామచంద్రదేవ్ కొద్దిసేపటి క్రితమే ఆక్కడ ఆగినారు. వారిరువురి ఆకస్మిక కలయిక, ఊహింపని దగుట వలన అది వారికెంతో మధురమైనది అయినది. తుఫానులో గూళ్ళను పోగుట్టు కొన్న పక్షిజంట వలె రామచంద్రదేవ్ రజియాలు ఆ రాత్రి అక్కడ గడిపినారు.

మోకాళ్లపైని గడ్డమును ఆన్చి గవాక్షములో నుండి మ్లాన చంద్రుని గమనిస్తూ రజియా బేగమ్ మఖమల్ పరుపుపైని కూర్చున్నది. రహస్యమయముగ గోచరిస్తున్న రజియా సువిశాల నేత్రములను తదేకదృష్టితో చూస్తూ రామచంద్రదేవ్ కూర్చుని ఉన్నారు.

రథారూఢుడైన జగన్నాథస్వామిని ఒక పర్యాయము చూడవలెనని రజియా ప్రార్థన సలుపుచున్నది. కాని ఆ అవకాశము తనకు లేదని ఆమెకు తెలుసు. గంజేయిసాహీర్ సమాధివద్ద మ్రొక్కబడి తీర్చుకొని తిన్నగా కటక్ చేరవలెనని తకీఖాన్ ఆమెకు గట్టిగా తాకీదు ఇచ్చియున్నాడు. కనుక తన కోరిక నెరవేరదని ఆమెకు తెలుసును.

రథయాత్ర సమయములో సుదృఢమైన తమ పునఃప్రతిష్ఠాపన ప్రయత్నములో తాము మునిగి యున్నప్పుడు పూరీలో రజియా బేగమ్ ఉండడము విషమ పరిస్థితులకు దారితీయ వచ్చునని రామచంద్ర దేవ్‌కు తెలుసును.

ఆ వినిద్రావస్థలో నుండి రామచంద్రదేవ్‌ను రజియా జాగరూకుని చేసినది. రథయాత్ర అనంతరము జగన్నాథాలయను అమీన్‌చంద్ వశము చేస్తూ తకీఖాన్ హుకుమ్ జారీచేసినాడనీ, అందువలననే మొగల్ సైనికుల సంఖ్యా నానాటికి పెరిగి పోతున్నదనీ, రథయాత్రను చూడవలెనన్న మిషతో అమీన్ చంద్ కూడ సైన్యముతో పూరీ వస్తున్నాడనీ అతను అప్పటికే బయలుదేరి ఉండవచ్చుననీ ఆమె రామచంద్ర దేవ్‌కు తెలియజేసినది.

ఈ దుర్వార్తను విన్న రామచంద్రదేవ్ కొన్ని క్షణముల క్రితమే ఆకాశమును వీడిపోయిన తుఫాను మరియు మబ్బుల మూలముననే యిపుడు తమ స్వప్నాహత మనోకాశము బహుళా అంధకారాచ్ఛన్న మవుతున్నదని ఆలోచించ దొడగినారు.

తెల్లవారు సరికి ఆకాశము నిర్మలమైనది. ఎండకు కాలి, కంకర రాళ్ళతో నిండిన జేగురు రంగుమట్టి రాత్రి కురిసిన వర్షమువలన స్నిగ్ధము

గాను, ఉజ్వలముగాను కనిపిస్తున్నవి. రజియా పల్లకీలో కూర్చుని తనతో వచ్చిన అశ్విక సైనికులతో కలసి తిరిగి కటక్‌కు ప్రయాణమైనది. రామచంద్రదేవ్ కూడ పూరీవైపుకు బయలుదేరినారు. పొగమంచుతో కప్పబడిన ఉదయపు పెండసీడలు క్రమ క్రమముగా వన శీర్షముమీద ఎలా విలీనమౌతవో అలాగు ననే 'గంగఆ' నది మఖపువద్ద రజియా బేగమ్ పల్లకి దృష్టిపథము నుండి మెల్ల మెల్లగ మాయమయినది. చివరి సైనికుని తలపాగకూడ అదృశ్యమయినది.

రామచంద్ర దేవ్ అటునుంచి తమ దృష్టిని మరలించి దీర్ఘముగా నిశ్వసించినారు. తర్వాత కళ్లెమును సడలించి గుర్రమును జగన్నాథ మార్గమువైన పరుగెత్తించుకొంటూ వెళ్ళిపోయినారు.

వర్షార్ద్రమైన ప్రాతస్సమీరపు సంపర్కములో అగరు అత్తరువుల కమనీయ పరిమళము ... ప్రేమమయి, రహస్యమయి అయిన రజియా యొక్క శరీరమును పులకింపజేసే సమ్మోహన కరమైన స్పర్శ-తమ శరీరము లేక మనస్సు దేనిపైన లగ్నమై యున్నదో తెలిసికొనుట రామచంద్ర దేవునికి కష్టసాధ్యమైపోయినది. అయినను ఆ సమయమందు భావప్రణవతకు అవకాశము లేదు. అందుచే కేవలము చింతాక్రాంతులై రానున్న విపత్కర పరిస్థితులను ఎదుర్కొనుటకై యోచిస్తున్నారు రామచంద్రదేవ్.

ఆ యేడు మొగల్ దాడులు లేవు. వైగా జగన్నాథుడు పతితపావనుడైనాడు. అందువలన దూర దూరములనుండి యాత్రికులు తండోప తండములుగ పూరీ చేరుతున్నారు. దండవతీ యాత్రికులు, పాదచారులు, గుర్రములు ఒంటెలు ఎడ్లబండ్లు వల్లకీలు మొదలగు వాహనములపైన వస్తున్న యాత్రికులు- ఆ జన ప్రవాహము పూరీవైపు సాగి పోతున్నది. 'జగన్నాథ స్వామి నయన పథగామి భవతుమే' అన్న భజన గీతము, 'భలే విరాజో జీ జగన్నాథ్‌పురీ మే' అన్న ఛత్తీస్‌గఢీ గీతముతో పాటు "చకాడోలా ఆజి థకా లాగి లాణి" మొదలైన ఒడిస్సీ జణాణలు–అనేక భాషలలో అనేక రాగ రాగిణులలో ప్రతిధ్వనిస్తున్నవి. మహా శూన్యపు ఆకాశ వేదికపైన అసంఖ్యాక

ములైన ప్రాణుల వ్యాకుల ప్రార్థనలు, ఆరతి శిఖవలె ఒక్కసారి పైకిలేచి ఆ మహాశూన్యములో విలీనమౌతున్నవి.

మొగలి పొదల నంటియున్న కాలిబాట మీద కాలినడకను వెళ్ళే యాత్రికులు పయనిస్తున్నారు. పశ్చిమ యాత్రికులు ఎడ్లబండ్ల క్రింద, గుర్రముల కాళ్లక్రింద పడి నలిగి పోకుండుటకు గాను బార్లుతీర్చి నడుస్తున్నారు. నడచి నడచి కొందరి కాళ్లువాచినవి. కొందరి కాళ్లు బొబ్బలెక్కినవి. అయినప్పటికిని వారు వాటిని లక్ష్యపెట్టకుండ ప్రయాణమును సాగిస్తూనే ఉన్నారు. వర్షములో తడిసి మెలికలు తిరిగిన కాగితపు ముక్కల వలె కొందరు అలసట చెంది చెట్లక్రింద పడుకొని నిద్రపోతున్నారు. విషూచికి గురియైన కొందరు రోగులు మంచితీర్థము కొరకు ఆర్తనాదములు చేస్తున్నారు. జ్వరపీడితులు బాధతో మూల్గుతున్నారు. వారితో వచ్చినవారు వారిని వదలి ముందుకు పయనిస్తున్నారు. అపరిచితమైన భూమి, ఉదాసీనులైన మానవులు, ఎందలో వానలో ఆకాశముమీద విహరించే గృధ్రరాజులు.... దుఃఖరహితమైన ఈ పుణ్యభూమి మీద అంతిమ శయ్య నేర్పరుచు కొన్నప్పటికి కూడ ప్రయాణ శ్రమ నిరర్థకము కాదు. కాని పూర్వ పాపకర్మల వలన అదికూడ సంభవించుట లేదు. "తీర్థ యాత్రలోని ఆ పదధూళే చాలును," అని తలపోసి వానకు తడిసిన భూమిని చేతులతో తాకి, మట్టిని నొసట నుంచుకొన్న తర్వాత ఆ మృత శీతల హస్తములు నొసటిమీది నుండి నేలకు నెమ్మదిగ వరిపోతున్నవి. అయినప్పటికి వారి లోనుండి బ్రతికి బయట పడినవారు ఆ జీవితశ్మశాన శవశయ్యవైనుండి లేచి బడలికతో సడలిన శరీరమును భారముగా ఈడ్చుకొంటూ తడబడుతున్న అడుగులతో గమ్యము వైపుకు సాగిపోతూనే ఉన్నారు.

"హే జగన్నాథా! నీకు జయమగు గాక! ఒక కాళరాత్రి నీ దయవలన గడచినది" వేదన, విషాదము, అవసాదము, మృత్యువును జయించగలమను ఆశ, విశ్వాసము-ఇటువంటి విచిత్ర కలయికలతో కూడి శోభాయమానమైన తీర్థయాత్రను అంతకు ముందెన్నడును రామచంద్రదేవ్ చూసియుండలేదు.

కష్టములకు భయపడి వెనుకకు మరలిపోయే వన్యపశువు కాడు మానవుడు. అతని శరీరమును మృత్యువు నాశనము చేయగలదు గాని అతని ఆత్మను అది నాశనము చేయలేదు. మానపుని ఆత్మ అజేయమైనది.

భయ సందేహముల తెర రామచంద్రదేవుని మనస్సునుండి తొలగి పోయినది. అభయ సూర్యుని ప్రకాశముతో ఆయన మనోకాశము నిర్మలమై ఉద్దీప్తమయినది.

కటక్ నుండి అసంఖ్యాకముగ మొగల్ సైనికులు అశ్వములపై పూరీ వైపునకు సాగిపోతున్నారు. వారి చేష్టలను కనిపెట్టుట కొరకు రామచంద్రదేవ్ ఒక చెట్టుచాటున దాగొన్నారు.

ఆ సమయములో బాటసారియైన ఒక యాత్రికురాలు బాగా వెనుకబడి పోయినది. ఆశ్విక దళమును చూసి భయముతో ఆమె ప్రక్కకు తప్పుకొన బోవుచున్న సమయమందు ఒక సైనికుడు గుర్రము పైనుండి ఆమె కొంగును పట్టుకొనినాడు. హఠాత్తుగ కొంగు పట్టుకొనుట వలన ఆమె క్రింద పడబోయినది. కాని ఆమె తమాయించు కొన్నది. ఆ సైనికుని కండ్లలోని పశుత్వమును చూచి ఆమె ఆర్తనాదము చేసినది. ఆ ఆర్తనాదముతో ఆ సైనికుని హృదయము ఆశ్లీల సంతోషముతో నిండినది. అనాచ్ఛాదిత మైన ఆమె వక్షోజముల మీద అతని కళ్ళు లగ్నమైనవి. పులిని చూసిన లేడివలె ఆమె వ్యాకులపడినది. ఆ యువతి కండ్లలో ప్రార్థన గోచరమయినది. ఆ సైనికుని పైకి రామచంద్ర దేవ్ ఉరకబోతున్న సమయములో వెనుకనుండి 'హోషియార్!' అనే హెచ్చరిక మేఘ గర్జనవలె వినవచ్చినది.

ఆశ్విక సైనికులు వెనుదిరిగి చూసినారు. నల్లగుర్రము పైన అమీన్ చంద్ ప్రత్యక్షమైనాడు. సైనికులు అప్రమత్తులైనారు. ఆ సైనికుడు యాత్రికురాలి కొంగును వదిలిపెట్టినాడు. ఆమె పరుగు పరుగున బోయి తనవారిని కలుసుకొన్నది. ఆ ఆశ్వికదళము వెళ్ళునంత వరకు అమీన్‌చంద్ అక్కడ నుండి కదలలేదు.

క్రమ క్రమముగ యాత్రిక బాటసారులు కనుమరుగైనారు. ఆశ్వికులు గూడ త్వరగా ముందుకు దౌడుతీసినారు. అమీన్‌చంద్ చేతిలో కళ్ళెమును సడలించినాడు. అతని కాలి అదరింపుతో అతని గుర్రము ముందుకు కదలినది. ఇంతలో చెట్టు చాటునుండి రామచంద్ర దేవ్ మార్గముపైకి వచ్చినారు. అమీన్‌చంద్ ఆయనను చూడకముందే ఆయన అమీన్‌చంద్ గుర్రపు కళ్ళెమును పట్టుకొని అమీన్‌చంద్‌ను నిలబెట్టినారు.

అనుకొనకుండా హఠాత్తుగ రామచంద్రదేవ్‌ను చూసిన అమీన్‌చంద్ "సలామ్ ఆలేకుమ్!" అని అభివాదము చేసినాడు. గాని అందులో శ్లేష ధ్వనించినది.

ఆయనకు సమాధానముగ "జై జగన్నాథ్!" అని శాంత గంభీర స్వరముతో అన్నారు రామచంద్రదేవ్.

"నవాబ్ సాహబ్! ఎక్కడకు బయలుదేరినారు?" అని అమీన్ చంద్ ప్రశ్నించినాడు.

సుగఠితమైన నల్ల చలువరాతి విగ్రహము వలె, కళ్లెమును బిగించి పట్టుకొని గుర్రము మీద రామచంద్రదేవ్ కూర్చుని ఉన్నారు. వారి ముఖమండలము కఠోరముగ నున్నది. నివురుగప్పిన నిప్పువలె ఆయన నేత్రములు తీక్ష్ణముగ నున్నవి.

"నేను పూరీ వెళుతున్నాను" అనిమాత్రము ఆయన జవాబిచ్చినారు.

"బహుశా రథయాత్రకు వెళుతున్నట్టున్నారు" అన్నాడు అమీన్ చంద్.

"జగన్నాథుని రాజసేవకులుగా భోర్ధా మహారాజులకు రథయాత్ర సమయములో ఒక విశిష్ట భూమిక ఉన్నది. మీరూ హిందువులే గనుక ఆ విషయము మీకు తెలిసే ఉండవచ్చును" అని రామచంద్ర దేవ్ అన్నారు.

"కాని తమరు మతచ్యుతులై పతితులైనారు కదా నవాబ్ సాహబ్?" అని అనినాడు అమీన్‌చంద్.

రామచంద్ర దేవుని ముఖమండల రేఖలు మరింత కఠినమైనవి. "జగన్నాథునికి హిందువులు, ముస్లిములు అనే భేదభావము లేదు. సాల్‌బేగ్‌వంటి ముస్లిములు గూడ జగన్నాథుని భక్తశ్రేష్ఠులై ప్రభుని అనుగ్రహము పొందినారు. జహాంగీర్ పాదుషా కాలములో కేశవదాస్ మారోవంటి హిందువులు కూడ జగన్నాథుని పైన చేయిచేసికొని ఇటు ఇహలోకములోను, అటు పరలోకములోను అభిశప్తులయినారు. దీనినిబట్టి మీరు ఏమి గ్రహించగలుగుతున్నారు? జగన్నాథునికి మతభేద భావము ఏమైనను ఉన్నదంటారా? అయితే ఇంతకూ మీరు ఏ పని మీద ఇటు వచ్చారు అమీన్ చంద్‌జీ?' అని రామచంద్ర దేవ్ అడిగినారు.

అమీన్ చంద్ ఆ ప్రశ్నకు వెంటనే సమాధానము ఇవ్వలేక పోయినాడు. తన బుగ్గమీసములను ఎడమ చేతితో సవరించుకొంటూ అవమానము పొందిన స్వరముతో, "మొగల్ ప్రభుత్వాధీన క్షేత్రములో తిరుగుటకు మొగల్ ప్రభుత్వ కర్మచారులు ఖోర్ధా రాజావారి వద్ద అనుమతి పొందవలెనా ఏమి? నేనుకూడ రథయాత్రను సందర్శించవలెనని పూరీ ప్రయాణమయినాను," అని అమీన్‌చంద్ సమాధాన మిచ్చినాడు.

"అయితే ఈ మొగల్ సైనికులు మీ అంగరక్షకులా?" అని రామచంద్రదేవ్ మరియొక ప్రశ్న వేసినారు.

అమీన్ చంద్ ముందుకు వెళ్ళబోతూ ఆగి "ఔను, మీరు ఊహించినది నిజమే? సరైన సమయమందు మీకు అంతా విశదము కాగలదు" అనిచెప్పి కళ్ళెమును సడలించినాడు.

రామచంద్ర దేవ్ అమీన్ చంద్ గుర్రమును ఆపి "అక్బరు పాదుషా కాలమునుండి జగన్నాథ మార్గములో ఏ విధమైన ఆపదా కలుగదని మొగల్ ప్రభుత్వము హామీ ఇస్తున్నది. ఆ విషయము మీకు తెలియనిది కాదు. బంగ్లా.

బీహార్, ఒరిస్సా సుబాల సూబేదారు, ఉదార మార్గానుయాయి అయిన సుజా ఖాన్ బహాదుర్ దానిని అమలు పరచుట కొరకు మార్గమధ్యమునందు చౌకీలను గూడ ఏర్పాటు చేసినారు. కాని ఇంతకుముందే మీ మొగల్ సైనికుడు ఒక అసహాయురాలైన యాత్రికురాలి యెడల ప్రవర్తించిన అశ్లీల రీతి ఆ వాగ్దానమును ప్రతిబింబింప జేస్తున్నదా? జిజియా పన్ను వసూలు చేసే ఇజారాదారుల అత్యాచారము వలన ప్రజలు జగన్నాథ స్వామిని దర్శించుకొనలేక పోతూ ఉన్నారు. ఇదంతా మీ వంటి ధార్మిక హిందువుల కండ్ల ముందే జరగడము బహు విచారకరమైన విషయము. దానిని మీరు చూస్తూకూడా మీరు కొంటున్నారు. దీనిని మన దౌర్భాగ్యము అనక మరేమి అనగలము?" అని అన్నారు.

ఇందులో అమీన్ చంద్ హిందూత్వము పట్ల ప్రత్యక్షమైన ఆరోపణ ఉండుట వలన రామచంద్ర దేవుని మాటలకు అమీన్ చంద్‌కు కోపమువచ్చి "మీరు తుచ్ఛముగా స్వీయ రక్షణ కొరకు మతాంతరులయి ముసల్మాను లైనారు. మీరు హిందువుల కొరకు వాదపడడము అనవసరము" అని సమాధాన మిచ్చినాడు

ఒక అస్పష్ట వేదనా భరితమైన హాసరేఖ రామచంద్రదేవుని పెదవుల పైన గోచరించినది. "ముసల్మాన్ తీర్థయాత్రికుల పట్లకూడ ఆ విధముగా ఎవరు ప్రవర్తించి యుండినను నేను వారినిగూడ ప్రతిఘటించి ఉండేవాడనే. సంకీర్ణ మతాభిమానములను అధిగమించి సంసార ముక్తులైన మానవుల ఆరాధ్య దైవము శ్రీ జగన్నాథుడు. ఆయన తీర్థయాత్రికులలో ఎవరికి వారే ఒక మహా తీర్థము. ఆయన యెడల జరిగిన ఈ విధమైన దురాగతమును అల్లా కూడ క్షమించడు," అని రామచంద్రదేవ్ అన్నారు.

అమీన్‌చంద్ నేత్రద్వయములో హింసాకరమైన పశుత్వము కనిపించినది. నడుముకు వ్రేలాడుచున్న ఖడ్గముపైని చేయిపెట్టి "అయితే నన్ను సంజాయిషీ అడుగుతున్నారా?" అని అడిగినాడు.

అమీన్‌చంద్‌యొక్క గుర్రపు కళ్ళెమును వదలిపెట్టి, "నేను మీ వంటివారి నుండి దీనికి సంజాయిషీ ఆశించను. ఎప్పుడో ఒకనాడు నాయబ్ - నాజిమ్ తకీఖాన్ న్యాయముగా సంజాయిషీ దీనికి ఇచ్చుకొంటాడు. రాజా అమీన్‌చంద్‌జీ, నేను మీ దృష్టిలో ఎలాగూ మతచ్యుతుడనే, కాని హిందూస్థానములో హిందూ మతానికి హిందువులే విరోధులవు తున్నారు. ఈ సందర్భములో ఈ విషయమును మీకు జ్ఞాపకము చేయవలెనని అనుకొంటున్నాను. అందుచేత ఇక్కడ సంకీర్ణమైన స్వార్థ చింతన, స్వార్థసిద్ధి తప్ప మరే ఇతర మహత్తర జాతీయత సూచన ప్రాయముగనైన గోచరించడము లేదు. మీరూ, నేనూ అంటే హిందువులము, ముస్లిములము ఒకే నావమీద ప్రయాణము చేస్తున్నాము. కనుక మీరు నాకు సంజాయిషీ ఇవ్వవలసిన అవసరము లేదు. మీరు ఏదైనా ఇవ్వగలిగి నట్లయిన దానిని మీ వివేకమునకు ఇవ్వండి. చరిత్రకు అందివ్వండి. ఇక మీరు వెళ్ళవచ్చును" అని రామచంద్రదేవ్ అన్నారు.

నోటివెంట మాట రాక అమీన్‌చంద్ కోపముతో రామచంద్రదేవ్ వైపు చూశాడు. ఆయన ప్రజ్వలిత దృష్టిలో "హాఫిజ్‌కాదర్! నీవు పరిణామములను గుర్తించలేని మూఢుడివి. త్వరలోనే సంజాయిషీ ఇచ్చుకొనడానికి సిద్ధముగా ఉండు" అన్న హెచ్చరిక పరోక్షముగా దాగొని ఉన్నది. తర్వాత గుర్రమును అదలించి అమీన్‌చంద్ ముందుకు సాగినాడు.

ఊదలు వ్యాపించియున్న ఒక మర్రిచెట్టు వద్దకు వెళ్ళి అక్కడ ఆగి అమీన్‌చంద్ వెనుకకు చూచినాడు. రామచంద్రదేవ్ విగ్రహమువలె గుర్రము మీద కనుపించినారు. వెంటనే అమీన్‌చంద్ తన ఒరలోనుండి ఖడ్గమును తీసి ఒక్క వ్రేటుతో అనేక మర్రి ఊడలను నరికివేసినాడు.

రామచంద్రదేవ్ నిలిచియున్న చోటుకు చేరువలో మొగలి పొదలవద్ద శవము ఒకటి పడియున్నది. కొన్ని గ్రద్దలు ఆ శవమును పీకి తింటున్నవి. రామచంద్రదేవ్ గుర్రముపై నుండి దిగివెళ్ళి ఒక్క వ్రేటుతో అనేక గ్రద్దలను తమ ఖడ్గముతో నరికివేసినారు. తలలు తెగిన ఆ గ్రద్దల కబంధములు శవము

పైని నాట్యము చేసినవి. మిగిలిన గ్రద్దలు ఎగిరి పోయినవి గ్రద్దల రక్తముతో చల్లబడిన శవము ఎరుపెక్కినది. ఆ శవమును ఆకలిగొన్న ఒక నక్క చూస్తున్నది. రామచంద్రదేవ్ దాని ప్రాణములను తీయదలచి ఒక అకారణ ఉద్రేకముతో అట్టహాసము చేసినారు. అదివిని భయపడి నక్క పారిపోయినది.

ఒక ప్రమత్తమైన ఉల్కవలె రామచంద్రదేవ్ గుర్రముమీద దౌడు తీస్తూ అమీన్‌చంద్‌ను దాటి పూరీవైపు వెళ్ళినారు.

3

అమీన్‌చంద్‌కు ఇంక రెండు రోజులు మాత్రమే గడువు ఉన్నది. నేడు అణసర్ ద్వాదశి. రేపు నవ యౌవన దర్శనము ఆ తరువాత ఆషాఢశుక్ల విదియ నాడు రథయాత్ర జరుగుతుంది.

పురుషోత్తమ క్షేత్ర నాయబ్ పదవిని చేపట్టుటకు వచ్చిన అమీన్‌చంద్ పూరి వచ్చిననాటినుండి రామచంద్రదేవ్ చేసా పహరావంటి రాజసేవలు చేయకుండా నిరోధించుటకు తగిన ఏర్పాట్లు చేయుటలో నిమగ్నుడై ఉన్నాడు. చేసా పహరా వంటి విధులను నిర్విఘ్నముగా రామచంద్రదేవ్ నిర్వహిస్తే ఆయన పృథివీ పతిత్వము వలన ఒరిస్సా ప్రజల హృదయములలో వారు తిరిగి స్థానమును సంపాదించు కొంటారేమోనని అమీన్‌చంద్‌కు భయ సందేహములు కలిగినవి. దుర్గాధిపతులు, సామంతులు, పాయిక్‌లు, సాధారణ ప్రజలుకూడ రామచంద్రదేవుని పట్ల తిరిగి అనురక్తులై వారికి విశ్వాసపాత్రులైన అనుయాయులు కాగల అవకాశమున్నది. జగన్నాథ రాజసేవ సందర్భములో రామచంద్రదేవునితో పాటు ఉండుటకు పదునెనిమిది సంస్థానాధీశులు వచ్చి ఉన్నారు అనేకమంది జమీందారులు, హరిపుర్, మయూర్‌భంజ్ మొదలగు భంజ్ రాజ దళములు కూడ పారంపర్యముగా వస్తున్న క్రమానుసారము రామచంద్రదేవునితో గూడ

ఛత్ర చామరాదులను ధరించి జగన్నాథుని సేవలు చేయుటకు పూరీలో విడి ఉన్నారు.

నదీ ప్రవాహమును ఆరికట్టుటకు కట్టిన ఇసుక వారధి వలె, ఒరిస్సాలోని ఈ రాజకీయ ఐకమత్యమును చీలదీయుటకు తకీఖాన్ పన్నిన కుయుక్తులన్నియు మెల్లమెల్లగ కరగి పోయినవి. ఇప్పుడు అమీన్‌చంద్ తకీఖాన్ ప్రేరణ వలన పురోషోత్తమ క్షేత్రమునకు నాయబ్‌గా వచ్చినాడు. మతచ్యుతుడైన రామచంద్ర దేవుని ఏ ఉపాయము వలన నైనను పరంపరాగతముగా వస్తున్న ఆ రాజసేవా విధులను నిర్వహించకుండా చేయగలిగి ఆయన స్థానములో ఆ విధులను అమీన్ చంద్ నిర్వహించ గలిగితే ఏ కొద్దిగానైనా ప్రతీకారము జరిగి నాయబ్-నాజిమ్ తకీఖాన్ అభిలాష నెరవేరడమే కాక, కటక్‌నుండి ఢిల్లీ, మూర్షిదాబాద్ వరకు అమీన్‌చంద్ పేరు జయజయ ధ్వానములతో మారుమ్రోగి పోతుంది. ఆ ఆలంబనముతో కటక్ సర్కారులో అమీన్‌చంద్‌కు కాజాలని దేముంటుంది?

కాని హఠాత్తుగ జగన్నాథుడు పతితపావనుడై మ్లేచ్ఛుడైన రామచంద్ర దేవుని మీద ప్రసన్నుడైనాడు. ఆ ఆధారముతోనే ముక్తి మండప శాసనపు బ్రాహ్మణ పండితులు, సమస్త భారతదేశ బ్రహ్మచారులు గూడ ఛేరా పహరా మొదలైన విధులను రామచంద్రదేవ్ నిర్వర్తించవచ్చునని నిర్ణయించినారు. దీని వలన అమీన్‌చంద్ ఆశలు నిరాశలయినవి.

అందుచేత పూరీ వచ్చినప్పటినుండి బడ పరిచా గౌరీ రాజగురుతో మంత్రాంగములు అమీన్‌చంద్ జరుపుతునే ఉన్నాడు. రామచంద్రదేవుని ఆ పదవినుండి తొలగించే విధానమును అతడు ఆలోచిస్తూనే ఉన్నాడు. తనకు చేయు సహాయమునకు ప్రతిఫలముగా గౌరీ రాజగురువుకు చిలికా సరస్సు తీరమునందున్న 'అంధారీ' పరగణా లభించగలదు. కాని ముక్తి మండప పండితుల నిర్ణయమును మార్చడం ఎలా? బడ పరిచా పదవి, హోదాలు గూడ రాజానుగ్రహము మీద ఆధారపడి యున్నవాయె అందువలన అంధారీ పరగణా ప్రలోభము ఉన్నప్పటికిని గౌరీ రాజగురు ముందడుగు వేయలేకుండా ఉన్నాడు. అయినా అతని సహాయముతోను, ఇతర సేవకుల సహాయముతోను ఏదో సాధించవలెనని అమీన్ చంద్ ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

అణసర్ ద్వాదశినాడు దఇతా, పతి మహాపాత్ర, స్వాఈ మహాపాత్ర, తళిఛో మహాపాత్ర, తధాడి పట్టనాయక్, దేఉళ్ కరణ్ మొదలగు ఆలయసేవకులకు రాజావారు స్పృశించిన వస్త్రముల దానము జరుగుతుంది. రథయాత్ర విధులకు అది ప్రారంభ కార్యక్రమము. ఆ సమయములో ఆలయసేవకులు మ్లేచ్ఛ రాజునుండి వస్త్ర దానమును గ్రహించుటకు రాజావారి ముఖము మీదనే తిరస్కరించినట్లయిన ముక్తి మండప పండితుల నిర్ణయములన్నీ నిరర్థకములు కాగలవు. దఇతా మరియు పతి మహాపాత్రలు జగన్నాథునికి ఆది సేవకులు. స్నానపూర్ణిమనుండి రథయాత్ర వరకు జగన్నాథునికి జరుగు విధులన్నింటికిని వారే విధాయకులు. వారిమీద ముక్తి మండప కర్తృత్వము ఏమీ లేదు. సరైన సమయమందు వారు గట్టిగా పట్టుబట్టి నిలబడ గలిగితే ముక్తి మండప నిర్ణయములన్నీ వ్యర్థము కాగలవు. అందుచేత ఇప్పుడు పతి మహాపాత్ర, షేంఢ్ సుఆర్‌లు అమీన్‌చంద్‌కు కుడిభుజము లైనారు. ఇందుకు షేంఢ్ సుఆర్‌కు బయానా కూడ ముట్టినది.

ద్వాదశీ మండప భోగము ఆణసర్ లోపలనున్న మధ్య మండపములో సమర్పించబడినది. దీని తరువాత దక్షిణ ద్వారపు 'లండావర్త్' నుండి వెండి పళ్లెరములో 'పాట్‌డోర్' తీసికొని సేవకులు 'శ్రీనవర్'కు వెళ్ళనున్నారు. శ్రీనవర్‌లో రాజావారు వస్త్రప్రదానము చేయునప్పుడు దానిపై ప్రత్యాఖ్యానము చేయు బాధ్యతను షేంఢ్ సుఆర్ స్వీకరించినాడు. ఇప్పుడు ఆ సమయము ఆసన్నమయినది. అందువలన అమీన్‌చంద్ ఆలయములో ఇటునటు తిరుగాడుచు షేంఢ్ సుఆర్ కొరకు వెతుకుచున్నాడు.

'మాజణా' మండపము వద్ద ఒక వృద్ధ యాత్రికురాలు మరియు ఆమెతో కూడా వచ్చిన కొందరు పూర్వ సువాసినులకు, రెండుసేవక దళములకు మధ్య వాగ్యుద్ధము జరుగుతున్నది. అక్కడ ప్రతి గురువారమునాడు లక్ష్మీ 'రాజణా' జరుగుచుండును. రుక్మిణీ కల్యాణ మహోత్సవము కూడ ఆ మండపములోనే జరుగుచుండును. సహస్ర కుంభాభిషేకమునకు కూడ స్థలము ఆదే. అందుచేత

ఆ స్థలమందు యాత్రికులు ఎక్కువగా ఉంటారు. అక్కడ యాత్రికుల వద్ద నుండి లభించిన దక్షిణల పంపకము జరుగుతుంది. లక్ష్మి 'భాజణా' పైసలు మహాజనులు తీసికొంటారు. పూజా దక్షిణలు పండాలకు చెందుతవి. రుక్మిణీ కల్యాణ సమయమందు లభించు దక్షిణలు మహాజనులు, పండాలు పంచుకొంటారు. సహస్ర కుంభాభిషేకమునకు వచ్చు బహుమతులు పతి మహాపాత్రకు లభించవలెను. ఈ విధులన్నియు ఆవహామాన్ కాలమునుండి సంప్రదాయానుసారముగ జరుగుచున్నవి. కాని ఇక్కడ యాత్రికులనుండి లభిస్తున్న దక్షిణల విషయమై తరుచు ద్వంద్వ యుద్ధము జరుగుతూనే ఉంటుంది. ఇక రథయాత్ర సమయములో అయితే నోరున్న వానిదే రాజ్యము.

ప్రస్తుతము ఆక్కడ కొందరు పరదేశీ యాత్రికులాంధ్రకు పూజా పండా, నియోగ్ బలిఆ పూజా పండాలు 'మాజణా' మండపమును చూపిస్తున్నారు. అక్కడ ప్రొక్కుకొన్న వారికి కోరికలన్నియు సిద్ధించునని వారు తెలియజేస్తున్నారు. లక్ష్మీదేవి భాజణాపద్ద దానమిచ్చిన యెడల దానిని స్వయముగ జగన్నాథుడు స్వీకరించి సంతుష్టి చెందునని...ఇంకా అనేక విషయాలను పండాలు యాత్రికులకు వర్ణించి చెపుతున్నారు. భాజణా మండప మహత్తును తెలిసికొన్న యాత్రికులు ఏ రాగినాణెమునో, ఏ చిల్లిగవ్వనో తమ తమ శక్త్యానుసారము ఇచ్చుట ఆచారము. కాని నేడు పండాలు వేసికొన్న అంచనాకు తక్కువగా ఆ యాత్రికులాంధ్రవద్ద నుండి ముట్టినందువలన తగవు ప్రారంభమయినది. మహాజన్ నియోగ్ తాలూకు దామ్ సుఆర్ ఒక యాత్రికురాలి రెక్క పట్టుకొని భంగు త్రాగిన స్వరముతో 'ఏమిటమ్మా నువ్వు చేస్తున్నది? లక్ష్మీదేవికి లంచమిస్తున్నావా? లేక బిచ్చము పెడుతున్నావా? కనీసము ఒక జహాంగీర్ రూపాయి అయినా ఆక్కడ పెట్టాలి. పెట్టమ్మా, పెట్టు' అని దబాయిస్తున్నాడు.

ఒక అపరిచిత పురుషుని హస్త స్పర్శ తన భుజముమీద తగలడముతో ఆ యాత్రికురాలు అదరిపడి, భయముతో ప్రక్కకు తప్పుకొన్నది. అంతట దామ్ సుఆర్ మొదలగు సేవకులు వెకిలిగ నవ్వి హేళన చేసినారు. అంతేకాదు. కొంత

మంది పండాలు యువతులుగా నున్న యాత్రికురాంద్రనుండి దానము స్వీకరి స్తున్న సమయములో రసికత్వము చూపడము కూడ మొదలు పెట్టినారు.

దామ్ సుఆర్, బలిఆ పూజా పండాల మధ్య సంబంధము సాధారణంగా కటువుగానే ఉంటూ ఉంటుంది. ఆ ఇరువురు ఇనుప విగ్రహములవలె కనిపిస్తారు. ఇద్దరూ వస్తాదులే. బలిఆ పండా తన లంబోదరము క్రింద కట్టుకొన్న అంగ వస్త్రమును గట్టిగ బిగించి దామ్ సుఆర్ బాహువులను పట్టుకొని, "నా యాత్రికు లను పట్టుకొనుటకు నీవు ఎవడవురా మూర్ఖుడా?" అని ఆరచినట్లుగా ప్రశ్నించి నాడు.

ఈ సవాలుతో దామ్ సుఆర్ మాంస కండరములు బిగుసుకొన్నవి. తన బోడితలపై నున్న విలకముడిని ఆడిస్తూ, ఆ యాత్రికురాలి భుజమును మరింత గట్టిగ పట్టుకొని "నువ్వెవడవురా నాకు చెప్పుటకు, ఓరి అప్రాచ్యుడా? ఈమెతో నీకు యిచ్చిపుచ్చుకోవడము ఏమున్నదిరా?" అని అశ్లీలముగ కేకలు వేయ నారంభించినాడు.

వారిరువురి ధన ప్రవృత్తినిచూసి ఆ యాత్రికురాంద్రు భయ సందేహము లతో ఒకరి నొకరు చూసికొనినారు. ఆ బాధాకరమైన దృశ్యమును చూస్తూ కొద్దిదూరములోనే నిలబడి ఉన్నాడు అమీన్‌చంద్. శ్రీ జగన్నాథుని పుణ్యపీఠ మును కలుషితము చేయవలెనన్న తలంపుతో యవన మ్లేచ్ఛుడైన తకీఖాన్ ప్రేరణతో అతను అక్కడికి వచ్చినమాట యదార్థమే. దానిలో అతని స్వార్థము కూడ ఉన్నది. అయినప్పటికిని జగన్నాథ దర్శనాభిలాషులైన ఆ యాత్రికురాంద్ర యెడల జగన్నాథసేవకులే అశ్లీలముగ ప్రవర్తించుటను, తగవు లాడుటను చూచుసరికి అతని మనస్సునందు గూడ కోపము, విరక్తి కలిగినవి.

అప్రయత్నముగ అతడు యాత్రికురాంద్ర వద్దకు వెళ్ళినాడు. వారు మాట్లాడు చుండిన ఖడీబోలీని బట్టి వారు తన రాష్ట్రమునకు చెందిన స్త్రీలని అతడు గ్రహించినాడు. అతడు కోపముతో ఆలయ సేవకులవద్దకు వెళ్ళి "వెళ్ళండి ఇక్కడనుండి" అని గద్దించినాడు. అకస్మాత్తుగ అమీన్‌చంద్‌ను

చూచుసరికి ఆ ఆలయ సేవకులు భయపడి వైదొలగినారు. ఆదే మంచి సమయ మనుకొని ఆ స్త్రీలు గూడ అక్కడ నుండి వెళ్ళిపోయినారు.

తన గుప్పిటలోనుండి తనకు రావలసిన దక్షిణ డబ్బులు జారిపోతుండ డము దామ్ సుఆర్ భరించలేక పోయినాడు. ఆతడు కోపముతో అమీన్‌చంద్ వైపు తిరిగి "ఈ ఆలయము లోపల నీ వెత్తన మేమిటయ్యా? ఇది ఏమైనా పఠాన్ నాయబ్-నాజిమ్ ఎంగిలికూడు నాకే స్థలమును కొన్నావా మామీద కంట్రోల్ జేయుటకు? ఇది కలియుగ బలియార్ భుజుని ఆస్థానము, తెలుసా? మర్యాదగ ఇక్కడనుండి వెళ్లు" అని అన్నాడు.

ఆకస్మికముగ దామ్ సుఆర్ తనమీద ఈ విధముగ విరుచుకొని పడడము చూచి అమీన్‌చంద్ కొంచెము వెనుకకు తగ్గినాడు. దామ్ సుఆర్ ఆకారమును చూసి అతడు భయపడినాడు.

కాని ఇంతలో తన హోదా తనకు గుర్తు వచ్చినది. తను మన్సబ్ హోదాలో ఉన్నాడు. అంతేకాదు, తకీఖాన్ స్వయముగ తనను ఆక్కడకు పంపినాడు. పురుషోత్తమ క్షేత్రము త్వరలో తన ఆధీనములోనికి రానున్నది. అట్టి పరిస్థితులలో తనను ఒక పంజా ఈవిధముగ ఎదిరించి అవమానకరముగ ప్రవర్తించడము అతడు సహించలేక పోయినాడు. వెంటనే అతడు మొలలోని ఖడ్గమును దూసి పండాపై లంఘించుటకు సిద్ధమయినాడు.

కాని ఆమాత్రమునకు సుఆర్ భయపడువాడు కాడు. దీనికి తోడు భంగుమత్తు అతనికి తారస్థాయిలో నున్నదికూడ. వైగా అతడు వ్యాయామ శాలలలో మల్లయుద్ధములుచేసి ఆరితేరిన కండపుష్టి గలవాడు. అతడుకూడ అమీన్‌చంద్‌ను ఎదురించి, "ఓరి పిచ్చినాన్నా! నీకు తేలుమంత్రమయినను తెలియను, అనవసరముగ నల్లత్రాచును రెచ్చగొట్టకు. ఇది ఏమైనా నాయబ్ - నాజిమ్ దర్బారు అనుకొన్నావా నీ ప్రతాపము చూపించుటకు? ఇది బలియార్ భుజుని శ్రీవత్స ఖండళాల ఆలయము. నీవు కయ్యిరజేసి కత్తి దూసినంత

మాత్రమున ఇక్కడ నీకు భయపడువారెవ్వరూ లేరు. నీకు ధైర్యమున్నయెడల వ్యాయామశాలకు రా. మన బలాబలాలు తేల్చుకొందాము" అని సవాలు చేసినాడు.

దామ్ సుఆర్ నడుముకు అంగవస్త్రము బిగించి ఎగిరి గంతులిడుట చూసిన ఇతర పండాలకు, సేవకులకు ధైర్యమువచ్చి "పఠాన్ ఎంగిలి కూడు తినే ఈ మొనగాడు పురుషోత్తమ క్షేత్రమునకు దివాన్ కానున్నాడట; అరే పోరా; వెళ్ళు ఇక్కడనుండి. సింహపు పిల్ల సింహమౌతుంది గాని, గ్రామసింహపు పిల్ల సింహము ఎలాగ అవుతుందిరా" అని గేలి చేసినారు.

ఈ విధముగ వాగ్యుద్ధము జరుగుతున్న సమయములో బంగారపు చేతి బెత్తమును ఆడించుకొంటు బడ పరీఛా గౌరీరాజగురు ఆ గోలకు అక్కడకు వచ్చినాడు. అతడు అమీన్‌చంద్ భుజము పట్టుకొని "రాజాసాహబ్; మీరు ఇక్కడికెందుకు వచ్చినారు; పండాలను మీరు ఈ విధముగ రెచ్చగొట్టిన యెడల మీ లక్ష్యసాధనకు ఆటంకము ఏర్పడ వచ్చును. ఆ విషయము మీరు మరచి పోకండి" అని హెచ్చరించినాడు.

బడ పరీఛానుచూసి తలిఛో మహాపాత్ర వ్యాకులము చెంది "అరే; తమ రిక్కడ ఎందుకు; వెళ్ళండి. అక్కడి ద్వాదశి విధులకు ఆలస్యమవుతుంది. స్వామివారి ఆస్థాన ప్రతీహారులు మీరు. నేడు జరుగవలసిన విధులు పూర్తి అవుతాయో లేదో; శ్రీనవర్‌కు పళ్ళెరము ఎప్పుడు చేరుతుందో;" అని అన్నాడు.

బడ పరీఛాను చూసి మాజఘా మండపమునుండి ఆలయ సేవకులందరూ ఇటూఅటూ తప్పుకొని వెళ్ళిపోయినారు. రథయాత్ర ఉత్సవముల ప్రారంభము నందు ఇటువంటి సంఘటనలు ఆలయ ఆవరణలో జరుగుట ఆశ్చర్యకర విషయ మేమీ కాదు. చాల స్వాభావికమైన సాధారణ విషయము.

అమీన్‌చంద్ సంజాయిషి ఇవ్వదలచినట్లుగా "షేంఢ్ సుఆర్‌ను వెదకి కొంటూ ఇటు వచ్చాను" అని సాధారణ స్వరముతో అన్నాడు.

గౌరీ రాజగురు ఆమీన్‌చంద్ చెవిలో రహస్యముగ "అతడిప్పుడు 'మేరదారోష్'లోగాని 'సర్‌ఘర్'లోగాని నిద్రపోతూ ఉండవచ్చును. మీరు ఈ దారిని వెళ్ళండి" అని చెప్పినాడు.

దక్షిణదిశ ప్రాకారమును అంటియున్న 'మేర్దారోష్' వైపు ఆమీన్‌చంద్ బయలుదేరినాడు. ఆయనను గౌరీ రాజగురు వెనుకకు పిలిచి, "అతనిని వెంటనే ఇక్కడకు పంపండి. పాహాడామీద పళ్ళెమును పెట్టే సమయము కూడ అయినది" అని చెప్పినాడు.

మేర్దారోష్, సర్‌ఘర్ ఇండ్ల శ్రేణులు దక్షిణ ప్రాకారమును అంటి ఉన్నవి. సంవత్సరము పొడుగునా ఈ ఇండ్లు వాడుకలో ఉండవు. వంటశాలలు ఏవైనా మరమ్మత్తులో ఉన్నప్పుడు మాత్రము ఇవి తాత్కాలిక వంటశాలలుగ ఉపయోగించబడుతవి. ఎవరైనా ప్రత్యేక అతిథులుగాని, యాత్రికులుగాని, అధికారులుగాని దైవదర్శనమునకు వచ్చినప్పుడు వారి వసతికి ఇవి ఏర్పాటు చేయబడుతుంటవి. వీటిలోపల చాల చీకటిగ ఉంటుంది. దక్షిణ ప్రాకారమువైన సిందూరలిప్తమైన మహావీర విగ్రహము ఒకటి ఉన్నది. మహావీరుని పూజకు నియమిత పూజావిధి అంటూ ఏమీలేదు. సుఆర్‌లకు మహావీరునివైన ప్రత్యేకభక్తి కలిగినవాడు షేండ్ సుఆర్ నీళ్ళు తోడితెచ్చి స్నానాదికములు చేయించి పూజ చేస్తూ ఉంటాడు. లేనివాడు ప్రతిదినము తన భంగు తయారుచేయు కార్యక్రమము ముగిసిన తరువాత ఉన్నదేదియో మహావీరునికి నైవేద్యముగ సమర్పించి సంతుష్టుడవుతాడు. ఆ స్వామివారి ఆస్థాన రక్షకుడు అతడు. అందువలన అతడు పరీక్షకు ఏదో కాస్త ముట్టచెప్పి షేండ్ సుఆర్ ఆ ఇండ్లను తన ఆధీనమందుంచుకొనినాడు.

షేండ్ సుఆర్ ఆ 'మేర్దారోష్' ఇంటిలోని ఒక మధ్యగదిలో కొబ్బరి చాపపైన ఒదలు తెలియకుండా నిద్రిస్తున్నాడు. అతని తలకు నాగకేసర పుష్పమాల ఉన్నది. గదిలో ఒక మూలను భంగునూరే కల్వము మాత్రము ఉన్నది. వేరొకమూల అన్నము వండిన 'ఉడిఆ' ఖాళీగాపడి యున్నది. దాని

మీద వాలిన ఈగలు అడపాతదపావచ్చి సుఆర్ బుగ్గలపైన వ్రాలుతున్నవి. అతని నోటిలోనుండి చొంగకారి బుగ్గలపైన నిలిచి ఉన్నది. భంగుమత్తువలన అతడు ఈ లోకములోనే లేడు.

పరీచా గద్దింపులతో లండాపర్త్ వద్ద పాహాడాలు పరచే పని ప్రారంభమయినది. ఘంటలు మ్రోగుతున్నవి. ఆ ఘంటారావము వలన షేండ్ సుఆర్ కండ్లు కొద్దిగా తెరచుకొని మత్తువలన తిరిగి మూసుకొంటున్నవి. ఆనాడు అతడు నెరవేర్చవలసిన కార్యములు ఏమీ లేవు ఆయన కేవలము అమీన్‌చంద్ పని కొరకే ఉన్నాడు. ద్వాదశిలో పళ్ళెమును పంపు కార్యక్రమము ఎప్పుడు ప్రారంభమవుతుందా అని ఎదురుచూస్తూ కూర్చుని కూర్చుని ఉండుటవలన అతని కండ్లు వాటంతట అవే మూతలు పడినవి.

గంటల మ్రోతవలన షేండ్ సుఆర్‌కు నిద్రాభంగమయినది. కాని అతడు భంగు మత్తునుండి తేరుకొనలేదు. ఆ సమయమందు ఆకాశము మబ్బుగా నున్నందువలన వేళ ఎంత అయినదో అతనికి తెలియలేదు. సింధూర లిప్తమైన మహావీరుని విగ్రహమును చూచి తను ఇంకా ఇహలోకములో ఉన్నట్టు బహుశా అతడు గ్రహించి ఉండవచ్చును. ఆనాటి ఉదయము అతడు పట్టువలతో కొన్ని ఉమ్మెత్త గింజలను, గంజాయి మొగ్గలను పేసి భంగు నూరి సేవించినాడు. ఒకటి రెండు చుక్కల పాము గరళము కూడ భంగులో కలివి నాడు. అందువల్ల భంగు శక్తి ఇనుమడించినది. దానికి తోడు మోతాదు కూడ ఎక్కువే అయినది.

అతనికి నిద్రాభంగమయితే అయినది కాని భంగుమత్తు ఇంకను వదలలేదు మెల్లగాలేచి రాతి బండపైన కూర్చొన వలెనని అతడు ప్రయత్నిస్తున్నాడు. కాని తల బరువుగా ఉండడము వలన అతనికి కూర్చొనుట సాధ్యమవడములేదు. అతి కష్టముమీద రెండు మూడు సారులు ఆవలించి చిటికలు వేసిన తరువాత శరీరము కొద్దిగ తేలికపడినట్టయినది ఆతనికి. అ

సమయమునకు అమీన్‌చంద్ వసారాలోనికి వచ్చి చీకటిగా నున్న గదిలోనికి తొంగిచూసి, "షేంఢ్ సుఆర్ ! షేంఢ్ సుఆర్ !" అని విరక్తితో పిలచినాడు.

"మధుర సంబంధికుడు ఎవడో వచ్చినట్టున్నాడు. బేఇపో, పేరుపెట్టి పిలుస్తున్నాడు. అరే షేంఢ్ సుఆర్ కలియుగ బలిఆర్ డబ్బుతప్ప ఇతరులది తినడము లేదు. అధికారులయితే మాత్రము నా తలకాయను కొన్నారా ?" అని షేంఢ్ సుఆర్ పడుకొన్న చాపమీద నుండే అరచినాడు.

అమీన్‌చంద్‌కు షేంఢ్ సుఆర్ మాటలు అర్థము కాలేదు, అతని కంఠ ధ్వనిని గుర్తించి లోనికి వచ్చినాడు. "నీ వెక్కడ గుర్రుపెడుతూ నిద్రపోతే ఎలాగ ? అక్కడ అణసర్ పీఠము నుండి రాజప్రసాద పక్షెము శ్రీ నవర్‌కు చేరబోతున్నది. ఇంకెప్పుడు మనపని అవుతుంది ?" అని అమీన్ చంఢ్ అనినాడు.

ఆ మాటకు షేంఢ్ సుఆర్ మత్తువదలి లేచి నిల్చున్నాడు. అమీన్ చంద్‌ను లోపలకు ఆహ్వానిస్తూ "అది ఉత్తమాట. ఎవరు ఎక్కడకు వెళతారు మణిమా ? 'చఉవాహా'కు కాళ్ళూ చేతులూ లేవుకదా ? అతడు ఎక్కడకు వెళ్ళగలడు ? మీరు ఎక్కడకు వెళతారు ? నేను ఎక్కడకు వెళతాను ? మనమంతా మన మన స్థానములలో నిలుచుని కాళ్ళు కదలిస్తున్నాము. ధైర్యముతో మనము మన పనులను సాధించుకొనాలి, మణిమా ! నేను వెళ్తున్నాను. అన్నిటిని సరి చేస్తానుకదా ?" అన్నాడు. ఆ తరువాత అతడు తన అంగవస్త్రము ను నడుముకు బిగించి తన లంబోదరమును ఊపుకొనుచు దక్షిణద్వారపు 'లండావర్త్' వైపునకు నడవనారంభించినాడు ; కాని హఠాత్తుగ వెనుకకు తిరిగివచ్చి అమీన్ చంద్‌ముందు నిలిచి, చేతులుచాపి "నేడు అణసర్ ద్వాదశి. ప్రొద్దుటినుండి ఒక్క రాగివైస అయినా చేతిలో పడలేదు. కనీసము ఒక చిల్లిగవ్వకూడ నా కంటితో చూడలేదు. మణిమా ! ఒక్క 'అషర్ఫీ' మంజూరు చేయండి" అని ప్రార్థించినాడు.

ఒక్క అషర్ఫీతో తన పని నెరవేరదని ఆమీన్‌చంద్‌కు తెలుసు. కొద్దిగా నైనా అతనికి ముట్టచెప్పక పోయినయెడల అతడు అడుగు ముందుకు వేయడు. అనవసరముగా కాలము వృథాచేయడము వలన లాభములేదు. ఇంతలో శ్రీ నవర్‌కు పళ్లెములు చేరుకొనవచ్చును.

నాయబ్ నాజిమ్ దర్బారులో గూడ ఈ విధముగనే జరుగుతున్నది. ఏదో రాచకార్యము పైన వచ్చిన ఏ జమీందారునో ఇజారాదారునో దర్బారు లోనికి ప్రవేశవెడుతూ మధ్యలో తమకు ముట్టవలసిన దానిని సేవకులు యాచించుకొంటూనే ఉంటారు. ఈ విషయమును తెలిసిన ఆమీన్‌చంద్ మనసులో కోపముతో మథనపడుతూనే ఆలస్యము చేయకుండా జేబులోనుండి ఒక అషర్ఫీని తీసి షేంఫ్ సుఆర్ చేతిలో పెట్టినాడు. షేంఫ్ సుఆర్ ఆ బంగారు నాణెమును ఒకసారి చూసి, సంతోషించి, దానిని తన బొడ్డులో భద్ర ముగ దోపుకొనినాడు. ఆ తరువాత గున్న ఏనుగువలె లండావర్ట్ వైపుకు పరుగెత్తినాడు.

ఆప్పటికి లండావర్ట్ వద్ద పాహాచాలు పరచబడినవి. దయితాలు పతులు అందరు అణసర్ పీఠము మీదకు పళ్లెములు తీసికొని వెళ్లుటకు సిద్ధముగ నున్నారు. ఘంటానాదకులు విల్లువలె వంగుచూ, లేస్తూ గంటలను మ్రోగిస్తు న్నారు. తూర్యనాదములు ప్రారంభమయినవి. చూడతగిన విశేషము అక్కడ ఏమియు లేకపోయినను లండావర్ట్ చుట్టూ యాత్రికులు మాత్రము గుమిగూడి ఉన్నారు.

ఇంతకుముందు ఇచ్చిన అషర్ఫీని కాక మరొక అషర్ఫీని ఆమీన్‌చంద్ షేంఫ్ సుఆర్‌కు ఇవ్వవలసి వచ్చినది. ఇచ్చిన లంచమునకు ప్రతిఫలముగ తాను అనుకొన్న పని సవ్యముగ జరుగుతున్నదో లేదో తెలిసికొనుటకు గాను అతడు షేంఫ్ సుఆర్ వెనుక వెనుకనే వచ్చి జన సమూహములో కలసి పోయినాడు.

భండార్ ఘర్ (సామ్రగి గది) నుంటి చాంగడా మేకాప్ మూడు వెండి పళ్లెములను గొనివచ్చి వాటిని పాహాడాలపైని అలంకరించి పెట్టినాడు. ఆ పళ్ళెముల పైని మడతలు మడతలుగ పట్టు వస్త్రములను దయితాలు అమరుస్తున్నారు. ఆ సమయములో దోఉకరణ్ దయితారీ పట్టనాయక్ వచ్చి "అరే! ఇక్కడ మూడు పళ్ళెములే ఉంచినారేమిటి? నాలుగు పళ్లెములు పెట్టరాదెనని కదా మణిమా ఆదేశము?" అని రుష్ట స్వరముతో అడిగినాడు.

దోఉకరణ్ మాటలను వ్యతిరేకిస్తున్నట్లుగా "ప్రతి ఏడూ మూడు పళ్ళెములనే పెడుతున్నాము. మహారాజావారికి ఒకటి, మహారాణీ వారి దొకటి, జేనామణిది ఒకటి. క్రిందటి సంవత్సరము బక్షీ వేణు భ్రమరవర్ది ఒక్కటే పెట్టినాము. ఇప్పుడు ఏ శాస్త్రపద్ధతిని నాలుగు పళ్లెములను పెట్టగలెనో చెప్ప" అని చాంగడా మేకాప్ అడిగినాడు.

దోఉకరణ్ ఇటువంటి చిల్లర ప్రశ్నలకు సమాధానము చెప్పే స్థితిలో లేడు. అందుచేత "అల్లము అమ్మకొనేవాడు ఓడను బేరముచేసిన లాభము ఏమున్నది? మేము చెప్పినది నీవు చేయి. వెళ్ళి భండార్ ఘర్‌లోనుండి మరొక పళ్ళెము తీసికొనిరా" అని అతడు ఆదేశించినాడు.

చాంగడా మేకాప్ మరొక పళ్ళెము కొరకు వెళ్ళినాడు. ఆ సమయమునకు రొప్పకొనుచు షేంధ్ ఆసుర్ అక్కడకు వచ్చి చేరినాడు. వచ్చిన వెంటనే "ఇప్పుడు పెట్టబోవు పళ్ళెము మ్లేచ్ఛరాణి రజియా కోసమా? ప్రతి సంవత్సరము పెడుతున్నట్టుగ మూడు పళ్ళెములనే పెట్టండి. నాలుగు అనవసరము" అని కర్కశముగ అనినాడు.

షేంధ్ ఆసుర్ మాట్లాడిన తీరుకు అక్కడ ఉండిన సేవకులందరు ఘక్కున నవ్వినారు. ఆ నవ్వును తన అభిప్రాయమునకు సమర్థనగ భావించి, "ఇంత ధిక్కారమా? మహారాజావారు మతాంతరులై మ్లేచ్ఛులైనారు. ఇప్పుడు మీరా యవనురాలి కోసము పళ్లెమును ఏర్పరుస్తున్నారా? మ్లేచ్ఛుడు స్పృశించ

నున్న వస్త్రమును స్వీకరించి మీరు రథయాత్రను ప్రారంభించనున్నారా? మీకు సిగ్గులేదా? ఎంత ధిక్కారము!" అని అతడు అరవనారంభించినాడు.

పరిస్థితి ఈ విధముగ మారగలదని ఎవరూ ఊహించనైనా ఊహించ లేదు. అందువలన సేవకు లందరు ఏమి చేయవలెనో తెలియక ఒకరి ముఖము ఒకరు చూసుకొన్నారు. యాత్రిక సమూహములో ఆమీన్ చంద్ ముఖము షేంఢ్ సుఆర్ కు కనుపించడముతో, "ఈ యేడు శ్రీనవర్‌కు పల్లెములు వెళ్ళ నవసరము లేదు. రాజావారు అన్యమతము స్వీకరించి హిందూ మతమును విడిచి పెట్టినారు. కనుక ఆయన ఛేూపహరా చేయడానికి గాని రథము మీదకు ఎక్కడానికి గాని వీలులేదు." అని గట్టిగా అనినాడు.

"అయితే, రాజవిధుల నన్నిటిని ఎవరు ఇప్పుడు నిర్వర్తిస్తారు?" అని ధోఉకరణ్ ప్రశ్నించినాడు.

"శ్రీ క్షేత్రమునకు నాయబ్‌గా వచ్చిన రాజా ఆమీన్‌చంద్ ఈ విధు లను నిర్వహించవలసి ఉంటుంది. గత సంవత్సరము ఈ పనులను బక్షీ వేణు భ్రమరవర్ నిర్వహించారు. ఈ యేడు రాజా ఆమీన్‌చంద్ నిర్వహిస్తారు" అని షేంఢ్ సుఆర్ సమాధాన మిచ్చినాడు.

అమీన్‌చంద్ పేరు వినగనే అతని చేత కొద్ది సేపటికి పూర్వమే అవ మానింపబడిన పండాలు పాములవలె బుసకొట్టుచు "జగన్నాథుడు స్వయముగ పతితపావనుడై రాజావారిని అనుగ్రహించినాడు. ముక్తి మండప పండితుల నిర్ణ యము ప్రకారము ఇక్కడ అంతా జరుగవలసినదే. పఠాన్‌ల ఎంగిలి కూడు తినే ఆమీన్‌చంద్ రాజవిధులను నిర్వహిస్తాడని ఈయన చెప్పవచ్చినాడు!" అని హేళనతో ధిక్కరించినారు.

ఈ తగవులాట జరుగుతూ ఉండగా చాంగడా మేకాప్ మరొక పళ్లెమును తెచ్చి పెట్టినాడు. పరిస్థితిని కనిపెట్టుచున్న సాన్‌పరీఛా విష్ణు మహాపాత్ర ఆదుర్దా చెంది పళ్లెములను అణసర్ పీఠముపైకి కొని రావలసినదిగా తొందర చేసినాడు. షేంఢ్ సుఆర్, పండాల మధ్యను జరుగుచున్న వాగ్యుద్ధము ఎవరికిని వినిపించ

నంత గట్టిగ ఘంటారావము, తూర్యనాదము మ్రోగసాగినవి. ఆ కోలాహలము లోనే దయితాలు పళ్ళెములను ఆణసర్ పీఠముపైకి తీసికొని వెళ్ళి వెనువెంటనే లండావర్‌కు తీసికొని వస్తున్నారు.

"పళ్ళెములను త్వరత్వరగా తీసికొని రండి. ఇప్పటికే చాల ఆలస్యమయినది. నెరవేర్చ వలసిన విధులు ఇంకను ఎన్నో ఉన్నవి"అని తలిఛో మహాపాత్ర ప్రధానిని విలిచి చెప్పినాడు దయితాలు పళ్ళెములను భుజముల మీద పెట్టుకొన్నంతనే ఘంటా తూర్యనాదములతో ఆలయ ప్రాంగణమంతయు మార్మ్రోగినది. "హే బలియార్ భుజ ప్రభో! ఖోర్ధా రాజావారిని చక్రము చాటున శంఖములోను ఉంచి వారిని సర్వదా రక్షింపు, మహాప్రభో!" అనిఘంటి ఆలందరు ఉచ్చై స్వరముతో ప్రార్థించ సాగినారు.

అక్కడ గుమిగూడిన యాత్రికులందరు 'హరిబోల్, హరిబోల్" అంటూ తన్మయులై హర్షధ్వానములు చేయసాగినారు. 'హరిబోల్' నినాద నాదము, యాత్రికుల హర్షధ్వానములు, ఘంటా తూర్యనాదములు వీటి కలయిక వలన నాదముతో ఆలయ ప్రాంగణమంతయు ప్రతిధ్వనించినది ఏర్పడిన ఒక అద్భుత స్వాయీమహాపాత్ర, దేహికరణ్, దేఉల్‌కరణ్, తలిఛో మహాపాత్ర మొదలగు స్వామి సేవకులందరు పళ్ళెములను పట్టుకొని శోభాయమానమైన యాత్రగా శ్రీనవర్‌కు ప్రయాణమయినారు.

ఆసన్నమగుచున్న సంధ్యాసమయపు మసక చీకటిలో శ్రీనవర్ రాజ ప్రాసాదము వైపుకు సాగి వెళ్ళుచుండిన కర్తవ్యనిష్ఠమైన కోలాహల సమూహము వెనక స్థాణు ప్రతిమలవలె, నోట మాట రాక, నిరాశులై, చేతనారహితులై ఇద్దరు వ్యక్తులు నిలచుని ఉండిపోయినారు. ఒకరు బడ పరీచా గౌరీ రాజగురు, రెండవవారు అమీన్‌చంద్. షేండ్ సుఆర్ మాత్రము అత్యంత అనాసక్తుని వలె తన వాటాను పొందుటకు ఆ శోభనయాత్ర వెనువెంటనే నడిచి వెళ్ళినాడు.

4

నాడు ఆషాఢ శుక్ల విదియ.

శ్రీ జగన్నాథుని రథయాత్ర వలన నీలాచలము చాల కోలాహలముగ నున్నది. బల్‌గండి నుండి సింహద్వారము వరకు రథ్ దాండ్ అంతా జనముతో క్రిక్కిరిసి ఉన్నది. యాత్రికులందరు వీలయిన మంచి స్థానములలో నిలుచుని ఎంతో ఆసక్తితో విగ్రహముల 'పహండీ' కొరకు ఎదురుచూస్తున్నారు. హిమాచలము నుండి కన్యాకుమారి వరకు, కుమారి పీఠమునుండి ద్వారక వరకు, భారత దేశపు నలుచెరగులనుండి వచ్చిన యాత్రికుల అనేక విచిత్ర వేష భూషణములు, అనేక భాషల కోలాహలము, విభిన్నవర్ణ విన్యాసములు, వీటి సుందర వైభవము బల్‌గండినుండి సింహ ద్వారము వరకు వ్యాపించినది. వారిలో రసిక యాత్రికులు రసికత్వమును వెతుకుకొనుచు మలధర సుందర గామినుల వెనుక సీతాకోక చిలుకలవలె ఎగిరి ఎగిరి వెళుతున్నారు. తమ తోడి యాత్రికు రాంద్ర కన్న వెనుక బడిన కురంగ నేత్రలైన నవయౌవనాంగినులు తమ ఉన్ముక్త కాహుమూలములనుండి ఈషణ్మాత్రముగ గోచరమగుచున్న హరిద్రలిప్త స్తనాంశములవైన అపరిచిత కరస్పర్శ కలిగినంతనే ఒక అవ్యక్త రోమాంచమునకు లోనవు చున్నారు. వారి నేత్రములలో ప్రతిరోధము గోచరించకున్నను, ప్రతివాదము మాత్రము స్పష్టముగ గోచరిస్తున్నది. అటువంటి ఒకానొక రసిక యాత్రికునితో అల్పసంతోషి అయిన అతని మిత్రుడు "రథముమీది జగన్నాథుని దర్శనమునకు ముందుగనే ఫలప్రాప్తి అయినది, మిత్రమా!" అని ఉల్లాస మాడినాడు.

"ఫలప్రాప్తి అయితే తప్పక అయినది కాని ఏమి లాభము? సింహద్వారపు చందన గడియ తెరవ బడనంత వరకు పూజ ఎలా అవుతుంది మిత్రమా?" అని ఆ రసిక శిఖామణి సమాధాన మిచ్చినాడు.

ఆ స్నేహితుల హాసభాసురమైన అధరములవైన సంతృప్తి వెల్లి విరిసినది. ఆ రసికుల రసిక భాషణలకు గురి అయిన యాత్రికురాలి కమనీయ ముఖ

మందలము వారి వక్రోక్తి పరిహాసముల మూలముగ మందుచెందలోని పథశ్రమ వలన కలిగిన అరుణిమ కన్న ఎంతో అధికముగ అరుణాభమైనది.

గౌడ దేశమునుండి నడచి వచ్చిన వైష్ణవులు తమ రెండు బాహువులను పైకెత్తి "కహాఁ తుహూఁ బ్రజేంద్ర కుమార్" అని ఆవేశముతో ఆ జనసముద్ర ములో నుండి పాడుకొంటూ వస్తున్నారు.

ఆ దృశ్యమును క్రేగంట వీక్షించిన ఉత్కళ వైష్ణవ భక్తుడు తన హరి తిలక చర్చితమైన నాసమును కుంచిత పరచి మృదంగము క్రమోగిస్తూ "జయ్ జయ్ ఆణాకార్ నీలాద్రీ బిహారీహై" అని పాడుకొనుచు సాగిపోయినాడు.

యాత్రికులను ఆకర్షించుటకు వస్తు విక్రేతలు బహు విధముల ప్రయత్నిస్తున్నారు. ఎండ వేడిమికి అలసట చెందినవారు, వ్యాధిగ్రస్తులైనవారు దొరకిన చోటునక్రింద కూర్చుని, దుఃఖరహితమైన పవిత్ర భూమిపైన దేహధారణ యొక్క అంతిమ ఆశను సార్థక పరచుకొంటున్నారు. యతి-యువతి, సాధకుడు -రసికుడు, మృత్యువు-శృంగారము, భక్తి-ప్రమత్తత, శుచ్చత-నిత్యత, ఆవ సాదనము-జీవనోచ్ఛలత, వీటితో గూడిన ఆ కోలాహలములో అచల ధైర్య పండితమైన ప్రతీక్షణము అంకితమై ఉన్నది. యాత్రికుల అందరి దృష్టి ఆ సింహద్వారపు అడ్డు గడియ పైననే కేంద్రీకృతమై ఉన్నది. సింహద్వారము ఎప్పుడు తెరవబడుతుంది, పరమేశ్వరుని పహండీ ఎప్పుడు ప్రారంభమవుతుంది, వీటికొరకే ప్రతి యాత్రికుని ప్రతీక్షణ-మధ్యాహ్నపు చెండలో రథయాత్రను ఎవరు ముందువెళ్ళి చూడగలరో తెలిసి కొనుటకు పోటీ జరుగుచున్నదా అన్నట్లుగా యాత్రికులు క్రొక్కిసలాడు కొనుచున్నారు.

మధ్యాహ్న సమయము అయినది. ఈ పాటికి జగన్నాథుని పహండీ సమాప్తమయి చేరా మామూలుగ ప్రారంభము కావలసి యున్నది. కాని ఈ యేడు పహండీ ఆలస్యమయినది. దానికి కారణము తెలియదు. తెలిసికొనవలెనన్న ఉత్సుకత సంచర్మకులలో ఏ ఒక్కనికీ లేదు. ఏకాదశీ ఉపవాసులు గూడ చింతి తులుగా లేరు. ఆసక్తికరమైన అందరి దృష్టి సింహద్వార గడియపైననే నిబద్ధమై

యున్నది. "ద్వారము ఎప్పుడు తెరవబడుతుంది? మహా సామంతుడైన శ్రీ జగన్నాథుడు ఎప్పుడు పహండీ చేస్తాడు?" అందరిలోను ఇదే ప్రశ్నలు-వీటికొరకే వారి ప్రతీక్షణ, ఆది క్లేదాక్త అయిన భూదేవత అవతరణ కొరకు అలసట చెందిన అహల్య యొక్క పాషాణ ధైర్యపు ప్రతీక్షణమువలె నున్నది.

సింహద్వారము ముందు పట్టు పతాకములు, చామరములు, పుష్పములు, కలశములు మొదలగు వానితో శోభాయ మానముగ నలంకరింపబడిన బలభద్ర, సుభద్ర, జగన్నాథుల రథములు మహా ప్రభువులవారి పహండీ విజయమునకు ఎదురుచూస్తున్నవి. రథముల సుందరరూప శోభను తిలకించుటకై రథముల నలుదిశలను యాత్రిక సమూహము అధికము కాజొచ్చినది. అనంతమైన నిరీక్షణానంతరము ఫలప్రాప్తి సంభవత వలె రథ గోపురములపైన ధ్వజములు మందమారతములో రెపరెపలాడుచు ఎగురుచున్నవి. 'చార్' మీదినుండి చీమల బారులవలె యాత్రికులు రథములపైకి ఎక్కి దిగుచున్నారు.

ఉన్నట్లుండి హఠాత్తుగ 'మణిమా! మణిమా!' అంటూ ఆ జన సముద్రము ఒక్కసారి ఉద్వేలిత మయినది. నురుగుతో గూడిన సముద్రపు టలలవలె శతాధిక చామరములు కదలాడినవి. సూర్యాతప తప్తమై యున్న ఆకాశ వితానమును చీల్చి వేయుచున్నట్లు 'హరిబోల్!' హర్షాతిరేక ధ్వానములు చెలరేగినవి

మంగళ్‌పుర్ గ్రామవాని పహలీ విశ్వాల్ గూడ తన అరణ్య ప్రాంతములు తుచ్ఛమని ఎంచి సకుటుంబ సపరివారముగ జగన్నాథుని దర్శనము కొరకు ఈ సంవత్సరము యాత్రకు వచ్చినాడు.

ఎంతో ముందుగానే ఏంతూ ఆలయముపైపు వెళ్ళినాడు. "ఈ గుంపులో, ఈ త్రోపులో ఈగ కూడ తొమ్మిది ముక్కలై పోయేటట్టున్నది. వాడింత వరకు ఆక్కడ ఏమి చేస్తున్నట్లు? వాడేమి మనిషి" అని విశ్వాల్ అనుకొను చుండగనే ఏంతూ దూరముగ అతనికి కనబడినాడు. అతడు చెమటతో తడిసి ముద్దయినాడు. ఆయాస పడుతూ ఒక 'బేంగ్‌బాయిద్' పట్టుకొని తిరిగి వచ్చి

నాడు. ఏంతూ యువకుడు అతని చేతులకు వెండి మురుగులు, చెవులకు బంగారపు పోగులు ఉన్నవి. సుగఠితమైన వక్షస్థలము పైన కొయ్యపూసల మాల ప్రేలాడు చున్నది. ఆ మాలలో ఒక ఐరిణ ప్రేలాడు చున్నది. అతడు జుట్టును ముడివేసికొని, ముక్కునుండి నొసటి పై భాగము వరకు హరి తిలకము పెట్టు కొన్నాడు అతడు వచ్చిన వెంటనే "పహండీ ఆలస్యమవుతున్నది, అసలు విషయము ఏమిటి ఏంతూ భైయా?" అని పహాలీ విశ్వాల్ చిన్న కొడుకు నరి అతనిని అడిగినాడు.

"అరే, పహండీకి ముందు జరుగవలసిన విధులు ఎన్నో ఉన్నవి. అవి పూర్తి అయితే గాని పహండీ ఎలా జరుగుతుంది? ఇప్పుడే ఖిచడీ భోగము అయినది. పండాలు, పతి మహాపాత్రలు, ముదిరథులు మూడు విగ్రహములవద్ద మంగళారోపణము చేయుటకు అటు వెళ్ళినారు, నేను ఇటు వచ్చినాను. ఇంక కొద్ది సేపటిలో పహండీ ప్రారంభము కాగలదు. మరి మీరు కాస్త ఓపిక పట్టండి" అని సర్వజ్ఞునివలె ఏంతూ చెప్పినాడు.

"గత సంవత్సరములలో ఈ పాటికి ఖిచడీ భోగము, పహండీ మొదలైన విధులు పూర్తయి చేరా పహరా కూడ జరుగుతూ ఉండేది. ఇప్పుడింకా ఖిచడీ భోగము అయిందని నీవు అంటున్నావు. అయితే ఇంకా చాలా ఆలస్యమౌతుందన్న మాట!" అన్నాడు మేకాప్.

"నీవైతే చూసి వచ్చినావు, కాని నన్ను తీసికొన్నివెళ్ళలేదు కదూ, ఏంతూ భైయా!" అంటూ అభిమాన పూరిత స్వరముతో నరి నిందారోపణ చేసినాడు.

"అరేఁ అణసర్ ద్వారముపద్ద ఎంతమందీ!... ఎంతమందీ! ఆక్కడ ఎలా ఉందనుకొన్నావ్, నాకే అక్కడనుండి, ఆ కొట్లాటలో నుండి తిరిగి రావడము ఎంతో కష్టమయింది. నీవు అక్కడకు వెళ్ళగలవా, తిరిగి రాగలవా?" అని ఏంతూ తన అంగవస్త్రముతో చెమటను తుడుచుకొంటూ అన్నాడు.

మేకాప్ తన 'భటువా'లోనుండి తమల పాకులు తీసికొంటూ అణసర్ పీఠమువద్ద గుంపుచేరి కొట్లాడు కొంటున్నారని విని "అణసర్ పీఠమువద్ద

కొట్లాటలు ఏమి జరుగుతున్నవి? అరెరే! నేనక్కడకు వెళ్లలేక పోతినే! నీకు అన్నీ చూపిస్తూ నేనిక్కడనే ఉండిపోవలసి వచ్చినది, బేయిపో!" అన్నాడు.

నిజమునకు ఏంతూ అణసర్ పీఠము వద్దకు వెళ్ళనూ లేదు, అక్కడి కొట్లాటలను చూడనూ లేదు. సుభద్ర యొక్క దేవీదలన్ రథచాయలో విశ్రాంతి తీసికొంటూ ప్రజలనుండి తాను విన్నదానిని తాను చూచినట్టే వీరికి చెపుతున్నాడు: "పహండీ ప్రారంభము ఆగుటకు ముందు పన్నెండు 'కుడుఆ'ల భోగము జరుగుతుంది. అయితే 'సుఆర్‌బడు' దానికి నాలుగు రెట్లు తెచ్చినాడు. దానితో 'సుఆర్'లు పండాలు దెబ్బలాడు కొనినారు. తరువాత వారు చేతులు చేతులు కలుపుకొన్నారు. సుఆర్‌బడు ముందు పళ్ళూ రెండూ ఊడిపడేట్టు ఒక పండా కొట్టినాడు. సుఆర్‌బడు నోటిలోనుండి రక్తము కారి క్రిందపడినది. దానితో ఆలయము అపవిత్రమయినది. భోగము మైల పడినది. అందువలన ఆలయమును శుద్ధి పరచి, మరల భోగము వండి సమర్పించవలసివచ్చినది. తాకూర్ల మంగళారోపణము జరిగిన తరువాత నేను అక్కడనుండి వచ్చినాను."

"ఎలా?" అని విశ్వాల్ కుమారులు ఆశ్చర్యముతో అడిగినారు.

ఆ సమయములోనే విభూతి దారులైన దిగంబర నాగా సన్యాసుల దళ మొకటి ఒంటెలపైని కూర్చొని ఇసుప చిరుతలను ఝున ఝున లాడించు కొంటూ గుంపులమధ్య నుండి సింహద్వారము వైపు వెళ్ళినది. వారి మహంతు గంజాయి సేవనము వలన ఎరుపెక్కిన కళ్ళను త్రిప్పుతూ, "జై జగన్నాథ్‌కీ జై!" అని అరుస్తూ వెళ్ళినాడు. వెంటనే సహస్రాధికమైన కంఠముల నుండి 'హరిబోల్' అనే నినాదము ఉచ్చైస్వరముతో ప్రతిధ్వనించినది. ఆ నాగాలను చూచుటకు జనులు గుంపులు గుంపులుగా త్రోసికొని వచ్చినారు. పహాలీ విశ్వాల్ ఆ జన సమూహపు త్రోపుడులో క్రింద పడబోయి నిలద్రొక్కు కొన్నాడు.

"గుంపులోనికి దూరవద్దని నేను హెచ్చరిస్తూనే ఉన్నాను, కాని నామాట ఎవరు వింటారు?" అని విశ్వాల్ పెద్ద కుమారుడు జగబంధు విరక్తితో అనినాడు.

"అరే! ఈ జనసందోహములో బెత్తము దెబ్బలు తినకుండా, క్రిందా మీదా పడకుండా రథముమీది 'చకాడోలా'ను చూసి మోక్షము పొందడము సంభవమేనా' 'అని ఏంతూ ఆశ్వాసిస్తూ అన్నాడు.

గుంపును చీల్చుకొంటూ, తన వాళ్ళందరిని సింహద్వారము వరకు తీసికొని వెళ్ళుటకు త్రోవ ఏర్పరుస్తూ "మీరందరూ నా వెనుకనే రండి, మనము రథము వద్దకు వెళ్ళక పోయినట్లయిన పహండీ చూచుటకు వీలుండదు. నేను మిమ్ములను తిన్నగా పహండీ వద్దకే తీసికొని వెళ్తాను కనుక నా వెనుకనే గండి:" అని ఏంతూ వారిని హెచ్చరిస్తూ బయలు దేరినాడు.

కాని వాడు ముందుకు వెళ్ళడము అసాధ్యమయినది. సరిగా ఆ సమయమునకే తూర్యములు, తెలంగ్ వాయిద్యములు మ్రోగుచుండగా బలిగండ్ వైపు నుండి పల్లకీలో అమీన్‌చంద్ పహండీ వైపుకు వెళ్లుచున్నాడు. పల్లకిని చూసి రామచంద్రదేవ్ ఛేరా పహరా కొరకు వెళ్ళుచున్నారని ప్రజలు భావించి జయ జయ ధ్వానములు చేసినారు. "భోర్ధారాజా రామచంద్రదేవుకీ జై, మజిమా! శరణ్ పంజర్ మహాబాహూ!" మొదలైన ప్రజల నినాదములతో బడ్‌దాండ్ ప్రతి ధ్వనించినది. రామచంద్రదేవుని దర్శించవలెనని ప్రజలు గుంపులు గుంపులుగ విరుచుకొని పడినారు. కాని ఆయన రామచంద్రదేవ్ కాడని వారికి వెంటనే తెలిసినది. అతడు నాయబ్-నాజిమ్ తకీఖాన్ యొక్క నాయబ్ రాజా అమీన్ చంద్ అని ప్రజలు తెలిసి కొన్నారు. ప్రజలకు కుతూహలము పోయి అక్కడ నుండి వైదొలగినారు.

ఆలయమునుండి ఘంటా తూర్యనాదములు వినిపిస్తున్నవి. మంగళ రోపణము ముగిసినది. ఇంక సింహద్వారము తెరవబడుతుంది పహండీ ప్రారంభము అవుతుంది. ప్రజలు ఎక్కడివారు అక్కడనే నిలుచుని సింహద్వారము వైపునకే చూడసాగినారు.

సింహద్వారము వద్దనున్న గుమ్మటముకుండి వీధి వరకు సందర్శకుల తోను ఉపవాస వ్రతులతోను స్థలము నిండి పోయినది. అరుణ స్తంభముపద్ద

నిల్చున్నయెడల సింహద్వారము తెరచుకొనడము బాగుగ కనబడుతుంది. అందుచేత అక్కడ యిసుక వేసినచో రాలనంత మిక్కుటముగ జనులు చేరి నారు. ఇంకను సింహద్వారము తెరవబడలేదు.

సాత్ పాహాచ్ వద్ద ఠాకురులను మొగలి పువ్వులతో అలంకరిస్తున్నారు. దానిని 'టాహిఆ లాగి' అంటారు. సింహద్వారమును ఇంక తెరవనున్నారు. "మణిమా మణిమా" నాదముతో రథ్‌దాండ్ ముఖరితమయినది. సింహద్వారము తెరచుటకు జాగు అగుచున్న కొలదీ 'మణిమా, మహాబాహు' నినాదములు ఉద్వేలిత మగుచున్నవి. 'సాత్ పాహాచ్' ల క్రింద 'ధాడి పహండీ' కొరకు ఠాకురు విరాజితుడవుచుండిన సమయములో ఘంటా, శంఖా. తూర్యాది నాదములతో గూడిన సమష్టి ధ్వనితో ఆలయ ప్రాంగణము ప్రతిధ్వనించినది.

యుగయుగముల ప్రతీక్షణానంతరము మహాకాలుని రుద్రద్వారము తెరవ బడినట్లు చివరకు ఆ సింహద్వారము తెరవబడినది. సాత్ పాహాచ్ నుండి మోషడా వరకు బారులు తీరిన ఘంటా వాదకులు విల్లుల వలె వంగుతూ, లేస్తూ ఒక విధమైన నాట్యభంగిమలో లయ విన్యాసముతో ఘంటలు మ్రోగిస్తున్నారు. మృదంగ శంఖ తూర్యాది వాద్యములు మ్రోగినవి. ప్రప్రథమముగ దయితాలు ఇరువురు సుదర్శన చక్రమును భుజములపైని మోసుకొని వచ్చి సుభద్ర రథము పైన శోభిల్ల జేసినారు.

ఆటుపైన కాదంబరీ ప్రమత్తమయిన పద్యబంధముతో నాట్యము సలుపుతూ, శిరోభాగమున విశాల కేతకీ పుష్ప శిఖను నాట్యమాడిస్తూ మోహన చిత్తాలోడన కరమైన భంగిమలో 'బడ ఠాకూర్' శ్రీబలదేవ్ ఆలయములో నుండి వెలుపలికి వచ్చినాడు. వెనక నుండి 'పిందూరీ గంతా పాగ్'కు బిగించి బలదేవుని దయితాలు పట్టు కొనినారు. మోయలేక ఈడుస్తూ, మెత్తని దిండ్ల పైని ఎత్తి పడవేస్తూ ఠాకూరును దయితాలు తీసికొని వస్తున్నారు. ఊహించరాని హృదయాందోళనవలె కేతకీ పుష్ప గుచ్ఛము ప్రమత్తత వలన ఒకసారి ఉన్నతము మరి యొకసారి అవనతము అవుతున్నది.

ఆ సమయమందు నిష్కళంక లావణ్యవతులు, గజేంద్ర గామినులు, క్షీణ మధ్యములు అయినటువంటి మహరీలు ఠాకూర్ సమక్షములో నృత్య మాడ మొదలిడినారు. వారి కుటిల కుంతల కమనీయ నిగలు, ఆ నిగలలోని కేతకీ చంద్రఝుంపలు తాళ లయానుసారముగ విన్యాసములు చేయుచుండినవి. బలభద్రస్వామి తన రథసోపానము మీదకు ఎక్కినాడో లేదో, వెనువెంటనే దయితాలు సుభద్రను దేవీ దలన్ రథముపైకి తీసికొని వెళ్ళినారు. లజ్జాన్విత యైన వధువు వలె సంభ్రమముతో బలభద్రదేవుని ముందునుండి ముఖము చాటు చేసికొని ఆమె తన రథముపైకి ఎప్పుడు చేరినదో ఎవరికిని తెలియలేదు. ఇంతలో దయితాలు అతి కష్టముతో బలభద్రుని రథముపైకి చేర్చినారు. ఆంతట కొలదినేపు పహండీలోని వారికి విశ్రాంతి లభించినది. ఇంక ఆయనను ఆసీనుని చేయుటయే మిగిలియున్నది.

జగత్తుకు ప్రాణాధారుడైన జగన్నాథుని పహండీ విజయము ఇంక ప్రారంభము కానున్నది. ఎవరికి వారు రథము వరకు ప్రోసికొని పోపలెనని యాత్రికులు ప్రయత్నిస్తున్నారు. ఎవరు క్రింద పడినారు, ఎవరు ఎవరిని త్రొక్కి వేసినారు, ఇవన్నీ చూచుటకు ఎవరికీ సమయము లేదు. అవకాశమూ లేదు. 'మణిమా, మహా బాహు, శరణ పంజర్, చకొడోలా, పతితపావన్' మొదలగు భక్తి పారవశ్య సంబోధనలతో జనసమూహము జగన్నాథుని దర్శనము కొరకు ఉవ్వెత్తున లేచి పడుతున్న సముద్ర కెరటములపలె మహా ఘోషతో ముందుకు విరుచుకొని పడుతున్నది. దయితాలు జగన్నాథుని లాగు కొంటూ పోతూ సుకోమలమైన మెత్తని దిండ్లపైన ఆడపా తడపా పడవేస్తున్నపు డల్లా యాత్రికులు ఆనంద బాష్పములను రాలుస్తున్నారు. "హే ప్రభో! నీవు నీ యిచ్ఛను సారముగనే రథము పైకి వెళుతున్నావు. ఈ యీడ్పులు, ఈ యెత్తి పడవేతలు, యీ తిట్లు నీ యిష్టాను సారముగనే భరిస్తున్నావు. కాక పోయిన తుచ్ఛ ప్రాణియైన మానవుడు నిన్ను ఈ విధముగ చేయగలడా? నిన్ను సింహాసనము మీద నుండి లేవ దీయ గలడా?"

ఏ స్మరణా తీత గతమందు సునీపుర్ లో జగన్నాథుడు 'పాతాలీ' అయినాడో ఎవరికీ తెలియదు. ఏ ఇంద్రద్యుమ్న మహారాజు ఈ విధ ముగ జగన్నాథుని ఈడుస్తూ, పడవేస్తూ తీసికొని పచ్చి ఇక్కడ పునఃప్రతిష్ఠించినాడో కూడ తెలియదు. ఈ గుండిచా పహాండి ,ఆ చారిత్రాత్మక స్మృతికి పునరాభినయ మేమో? తాత్త్వికులు, చరిత్రకారులు ఏ యుక్తులు, ఏ వితండములు చెప్పినను అనేక దుస్తర మార్గములను, సహస్ర యాతనలు అధిగమించి జగన్నాథుని దర్శనార్థమై యాత్రికులు అచట గుమిగూడుచున్నారు, భక్త్యావేశ పులకితులవుచున్నారు, ఆ ధూళి దూసరితమైన బడదాండ్ మీద జగన్నాథుని దర్శించి అనశ్వరమైన, శాశ్వతమైన, సౌందర్యయుతమైన మహోదయమును దర్శించి తమ నేత్రములను సార్థక పరచు కొంటున్నారు.

అసలు ఈ జగన్నాథుడు ఎవడు? బౌద్ధుడా? జైనుడా? పంచరాత్రికుడా? లేక వైష్ణవుడా? ఈ విషయమును తెలిసికొనవలెనన్న కుతూహలము ఆ యాత్రికులకు లేదు. నశ్వర జీవన పథములో ఆ మహాసామంతుని పహండీ విజయమును చూడవలెనన్న ప్రతీక్ష మాత్రమే జన్మజన్మాంతరముల నుండి వారితో ఉన్నది. దానితోనే వారి మర్త్యజీవనము మూల మూలలా అమృతైశ్వర్యముతో నిండి పోతున్నది. మృత్యువు, రోగము, దూరము, పథశ్రమలను వారు లక్ష్య పెట్టకుండ ఆ మహాసామంతుని సింహద్వారము ఎదుటకు చేరినారు. జగన్నాథుడు తన రత్న సింహాసనమును వీడి పతిత పావనుడైనాడు. ఒక మహత్తర అవ్యక్త ఆవేదన వలన ఆందరి అర్ధచేతనత్వమును జగన్నాథుడు స్పృశిస్తున్నట్టుగ ఉన్నది. ఆ అనుభవము అందరకు కలుగుతున్నది. కాని దానిని వారు గుర్తించుట కష్టము.

పహండి సమయములో జగన్నాథుని స్పర్శను ఒక్క సారైనను పొందవలెనని ప్రతి భక్తుడు ఆతృత చెందుతున్నాడు. జగన్నాథుని ఈడ్చుకొని తీసికొని వెళుతున్నప్పుడు ఆయన తలలో నుండి మొగలిరేకులు జారి క్రిందరాలుతు

న్నవి. వాటినే కాక వాటిని కట్టిన వేదుర ఈనెలను, సోలా పుష్పములను గూడ లాగు కొనుటకు భక్తులు పెనుగు లాడుతున్నారు. ఆయన వతిత పావనుడు. తన దేహము మీద నన్నదంతయు అతడు భక్తులకు ఇచ్చి వేస్తున్నాడు. ఆ విధముగ ఇవ్వనప్పుడు ఆయన పతితపావనుడు ఎలా కాగలడు?

ఆ జన సమూహములో అమీన్ చంద్ అహంకారమంతయు ఎక్కడికో పోయినది. ఆయన పల్లకీలో జగన్నాథ వల్లభము దాటి ముందుకు వెళ్ళలేక పోయినాడు. ఆయన పల్లకిలో నుండి దిగి, గుంపులో పడి, ఏదో విధముగ అతి కష్టమునపైన రథము వద్దకు చేరినాడు.

పహండీ ఆయనను ఎక్కువగా ఆకర్షించలేదు. దానిని ఆయన చూడ డము లేదు. జగన్నాథుని వెనుకనున్న ఉత్కళజాతి ఐకమత్యమును, శక్తిని, గొప్పతనమును అతడు మాచి ఆశ్చర్యపోతున్నాడు. ఈ జగన్నాథుడే ఉత్కళ దేశ చక్రవర్తి. ఒరిస్సాలోని రాజులు ఆయన సేవకులు మాత్రమే. 'ధిల్లీశ్వరేవా, జగదీశ్వరేవా' అయినటువంటి మొగల్ సమ్రాట్ అక్బర్ వరకు కూడా అనేక మంది చక్రవర్తులు ఇక్కడకు వచ్చి ఈ జగన్నాథుని ముందు తమ ఓటమిని అంగీకరించి వెళ్ళిన వారే. టోడర్‌మల్, మానసింహాలు కూడ నతమస్తకులై ఇక్కడ నుండి వెళ్ళ వలసి వచ్చినది. నాయబ్–నాజిమ్ తకీఖాన్ అతని సేవక రూపుడైన అమీన్ చంద్ ఈ మహా మహిమాన్వితుని ముందు తుచ్ఛాతి తుచ్ఛులు మాత్రమే.

అమీన్ చంద్ విభ్రాంతుడై ఆలోచనా నిమగ్నుడై యుండగా 'టాపిఆ' లో నుండి కేతకీ దవన మాలల ఖండములను సంపాదించుకొనుటకు గాను యాత్రికులు ఆయనను త్రోసికొంటూ ముందుకు దూసుకొంటూ వెళ్ళినారు. అమీన్ చందుని అంగరక్షకులు 'తప్పుకొనండి, తప్పుకొనండి' అని ఎంత అరచినను వారి ప్రయత్నము నిరర్థక మయినది. ఆ సమయములో వారి కేకలను వినేవారు ఎవరున్నారు? ఆ గుంపుల వత్తిడికి క్రింద పడబోయిన ఆ అంగరక్షకులు ఎలాగునో తట్టుకొని అతి కష్టముతో అమీన్ చంద్‌ను ఒక సురక్షిత ప్రదేశమునకు చేర్చినారు.

జగన్నాథుని పహండీ పూర్తి అయినది. నిచ్చెనల పైనుండి జగన్నాథుని రథము పైకి దయితాలు ఎక్కుస్తున్నారు. భక్తకోటి అంతా నిశ్శబ్దముగ ఉత్కంఠ పూరితమై ఆ దృశ్యమును చూస్తున్నది. పహండీ పూర్తి అయి జగన్నాథుడు రథము పైని విరాజమానుడైన వెంటనే "మణిమా! మణిమా!' అంటూ లక్షలాది కంఠములు వినమ్రతతో, అతురతతో పిలువసాగినవి. ఖంజరి వాద్యముతో కూడిన జణాణలు హరిబోల్ నినాదముతో కలిసి భూమ్యాకాశములను కంపింప జేసినవి. వస్తు విక్రయదారులు తమ తమ వస్తువుల నాణ్యతను ఎలుగెత్తి చాటుతున్నారు. 'వేంకాలీ' 'బేంగ్‌బాయిద్', డమరు మొదలైన వాటిని వారు అమ్ముతున్నారు. దూర గ్రామములనుండి విచ్చేసిన పరిచితులను, బంధువులను, ఆత్మీయులను ఆకస్మాత్తుగ కలిసికొన్నంతనే యాత్రికులు ఒకరినొకరు పలకరించు కొంటున్నారు. పుట్టింటి చెలిమి కత్తెలను, 'ఆంబకషి'లను, 'బఉలు'లను చూసిన మహిళలుకూడ ఆత్మీయతతో పలకరించి మాట్లాడుకొంటున్నారు. మధుర నీరవ దరహాసములతోను, ఆహ్లాదమయ చంచల నయనములతోను కూడిన శాంత సంభాషణమే ఆ శుభసమయములో వినవస్తున్నది.

ఠాకురులను రథములపైని ఆసీనులను చేసి చాంగడా మేకాప్‌లు తమ విధులను నిర్వర్తించినారు. ఇంతలో రామకృష్ణ, మదన మోహన్ దేవతలను పల్లకీలో సాధువులు దక్షిణ ద్వారమునుండి రథము వద్దకు తీసికొని వస్తున్నారు. ఆ శోభిత యాత్రా దృశ్యమును చూచి, తెలంగ్ వాద్య, తూరీ మృదంగ, శంఖాది వాద్యముల సమష్టి ధ్వనిని విని యాత్రికులు గూడ అక్కడ గుమి గూడ నారంభించినారు.

ఆటు పిమ్మట లెంకాలు, పాయిక్‌లు ఘంటలను, తూర్యములను మ్రోగిస్తూ స్వర్ణకారుల వద్దనుండి ముత్యాలు పొదిగిన 'చితా'లను తీసికొని వచ్చినారు. అవి మూడు రథములపైనను సమర్పించబడినవి. దీని అనంతరము ఛేరా పహరా జరుగుతుంది, 'కాల్ బేఠిఆ'లు రథమును లాగడము ప్రారంభిస్తారు.

జగన్నాథుని వద్దనుండి ఆజ్ఞా సామగ్రిని, పత్రికను తీసికొని సాన్ పరిచా శ్రీ నవర్‌లో నున్న రామచంద్రదేవ్ వద్దకు వెళ్ళినాడు. బాలిసాహి

ప్రాసాదము జరా జీర్ణమై వినష్టమయినది. అందువలన దానిలో ప్రవేశించు అధికారమును ఆయన కోల్పోయినారు. కనుక బడదాండ్ పైని మధుపుర్ వద్ద ఒక అస్థాయీ శ్రీ నవర్ నిర్మింపబడినది. ఆజ్ఞా సామగ్రిని స్వీకరించిన తరువాత రాజావారు ఛేరా పహరా చేయుటకు వేంచేయుదురు. ఆజ్ఞా సామగ్రిని తీసికొని బడ పరీఛా వెళ్లవలసి యున్నది. కాని నేడు సాన్ పరీఛా వెళ్ళినాడు. ఆ సమయములో బడ పరీఛా అక్కడ లేడు. ఎక్కడకు వెళ్ళినాడో ఎవరికిని తెలియదు.

మోసము, బలప్రయోగము, యుక్తి మొదలగు వానిలో దేని ద్వారా నైనా సరే ఏ విధముగా నైనా సరే ఛేరా పహరాను రామచంద్రదేవ్ చేయకుండా నిరోధించుటకు సముచితమైన ఏర్పాటులను చేయుటకు తకీఖాన్ యొక్క నాయబ్ రూపములో అమీన్‌చంద్ పూరీ వచ్చి యున్నాడు. వరదలోని ఇసుక ఆనకట్టలె ఆయన నిర్మించిన వ్యూహము గంగ పాలైనది.

వైభవముతో రామచంద్రదేవ్ ఇప్పుడు వేంచేసి సగర్వముగ ఛేరా పహరా చేయసున్నారు. ఒక అంకిచనునివలె ఈ జనసముద్రములో నిల్చుని అమీన్‌చంద్ దీనముగా ఆ దృశ్యమును చూడసున్నాడు. ముందువెనుకల ప్రోపుదులనుండి తన తలపాగను కాపాడు కొంటూ, ఖేద పూరితమైన తన పరిస్థితిని గురించి అమీన్‌చంద్ తలపోస్తున్నాడు.

పశ్చిమాద్రిలో సూర్యభగవానుడు క్రుంకనున్నాడు. నిజముగ ఈ పాటికి రథము బల్‌గండీ చేరవలసినది, అక్కడి పూజకూడ ముగియవలసినది. కాని ఈ యేడు పహండీలో ఆలస్యమయినందువలన ఇంతవరకు ఛేరా పహరా కూడ పూర్తి కాలేదు. బల్‌గండీ వద్దకు రథములు ఈ నాడు చేరుసరికి ప్రొద్దు పోవచ్చును. రథములను లాగుటకు యాత్రికులు వేగిరపడుతున్నారు. సైనిక నావలవలె దక్షిణ దిశనుండి పశ్చిమ దిశకు నల్లని మబ్బులు ఒకదానివెంట ఒకటి ఆకాశములో ప్రయాణిస్తున్నవి. మధ్యాహ్నపు మండుటెండకు వేడెక్కిన శరీరములమీద కర్పూర చందన శీతల స్పర్శవలె శీతల మందమారుతము వీవసాగినది.

తెలంగ్ వాద్యములు, వీర్తూరి, నిషాణ్, విజయఘోష్ మొదలగు వాద్యములు మధుర ధ్వని దూరముగ వినబడుచున్నది.

"మహా రాజావారు వేంచేస్తున్నారు...మహా రాజావారు..." అంటూ సహస్ర కంఠములు ఒక్కసారిగ పలికినవి.

మహా రాజా రామచంద్రదేవ్ పల్లకీలో కూర్చుని రథములవైపు వస్తున్నారు. పద్దెనిమిది సంస్థానముల రాజా, మహా రాజాలు పల్లకి ముందు నడచివస్తున్నారు. తమ తమ మర్యాదాను సారము ఛత్ర, చామర, పతాకాది గౌరవ చిహ్నములను ధరించి వారు రామచంద్రదేవుని పల్లకితో సరిగ నడచి వస్తున్నారు. రామచంద్రదేవునికి సామంతులు కాని మొగల్ అధీన ప్రాంతముల జమీందారులు గూడ ఆ శోభన యాత్రలో పాల్గొన్నారు. తకీఖాన్‌కు వారు లోబడి ఉన్న జమీందారులే అయినా వారా ఊరేగింపులో ఐచ్ఛికముగ పాల్గొని 'ఖోర్ధా రాజా-మహారాజ్ రామచంద్రదేవ్‌కీ జయ్' అని నినాదాలు చేస్తూ వస్తున్నారు.

ఈ దృశ్యము కండ్లబడినంతనే ఆమీన్‌చంద్ ఆత్మ విశ్వాస శూన్యుడైనాడు. సాంప్రదాయానుసారముగ వస్తున్న ఛేరా పహరా విధి నిర్వహణగ ఇది ఆతనికి అనుపించలేదు. జగన్నాథునిపైన కేంద్రీకృతమైయున్న అపరాజేయమైన ఉత్కళ రాజకీయ ఐక్యతకు ఒక సాటిలేని జైత్ర యాత్రగా అతనికి గోచరించినది. మానసింహ్వంటి ధుర్దాంత మొగల్ సేనాపతి గూడ ఈ ఐక్యతను అపహాస్యము జేయ ప్రయత్నించి విఫలుడైనాడు. అతని ముందు ఈ ఆమీన్‌చంద్ ఏపాటివాడు?

ఇంతలో పల్లకీ బలభద్రస్వామి వారి రథమును సమీపించినది. పదునెనిమిది సంస్థానముల సామంతులు, మొగల్ అధీన ప్రాంతములోని చాలమంది జమీందారులు, తఢాఉకరణ్, దేఉల్ కరణ్, రాజగురు, సాన్‌పరీఛా ఆదిగా గల ఆలయ ప్రముఖులతో గుడ రామచంద్రదేవ్ నిచ్చెనపైనుండి రథముమీదకు ఎక్కుచున్నప్పుడు "జై: గజపతి చలతి విష్ణు మహారాజ్ రామచంద్రదేవ్‌కీ

జయ్" అంటూ నలువైపులనుండి ప్రజలు హర్షధ్వానములను చేసినారు. ఆ సమయములో విచ్చివానిలా అమీన్‌చంద్ బడ పరీఛా గౌరీ రాజగురు కొరకు వెతుకుచున్నాడు. కాని ఆ రాజగురు కనుపించ లేదు.

ప్రొద్దు గ్రుంకుటకు ఇంక కొద్దిగ వ్యవధి ఉన్నది. కాని దక్షిణ దిశ నుండి వచ్చుచున్న మేఘములు ఆకాశమును నెమ్మది నెమ్మదిగా మూసి వేస్తున్నవి. ఆంధకారము మెల్లగ అలముకొంటున్నది. చల్లని తూర్పుగాలికి రథము వైన అలంకరింపబడిన పట్టు, మఖమల్ వస్త్రములు రెపరెపలాడుచున్నవి. పతాకములు స్పందిస్తున్నవి. ప్రజల కోలాహలము, వాద్యముల ధ్వోతలతో కలిసిన మేఘ గర్జనలు ఒక మహాద్భుతమైన ఏకత్వమును సృష్టిస్తున్నవి.

తాలధ్వజ్, దేవీదలన్ రథములవైని ఛేరా పహరా పూర్తిచేసి రామ చంద్రదేవ్ తమ అనుచరులతో నంది మోష్ రథము వైపుకకు వెళ్లుచున్నారు. వారి సౌమ్యదేహము ఒకానొక అసాధారణ దీప్తితో వెలుగొందుచున్నది.

రామచంద్రదేవ్ మతాంతురులనిగాని, మ్లేచ్ఛులని కాని ఆ సమయములో ఎవరూ అనుకొనలేరు. సర్వప్రథమముగ గరాబడూ నుండి హస్తములలోనికి పుష్పములను గ్రహించి రామచంద్రదేవ్ వినీత భావముతో నత మస్తకుడై పుష్పాంజలిని ఘటిస్తున్నప్పుడు "మణిమా ! మహాబాహు! చలతి విష్ణు!" మొదలగు జయజయ నాదములతో ఆకాశము విక్కటిల్లి, మేఘ గర్జనలు మరుగు పడినవి.

ఆకాశములో మేఘములు దట్టముగ క్రమ్ముకొంటున్నవి. అందువలన 'కాల్‌బేఠిఆ'లు బలభద్ర, సుభద్ర రథముల నుండి నిచ్చెనలను తొలగించినారు. వారు సారథి మరియు అశ్వముల కొయ్య ప్రతిమలను అలంకరించ మొదలిడినారు. ఖల్‌గండీ వరకు రథములు నేడు వెళ్ళగలవని తోచుట లేదు. జగన్నాథుని రథము మీద ఛేరా పహరా నేడు సమాప్తమగుసరికే సాయంత్రము కావచ్చును. రథయాత్ర ప్రారంభము అయి రథములు నడవక పోయినట్లయిన అది సృష్టికే అమంగళకరము. ఒక్క ఆదుగయినను రథములను నేడు

నడిపించక తప్పదు. అందువలన రామచంద్ర దేవ్ తమ విధులను త్వరత్వరగ నిర్వహిస్తున్నారు ఘటు ఆరీ, భండార్ మేకాప్‌లు రజిత ఘటముల నుండి చందన జలమును తిని శుక్ల పుష్పములపైన ప్రోక్షణ చేస్తున్నప్పుడు పుష్పములు జఒకణములు గూడ గాలికి కొట్టుకొని పోయి రథముల వెలుపల పడుతున్నవి. తుఫాను వేగము, నెమ్మనెమ్మదిగా పెరుగుతున్నది. దానితో పాటే ప్రజల 'మణిమా, మహాబాహు' నినాదములు గూడ పెరగజొచ్చినవి.

రథము నలువైపులా స్వర్ణ మార్జనితో రామచంద్ర దేవ్ మార్జనము చేసి క్రిందికి దిగుచున్న సమయమందు రేగు కాయలంతటి వర్షపు చినుకులు పడ నారంభించినవి. దర్శనీయమైన విధులన్నియు సమాప్తమయినవి, కాని ఇంక రథమును లాగవలసిన ముఖ్య కార్యక్రమము మాత్రము మిగిలి యున్నది. వర్షమునుండి తప్పించుకొనుటకు పంచకోశ యాత్రికులు ఇటునటు పరుగిడ జొచ్చినారు. రథదాండ్‌పైన వర్షపు మేఘములు సంజ చీకటులను మరింత పెంచ సాగినవి. వర్షపాతము, మేఘగర్జనలు, ప్రజాకోలాహలము, వాద్యధ్వనులు, అన్నీ కలసి ఒకవిధమైన ఏకాకార ధ్వనిని సృష్టించినవి.

రామచంద్ర దేవ్ వర్షములో తడుస్తూ బడ్ దాండ్ పైన నిలబడి రథముల అశ్వముల, సారథుల అలంకరణమును తిలకించసాగినారు.

శ్రీ గుండిచానాడు రథములు కదలక పోయిన యెడల అది పరమేశ్వరుని కపటముగను, కూట కౌశలముగను భావించ బడుతుంది. అంతేకాదు, యవనుడైన రామచంద్ర దేవ్ రథము మీది విధులను నిర్వర్తించినారు గనక జగన్నాథ రథము కదల లేదని కూడ అభివర్తించబడుతుంది రామచంద్ర దేవుని విరోధులు ఆ విధముగ అవకాశమును తప్పక వినియోగించు కొన గలరు. నేడు రథము కదలక పోయిన యెడల వేలకొలది భక్తులు నిర్జలోప వాసము చేయవలసి వస్తుంది. రామచంద్ర దేవ్ అంత వరకు పునరుద్ధరించు కొన్న ప్రతిష్ఠ మట్టిపాలు కావచ్చును. ముదిరథ్‌తో కూడ వచ్చిన సాన్ పరీచా ఆనాటికి రథములను లాగవలసిన ఆవసరము లేదనీ, మరునాటి ఉదయము

లాగ వచ్చుననీ ఆజ్ఞాపించవలసినదిగ రామచంద్ర దేవుని ప్రార్థించి నప్పుడు వారు "... కాదు, కాదు... ... ... కనీసము ఒక్క అడుగైనను నేడు రథములు ముందుకు కదలి తీర వలయును". అని సంక్షేపముగ జవాబిచ్చినారు.

జగన్నాథ రథము మీద నుండి నిచ్చెనను సేవకులు తీసివేసినారు. అశ్వముల, అశ్వసారథుల అలంకరణము పూర్తయినది. 'కాల్ భైరి ఆ'లు 'హా హూ' అంటూ నడుములు బిగించి, బలభద్రస్వామివారి రథమునకు గట్టిన మోకును పట్టుకొని రథమును లాగుటకు సిద్ధమయినారు. వాద్యముల మ్రోతకు ప్రళయ భయంకర మేఘగర్జనలు శాంతించినవి.

"జయ్! జగన్నాథ్‌కీ జై!" అన్న జయ జయ ధ్వానములతో వర్ష మేఘ గర్జనల మధ్య రథములు ముందుకు సాగినవి.

ఆది జగన్నాథుని నందిఘోష రథయాత్ర కాదు, అది అపరాజేయమైన ఉత్కళ జాతి యొక్క అనంత జైత్ర యాత్ర.

వైరాహత శ్వానము వలె అనీన్‌చంద్ అక్కడ నుండి తన వసతి గృహమునకు మరలిపోయినాడు.

— —

తొమ్మిదవ అధ్యాయము

I

దక్షిణమున కందానదీ ముఖద్వారమునుండి ఉత్తరమున మాణిక్ పాటణా వరకు చిలికాసరస్సుకు సముద్రముకు మధ్య తండాకినార్ యొక్క అంతము లేని ఎడారి ఇసుక ప్రాంతము ఒక చేతనా. రహితమైన అజగరము నిద్రిస్తున్నట్లు ఉన్నది. దానికి ఇరు ప్రక్కలను వట్టి వేళ్ళ గుబుళ్ళు, కొద్దిగ కచ్చూరపు మొక్కలు, సరివి చెట్లు, తాడి చెట్లు గాలికి తలలు ఊపుతున్నవి. రాజా పురుషోత్తమ దేవుని మాన రక్షణకు గాను ఒకప్పుడు జగన్నాథుడు, బలభద్రుడు తెలుపు, నలుపు గుర్రములైన ఈ తండా కినార్ మీదుగా కాంచీ విజయమునకు ప్రయాణము చేసినారు.

ఆ ఇసుకను సర్దేయీ గుప్పిట తీసికొని నొసటను అద్దుకొన్నది. ఆమె యొక్క క్లాంత మనస్సుకు శరీరమునకు ఆ తడి ఇసుక యొక్క కర్పూర సదృశమైన శీతల స్పర్శ హాయిని కలుగజేసినది.

మండుటెండలో తపించి పోయిన నాటి నిర్జన మధ్యాహ్న సమయము, మాల్‌కుదాలో తన అత్తవారి ఇల్లు, యింటిముందు రోడ్డుమీద నిలుచున్న ఖోర్ధా రాజా వారి మూర్తి, నీళ్ళ కొరకు ఆకులపాటు చెందిన ఆయన ప్రార్థన. ఈ దృశ్యము లన్నియు ఆమె నిశ్చల నేత్రముల ముందు తేలియాడినవి. తన ఎడమ భుజముపైన మొగల్ సైనికుని బల్లెపు పోటువలన కలిగిన మచ్చను ఆమె చూసుకొన్నది. గాయము మానినను దాని మచ్చ మాత్రము స్పష్టముగ శాశ్వతముగ నిలిచిపోయినది. అది ఆనందావేదనల సమ్మిశిత స్మృతి.

నిర్జన తండా కినార్ పైన సముద్రపు గాలి అలసి సొలసి వీస్తున్నది. గుంపులు గుంపులుగ కొంగలు, హంసలు, నీటి కాకులు, జలపాదసములు చప చప మంటూ ఒకసారి చిలికా సరస్సులోని నీల జలములు మీదకి దిగుతూ, వేరొక సారి గగన మండలములోనికి ఎగురుతూ కన్నులకు విందు ఒన గూరుస్తున్నవి. సరస్సు ఒడ్డున మౌన యోగులవలె ఏరా పత్తులు ముక్కులు వేలాడ వేసికొని గుంపులు గుంపులుగ కూర్చున్నవి. ఆవి తమ రంగుల రెక్కలను విదిలిస్తూ ఐద్ధకము తీర్చుకొంటునట్లుగా ఉన్నవి.

దక్షిణ దిశనుండి వచ్చిన ఒక యాత్రిక దళము చీమల బారులవలె ఇదే తండా కినార్ మీదుగా కొద్దిరోజుల క్రితమే వెళ్ళింది. ఆ యాత్రికులలో ఒకడు అక్కడ ఒక నిర్జనమైన సరివిచెట్టు క్రింద మహామారి వలన చనిపోయినాడు. అతని శవమును గ్రద్దలు పొడిచి పొడిచి తిన్నవి. శేషించిన కంకాళము పైన ఇసుక ఎగిరి వచ్చి ప్రోగయినది. సగము కంకాళమే ఇవ్వుడు కనిపిస్తున్నది. మరికొద్ది దినములలో అది పూర్తిగ కప్పుపడిపోయి గుర్తులేకుండ పోగలదు. ఆ అపరిచిత తీర్థయాత్రికుని కొరకు ఆ ఒంటరి సరివిచెట్టు మాత్రమే విచ్చి దానివలె తల బాదుకొంటూ ఏడుస్తూ, నిట్టూరుస్తూ ఉంటుంది. ఆ తరువాత ఆ అనామకుని సమాధివైన నామరహితమైన లతలు, మొక్కలు వెలిగిపోయి, దానిని మరుగుపరస్తవి.

ఒక ఆకథనీయమైన నిస్సంగత్వము మరియు అనాగత మృత్యుభయ మతో సర్దేయీ తనలో తానే ఆర్తనాదము చేసినది. మధ్యాహ్న సమయమందు చెట్టుకొమ్మ పైన కూర్చున్న ఒక నిర్లిప్త కపోతమువలె ఆమె 'జగుసీ..ఓరే... జగుసీ...'అని విలపించినది.

మర్మ భేదకమయిన ఈ సర్దేయీ విలుపు సముద్రపు గాలిలో ఎగిరి పోయి నీల ధూసర వర్ణ మిశ్రితమైన చిలకా సరస్సు ఒడిలో ప్రాలినది.

జగుని ఉదయమునకే ఒక నావను తీసికొని చిలికా సరస్సు లోనికి వెళ్ళినాడు. మధ్యాహ్నమయినది. జాలర్లు సరస్సు నుండి తిరిగి వచ్చుటకు

ఇంకా వేళ కాలేదు. సత్రములో యాత్రికులు ఎవరూ లేరు. బాహుడా యాత్రను చూసి పూరీ నుండి తిరిగి వచ్చే యాత్రికులు ఇక్కడ నుండే చిలికా గర్భమందున్న మఱిసా బ్రహ్మపుర్ ద్వీపమునకు వెళ్లు చుందురు. ఒకప్పుడు మొగల్ దాడుల కారణముగ శ్రీ జగన్నాథుడు ఈ ద్వీపములోనే ఆత్మగోపనము చేసికొన్నాడు. లతా గుల్మవేష్టితమైన ఏ అడవిలో ఏ స్థలమందు జగన్నాథుడు పూజితుడయినాడో ఆది ఇప్పుడు కూడా ఉన్నది. ఆ శూన్య స్థలమందు నేటికీ పూజలు జరుగుతున్నవి. ఆక్కడ ఉన్న రస్కూడా గ్రామములో అనేక పండా కుటుంబములు నివసిస్తున్నవి. అంధారీ పరగణాలో వ్యవసాయము చేసికొని వారిని జీవించమని భోర్దారాజావారు వారికి భూములను దానము చేసినారు. బాహుడాను చూసి తిరిగి వచ్చే యాత్రికులతో కొన్ని ఘడియలపాటు ఈ నిర్జన తండాకినార్ కళకళలాడుతూ ఉంటుంది. సత్రపు రాబడి ఆ సమయములో పెరుగుతుంది. ఆ సమయములో గతమును నెమరు వేసుకొంటూ శీతల నిట్టూర్పులు విడచుటకు సర్దేయీకి సమయము దొరకదు. కాని ఇప్పుడంతా జనశూన్యము గాను, సముద్ర ప్రాంతరమందలి నిర్జన సభిలోసి "చేంచేఖఆ" విలాపము వలె శ్రీ హీనముగాను ఉన్నది.

"ఎటువంటి జీవితమిది: అనేకమైన ఆశలు, నిట్టూర్పులు. యాతనలు: ఈ నిర్జన బాలుకా ప్రాంతరములో నామరహితమైన రంగు రంగుల పూలవలె మనస్సులో ఏకాంత స్మృతులు ...కొన్ని వాసన గలవి, కొన్ని ముళ్లు గలవి: ఆ పూలను సేకరించ బోయినచో ఒక్కొక్కటి చొప్పున రేకులు రాలిపోతూ ఉంటాయి ఏమిటి జీవితము: " అని సర్దేయీ తనలోతానే ప్రశ్నించుకొన్నది.

సర్దేయీ మనస్సంతా చింతాకుల మైనది. ఎటువంటి దురదృష్ట వంతురాలు ఆమె: సుదూర ప్రాంతముల నుండి కూడ భక్తులు కాలిఆ ఠాకుర్‌ను చూసి జీవితములో ముక్తిని పొందవలెనది ఆశిస్తున్నారు. కాని ఇంత చేరువలో ఉండికూడ పతిత పావనుడైన చకాడోలాను ఆ అభాగ్యురాలు దర్శించలేక పోతున్నది సాత్‌పడా పూట్ తాలూకు కరంజపు తోట ఎదురుగ కనబడుతున్నది.

అక్కడనుండి నడచి వెళ్ళితే ఒక పూటలో పూరీ చేరవచ్చును, అంతగా అయితే ఒక రోజులో చేరవచ్చును. "సర్దేయీ! బయలుదేరు, నిన్ను రసకుదానుండి హర్ చండీ నది మార్గమున పూరీ నరేంద్ర పోఖరీకి నావలో తీసికొని వెళతాను" అని ఆనాడు జగునీ అన్నాడు.

మొగల్ విద్రోహములు సంభవించునప్పుడు రాకుర్ ఈ మార్గమునే చిలికా ప్రాంతమును చేరుకొంటూ ఉంటాడు.

కాని ఆయన కనుక సూత్రమును లాగక పోయినట్లయిన ఈ సంసారపు టడవులను వదలి వెళ్ళడము సంభవమా? అందుచేతనే సర్దేయీ ప్రతి సంవత్సరము పూరీ వెళ్ళవలెననుకొంటూ కూడ వెళ్ళలేక పోతున్నది. ఆమె ఏమి వెళ్ళగలదు? సర్దేయీకి జ్ఞప్తికి వచ్చినది. సంఘదృష్టిలో నేడామె యవనభోగ్య, పతితురాలు. అందుచేతనే బాలాగావ్‌లో ఆమెకు స్థానము లేకుండ పోయినది. అటువంటప్పుడు రత్నవేదిక దిగువను నిలబడి జగన్నాథుని కంటినిండా చూడగల అర్హత ఉన్నదా? "జగునీ! ...జగునీ...ఓ జగునీ!" అని సర్దేయీ మరల పిలువ నారంభించినది.

అంతవరకు ఏ సరివిచెట్టు పైననో నిద్రపోయిన సముద్రపు గాలి ఆ పిలుపుకు మేల్కొని ఆ పిలుపు చిలికా సరస్సులోని దూర దూరములకు తీసికొని పోయినది.

రసకుదా గ్రామము కూతవేటు దూరములోనే ఉన్నది. ఆ గ్రామములో కొంతతుంది నోలియాలు, కందరాలు, ఖండాయతులు, బ్రాహ్మణులు నివసిస్తున్నారు. పున్నాగ, సరివి చెట్ల గుబురులలోని చీకటివలె పూరిండ్ల రసకుదా గ్రామము పడి ఉన్నది.

రసకుదా గ్రామము వెలుపల 'కంచన్ ధనా ఘర్' ఉన్నది. తండా కినార్ చుట్టూ అటువంటి ఇండ్లు చాలా ఉన్నవి. దక్షిణాది నుండి వచ్చే యాత్రికులు, సాధువులైన నావికా వర్తకులు అక్కడ బసచేస్తూ ఉంటారు. కంచన్ బాయి అనే ఒక దేవదాసి, దుర్గమ మార్గముల నుండి నడచివచ్చే జగ

న్నాథ యాత్రికుల సౌకర్యము కొరకు తన సంపాదనతో ఈ యిండ్లను కట్టించి నది ఈ రాతి యిండ్లు ఇప్పుడు బందిపోటు దొంగలకు, పాశ్చాత్య నావికులకు నివాసస్థలము లైనవి. కొద్ది దూరములో మరొక ''ధవాఘర్'' ఉన్నది. సముద్రపు గాలివలన ఇసుక దిబ్బలు ఏర్పడి, వర్షము వలన నాచుపట్టి అదొక భూత గృహము వలె తయారయినది. బాలూగావ్‌నుండి ఇక్కడకు వచ్చిన సర్దేయా తన క్రొత్త సత్రమును ఈ గృహములోనే ప్రారంభించినది. ఈ గృహమునకు "కంచన్ బాయి ధవా" అన్న పేరు కాల క్రమేణా అంతరించి 'రసకుదా సత్రము' అన్న పేరు వచ్చినది. ఆ ఇంటి పశ్చిమ వసారాలో కూర్చుని, వాడిన మనస్సుతో, శూన్యదృష్టితో సర్దేయా చిలికా సరస్సును తిలకిస్తున్నది.

జలసారసములు, కాదంబవలు, చక్రవాకములు, గుంపులు గుంపులుగ మంటశిలవైపుకు ఎగిరి వెళ్తున్నవి. ఏ సారసమో ఆ ఇంటివైపుకు దేనికొరకో వచ్చి, ఆది దొరకకపోవుటన తిరిగి సముద్రము వైపుకు ఎగిరి పోతున్నది.

ఏదో ఒక నావ ఒడ్డు చేరుతున్నది. "జగునీ, ఓరే జగునీ!" అని సర్దేయా తిరిగి తిరిగి పిలువనారంభించినది.

కాని ఆ నావలో రసకుదా బ్రాహ్మణ పూజారి తలమీద తాటి ఆకు గిడుగు వేసికొని నావ సడపు కొంటూ వస్తున్నాడు. తన వంతు ప్రకారము మడసా - బ్రహ్మపుర్ గ్రామ ద్వీపములో జగన్నాథ శూన్యస్థలము వద్ద దీపారాధన చేసి వస్తున్నాడు.

సర్దేయా మరల తన ఆలోచనలో నిమగ్నురాలైనది.

ఆకాశము మేఘావృతమైనది. కాని ఆ మేఘపు నీడలో చల్లదనము లేదు. ధూసర ధూమ్ర వర్ణముల మేఘములతో ఆకాశము కప్పబడి ఉన్నది.

సూర్యకిరణముల స్వర్ణిమ రేఖలు మేఘములలో నుండి చల్లని నిప్పును వర్షిస్తున్నట్టు ఉన్నది.

ఆకాశము నిర్మలముగా నున్నప్పుడు చిలికా సరస్సుకు ఆవలి ఒడ్డున నున్న కొండలు స్పష్టముగ కనిపిస్తవి. ఆ అగాధ చిలికా సముద్రమునకు ఆవల అస్పష్టమైన స్మృతి తెరవలె ఆ కొండల పద్దనే బాలూ గ్రామము ఉన్నది. తన నిరర్థకమైన జీవితములోని కొన్ని సంవత్సరములను సుఖ దుఃఖములతో ఆమె అక్కడనే గడపినది. "అయ్యో! బ్రహ్మదేవుడా! ఎందుటాకు వలె అక్కడకు ఇక్కడకు ఎగిరిపోతూ జీవించమని నా లలాటము పైన లిఖించి నావా తండ్రీ!" అంటూ ఆమె దుఃఖాశ్రువులను రాల్చింది.

బాలూ గ్రామములోని తన జీవితపు ఏషాడకర ఘడియలను తన స్మృతి పథమునుండి ఎంతోదూరముగ నెట్టివేయవలెనని ఆమె ప్రయత్నిస్తున్న కొలది అవి చిలికా సముద్ర తరంగములవలె తిరిగి ఆమెనే చేరుకొంటున్నవి. వేదనా పీడితమైన ఆమె హృదయమును విదీర్ణము చేసి, ఆమెను అణువణువునా బాధించి, పీల్చి పిప్పి చేయడమే వాటిపని.

ఏ వేదనా పూరితమైన స్మృతిని మరచి పోవలెనని ఆమె ప్రయత్నిస్తున్నదో అది తృప్తి చెందని జలసౌరసమువలె రెక్కలాడించు కొంటూ మరల మరల ఆమె వద్దకే చేరుతున్నది.

ఆ బాలూ గ్రామ సత్రము వసారాలో సర్దేయీ అలసిపోయినట్లుగ కాళ్ళు చాచుకొని ఎవరి కొరకో నిరీక్షిస్తున్నట్లుగ కూర్చుంటూ ఉండేది తన సత్రము నుంచి వెళ్ళే వంకర టింకర కాలిబాట చిక్కాలి రఘునాథపురము మార్గమును కలుస్తుంది. ఆ కూడలివద్దనే పొండి భంగా వటవృక్షమున్నది. దాని ప్రక్కనే ఉన్నది చిన్న చెరువు. దానికి కొద్ది దూరములో ఒక తాడి చెట్టు ఉన్నది. ప్రతిరోజు, ప్రతిఘడియ, తనకు కనబడే ఆ దృశ్యమును తన ఏకాంత ఘడియలలో పునరావృత్తము చేసికొంటూ, దానిలోనుండి ఒక క్రొత్త అర్థమును, ఒక క్రొత్త రహస్యమును కనుగొనుటకు, ఆమె ప్రయత్నిస్తూ ఉండేది. మధ్యమధ్య ప్రలాపిస్తున్నట్లుగ "జగునీ...ఓరే...జగునీ" అని ఆమె పిలిచేది.

సత్రములో ఎవరైన యాత్రితులు బస చేసియున్నప్పుడు సర్దేయికి ఈ బాధాకరమైన, అర్థ రహితమైన నిరీక్షణ ఉండేదికాదు. చంకను కుండనిడు కొని, నడుమును ఆడించుకొంటూ నీళ్ళు తెచ్చుటకు చెరువుకు ఆమె పోతూ ఉండేది.

తరుణ లేక ప్రౌఢ వయస్సులో నున్న యాత్రికు లెవరైనను అకారణ తృష్ణాపీడితులై యుంటే వారు సర్దేయీ వెనుకనే ఆ చెరువు పద్దనున్న హాండి థంగా వృక్ష ఏకాంత ఛాయపద్దకు చేరుకొనేవారు. సర్దేయీ వెళుతూ వెళుతూ వెనుదిరిగి ఆ వస్తున్న ఆతుర పథికుని చూసినట్లయితే అతడు ఆమె కండ్లలోని సిగ్గుతోగూడిన ఆహ్వానమును చూడగలిగేవాడు. ఆమె చెరువులో కుండను ముంచి దానిని నీళ్ళతో పైకెత్తుతున్న సమయమందు ఆమె ఊరువులలో, విరుదలలో, బాహు మూలంలో, వక్షోజములలో ఆ ఆహ్వానము తరంగా యుత మగుచుండేది. ఆతురుడైన ఆ అతిథి చేరువనుండి తదేక దృష్టితో చూచుటకు గాని కుండలోని నీటికొరకు చేయి చాచుటకు గాని ముందుగనే ఆమె "జగునీ !...ఓరే జగునీ..." అని కేక వేసి రసభంగము చేసేది.

ఆ సమయములో జగుని ఎక్కడ ఉండెడి వాడో ఎవరికి తెలుసును ? ఒక్కొక్క సారి ఏ పొదల చాటునుండో అతడు అక్కడకు ఊడిపడుతూ ఉండేవాడు. ఒక్కొక్క సారి "దేయీ ! నన్ను రమ్మంటున్నావా ?" అని అక్కడనుండే అరుస్తూ ఉండేవాడు.

జగుని ఆకస్మిక ఆగమనముతో అతిథి ఆశలు కలలుగా కరగి పోయేవి. అతని తృష్ణ మృగతృష్ణ అయ్యేది.

పరిచితులైన అతిథులకు తెలుసు, సర్దేయీకి అస్వీకృతి లేదు కాని అసమ్మతి ఉన్నదని. గాలికి కంపిస్తున్న పద్మములోని మకరందము కొరకు ఎగురుచున్న తుమ్మెద పద్మ హృదయాన్ని వెదకునట్లు ఈ సర్దేయీ వెనుక ఆమె హృదయమును వెదకుచూ వెళ్ళడము వృథాశ్రమ అని రసిక

ప్రియులు అంటూ ఉండేవారు. కంపిస్తున్న పద్మములో భ్రమరానికై అన్వేషణ లేదు. అది ప్రీడా విధూతమైన భయము కావచ్చును, లేదా అసమ్మతి కూడ కావచ్చును. ఏదైనను రెండింటి పరిణామము ఒకే విధముగా ఉంటుంది. దాని వలన మధువుకొరకుండిన భ్రమరము యొక్క దాహము తీరదు. సర్దేయాని లొంగదీసుకొన వలెనని చాలామంది రసికులు ప్రయత్నించి విఫలులైనారు.

అప్పుడప్పుడు నిర్జన రాత్రిపూటలందు నిద్రపోయే సమయములో సర్దేయా ఆత్మ పరీక్ష చేసికొనుచుండేది. అపరిచిత అతిథుల యెడల ఆమెకు తపనలేదు. కాని భయమున్నది. కాని అది కుంఠితమని చెప్పుటకు వీలులేదు. ఏ అపరిచిత పథికుడైన ఆమెను బలాత్కరించి, ఆమె యొక్క సిగ్గును సంకోచమును తన క్షుధిత హస్తములతో బలాత్కారముగ తొలగించి, ఆమెను దోచుకొనుటకు ప్రయత్నించు నపుడు కూడ అతనిని ఆమె ప్రతిఘటించదా? బహుశా ప్రతిఘటించక పోవచ్చును. అయితే అటువంటి రసమయ ముహూర్తములలో అకారణముగా "జగునీ, జగునీ!" అని పిలిచి ఆమె ఎందుకు రసభంగము చేస్తున్నది? ఆ పథికుని హృదయాకుల ఉత్కంఠను మరింత పెంచుటకు కాదు కదా? ఏది ఏమైనప్పటికి నిష్ఠురముగ రసభంగము గావించుకొంటూ ఒక అనాస్వాదిత వేపథువు యొక్క రోమాంచమును ఆమె నిశ్చయముగ అనుభవిస్తున్నది.

మొగల్ సైనికుడు ఒకడు గుర్రముపైని చికాకోల్ నుండి కటక్ వెళుతూ సర్దేయా సత్రములో ఒకనాడు బసచేసినాడు. నిర్జన మధ్యాహ్న సమయమది. చైత్రమాసపు గాలి ఆది ఆది బహుళా అలసిపోయి క్రొత్తగ పుష్పించిన మోదుగు, బూరుగు చెట్లపైన క్షణమాత్రము విశ్రమిస్తున్నదా అన్నట్లుగా ఉన్నది. గదచిన స్మృతులవలె హాండిభంగా వటవృక్షముపైనుండి పండు టాకులు రాలిపోతున్నవి. ఆనాడు సర్దేయా కుండలో ఒక్క నీటిబొట్టు కూడ లేదు. కాని చెరువుకు వెళ్ళి నీరు తెచ్చుటకు ఆమెకు ఎందువల్లనో మనస్కరించుటలేదు. ఆ సైనికుని చూసిన తరువాత ఆమె హృదయము ఎందువల్లనో ఒక అవ్యక్త భయముతో నిండిపోయినది.

ఆనాడు నీరు తెమ్మటకు ఆ వంకరటింకర కాలిబాట వైని చెరువుకు వెళ్తూండిన సమయములో ఇతర రోజులలోవలె స్వప్నావిష్ట తంద్రాలసతలో ఆమె కాళ్ళు మార్గమధ్యములో ఆగుటకాని, ఆమెలో వెనుదిరిగి చూసే సాహసము కాని లేవు. అయినప్పటికిని తనకు తెలియకుండగనే తన వెనుక నే గుర్రముపైని వచ్చుచుండిన సైనికుని చూచుట తటస్థించినవి. భయముతో ఆమె కంపించి పోయినది. ఇతర రోజులలో అయితే ఆమె తన ఒనికత్వమును ప్రదర్శించి జగునిని పిలిచి ఉండెడిది. కాని ఆనాడు ఠనికత్వమునకు బదులు ఆమె పిలుపులో ఆర్తనాదము వినిపించినది. వేటగాని బాణముల వలె ఆ సైనికుని నేత్రములు ఆమెను వెంబడిస్తున్నట్లుగ ఉండినవి. పులిని చూసిన లేడివలె ఆమె ఆర్తితో అరవసాగినది. పెరుగుచుండిన ఆమె అరుపులతో బాటు సైనికునిలో పశుకాంక్ష పెరగసాగినవి.

ఆమె మేలి ముసుగును సవరించుకొని సైనికునికి దారి వదలినది. ఆ నాడు కూడ జగుని తనతోగూడ వచ్చియున్నట్టయిన...కాని ఆనాటి అదృష్టము వేరొక విధముగ నున్నది. తన నల్లని గుర్రమును గాలిలో ఉరికించుకొనుచు వచ్చి సర్దేయా ఎద్ద ఆగినాడు. హఠాత్తుగ కళ్ళెమును బిగించుట వలన గుర్రము కోపముతో సకిలించినది. తన దంతములతో ఆ కళ్ళెమును ముక్క ముక్కలు చేయగలిగి ఉన్నయెడల ఆ గుర్రము శాంతించి ఉండేదేమో.

సర్దేయా వెంటనే "జగునీ! ఓరే జగునీ" అని అరచినది. కాని జగుని ఆ ప్రాంతములలో ఎక్కడా లేడు. మామూలుగా పిలిచిన వెంటనే జగుని వచ్చి సర్దేయా ఎదుట వ్రాలేవాడు. కాని ఆనాడు సర్దేయా పిలుపు అతనికి వినిపించి నట్టులేదు.

తన ఎదుటను గుర్రముపైన ఆ సైనికుని చూసి సర్దేయా శిలా ప్రతిమ అయినది. వాడు చికాకోల్ ఫౌజ్‌దార్ సైనికుడు అని ఆమెకు తెలియును. అటువంటి వాని చేతులలో నుండి తప్పించు కొనడము సులువుకాదు. అసలు, వానికి సత్రములో చోటు తాను ఎందుకిచ్చినట్లు? ...ఇప్పుడు ఆమె ఏమి చేయగలదు?

మొగలీ సైనికుని కన్నెత్తి చూచుటకు ఆమెలో సాహసము లేదు. తన మేలి ముసుగును మరింత క్రిందకు లాగుకొనదములో చెయిజారి కుండ క్రింద పడి ముక్కలైనది.

సైనికుడు సర్దేయా అసహాయ స్థితిని కనిపెట్టి, పెద్దపెట్టున నవ్వుచూ, తన కత్తితో ఆమె మేలిముసుగును తొలగించినాడు. శల మీదినుండి ఎర్ర చీర చెరగు తొలగినంతనే సర్దేయా ముఖము వాడిన కమలము వలె ముడుచుకొని పోయినది. అమె విశాల నేత్రములు అపరిచిత అతిథిని చూచినపుడు సాధారణముగా ఉజ్జ్వల ప్రసన్నతతో ప్రకాశించెడివి కాని ఆనాడు ఆ నేత్రములు భయసందేహములతో శిరమందలి పద్మమువలె ముకుళించు కొన్నవి. ఆమె నొసటి మీద స్వేద బిందువులు ముత్యములవలె మెరయ జొచ్చినవి.

సర్దేయాయొక్క ఆ భయార్తమైన, వ్రీడాలాంఛితమైన సహాయ, రహిత మైన మూర్తి సైనికునిలో నిద్రాణమైయున్న కామ వాంఛను రేకేత్తించినది. అతడు గుర్రము మీదినుండి వంగి ఆమెను తన బాహువులలో ఇరికించుకొని గుర్రముపైకి ఎత్తినాడు. వెనువెంటనే చేరువలోనున్న అడవిలోనికి ఆమెతో గూడ అదృశ్యమైనాడు. సరిగా అదే సమయములో జగుని విల్లునుండి వెలువడిన అమ్మ ఒకటి ఒక బూరుగు చెట్టునకు గ్రుచ్చుకొని నిష్ఫల క్రోధముతో కంపిస్తూ ఉండిపోయినది.

ఆ మలిన స్మృతి సర్దేయా శరీరమున నేటికి కూడ పంకిలయుతము చేస్తున్నది. ఆ ఏకట స్మృతి యొక్క విషజ్వాల వలన సర్దేయా మనస్సు వికలమయి పోతున్నది. ఆమె ఆ స్మృతిని ఎంత దూరముగ నెట్టివేయవలెనని ప్రయత్నిస్తున్నదో అది అంత చేరువగ ఆమెపద్దకు వస్తున్నది.

ఆ అడవిలో ఒక మద్దిచెట్టు వద్ద తెల్లని పూలతో శోభిల్లుతున్న ఒక దట్టమైన పొదరిల్లు ఉన్నది. నగ్న ప్రాయమయిన సర్దేయా శరీరమును తన బాహువులలో ఇరికించుకొని వచ్చి ఆ సైనికుడు ఆ పొదగింటి వద్ద క్రిందకు దూకినాడు. అనావృతమైన తన వక్షమును తన హస్తములతో మరగు పరచు

కొనుటకు ఆమె విఫల ప్రయత్నము చేస్తున్నది. అందుకు ఆ సైనికుడు వికట ముగ నవ్వసాగినాడు. అర్ధమృతప్రాయమైన సర్దేయా కంపిస్తూ నేలపైని పడిపోయినది

లజ్జా, భయ సంకోచములతో కృంగిపోయిన సర్దేయాకి ఆ సమయములో ఆ దుష్టుని ప్రతిఘటించగల మానసిక శక్తి క్షీణించినది. సత్రము వద్దనుండి ఒక అసహాయురాలైన అబలయొక్క ఆనావృత శరీరమును చంక నిడుకొని గుర్రముమీద తీసికొని రావడములో అధికోత్తేజము వలన సైనికుడలోని అకలి గొన్న యౌవ్వనపు పొంగు అణగారి పోయినది. సర్దేయా అతనిని ప్రతిఘటించి ఉండిననూ, ఆడపులివలె అతని మీదకు ఉరికి అతనిని కొట్టుటకు ప్రయత్నించి యుండిననూ అతనిలో కామవాంఛ కూడ రెచ్చిపోయి బహుశా హింసాత్మక రూపమును ధరించి యుండెడిదేమో. కాని ఆ విధముగ జరుగలేదు. ఏ విధము గను సర్దేయా నిరోధించకుండ అతనికి ఆత్మ సమర్పణము గావించుకొన్నందు వలనను, జడపిండమువలె పడియుండుట వలనను బహుశా ఆ సైనికుడు నిర్వీర్యుడు, నిర్వేదగ్రస్తుడు అయి యుండవచ్చును. ఆ సమయములో ఆమె చైతన్య రహిత అయినది.

ఒకానొక అహేతుకమైన జిజ్ఞాసతో, భూలుంఠితమైన సర్దేయా నగ్న శరీరమును ఆ మొగల్ సైనికుడు కాలితో తన్ని, గుర్రముపై నెక్కి దౌడు తీసి వెళ్ళి పోయినాడు.

ప్రొద్దు గ్రుంకిన తరువాత గాని సర్దేయాకి స్పృహ రాలేదు.

చైత్ర మాసపు శీతల వాయువులో కంపించుచుండిన ఆకుల ధ్వనితో వనస్థలి అంతయు ముఖరితమైనది. పిచ్చిదానివలె సర్దేయా తన చీరనైనా సరిచేసికొనకుండ సత్రమును చేరుకొన్నది. జగునిని పిలుచుటకు గూడ ఆమెలో సాహసము కొరవడినది. ఆ సమయములో జగుని ఆ ప్రాంతములో లేడని తెలిసికొని ఆమె మనసులోనే ఊరట చెందినది.

కాని ఆ మరునాడే, పకాన్ సైకునికి తన శీలమును అర్పించి సర్దేయా పతితురాలైనదన్న వార్త దావానలమువలె వ్యాపించినది. ఆనాటివరకు సర్దేయాతో పోటిపడి ఓడిపోయిన యితర సత్రముల యజమానులకు ఇప్పుడు చక్కని అవకాశము లభించినది. ఈ గోరంత వార్తను కొండంత చేసి వారు ప్రచారము చేయ మొదలిడినారు. యవనభోగ్య ఆయి, సర్దేయా పతితురాలై నది. ఆమె చేతి నీరు ముట్టుకొనడమే మహాపాతకము. సర్దేయా వలన నిరాశ చెందిన బాలూ గ్రామములోని వారంపరు కూడ తమ దుష్ప్రచారమును ప్రారంభించినారు. హాండిభంగా పట్, పోఖరీ, దానికి వెళ్ళే కాలిబాట వరకు ఆన్నీకూడ ఆమెకు దుర్గమము అయినవి. ఇండ్ల ద్వారములు ఆమెకు అవరుద్ధ మయినవి. ఆమె యవనభోగ్య అయినది. అందువలన యాత్రికుల రాకపోకలు క్రమముగా నిలిచి పోయినవి.

ఆ పరిస్థితులలో "మనము ఇక్కడనుండి ఎక్కడికైనా వెళ్ళి పోదాము, దేయీ!" అని జగుని సలహా ఇచ్చినాడు. కాని ఎక్కడికి అని కూడ సర్దేయీ అతనిని అడగలేక పోయినది.

చివరకు ఒకనాడు తన సంసార అవశేషములను, తన నిందిత నారీ త్వపు విడంబనను తీసికొని జగునితో గూడ సర్దేయీ బాలూ గ్రామమును విడిచి వెళ్ళినది.

మరి కొద్దినాళ్ళ తరువాత ఈ తండా కినార్‌లో తన క్రొత్త సత్రమును ఆమె తెరచినది. ఇక్కడి నివాసులకు గాని, బాటసారులకు గాని ఆమెయొక్క విడంబిత ఇతిహాసము తెలియుటకు అవకాశము లేదు. తండాకినార్‌లో ప్రతి చోటను అనేక సత్రము లున్నవి. వాటిలో సర్దేయీది కూడ ఒకటి.

పక్షి సమూహము ఒకటి రెక్కలాడించకొంటూ వచ్చి చిలికా సరస్సు వరకూ ఉన్న తన చరణ భూమిమీద వ్రాలినది.

ఒక నావమీద జగుని ఒడ్డుకు చేరుకొంటున్నాడు. అనేక జల సారస ములు అతని తలపైన ప్రదక్షిణలు చేస్తున్నట్టుగా ఎగురుతున్నవి.

అతనితో పాటు మరిద్దరు మనుష్యులు ఉన్నారు. వారు ఎవరో ఎవరికీ తెలుసు? వారు ఆక్కడి స్థానికులవలె లేరు. ఆ నావలోనుండి దిగివారు రస్కుదా గ్రామమువైపు నడిచి వెళ్ళినారు. వారు చేరువ అవడముతో ఏరా పక్షులు రెక్కలను మాత్రము చాపినవిగాని ఎగురలేదు. సర్దేయా తన అలవాటు ప్రకారము 'జగుసీ!...జగుసీ' అని పిలిచినది. కాని జగుని పలకలేదు.

భుజములమీద వలను వేసికొని, చేతులలో చేపలను పట్టుకొని తల వంచుకొని విదారగ్రస్తుని వలె ఏస్తున్నాడు. అతనిని చూసి, "నువ్వు ఎక్కడకు వెళ్ళినావురా, జగుసీ? నీకోసము ఎదురుచూసే సరికి ప్రొద్దుగ్రుంకినది" అని సర్దేయా అన్నది.

జగుని ఏమీ మాట్లాడకుండా రెండు చేపలను క్రింద పెట్టినాడు. వాటిని చూసి ఆదరిపడి "అరే! ఇవి కుండల్ మత్స్యములు. ఈ చేపలు చిలికా సరస్సులో చనిపోతే దేశముకో కరువువస్తుంది " అని సర్దేయా అన్నది.

దానికి కూడా జగుని ఏమీ సమాధానము చెప్పకుండా చిలికా సరస్సు వైపు వెళుతూ ఉంటే "ఒరే! ఎక్కడికి పోతున్నావురా? తిండీ తిప్పలు లేకుండా మళ్ళీ ఎక్కడికిరా?" అని సర్దేయా కేకవేసినది.

పశ్చిమ దిశనుండి తుఫానును సూచిస్తూ గాలి వీస్తున్నది. గాలితోపాటు సర్దేయా మాటలు కూడా సముద్రము వైపుకు ఎగిరి వెళ్ళిపోయినవి.

"వారిద్దరు నేటి దినమంతా నన్ను గురుతాయినుండి బరుణ్‌కుదా, అక్కడినుండి మఉసా బ్రహ్మపుర్‌కు త్రిప్పి ప్రయాసపెట్టి, అద్దె అడిగితే రస్‌కుదా బలిప్రధాన్ ఇంటికి రమ్మనినారు. వారిద్దరు అక్కడే బసచేసినారు." అని జగుని చెప్పినాడు.

"వారు ఎవరు?" అని సర్దేయా అడిగినది.

"నా కేమి తెలుసు? చిలికా సరస్సులో ఇక్కడా అక్కడా తిరిగి ఏమి వెదకుచున్నారో నాకు తెలియలేదు. లక్ష ప్రశ్నలు వేసినను వారు నాకేమి చెప్పలేదు," అని అలసిన నీరసముతో సమాధాన మిచ్చినాడు.

వారెవరో యాత్రికులై ఉండవచ్చుననీ. మఉసా-బ్రహ్మపుర్ దీపములో జగన్నాథ స్థలము వద్ద పూజ చేయుటకు వచ్చి యుండవచ్చుననీ సర్దేయా భావించి నది. ఆ విధముగా ఎనేకమంది యాత్రికులు అక్కడకు వస్తూ ఉంటారు. అటువంటి యాత్రికులను తన పడవమీద కిరాయికి త్రిప్పడము జగునికి అలవా టయినది.

ధూళిని రేపుతున్న తుఫాను గాలిలో తన అద్దె డబ్బులను వసూలు చేసి కొనుటకు జగుని రసీకుడా గ్రామము వైపు పరుగువంటి నడకతో వెళ్ళినాడు. సర్దేయా అక్కడ కూర్చుని "త్వరగా తిరిగిరా, జగునీ, తుఫాను వచ్చేటట్లు న్నది, వేగముగా తిరిగి రా," అంటూబిగ్గరగా ఆరవనారంభించినది.

సూర్యుడు మేఘముల చాటునుండి క్షణమాత్రము ముఖము చూపించి నప్పుడు జలసారసముల రెక్కల పైని ఎవరో బుక్కాపొడిని చల్లినట్లు అనిపించి నది. 'జటి ఆనాసీ', 'ఘంట్‌శిలా' కొండలకు ఆటువైపు క్షితిజరేఖను ఆంటి బూరుగు దూది పింజలవలె మేఘములు ఎగురుచున్నవి. అవి కూడా బుక్కా రంగులో క్షణమాత్రము కనిపించినవి చిలికాసరస్సులోని సీల జలముల ఉప రితలము వైన అకస్మాత్తుగ ఒక ఎర్రని సిందూరపు రేఖ గోచరించినది. దానిని అలలు తమలో ఇముడ్చు కొనడముతో అది ఆ అగాధ జలములో ఎక్కడనో అదృశ్యమయినది.

సతములోనికి వెళ్ళుటకు సర్దేయాకి మనస్కరించలేదు. విచ్చిదానివలె వస్తున్న తుఫానును చూస్తూ ఉంటే సర్దేయాకి హాయిగా ఉన్నది. చిలికా సరస్సు ప్రాంతములోనున్న పక్షి సమూహములు భూఖండముల వైపు ఎగిరి వెళ్ళి పోతు న్నవి. తుఫాను క్రమక్రమముగ హెచ్చుతన్నది. సరిపిచెట్లు తలలాడిస్తూ నాట్యము చేస్తున్నవి.

కూతవేటు దూరమునందు తండాకినార్‌ను అడ్డముగ రెండు భాగములు చేస్తున్నట్టుగ ఒక ఇసుక సొరంగ మున్నది. అది దక్షిణము వైపుకు మలుపు తిరిగిన స్థలమందు రెండు తాడిచెట్లు కావలి కాస్తున్నట్టుగా ఉన్నవి. గాలి తాకి డికి మూసికొనిపోతున్న తనకండ్లపైన చేతిని తెరచలె అడ్డము పెట్టుకొని సర్దేయా

చూస్తున్నది. అటువైపునుండి ఒక ఆశ్వికుడు సత్రమువైపు వస్తున్నట్టు ఆమెకు కనబడినాడు. దక్షిణము వైపునుండి వచ్చే ఆశ్వికులు, ఆటు వైపు వెళ్లే ఆశ్వికులు ఆ దారినే వచ్చి వెళ్తూ ఉంటారు. కాని ప్రస్తుతము ఆ దారి మూసివేయబడినట్లున్నది. ఇప్పుడు చికాకోల్-కటక్ దారి వెంబడినే అశ్వికులు వెళ్ళుతున్నారు. మాలుద్‌లో మొగల్ ఫౌజ్‌దారు తన ఆశ్విక పదాతి దళములతో ఘాటీ స్థావరము నొక దానిని ఏర్పరచి యున్నాడు. అయినా వారుకూడ ఈ దారి వెంబడి వచ్చుట లేదు. ఆందువలన నేడు ఒక ఆశ్వికుడు ఇటు వైపు వస్తూండడము కని పెట్టి సర్దేయీ చాల భయపడినది. నేడు జగుని లేడు. బాలూ గ్రామములో ఆ హాండి భంగా వృక్షమువద్ద ఆనాడు ఆమె అనుభవించిన ఆ దుర్భరయాతనా స్మృతి ఇప్పుడు ఆమెను భయపెట్ట సాగినది.

"జగుసీ!...ఓరే...జగునీ..." అని ఆమె చాల బిగ్గరగ అరవనారంభించినది. కాని ఆమె ఆర్తనాదము ఆ తుఫాను కోలాహలములో కలిసిపోయినది.

ఇంతలో ఆ ఆశ్వికుడు సత్రమును చేరనే చేరినాడు. గాలికి అతని తలపాగ, కమీజు ఉబ్బినట్టు కన్పిస్తున్నవి. లోపలకు పోవడమా, లేక అక్కడనే ఉండడమా అనే మీమాంసలోనే సర్దేయీ ఉన్నది. ఇంతలో ఆ అశ్వికుడు ఆమె వద్దకే వచ్చినాడు.

గుర్రమును చూసినంతనే సర్దేయీ అదరి పడినది. ఆ గుర్రము కూడ నల్లగనే ఉండెను. దాని ముఖముమీద కూడ బొట్టుపలె తెల్లని మచ్చ ఉండెను. బాలూగ్రామపు హృదయ విదారక స్మృతి ఆమె మెదడులో మెరసి ఆమెను అవశురాలినిగ చేసినది. కాని ఈ ఆశ్వికుని నేత్రములలో ఆ లాలసా పూర్ణమైన ఘాతుకత్వము గోచరించుటలేదు. కాని ఇతని కండ్లు నిప్పులు చెరుగుతున్నవి, కాని వానిలో కాల్చి బూడిదను చేసే క్రౌర్యము కానరావడములేదు. అతని చూపులో ఉష్ణము ఉన్నది, కాని అది కాల్చి మాడ్చివేసే ఉత్తాపము కాదు.

ఈ ఆశ్వికుడు యువకుడు. జరీ తలపాగలో నుండి వ్రేలాడుచున్న ముంగురులు తడిసి, చిక్కులుపడి తుమ్మెదల వలె కనిపిస్తున్నవి. అతని నాసిక

వెడ్డది, ఉన్నతమైోది. దాని క్రింద సన్నని నాచు పొరవలె నున్న నూనూగు మీసమున్నది అతని వెదవులు పలచగ నున్నవి. ముక్కువద్ద రెండు సన్నని గీతలు అతని ముఖమును ఎంతో కోమలముగను, సంవేదనాభరితమైనదిగను చేస్తున్నవి. ఆ అపరిచిత తరుణ సుందరమూర్తి సర్దేయా మనము నందు వేరొక వ్యక్తియొక్క స్మృతిని మేల్కొలివినది. ఆ రెండవ వ్యక్తి సర్దేయాకి ఆత్మీయుడుగా అనివిస్తున్నాడు. అతనిని ఎప్పుడు ఎక్కడ చూసినది సర్దేయాకి జ్ఞప్తికి రావడము లేదు.

ఆ సుందరమూర్తి గుర్రమును ఆపుటకు ఎంత ప్రయత్నించినను అది ఆగుటలేదు. అందువలన అతడు గట్టిగా కళ్ళెమును బిగించుటతో గుర్రము సకిలించి ముందు కాళ్ళను మీదకు ఎత్తి ఆగినది ఆ దృశ్యమును చూచి సర్దేయా భయపడి లోనికి వెళ్లవలెనని వెనుతిరిగినది. ఇంతలో ఆమె పైటకొంగు గాలికి ఎగిరివెళ్ళి ఆకస్మాత్తుగ కళ్ళెపు రికాబులో తగులుకొన్నది త్వరగా లోనికి వెళు తుండిన ఆమెను ఆ ఆశ్వికుడు కొంగుపట్టి లాగినట్టయినది.

సర్దేయా మెట్లమీద తటాలున ఆగిపోయి మెడను ఎడమ భుజముమీదకు వాల్చి తొలగి పోతున్న కొంగును సర్దుకొనుటకై భయాకుల దృష్టితో ప్రక్కకు తిరిగి చూసినది. పైట తొలగడముతో ఎడమ స్తనము అనావృతమయినది కుడి స్తన వర్తుల రేఖ స్పష్టముగా పైకి కనపించినది. ఆ కంగారులో పీడిన కేశరాశి గాలిలో ఎగురుతూ వక్షభాగమును కప్పుటకు ఈషణ్మాత్రముగ సహాయపడినది. రికాబ్‌లో ఇరుక్కొన్న చీర చెరగు గాలిలో ఎగురుతూ రసికత్వమును ప్రతిబింబింప జేస్తున్నది. ఆమె అనావృత కుచమండల శోభను ఆ యువకుడు తిలకించి పరవశించి, పరిస్థితిని పరిసరమును మరచినాడు. ఆమె చీర చెరగును రికాబులోనుంచి తొలగించుట కూడ అతడు మరచినాడు.

కాని ఆ ఆశ్వికుని కండ్లలో కామ వాంఛ లేదు. ఏ స్త్రీ అంగశోభ అయినను ఆకస్మాత్తుగా ఏ పురుషుని ఎదుట నైనను ఉద్భాసిత మయినప్పుడు అది ఆ పురుషునిలో రూపతృష్ణను ప్రజ్వలింప జేయడము సహజము. ఆ రసాను

భూతి అంగ లావణ్యమునకు భిన్నమైనది. సమ్మోహన రూపముగల సర్దేయీ స్తనముల అందమును చూసిన ఆ యువకుని నేత్రములలో రసావిష్టమైన తన్మయత్వమే తలుకొత్తినది.

వక్షోజములను తన హస్తములతో మరుగుపరచుకొనుచు భయముతో రెండు అడుగులు ముందుకు వేసి తన చీర చెరగును ఎట్లు విడిపించుకొన వలయునో తెలియక సర్దేయీ తికమక పడినది. పెండ్లికాని కన్యవలె లజ్జా సంకోచములతో బాహ్యాంతరములందు ఆమె కుంచించుకు పోయినది.

విపణురాలై ఆమె గుర్రము వద్దకు వచ్చినది. అప్రతిభుడైన ఆ యువకుడు ఆమె కొంగును రికాబులోనుండి విడిపిస్తున్న సమయమందు తెలియకుండనే అతనికి ఆమె స్తన స్పర్శ కలిగినది. ఆ సర్శ సర్దేయీకి ఎంత రోమాంచమును కలుగ జేసినదో అంతకన్న ఎక్కువగ ఒక రహస్యమయ ఉద్రేకమును అతనిలో కలుగ జేసినది.

చీర కొంగు రికాబ్‌లోనుండి విడుదలయిన క్షణములోనే సర్దేయీ స్వారులోనికి వెళ్ళి, తలపును బిగించినది. ఆశ్వికుడు ఆ బాధింప బడిన తలపులను చూస్తూ పూర్తిగ ఆత్మవిస్మృతుడైనాడు. వెంటనే అతని ఉత్తేజ మంతయు చల్లబడినది. అతడొక క్రొత్త అనుభూతిని పొందసాగినాడు.

ఆ తరుణ వయస్కుని కంటె సర్దేయీ వయస్సులో పెద్దది అపరాహ్ణపు విషాద ఛాయవలె ఆమె యౌవనము సడల నారంభించినది. అయినను ఆ విషాద మయ ధూసరత్వములో అనిర్వచనీయమైన ఒక కరుణాయుత లావణ్యము ఆమెలో ప్రవహ్నముగా ఉన్నది అది సర్దేయీని ఏ ఇతర సౌందర్యవతి యొక్క సౌందర్య లాలిత్యము కన్న ఎక్కువ సుందరముగను, అపూర్వము గను, లోభనీయముగను రూపొందించినది. ఆ వాడిన సర్దేయీ రూపమే ఆ తరుణ వయస్కుని సంవేదనా శీలమైన అంతఃస్థలమును ఉద్వేల పరుస్తున్నది. నవ యౌవనములో అతనికి కలిగిన అనేకమంది స్త్రీల శరీర సంపర్కము వలన కలిగిన వైదగ్ధ్యము అతని ముఖములో సుస్పష్టముగ ప్రతిబింబిస్తున్నది.

రూపారణ్యములో అతని వేట ఇంకను పూర్తి కాలేదని అతని విలోల నేత్రము లలో స్పష్టముగా గోచరిస్తున్నది. ఏది ఏమయినా, చిలికా సరస్సు తీరమంచలి ఆ పాడువడిన తండాకినార్‌లో తుఫాను వలన విక్షుబ్ధమైన ఆ సంధ్యా సమయ మందు ఆ ఆశ్వికుడు నేడు తల్లి, సోదరి, ప్రియురాలు వీరందరి యొక్క ఏకీ భూతమయిన ఒక ఆశ్చర్యచనీయ స్త్రీ రూపమును చూసినాడని స్పష్టముగ చెప్ప వచ్చును.

గాలివలన వర్షముపడే అవకాశము క్రమముగా సన్నగిల సాగినది. కాని గాలి వేగము మాత్రము తగ్గలేదు. పశ్చిమ దిశను సంధ్యాసమయపు టంధకారము ఘనీభూతమగుచున్నది. కావి పూర్వోత్తర క్షితిజ రేఖపైని సాయం సంధ్యా కాంతులు మిథ్యా ప్రభాత భ్రమను కలిగిస్తున్నవి. జల పక్షుల సమూహములు ఏక దిక్కుగ చిలికా సరస్సులోని ద్వీపముల వైపుకు ఎగిరి వెళ్లుచున్నవి.

ఆ తరుణ వయస్కునికి వెనుకనే వచ్చిన యిరువురు ఆశ్వికులలో ఒకడు "మాణిక్ పాటనా ఈ ముఖద్వారమునకు దగ్గరలోనే ఉన్నది. రాత్రి మొదటి జాములోపల మనము అక్కడకు చేరుకొనవచ్చును. మహా వేయీ అంధారీగఢ్ కేలు సామంత రాయ్‌కి ముందుగనే కబురు చేసినారు. కనుక వారు మాణిక్ పాటనా ముఖ ద్వారము వద్ద మొగల్ సైనికులతో బాటు మన కొరకు నిరీక్షిస్తూ ఉండవచ్చును. రాత్రి అక్కడనే గడపి రేపు వేకువనే మనము పూరీకి బయలు దేరవచ్చును," అని సలహా ఇచ్చినాడు.

ఆ తరుణ ఆశ్వికునిలో ముగ్ధావేశము ఇంకను పోలేదు. జలసారసముల గుంపు ఒకటి తుఫానును లక్ష్య పెట్టకుండ సముద్రము వైపునుండి వచ్చి చిలికా సరస్సు వైపుకు ఎగిరి వెళ్ళినది.

"ఇప్పుడు ఈ నిర్జన ప్రదేశములో ఆగినా రెందుకు కుమార్? ఏమిటి ఆలోచిస్తున్నారు?" అని రెండవ ఆశ్వికుడు వేగిరపాటు స్వరముతో అడిగినాడు.

ఆ తరుణ వయస్కుడైన ఆశ్వికుడు ఖోర్ధా యువరాజు భాగీరథీ కుమార్.

అతని వెంటవచ్చిన ఆ యిద్దరు ఆశ్వికులు లలితా మహా దేయీకి అత్యంత విశ్వాస పాత్రులు. వారిలో ఒకరు వంశీధర్ శ్రీ చందన్, రెండవవారు జగన్నాథ్ పరిచా. వారిపురి ఆధ్వర్యములో భాగీరథీ కుమార్‌ను, యాభై మంది సైనికులను తోడు ఇచ్చి లలితా మహాదేయీ పంపినది. నాయబ్-నాజిమ్ తకీఖాన్ ఏ ఉద్దేశ్యముతో అమీన్‌చంద్‌ను పూరీ పంపినాడో, ఆ ఉద్దేశ్యముతోనే లలితా మహా దేయీ తన కుమారుని పూరీకి పంపుచున్నది. రథయాత్ర సమయములో భాగీరథీ కుమార్ ఛేరాపహారా మొదలగు విధులను నెరవేర్చ గలిగిన స్వయముగ జగన్నాథుని సహాయములో, వేలాది ప్రజల యెదుట ఖోర్ధా రాజ్య సింహాసనము పైన అతనికి గల హక్కు సుప్రతిష్ఠితము కాగలదని ఆమె భావించినది. అందుకు గాను స్వర్గీయ వేణు భ్రమరవర్ అనుచరులతో ఆమె రహస్య సమాలోచనలు జరిపి ఒక పథకము వేసినది. జగన్నాథునికి రాజసేవా విధులను నిర్వర్తించుటకై సరైన సమయమునకు భాగీరథీ కుమార్ పూరీ చేరినట్లయితే అతని వద్దకే ఆజ్ఞా సామగ్రిని ముఖ్య సేవక మండలి పంపుతుంది. అందుకు తగిన ఏర్పాట్లు కూడ జరిగినవి.

అట్టి పరిస్థితిలో రామచంద్రదేవ్ ఏమి చేసి ఉండెడివారో తెలియదు, కాని పరిస్థితి మరియొక విధముగ మారినది.

పూరీ ఇంకా దూరముగా నున్నది. రథయాత్ర సమీపమై నేడు పూరిలో హేరా పంచమి ఉత్సవము జరుగుచుండ వచ్చును. ఏ లక్ష్యముతో భాగీరథీ కుమార్ బాణ్‌పుర్ నుండి బయలుదేరినాడో దానిని సాధించుట ఇప్పుడు సాధ్యమగు పని.

పోతా ముఖద్వారమును వారు దాటుతూ ఉండగా మాలుద్ ఫౌజ్‌దార్ తమమీద హఠాత్తుగ దాడి చేస్తాడని, తమను అక్కడ అపు చేస్తాడని ఎవరు అనుకొన్నారు? ఇప్పుడు ఎలాగైనను బాహుడా వరకు వెళ్ళగలిగితే అక్కడి నుండి సులభముగ పూరీ చేరవచ్చును. కాని ఈ ఆశకూడా నెరవేరేటట్లు కనిపించుట లేదు.

ఆలస్యమును సహించలేక "సాయంత్రమయినది. తుఫాను రాత్రి. ఇంకా ఆలస్యము చేసిన లాభము ఏమున్నది కుమార్ ?" అని వంశీధర్ రాకుమారుని తొందర చేయసాగినాడు.

భాగీరథీ కుమార్ గుర్రము మీదినుండి క్రిందకు దిగి, "ఇటువంటి రాత్రి సమయమందు కందానదిని దాటుట వల్లనే కదా మాలుద్ ఫౌజ్‌దార్ మనలను బంధించ గలిగినాడు. నేను ఈ చీకటి రాత్రిలో మాణిక్‌పాటనాకు రాను. మీరు ముందు వెళ్ళండి, అక్కడ నావను ఏర్పాటుచేసి సిద్ధముగా ఉంచండి, నేను రేపు ఉదయమే అక్కడకు చేరుకొంటాను. మన వెనుక కాలి నడకను వస్తున్న పాయిక్‌ల కొరకు నేను వేచి ఉంటాను. ఇది ఒక సత్రము వలె ఉన్నది. ఈ రాత్రికి నేను ఇక్కడనే ఉండదలచు కొన్నాను," అని సమాధానము చెప్పినాడు.

కుమార్ పట్టినపట్టు విడువడని వంశీధర్‌కు భాగాతెలుసును. అతడు ఏదైన పట్టుదల పట్టినప్పుడు దానినుండి అతనిని మరల్చడము అసాధ్యము. అతనికి నృత్య గానాదుల ముందు తల్లి ఆదేశించిన కార్యము శుష్కమైనది. తల్లి మాటకు భయపడి బయలుదేరక తప్పలేదు. అందుకే అతడు ఎంతో వ్యాకుల పడుతున్నాడు. రాజనీతిలోని హింసా క్రౌర్యముల పట్ల అతనికి ఆసక్తి లేదు. అయినప్పటికి, తల్లి యెడల ఆనుగత్యము, ఖోర్ధా సింహాసనము యెడల మోహము, తండ్రి యెడల అకారణ ఏవగింపు - యివి అతనిని తుఫాను లోని ఎండుటాకు వలె పూరీ వైపుకు లాగుకొని పోతున్నవి.

ఆ రాత్రికి ప్రళయము వచ్చినా భాగీరథీ కుమార్ అక్కడనుండి కదలడని గ్రహించిన వంశీధర్ మారు మాట్లాడకుండా గుర్రమును అదలించి, కళ్ళెమును సడలించి మాణిక్‌పాటనావైపు దౌడు తీసినాడు. భాగీరథీ కుమార్ సర్దేయీ సత్రమువైపుకు అడుగులు వేయసాగినాడు.

తలుపు తీయడమా, మానడమా అని తలుపుచాటున నిలబడి సర్దేయీ ఆలోచిస్తున్నది. అందరు యాత్రికులు బస చేయుచున్నట్లే ఇతడుకూడ ప్రక్క

గ్రదిలో బస చేయవచ్చును. తన స్రతమ్ లో లోగద అనేకమంది బస చేసినారు. చివరకు పోకిరీ వారికికూడ అక్కడ బస చేయుటకు ఆమె అనుమతించినది. వారందరకు వసతిని ఏర్పాటు చేసినప్పుడు సర్దేయీ సంకోచించలేదు. కాని ఇప్పుడు ఈ యువక అశ్వికునికి ఆశ్రయ మిచ్చుటకు ఎందువలననో సంకోచిస్తున్నది. ఎందువలన ఆమె చింతాకుల యగుచున్నది ?

దీనికి సరైన సమాధానము కొరకు ఆమె ఆలోచించ సాగినది. కాని ఆమెకు సమాధానము దొరుకుటలేదు. తలుపు సందులోనుండి జోరుగా వీస్తున్న గాలి ఆమె పైటకొంగును ఎగురగొడుతున్నది. దానిని ఒంటినిండా కప్పుకొని, ఎగరకుండా పళ్లతో బిగించి పట్టుకొన్నది.

ఆ యువకుడు తన గుర్రమును జీడిమామిడి చెట్టుకు కట్టివైచి స్రతము వసారా లోనికి వచ్చినాడు.

బాణ్‌పుర్ యువరాజు భాగీరథీకుమార్‌ను బంధించి ఖైదు చేయవలసినదిగా తకీఖాన్ జారీచేసిన హుకుమ్‌ను అనుసరించి ఫౌజ్‌దార్ హాషింఖాన్ బంకాడ్, నీలాద్రి ప్రసాద్, చంపాగఢ్, కుహుడి, భద్రగఢ్ మొదలగు దుర్గములన్నిటిని గాలించినాడు. కాని యువరాజు చిక్కలేదు. ఆ సమయములోనే లలితా మహాదేయి తన కుడిభుజము వంటి వారైన వంశీశ్రీ చందన్, జగు పరీచాలనిచ్చి యువరాజును పాయక్‌లతో పూరీకి పంపినది. కాని వారుభయులు వెంట ఉంటూ ఉండగాకూడ వలలో చేపలు పడినట్లుగ వారందరు తేలికగ చిక్కకొని పోతారని ఎవరికి తెలుసు ? హాషిమ్‌ఖాన్‌ను మోసగించుటకు గాను వారు ఖోర్ధా మార్గమును వదలిపెట్టి వజ్రకోట ఘాట్‌వద్ద చిలికా సరస్సునుదాటి తండా కినార్ మీదుగా పూరీ వెళుతున్నారు. ఈ దారిలో మొగలులను ఎదుర్కొన వలసిన అగత్యము ఉండదని, భాగీరథీ కుమారుని జాడ మొగలులకు తెలిసే అవకాశముండదని, నిర్భయముగ పూరీ చేరవచ్చునని వారు భావించినారు. కాని దక్షిణ దిశనుండి వచ్చు యాత్రికులనుండి జిజియా పన్నును వసూలు చేయుటకు గాను కందాకదీ ముఖద్వారము వద్ద మాలుద్ ఫౌజ్‌దార్ ఒక చౌకీని ఏర్పాటు చేసినాడన్న విషయము వారికి తెలియదు.

వజ్రకోటనుండి కందానదీ ముఖద్వారమునకు భాగీరథీకుమార్ తన అనుచరులతో వచ్చుసరికి సంధ్యాసమయము అయినది. ఆషాఢ మాసారంభములో కందానదీ ముఖ ద్వారము ఎండిపోయి ఉంటుంది. మోకాలు లోతుకు మించి నీరుండదు. ఒక్కొక్క చోట మహాఉంటే నడుము వరకే నీరు ఉంటుంది. కాని శ్రావణ మాసములో చిలికా సరస్సు నిండుగా ఉంటున్నప్పుడు మృత సర్పమువలె పడియుండే కందానదీ ముఖ ద్వారము నురుగులు క్రక్కుతూ ప్రవహిస్తుంది. గతములో ఈ మార్గము మీదుగనే సముద్రములోనుండి నావలు చిలికా సరస్సులోనికి వచ్చుచుండెడివి. కాని ఇపుడు ఆ ముఖద్వారము మట్టితో మేటవేసి యున్నది. పూరీకి వెళ్లే దక్షిణదేశ యాత్రికులు ఈ మార్గము మీదుగనే కాలినడకను వెళ్ళుతూ ఉంటారు. ఆ విషయము గుర్తెరిగిన మాలుద్ ఫౌజ్‌దార్ అక్కడ చౌకీని ఏర్పరచినాడు.

భాగీరథీ కుమార్ తన సైనికులతో గూడ ఎడ్లబండ్లలో కావలసిన ఆహార పదార్థములను తీసికొని అక్కడకు చేరినాడు. వారిని సామాన్య యాత్రికులుగా చౌకీవద్ద నున్నవారు భావించలేదు. ఫౌజ్‌దారుని సైనికులు వారిని ఆ రాత్రంతయు అక్కడనే నిలిపివేసి, ఉదయమునకే ఫౌజ్‌దార్ వద్దకు పంపినారు. వారిని గుర్తించుటకు ఫౌజ్‌దారునకు ఎంతో సేపు పట్టలేదు. అతడు వారిని బంధించి నాయబ్ - నాజిమ్ తకీఖాన్‌కు వర్తమానము పంపినాడు. 'హాషిమ్ ఖాన్‌కు సాధ్యపడని కార్యమును మాలుద్ ఫౌజ్‌దార్ సులువుగ చేయగలిగినాడు. అందువలన తకీఖాన్ నుండి బహుమతిగా మన్సబ్‌దార్ హోదాను పొందవచ్చునన్న ఆశతో మాలుద్ ఫౌజ్‌దార్ ఎంతో భక్తిభక్తులతో కబురంపినాడు. కాని అప్పటికే భోర్ఖాపట్ల తకీఖాన్ తన రాజకీయవైఖరిని మార్చుకొనినాడు. కాని ఆ సంగతి మాలుద్ ఫౌజ్‌దార్‌కు తెలియదు.

రాజనీతి చాలా విచిత్రమైనది. వేశ్యాప్రేమ, చంద్రుని వెన్నెల స్థిరముగా ఉండగలవేమోకాని, రాజనీతిలోని స్నేహము, వైరము మేఘములవలె చంచలమైనవి. ఈ క్షణములో మిత్రుడుగా నున్నవాడు మరుక్షణములో శత్రువుగా

పరిగిణింపబడగలదు. ఈ క్షణములో శత్రువుని కంఠమును ఉత్తరించుటకు గాను నూరుచున్న కత్తితో మరుక్షణములో మిత్రుని కంఠమునే నరకవచ్చును. అవకాశ వాదమునకు ఒక మహారణ్యము రాజనీతి. ఆత్మరక్షణ, స్వార్థము ఇవే రాజనీతికి ధర్మములు.

నాడు మిత్రుడైన రామచంద్రదేవుకు వ్యతిరేకముగ భాగీరథీకుమార్ ధ్వజమెత్తిన కారణమున అతనిని బధించ వలసినదిగ హాషింఖాన్‌ను తకీఖాన్ బాణ్‌పుర్ పంపినాడు. నేడు ఆ రామచంద్రదేవుని శ్రీ క్షేత్రమునుండి ప్రతిష్ఠా చ్యుతుని గావించవలెనని తలంచిన వెంటనే అతనికి ఆ భాగీరథీ కుమార్‌ని స్నేహము అవసరమయినది. సరియైన సమయమునకు భాగీరథీ కుమార్ పూరీ చేరినట్లయిన అతనిచేత రాజసేవా కార్యములను జరిపించి రామచంద్రదేవుని తొలగించవచ్చును. ఈ మార్పుకు జగన్నాథ ఆలయములో సంపూర్ణ సహకారము లభించగలదని అమీన్‌చంద్‌నుండి కూడ కబురు వచ్చినది. తండ్రీ కుమారుల మధ్య యుద్ధము చెలరేగినట్లయిన మూడవ పక్షముగ అమీన్‌చంద్‌కు లాభము చేకూరగలదు.

పూరీకి వెళ్లుచుండిన భాగీరథీ కుమార్‌ను మాలుద్ ఫౌజ్‌దార్ ఖైదు చేసినాడని తకీఖాన్ తెలిసికొని, అతనికి బహుమతికి బదులు, ఏ పరిస్థితిలోనైనా సరే భాగీరథీ కుమార్‌ను శీఘ్రముగా పూరీకి చేర్పించ వలెనని, సరైన సమయమునకు అతడు పూరీకి చేరకపోయిన యెడల మాలుద్ ఫౌజ్‌దార్‌నుఖైదు చేయ వలసినదిగాను అతడు హుకుమ్ జారీచేసినాడు.

హాషిమ్‌ఖాన్ ఆ సమయములో లాల్‌బాగ్‌లోనే వుండినాడు. తనవంటి దుర్దాంతుడైన సేనాపతి చేయలేని పనిని ఒక సామాన్య ఫౌజ్‌దార్ చేసి చూపించినాడు. అందువలన అతడు మనస్సులోనే అసూయ పడుతూ పళ్ళు పటపట లాడించినాడు. అనకొనని అవకాశము దొరకడముతో తకీఖాన్ క్రోధాగ్నిలో ఆజ్యము పోయదలిచి "ప్రభూ! ఇందువలననే నేను భాగీరథీ కుమార్‌ని చూసికూడ వదలిపెట్టినాను. నేను కోరి వదలకపోతే నన్ను వాడు

తప్పించుకొని వెళ్ళగలడా ? మాలుద్ ఫౌజ్‌దారుని తెలివితక్కువతనము వలన ఇప్పుడు సిద్ధాన్నము కాస్తా కుక్కల పాలు కానున్నది" అని అన్నాడు.

తకీఖాన్ నిష్ప్రయోజనమైన కోపముతో కాలును విసరికొట్టి 'హాషిమ్ ఖాన్ ! నువ్వేమీ మాట్లాడకు, నీ వేమేమి అద్భుతములు చేసి చూపగలవో నాకు తెలియును, ' అని అన్నాడు.

భాగీరథీ కుమారుని విడుదలచేసి పూరీకి పంపవలసినదని తకీఖాన్ జారీ చేసిన ఫర్మానాను మాలుద్‌కు తీసికొని వెళ్ళిన సైనికుడు తిరిగి వచ్చేసరికి పూరీలో గుండిచాయాత్ర ముగిసినది.

తఫాను శాంతించినది. ఆకాశము మీది మబ్బుల చాటునుండి తన ముఖమును చూపిస్తూ సప్తమి చంద్రుడు నవ్వుతున్నాడు. చిలికా సరస్సు మబ్బుల నీడను వెన్నెల దుప్పటిని కప్పుకొని నిద్రపోయినది. కాని కొన్ని తరంగములకు, కొన్ని జలసారసములకు నిద్రరావడము లేదు. ఆ సమయములో క్షణమాత్రము మబ్బుల చాటున చంద్రుడు దాగొన్నాడు. మేఘముల అంచులకు ఏ ఇంద్రజాలికుడో రజతమును పొదిగి నట్టున్నాడు. నల్లని మేఘముల చట్టూ తెల్లని కాంతిపుంజము దీపిస్తున్నది, దుర్దినముల మధ్యగూడ సుదినముల ఉజ్వలావకాశము వలె.

అది నిజముకాని యెడల నిర్జనమైన ఆ తండాకినార్‌లో ఆ పాడువడిన సత్రములో ఆటువంటి అనుభూతి ఎట్లు లభించగలదు భాగీరథీ కుమారునకు ?

నిద్రావస్థలో నున్న మత్తకళ్ళతో చంద్రుని, చిలికా సరస్సును చూస్తూ భాగీరథీ కుమార్ దీనిని గురించే ఆలోచిస్తున్నాడు. నిర్మానుష్యమైన తండా కినార్ యొక్క బాలుకా ప్రాంతరములో కొన్ని జలసారసములు ఎగురుతున్నట్లుగా సర్దేయీ చట్టూ భాగీరథీ కుమారుని ఆలోచనలు, భావనలు పరిభ్రమిస్తున్నవి. కాని బాణ్‌పుర్ తిరిగి వెళ్ళవలసిన విషయము జ్ఞప్తికి వచ్చినంతనే అతని ఆలో చనలకు, భావనలకు రసభంగము కలుగుచున్నది. లలితా మహాదేయీ స్వాభావికముగ కోపిష్ఠి. తనను భోర్ధా సింహాసనారూఢుని చేయుటకు ఆమె ప్రతినబూని

నది. ఆ కార్యమునకు తాను కేవలము నిమిత్త మాత్రుడు. ఏ రామచంద్రదేవ్ ఒకానొక యవన స్త్రీని వివాహమాడి లలితా మహాదేయాని అవమాన పరచినారో, అవమానపరచుచున్నారో ఆ రామచంద్రదేవుని సింహసనాచ్యుతుణ్ణి చేయగలనని పాంచాలివలె లలితా మహాదేయా శపథము చేసినది.

తమను కందానది ముఖద్వారము వద్ద మాలద్ ఫౌజ్‌దారు అడ్డగించి నట్లు చెప్పిన ఆమె నమ్మదు. "ఐతే మీతో సైనికులను ఎందుకు పంపినాను. నాట్యము ప్రదర్శించుటకా?" అని తప్పక ఆమె అడుగుతుంది. ఆ సాయంసంధ్యా సమయమందు ఆ మాలుద్ ఫౌజ్‌దారుని సైనికులను ఎదుర్కొనే శక్తి తమ కొద్ది మంది సైనికులకు లేదన్న విషయము ఆమె ఎలాగున గ్రహించగలదు? భాగీరథీ కుమారుని అశ్రద్ధ వలననే వారు అతనిని పూరీకి చేర్చలేక పోయినారని ఆమెకు చెప్పినంతనే ఆమె తోక త్రొక్కిన త్రాచులాగ ఎగిరిపడుతుంది. ఇదే ఆలోచన, ఇదే చింత భాగీరథీ కుమారుని అత్యంత దుర్బలునిగను, క్లాంతునిగను చేస్తున్నది.

ప్రక్క గదిలోని సర్దేయీ కండ్లలో గూడ నిద్రలేదు. క్షుధిత చకోరము వలె ఆమె మనస్సు గగన వీథులలో విహరిస్తూ క్షణమాత్రములో భూమి మీదకు తిరిగి వస్తున్నది. ఆశ నిరాశల ద్వంద్వ ఆలోచనల వలన ఆమెకు నిదుర వచ్చుట లేదు.

ఆనాటి సాయంత్రము ఆ తరుణ వయస్కుని చూసినప్పటి నుండి సర్దేయీలోని నిరుత్తప్త మైన నారీత్వము ఒక్కసారిగా మేల్కొన్నది. శ్రీ రామ చంద్రుని పవిత్ర పాద స్పర్శతో ఉత్తేజితయైన అహల్యవలె, వాతాందోళిత యైన లతవలె ఆమె నారీత్వముగూడ ఒక ప్రాపు కొరకు వెదకు లాడుతున్నది.

మాల్‌కుదా గ్రామములో తన అత్తవారింటి తాలూకు విరిగి పాడువడిన చిత్రమొకటి ఆమె మనోనేత్రము ముందు నిలిచి ఆమెను వ్యాకుల పరచసాగినది. యుద్ధముల వలన కళకళలాడే గ్రామములు ఎన్ని నాశనమైనవి? వర్షముల వలన; తుఫానులవలన ఆ గ్రామములలోని ఇండ్లన్నియు బహుళా మట్టిలో కలిసి పోయి

యుండవచ్చును. నాగజెముడు మొదలగు అనేక నామ రహిత గుల్మాదుల క్రింద తాతలనాటి ఆ భూమి మరగుపడి ఉండవచ్చును. నవ వధువుగ ఆమె ఆ గ్రామ ములో అడుగిడినది. తనదైన ఒక కొంగ్రొత్త సుందర ప్రపంచమును నిర్మించు కొనవలెనన్న మధుర స్వప్నములతో వీరవధూటివలె లజ్జాశీలి...పాదములందు ఎర్రని పారాణి...లలాటముపైనరక్తాభ సిందూరము...పెదవులపైని లాలిమ...

శోభన రాత్రి ఇంకా ముగియనైనా ముగియలేదు. ఇంతలో తూర్యనాద ములు తమ గ్రామములో చెలరేగినవి. ఇంటింటా యువకులు సంసిద్ధులు ఆవుతు న్నారు. తన మువ్వురు బావగారలు గత యుద్ధములలో వీర స్వర్గమును అలంక రించినారు. వారు పాయిక్ వంశీయులు, యుద్ధములో ప్రాణములు అర్పిస్తామని ప్రతిజ్ఞ చేసి జన్మిస్తూ ఉంటారు. ఒకరి తర్వాత ఒకరుగా తన ముగ్గురు కొడుకు లను యుద్ధములలో పోగొట్టుకొని సర్దేయీ అత్తగారు విచ్చిదై పోయినది. అందు వలననే ఆమె తన కనిష్ఠ పుత్రుని యుద్ధమునకు వెళ్ళ వద్దని నిరోధించ సాగినది. ఆమె తన క్రొత్తకోడలైన సర్దేయీని విలిచి "ఓసీ అభాగ్యురాలా! నీవు యీ యింట్లో అడుగు పెట్టినావో లేదో, కాని నా కొడుకు యుద్ధమునకు బయలుదేరు తున్నాడు. వాడు బ్రతికి బయట పడతాడా? ఇంతకు ముందు ముగ్గురను పోగొట్టుకొన్నాను...ఒక్కరైనొక్కడు కూడ ఇంటికి తిరిగి రానేలేదు. ఇప్పుడు ఈ చచ్చినవాడు కూడి నడుము బిగించి యుద్ధమునకు సిద్ధమౌతున్నాడు. నేను చెపితే వాడు వినడము లేదు. నీ వైనా చెప్పి వాడిని ఆపుచేయవే!" అని చెవిలో చెప్పినది.

సర్దేయీ క్రొత్త కోడలు. భర్త ముఖమునైనా సరిగా చూడ లేదు. అస్ప ష్టముగ ఆ రూపము అప్పుడప్పుడు ఆమె స్మృతి పధములోనికి వస్తూ ఉంటుంది. సుందరమైన, సుగఠితమైన, బలిష్ఠమైన ఒక నల్ల చలువరాతి విగ్రహము. భుజ ముల వరకు వ్రేలాడుచున్న గిరజాలు. చెవులకు బంగారు కమ్మలు. ప్రభాతకాల మందు వికసించిన పుష్పముల వంటి సజీవమైన రెండు స్వప్నిల నేత్రములు... ...బుగ్గ మీసములు...మరి జ్ఞాపకము చేసికొన లేక పోయినది సర్దేయీ కండ్లు

అశ్రుపూరితమ లై నవి ఆ కన్నీళ్ళలో ఆ చిత్రము కలిసిపోయి మరింత అస్పష్ట మైనది.

ఆ సమయములో తన భర్తకు తనేమి చెప్పగలదు? ఆమె తన భర్త కాళ్ళపైన మొదలు నరికిన చెట్టువలె పడిపోయినది. ఆమెకూడ పాయిక్ ఇంటి ఆడబడుచు. ఇంటినుండి యుద్ధమునకు బయలుదేరిన వీరులు తిరిగి ఇంటికి రారన్న విషయము ఆమెకు గూడ తెలుసును. ఆమె తండ్రి, తాత, పెదతండ్రీ, సోదరులు అందరూ యుద్ధములకు వెళ్ళినవారే, కాని ఒక్కరు కూడ తిరిగి ఇంటికి రానేలేదు.

పాయిక్ యింటి ఆడపడుచు మాత్రమేకాదు ఆమె, పాయిక్ యింటి కోడలు కూడ. ఆమె నరనరములలో పాయిక్ రక్తమే ప్రవహిస్తున్నది. అయినప్పటికిని ఎవనితో కలిసి ఒక సరిక్రొత్త ప్రపంచమును సృష్టించుకొనుటకై క్రొత్తకోడలుగ ఆ అపరిచిత గ్రామములో కాలుపెట్టినదో అట్టివానినే తన చేతులతో తానే అతని నొసటను సిందూర తిలకమును దిద్ది, దూర్వాక్షతలతో నమస్కరించి, హారతి నిచ్చి నిశ్చితముగ మృత్యుముఖములోనికి గెంటుతున్నప్పుడు ఆమె హృదయము ఎంతగానో ఆర్తనాదము చేసినది.

కోడలు దుఃఖిస్తూ ఉండగా చూసి తన కొడుకు యుద్ధమునకు వెళ్ళకుండ ఎక్కడ ఆగిపోతాడో నని ఆమె మామగారు దయ్యము పట్టిన వానివలె చిందులు త్రొక్కుచు అరవ నారంభించినాడు. "ఓరీ! నీవు పాయిక్ కొడుకువా? పాకీ వాని కొడుకువా? మనము పాయిక్‌లము. యుద్ధములో ప్రాణములను త్యజించుటే మన కర్తవ్యము. ముసల్మానులు వచ్చి శ్రీ మందిరము పైన దాడి చేస్తున్నారు. ఒరియా జాతికి శిరోభూషణమైన ఖోర్ధా రాజావారు ఉత్కళ దేశమునకే గౌరవనీయులు. అటువంటి వారు జాతికే ఇష్టదైవ మైన జగన్నాథుని మాన మర్యాదలు మట్టిపాలు కాకుండ కాపాడుట కొరకు ఆడవులలో తిరుగాడుచున్నారు. నీవు మాత్రము లంగాలో దాగొనాలను కొంటున్నావా?" అని గంద్ర గొడ్డలిని తీసికొని గంతులు వేస్తూ ఆ ముదుసలి అరుస్తున్నాడు.

సమర సన్నాహము కొరకు బాజాలు, నగారాలు, తూర్యములు మ్రోగగనే ఆయన ఆవయస్సులో కూడ నాట్యమాడ సాగినాడు.

చివరకు సర్దేయీ తన భర్తకు సిందూర తిలకము దిద్ది, కంఠమందు కాలిజాయీదేవి యొక్క మాలవేసి, హారతి ఇచ్చి ఇతర పాయిక్ యువకులతో పాటు యుద్ధమునకు పంపినది. కాని ఆనాడు మంగళ శంఖనాదములు వినివిస్తుండిన సమయములో ఆమె నేత్రములు వేదనతో అశ్రుపూరితములైనవి. రణభేరీ మ్రోగుచుండగా ఆ యుద్ధవీరులు గ్రామ మలుపు వద్ద అదృశ్యులైనారు. సర్దేయీ నిల్చుండిన చోటనే మొదలు నరికిన చెట్టువలె కుప్ప కూలిపోయినది.

చాల రోజుల నిరీక్షణ తరువాత ఒకనాడు ఆమె భర్తకు బదులు...ఒక కత్తి, రక్తముతో తడిసిన ఒక శిరస్త్రాణము...సర్దేయీ యొక్క వధూ జీవితపు అంతిమ అవశేషము రూపములో తిరిగి వచ్చినవి.

ఆ అనంత నిరీక్షణలోనే సర్దేయీ సజీవముగా ఉంటున్నది. ఈ జన్మ తరువాత వేరొక జన్మ ఉన్నదా? సర్దేయీ నిట్టూర్చినది.

తండాకినార్‌లో రాత్రి చాలా వరకు గడిచినది. జగుని అప్పటికింకనూ రానేలేదు. దీపపు వెలుగురేఖ గోడమీద నాట్యము చేస్తున్నది. నిరాశ్రయమైన నిస్సంగత్వములో ఆమె ఒకనాడు గోడమీద జగన్నాథ, బలభద్ర, సుభద్రల చిత్రములను మసి, పసుపు మొదలగు వాటితో చిత్రించినది. ఆ చిత్రములు కంపిస్తున్న దీప శిఖాలోకములో నాట్యమాడుచున్నట్లుగా అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది. ఆ చిత్రముల వైన సర్దేయీ అనావృత స్తన ద్వయ ఛాయ, కలిసి ఉన్న రెండు కొండలవలె, కనిపిస్తుంటుంది. సంఘముయొక్క విచిత్ర నిర్ణయాను సారము ఆమె కులనాశిని, సమాజచ్యుత అయినది. జగన్నాథ ఆలయములోనికి ఆమె ప్రవేశము నిషిద్ధమయినది. కాని హృదయములో నున్న జగన్నాథునినుండి ఆమెను ఎవరు వేరు చేయగలరు? అయితే జగుని మాత్రము, "నేను నిన్ను పూరీ తీసికొని వెళతాను. అక్కడ నిన్ను ఎవరు గుర్తించగలరు? నీవు బాలా గ్రామ సర్దేయీవని ఎవరికి తెలుసును? మనము వెళదాము పద," అని పట్టు పడుతూండేవాడు.

ఎవరు గుర్తించినా గుర్తించకపోయినా...ఆ చకాడోలా ఆయితే మాత్రము గుర్తిస్తాడు కదా! అతడు అంతర్యామి. ఆయనకు తెలియనిదీ, ఆయన ముందు గుప్తముగా దాచగలిగినదీ ఈ ప్రపంచములో ఏమున్నది? అటువంటప్పుడు ఆమె విధవ అయినప్పటినుండీ వ్రత చారిణి వలె పాప రహితమగను, నిష్కళంకముగను ఉంటున్న విషయము ఆయనకు తెలియదా? ఆమె తెలివిలో ఉండి, బుద్ధి పూర్వకముగ ఆ పఠాన్‌కు తన శరీరము అర్పించలేదు. పతితురాలు కాలేదు. వాడు తన శరీరమును కలుషితము చేయలేదు. మనస్సు అనే చంచల జల ఉపరి తలము మీద అనేకమైన సిడలు తప్పక పడుతూ ఉంటాయి. కాని అవి ఎలా వచ్చినవో అలాగే పోతూంటాయి.

బయట తుఫాను ఆగిపోయినది. కాని జటియానాసీ వైపునుండి మేఘములు క్రమ్మకు వస్తున్నవి. అయినా జగుని ఇంకనూ రానేలేదు. వాడీమధ్య అపరిచిత వ్యక్తులను తీసికొని దూర తీరములకు వెళుతున్నాడు. అడిగినప్పటికీ స్పష్టముగ ఏదీ చెప్పడము లేదు. దానికి తోడు, ఆనాడు బాలూ గ్రామములోని ఆ దుస్సంఘటన అనంతరము సర్దేయా విషయములో నిరుత్సాహమును, ఉదాసీనతను కనబరస్తున్నాడు. పూర్వము సర్దేయా వద్ద కూర్చుని అలసట చెందకుండా ఏవేవో విషయములు చెప్పుతూ ఉండేవాడు. కాని ఇప్పుడు ఏమీ మాట్లాడడు. సర్దేయాకి దూరదూరముగనే ఉంటున్నాడు.

సర్దేయా నేత్రములనుండి అశ్రువులు ఉబికి వచ్చినవి. చెక్కిళ్ళ మీదినుండి జారి రెండు వేడి కన్నీటి చుక్కలు నేల రాలినవి. కాని వాటిని మట్టినేల పీల్చి వేసినది. అక్కడ నేలపైని రెండు నల్లని వృత్తములు ఏర్పడినవి. మరి కాస్సేపటికి ఆ రెండు వలయములు రెండు కండ్లవలె ఆ దీప కాంతిలో ఆమెకు కనిపించినవి.

ఆ నిర్మానుష్యమైన మందుబెండతో కూడిన మధ్యాహ్న సమయము:... మాల్‌కుదా గ్రామమునకు వచ్చిన ఆ దప్పికొన్న అశ్వికుడు...ఉదాసీనమైన ఆతని రెండు శూన్య నేత్రములు.... ఆ దృశ్యమంతయు సర్దేయా కండ్లముందు

సాకారముగ కదలాడ సాగినది. అటువంటి స్నేహతృషితమైన అసహాయ నేత్ర ములను సర్దేయూ మరి ఎన్నడును చూడనేలేదు. ఆ నాడు ఆయనను చూడగనే సర్దేయూ హృదయము ఒక విధమైన మమకారముతో ఎందువల్లనో నిండిపోయి నది. ఆశని ఉత్తప్తమైన లలాటమును ఆదరముతో నిమిరి, చీర చెరగుతో విస రుతూ చెమటను పోగొట్టి నిద్రబుచ్చ వలెనని ఆమె మనస్సు ఎంతగానో ఆరాట పడినది.

ఇప్పుడుగూడ ఎప్పుడో ఒకప్పుడు ఏ యేకాంత సమయములోనో ఆవే కండ్లు, చిలికా సరస్సులోని జలములపైని కాలమేఘ ఛాయవలె నాట్యమాడి ఎక్కడనో మాయమవుతూ ఉంటవి.

నేడు వేరొక ఆశ్వికుడు వచ్చినాడు.

సర్దేయూకి అప్పుడు అనిపించినది, ఈ కండ్లను తాను ఆనాడు మాల్‌కుదా గ్రామములో నిర్జన మండుటెండ సమయమందు చూచినట్టు. కాని ఈ రెండు కండ్లు వన్యమైనవి. వీటిలో ఆ స్నేహ తృషితమైన అసహాయత లేదు...సుదూ రపు పిపాసకూడ లేదు.

సర్దేయూ శరీరము గగుర్పొడిచినది. తలుపుసందులోనుండి వచ్చిన గాలి గిలిగింతలు పెట్టినట్లయినది. ఆమె తన అనావృత వక్షప్రదేశమును చీర కొంగుతో కప్పుకొని కాళ్ళవైకి జీర్ణవస్త్రమును లాగుకొన్నది.

రాత్రి చాలా భాగము గడచినది. జగుని తిరిగి వస్తాడో రాడో తెలియదు. ఆ నాడు మధ్యాహ్నము దాటిన తరువాత వచ్చినవాడు తిరిగి ఎక్కడికి వెళ్ళినాడో కూడ తెలియదు. ఇప్పుడు మాణిక్‌పాటనావైపు సముద్రమువైని వేగుజుక్క ఉదయిస్తున్నది.

అలా పడుకొని గతకాల విషయములను స్మరించుకొనడము సర్దేయూకి ఎంతో హాయినిస్తున్నది. ఎందుకనో తెలియదు.

కొంగున ముడివేసికొన్న ఉంగరమును ఒకసారి చూడవలెనని సాయం త్రము గడచినప్పటినుండి తన ప్రేళ్ళు చూరాము చేస్తున్నవి. కాని ఎందువలననో సర్దేయా ఆ ఉంగరమును విప్పి చూచుటకు సాహసించలేక పోతున్నది.

ఆనాటి సాయంత్రము గడచిన తరువాత ఆ ఆశ్వికుడు సర్దేయా వద్ద పాలు, 'ఛేనా' కొనినాడు. వాటి ఖరీదు చెల్లించుటకు ఆతనిద్ద డబ్బు లేనందున ఈ ఉంగరమును కుదువబెట్టినాడు.

నెమ్మదిగా సాయం సమయము గడచినది. నాలుగు వైపులను మేఘావృతమైన వెన్నెలలో చీకటి వ్యాపింప జొచ్చినది. సర్దేయా తన గదిలో దీపము వెలిగించినది. ప్రక్క గదిలో నన్న ఆ అపరిచిత యువకుని అశాంత పదసవ్వడిని వినజొచ్చినది. సత్రములోని అతిథుల పరిచర్యలను సాధారణముగ జగుని చేస్తూ ఉంటాడు. కాని నేడు వాడు లేడు. అందువలన సర్దేయాయే ఆ గదిలోని దీపమును వెలిగించినది. కూజాతో నీళ్లు ఉంచినది. రాత్రికి అతడే స్వయముగ వండు కొంటాడా? లేక సర్దేయా వండినది తింటాడా? ఈ విషయము అడగ లేక పోయినది. అతనికి ఆకలి వేసిన అతడే అడుగుతాడు. అడుగుటకు ఆమె వెళ్ళ వలసిన అవసరమేమున్నది?

సర్దేయా ఆలోచిస్తున్నది...కొద్ది సేపైన తరువాత తలుపు తట్టిన శబ్దము అయినది. ఆమె అదరిపడినది. అది గాలివలన కలిగిన శబ్దము మాత్రము కాదు. అప్పటికే తుపాను ఆగిపోయినది. ఆమె తడబడుతూ వెళ్ళి తలుపు తీసినది. ఎదురుగా ఆ యువకుడు ప్రత్యక్షమయినాడు. వెంటనే ఆమె తలుపు చాటునకు తప్పుకొన్నది. ఒక చేతితో తలుపును పట్టుకొన్నది సంపంగి మొగ్గలవంటి ఆ చేతి ప్రేళ్ళు మాత్రమే ఆ యువకునికి కనబడుతున్నవి. సర్దేయా మాత్రము అతని నిండు విగ్రహమును చూడగలుగుతున్నది.

"పెరుగు ఉన్నదా?" అని యువకుడు అడిగినాడు. ఆమె సమాధానము వెంటనే చెప్పలేదు. అందువలన అతడు మరల మరల అదే ప్రశ్న వేయవలసి

వచ్చినది. అప్పుడు ఆమెకు తప్పనిసరిగా జవాబు చెప్పవలసి వచ్చినది. "పెరుగు లేదు, రెండు విడతల పాలున్నవి" అని ఆమె ఆన్నది.

ఆ సమాధానమునకు ఆ యువకుని వెదవులపైన చిలిపి చిరునవ్వు మొలకెత్తి అది వెనువెంటనే పెద్ద నవ్వుగా రూపొందినది.

ఆ యువకుడు ఎందుకంతగా నవ్వుచున్నాడా అని ఆమె ఆలోచించగనే ఆమె సిగ్గుతో కుంచించుకు పోయినది. ఆ యువకుడు ఆ సమయములో ఆమెను చూడగలిగి యుండినచో సిగ్గుతో ఎర్రబడిన ఆమె ముఖమును చూడగలిగి యుండెడివాడు.

వెదవుల పైని నవ్వును ఆణచుకొని "పాసీ కలిసిన పాలు కావు కదా?" అని అతడు ప్రశ్నించినాడు.

ఆ సమ్ముఖత్వము వలన సర్దేయీ సంకోచము తొలగిపోనారంభించినది. ఆమె తలుపు చాటునుండి ఈవలకు వచ్చి "సొంత గోషములోని పాలయితే సరిగా చెప్పవచ్చును. ఇవి ఇతరుల వద్దనుండి తెచ్చిన పాలు. పాసీ కలిసినవేమో నేను చెప్పజాలను" అన్నది.

ఆ యువకుడు మరల నవ్వ నారంభించినాడు. 'పాసీ' అంటే "నీళ్ళు" అనే కాకుండా వేరొక అర్థమున్నదని సర్దేయీ గ్రహించలేక పోయినది.

ఆ యువకుడు పనివిల్లనాని వలె నవ్వినందున సర్దేయీ సిగ్గుతో చచ్చి పోతున్నది.

"సరే, నీ వద్ద ఏది ఉంటే అదే యివ్వు" అని ఆ యువకుడు అన్నాడు.

సర్దేయీ లోపలకు వెళ్ళి రెండువిడతల పాలు, కొద్దిగ చేనా తీసికొని వచ్చి అతని ముందుంచినది. ఆ ఆవ్వాకుసికి తీసికొన్న వాటికి ఖరీదు చెల్లించే అలవాటు లేనట్టున్నది. అతడు వాటిని తీసికొని వెళ్ళబోతూ ఉండగా, "ఖరీదు?" అని సర్దేయీ అడిగినది.

ఆకాశము మీద నుండి క్రిందపడినట్లుగ ఆ యువకుడు తటాలున నిలబడి పోయినాడు. "నా వద్ద డబ్బులేదు ఇక్కడ ఈ రాత్రికి ఉందునని అనుకొన లేదు. ఆపదలో చిక్కుకొని ఇక్కడ ఈ రాత్రికి నేను ఉండవలసి వచ్చినది." అని అంటూ తన చేతి ఉంగరమును తీసి ఇచ్చినాడు. నీలము పొదిగిన ఉంగరమది. దానిని సర్దేయాకి అందజేస్తూ "ఇంద, దీనిని నీ వద్ద ఉంచు. నేను తిరిగి వచ్చే టప్పుడు నీ డబ్బు నీ కిచ్చి నేను దీనిని తీసుకుంటాను" అని అన్నాడు.

ఒక విలువైన ఉంగరమును తన వద్ద కుదువ పెట్టుతున్నపుడు సత్రము నడుపుతున్న సర్దేయా ఎందుకు వద్దంటుంది?

ఆ తరువాత ఆమె సానుభూతితో 'నీవు ఎక్కడికి వెళుతున్నావు? ఎక్కడనుండి వస్తున్నావు? ఒంటరిగనే వచ్చినావా?" అని ప్రశ్నించినది.

"ఔను, నేను ఒంటరి వాడనే, మరి నీవు?" అని అతడు అడిగినాడు.

దీపకాంతిలో ఆ ఉంగరమును చూస్తూ అన్యమనస్కగ ఆమె "నేడు జగుని మరి రాడేమో?" అని అన్నది.

ఆ యువకుని పల్చని పెదవులపైన చిలిపి నవ్వొకటి మొలకెత్తినది. సర్దేయా ముఖము నిగ్గుతో ఎర్రబడినది.

సర్దేయా తన ఎడమ అరచేతిమీద తన చెక్కిలి ఆన్చి కునుకుతున్న దీపమును చూస్తూ తన్నుతాను తిట్టుకొంటున్నది.

"...ఛీ-నేను ఈ రాత్రి సత్రములో ఒంటరిగా ఉంటున్నానని ఆయనతో ఎందుకు అన్నాను. అతను నా గురించి ఏమేమి అనుకొంటున్నాడో, ఏమో?

ఐయట మేఘములు తిరిగి క్రమ్ముకొంటున్నవి. తలుపు సందులోనుండి వస్తున్న గాలికి దీపము మాటి మాటికి రెపరెపలాడుతున్నది. ఆ సమయములో తలుపును ఎవరో తట్టినట్లు అనిపించినది. ఆమె నఖశిఖ పర్యంతము ఉత్తేజ ముతో, ఉత్కంఠతో కంపించి పోయినది.

తలుపు శబ్దము ఆగిపోయినది. దీపకాంతి గోడమీద చిత్రముపైని నాట్యమాడ సాగినది.

మరల అదే ధ్వని ఆమెకు వినబడినది. ఈ నిర్జన నిశ్శబ్దరాత్రి సమయ మందు సర్దేయా ఒంటరిగ నున్నదని తెలిసిన ఆ యవకుడే బహుశా తలుపు తట్టుచుండ వచ్చును. ఈ భయ సందేహములతో సర్దేయా లేచివెళ్ళి తలుపు తెర చుటకు సాహసించలేక పోయినది. కాని ఆ ధ్వని నెమ్మది నెమ్మదిగ వెరగ జొచ్చినది. గత్యంతరము లేక సర్దేయా తలుపు తెరచినది.

ఆ నాడు బాలూగ్రామములో అ పఠాన్ సైనికుడు ఆమెను అదవి లోనికి ఎత్తుకొని పోయిన సమయములో ఆమె ఏ విధముగ చేతనా రహితయై మంచులో తడసిన చల్లని శిలవలె అయిపోయినదో అదేవిధముగ ఇవ్వుడు కూడ ఆమె చైతన్యమంతయు నిష్పంద మయినది.

సర్దేయా తలుపు తీసినంతనే చాల వేగముతో వరద నీరు వలె గాలి లోపలకు పచ్చినది. బయట ఎవ్వరును లేరు. శుక్లపక్ష చంద్రుడు గూడ అస్త మించినాడు.

సత్రమునకు చేరువలో సంపంగి చెట్టుక్రింద బంధింపబడిన గుర్రము మాత్రము తన గిట్టలతో నేలను కొడుతున్నది. ఆ ధ్వనియే తలుపు కొట్టినట్లు వినబడి యుండవచ్చును. ఆ పిచ్చిగాలికి చిలికా సరస్సు హోరు సముద్రపు హోరు ఏకమైనవి. అప్పటికింకా జగుని తిరిగి రానేలేదు.

ముఖముపైన చిక్కులు వడిన ముంగురులును సవరించుకొంటూ సర్దేయా "జగునీ ...జగునీ ... ఒరే జగునీ..." అని పిలువ నారంభించినది. ఆ పిలుపులు ఆ గాలికి తిరిగి సత్రమునకే తిరిగి వచ్చినవి. సర్దేయా లోపలకు వచ్చి తలుపులను మూసినదో లేదో 'దేయా !' అంటూ జగుని పిలిచినాడు. సర్దేయా వెంటనే వెళ్ళి తలుపు తీసినది. జగుని లోపలకు ప్రవేశిస్తూనే నడుములో దోపిన రూపాయిని తీసి క్రిందకు విసరికొట్టి "ఆ రూపాయిని తీసి ఎక్కడైనా దాచివెట్టు. వారింకా ఇస్తామన్నారు" అని చెప్పినాడు.

అదొక నూర్జహానీ వెండి రూపాయి. సామాన్యుల ఇండ్లలో అటువంటి రూపాయి స్వప్నతుల్యము. ఇది ఏమి రూపాయి ? దీనిని ఎవరు ఇచ్చినారు ? ఎందుకు ఇచ్చినారు ? మొదలైన ప్రశ్నలను ఇంకా సర్దేయా వేయనేలేదు. ఇంతలోనే "బయటనున్న గుర్రము ఎవరిది ?" అని జగుని ప్రశ్నించినాడు.

"సాయంత్రము ఒక ఆశ్వికుడు రాత్రికి ఇక్కడ గది తీసుకొన్నాడు. నీవేమో వెళ్ళిపోయినావు. నేనేమో ఇక్కడ హైరాను పడుతున్నాను" అని ఆమె బొంగురు కంఠముతో చెప్పినది.

"అయికే వారంటున్నది నిజమే నన్నమాట !" అన్నాడు జగుని.

సర్దేయాకి ఇది ఒక నిగూఢ సమస్యవలె గోచరించినది. 'ఏమంటున్నారు ?' అని ఆమె అడిగినది.

ఆ ప్రశ్నకు జగుని సమాధానము ఇవ్వకుండ "ఈయన ఎవరో నీకు తెలుసునా దేయీ ?" అని అడిగినాడు.

"లేదు, నాకు తెలియదు. నాకు ఎలా తెలియగలదు ? మన సత్రమునకు ఎంతోమంది వస్తూ ఉంటారు," అని సర్దేయా అన్నది.

"నీవు నాకు ఆనాడు ఉత్తరము ఇచ్చి ఖోర్దా రాజావారి వద్దకు పంపినావు జ్ఞాపకమున్నదా ? ఆ రాజావారి కుమారుడే ఈ ఆశ్వికుడు. తండ్రికి విరుద్ధముగా పోరాడడానికి ఇతడు పూరీ వెళుతున్నాడు." అని జగుని చెప్పినాడు.

సర్దేయా ఆదరిపడి "తండ్రీ కుమారుల మధ్య పోరాటమా ? నీతో ఎవరు అన్నారు ?" అని అడిగినది. కొంగున ముడివేసిన ఆ ఉంగరమును జగునికి చూపించ వలెనని ఆమె అనుకొన్నది. కాని ఇదంతయు అయోమయముగ అనిపించి నందువలన ఆమె ఆ ఉంగరమును తీయనేలేదు.

"చూడు జగునీ ! నామీద ఒట్టువేసి నేను అడిగినదానికి స్పష్టముగ సమాధానము చెప్పు. నీవు నీకు తెలియని వ్యక్తులతో చాలా దినములుగ తిరుగు

తున్నావు. నేను చూస్తూనే ఉన్నాను. చిలికా సరస్సులో నీకు ఇంత పని ఏమ్మున్ది చెప్పు. వారు ఎవరో కాస్త తెలియజేస్తావా ? " అని అడిగినది ఆమె.

జగుని ఆవలించి, దీపమును ఆర్పివేసి, "దేయీ, ఇవన్నీ నన్ను నీవు ఆడగవద్దు ఎవరితోనూ చెప్పవద్దని నన్ను వారు కట్టడి చేసినారు. నేను బాగా అలసిపోయినాను. వేకువజాముననే నేను మరల వెళ్ళవలసి ఉన్నది. కనుక నిద్రపోవాలి" అని చెప్పి పడుకొని గుర్రు తీయనారంభించినాడు. కాని సర్దేయీ కంటిపైని కునుకులేదు. పిచ్చి పవనుని రెక్కలకుకూడ విశ్రాంతి లేదు.

——

పదవ అధ్యాయము

నేడు నవమి, రేపు బాహుడా యాత్ర. ఎల్లుండి అధర్వణా భోగము ఆవలి ఎల్లుండి నీలాద్రి విజయము. అటువిమ్మట శ్రీ మందిరమునకు జగన్నాథుని ప్రత్యావర్తనము జరుగుతుంది. దానితో జగన్నాథుని రథయాత్రా మహోత్సవము సమాప్తము అవుతుంది.

కాని దాని తరువాత?

రామచంద్రదేవుని ముఖమండల రేఖలు కుంచించుకొన్నవి. కనుబొమలు ముడివడినవి. కండ్లు దూరమున నున్న సాత్‌పడా ద్వీపమందున్న సర్కిందే వనమును చూస్తున్నవి.

అపరాహ్ణపు స్తిమితా లోకములో దూరముగనున్న వనరేఖ స్నిగ్ధ కోమలత్వముతో ప్రలిప్తమయి శాంతముగ కనిపిస్తున్నది. చల్లని తూర్పుగాలి స్పర్శవలన సంస్కార రహితమైన రామచంద్రదేవుని కేశములు నొసటిపైనను కండ్లపైనను నాట్యమాడుచున్నవి. క్షురకర్మ లేనందువలన రూక్షమైన ఆయన ముఖమండలము మలినమై యున్నది.

సాన్‌పరీచా విష్ణు పశ్చిమ కపాట్ మహాపాత్ర చెక్కిలిని అరచేతిలో ఆన్చి విచారదృష్టితో అనంత చిలికా జలరాసిని వీక్షిస్తున్నాడు. సమాధానములు లేని, చెప్పనలవికాని, జటిల ప్రశ్నలు ఆయనను ఎంతగనో ఉద్వేలిత పరుస్తున్నట్లుగ మధ్య మధ్య ఆయన రామచంద్రదేవుని చూస్తున్నాడు కాని ఆయన నోట మాట లేదు.

బరుణకుదా ద్వీపమును ఎడమవైపున వదలి గురుబాయీ ద్వీపమునకు కుడివైపు నుంచి ఈశాన్య మూలగా నావ ప్రయాణిస్తున్నది. ఎదుటనుండి తూర్పుగాలి వీస్తున్నది అందుచేత చిలికా జలరాశి నురుగులు గ్రక్కుతూ అలలు అలలుగా పశ్చిమ దిక్కునకు ప్రవహిస్తున్నట్టు గోచరిస్తున్నది. అంత వరకు ఎదురుగాలి లేనందువలన నావను తన ఇచ్ఛాను సారము జగుని నడిపించినాడు. కాని ఇప్పుడు జగుని కష్టపడ వలసి వస్తున్నది. తలనుండి నడుము వరకు తన శరీరమును కదుల్చుతూ రెండు చేతులతో తెడ్డువేస్తూ జగుని అతి కష్టముతో నావను నడుపుకు పోతున్నాడు. చిలికా జలములవలె అతని శరీర కండరములు ఉబ్బి ఉన్నవి.

చిలికా సరస్సు నిర్జనముగ నున్నది. బెస్తవారి తెప్పలు ఒడ్డుకు చేరుకొన్నవి. జగుని వెనుకకు మరలి చూసినాడు. సూర్యుడు అస్తమిస్తున్నాడు. సౌభాగ్యవతి పాపటిమీది సిందూర రేఖవలె చిలికా సరస్సులోని జలములను రెండుగ విభజిస్తూ అస్తమిస్తున్న సూర్యకిరణములు ఒక రేఖా రూపమున ఆ జలరాసిలో కన్పిస్తున్నవి తూర్పు దిశలోని పక్షులు తమగూళ్ళకు మరలుతున్నవి.

"దాని తరువాత:" ఈ బాధాకర ప్రశ్ననే రామచంద్రదేవ్ మాటి మాటికి తమలో తాము వేసికొంటున్నారు. జవాబు పొందలేని ప్రశ్న - మరల మరల వారిని ఆందోళన పరుస్తున్న ప్రశ్న.

భగ్నరహిత మైన రాగిజి వలె దుర్భేద్యమైనది బరుణ్ కుదా ద్వీపము లోని అరణ్యము. దానికి విశ్రాంతి లేదు. ఆ గహనారణ్యమును చూస్తూ రామచంద్రదేవ్ దాని దుర్భేద్యతను గురించే ఆలోచిస్తున్నారు. 'అన్ని స్థలములను వెతుకు వెదకుచు మొగల్ సైన్యము ఇచటి వరకు రాగలుగునా, లేదా:" అన్న నిశ్చయమై రామచంద్రదేవ్ దక్షుడైన ఒక సేనాపతి వలె అతి నైపుణ్యముతో అన్నివైపులనుండి ఆలోచిస్తూ సమీక్షిస్తున్నారు.

వట్టివేరు, ఎత్తైన సముద్రపు గడ్డి చిలికా సరస్సు మీద చాలా చోట్ల వ్యాపించి ఉన్నది. ఆ యా చోట్ల శాంతి గూడు కట్టుకొన్నట్లు ఉన్నది. కాడి చెట్టు ఒకటి మాత్రము కాపలా దారునివలె మేలొక్కని అచటి అనాహత ప్రశాంతిని, దాయాఘన రహస్యమును పరీక్షిస్తున్నది.

సాత్ పడా ద్వీపము వైపునుండి ఎగిరి వచ్చిన నల్ల గడిదుణీ పక్షుల దండు ఒకటి ఛాయాచ్ఛన్నమైన చిలికా జలములమీద వ్రాలినది. అనాహత మైన ఆనందము యొక్క సంతానమే ఇవి. వీటికి భయ సందేహములు లేవు, ఉద్వేగము లేదు, దుశ్చింత లేదు, మృత్యుభయము లేదు---ఆత్మరక్షణ కొరకు జగన్నాథుడు చిలికా సముద్రములోనికి ఎక్కడికో రానున్నాడని వాటికి తెలియనే తెలియదు. ఐహికా వాటికి చింతారహితమైన కాకలీ, సంతరణములు మాత్రము తెలిసి యుండవచ్చును:

రామచంద్రదేవ్ ఒకసారి నిట్టూర్చి చిలికా జలములను చూసినారు. రానురాను మఉసా-బ్రహ్మపుర్ ద్వీపము జలతలముపైన ఒక మొసలి వీపువలె ఉబ్బెత్తుగ కనుపించసాగినది. ఒరిస్సా చరిత్రలోని అనేక విపర్యయములు, విడంబనలు, నీచమైన విశ్వాసఘాతుకత్వములు, దేశద్రోహపు కళంకములు ఆ నామరహిత ద్వీపమునకు అంకితమైనవి.

రామచంద్రదేవ్ ఆ ద్వీపము వైపు సొంజ్ఞ చేసి "కాలాపహాడ్ వ్యూరీమీద దాడి చేసినాడని పరీఛా దివ్యసింహ్ పట్టనాయక్ విని, జగన్నాథుని మాణిక్ పాటనా ముఖ ద్వారము మీదుగా తీసికొని వచ్చి ఈ ద్వీపములోనే 'పాతాళ' చేసినాడు. కాని ఆంధారీకి చెందిన దాన్ పాహాంతా సింహ్ లంచానికి ఆశపడి కాలాపహాడ్‌కు దారి చూపించి ఇక్కడకు తీసికొని వచ్చినాడు జగన్నాథుని ఆచోకిని తెలిసికొని కాలాపహాడ్ ఆయనను ఏనుగు మీద ఎక్కించి గౌడ మార్గమున తీసికొని పోయినాడు. దాన్ పహాంతా సింహ్‌కు, అతను చేసిన విశ్వాస ఘాతుకత్వమునకు ఐహుమతిగా ఘోడా శిరియా, చబిష్ కుద్, రాహాంగ్ ఇలాకాల జాగీర్లతో బాటు పాహాంతా సింహ్ హోదా కూడా లభించినది...

నేడు కూడ ఇటువంటి పాపాంతా సింహాలు శత్రువులతో చేతులు కలిపి ఉత్కళ దేశ సౌభాగ్యమును ముక్కలు ముక్కలుగ చేసి పొడుచుకొని తింటు న్నారు." అని అన్నారు.

జగన్నాథుడు వారికి తగిన శాస్తి చేయడా?

పక్షులు గుంపులు గుంపులుగా మఉసా–బ్రహ్మపుర్ వైపు ఎగిరి వెళ్ళు తున్నవి. గోధూళి సాయం సమయపు అరుణ కాంతితో చిలికా సరస్సు రక్త వర్ణ ముతో దీప్తి చెందినది. రథయాత్ర తర్వాత దక్షిణమునుండి వచ్చిన అనేక మంది యాత్రికులు మాణిక్ పాటనా ఘాట్ దాటి తండా కినార్ మీదుగ మరలి వస్తున్నారు. పలుచోట్ల చీమల బారులులాగ పొడుగుగా నున్న మానవ శ్రేణులు అక్కడక్కడ గుమిగూడిన జనసమూహములు సంధ్యారుణ కాంతితో దీవిస్తున్న మలినాకాశపు పృష్ఠ భూమిపైని ఛాయా చిత్రములవలె కనిపిస్తున్నవి.

"నేడు నవమి రేపు లేదు ఎల్లుండే అధర్పణా భోగము. ఆ తరువాత నీలాద్రి విజయము. దాని తరువాత?" అని రామచంద్రదేవ్ తమలో తాము అను కొన్నారు.

తిరిగి ఆదే బాధాకరమైన ప్రశ్న వారి మనస్సులో తల ఎత్తుతున్నది.

సాన్ పరీఛా విష్ణు పశ్చిమ్ కపాట్ మహాపాత్ర మాత్రము చిలికా జలా లను రెప్ప వాల్చకుండ చూస్తూ మరేదో ఆలోచిస్తున్నాడు. ఈ అగాధ జలము నకు కూడ జీవమున్నది, హృదయమున్నది, భావన ఉన్నది, కాని వాటి పరిచయ భాగ్యము ఈ అలల చంచలత్వము వలన లభించడము లేదు. ఏమి తాళ్ళ లోతు గల నీటిలో ఆ రహస్యమయ జీవనము, హృదయము ప్రచ్ఛన్నముగా ఉన్నవి మానవ మనస్సులోని వందలాది ఆలోచనలు భావనలు వలె. వాటినిగూడ కండ్లతో చూడవచ్చును...ఎటుటి మనిషి హృదయములోని రహస్యములను తెలిసికొన గలిగితే! రామచంద్రదేవ్ ఏమిటి ఆలోచిస్తున్నారు? సాన్‌పరీఛా రామచంద్ర దేవ్ వైపు చూచినాడు.

రామచంద్రదేవ్ స్వప్నములో నున్నట్లుగా "ఇప్పుడు దీని తరువాత?" అని అడిగినారు.

ఈ రహస్యమయ ప్రశ్నలోని అంతరార్థమును సాన్‌పరీక్షా వెంటనే గ్రహించలేక పోయినాడు. "మఉసా బ్రహపుర్ ద్వీపముపైన జగన్నాథుని ఆ స్థానము ఇప్పుడు కూడ ఉన్నది" అని అతడు అన్నాడు.

జగుని వారి మాటలను వింటున్నాడు. నావ ఇప్పుడు మరొక దిశకు మళ్ళినందున యిపుడు దానిని నడపడము కొంచెము తేలిక అయినది.

"పూరీనుండి తిరిగి వచ్చు యాత్రికులు రసకుదా ఘాట్‌నుండి మఉసా బ్రహ్మపుర్ వెళ్లుతూ ఉంటారు. నేను ఇప్పుడు మీతోపాటు తిరుగు తున్నాను, లేకపోయిన యెడల యాత్రికులను తీసికొని వెళ్లుటకు, తిసికొని వచ్చుటకు కూడ నాకు తీరిక ఎక్కడ చిక్కుతుంది" అని జగుని అన్నాడు.

విష్ణు పశ్చిమ్ కపాట్ మహాపాత్ర జగునికి దగ్గరగా కూర్చొని ఉన్నాడు. ఆదరముతో అతని వీవును నిమురుతూ "దినికోసము నీవేమీ విచారించకు. నీకు నష్టము రానివ్వము. యాత్రికులనుండి నీకు రావలసిన దాని కన్న ఎంతో ఎక్కువగానే మేము ఇస్తాములే. కాని పొరపాటునగూడ ఎవరితోను మేము గురు బాయీ ద్వీపము మీదకు వెళ్ళినట్టు చెప్పకు" అని అన్నాడు.

జగుని తల ఆడిస్తూ గంభీర స్వరముతో "నేను ఒకరి విషయమును ఇతరులకు ఎందుకు చెప్తాను? నేను జగన్నాథ ద్రోహిని కాలేను, మీరు సొమ్ము ఇచ్చినా సరే ఇవ్వకపోయినా సరే" అని అన్నాడు.

జగునిని హృదయపు లోతులనుండి రామచంద్రదేవ్ చూసినారు. చాలా దినములుగ వాడు తమతోనే తిరుగుతున్నాడు. వానికి శ్రమలేదు, అయిష్టత లేదు. పరిశ్రమ కాతరత్వము లేదు. జగుని పట్ల రామచంద్రదేవుని హృదయము శ్రద్ధతో స్నిగ్ధ మైనది, "ఒరే జగుసీ! నేను నిన్ను ఎక్కడో చూసినట్టున్నది. కాని సరిగ జ్ఞాపకము వచ్చుట లేదు". అని ఆయన అన్నారు.

జగుని మనస్సు అభిమానముతో నిండిపోయినది. నావను త్వరితగతిని నడిపిస్తూ "తమరు పెద్దలు. రాజ్యమునకు రాజులు. తమ ముందు నేను ఎంతటి వాడినిు తమరు నన్ను ఎలా జ్ఞాపకము ఉంచుకొన గలంగుతారుు"అని అన్నాడు.

రామచంద్రదేవ్ విస్మితులై "నేను రాజునని నీకు ఎలా తెలుసుు" అని ఉత్సుకతతో అడిగినారు.

రామచంద్రదేవుని వైపు జగుని భక్తి పూర్వకముగ చూసి, "మా సర్దేయీ నుండి ఒక పు త్తరమును తీసికొని వచ్చి తమకు నేను ఖోర్ధాగఢ్‌లో అందజేసినాను కదాు" అని అన్నాడు.

రామచంద్రదేవ్ చిక్కుపడిన తమ కేశములను విడతీసికొంటూ ఆలోచించ సాగినారు. మరుపు చాటునుండి నెమ్మది నెమ్మదిగా జగుని పరిచిత రూపము రామచంద్రదేవుని కండ్లముందు ప్రకటితము కాసాగినది. 'పీడేనా ఆనాడు లలితా మహా దేయీ పేర వేణు భ్రవరవర్ ప్రాసిన ఉ త్తరమును తీసికొని వచ్చినవాడుు' ఒక మంత్ర పూతమైన కవచమువలె ఆ ఉ త్తరము రామచంద్రదేవుని ఒక పెద్ద విపత్తునుండి, ఒక దుర్యోగమునుండి కాపాడినది. "ఇతనికి సంబంధించి ఆ సర్దేయీ ఎవరోగాని ఆ ఉ త్తరమును బాలూ గ్రామములో బక్షీ పాయిక్‌లనుండి సత్రములో నేర్పుతో దొంగిలించి పీని ద్వారా పంపినది. ఆ సర్దేయీ ఎవరుు ఆ సత్రము ఎక్కడ ఉన్నదిు బాలూ గ్రామములో ఆ సత్రమును వదిలి ఇతడు ఇక్కడ ఎందుకు ఉన్నాడుు ఇక్కడ ఈ చిలికా సరస్సువద్ద ఏమి చేయవలెనని వచ్చినాడుు" ఈ విషయములన్నీ రామచంద్రదేవునికి సమస్యలవలె కనువించ సాగినవి. ఏ విధమైన ప్రత్యుపకారమును ఆశించని ఆ ఉపకారి అయిన జగునిని గుర్తించ లేనందుకు రామచంద్రదేవు మనస్సులోనే నిగ్గుపడినారు.

సాత్‌పడా మఉసా-బ్రహ్మపుర్‌ల మధ్యను చిలికా సరస్సు ఒక పెద్ద కందకము వలె నున్నది. మాణిక్ పాటనా నుండి హర చండీ నదియొక్క ఖాల్ కాటి పాటనా ముఖద్వారము వరకు పొడుగునా ఈ కందకము ఉన్నది. దానికి ఇరువైపులను దట్టమైన అడవులు ఉన్నవి. ఆ గట్లపైని ఏరా పక్షులు గుంపులు

గుంపులుగ దిగుతూ ఉంటవి. ఆస్తమిస్తున్న సూర్యుని అరుణ కిరణములు వాటి రెక్కలవైని బుక్కాపొడి ఆద్దినట్టుగా ఉన్నది. రామచంద్రదేవుని వైన కొన్ని జలసారసములు ఆకాశమలో ప్రదక్షిణలు చేస్తూ ఎగురుచున్నవి. గురుబాయీ ద్వీపము చాల వెనుకబడినది. బరుణ్‌కుదా ద్వీపము కనుమరుగైనది. కాలిఛాయీ కొండవైని చీకటి తెర పడుచున్నట్టుగా ఉన్నది.

ఎదుట నున్న మాణిక్ పాటనా ముఖద్వారము అనిశ్చితమైన అంధకారమువలె రహస్యమయముగ నున్నది. ఆ ముఖద్వారపు సామీప్యము వలన చిలికా సరస్సులోని తరంగములు ఉద్వేలిత మౌతున్నవి. ఆ తరంగముల తాకిడికి నావ ఎక్కువగ ఊగిసలాడుతున్నది.

జగుని తన రెండు చేతులతో చుక్కానిని పట్టుకొని నావను తన వశమందుంచుకొంటూ తండాకినార్‌లోని రసకుదా ఘాట్‌ను తన వ్రేలితో చూపిస్తూ "...అది...అదే మా సత్రము. ఆ సరివి చెట్టుక్రింద ఎవరో నిలుచున్నట్టుగా ఉన్నదే ఆమె మా సర్దేయీ కావచ్చును," అని చెప్పినాడు.

తండాకినార్ వద్ద సర్దేయీ సత్రము ఆకాశములోనుండి ఊడిపడిన ఒక చీకటి ఖండము వలె కన్పిస్తున్నది.

రామచంద్రదేవ్ తమ దృష్టిని జగునిపైకి మరల్చి "నీవు ఈ విషయమును గురించి సర్దేయీకికూడ చెప్పడము లేదుకదా? నీవు మాతోకూడ ఈ చిలికా సరస్సులో తిరుగు చున్నావన్న సంగతికూడ ఆమెతో చెప్పలేదు కదా? ఈ విషయములు అతి రహస్యమయినవి. ఎవ్వరికీ తెలియకూడదు. తెలిసినదా?" అని హెచ్చరించినారు.

జగుని తలను ఆడించి "ఎవ్వరికినీ తెలియనివ్వను" అని చెప్పి, కొంత సేపు మౌనముగా ఉండి, "సర్దేయీ నన్ను చాల గట్టిగనే అడుగుతున్నది. కాని నేను ఏవేవో మాటలు చెప్పి అసలు విషయము దాట వేస్తున్నాను. నేను జగన్నాథ ద్రోహిని కాలేను. ఆమెకు నా మీద కోపము కూడ వచ్చినది. రానివ్వండి, ఫరావాలేదు" అని తిరిగి చెప్పినాడు.

నాది ఉదయం తెల్లవారుతూ ఉండగా గురుబాయికి నావను తీసికొని వెళ్ళుటకు జగుని ఇంటినుండి బయలు దేరుతున్నప్పుడు సర్దేయీ దారికి అడ్డుపడి, "పిచ్చివానిలాగ ఎక్కడికి పోతున్నావు, నీవు నిజము చెప్పక పోయినట్లయితే నా మీద ఒట్టే. జగునీ, నాతో స్పష్టముగా చెప్పవా?" అని ఏడుస్తూ ఆడిగినది.

యాత్రికులను కొల్లగొట్టుట, గంజారేవుకు వెళ్ళు పడవల నైన దాడి చేయుట మొదలగు దారి దోపిడులను చేస్తున్న బందిపోటు దొంగల ముఠాలో జగుని కలిసి యుండవచ్చునని సర్దేయీకి చాలా అనుమానముగ నున్నది. కాని అటువంటి పనులను జగుని చేయడన్న నమ్మకముగూడ ఆమెకు ఉన్నది. తండా కినార్‌కు కొంచెము దూరములోనున్న నృసింహపాటనాకు దక్షిణాన కలావంత్ గుహ, గంజాగఢ్ సీమనానుకొని జాగాయీ-మాధాయి గుహ ఉన్నవి. వాటి వద్దనే అసహాయులైన యాత్రికులను బందిపోటు దొంగలు దోచుకొంటూ ఉంటారు. పడవల మీద ప్రయాణించే సాధువులను, తెల్లవారిని వీరు దోచుకుంటూ, వారి ధన, ప్రాణములను అపహరించే హృదయ విదారకమైన అనేక సంఘటనలను సర్దేయీ కథలుగా విన్నది. అప్పుడప్పుడు ఈ దొంగల ముఠాలు తన సత్రము పరకు కూడ వస్తూ ఉంటారు యాత్రికులను వెదకుకొంటూ. కొందరు తన సత్రములో బసచేయడము కూడ కలదు. వారిని సర్దేయీ నాన్నా, అన్నా, మామా అని ఏదో రకమైన బంధుత్వపు వరుసలతో సంబోధించి, మంత్ర ముగ్ధ సర్పములవలె వారిని తన వారిని చేసికొంటూ ఉంటుంది. వారు సర్దేయీ సత్రములో బసచేసి వారి దోపిడీసొమ్మును పంచుకొని, మద్యము సేవిస్తూ ఉంటారు. వారిలో వారికి తగవులు వచ్చినయెడల సర్దేయీ మధ్యవర్తిగ తీర్పులను ఇస్తూ ఉంటుంది. వారు సర్దేయీ తీర్పును మన్నిస్తూ ఉంటారుకూడ. అటువంటి సమయములలో జగుని వారిని గురించి ప్రస్తావిస్తూ ఉంటాడు. అందు చేతనే జగుని వారితో కలిసి తిరుగుతున్నాడేమోనని సర్దేయీకి అనుమానము.

సర్దేయీ ఒట్టులను లక్ష్యపెట్టకుండా జగుని మెల్లగ అక్కడినుండి జారుకొన్నాడు. మాణిక్ పాటనా గగన వీథిలో వేగుచుక్క అగ్నివలె మెరస్తున్నది.

అప్పటికింకను జలసారసములు మేల్కొనలేదు. జగుని వెతుండగ వెనుకనుండి సర్దేయా పిలుస్తూ చెప్పసాగినది. "జగునీ! పూరీనుండి తిరిగివచ్చే యాత్రికుల గుంపు నేడు వస్తున్నది. నేను ఒక్కతెను ఇక్కడ ఏమి చేయగలను?..." సర్దేయా కంఠము రుద్ధమైనది. కాని అప్పటికే జగుని రసకుదా గ్రామము వైపు వెళ్ళి కనుమరుగైనాడు.

బహుశా ఆ సర్దేయాయే ఆ నిర్జన రేవులో సాయం సమయపు అరుణ కిరణ రంజితమైన చిలికా సరస్సును వీక్షిస్తూ జగుని కొరకు నిరీక్షిస్తూ ఉండవచ్చును.

ఒక మలుపు వద్దకు వచ్చుసరికి ఆ రసకుదా రేవు కనుమరుగైనది. అప్పటికి సాయంకాలమయినది. నోరు తెరచిన మొసలి దవడలవలె నున్న రెండు మేఘ శకలముల మధ్య నవమినాటి మ్లాన చంద్రుడుదయించినాడు.

అరఖ్‌కుదా ఇంకను దూరమున నున్నది. మాణిక్ పాటనా వద్ద నావ దిగి గుర్రము మీద వెళ్ళవలెను.

తన మనస్సులో ఆణచుకొని యుంచిన అభిప్రాయమును హఠాత్తుగ బయలు పరస్తూ "ఛామూ అనవసరముగ శంకిస్తున్నట్టు ఉన్నారు. తకీఖాన్ శ్రీక్షేత్రమువైన దాడి చేస్తాడని నాకు తోచడములేదు." అని విష్ణు పశ్చిమ్ కపాట్ మహాపాత్ర అన్నాడు.

"ఆలా ఊహించుటకు కారణము ఏమైన ఉన్నదా?" అని రామచంద్ర దేవ్ విచార స్వరముతో ప్రశ్నించినారు.

"ముర్షిదాబాద్‌లో సుజాఖాన్ ఉన్నంతవరకు జగన్నాథుని యెడల ప్రస్తుతము అనుసరింప బడుతున్న ఉదార వైఖరే అనుసరించ బడవలసి ఉంటుంది. ఇది మొదటి విషయము..." అని విష్ణు మహాపాత్ర ఇంకా ఏమో చెప్పబోతూ ఉండగ, రామచంద్రదేవ్ మధ్యలోనే అడ్డువచ్చి "కాని ఆ సుజాఖాన్ కటక్‌లో నాయబ్-నాజిమ్‌గా ఉన్నప్పుడు మొగల్ రాజ్య పరిస్థితి ప్రమాద భరితము గానూ లేదు, జగన్నాథుని వెనక ఉత్కళ దేశములో రాజకీయ ఐక్యతా లేదు" అని అన్నారు.

"ఇది ముమ్మాటికీ నిజమే, కాని చాలకాలముగ ఓడ్ర పాయిక్‌లు మొగల్ శక్తిని ఎదురించి పోరాడి అలసి పోయినారు తకీఖాన్‌కు ఈ విషయము తెలియనిది కాదు. అందువల్లనే అతడు మన పాయిక్‌లకు భయపడడము లేదు." అని మహాపాత్ర అన్నాడు.

రామచంద్రదేవ్ మహాపాత్ర వాదమును దృఢముగా ఖండిస్తూ "కాని, నేను మీ వాదముతో అంగీకరించలేను. ఇది కాక మీరు వేరు కారణమును చెప్పగలరా ?" అని శాంత స్వరముతో అడిగినారు.

"జగన్నాథ యాత్రికుల నుండి లభిస్తున్న జిజియా పన్ను మొగల్ రాజ్యమునకు ప్రధానమైన రాబడి. తకీఖాన్ మరల ఈ జిజియాను అమలు పరచినప్పటి నుండి ఏటా తొమ్మిది లక్షల రూపాయలు మూర్షిదాబాద్ ఖజానాకు చేరుతున్నవి. అంతేకాదు, దీని వలన ఇజారాదార్లకు ఇతర ప్రభుత్వోద్యోగులకు ఎంతో కొంత ముట్టుచునే ఉన్నది. అందువలన జగన్నాథుని నాశనము చేసి ఈ లాభప్రదమైన రాబడిని తకీఖాన్ పోగొట్టు కొంటాడా ?" అని విష్ణు మహాపాత్ర అన్నాడు.

తండాకినార్ మాణిక్ పాటనాల మధ్య చిలికా సరస్సు వెడల్పు తక్కువగాను, ఇరుకుగాను ఉండడమువలన అక్కడ అలలతాకిడి ఆధికముగాను, ప్రవాహము ప్రతికూలముగాను ఉంటుంది. సాయంత్రమగుసరికి పోటు ప్రారంభమయినది. నావల రాకపోకలకు ఆ ముఖద్వారము చాల ప్రమాదకరమైనది. ఆనేకచోట్ల నీటిలో సుడిగుండములు ఉండడమువలన వాటిలో నావ చిక్కుకొని మునిగిపోయే ప్రమాదమున్నది. అందుచేత ఆ మార్గమునకు పరిచితులై, అనుభవజ్ఞులైన నావికులు తప్ప ఇతరులు ఆ మార్గమున నావలను తీసికొనిపోరు. ఆ మార్గము తెలిసినవారు సుడిగుండములను తప్పించుకొనుటకు ఒడ్డు నానుకొని వెళ్లుచుందురు.

ఆకస్మాత్తుగ నావ ఒక పెద్ద అలతోపాటు పైకిలేచి క్రిందకు పడినప్పుడు "జై మాతా ! కాలిజాయీ !" అని జగుని అరచి నావను తండాకినార్ వైపునకు

మళ్ళించినాడు. ఆ తరువాత నావ ఏ ఒడుదుడుకులు లేకుండ అలల మృదుల తాకిడులకు ఉయ్యాలవలె ఊగులాడుచు హంస వలె శాంతముగ నడవ నారంభించినది.

తండాకినార్ ఇసుక తిప్పకు ఆవలివైపున సముద్రఘోషలో అన్ని యితర శబ్దములు అయమైపోయినవి.

"తకీఖాన్ ఒక్క దెబ్బకు రెండు పిట్టలను కొట్టవలె ననుకొనుచున్నాడు. శ్రీ మందిరము పైన దాడి జరిపి నికరమైన జిజియా రాబడిని పోగొట్టుకొనవలె నని అతడు తలచుటలేదు కాని జగన్నాథుని వద్ద మరల సుస్థిరపడిన ఉత్కళ దేశపు రాజకీయ ఐక్యత ఖోర్ధా చుట్టూ కేంద్రీ కృతమై అక్షయముగా ఉండుట అతనికి ఇష్టములేదు. అందుచేతనే అతడు అమీన్‌చంద్‌ను పూరీకి నాయబ్‌గా నియమించి పంపినాడు. అతడు హిందువు. ముసల్మాను కాడు. 'అందువలన జగన్నాథుడు అవమానింపబడుతాడని గాని, అపవిత్రు డవుతాడని గాని హిందువులు భయపడరు. దీనివలన ఖోర్ధారాజు జగన్నాథుని రాజసేవలకు దూరము కాగలడు. అప్పుడు ఇతర దుర్గాధిపతులు, సామంతులు ఖోర్ధారాజు ఆధిపత్యమును అంగీకరించరు. ఖోర్ధా రాజు అమీన్‌చందును ఎదిరిస్తే ఖోర్ధా రాజును సింహాసనమునుండి తొలగించి భాగీరథీకుమార్‌ను కీలుబొమ్మను చేసి కూర్చుండ బెట్టవచ్చును,' ఇదీ తకీఖాన్ పన్నాగము. ఈ ఆలోచనను కార్యరూపములో పెట్టుటకుగాను బాణ్‌పూర్‌కు కబురు వెళ్ళినది. యువరాజు ఈ తండాకినార్ మీదుగనే పూరీ వెళ్ళినట్టు నాకు వర్తమానము అందినది." అని రామచంద్రదేవ్ తకీఖాన్ ఆలోచనలను ఊహించి విశదీకరించినారు.

చిలికా సరస్సు పైన వెన్నెల వ్యాపించినది. సురుగులు క్రక్కుతున్న కెరటములు, సుడిగుండములు వెన్నెల వరదవలె గోచరిస్తున్నవి. కాని దాని ప్రక్కనే అగాధమైన అంధకార మున్నది. చంచల జలసాహసములు భయోద్వేగ రహితముగ స్వైర విహారము చేస్తూ ఆనంద బుద్బుదములవలె ఆ చీకటి వెలుగుల మహా ప్రవాహములో ఒకసారి పైకిలేస్తూ, వేరొకసారి క్రిందకు దిగుతూ ఎగురుతున్నవి.

"నేటివరకు మొగల్ ఫౌజ్‌దార్లు జగన్నాథుని అవమానిస్తూనే ఉన్నారు. కాని ఇకమీద హిందువుడైన అమీన్‌చంద్ వంటి హిందూమత నాశకుని చేతులలో జగన్నాథుడు అవమానింప బడనున్నాడు. ఈ అవమానము చూచుటకు మీరయితే ఇప్పుడు అక్కడ లేరు. గౌరీరాజగురు ఈ కార్యములో అమీన్ చంద్‌కు సహాయము చేసినట్లయితే ఆయనకు ఐహుమతులు, జాగీరులు తప్పక లభించగలవు. ఆయనకు అట్టి వాగ్దానము లభించినది కూడ. ఆ పరిస్థితులలో మీరు అక్కడ సాన్‌పరీఛాగా కొనసాగే అవకాశమున్నదంటారా? విద్రోహుల జాబితాలో మీ పేరుకూడ తప్పక చేర్చబడే ఉంటుంది." అని రామచంద్రదేవ్ అన్నారు.

సాన్‌పరీఛా విష్ణుమహాపాత్ర వయస్సులో యువకుడు. ఆయనలో మెండుగా ఓడ్రాభిమాన మున్నది. ఆయనకు జగన్నాథుని తోడను, శ్రీ మందిరము తోను ఉన్నటువంటి సంబంధము తరతరముల నాటిదీ, స్మరణాతీతమైనదీను. మొగలుల అవమానములకు గురికాకుండగ జగన్నాథుని కాపాడుటకు ఆయన పూర్వులు నిర్భయముతో ఎంతో గొప్ప సాహసములను ప్రదర్శించినారు. ఆ సద్గుణములు ఆయన రక్తములో నరనరమున పట్టి ప్రవహిస్తున్నవి.

తండాకినార్ ముఖద్వారము చేరువలోనే ఉన్నది. ఆ వెన్నెల వరదలో దిశలు, మార్గములు అన్నీ ఏకమయినట్లుగ కనువిస్తున్నవి. జగుని నావను మాణిక్ పాటనా వైపు మళ్ళించినాడు.

దగ్గరలోనే ఒక సుడిగుండము వెన్నెలలో తన పరిధిని విస్తరించుకొని ఉన్నది. ఆది తరంగ రహితముగాను, స్తబ్ధముగాసు ఉన్నది. నావ అందులోనికి ప్రవేశించగనే గిరగిర తిరగ నారంభించినది. "జై మాతా కాలిజాయీ!" అని గట్టిగ కేకలువేస్తూ నావను మళ్ళించుటకు జగుని ప్రయత్నించ సాగినాడు. సుడిగుండములో మధ్యనున్న అగాధ గహ్వరమును నావ చేరినట్లయితే నావలోని వారు బ్రతుకుట దుర్లభము.

అదృష్ట వశమున వెనుకకు మరలి వస్తున్న ఒక పెద్ద ఆల నావను ఢీకొని నావ తండాకినార్ వైపుకు నెట్టబడినది.

"జయ్ మాతా కాలిఖాయీ!" అని సాన్‌పరీచా నిట్టూర్చినాడు.

జగుని చుక్కానిని వదలి "పోటు తగ్గువరకు ఇటునుండి కదలుట శ్రేయస్కరము కాదు" అని హెచ్చరించినాడు.

సమ్మోహితుని వలె రామచంద్రదేవ్ సుడిగుండమును చూడసాగినాడు. నావవైని జగుని పడవేసిన తెడ్డును తీసికొని "మీరు చుక్కానిని పట్టుకోండి. నేను తెడ్డు వేసి నావను మరలిస్తాను" అని సాన్‌పరీచాతో రామచంద్రదేవ్ అన్నారు.

జగుని నావ అంచున కూర్చుని "జై మా! కాలిజాయీ!" అని బిగ్గరగ అరవనారంభించినాడు.

పరిణామమును ఉపేక్షిస్తూ, ఉన్మత్తునివలె రామచంద్రదేవ్ నావను తిరిగి ముందుకు సాగనిచ్చినారు. మృత్యుగర్భితమైన ఆ భయంకర సుడిగుండము వైపుకు ఒక ముగ్ధ రాజహంసవలె నావ సాగిపోసాగినది.

2

మాణిక్‌పాటనా ముఖద్వారము వద్ద చిలికా సాగర తరంగముల క్రుద్ధ ప్రతి రోధములను, జలావర్తముల కరాళ భ్రుకుటులను ధిక్కరిస్తూ నావను అరఖ్‌కుదా ఘట్టమువైపునకు నడిపించుటకు రామచంద్రదేవ్ ప్రయత్నిస్తున్నారు.

అదే సమయమందు పూరీ చుడంగసాహీలో సునామాహారీ నివాసమువద్ద ఒక గదిలో మఖమల్ గద్దె వైన జాలీసులను ఆనుకొని సురాపాన మత్త స్వర ముతో "రండి, రండి, దయచేయండి భాగీరథీ కుమార్‌జీ! తమరు ఆలస్యము

చేసినారు. తమకు సమయమునకు ఇక్కడకు చేరలేదు. అందుచేత మతచ్యుతు లైన ఖోర్ధా రాజావారే జగన్నాథుని రథముపైన చేరాపహరా ఇచ్చినారు. కాని, ఆ కార్యము వలన ధర్మప్రాణమైన ప్రతి హిందూ హృదయముపైన దెబ్బ కొట్టి నట్లయినది! అంతేకాదు; హిందూమత గౌరవమే మంట కలిసినది," అని అమీన్‌చంద్ భాగీరథీ కుమార్‌తో ప్రసంగించ సాగినాడు.

అమీన్‌చంద్‌కు చేరువలో ఘూర్చుని సునామాహాకీ ఆయనకు తమల పాకుల చిలుకలను అందిస్తున్నది. ఆమె కాటుక కండ్లు పాన్‌దాన్ పైన నిబద్ధమై ఉన్నవే కాని, ఆమె వక్రపు కనుబొమల ప్రకింద్రుండి ఆమె సస్మిత దృష్టి మాత్రము భాగీరథీ కుమారుని దృష్టితో దాగుడుమూత లాడుచున్నది. ఆ ఆనందానుభవమును భాగీరథీ కుమార్ తన లోపలనే పొందుపరచు కొంటు న్నాడు.

తన ఆకర్ణాయత విశాల నేత్రముల అగ్ని శిఖలో భాగీరథీ కుమార్ వంటి అనేక చపల, ప్రమత్త పతంగములు ఆహుతి అయినవని ఆమెకు తెలి యును. మస్మథుని ఆ మధుర ఆహ్వానమును భాగీరథీ కుమార్ గూడ తిరస్క రించ లేదు.

భాగీరథీ కుమార్ పూరీ చేరునప్పటికి నిజముగానే ఆలస్య మయినది. అందుకు ఏదో ఒక సాకుతో అమీన్‌చంద్‌కు సంజాయిషీ ఇచ్చుకొన వచ్చును. కాని లలితా మహాదేయికి ఏ విధమయిన సంజాయిషీ అతడు చెప్పగలడు? ఈ ఆలోచన కలిగినంతనే అతని ముఖము వివర్ణము కాజొచ్చినది. మాలద్ ఫౌజ్ దార్ అతనిని బంధించకుండా ఉండియుండిన యెడల బహుశా అతడు సకాల మునకు పూరీచేరి జగన్నాథుని రాజకార్య విధులను నెరవేర్చి యుండెడివాడేనేమో? కాని తండాకినార్ వద్ద సర్దేఖూ సత్రమునుండి విముక్తుడై వచ్చుటలోనే రెండు దినములు గడచి పోయినవి. ఆ ఆలస్యమునకు సంజాయిషీ ఏమని చెప్ప గలడు? అది అతనికి సంభవము కాదు.

ఆనాడు తెల్లవారినది మొదలుకొని ఎడతెరపి లేకుండ వాన పడుతూనే ఉండెను. మ్లాన భరితమైన నేత్రములవలె ఆకాశముమీద మేఘములు ఎట్లు ఆవరించి ఉండెను ; తుఫాను వలన సత్రమును వీడి వచ్చుటకే వీలు కలుగ లేదు ; ...ఇవన్నీ తన ఆలస్యమునకు కారణములు కావచ్చును. కాని ఇంతటి సామాన్యమైన, తుచ్ఛమైన అవరోధములను అధిగమించజాలని వానికి రాజ సింహాసనా కాంక్ష దురాకాంక్ష మాత్రమే కాగలదు.

యథాసమయమునకు కుమార్ పూరీ చేరక పోవుట లలితా మహాదేయీ దృష్టిలో క్షమింపరాని అపరాధము.

సునామాహారీ తరంగాయిత భంగిమలో లేచి గది బయటకు వెళ్ళినది. ఆమె నిగ్గు వలననో, సంకోచము వలననో ఆ విధముగ బయటకు వెడలినట్లు గోచరించినది. కాని గురు నితంబిని అయినటువంటి సునామాహారీ మత్తహాస్తిని వలె అనేక కోమల హృదయములను దళితము చేసినది. ఈ విషయమును సూచించుట గూడ ఆమె ఆందోళిత అంగలతలోని అభిప్రాయమై యుండ వచ్చును. తన అపూర్వ రూప లావణ్యమును, దాని సమ్మోహినీ శక్తిని భాగీరథీ కుమారునకు పరిచయము చేయవలెనన్న అభిప్రాయముతో గూడ ఆమె ఆ విధముగ వెళ్ళియుండవచ్చును. లేనట్లయిన సువ్యవస్థిత కుంతలముల నుండి సుగంధితమైన మొగలి పూరేకు ఒకటి ఎట్లు రాలి పడగలదు ; లేడిపిల్ల వలలో చిక్కుకొన్నదా లేదా అని వేటగాడు చూచునట్లుగ ఆమె వెనకకు తిరిగి చూసినది. ఆమె ధరించి యుండిన పల్చని వస్త్రముల క్రింద సుగంధితమైన శరీరావయవముల అద్భుత యౌవన వంపుల శోభ వలన భాగీరథీ కుమార్ సుమశరాహతుడు కాజొచ్చినాడు.

సునామాహారీ పూరీలో ఒక ప్రఖ్యాత వేశ్య. ఆమె ఇద్దరు సోదరీలు జగన్నాథుని సేవలో దేవదాసీలు. ఆలయములో బడసింహార్ పూర్తయిన తరువాత వారు ఇతర దేవదాసీలతో బాటు గీత గోవిందము గానము చేసుంటారు. సునామాహారి తల్లి కేతకీమాహారీ. ఆమె తన తరుణ వయస్సులో కటక్‌లో నాయబ్ - నాజిమ్‌గా నుండిన సుజాఖాన్‌ను గాలములో చిక్కుకొనిన

చేపవలె గిలగిల లాడించినది. సుజాఖాన్‌కు ప్రీతిపాత్రుఁ కావలెనన్న కోర్కెతో కేతకీమాహారీ వాకిలివద్ద ఎంతో విధేయతతో అనేకమంది రాజులు, జమీందారులు వేచి ఉండేవారు.

దివ్యసింహదేవ్ మహారాజా వారి ప్రాపకములో ఈ కేతకీమాహారీ ఉండెనని అందరూ చెప్పుకొంటారు. బాలిసాహీ ప్రాసాద సాధనా కక్షలో వారామెతో దివారాత్రములు గడపుచుండేవారట !

దివ్య సింహదేవుని ఆరవ అంకములో శ్రీ మందిరమును ధ్వంసము చేయవలెనని సుజాఖాన్ దండెత్తి వచ్చినాడు. ఆ దాడిని ఎదుర్కొనుటకు చందన్‌పుర్ వద్ద దివ్యసింహదేవ్ ఒక సైనిక శిబిరమును నెలకొల్పినారు. ఆయనతో గూడ ఆ శిబిరమునకు కేతకీమాహారీ వచ్చినది. సుజాఖాన్ అకస్మాత్తుగ ఆ శిబిరముపైన దాడి సలిపినపుడు రాజావారు లేరు. ఆ శిబిరములో సుజాఖాన్ కొరకే నిరీక్షిస్తున్నట్లుగా ఆమె అతనికి ఎదురైనది. ఆమె అతనికి వంగి సలామ్ చేసి, వినమ్ర నేత్రములతో అతనిని చూసి, మౌనముగ నిలబడినది. ఎడమ కాలి బొటన వ్రేలితో నేలపైని గీతలు గీయసాగినది. ఆ ఎడమ కాలు తప్ప మరి ఏ యితర అవయవములను ఆమె కదల్చలేదు.

సుజాఖాన్ ఆమె చెంతకు వచ్చి, ఆమె చిబుకమును తన కుడిచేతితో పైకెత్తి "నీవు ఖోర్దా రాజుకు సేనాపతివా?" అని అడిగినాడు.

అరక్తమైన కేతకీ ముఖమండలము పైన ఈషన్మాత్రము కూడ భయము ఆవహించలేదు అతని ప్రశ్నకు చిరునవ్వును సమాధానముగ ఇచ్చి తన చుబుకమును అతని చేతినుండి తొలగించి మౌనము వహించినది.

నాటకీయముగా సుజాఖాన్ తన ఖడ్గమును ఒరతో గూడ ఆమె కాళ్ళ ముందర నుంచి, సస్మిత దృష్టితో ఆమె కుసుమ కోమల ముఖమండలమును వీక్షించి "మంచిది, మేము యుద్ధము చేయకుండ ఆత్మసమర్పణము చేసికొంటున్నాము," అని అన్నాడు.

ఈ అవకాశమును సద్వినియోగ పరచుకొని దివ్యసింహదేవ్ శ్రీ మంది రమునుండి మరొక స్థానమునకు విగహములను తరలించి వేసినారు. ఆ తరు వాత సుజాఖాన్ మరెన్నడూ పూరీమీదకు దాడి వెడలలేదు.

కేతకీమాహారీ కుమార్తె సునామాహారీ తల్లివలెనే అపురూప సౌందర్యవతి. ఆమె లావణ్యమునకు పూరీ, కటక్ ముర్షిదాబాదుల వరకు నలువైపులను జయ నాదములే విన్పిస్తుంటాయి.

సునామాహారీ వెళ్ళిపోయినది. కాని భాగీరథీ కుమారుని మగ చేతస్సులో ఆమె కాలి అందెల మధుర ఝంకార ధ్వనులు యింకా ఉపశమించ లేదు. ఉండి ఉండి ఆమె గాజుల, అందెల మధుర రవళులు మధుర సంగీతము వలె గది బయటనుండి విన్పిస్తున్నవి. వాటిని వినుటకు భాగీరథీ కుమార్ చెవులు రిక్కించి కూర్చున్నాడు. అమీన్‌చంద్ నేత్రములు అర్ధనిమీలితముగ నున్నవి. బహుళా అతడేదో ఆలోచనలో నిమగ్నుడై యుండవచ్చును. భాగీరథీ కుమార్ ఆ సమయమందు సునా కుంతలముల నుండి జారిపడిన ఒక మొగలి పూరేకును నేలపైనుండి తీసి, దానిని వాసన చూస్తూ, ముక్కుముక్కలు చేస్తూ, మఖమల్ గద్దెమీద వెదజల్లుతున్నాడు. ఆతడు తన మనస్సులో సర్దేయీ సజల నేత్రములను సునామాహారీ నయనములతో పోల్చి చూసుకొంటు న్నాడు. ఛాయాచ్ఛన్నమైన చిలికా ఘన నీల జలాలవలె ప్రశాంతముగ నున్నవి. సర్దేయీ నయనములు. వాటి అగాధ గాంభీర్యములో నిమజ్జితము కావలెననే అభిలాష మేల్కొంటూ ఉంటుంది.....కాని సునా నేత్రములు? హాస్యవిలోలిత మైన ఈమె నేత్రములందు స్రోతస్సులోని చాంచల్యమున్నది, అస్థిరత్వము నుండి మేల్కొలుపు ఆహ్వానమున్నది.

అమీన్‌చంద్ కండ్లు తెరచి భాగీరథీ కుమారుని చూసి అతని ఉనికిని గుర్తిస్తూ జాగరూకుడై కంపిస్తున్న స్వరముతో "తమరు జాగు చేసినారు," అని అన్నాడు.

భాగీరథీ కుమార్ అకారణముగ నవ్వుతూ, "మీ మాలద్‌ఫౌజ్‌దార్ ఏమి చేసినాడో మీకుతెలుసునా? మేము కందా నసిని దాటుచుండగా అతడు మమ్ములను అడ్డగించినాడు. లేకపోయిన యెడల మేము సమయానికే వచ్చి ఉండేవారము" అని తన సంజాయిషిని స్ఫురింప జేసినాడు.

గది బయట సునా గాజులు మరొకసారి గలగల మన్నవి. భాగీరథీ కుమార్ చంచల స్వభావము అతనిని అటు త్రిప్పినది. అతని దృష్టి అటు తిరిగినది. అమీన్‌చంద్ కూడ ముగ్ధ నీరవత్వముతో ఆ ధ్వనిని వినినాడు. అతడు ప్రక్కనే ఉన్న హుక్కా గొట్టమును అందుకొని గుడ గుడ పీలుస్తూ, "మర్యాద హీనుడైన ఆ ఫౌజ్‌దారొక మూర్ఖుడు. అందువలన అతనిపైన తకీఖాన్ బహదూర్ వారికి చాలా కోపము కలిగినది. కాని తమరు రాజ మార్గ మున రాక ఆ త్రోవను ఎందుకు వచ్చినారు?" అని అడిగినాడు.

భాగీరథీకుమార్ చిన్నగా నవ్వి "ఖోర్ధా దారిలో ప్రతి ఘాటివద్దను సైనికు లను నియమించుట వలన మమ్మల్ని వారు నిర్బంధించే అవకాశమున్నది." అని చెప్పినాడు.

అసలు విషయమును ఏ విధముగా ప్రారంభించ పలెనో తెలియక అమీన్ చంద్ ఆలోచించ సాగినాడు. తరువాత అస్పష్ట హుంకారముతో హుక్కా గొట్ట మును క్రిందపెట్టి, కంఠమును సరి చేసికొని, "తమరు ఆ విధముగ సందేహిం చుట తగదు. నేడు ఖోర్ధాలో తమరు తప్ప అన్యులెవరూ నాయబ్-నాజిమ్ తకీ ఖాన్ బహదూర్ వారి దృష్టిలో లేరు. హాషిమ్‌ఖాన్ బాణ్‌పుర్ మీదకు దాడి వెడ లిన మాట నిజమే. కాని అది మీ మీదకు కాదు. తిరుగుబాటుదారులను శిక్షించ డమే ఆ దాడిలోని ప్రధాన ఆశయము. అంతేకాని వేరొక అభిప్రాయము లేదు. ఇంతకూ అతడు తమరిని ఎందుకు ఖైదు చేస్తాడు?" అన్నాడు అమీన్‌చంద్.

కాని ఆ సమయమందు భాగీరథీ కుమారుని మనస్సు ఆ తుచ్ఛమైన కూట రాజనీతి పైన లేదు. అది అంతఃపుర చారిణి సునామాహారీపైకి మరలినది. ఆమె నిగనుండి రాలిపడిన ఆ మొగలి రేకులోని ఒక తునకను అతడు నోటిలో పెట్టుకొని నములుతున్నాడు.

"ఖోర్ధా సింహాసనము పైన తమను కూర్చుండ బెట్టవలెనని నాయబ్-నాజిమ్ వేగిరపడుతున్నారని తెలిసికోండి, తమరు వారిని అన్యథా భావించకండి" అని అమీన్‌చంద్ కుమార్‌తో చెప్పినాడు.

ఖోర్ధా సింహాసనము పైన భాగీరథీ కుమారుని ఆకాంక్ష లలితా మహాదేయీ ప్రోత్సాహము వలన బహు దినములనుండి పెరుగుతూ వచ్చినది. రామచంద్ర దేవుని పైన కలిగిన ఒక అకారణ ఏవగింపుతో అతని హృదయము విషాక్త మయిన మాట వాస్తవమే. కాని, తన తండ్రిని సింహాసనమునుండి ఉపేక్షరించి దానిని అతడు అధిరోహించడము అనే తలంపే అతనికి అమంగళకరముగ తోచినది. ఈ భావమును తన తల్లి యెదుట వ్యక్తము చేయుటకు అతడు ఎన్నడూ సాహసించలేదు. కాని ఇప్పుడు అమీన్‌చంద్‌ముందు తన అభిప్రాయమును వెల్లడి చేయుటకు సంకోచించనవసరము లేదు. అందువలన "కాని, మహారాజా వారు ఉంటూ ఉండగా నేను సింహాసనము పైన ఎట్లు కూర్చోగలను?" అని అడిగినాడు.

తన భావమును అతడు గ్రహించలేక పోయినందుకు అమీన్‌చంద్‌కు కొద్దిగ కోపము వచ్చినది. "తమరు ఎవరిని మహారాజు అని అంటున్నారు? కుమార్! తమ తండ్రిగారు ఒక యవన స్త్రీని వివాహమాడి మత భ్రష్టులైనారు. ముక్తి మండప పండితుల పక్షపాత నిర్ణయము ప్రకారము వారికి ఛేరా పహరా చేసే అధికారము లభించినప్పటికిని ఆయనకు శ్రీ మందిర ప్రవేశము నిషిద్ధ మయినది. ఆలయములోపల వారికి ఏ అధికారమూ లేదు," అని కొంచెము తీక్ష్ణముగానే అమీన్‌చంద్ అన్నాడు.

అమీన్‌చంద్ ప్రసంగము భాగీరథీ కుమార్‌ను ప్రభావితుణ్ణి చేయలేక పోయినది. అతడు ఆ మొగలి రేకు ముక్కను నములుతూ సునామాహారీ గాజుల గలగల కొరకు, ఆమె అందెల రవళుల కొరకు ఆతురుడుగా వేచి ఉన్నాడు.

పూరీ చేరిన తర్వాత అమీన్‌చంద్‌ను గుండిచా గృహము వద్ద కలిసినప్పటినుండి అతనియందు ఒక విరక్తి భావము కలిగినందువలన భాగీరథీ

కుమార్ అత్యంత అవ్యవస్థితుడైనాడు. అమీన్‌చంద్ తన యెడల సమ్మాన భావమును, సదిచ్ఛను ప్రకటించి, శుభాకాంక్షలను తెలియజేసినప్పటికిని అతనితో ఎట్టి సంపర్కమునైనను పెట్టుకొన వలెనన్న అభిప్రాయము భాగీరథీ కుమారునకు కలుగలేదు. కాని ఈ మధ్యలో లలితా మహాదేయీ ఒక ప్రత్యేక వార్తాహరుని ద్వారా తన పేర ఒక లేఖను వ్రాసి పంపినది. ''రాజా అమీన్‌చంద్ మన హితైషి. ఆయన సూచించిన మార్గాన నడుచుకో. వారు ఏది ఆదేశిస్తే అది నెరవేర్చు'' అని ఆ లేఖలో ఉన్నది.

ఆమె ఆదేశమును శిరోధార్యముగ భావించి రాజకార్య నిర్వహణకొరకు, అవసరమైన సలహా సంప్రదింపుల కొరకు గుండిచా గృహములో అమీన్‌చంద్‌ను కలిసికొనుటకు భాగీరథీ కుమార్ వచ్చినాడు. ఈ మంతనములన్నీ రామచంద్ర దేవ్‌కు విరుద్ధముగా ఉండగలవనీ, తండ్రిపైన ఒక కుట్ర తయారవుచున్నదనీ అతనికి తెలుసు. కాని అపరిచితుడొకడు తన తండ్రిని గురించి దుర్భాషలాడుటను విని సహించుటకు మాత్రము అతడు సిద్ధముగా లేడు. అందువలన అతడు తన ప్రతి క్రియను సూచిస్తూ మౌనము వహించి కూర్చున్నాడు.

"హిందూ మతచ్యుతుడు, జగన్నాథ సేనా భ్రష్టుడు, యవనుడు అయిన హాఫిజ్‌కాదర్‌కు ఖోర్ధా సింహాసనముపైన ఎట్టి అధికారము లేదు. యువరాజుగా తమకే ఖోర్ధా సింహాసనము పైన అధికారమున్నది. నాయబ్-నాజిమ్ తకీఖాన్ బహాదుర్ వారి అభిప్రాయము కూడ ఇదే," అని అమీన్‌చంద్ చెప్పినాడు.

ఇత్తడి పాత్రలో వెలుగుతున్న దీపము వైపు తీక్ష్ణ దృష్టితో చూస్తూ "రామచంద్రదేవ్ మహారాజా వారు తమంత తాము మతచ్యుతులు కాలేదు. బలాత్కారముగ ఆయన మతాంతరులు కావించబడినారు'' అని భాగీరథీ కుమార్ అన్నాడు.

ఈ మాటలను విన్న అమీన్‌చంద్ చాల సేపటి వరకు అచేతనుడై చేతిలోని హుక్కా గొట్టమును పెదవుల క్రింద నొక్కిపెట్టి కూర్చుండి పోయినాడు. తరువాత నోటిలోని పొగను మెల్లగ వదులుతూ "సరే, ఖోరా సింహాసనమును

భాగీరథీ కుమార్ ఆభిషించుట లేదని లలితామహాదేయీకి కబురు చేస్తాను. నాయబ్-నాజిమ్ బహాదుర్ వారు ఖోర్ధా సింహాసనమునకు మరొక ఉత్తరాధికారిని తప్పక ఎన్ను కొంటారు. ఖోర్ధా సింహాసనమును ఆశించే వారి సంఖ్య కూడ తక్కువగా లేదు. కాని ఒకటి మాత్రము నిశ్చయము. హాఫిజ్‌కాదర్ మాత్రము ఇకనుండి సింహాసనమునకు అధికారి కాడు," అని అతడు అన్నాడు.

మాటలో మాటలోనే ఖోర్ధా సింహాసనము చెయిజారి పోతున్నదన్న విచారము గూడ భాగీరథీకుమార్‌కు లేదు. కాని మహారాణి లలితా మహాదేయీ యొక్క రోషకషాయిత విశాల నేత్రములు రెండూ భాగీరథీ కుమార్ ఎదుట కనిపించినవి. వెంటనే భాగీరథీ కుమార్ ఉద్విగ్న కంఠముతో "ఖోర్ధా సింహాసనము పైన నాకు కోరిక లేదని నేను ఎప్పుడు అన్నాను? రామచంద్రదేవ్ మహారాజావారు ఏ విధముగ మతాంతరులు అయితేనేమి, ఖోర్ధా సింహాసనము నకు పరంపరాగతముగ వస్తున్న ఆచారము ప్రకారము జగన్నాథునికి రాజ సేవలు చేయువాడే ఖోర్ధా రాజుగ ఉండగలడు. రాజ సేవలనుండి వారు తొలగింప బడినందున ఆయనకు సింహాసనము పైన అధికారము పోయినట్లే. ప్రస్తుతము ఆ సింహాసనమునకు మేమే ఉత్తరాధికారులము. నాయబ్ - నాజిమ్ బహాదుర్ వారు మమ్ములను ఎట్లు ఉపేక్షించగలరు?" అని అన్నాడు.

నెమ్మదిగా భాగీరథీ కుమార్ తన దారిలోనికి వస్తూ ఉండుటను అమీన్ చంద్ గమనించినాడు. కనుక ఇతర షరతులను కుమార్‌కు చెప్పుటకు అతడు ఆయత్త పడసాగినాడు. శ్రీ మందిర సంచాలనాధికారమును పూర్తిగ కుమార్ వదలుకొనవలెను. దానిమీది అధికారము తనకు ఉండివలెను. ఈ విధముగ ఆలోచిస్తూ, మౌనము వహించి అమీన్‌చంద్ అనాసక్త భావముతో హుక్కా పొగను వదల నారంభించినాడు.

అమీన్‌చంద్ గొంతుక ఎండిపో నారంభించినది. ఉప్పొంగిన రసికత్వముతో "సునా! సునా మాహారీ! ఎవరి ముందు నీ కీ సిగ్గు? తీసికొనిరా! గొంతుక ఎండి పోతున్నది. యువ రాజా వారికి కూడ దాహము ఎక్కువగు

చున్నది." అని సునాను కేక వేసి, "కుమార్ ! ఏమంటారు ?" అని కుమార్ వైపు చూసి అన్నాడు.

ఆకాశమునలో నుండి గాజుల, అందెల రవళులు విన్పించినవి. భాగీరథీ కుమార్ తన దృష్టిని అటువైపునకు సారించినాడు. అది అమీన్‌చంద్ యొక్క పరిశీలనా దృష్టినుండి దాటి పోలేదు.

కొద్దిసేపటిలో సునామాహరీ తరంగిత సర్పిణివలె రెండు రజత పాత్రలను మధువుతో నింపి తీసికొని వచ్చినది. ఆమె ప్రతి కదలికలోను కోమల శయ్యయొక్క నిద్రాతుర ఆహ్వానమున్నది. సునా ఆ పాత్రలను మేజాపై పెట్టి నితంబములను కదలించుకొంటూ, నృత్య భంగిమలను ప్రవర్శిస్తూ వెళ్ళబోయినది. అమీన్‌చంద్ వెంటనే ఆమె హస్తమును గ్రహించి, "ఇక్కడ నీవు కూర్చొన కూడదా ? నీ యెదుట భోర్డా మహారాజావారు స్వయముగా కూర్చుని ఉన్నారే ! వారి పరిచర్య చేయవా మరి ?" అని అన్నాడు.

మఖమల్ గద్దె కూడ ఆ కోమలాంగికి బాధ కలిగిస్తున్నదా అన్నట్టుగా బాధను అభినయిస్తూ ఆమె కూర్చున్నది.

ఆ తరువాత తన మోహన దృష్టితో భాగీరథీ కుమార్‌ను సమ్మోహితుని జేస్తూ, మొగల్ దర్బార్ సంప్రదాయానుసారము కుడి అర చేతితో తన పెదవులను స్పృశించి, వంగి సలామ్ చేసినది.

భాగీరథీ కుమార్ నెమ్మది నెమ్మదిగా సమ్మోహితుడు కాజొచ్చినాడు. ఒక అనిర్వచనీయమైన అద్భుతమైన మత్తు తన ప్రతి స్నాయు తంత్రిని ఉత్తేజ పరస్తున్నట్టుగా భాగీరథీ కుమార్‌నకు అనిపించినది. అటువంటి ఆనందకరమైన సమయములో విచార వదనములతో బడలిన శరీరములతో బహపరిఛా గౌరీ రాజగురు, అంధారీగఢ్‌కు చెందిన కేలు సామంతరాయ్, బాణ్‌పుర్ తాలూకు వంశీ శ్రీచందన్ మరియు జగన్నాథ్ పరీఛాలు లోనికి ప్రవేశించి రస భంగము కావించినారు. రామచంద్రదేవుని పైన పన్నుతున్న కుట్రలో వీరందరు భాగ

స్తులు. అమీన్‌చంద్‌కు వీరు ప్రధాన అనుచరులు. వీరు ప్రవేశించి నంతనే సునామాహారీ నిష్క్రమించినది.

ఆ సమయములో వారిని సునామాహారీ గృహమునందు కలిసికొనవలసి వస్తుందని అమీన్‌చంద్ ఊహించనైనా లేదు. ఆకస్మాత్తుగ వారిని చూసి ఉద్విగ్న కంఠముతో "ఏమిటి విశేషము ? మీ రాకకు కారణము ?" అని అమీన్‌చంద్ ప్రశ్నించినాడు.

అమీన్‌చంద్ ప్రశ్న ఇంకను పూర్తి అయినదో లేదో ఒక పరిచిత సైనికుడు లోన ప్రవేశించినాడు. కటక్ లాల్‌బాగ్ నుండి తకీఖాన్ పంపగా అతడు వచ్చినాడు. అతడు ఎక్కడను ఆగకుండ సరాసరి పూరీ నుండి వచ్చినట్టున్నాడు. అందువలన అతడు బాగా రొప్పుతున్నాడు. లండామఠములో అమీన్‌చంద్ లేకపోవుట వలన బడపరీఛా సహాయముతో అతనిని వెదకుకొంటూ ఇక్కడికి వచ్చినాడు. అతని నొసటినుండి చెమట కారుతున్నది. ధరించిన వస్త్రములు తడిసి పోయినవి.

కటక్‌నుండి ఏదో ఒక అత్యవసరమైన వార్త వచ్చినదని అమీన్‌చంద్ గ్రహించి ఆ వార్తాహరుని "ఏమిటి విశేషము ? నీవు ఎలా వచ్చినావు ?" అని ప్రశ్నించినాడు.

"ఖోర్ధా రాజావారు ఎక్కడికో వెళ్ళిపోయినారనీ, ఆయన జాడ తెలియ రావడము లేదనీ లోధుమియా నుండి వార్త వచ్చినది. నివాన్ - నవీన్, దారో గాలకు కూడ వారిజాడ తెలియదట. ఈ విషయము తమతో మనవి చేయమని వజీర్ ముస్తఫా అలీఖాన్ వారు తమవద్దకు నన్ను పంపినారు" అని ఆ సైనికుడు తెలియజేసినాడు.

రామచంద్రదేవ్ ఆకస్మికముగా అంతర్ధానము అయినందుకు గౌరీ రాజ గురు, ఇతరులు ఆశ్చర్యపోయినారు. అమీన్‌చంద్ అదరిపడినాడు.

అయితే అమీన్‌చంద్ పన్నాగము రామచంద్రదేవ్‌కు తెలిసిపోయినదా ? రథయాత్ర అనంతరము రాజసేవల నుండి వారు తొలగింప ఇడగలరని ప్రజ

లలో కొంతమంది శంకిస్తూనే ఉన్నారు. దానిని వారు ప్రతిఘటిస్తే సింహాసనము నుండి నిర్వాసితులై కారాగారములో బంధింపబడుట ఖాయమని కూడ వారు అనుకొన్నారు. ఎంతో రహస్యముగ వేసిన ప్రణాళిక ఇది. ఆయనకు ఎలా తెలిసినది?

మోసము, బలము, కౌశలములతో రామచంద్రదేవుని వూరి క్షేత్రము నుండి గెంటివేయుటకు అమీన్‌చంద్ తీవ్ర ప్రయత్నము చేస్తున్నట్లు గౌరీ రాజ గురు ప్రభృతులందరికీ తెలిసినను దాని అంతరాళములలో నున్న రహస్య వ్యూహము తకీఖాన్ దర్బారులోనే చాలమందికి తెలియదు. అందుచేత రామచంద్రదేవ్ ఆకస్మాత్తుగ జాడ తెలియకుండ పారిపోవుటకు గల కారణము అమీన్‌చంద్‌కు తెలియ లేదు.

"భీతరఛో మహాపాత్ర, ధనీ పఢిఆరీ, సాన్ పరిఛా విష్ణు పశ్చిమ్ కపాట్ మహాపాత్ర, చాలా మంది యితర పతి మహాపాత్రల జాడ కూడ తెలియదము లేదు. నిన్న అష్టమినాటి రాత్రి బడసింహార్ తరువాత దయితా పతుల లెక్కలు వేయబడినవి. భీతరఛో మహాపాత్ర, ధనీ పఢిఆరీలు కూడ లేరు. నిన్న వీరిద్దరి వంతు ఉండెను. వారు రాలేదు. అందువలన వారు భంగు మత్తులో ఎక్కడనో పడియుండ వచ్చునని వెదక నారంభించిరి. కాని వారెక్కడను కనబడ లేదు. గోటిపుఆ నాట్యము చూడడానికి వారు వెళ్ళినట్లునూ, సప్తమి నాటి రాత్రి వెళ్ళిన వారు ఇంతవరకు తిరిగి రానేలేదనీ వారి ఇండ్లలో తెలియజేసినారు. సేవకులపైన పర్యవేక్షణ చేయవలసిన వాడు సాన్‌పరిఛా. ఆయన రాలేదు. ఆయన కొరకు ఎక్కడ వెతికినా కనబడ లేదు. ఇంటివద్ద కూడా లేదు. ఆయన జాడ ఇంట్లోవారికి కూడ తెలియుట లేదు," అని గౌరీ రాజగురు వివరించినాడు.

బహుశా మహారాష్ట్రులతో సంబంధము పెట్టుకొనుటకు రామచంద్రదేవ్ నాగపూరీ వెళ్ళి ఉండవచ్చునని అమీన్‌చంద్ ఊహించినాడు. మహారాష్ట్రులకు ఇప్పుడు బెంగాల్ సూబాపైన కన్నుపడినది. ఉత్కళ దేశములో వారికి

పలుకబడి ఏమీలేదు. కాని రామచంద్రదేవ్ వారి సాయముతోనే తకీఖాన్‌ను కటక్‌నుండి గెంటించి వేయుటకు పథకము వేసినారనీ, అందుకొరకే వారు భాస్కర పండితుని వద్దకు వకీలును పంపినారనీ నివాన్ నవీసు ద్వారా అమీన్‌చంద్‌కు వార్త చేరినది. కాని ఇది ప్రామాణిక సూత్రముల ద్వారా నిరరించబడిన వార కాదు.

అమీన్‌చంద్‌కు ముస్తాఫా అలీ వ్రాసిన ఉత్తరమును సైనికుడు జేబులో నుండి తీసి అందజేసినాడు ఆ ఉత్తరము పైన ఉన్న సీలును తీసి అమీన్ చంద్ చదువ నారంభించినాడు.

ఈ మధ్యలో భాగీరథీ కుమార్ పూరీ చేరినట్లయిన అతనిని భోర్డా సింహాసనముపై కూర్చుండ బెట్టవలసినదిగా వజీర్ ముస్తఫా ఆ లేఖలో సలహా ఇచ్చినాడు.

జగన్నాథుని ముందు చీర (శిరో వస్త్రము) చుట్టుకొని ఆజ్ఞా సామ్రగిని స్వీకరించిన యెడల భోర్డా సింహాసనము మీద అధికారమును పొందుటకు అనుమతి లభించినట్లుగ భావించబడుతుంది. కనుక భాగీరథీ కుమార్ ను సింహాసనము మీద కూర్చుండ బెట్టుటకు ముందు అతనిచేత చీర చుట్టించి ఇతర విధులను కూడ జరిపించవలని ఉంటుంది.

యత్నపూర్వకముగ ఆ లేఖను జేబులో పెట్టుకొని అమీన్‌చంద్ భాగీరథీ కుమార్‌వైపు చూచినాడు. పసివాడు, క్రమరహితుడు, దుర్బల చిత్తుడుగా అతడు అతని కంటికి కనుపించినాడు. ఇటువంటివానిని భోర్డా సింహాసనాసీనుని చేయవలె నన్న తలంపు వచ్చినంతనే అమీన్‌చంద్ హృదయములో ఈర్ష్య హఠాత్తుగ చోటు చేసికొన్నది. అతడు కండ్లు మూసికొని మౌనముతో కొన్ని క్షణములు ఆలోచించినాడు. తన ఆధిపత్యమును పూరీక్షేత్ర విషయములో భాగీరథీ కుమార్ అంగీకరించనంతవరకు అతనిని భోర్డా సింహాసనముపైన కూర్చుడబెట్టిన యెడల అమీన్‌చంద్ సాధించునది ఏదియులేదు. ఇట్టి వానిని సింహాసనముమీద కూర్చుండ బెట్టిన తరువాత పూరీపైని తన ఆధిపత్యమును అతడు నిరాకరించనూ

వచ్చును, లేదా ప్రతిఘటించనూ వచ్చును. జ్ఞానవంతములైన సిద్ధాంతములకన్న భావనాబలమే ఆయనను వశపరచుకొంటున్నది. ఈ సందర్భములో తన ఆధిపత్యము విషయమై బడపరీఛా గౌరీ రాజగురుతో, లలితామహాదేయీ ప్రతినిధితో ముందుగా సంప్రదించవలసిన అవసరమున్నదని అమీన్‌చంద్ భావించినాడు. ఐయట నిలబడియున్న సునావైపు అమీన్‌చంద్ చూసి, ఆ తరువాత భాగీరథీ కుమార్‌ను ఉద్దేశించి, ''కుమార్, తమరు ఇక్కడే ఉండండి. మేము త్వరలో తిరిగి వస్తాము. విషమ సమస్యల గురుత్వమును తమరు గ్రహించే ఉంటారు. మేము రావడము ఆలస్యమైనను తమకు ఇక్కడ ఇబ్బంది కలుగదు" అని చెప్పి అతడు బయలుదేరినాడు.

గదికి ఆవల సునా మాహారీ గాజులు, అందెల రవళులు కుమార్‌కు వినిపించినవి. అతడు వీలయినంత కోమలముగను ఆవేగముగను ''సునా" అని పిలిచినాడు.

కష్ట బయట మసక చీకటిగ నున్నది. అతని పిలుపుకు సమాధానముగ ఆమె అందెల మందమంద రవళులుతప్ప, వేరొక సమాధానము రాలేదు. అనేక వ్యాకుల ఆహ్వానములు వినమ్ర నివేదనలు సమర్పించిన వెనుక సువర్ణ ప్రతిమవలె సునా నిదురాతురత్వమును నటిస్తూ, వంపులను ప్రదర్శిస్తూ వచ్చినది. అమీన్‌చంద్ ప్రభృతులు కొద్దిసేపటి క్రితమే వెళ్ళినారనీ, దాలసేపటి వరకు వారు రారనీ ఆమెకు తెలుసును. అయినప్పటికీ ఒక అసహాయురాలువలె నటిస్తూ "నన్ను ఒంటరిగ వదలి అమీన్‌చంద్ ఎక్కడికి వెళ్ళినారో, ఈ యింటిలో నన్ను ఒంటరి దానిని చేసినారే!'' అని అభిమాన స్వరముతో అన్నది.

నాయికయొక్క పరోక్ష ఆహ్వానమునకు సంబంధించిన ఇటువంటి ఆలంకారిక పద్ధతులు భాగీరథీ కుమార్‌కు పరిచయమైనవే. అందుపలన అతడు నవ్వుతూ "నీవు ఒంటరిదానవు కావు. నేను నీకు కాపలా ఉన్నానుకదా!" అని అన్నాడు.

సునా గోడవైపు ముఖముత్రిప్పి, గోడమీద చిత్రించబడిన కాంచీయాత్ర సమయపు జగన్నాథ బలభద్రుల చిత్రమును తిలకిస్తూ, "మీరు దొంగలో, దొరలో నమ్మడము ఎలా?" అన్నది.

"సునా" (స్వర్ణము)ను దొంగలు దొంగిలించకపోతే దాని విలువ గృహస్థులు ఎలా తెలిసికో గలుగుతారు?" అని అతడు నవ్వుతూ సమాధాన మిచ్చినాడు.

మోహినివలె కుమార్ వైపు చూచి, సిగలోని పూవునుతీసి ఆతనిపై విసరి మోహమాదక స్వరముతో "అబ్బా! పొండీ—" అన్నది.

స్త్రీ ఒకవంక కల్యాణమయి కాగలదు, వెనువెంటనే వేరొకవంక ఆశ్రుపూరిత విషాద ప్రతిమగా కూడ మారగలదు. కాని జ్వాలామయి అయిన చోట ఆమె యీ విధముగా లాస్యమయి రసమయి అయిన కామనా మూర్తిగకూడ రూపొందగలదు అప్పుడు ఆమె ఉజ్జ్వల నారీ లావణ్య ప్రతిమ కాక సౌందర్య జ్వాలాశిఖి అవుతుంది. మోసకత్తెగా ఉన్నచోట ఆమె కపటత్వము, చాతుర్యము ఆమెయొక్క చంచల మనోహర హాస్యములోను, చంచల దృష్టిలోను ప్రకటిత మవుతవి. ఆ చాతుర్యమే పురుషుణ్ణి ముగ్ధునిగాను, అంధునిగాను, విభ్రాంతుని గాను చేస్తుంది.

భాగీరథీ కుమారుని అప్పటికే ఆమె విభ్రాంతునిగాను, సమ్మోహితుని గాను చేసివేసినది. ఆ సమయములో సునా కొరకు ఏమి చేయుటకైనను అతడు సిద్ధముగా నున్నాడు.

సంపంగి వర్ణములోనున్న ఆమె యౌవన ప్రమత్తమైన అంగలత కోమల దీపకాంతిలో జ్వాలామయమైన అగ్నిశిఖవలె కన్పిస్తున్నది. అన్యమనస్కవలె నటిస్తూ ఆలోకమొగ్గ నొకదానిని త్రుంచుతూ, కంఠస్వరములో ఆప్యాయతను పూరించి, "రాజా అమీన్‌చంద్‌గారి మాట మీరు వినలేదుగా.....మరి మీ మాట నేనెందుకు వినాలిః" అని ఆమె అన్నది.

తాను వినుటకు యిష్టపడని దానిని దేనిని రాజా అమీన్‌చంద్ చెప్పినాడు, దేనిని వినడానికైనను తాను సిద్ధముగానే ఉన్నాడు. సునా మనస్సులోని అనుమానము తొలగించవలెనన్న తలంపుతో "రాజా అమీన్‌చంద్ నా ఏకైక శ్రేయోభిలాషి, శుభాకాంక్షి. ఆటువంటప్పుడు ఆయన చెప్పిన మాటను నేను కాదనగలనా?" అని భాగీరథీ కుమార్ అన్నాడు.

సిగ్గుపడుచున్నట్లుగా చిరునవ్వు నవ్వి "అయితే మీరు ఖోర్ధా సింహాసనము మీద కూర్చొనుటకు ఎందుకు అంగీకరించడము లేదు?" అని ఆమె అడిగినది.

"ఏమిటి నీవు అంటున్నది? నన్ను మహారాణి ఎందుకు పంపిన దనుకొన్నావు? అయినా, సునా! అందులో జంజాటములు చాలా ఉన్నవి ఒక ఘడియకాదు, అర ఘడియకూడ హాయిగా గడుపుటకు వీలుండదు," అని అతడు అన్నాడు.

సునా తన సిగనుండి సన్నజాజిమాలను తీసి తన ఎడమచేతి చూపుడు వ్రేలికి తగిలించి త్రిప్పుతూ, ఒయ్యారముగ నడస్తూ "మళ్ళు ఉండకూడదు; .....పువ్వులే పువ్వులు ఉండాలి.....అలాగ ఎక్కడైనా మీరు చూశారా?" అనిఆమె అడిగినది. ఇంతలో ఆమె త్రిప్పుతున్న జాజిమాల తగిలి దీపము ఆరి పోయినది. గది అంధకారమయమయినది.

ఆలస్యముగా అమీన్‌చంద్ ఒక్కడే తిరిగి వచ్చినాడు. అతడు ధ్యాన పూర్వకముగా చూసి యుండిన, కక్షలో వెలుగుచున్న దీపము అచేకాదనీ, మారి పోయినదనీ, తన చెక్కిలిమీది క్షత చిహ్నమును దాచుటకు కుమార్ ప్రయత్నిస్తున్నాడనీ గ్రహించి ఉండేవాడు. కాని ఆ సమయములో వాటిని పరిశీలించ డానికి అతనికి అవకాశము లేదు. చాల తర్కవితర్కములు జరిగిన పిమ్మట అతని షరతులకు లలితా మహాదేయీ ప్రతినిధులు అంగీకరించినారు. బడపరీక్షా రాజగురుకూడ అయిష్టముగా లేదు. రాజా అమీన్ చంద్ ఇష్ట ప్రకారము ఆలయ సంచాలనము జరుగగలదు. ఆలయములోని రాజసేవలన్నిటిని అమీన్ చంద్ నిర్వహించుటకు అంగీకరించబడినది. ఖోర్ధా మహారాజావారు, వారి కుటుంబ

సభ్యులు వంశ పరంపరాగతముగ వస్తున్న సంప్రదాయమును అనుసరించి ఆలయములోనికి రావచ్చును. సంక్రాంతి మొదలగు ఉత్సవ సమయములలో ఆలయ శిఖరమునపైన మహాదీపమును వెలిగించు సమయములందు చారణులు ఖోర్ధా రాజా వారి వేరును గాక రాజా అమీన్ చంద్ వేరును కీర్తించవలసి ఉంటుంది.

అమీన్ చంద్ అలసి పోయినట్లుగా గద్దెమీద వాలుతూ, "కుమార్! తమరు తయారుగా ఉండండి! నీలాద్రి విజయమైన మరునాడే తమకు పట్టాభిషేకము జరుగుతుంది" అని చెప్పినాడు.

ఆ శుభవార్తను విని భాగీరథీ కుమార్ అమాయకుని వలె నవ్వు నారంభించినాడు.

3

ఆకాశము మీద భానిస్తున్న మేఘముల వెనుక చంద్రుడు నడుస్తున్నాడా! లేక భాస చంద్రుని వెనుక మేఘములు పరుగెడుతున్నవా! దీనిని పరిశీలించుట భాగీరథీ కుమారునకు ఒక సమస్య అయినది. కాని ఆ పరిశీలనకు కావలసిన ఏకాగ్రత భాగీరథీ కుమారుకు ఎక్కడున్నది! నీలి మేఘముల వెనుక చంద్రుడు దాగున్నప్పుడు బడ్ దాండ్ వైన క్షణకాలముపాటు పల్చని నీడ ఆవరిస్తున్నది. మేఘముల చాటునుండి చంద్రుడు బయటకు వచ్చి నిర్మలాకాశములో ప్రకాశిస్తున్నప్పుడు వీథికి ఇరు ప్రక్కలనున్న కొబ్బరిచెట్ల ఆకులపైని వెన్నెల వజ్రపుతునకలను వెదచల్లుతున్నది. నిశాచర పక్షులు మేల్కొంటున్నవి. బడ్‌దాండ్‌కు ఇరువైపులను దుప్పట్లు కప్పుకొని నిద్రపోతున్న యాత్రికులు చైతన్యములేని జడపిండములవలె కనిపిస్తున్నారు.

రేపు బాహుడా దశమి. ఆ ఉత్సవమును చూడ వలెనన్న ఆశతో యాత్రికులలో సగము మందికి పైగా పూరీలో ఉంటారు. బాహుడా యాత్ర జరిగిన మిమ్మటనే అనేకమంది యాత్రికులు తిరిగి వెడతారు. ఆ తర్వాత కూడా ఉన్నవారు మహాప్రభువుని నీలాద్రి విజయము, ద్వాదశి ఉత్సవముల తిలకించి తిరుగు ముఖము పట్టుతారు.

ఎల్లుండి అధర్వణా ఏకాదశి. ఆ మరునాడు, ద్వాదశినాడు నీలాద్రి విజయము. దానితో రథ యాత్రోత్సవము సమాప్తమవుతుంది. దాని తరువాత ఖోర్ధా రాజ్య సింహాసనము పైన భాగీరథీ కుమారుని అభిషేకము జరుగుతుంది. ద్వాదశి నాటినుండి మహారాజ్ వీరకేసరీదేవ్ పేరుతో క్రొత్త అంకము ప్రారంభమవుతుంది.

బడ్‌దాండ్ నిర్జనముగా నున్నది. చంద్రుడు మ్లానముగా నున్నాడు. గాలి వెర్రిగ వీస్తున్నది. సునామాహారీ సమ్మోహనము నుండి విముక్తుడై బాలి సాహి ప్రాసాదపు జీర్ణ విషాద జర్జరిత వాతావరణములోనికి తిరిగి రావడానికి భాగీరథీ కుమారునకు మనస్కరించదము లేదు.

బడ్‌దాండ్ పైని యాత్రికులు జట్టుజట్టుగ నిద్ర పోతున్నారు. నిద్రరాని వారు భజనలు చేస్తున్నారు, కాని వారి ఖంజరీ ధ్వనిలో నిద్రచే బరువెక్కిన కండ్ల స్పర్శ ఉన్నట్లు అనిపిస్తున్నది.

బాహుడా యాత్రకొరకు గుండిచా ఆలయము వద్ద సన్నాహములను చేస్తున్న సేవకుల కోలాహలము లింకను వినబడుచున్నవి. నవమినాటి రాత్రి బడ్‌సింహార్ తరువాత బాహుడా రథము కదలేవరకు సేవకులకు తీరిక ఉండదు.

కోత్ సుఆసిఆలు రథముపైన 'దార్' కట్టనారంభించినారు. కాగడాల కాంతిలో బడ్‌దాండ్‌లోని ఆ పవిత్ర స్థలము మాత్రము మసకగ కనబడుతున్నది. మూడు ఛాయాచిత్రముల వలె దూరమున నున్న రథములు కన్పిస్తున్నవి.

ఘంటా, శంఖ, తూర్యనాదములతో రథ్‌దాండ్ మీదుగ రాఘవదాసు మఠమునుండి ధవళవస్త్రమును దయితాలు కొనివస్తున్నారు.

రథములపైన 'చార్' కట్టడము తెల్లనారు సరికి పూర్తి కాగలదు. దాని తరువాత హాగతి. ఆ తరువాత సూర్యపూజ, ద్వారపాల పూజ మొదలయినవి జరిగిన పిమ్మట ప్రాతఃకాల పూజలో ఖిచడీ భోగము జరుగుతుంది. ఈ విధ మైన నైతిక సంప్రదాయ బద్ధమైన వ్యవహారములతో బంధింపబడిన మహా ప్రభు సేవకులకు నవమి నాటి రాత్రి నిద్ర ఉండదు.

రామచంద్రదేవ్ జాడ తెలియకుండ ఎక్కడికో పారిపోయినారన్న విష యము అకస్మాత్తుగ భాగీరథీ కుమారునకు జ్ఞప్తికి వచ్చినది. అందువలన రేపటి బాహుడా యాత్రకు రాజా అమీన్‌చంద్ ఛేరా పహరా చేయనున్నాడు. ఖోర్ధా సింహాసనముపైన మహారాజుగా భాగీరథీ కుమార్ కూర్చొనుటకు తకీఖాన్ ప్రతినిధిగా అమీన్‌చంద్ ఈ షరతు పైననే అంగీకరించినాడు.

బాణ్‌పుర్‌నుండి వచ్చిన జగన్నాథ పరీఛా మొదట ఈ షరతునకు అంగీ కరించుటకు సుముఖుడుగా లేడు. కాని రాజా అమీన్‌చంద్ ఛేరాపహరా చేసి నంత మాత్రమున పోయేదేమున్నది? ఛేరా పహరా చేయుట ఏమంత మహాశ్చ ర్యము? అనఃసరముగ మాటలు పెంచుకొనడము నిరర్థకమని జగన్నాథ్ పరీఛా భావించినాడు.

సునా మాహారీ నివాసగృహమందు ఇదే విషయము పునరాలోచింపబడి నది. కొద్ది సేపయిన తరువాత, వంశీ శ్రీ చందన్, జగన్నాథ్ పరీఛా మొదలగువారితో గూడ కలిసి వచ్చి రాజగురు భాగీరథీ కుమారునకు సింహాసన ప్రాప్తిని కలుగ జేయుటకు నిర్ణయించిన షరతులను తెలియ జేసినాడు. పూరీ క్షేత్రముపైన భాగీరథీ కుమారునకు ఏ విధమైన అధికారముకాని కర్తవ్యము కాని ఉండబోదు. పరంపరాగతముగ వస్తున్న రాజసేవలను అతడు వదులు కొనవలసి ఉండును. ఆ అధికారములు అమీన్‌చంద్‌కు సంక్రమిస్తుని. వీటి తాత్పర్యము భాగీరథీ కుమార్‌కు అర్థము కాలేదు.

లలితా మహాదేయీ ఆదేశించుట వల్లనే అతడు ఛేరాపహరా చేయుటకు పూరీ వచ్చినాడు అతని దృష్టిలో ఆ కార్యము సామాన్యమైనది. ఆలస్యముగ

పూరీ చేరుటవలన ఆ పని నుండి విముక్తుడయినాడు. ఇప్పుడు మహారాణిని సంతృప్తి పరచుటకు జగన్నాథుని సమక్షములో చీరను ధరించి ఆ కార్యమును గూడ అయినదనిపించుకొని వీలయినంత త్వరలో కాణ్‌పుర్ చేరుకొనవలెనని అతడు ఆతురత చెందుతున్నాడు. ఇక్కడ సునాతో ఆకస్మిక పరిచయము, తండాకినార్ వద్ద సర్దేయా సందర్శనము, ఖోర్దా సింహాసన ప్రాప్తికి అంగీకారము మొదలైన ఊహించ జాలని సంఘటనలవలన అతడు ప్రభావితుడైనాడు. జగన్నాథుని సామాన్య రాజ సేవలకు సంబంధించిన అధికారముల కొరకు నిరర్థకమైన తర్క వితర్కములను పెంచుకొని రాజ సింహాసన ప్రాప్తికి గల అవకాశములను అతడు పోగొట్టుకొన దలచ లేదు.

కాని ఈ షరతులను అంగీకరించుటకు జగన్నాథ్ పరీఛాకు మనస్కరించ లేదు. "ఇదెలా సంభవము? మహారాజ్ అనంగ భీమదేవుని కాలమునుండి ఇవి రాజ విధులుగా వస్తున్నవి. ఈ విధులను నిర్వర్తించనిదే ఏ రాజునకు ఖోర్దా సింహాసనము పైన అభిషేకము జరుగలేదు, జరుగుటకు వీలులేదు. శ్రీ జగన్నాథుడే ఉత్కళ దేశమునకు ఏకైక చక్రవర్తి. ఆ సమ్రాట్‌యొక్క సేవకుని రూపములోనే గజపతులు పాలనాధికారము స్వీకరిస్తూ వస్తున్నారు. సూర్యవంశ సమ్రాట్ కపిలేంద్రదేవ్ గంగానది నుండి గోదావరి వరకు ఉత్కళ సామ్రాజ్యమును విస్తరింపజేసి 'వీరశ్రీ గజపతి గౌడేశ్వర నవకోటి కర్ణాటోత్కళ వర్గేశ్వర వీరాధివీరవర' ఆదిగా గల బిరుదావళితో శోభిల్లుతూకూడ పిజయ ద్వారము వద్ద స్థాపించిన శిలా శాసన లేఖలో "నీవు ఎవరిని ఆనుగ్రహించెదవో ఈ సింహాసనము వారిది." అని ప్రకటించినారు ఇదే గజపతుల ఖోర్దా సింహాసనా పరంపర. జగన్నాథుని రాజసేవకుడు కాని వానిని ఓరిస్సా సింహాసనము పైన మహా రాజుగ ఎవరు అంగీకరిస్తారు? అందుచేత భాగీరథీ కుమార్ ఆ అధికారములను వదలుకొనడము సంభవించదు" అని ఆయన వాదించినాడు.

మసక దీప కాంతిలో ఆకలిగొన్న డేగవలె గౌరీ రాజగురు కన్పిస్తున్నాడు. కాని ఈ సింహాసన సంప్రదాయ పరంపరలతో సుపరిచితుడైనాడు అతడు

ఒక్కడే కాని రాజసేవాధికారములను అమీన్‌చంద్‌కు హస్త గతము చేసినట్లయితే అతని నుండి బహుమానములు లభించగలవన్న ఆశతో ఆయన గౌరవనీయమైన సంప్రదాయములనే విస్మరించి "జగన్నాథుని వద్ద రాజసేవలను చేసే అధికారము గజపతులకు సంక్రమించినదన్న విషయము సత్యమే. కాని రాజుల అనుపస్థితిలో ఆ కార్యములను ముదిరథులు నిర్వహిస్తున్నారన్న విషయము అందరకు తెలుసును. రామచంద్రదేవువారి కాలములోనే ఒకసారి ఈ కార్యమును బక్షి వేణు భ్రమరవర్ నిర్వర్తించినాడు. ఇప్పుడు రాజా అమీన్‌చంద్ చేయనున్నారు. ఈ చిన్నవిషయమునకు వివాదము అనవసరము. మిన్ను విరిగి మీద పడేటంత ఘనకార్యమేమీ కాదు ఇది. ముదిరథులు రాజసేవలు చేయ గలిగినాడు రాజా అమీన్‌చంద్ ఎందుకు చేయరాదు?" అని అడిగినాడు.

"రాజగురు మహాశయా! మనము అనినంత మాత్రమున జరిగేదేమున్నది? నీలాద్రి మహోదయోక్తమైన ఇంద్రద్యుమ్నుని గురించిన బ్రహ్మవాక్యములను జ్ఞాపకము చేసికొనుడని తమకు మనవి చేసికొంటున్నాను. దాని ప్రకారముగనే ప్రాచీన కాలమునుండి ఈ విధులన్నీ పాటింపబడుతున్నవి. రాజసేవ చేయుటకు ప్రతిష్ఠితమైన అధికారము ఏదీ ముదిరథులకు లభించ లేదు. ముదిరథులు తప్పనిసరిగ సర్వశాస్త్ర కోవిదులు అయిన తరువాతనే రాజ ప్రతినిధుల రూపములో వారికి స్వీకృతి లభించవలసి ఉంటుంది.

"ఏవం మహోత్సవం కుర్యాత్ పూజయాంచ రమాపతే
విధిమేతా దృశం కర్తుం నో శక్యచేద్ యదానృప
తదా ప్రతినిధి కుర్యాద్విప్రం కించిత్సుధార్మికమ్
తర్హ ప్రతినిధి సోఽయం సర్వ శాస్త్రార్థ తత్వ విద్"

ఇది నీలాద్రి మహోదయుని బ్రహ్మవాక్కు. తమరు దీనిలోని 'ప్రతినిధి' శబ్దమును సమీక్షించండి. అప్పుడు నా తాత్పర్యము తమకు తెలియగలదు" అని జగన్నాథ్ పరిష్కార సమాధానము ఇచ్చినాడు.

"ఒహో, ప్రతినిధి అయితే, ప్రతినిధి రూపములో రాజా అమీన్‌చంద్‌ను మనము అంగీకరించి నట్లయితే ఏ శాస్త్రము అపవిత్రమవుతుంది" అని అనాదర సూచకముగా గౌరీ రాజగురు అన్నాడు.

అంతవరకు బాలీసులపైన పడుకొని హుక్కాను గుడగుడ లాడిస్తూ ఆ చర్చల పట్ల అనాసక్తుడుగా నున్నట్లు అమీన్‌చంద్ అభినయించినాడు. ఘాటైన సుగంధ సువాసనలతో కూడిన హుక్కా పొగతో ఆగది నిండి పోయినది. అలసట, ఉత్తేజముల వలన అమీన్‌చంద్ స్థూలకాయము నుండి చెమట కారుతున్నది.

"మత ధర్మమునకు, సేవలకు రాజరికముతో సంబంధము ఏముంటుంది? భాగీరథీ కుమార్ సింహాసనము మీద కూర్చుంటారు. దానితో ముడిపెట్టి ధర్మ కర్మల విషయములను చర్చించ వలసిన అవసరము ఏమున్నది?" అని అమీన్ చంద్ అడిగినాడు.

"రాజా సాహబ్, తమరు అలా సెలవియ్యకండి. గజపతుల సింహాస నము లోపలకు ఎంత ఉన్నదో బయటకు కూడ అంత ఉన్నది. లోపల మతము ధర్మము, బయట రాజరికము ఉన్నవి. అదే లేకపోయినట్లయితే పఠా నుల దాడులవలన ఒరిస్సా ఏనాడో నామ రూపములు లేకుండ పోయి ఉండెడిది." అని గంభీర స్వరముతో జగన్నాథ్ పరీఛా అన్నాడు.

ఆ విధముగా మొగల్ దాడులను గురించి ప్రత్యక్షముగా జగన్నాథ్ పరీఛా ఆక్షేపించడము అమీన్‌చంద్‌కు రుచించలేదు. అందువలన అతడు "ఈ విమర్శనలను పొడిగించుట వలన లాభము లేదు. చివరి మాటగా చెపుతున్నాను వినండి. ఖోర్ధా సింహాసనము ఖాళీగా పడిఉన్నది. దానిని అధిష్ఠించమని భాగీరథీ కుమార్‌ను ఎవ్వరూ బలవంతపరచుట లేదు. వారు అంగీకరించిన యెడల మంచిదే. లేకపోయినట్లయితే ఖోర్ధా ప్రత్యేకించబడుతుంది. నేను హిందువును. అందుచేత జగన్నాథుని తకీఖాన్ చేతులనుండి రక్షించడానికి ప్రయత్నిస్తూ వచ్చినాను. అందుకు నేను విచారించడము లేదు. గీతలో చెప్పినట్లుగా మనుష్య

నకు కర్మ పైన అధికారమున్నది, కాని కర్మఫలము పైన కాదు. భాగీరథీ కుమార్ అంతా విని యున్నారు. కనుక వారే ఇప్పుడు చెప్పగలరు," అని కోప స్వరముతో అన్నాడు.

గుండిచా ఆలయములో సేవాకార్య విధి ఏదో జరుగుతున్నది. ఆక్కడ వాద్యములు మ్రోగుతున్నవి. ఘంటా తూర్య నాదములవలన రాత్రిలోని నిశ్శబ్దత హఠాత్తుగ భంగమైనది. దానిలో ఒకానొక అవ్యక్తమైన సుదూర భవిష్యత్తు యొక్క ఆహ్వానము ప్రతిధ్వనిస్తున్నట్లుగా ఉన్నది.

"మీ షరతులు నాకు సమ్మతమే" అని భాగీరథీ కుమార్ తన అభిప్రాయమును తెలియ జేసినాడు. దానితో తర్క వితర్కము లన్నియు ముగిసినవి.

భాగీరథీ కుమార్ బాలిసాహీ ప్రాసాదము వైపు నడచి వెళ్ళినాడు. వందల కొలది జయపరాజయములు, గౌరవాగౌరవములు, ఉత్థాన పతనముల మధ్య ఒరియా జాతియొక్క అదమ్యమైన దంభ విశ్వాసముల అంతిమ విజయ సంకేతమువలె రహస్యావృతమైన గాంభీర్యముతో శ్రీ మందిరము దండాయమానముగ కానిస్తున్నది.

జగన్నాథ్ పరీచా అన్నమాటలను భాగీరథీకుమార్ మననము చేసి కొన్నాడు. "గజపతుల సింహాసనము లోపల ఎంత ఉన్నదో బయటకూడ అంత ఉన్నది. లోపల మతము ధర్మము, బయట రాజరికము ఉన్నవి."

నాసటివైన చిక్కువడిన శిరోజములను సవరించు కొంటూ "ఆలయము లోని రాజసేవ ఏమంత మహత్కార్యము!" అని స్వగతముగ భాగీరథీ కుమార్ అనుకొనినాడు.

ఖోర్దా సింహాసనాభిషిక్తుడయే అవకాశము అతనిని ఉత్తేజ పరచినది. సుందరమయిన లజ్జా పూరితమైన సునామాహారీ నయనములు ఆ ఉత్తేజములో అపూర్వ మాదకత్వమును నింపినవి.

అకారణముగ గుర్రమును కొరడాతో కొట్టి, నిర్జన బడ్‌దాండ్ పైన దానిని పరుగెత్తిస్తూ బాలిసాహీ వైపుకు భాగీరథీ కుమార్ సాగిపోయినాడు.

— —

పదకొండవ అధ్యాయము

బాహుడా యాత్ర ముగిసినది.

రేపు అధర్వణ ఏకాదశి, తరువాత ద్వాదశి, నీలాద్రి విజయము. బాహుడా యాత్ర ముగిసిన తరువాత యాత్రికుల సమూహము పలుచబడినది. అధర్వణ ఏకాదశికి, నీలాద్రి విజయమునకు పంచక్రోశీ యాత్రికులు, గౌడీయ భక్తులు ఎక్కువగ ఉంటారు. రథయాత్ర ముగిసిన తరువాత పశ్చిమ యాత్రికులు తిరుగు ముఖము పట్టారు. ఈ సంవత్సరము బాహుడా సమాప్తమయిన వెంటనే జగన్నాథుడు శ్రీక్షేత్రమును విడచి వెళ్ళినాడన్న వదంతి ఎలా వ్యాపించినదో తెలియదు.

జగన్నాథుడు గుండీచా సదనమునుండి వచ్చి ఆలయ సింహ ద్వారము వద్ద రథముమీద చకాడోలాను ఉష్ముక్తము చేసి కూర్చున్నాడు. ద్వాదశినాడు నీలాద్రిలో ప్రవేశిస్తాడు. జగన్నాథుని అందరు తమ కండ్లతో చూస్తూ కూడ ఆ గాలి వార్తను నమ్ముతున్నారు. తకీఖాన్ ప్రతినిధి, మొగల్ నాయబ్, పశ్చిమ ప్రాంతీయుడు అయిన అమీన్‌చంద్ ఛేరాపహరా చేయుటకు గాను రథముపైకి ఎక్కగానే జగన్నాథుడు పూరీ క్షేత్రమును వీడి వెళ్ళినాడు. శూన్య పురుషుడు శూన్యుడైనాడు. ఇప్పుడున్నది ఘటము...కాయము మాత్రమే పడి యున్నది. ఈ విధమైన వ్యాఖ్యానములు బయలుదేరినవి.

"చూడండి! శ్రీ ముఖము ఎంత మలినముగ కన్పిస్తున్నదో!" అని తీవ్ర అంతర్దృష్టి కలవారు ప్రక్కనున్న వారితో అంటున్నారు.

ఈ యేడు బాహుడా యాత్ర జరుగుతున్నప్పుడు యాత్రికులలో ఆనందమే లేదు. ఒకానొక అనిశ్చితమైన ఆశంకతో పూరీక్షేత్రము ఆశంకితమైనది.

రామచంద్రదేవ్ మహారాజావారు హఠాత్తుగ అంతర్ధానమైన వార్త బహుముఖముగ ప్రసారమై రకరకములుగ పల్లవించినది. కాని ఎవరూ కూడ ఆ వార్తకు ప్రాముఖ్యము ఇవ్వలేదు. ''మహారాజావారు దెక్కలి వెళ్ళినారు'' అని ఒక రంటే, "లేదు, మొగల్ ఉపద్రవములకు భయపడి కుదరా, ఆర్‌గఢ్‌లలో ఎక్కడనో దాగున్నా"రని వేరొకరు అన్నారు. "కాదు, వారిని బంధించి, బోనులో బార్వాటీ తీసికొని వెళ్లుటకు మొగల్ సైనికులు పూరీలో విడిసి యున్నారు. జేనామణి అయిన భాగీరథీ కుమార్ ఖోర్ధాకు రాజు కానున్నాడు. అందువల్లనే ఆనాడు, నవమినాడు గుండిచా మందిరములో జగన్నాథుని ముందు చీర కట్టించినారు, చూడ లేదా?" అని మరికొందరు అన్నారు. ఇవన్నీ ఆకస్మికముగా జరిగి పోయినవి అన్నట్లుగా వారందరి మనస్సులలో ఒక అవ్యక్తమైన అమంగళమును ఘనీభూత పరస్తున్నవి.

బాహుడా యాత్రనాడు ఠాకుర్‌ల పహండీ ఉదయమే ప్రారంభమవుతుంది. అది ప్రారంభమయినంతనే ఎక్కడినుండో ఒక గ్రద్ద ఎగిరివచ్చి పెద్ద ఠాకుర్ యొక్క తాల ధ్వజమునపైన వ్రాలి కూర్చున్నది. ఘంటా తూర్యాది నాదములకు గాని, ప్రజల అదలింపుల కోలాహలమునకు గాని అది చలించలేదు. అది రెక్కలను చాచి ఇటు నటు చూసి శ్రీమందిరము వైపునకు ఎగిరి వెళ్ళినది. ఆ పైన అదే గ్రద్ద లక్ష్మీ మందిర శిఖరముపైన వ్రాలినదని అనేకమంది అనుకొన్నారు. రథముమీద గ్రద్ద వ్రాలుట వలన పహండీ ఆలస్యమయినది. రథశోధనము, పవిత్రీకరణము మొదలైనవి జరిగిన తరువాతనే పహండీ ప్రారంభమయినది.

రథముమీద గ్రద్ద వ్రాలుటకు, రామచంద్రదేవ్ అంతర్ధాన మగుటకు సంబంధము ఏమీ లేక పోయినను సంయోగవశమున రెండు సంఘటనలు ఒకేసారి ఘటిల్లినవి.

బాహుడా యాత్రాదినమందు ఈ అశుభ శకునములను చూసి మొగల్ ఉపద్రవముల ఆశంకతో శ్రీ క్షేత్రమంతా విషాద ఛాయలు వ్యాపించినవి. అర్ధ చేతనములో నిక్షిప్తమై యున్న అనేక స్మృతి విస్మృతులు గహనాగాధ నీల జలములలోని నీటి బుడగలవలె ఉద్భవించ సాగినవి.

"దివ్యసింహదేవ్ మహారాజావారి ఏడవ అంక వృషభ మాసములో నీల చక్రమువైన ఇదే విధముగ ఒక గ్రద్ద వ్రాలినది. ఆ సంవత్సరములో మొగల్ ఉపద్రవములు శ్రీ క్షేత్రము పైన చాల తీవ్రముగ జరిగినవి. దేశములో దుర్భిక్షము ఏర్పడినది. ఒక తరణము ధాన్యము వెల ఇరువదిఐదు కాహణముల వరకు వెరిగినది. మనిషిని మనిషి చంపి తిన్నాడు. ఆ సంవత్సరము ఢిల్లీ పాదుషా అయిన ఔరంగ్‌షా యొక్క ఫౌజ్‌దార్ ఇక్రామ్‌ఖాన్ సైన్యముతో పూరీ వచ్చినాడు. ఆలయ సింహద్వారము మూసివేయ బడినది. చందనయాత్ర రుక్మిణీ హరణము మొదలగు స్వామివారి ఉత్సవములు వాయిదా పడినవి. ఏకాదశి నాటి రాత్రి మహా ప్రదీపము కూడ వెలిగించబడలేదు. లోపల అవరణలోనే కర్ర పీటలపైన ఎలాగో దేవస్నానము జరిపించేవారు. ప్రత్యేక పూజా సమయము లందు మ్రోగే వాద్యములు మూగవోయినవి. భోగ మండపము మీదనే గుండిచా యాత్ర జరిగినది" అని ఒక వృద్ధుడు అన్నాడు.

ఆ నాటి దుర్బర దుర్ఘటనల స్మృతులు ప్రజల మనములందు మరల తిరుగాడ జొచ్చినవి. పహండీకి ఆలస్య మయినది. గ్రద్ద ఎగిరి వెళ్ళిపోయిన తరువాత యాత్రికులు గుంపులుగా చేరి ఆ విషయమునే చర్చించ సాగినారు. వయోజ్యేష్ఠులు, వృద్ధ ప్రపితామహులు ప్రగల్భముగా వివరిస్తూ ఉండే సామన్య ప్రజలు ఉత్కంఠతో ఆలకిస్తున్నారు.

రథీపుర్ నుండి నీలకంఠ పట్టనాయక్ రథయాత్రకు పూరీ వస్తూ ఉంటాడు. ఈ సంవత్సరము కూడ సకుటుంబముగా పూరీ వచ్చినాడు. నీలాద్రి విజయ ద్వాదశినాడు ఆయన తిరిగి రథీపుర్ వెళ్ళుతాడు. ఆయన వయస్సు ఎనభై దాటినది. ఆయన దివ్యసింహదేవ్ కాలమునాటి వాడు. ఇక్రాంఖాన్ శ్రీ మందిరము మీద దాడి సలిపినప్పుడు దానిని ఈయన కండ్లార మూసినాడు, బాధతో సహించినాడు. వార్ధక్యములోగూడ ఆయన జ్ఞాపకశక్తి మొక్కవోలేదు. లలాటము పైన, కంఠమందు, బాహువులపైన, శిథిల చర్మము క్రింద నరములు ఉబికి ఉన్నవి. నీలకంఠ పట్టనాయక్ ఏదైన చెప్పుట ప్రారంభించి నట్లయిన అతని

కంఠమందున్న తులసి మాలక్రింది నరములు బిగుసుకొంటవి. ఆయన చుట్టూ అనేకమంది యాత్రికులు చేరి ఆయన మాటలు వింటున్నారు. దివ్యసింహదేవ్ మహారాజావారి కాలములో గ్రద్ద వ్రాలిన నాటి ముచ్చటను కల్పనా చాతుర్యముతో మేళవించి మనోహరముగ నీలకంఠ పట్టనాయక్ శ్రోతలకు వినిపిస్తున్నాడు.

"ఇది ఒక అత్యంత అమంగళ కరమైన శకునము. ఆ యేడు అనగా దివ్యసింహదేవ్ ఏడవ అంకములో జగన్నాథుడు మరొకసారి తోలు పటకాతో బంధింపబడి గౌడ మార్గమున ఈడ్వబడడడముకాక మరేమి జరిగినది? ఆ సమయములో ఆ రాజావారు వేరొక ఉపాయమును ఆలోచించినారు. ఇక్రామ్ ఖాన్ సోదరుడు మస్తాంఖాన్ ఏభైమంది సైనికులతో వచ్చి సింహద్వారమును పగులగొట్టి, ఇరవైరెండు పాదచ్ఛలను ఎక్కి సాగినాడు. వెంటనే దివ్యసింహదేవ్ అతనికి ఒక కొయ్య విగ్రహమును చూపించి, అదే జగన్నాథుని విగ్రహమని చెప్పినారు. అప్పుడు మొగల్ సైనికులు భోగమండపమునుండి చక్రమును తీసికొని వచ్చి, ఆ కాష్ఠ ప్రతిమను ఏనుగుపై నెక్కించి చందన్‌పుర్ తీసికొని పోయినారు ఆ సంవత్సరము చందన యాత్ర, రుక్మిణీ హరణము మొదలగు ఉత్సవములు జరుగనే లేదు. మహా ప్రదీపము వెలుగనేలేదు. కాని మహా ప్రభువు మాత్రము బిమలాయి వెనుక అవరణలోనే ఉండిపోయినాడు" అని కంపిత స్వరముతో ఆ వృద్ధ నీలకంఠ పట్టనాయక్ చెప్పినాడు.

"ఆ తరువాత?" అని ఏక కంఠముతో శ్రోతలు అతనిని అడిగినారు.

నీలకంఠ నాయకుని కథ రక్తికట్టి సాగినది. ఆవిన చోటునుండి కథను తిరిగి ప్రారంభించినాడు.

"మొగలులు తాము పరమేశ్వరునే తీసికొని వెళ్ళినట్టు భావించినారు. కాని బలిఆర్భుజుడు ఆలయమందే ఉండి పోయినాడు.

"అదేమి చిత్రము? మొగలులకు ఆ విషయము తెలియదా?" అని శ్రోతలలో ఒకడు ప్రశ్నించినాడు.

"అరే తమ్ముడూ! ఇక్కాంఖాన్,మస్తాంఖానులు ఆ కొయ్య ప్రతిమనే పర మేశ్వరు డనుకొని ఏనుగు మీద వేసికొని పోయినారు. ఇక ఆలయములో పర మేశ్వరుడు లేడనే వారి అభిప్రాయము. శ్రీపత్సఖండశాల ఆలయ సింహ ద్వారమునకు వారు సీలు వేసినారు. ప్రాణములేని శరీరమువలె ఆలయము పడి ఉండెను. యాత్రికుల రాకపోకలు నిలిచిపోయినవి. అటువంటప్పుడు ఆలయ ములో ప్రభువు ఉన్నాడని మొగలులు ఎలా అనుమానించ గలరు? కాని ఆలయ ఆవరణ లోపలనే విధులన్నీ యథావిధిగ నిర్వర్తింపబడు చుండినవి. ఆ యేడు గుండిచాయాత్ర భోగము మండపము వద్దనే జరిగినది. ఇదేవిధముగ ఓవ్యసింహ దేవుని ఇరువది ఐదవ ఆంకము వరకు జరిగినది. కన్యారాశి పదవ దినము, కృష్ణ ఏకాదశి, బృహస్పతి వారమునాడు తిరిగి ఆలయము తెరవబడినది. దివ్యసింహదేవుని ఆదేశానుసారము పదునెనిమిది గర్ల ఖండాయతులు వచ్చి సీలును బ్రద్దలుకొట్టి ద్వారములను తెరచినారు, ఆ రోజునుండి సంధ్యా, ధూప సమయములందు పాటలు పాడుట, వాయిద్యములను మ్రోగించుట తిరిగి ప్రారం భించినారు. మరల మహాప్రదీపము వెలిగినది. ఇవి నేను విన్నవికావు, నా కండ్లారా చూసినవి," అని నీలకంఠ పట్టనాయక్ చెప్పినాడు.

శ్రోతలలో నీలకంఠుని సమవయస్కు డొకడు ఉన్నాడు. అతడు మధ్యలో అడ్డుపడి "వియ్యంకుడా! అసలు విషయము చెప్పుట మరచినావు. నీ చక్రమును మొగలులు విరిచివేసినారు. ముప్పది అయిదవ అంకములోకుంభమా సము నాలుగవ దినమున పాత్ర పరమానంద పట్టనాయకుని పుత్రుడు ధరము హరి చందన్ మహాపాత్ర శ్రమవలన ఆలయము మీద నూతన నీలచక్రము ప్రతిష్ఠించ బడినది. దానితో ఇంద్రుడు సంతుష్టుడై వర్షములను కురిపించినాడు. అప్పటి నుండి రాజ్యమునకు పాలకుడు వచ్చినాడు" అని చెప్పినాడు.

ఆంతవరకు తాంబూలము దంచుకొనుచు వినుచుండిన నీలకంఠ పట్ట నాయక్ మాటలో మాటకలుపుతూ, "అరే! బాప్‌రే! ఎంత కరువు వచ్చిపడిన దని! దేశమును అప్పుడు పరమేశ్వరుడు ఎట్లు రక్షించినాడో తెలియదు. చింత

చెట్ల పైన ఆకులుకూడ మిగుల లేదు. వెదురు పొదలనుండి పచ్చి వెదురునుతీసి ప్రజలు తినినారు. గడ్డి, గాదము, ఆకు, అలము గూడ మిగుల లేదు. అంతా మనుష్యుల పొట్టలో పచనము అయినది. ఇంక భూమిమీద ఏమీ మిగులలేదు. దానితో మనుష్యులే విప్పి అయినారు. ప్రాణాలను వదలినారు. శవములు గుట్టలు గుట్టలుగ పడి ఉండినవి. అదంతా జ్ఞాపకము వచ్చిన యెడల నాశరీరము, మనస్సూకూడా కంపించి పోతవి,"అని చెప్పినాడు.

వృద్ధుడు మరల తన ప్రసంగమును అందుకొని "పరమేశ్వరుని రథము కదలనైనా కదలలేదు. నేడు రథముమీద మరల గ్రద్దవ్రాలినది. రామచంద్ర దేవ్ మహారాజావారు దేశాంతర గతులైనారు. పరమేశ్వరుని ఇచ్ఛ ఏమిటో తెలియదు. ఇప్పుడు మీరు అన్నిటికి సిద్ధముగ ఉండవలెను. మేమయితే ప్రయాణమునకు సిద్ధముగ నున్నవారము. ఇప్పటికే మా శరీరములు సగమునకు పైగా అస్థిగతములై ఉన్నవి,"అని ముగించినాడు.

ఎక్కడి కక్కడ యాత్రికులు గుంపులు గుంపులుగా చేరి రథముమీద గ్రద్ద వాలుటను గూర్చి చర్చించుకొంటున్నారు. దానిపైన అనేక ఉపాఖ్యానములు, స్మృతులు వర్ణించబడుతున్నవి.

ఇంతలో ఆలయము, రథము శుద్ధి గావింపబడినవి. ఆలయములోని వాద్య ధ్వనులతో ఐద్‌దాండ్ ప్రతిధ్వనించినది. దయితాలు, పతులు ద్వారమును తెరుస్తున్నప్పుడు, పాలిఆల, ఖుంటిఆల "మణిమా ! మణిమా!" నాదములో "మాభైః" అభయవాణి ఉద్ఘోషిత మవుతున్నది. రథ్‌దాండ్ మీద నిల్చున్న యాత్రికులు రానున్న అమంగళమునకు సంబంధించిన వ్యాకులపూరిత ఆలోచనలను, భయ సందేహములను క్షణికాలము విస్మరించి"మణిమా ! మహాబాహూ" అని నినదించ ప్రారంభించినారు.

మొదట సుదర్శనములు దయితాల భుజములమీద వచ్చి, సుభద్రా పథము వద్ద విరాజమాన మయినవి. ఆ తరువాత మహాడంబరముగ దర్పయుత భంగిమలో బలభద్రుని పహండీ ప్రారంభమయినది.

ఇవి ప్రాణరహితములైన దేవతా విగ్రహములు కావు. ప్రబలమైన ఆక్రమణ శతము, ప్రమత్తమైన తాడన శతములలో అపరాజితమైన మనమ్యుని అపరాజేయమైన ఆత్మవంటివి ఈ విగ్రహములు. ఓడ్ర జాతిపైన గతములో అగణితమైన పఠాన్, మొగల్ దాడుల వర్షము వర్షించినది. వాని వలన కాలానుగణముగ ఓడ్రజాతి తప్పనిసరియై వంగినదే కాని ఎన్నడూ విచ్ఛిన్నము కాలేదు. ఇది ఓరియా జాతి యొక్క ప్రాణశక్తికి ప్రేరణ వంటిది. అశుభము, అమంగళము, ఆక్రమణ సముద్రపు పోటువలె వచ్చిన వచ్చుగాక ; ఓరియా జాతి గతములో ఎట్లు రక్షింపబడినదో అదే విధముగ నేడుకూడ రక్షింపబడగలదు. పహండీ సమయములో పెద్ద ఠాకూర్ తాలూకు 'టాపిఆ' యొక్క ఆద్వితీయ శోభలో అభయము ఉట్టిపడుతున్నది.

అచట గుమిగూడిన యాత్రికులు "బలియార్ భుజా ; మజీమా ; మహాబాహో ;" అని ద్విగుణీకృత ఉత్సాహముతో కేకలు వేయ నారంభించినారు.

ఠాకుర్ల పహండీ యథావిధిగ సమాప్తమయినది.

రథయాత్ర సమయములో ఏ యే విధులు పాటించ బడుతవో బాహుడా సమయములో గూడ ఆ యా విధులే పాటించబడుతవి. సాధారణ మైనందిన జీవితములో సామంతులు తమ గ్రామమునుండి వేరొక గ్రామమునకు బయలు దేరునపుడు కారణము ఉన్ననూ, లేక పోయిననూ ఇతరులను పిలిచెదరు. బయలు దేరుటకు ముందు ఎవరైనను వెనుక ఉండిపోయినారేమో తెలిసికొనుటకు అలా పిలుచుట ఆచారము. ఎవరైనను ఉండిపోయినచో వారిని వెదకవలసి ఉండును. యాత్రకు ముందు పాథేయమునకు సరకులు సమకూర్చ బడుతవి. ఆ సరుకులు లేనిదే యాత్ర ప్రారంభముకాదు. ఈ విధులే ఈ ఉత్సవములో పరోక్షరూపమున నిర్వర్తించబడుచున్నవి. దీనిలో ఎట్టి ఆధ్యాత్మిక విశేషమూ లేదు, ఏ విశేష అభిప్రాయమూ లేదు.

అయినప్పటికిని, ఇతరప్రాంతముల యాత్రికుల విషయములో ఎట్లు ఉన్ననుస్థానికులు, పంచకోశ యాత్రికులు కూడ ఆదే దృశ్యమును ప్రతియేడు

ఆవాక్కులై ఉత్కంఠతో తిలకిస్తూ ఉంటారు. మధ్య మధ్యను పాలిథి, ఖుంటీ ఆల "మణిమా ! మణిమా !" పిలుపుతో వారు కంఠము కలిపి, "మణిమా ! మణిమా ! మహాబాహో ! బలియార్ భుజా !" అని పిలుస్తారు. ఆ సమలు ధ్వని సముద్ర ఘోషకన్న ఎంతో గంభీరముగా ఉంటుంది.

దీని అనంతరము వేర్వేరు సేవకులు తమ తమ నిర్దిష్ట కర్తవ్యములను ఆ మూడు రథముల పైన నిర్వహిస్తారు. విభిన్న అలంకారములు, మండనములు, మాలాలంకృతములు ఆదిగా గల కార్యములు జరుగుతని. రథములు బయలుదేరుటకు ముందు ఛేరాపహరా చేయుదురు ఠాకుర్‌లు రథములపైని కూర్చున్నప్పటినుండి ఛేరాపహరా చేసినంతవరకు పని ఉన్నను లేకున్నను, సేవకగణము నిచ్చెనపైనుండి ఎక్కి దిగుచుందురు. తమ తమ పరిచితులకు, యజమానులకు, ఇతరులకు జగన్నాథ దర్శనముచేయించి దక్షిణలు దండుకొనడమే వారు ఎక్కువగా చేయుపని.

ఆనాడు ఆ విధముగ కార్యక్రమము జరుగు చున్నప్పటికిని యాత్రికులు ఆక్కడా, ఇక్కడా సమావేశమై రథము మీద గ్రద్ద వ్రాలిన సంఘటనను చర్చించు కొంటున్నారు.

హఠాత్తుగ కలిసిన తమ బంధువులను, స్నేహితులను, పరిచితులను, పలకరించి మాట్లాడుకొనుచున్నారు. ఆ కోలాహలమంతయు కలిసి బడ్ దాండ్‌ను ముఖరితము చేస్తున్నది.

ఈ యేడు తకీఖాన్ ప్రతినిధి నాయబ్ రాజా అమీక్‌చంద్ బాహుదా రథములపైని ఛేరా పహరా చేయనున్నాడన్న వార్త సముద్రములోని తరంగమువలె ఆ జన సమూహములో వ్యాపించసాగినది. "జేనామణి భాగీరథీకుమార్ ఉంటూ ఉండగ ఈ అమీన్‌చంద్ ఎవడు ? ఆయనకు ఛేరాపహరా చేయు అధికారము ఎక్కడ ఉన్నది ? జేనామణి లేకుండిన ముదిరథులు చేయవలసిన రాజసేవ ఇది:" ఈ విధమైన జిజ్ఞాసలతో బడ్ దాండ్ నిండిపోయినది.

"అమీన్‌చంద్ పూరీకి నాయబ్‌గా నియుక్తుడైనాడు. ఆ షరతునకు అంగీకరించి జేనామణి భాగీరథీ కుమార్ 'గోపపుండరీక' చీరను ధరించి సింహా సనాసీనుడగుటకు ఖోర్దా వెళ్ళినాడు. ఇప్పుడు అమీన్‌చంద్ కాక ఈ కార్యమును ఎవరు నిర్వహించగలరు?" అని రాజకీయ వార్తాహరులు చెప్పసాగినారు.

ఛేరా పహరా చేయుటకే కాబోలును అమీన్‌చంద్ పల్లకిలో బయలు వెడలినాడు. మార్కండేశ్వర సాహి వైపు నుండి తైలంగ్, తూర్యాది వాద్య ధ్వనులు వినవస్తున్నవి.

నీలకంఠ పట్టనాయక్ ఆ వాద్య ధ్వనులను విన్నంతనే ఉత్తేజముతో "ఎవరు జగన్నాథుని రాజసేవకులుగా ఉంటారో వారే ఖోర్దాకు రాజుగా ఉండుటకు అర్హులు. ఇదే గజపతుల ఆచారము. ఇదే దేశ సంప్రదాయము. జేనామణి తన రాజసేవక పదవిని విక్రయించి యున్నయెడల రాజుగా ఆయనను ఎవరు అంగీకరిస్తారు? ఎందుకు అంగీకరిస్తారు?" అని అరవసాగినాడు.

ఛేరాపహరా చేసే సమయములో తళ్ళో మహాపాత్రకు ఒక నిర్దిష్టమైన భూమిక ఉన్నది. అతడు రథముపైకి వెళుతున్నప్పుడు నీలకంఠ పట్టనాయకుని నిచ్చెన వద్ద చూసి సాదరముగ మాట్లాడినాడు. ఈ విషయమును నీలకంఠ పట్టనాయకుడు మహా పాతతో ప్రస్తావించినప్పుడు, మహాపాత్ర రహస్యముగ "కులనాశనము కాబోయేముందు ఇటువంటి కులనాశకులైన పుత్రులు జన్మిస్తూ ఉంటారు, అని శాస్త్రములలో ఉన్న విషయమే గదా? బలిఅర్ భుజుని ఇష్టము నెరవేరక తప్పదు. వచ్చే సంవత్సరము ఈ రథయాత్ర జరుగునో లేదో చూడవలసి ఉన్నది" అని చిరునవ్వు నవ్వుతూ రథముపైకి వెళ్ళినాడు.

జగన్నాథుడు శ్రీ క్షేత్రమును వదలి వెళ్ళినాడన్న వదంతి ఇక్కడనే అంకురితమై, నెమ్మదిగా ప్రజలనోట పల్లవించి పుష్పించినది.

రథముపైని జగన్నాథునికి మాల్యార్పణము జరుగు తున్నది. అందువలన సందిమోష్ వద్ద జనులు ఎక్కువగ గుమిగూడినారు నీలకంఠ పట్టనాయక్ తాలధ్వజ రథము వద్ద నిల్చుని ఈ అనాచారమును చూస్తూ నిరర్థకమైన ఉత్తే

జముతో అమీన్‌చంద్, భాగీరథుల పైన అభిశాపములను వర్షిస్తున్నాడు. కాని దీని ప్రభావము అక్కడ నిల్చుండిన యాత్రికుల భావన పైన పడదము లేదు.

రాజా అమీన్‌చంద్ చేరా పహరా చేయుటకు శోభన యాత్రలో వస్తున్నాడు. 'ఛాటిఆ'లు బెత్తములను ఆదిస్తూ యాత్రికులను అదుపులో నుంచుటకు యత్నిస్తున్నారు.

ముందు పల్లకీలో రాజా అమీన్‌చంద్, అయన వెనుకనే వేరొక పల్లకీలో బడ పరీఛా రాజగురు ఉన్నారు.

నేడు అమీన్‌చంద్ యొక్క చిరకాల వాంఛ సిద్ధించ బోతున్నది. కరువులో చేప దొరకినట్లుగ జగన్నాథుని వంటి ఒక పెద్ద రాజస్వ సముపార్జనాధారము అతనికి లభించినది. అందువలన మేదాయుతమైన అతని ముఖము మీద నున్న ఏనుగు కండ్ల వంటి చిన్న కండ్లలో సంతోష చిహ్నములు స్పష్టముగ కన్పిస్తున్నవి. వెనుక పల్లకీలో నున్న రాజగురు ముఖమునందు, శోణిత నేత్రములందు శవమాంస భక్షకురాలైన నక్కమెలకువలు కన్పిస్తున్నవి.

"మహారాజ్ అమీన్‌చంద్‌ను సీ శంఖమునందుంచి, చక్రము చాటున ఉంచుఁ హే మహాబాహూ, బలియార్ భుజా!" అనుచు అతని పల్లకీకి ఇరు ప్రక్కల నడుస్తున్న సేవకులు, పాయిక్‌లు జయజయ నాదములు చేయసాగినారు.

"ఖోర్ధా రాజావారికి కల్యాణము చేకూర్చుము హే జగన్నాథాఁ" అని సాధారణముగా అక్కడ చేరిన యాత్రికులు వంత పలుకుచుందురు కాని నాడు ఆ సమయములో యాత్రికులు అమీన్‌చంద్‌కు దారిని వదలి నిస్పృహతో చూడసాగినారు. ఇంతలో ఒక వ్యక్తి భంగు త్రాగిన వానివలె "వీడు ఎవడురా ? అప్రాశ్యుడు" అని అరచినాడు. దానితో నిశ్శబ్దతకు భంగము వాటిల్లినది.

యాత్రికుల వ్యంగ్య హాస్యోక్తులతో చెలరేగిన కోలాహలములో తెలంగ్ వాద్యముల ధ్వని కూడ మరగు పడినది. అమీన్‌చంద్‌ను 'అప్రాశ్య'దన్న వానిని బంధించవలెనని పాయిక్‌లు ఇటునటు వెతకసాగిరి. ఆ విధముగ వారు అమీన్‌చంద్‌ను సంతోష పెట్టవలెనని తలచి యుందురు. శ్రీ క్షేత్రము పైని అమీన్

చంద్‌కు గల అధికారమును, ప్రాముఖ్యమును ప్రజలకు తెలియజేయుట గూడ వారి ఉద్దేశ్యము కావచ్చును. తమ ప్రయత్నమునకు ఫలితము ఏమైనదన్న ఆలోచన లేకుండగనే వారు తిరిగి అమీన్‌చంద్ పల్లకీ వద్దకు వెళ్ళిపోయిరి.

"వీడు ఒక భండుడురా! సునామాహారీ ఇంటినుండి లేచివచ్చినాడు. భండుని మీద ఇంకను పసుపు మరకలున్నవి, చూడండి!" అని యాత్రికులలో నుండి ఎవరో అరచినారు.

పరిహాసములతో రథ్‌దాండ్ ప్రతిధ్వనించినది.

రాజా అమీన్‌చంద్ రథముపైకి వచ్చి, కప్పవంటి తన స్థూల కాయమును ముందుకు వంచి సాష్టాంగ ప్రణామము చేసినాడు. ఆ హాస్యోద్దీపకమైన అతని భంగిమను చూసి యాత్రికులు నవ్వసాగిరి. ఆ కోలాహలము అధికాధికమై నిప్పుమీద నీరు పడినట్లుగ క్షణకాలములో సద్దుమణిగినది. అమీన్ ప్రణామము చేసిన వెంటనే భండార్ మేకాప్ స్వర్ణ పళ్ళెరములో కర్పూర హారతిని అందిచ్చినాడు. అది అమీన్ చేతినుండి జారి క్రింద పడినది.

ఆ సమయములో కర్పూరహారతి క్రిందపడుటను అంతవరకు ఎవరూ చూడలేదు, వినలేదు. లక్షసార్లు జ్ఞాపకము తెచ్చుకొనుటకు ప్రయత్నించినప్పటికినీ, ఊహలకు లక్షసారులు రంగుపూసినప్పటికినీ ఛేరాపహరా సమయములో అటువంటి అమంగళకరమైన దుర్ఘటన నీలకంఠ పట్టనాయకునికి గూడ జ్ఞప్తికి రాలేదు. ఉదయము తాలధ్వజ రథముపైన గ్రద్ద వ్రాలడము వలన కలిగిన అవ్యక్తభయము ఛేరాపహరా సమయమందు అమీన్‌చంద్ కర్పూరహారతిని చేతినుండి జారవిడవడముతో మరింత ఘనీభూతమై యాత్రికుల మనములందు ప్రవర్థమానమైనది.

యాత్రికులలో నిరోధింపబడిన ఉద్వేగము ఆ సమయములో నిట్టూర్పుగా మారినది. అమీన్ చంద్ జగన్నాథుని రథముపైన ఛేరాపహరా చేయనారంభించినాడు.

ఛేరాపహరా అనగా రథయాత్ర సమయమందు బడ్దాండ్‌ను శుభ్ర పరచుట అని అర్థము. ఆ కార్యమును రాజసేవకుని రూపములో ఖోర్ధా గజపతి చేయవలెను. ఉత్కళ దేశ రాజతంత్రములోని విశిష్టత, విశేష ఆదర్శము ఇదే. దర్పయుతుడైన సమ్రాట్టుని యాత్రాపథమును అక్కడి ప్రజలు శుభ్రము చేయుట కాదు; సమ్రట్టే ప్రజారూపుడైన పరమేశ్వరుని సేవకుని రూపమున ప్రజల ఆధ్యాత్మిక చింతన, లోకకల్యాణ పథములను పరిష్కృతము చేయుటకుగాను తన స్వహస్తములతో మార్జనిని తీసికొని రథ దాండ్‌ను పరిశుభ్రము చేయును. ఛేరాపహరాలో ఇంత అర్థము ఇమిడియున్నది కాని, రాను రాను రాజత్వాభిమానము సేవకత్వపు దీనతలో ఇముడ లేనందున రథదాండ్ మీది నుండి' ఛేరాపహరా' రథము మీదకు మారినది.

ఏది ఏమైనవ్వటికిని ఈ విధి అత్యంత క్లాంతికరమైనది. ప్రతి రథము మీదను ఈ విధిని పునరావృత్తము చేయుట మరింత శ్రమకరము.

బలభద్ర, సుభద్రల రథములపైన ఛేరాపహరా గావించి జగన్నాథుని రథముపైకి ఎక్కుచున్నప్పుడు అమీన్‌చంద్‌కు నడిచే శక్తికూడ లేనట్టు గోచరించినది. జగన్నాథుని రథముపైన అమీన్‌చంద్ ఛేరాపహరా చేస్తూ ఆకస్మాత్తుగ నడుమును ఎడమ చేతితో పట్టుకొని, వికృతముఖముతో ఉండిపోయినాడు. బహుశా ఆయన నడుము పట్టుకొని పోయి ఉండవచ్చును. అ స్వర్ణ మార్జనిని ఎడమ చేతిలోనికి మార్చుకొని కుడిచేతిని నడుముపైన ఉంచి హాస్యోద్దీపక భంగిమలో నిల్చున్నంతనే యాత్రికులలో నవ్వుల కోలాహలము చెలరేగినది. ఛేరాపహరా విధిని భక్తిభావముతో విస్మయముతో చూడవలసిన ప్రజలు అపహాస్యముతో చూడసాగిరి. భక్తి శ్రద్ధలకు మారుగ యాత్రికులలో ఉపహాసము ఉద్రేకించినది.

నందిఘోష మీద కూర్చుని ఈ విడంబనమును పూర్తిగ నిస్పృహతో చూస్తునట్లుగ బలిఆర్ విభుడు కనుపించినాడు. ఆయన సర్వద్రష్ట. అయినను "చూడు, శ్రీ కళాముఖము ఎంత విషాదముగ కన్పిస్తున్నదో! ఇదివర

కెన్నడూ ఈ విధముగ కన్పడలేదు. శ్రీ ముఖము'ండి కళలు అదృశ్యమయి నట్లున్నవి" అని యాత్రికులు ఒకరితో నొకరు చెప్పుకొనసాగిరి.

బాహుడా యాత్ర చూడ వలెనన్న ఆసక్తి ఇప్పుడు ఎవ్వరిలోను లేదు. రథమునకు కట్టిన మోకును ముట్టుకొని నొసటను అద్దుకొని, నిరానంద మనస్కులై యాత్రికులు మరల సాగినారు.

అధర్వణ ఏకాదశి ఉదయము నుండి ఆకాశము మేఘావృత్తమై యున్నది. యుద్ధనావలవలె మేఘములు తూర్పునుండి పశ్చిమమునకు సాగిపోతున్నవి. శీతల వాయు వేగములో వర్ష రాకడకు సూచనలు గోచరిస్తున్నవి.

సముద్రము వైపునుండి వీస్తున్న గాలి వేగమునకు కొబ్బరిచెట్లు తలలు వంచినవి. రథ్‌దాండ్‌కు ఇరు ప్రక్కలను యాత్రికుల సౌకర్యము కొరకు పండాలు నిర్మించిన గుడిసెల వైకప్పులు ఎండుటాకులవలె ఆ గాలిలో ఎగురు తున్నవి. అది వడి గాలిలా లేదు, సుడిగాలిలా ఉన్నది.

వాన సూచనలను చూచి పంచక్రోశయాత్రికులు శ్రీ క్షేత్రమును విడిచి వెళ్ళ నారంభించిరి. జగన్నాథుడు ఇప్పుడు శ్రీ క్షేత్రములో లేడు. ఖోర్ధా రాజావారు కూడ లేరు నాయబ్ అమీన్ చంద్ భేరాపహరా చేసినాడు. ఆయన చేతిలో నుండి కర్పూరహారతి క్రిందపడినది. తాళధ్వజ రథము మీద గ్రద్ద వాలినది..... ఇట్టి అశుభ సంఘటనల వలన ఒక అనిశ్చిత, అమంగళ కర శంకతో తిరిగి యాత్రికులు తిరిగి పోనారంభించినారు. వీధులు నిర్మానుష్యము కాజొచ్చినవి.

మొగల్ దాడులు ప్రారంభమయిన యెడల అన్యరాష్ట్ర యాత్రికుల దుర్దశలకు హద్దు ఉండదు. జగన్నాథమార్గము వైనున్నంతవరకు వారు కొంత వరకు ప్రమాదరహితులుగానే ఉంటారు. ఆ మార్గమువైన కొన్ని రక్షణ సదు పాయాలను సుజాఖాన్ కల్పించినాడు. అందువలన సైనికులు యాత్రికుల వద్ద నుండి పన్నును వసూలు చేయుటకు గాని, వారిని దోచుకొనుటకు గాని సాహ

సించరు. ఆ మార్గముపైన పన్ను వసూలు చేయుటకు సర్కారు వారి చౌకీలు ఉన్నవి.

కాని మొగల్ సైనికులు శ్రీ క్షేత్రముపైన అకస్మాత్తుగ దాడిచేసినట్లయిన దూరదేశ యాత్రికుల ప్రాణ, మాన ధనములకు ముప్పు వాటిల్లగలదు. గత కాలములో ఇది జరిగినది. మొగల్ దాడులు జరుగవలసిన పరిస్థితులు ప్రస్తుతము లేవు. కాని అటువంటి ప్రమాదము లేకపోయినట్లయిన తాలధ్వజముపైన గ్రద్ద ఎందుకు వ్రాలినది ? అక్కడనుండి ఎగిరి వెళ్ళి లక్ష్మి ఆలయము పైని ఎందుకు దిగినది ? హఠతి పక్షేము ఎందుకు క్రింద పడినది ? కార్య కారణముల గురించి స్థిర చిత్తముతో ఆలోచించి నిర్ణయించగల స్థితిలో ఎవ్వరునూ లేరు. ఒక యాత్రిక దళము ఏదో కారణమువలన పూరీ వీడి వెళ్ళినదాన మరొక దళము వారిని అనుసరిస్తున్నది. బాహుడా నాటినుండి పూరీలో విషూచి భయము ప్రబలినది. బిమలేయీ దేవి పండాలలో ఒకరికి దేవి స్వప్నములో ప్రత్యక్షమయి "అమీన్‌చంద్ జగన్నాథుని రథముపైన ఛేరాపహరా చేసినందుకుగాను, దానికి ప్రతి క్రియగా పూరీని తుడిచి వేస్తా" నని చెప్పినదట. అందుచేత అధర్వణ ఏకాదశి నాటికి పూరీ వీధులన్నీ నిర్మానుష్య మయినవి. కొద్దిమంది యాత్రికులు మాత్రమే ఉన్న నిర్జన బడ్ దాండ్ మీద వర్షాగమనమును సూచిస్తూ రివ్వుమంటూ గాలి వీచ సాగినది.

గుండిచా యాత్రరోజున జగన్నాథుడు సుభద్రను తీసికొని వెళ్ళి పోతాడు. అందుకు లక్ష్మి ఈర్ష్యచెంది కోపగించుకొంటుంది. ఇది ఒక భిన్న రూపములో తాత్త్వికదృష్టితో మలచబడిన సాధారణ ఒరియా గృహస్థుని సాంసారిక జీవన చిత్రణము.

జగన్నాథుని సింహద్వారము వద్ద సాధారణ మనుష్యుడు దేవతారూపములో ఎట్లు కనిపిస్తాడో అదే విధముగ దేవతలు సాధారణ మానవ రూపములో కనిపిస్తారు. అందువలననే లక్ష్మి ఈర్ష్యాళువు, ప్రచండ స్వాభిమానవతి అయినట్లుగనే జగన్నాథుడు కూడ భార్యా విధేయుడు, పశ్చాత్తప్తుడు, అసహాయుడు అయినటువంటి స్వామి వలె భాసిస్తాడు.

జగన్నాథుడు రథముమీది నుండి దిగి సంతనే లక్ష్మి శ్రీ మందిర ద్వారమును మూసివేస్తుంది. మానిని, కువిత అయిన లక్ష్మి దేవి యొక్క దుర్జయ స్వాభిమానమువలన సింహద్వారము వద్ద ఆ రోజంతయు జగన్నాథుడు ఉపవాసముతో గడపవలసివస్తుంది. ఆకలి నివారణకు తన మందిరమునకు మరలిపోవుట తప్ప వేరు ఉపాయము జగన్నాథునికి కనువించదు. కాని అది కూడ మూసివేయబడియున్నది. కోపకారణముగ అధర్పణ ఏకాదశినాడు పూర్వ సువాసుని వలె అతడు నిర్జలోపవాసము చేయవలసి వస్తుంది. ఎంతో ప్రయాస చెందిన పిమ్మట పంచదార, ఛేనా, అరటిపండ్లు మొదలగు వానితో తయారయిన అధర్పణ మాత్రమే ఒక చిన్న కుండెడు లభిస్తుంది. ఆ కుండ సొరకాయవలె చిన్న మూతి గలది. జగన్నాథుడైన రంగాధరుడు దానిని కేవలము స్పృశిస్తాడు. ఆ మాత్రముతో ప్రపంచము యొక్క దాహము ఎట్లు తీరగలదు; లక్ష్మి కోపమువలన ఆ కుండ కూడ పగిలి పోతుంది. ద్వాదశి కూడ అదేవిధముగ గడుస్తుంది. అయినప్పటికిని లక్ష్మి అభిమానమును వీడదు.

ప్రాగ్వైదిక సమాజములో మంత్రతంత్రములు ఆదిగా గల అభిచారము లతో గూడిన పర్ణశబరీ పూజ ప్రచలితముగ నుండేది. దాని సాధికలుగ జ్ఞానదేయా, మాలుణీ, సితాయీ, ధోబణీ, గాంగీ గడ్డణీ, ఖుఆ తేలణీ, లహా కుటీ లుహారూణీ, పత్రవిందా స ఉరూణీ మరియు సుకుటి చమారూణీ ఉండే వారు. వీరు బహుశా సహజిఆ కృష్ణాచార్య లేక కాన్హుపా యొక్క చర్యాగీతికలోని సాధనా నాయిక లై యుండవచ్చును. వారు డోంబీ, శబరుల ఇటీవలి రూపాంతరములై యుండవచ్చును. ఒకానొక సమయములో పర్ణశబరీ తంత్రములోని ఉపాస్య దేవిగా లక్ష్మి ఉండేది. అటు పిమ్మట జగన్నాథునిపైన కేంద్రీకృతమై ఏర్పడిన సర్వమతముల, సర్వతత్త్వముల అపూర్వ సమన్వయము వలన శ్రీయా సేవితా, పర్ణశబరీ అయినటువంటి లక్ష్మి విష్ణుపత్ని, సాగర దుహిత అయిన లక్ష్మిగ రూపొందినది. కాని ఆ సమన్వయము సాంస్కృతిక సంఘర్షణములలో గతిశీల మయినది. చివరకు వైదికులు జగన్నాథుని గ్రహించి నారు. కాని జగన్నాథ క్షేత్రములో పర్ణశబరీ లక్ష్మిని గ్రహించుటకు వారువెను

కాడినారు. అదే విధముగ ఆవైదికులు కూడ పతి ఆజ్ఞను శిరస్సున ధరించేదిగ, జగన్నాథుని పత్నిగ లక్ష్మిని గుర్తించుటకు నిరాకరించినారు. వస్తుతః మాతృ ప్రధానమైన వైదికేతర సమాజములోని మాతృదేవి లక్ష్మి యొక్క ప్రాధాన్యమే ఈ సంఘర్షణా సమన్వయముల స్మృతికి ఒక మతాచారమనే ఆవరణను తొడిగినది. ఒకానొక సమయములో జగన్నాథుడు కమండల ధారులైన నాథ సంప్రదాయము వారి ఇష్టదైవముగ పరిగణింప బడేవాడు. ఈ అభినయములో బహుళా ఆ రూపము కూడ కొంత వరకు స్మరించబడుతున్నది.

హిందూ ధర్మాచరణలో తత్త్వముల యొక్క శుష్కమైన, రసహీనమైన క్లిష్టత లేదు. కావ్య వ్యంజనలో అది రసమయి. అందుచేత ఈ చారిత్రాత్మక ఘటనను కథా కావ్యముల మాధ్యమము ద్వారా ఒక ధర్మాచరణ పద్ధతిగా రూపొందించి దానిని శాశ్వతము చేసినారు. ఇందులో లక్ష్మి ఖండిత, స్వీయ నాయిక. జగన్నాథుడు పరకీయాప్రలుబ్ధుడైన ధూర్త నాయకుడు. జగన్నాథుని పరకీయ విలాసము వలన లక్ష్మి ఒక సాధారణ స్త్రీ వలె కోపించి శ్రీ మందిర సింహద్వారమును జగన్నాథుడు ప్రవేశించకుండ మూయించి వేయును.

నీలాద్రి విజయ ద్వాదశి విధిలో ఈ విధమైన సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంఘర్షణా సమన్వయముల అభినయము క్రమముగా రూపొందుతుంది. ఈ అభినయమును తిలకించుటకే ప్రతి సంవత్సరము ఆలయములోపలను, వెలుపలను కూడ ఇసుక వేసిన రాలనంత మంది యాత్రికులు వస్తుంటారు.

కాని నేడు, ద్వాదశినాడు కూడ సింహద్వారము ముందు, వీథులలోను కాకులు మాత్రము ఎగురుతున్నవి. జడివాన వల్లనే కాక అనేకయితర భయ సందేహముల వలన కూడ శ్రీ క్షేత్రమును వదలి యాత్రికులు వెళ్ళిపోయినారు. రథ్ దాండ్ జన శూన్యమైనది. యాత్రికుల గుడిసెల పైకప్పులను ఎగురగొట్టుతూ గాలి రివ్వున వీస్తున్నది.

దీనికి తోడు రేపటినుండి పంచగ్రహ కూటమి ఏర్పడనున్నది.

సాయంసంధ్యాసమయము కాకుండగనే ఆకాశము పైన అమావాస్యనాటి అంధకారము అలముకొన్నది.

అపరాహ్ణము తరువాత మేఘములు కొంతవరకు చెదరిపోయినవి. కాని తరువాత మేఘములు మరల క్రమ్మ్మకొని ఆకాశమును అంధకారమయము గావించినవి. ఆకాశములోని మెరుపులు మేఘాచ్ఛన్నమైన భయంకరత్వమును మరింత అధికము చేస్తున్నవి. మధ్యాహ్నము కురిసిన వర్షము వలన వీధికి ఇరుప్రక్కల నున్న మురికి నీటి కాలువలో నీరు గలగలమంటూ అతర్నలా వైపు ప్రవహిస్తున్నది. అప్పటి కింకను గాలి తీవ్రముగనే వీస్తున్నది.

సంధ్యా పూజానంతరము తాకురుల పహండీ జరుగనున్నది. కాని తుఫాను గాలికి కాగడాలు ఆరిపోతున్నందువలన ఐహళా పహండీ ఆలస్యముగ చీకటిలోనే జరుగవచ్చును. ఈ విషయమై ఆలోచించి వెలుగు ఉండగనే పండాలు జయమంగళ హారతిని ఇచ్చినారు. హారతి అనంతరము ఇతర విధులను జరిపించుటకు చాల సమయము పడుతుంది. తాకురులను వస్త్ర భూషణాదులతో అలంకరిస్తారు. జగన్నాథవల్లభ ఉద్యాన వనమునుండి ఖుంటిఆలు పూజా పుష్పములతోను మాలలతోను తయారు చేసిన భూషణములను తీసికొని వెళ్ళతారు. వాటితో ప్రభుప్రులవారి శ్రీ అంగములను అలంకరిస్తారు. నేడు ఆ విధులను నామ మాత్రముగ జరిపించినారు. పహండీని యథావిధిగా జరిపించ వలెనని సేవకులు ఆదుర్దా చెందుతున్నారు. జనము ఎక్కువగా ఉన్నట్లయితే పనులు మరింత ఆలస్యము కావచ్చును. కాని పండాల సంపాదన పెరిగి ఉండేది. నేడు ఇక్కడ ఒక పిల్లి కూన కూడా లేదు. సింహద్వార గుమ్మటములో ఆమీన్‌చంద్ బడపరీఛా గౌరీ రాజగురు వేచి ఉన్నారు. త్వరగా పహండీని ప్రారంభించ వలసినదిగా వారు మాటి మాటికి హెచ్చరిస్తున్నారు.

మేఘాచ్ఛనమైన ఆకాశపు విషణ్ణతలో, జడివాన చప్పుడులో పహండీ కొరకు విజయ తూర్యములు మ్రోగినవి. రాఘవదాసు మఠమునుండి తాకుర్ల కొరకు కొని వచ్చిన టాపాలతో తాకుర్లను అలంకరించినారు. పహండీ ప్రారంభమయినది. బలభద్ర సుభద్ర లిర్వురు ఆలయములో ప్రవేశించినారు. జగన్నాథుడు సింహద్వారము వద్ద చేరినంతనే దేవదాసీలు ఆచారము ప్రకారము దానిని మూసివేసినారు. నీలాద్రి విజయ ద్వాదశినాడు వారికి అఖండ కర్ప్ర

త్వము ఉన్నది. రాజా అమీన్‌చంద్, రాజగురులను గూఢ సింహద్వార గుమ్మ టమునుండి బయటకు నెట్టివేయుటకు వారు జంక లేదు.

సునామాహారీ తన కంకణ శోభిత హస్తములతో అమీన్‌చంద్‌ను కపట క్రోధముతో నెట్టి వేయుచున్నప్పుడు కాంచన, కేతకి, సారీఆ మొదలైన దేవ దాసీలు కిలకిల నవ్వసాగినారు.

ఆకస్మాత్తుగ అక్కడ సునామాహారీని చూసి అమీన్‌చంద్ గుర్తించ లేక పోయినాడు. మాహారీ విలాసమయ పరిధానమును త్యజించి, బాహ్య సౌందర్యోపాసకుడు, కామప్రమత్తుడు అయిన అమీన్‌చంద్‌వంటి వాని మనస్సులో గూడ కామవిలాస భావన జనించని విధముగ తనను తాను దేవదాసిగ అలంకరించుకొన్నది. ఆమె మహాలక్ష్మికి పరిచారిక అయిన మరియొక సునా వలె నున్నది. నారింజపండు రంగు పట్టు వస్త్రము, శిరమున రాళ్లు పొదిగిన స్వర్ణాభరణములు, వక్షమునకు ఇంద్ర గోవింద కంచుకము, మొలకు రత్నవడ్డాణము, ముక్కుకు ముత్యపు నాసాపుష్పము, చెవులకు వజ్రకుండలములు కంఠమందు రత్నమాల, కాళ్లకు నూపురాలు, కండ్లలో నైసర్గిక కమనీయ భంగిమ... అటువంటి మూర్తిని ఆలయ శిల్పములలోనే అమీన్‌చంద్ చూసినాడు రక్త మాంసయుతమైన అటువంటి సజీవ నారీ ప్రతిమ ప్రపంచములో ఉండుట సంభవమని అతడు ఎన్నడూ ఊహించనైనా ఊహించలేదు. సునాపైకి అతని దృష్టి మరలినదో లేదో ఇంతలోనే సింహద్వారము మూసుకొన్నది.

పహండీలో జగన్నాథుడు సింహద్వారము వద్దకు చేరుతున్నప్పుడు దేవ దాసీలు, పండాల మధ్య జరిగే 'దాయికా' గానములో చాలాకాలము వ్యయమవు తుంది. కాని ఘనీభూతమవుతున్న మేఘములు, వర్షముతో కూడిన వాతావరణము వారి ఉత్సాహమును చెడగొట్టినది. జగన్నాథుడు విజయద్వారము వద్దకు వచ్చినంతనే పండాలను అప్రతిభులను చేయుటకుగాను దేవదాసీలు వచనికను ఆరంభించినారు. ఇప్పుడు బయటి వాతావరణము వారికి అడ్డురాలేదు.

ఆలయపు దక్షిణ ఆవరణకు బయట ఒక పెద్ద వటవృక్ష శాఖ విరిగి పడినది. ఆ భయంకర శబ్దమునకు ఆలయ ప్రాంగణ మంతయు కంపించి పోయినది. ఆ సమయములో ఎక్కడనో దరిదాపులలో పిడుగు పడినట్లున్నది. అయినను గత సవత్సరము వలెనే ఈ యేడుకూడ దేవదాసీలు పట్టుదలతో నున్నారు. కాని సేవకులలో ధైర్యము లేదు. జయవిజయ ద్వారమును తెరచిన తరువాత జగన్నాథుడు రత్న సింహాసనముమీద విరాజితుడగుటకు పూర్వము అనేక విధులు నిర్వర్తింపబడుతవి. భండార ద్వారమునకు ఎదుట కోపముతో నున్న లక్ష్మి చెంతకు జగన్నాథుడు చేరుతాడు. అక్కడ హారతి పూజాదికములు జరుగుతవి. ఆ తరువాతనే జగన్నాథుడు రత్నసింహాసనమును అలంకరిస్తాడు. తదనంతరము ఐడ్ సింహార్ వేషము, పూజాదికములు జరుగుతవి. వీటి తరువాత శయన వ్యవస్థ, వీణా వాదనము, గీతా గానము, పుష్పాంజలి మొదలగునవి. జరుపబడుతవి. జగన్నాథుడు శయనించిన తరువాత ఆలయ ద్వారములు బంధింప బడుతవి ఈయేడు తుపాను వలన కార్యక్రమములు పూర్తి అగుసరికి అర్ధరాత్రి కావచ్చును. అందువలన వీలయినంత వేగముగ పనులను పూర్తి చేయవలెనని సేవకులు ఎవరి పనులలో వారు నిమగ్నులైనారు.

వచనిక వలన ఆలస్యమవుతున్నది. అందువలన ద్వారము వద్ద దయిత్వా ఒకడు కరాఘాతము చేస్తూ "అరీ ఓ సునా! ... చాలించు. తలుపు తెరు. వర్షపు చలిగాలి వలన జగన్నాథుడు గజగజ వణుకుతున్నాడు. ఇకనైన ద్వారమును తెరువుము" అని అనినాడు.

జయవిజయ ద్వారము తెరచుకొన్నది. కాని వెను వెంటనే ఈదురుగాలికి రత్నసింహాసనము వద్ద నున్న అఖండ ప్రదీపము కొండ ఎక్కినది. అఖండ దీపము ఆరిపోయినంతనే అఖండ మేకప్ లబోదిబో మని ఆర్తనాదము చేయ మొదలిడినాడు. "బాహుడా ప్రారంభించి సప్పటి నుండి ఒకదాని వెనుక ఒకటి అపశకునములే జరుగుతున్నవి. ఆ ప్రభువు ఇచ్ఛ ఎట్లున్నదో ఎవరికి తెలుసు? భవిష్యత్తు ఆయన కొకనికే తెలుసు. అఖండ ప్రదీపము ఆరిపోకూడదు" అని అతడు అన్నాడు.

అమీన్‌చ-ద్, గౌరీ రాజగురు దూరముగ ఒక చోట నిల్చుని సీలా|ది విజయ విధులను తిలకిస్తున్నారు. అఖండ మేకాప్ మాటలలో అమీన్‌చంద్ యెడల ఆక్షేపణ స్పష్టముగ వ్యక్తమయినది. అందువలన అమీన్‌చంద్ "గాలి వేగమునకు ప్రదీపము ఆరిపోయినది, అందులో చింతించ వలసినది ఏమున్నది" అని విరకితో అనినాడు.

అఖండ మేకాప్ అఖండ ప్రదీపమును తిరిగి వెలిగించినాడు.

ఆలయము లోపలకు ప్రవేశించిన తరువాత జగన్నాథ రుక్మిణుల గత బంధనమును లక్ష్మివద్ద విధి ప్రకారము భితర్చోమహాపాత్ర విప్పుతాడు. కాని ఆ సమయమునకు అతడు అక్కడ లేడు. నేడు నరేంద్ర మహాపాత్ర వంతు. అతడు అక్కడ లేకపోయినందుకు, "నరేంద్ర మహాపాత్ర ఏమయినాడు? సేవకులు తమ ఇచ్ఛానుసారముగా ప్రవర్తిస్తున్నారు. దీని వలన జగన్నాథుని విధి నిర్వహణలో ఎంతో ఆలస్యము జరుగుతున్నది" అని వ్యగ్ర స్వరముతో గౌరీ రాజగురు కోపగించినాడు.

భితర్చోను వెతకుటకు ఒక దయితా బయలు దేరినాడు. అతనికి ఎదురుగ భితర్చో మహాపాత్ర కొమకు వస్తూ కన్పించినాడు. "ఓరే మహాదేవ్, మీ నాయన ఎక్కడున్నాడురా?" అని అడిగినాడు.

"ఆయనకు వాత జ్వరము వచ్చినది. ఇంటిలో పడుకొని ఉన్నాడు. ప్రక్కమీది నుండి లేవలేని స్థితిలో ఆయన ఉన్నాడు. అందుకని నన్ను పంపినాడు" అని మహాదేవ్ చెప్పినాడు.

"సరే, సరే, త్వరగా కానివ్వండి. రత్నసింహాసనము మీద జగన్నాథుడు విరాజమానుడైన పిమ్మటనే బడ్ సింహార్ జరుగవలసి ఉన్నది." అని అనేకమంది తొందర చేసినారు.

...విధులన్నీ పూర్తి అయినవి...

జగన్నాథుడు రత్నసింహాసనమువైన విరాజమానుడవుతున్న సమయమందు

సేవకులందరు జయజయ ధ్వానములు చేసినారు. ''రత్నసింహాసనముపైని విరాజితుడవు కమ్ము... హే మణిమా! మహాబాహూ!" అని కీర్తించినారు.

ఐడ్ సింహార్ పూర్తి అగుసరికి అర్ధరాత్రి గడచినది. బయట ఈదురు గాలి జోరుగ వీస్తున్నది. వర్షము కుండ పోతగా కురుస్తున్నది ప్రభువులవారి శయన వ్యవస్థ, ఆరతి, గీత గోవిందగానము, పయిడ్ మణోహా, తాంబూల సేవనము, కర్పూర నీరాజనము మొదలగునవి ఒక్కొక్కటే పూర్తి అయినవి. సేవకులు శయన వ్యవస్థను ముగించి వెళ్ళినారు. పాలిఆ పధిఆరీ జయవిజయ ద్వారమును బంధించినాడు. అగ్ర దీపము వెలుగుతున్నది. అఖండ ప్రదీపము రత్నసింహాసనము క్రింద ఉంచబడినది. పాలిఆ మేకాప్ అగ్ర దీపమును చేతితో పైకెత్తి "మణిమా! మణిమా!" అని పిలుస్తూ సింహాసనమునకు నాల్గు వైపులను పరీక్షించి చూసినాడు.

కొన్ని ఎలుకలు సింహాసనము వెనుకనుండి గోడవారగ ఇటునటు పరుగెత్తి పాదోదక తూములోనికి దూరినవి. "ఆలయము లోపల కూడ ఎలుకలు ఎక్కువవుతున్నవి. తలిఛో మహాపాత్ర ఎలుకలబోను పెట్టడములేదు. వీటి ఆగడము రోజురోజుకు పెరిగి పోతున్నది" అని పాలియా మేకాప్ అనినాడు.

"బిడ్డా! ఇది డోలు లోపలి ఎలుక. దీనిని ఎవరు సంబాలించ గలరు? అది సరే గాని, బలియార్ భుజుడు ఏమికావాలంటున్నాడో చూడు'' అని భంగు త్రాగిన మత్తుతో దయితాపతి గోవింద మహాపాత్ర అనినాడు.

గౌరీ రాజగురు, అమీన్‌చంద్ తదితరులు వర్షములోనే బయటకు వచ్చినారు. వర్షము, గాలి మరింత ఎక్కువయినవి. ముదులి, బడ పుఆర్ పధిఆరీ, ఆలయ రక్షకులను బయటకు పంపించి వారు ఆలయము లోపలనే మేల్కొని ఉంటారు ఇతర సేవకులు వెళ్ళిన తర్వాత సింహద్వారము మూసివేయ బడినది.

ఆ రాత్రి వర్షము మరింత హెచ్చయినది. ఇంద్రాణీ ఆలయము నుండి ముక్తి మండపము వరకు కల్పవట వృక్షము కొమ్మలు ఆస్తవ్యస్తముగ విరిగి

పడి యున్నవి. ఆలయ శిఖరము పైనుండి నీలచక్రము ఎగిరి లక్ష్మీ ఆలయము వద్ద పడినది. తెల్లవారు సరికి గాలివాన ఆగిపోయినది. మేఘములు విడిపోయినవి. తుపాను ప్రకోపము వలన ఆలయ ఆవరణ ప్రాంతమంతయు ఒక విధ్వస్త రణ ప్రాంగణ మయినది. వేకువ జామున విడుగు పడినందువలన జగన్నాథ వల్లభ ఉద్యాన వనమందలి కొన్ని చెట్లు కాలిపోయినవి. తుపాను ఉద్ధృతము తగ్గినను మేఘ గర్జనలింకను విన్పిస్తున్నవి. రథ్‌దాండ్ పైన గాలి రివ్వుమని వీస్తున్నది.

ఉదయమునకు వర్షము తగ్గి ఆకాశము నిర్మలమైనది. బడపరీఛా గౌరీ రాజగురు, రాజా అమీన్‌చంద్, ప్రతిహారి భితర్చ మహాపాత్ర, ముదులి, అఖండ మేకాప్, పాలియా మేకాప్, ఖటశేజ్ మేకాప్, పాలిఆ సుఖర్, బడ ఖుంటిఆ, గరాబడు, బలితా జోగాణిఆ, సేవకులు మొదలగు వారందరు ప్రత్యూషమందే ద్వారము తెరచి మంగళహారతి ఇచ్చుటకు వచ్చినారు.

ముందుగ జయవిజయ ద్వారము వద్ద గతరాత్రి వేసిన సీలును పరీక్షించిన తరువాత ముదులి తాళమును తీసినాడు. ప్రదీపమును తీసికొని సేవకులు లోపలి ద్వారము వద్దకు వచ్చినారు. సీలును పరీక్షించి తలుపును తెరచినారు. అప్పుడు అఖండ మేకాప్, పాలియా మేకాప్ నవ ప్రదీపములను చేతులతో పట్టుకొని రత్న సింహాసనము వద్దకు వచ్చినారు. అంతే, వెంటనే చేతులలో నుండి ప్రదీపములు జారిపడి ఝణ ఝణ ధ్వనులతో ఆలయ ప్రాంగణము మారు మ్రోగినది.

రత్నసింహాసనము శూన్యముగా నున్నది. దేవతలు అంతర్ధానమైనారు.

బయట నుండి తాళములు వేయబడినవి. వాటిమీది సీళ్ళు సీళ్ళు గానే ఉన్నవి. కావలివాండ్రు ఆవరణకు కాపలా కాస్తూనే ఉన్నారు. మరి తాకర్లు ఏమైనారు ?

కాలిఆ తాకరీ శూన్యదేహుడు, శూన్యపురుషుడాయె! ఆయన మనవంటి ఛాయాదేహుడు కాడే, ఆయన వెళ్ళుచుండగా ముడిలి, పఢిఆరీ వంటి కావలి

వాండ్రు చూచుటకు! ఇటువంటి వాఖ్యానములు, వాటిపైని విమర్శలు ఆలయపు శూన్య గర్భములో ప్రతిధ్వనించినవి.

"మీకు ఇది అసత్యము, కాని నాకు ఇది సత్యము. తెల్లవారు జామున విడుగు పడినప్పుడు నేను వరాహ ఆలయపు వసారాలో కూర్చుని ఉన్నాను. లక్ష చంద్రవత్తులు ఒక్కసారి వెలిగినట్లు ఆలయ ఆవరణంతా తళతళ మెరిసి పోయినది. గరుడునివంటి పెద్ద పక్షి రెక్కలు చాచి ఎగిరిపోయినది. తర్వాత నాల్గువైపులను అంధకారము వ్యాపించినది. ఆ సమయములో నా ఒడలు అరటి ఆకువలె కంపించిపోయినది నేను ఈ విషయమును ముదలికి చెప్పినపుడు నాకు ఇంకా భంగుమత్తు వదల లేదని ఎగతాళి చేసినాడు." అని జగు పధిఆరీ భయ పడుతూ చెప్పినాడు.

"నే నెప్పుడు అలా అన్నాను? వెళ్ళిపోతూ ఉండగా గరుడుణ్ణి నా కళ్ళతో నేను చూసినాను. అతని రెక్కల తాకిడికి కల్ప వటవృక్షపు కొమ్మలు విరిగి పడినవి" అని ముదలి చెప్పినాడు.

"జగన్నాథుడు ఎలా వెళ్ళిపోయినాడు? ఎక్కడకు వెళ్ళిపోయినాడు? దీనికి సమాధానము ఎవరు చెపుతారు?" అని రాజా ఆమీన్‌చంద్ క్రుద్ధకంఠ ముతో ప్రశ్నించినాడు.

బడ్‌పరీఛా గౌరీరాజగురు శూన్య రత్నసింహాసనమును చూసి ఆలోచిస్తూ నిలుచున్నాడు. గతములో అనేక సారుు జగన్నాథుడు రత్నసింహాసనమును వదిలి వెళ్ళినాడు. కాని ఈ విధముగా అంతర్ధానము కావడము ఆయన ఎన్నడూ కనలేదు, వినలేదు. అయినా ఆయన తన మనోభావములను వెల్లడి చేయలేదు.

జగన్నాథుడు ఒక లాభప్రదుడైన మహాత్ముడుగా తనకు చిక్కినట్లే చిక్కి ఈ విధముగ తన చేతిలోనుండి జారిపోతాడని ఆమీన్‌చంద్ ఊహించ నైనా ఊహించలేదు. ఆయన సేవకులపైన చేతకాని కోపమును ప్రదర్శిస్తూ కేకలువేయ నారంభించినాడు.

బలిఆ పండా అమీన్‌చంద్ కంఠమునకు మించిన కంఠముతో "శూన్యము మహాశూన్యములో కలిసిపోయినది. విందము బ్రహ్మాండమయినది. పదహారు కళలు పదహారు కళలలో కలిసిపోయినవి. మీరు ఏమీ అర్థము కాక ఊరకనే అ విధముగ ఎందుకు అరుస్తారు? జగన్నాథుడు ఎక్కడికి వెళ్ళినాడో మునులు, యోగులు, మహర్షులు గూడ తెలిసికొనలేరు. అటువంటిది మనము ఎట్లు తెలిసికొనగలము? మీరు బలియార్ వద్దకు వెళ్ళి అతని విషయము అతనినే అడగండి, అతడే చెప్పగలడు" అని అరచినాడు.

——

పన్నెండవ అధ్యాయము

ఎడతెరపి లేకుండ నాలుగు పగళ్ళు, నాలుగు రాత్రులు కురిసిన వర్షము, జడులు తరువాత ఆకాశము నిర్మలమైనది. సూర్యకాంతి మందముగ నున్నది.

వర్షములు ప్రారంభమగుటకు ఒక రోజు ముందునుండి సర్దేయాకి జ్వరము వస్తున్నది. ఆ జ్వరములో ఆ నాలుగు వర్షపు దినములు గడచి పోయినవి. నిన్నటినుండి ఆమెకు జ్వరము తగ్గినది. కాని సాయంత్రపు వేళయందు జ్వరము అధికమగుచున్నది. ఆమె ప్రక్కమీదనే అచేతనురాలై పడి ఉన్నది.

సర్దేయాకి జ్ఞాపక మున్నది. చైత్ర మాసపు ప్రాతఃకాలమువలె పొగ మంచువలన ఏర్పడిన చీకటి నాలుగు వైపులా వ్యాపించినది. అందులోనుండి చనిపోయినవారి, పోగొట్టుకున్నవారి పరిచిత ముఖములు పొటమరించినవి. కొందరు ఆమెను పలుకరించినారు. మరికొందరు ఆమెనుచూసి మందహాసము చేసినారు. బాలూ గ్రామములోని ఆ వటవృక్షముక్రింద ఆ సైనికుని రాక్షస స్వరూపము ఆమె జ్వరపీడిత విభ్రాంత మనస్సులో మాటిమాటికి కదలాడ జొచ్చినది సర్దేయా అప్పుడు బాధతో అరుస్తూ తన అవిన్యస్త కేశములను గుప్పిట పట్టి పీకుకొని స్మృతి తప్పుతున్నది.

చాలా కాలము తరువాత వెలుగుతున్న కాగడాలను సర్దేయా చూసినది. కోలాహలము కూడవిన్నది, సత్రము లోపల అకస్మాత్తుగ లక్షలాదిచంద్రవత్తులు వెలిగినట్లు ఆమెకు అని పించినది. అన్ని వైపులను చందనము, కస్తూరి, అసంఖ్యాకములైన వివిధ పుష్పముల సుగంధముతో సత్రము నిండిపోయినది. ఎవరిదో శీతల కోమల కరస్పర్శ ఆమె జ్వరోత్తప్త లలాటమును స్నిగ్ధము చేసినట్లు ఆనిపించినది. అది రాత్రి ఎన్నో జామో ఆమెకు తెలియదు.

సర్దేయా కండ్లు విప్పి నలువైపులను చూసినది. తలుపు సగము తెరచు కొని ఉన్నది. ఆ సందులోనుండి వీస్తున్న శీతల శాంతవాయువు కోమల శీతల కరస్పర్శ వలె ఆమె లలాటమును తాకుతున్నది.

సముద్ర తరంగముల గర్జన, చిలికా సరస్సులోని అలల కలనాదము, జలసారసాది పక్షుల ప్రభాత కాకలులు కలిసి జడివానవలన విధ్వంసమైన తండా కినార్‌ను ఒక నవజీవన మహా సంగీతముతో ఉచ్ఛ్వసితము చేసినట్లున్నది.

గతరాత్రి పరిమళము ఉదయపు మంద మారుతములో శేషించి యున్నది. ఆ పరిమళము తన అశక్త శరీరమును, క్లాంతమనస్సును గ్రహము నుండి గ్రహాంతరములోనికి ఎగురవేసి తీసికొనిపోతున్నట్లుగా ఆమెకు తోచినది. ప్రాణ సంజీవని వలె అది తన రోమరోమమును జీవింపచేస్తున్నది.

సర్దేయాకి దాహము వేసినది. కలశములో నీరున్నదో లేదో తెలియదు. వేదనాభరితమైన దృష్టితో సర్దేయా నీళ్ల కొరకు అటునిటు చూసినది. రాతి చిప్పలో నీళ్ళు కనిపించినవి. దానిలోనికి నీళ్ళు ఎలా వచ్చినవి? అందులో ఆమె నీళ్ళు నింపనేలేదు. అసలు ఆ రాతి చిప్ప సత్రములోనిదే కాదు. వణకు తున్న చేతులతో ఆ రాతి చిప్పను ఎత్తి పట్టుకొని పూర్తిగా దాహము తీరు లాగన గొంతువరకు నీళ్లు త్రాగి ఆమె సొమ్మసిల్లి పడుకొన్నది.

గతరాత్రి సంఘటనలన్నీ ఒక్కొక్కటిగ ఆమె స్మృతి పథము లోనికి రాజొచ్చినవి.

చాల రోజులుగ జ్వరముతో బాధపడుచుండిన సర్దేయా కొద్దిగ స్వస్థత కలిగినందున సత్రములోనుండి బయటకు వచ్చి కూర్చున్నది. భయంకరమైన రాత్రి గడచిన విమ్మట ఉదయమనే ఎదుట వ్యాపించియున్న వరదను వేదనా భరితమైన విషాద నేత్రములతో చూస్తూ, గోడకు ఆనుకొని సర్దేయా కూర్చున్నది.

పశ్చిమాకాశమున బాలేరీ పర్వతము పైన మేఘ మాలల మధ్యనుండి అపరాహ్ణపు వెలుగు మసక మసకగా తొంగిచూస్తున్నది. చిలికా సరస్సులోని

ధూసర జలములు ఆ వెలుగులో భయానకముగ కన్పిస్తున్నవి. దయా, భార్గవీ, పాలిఆ మొదలగు నదులు తమ వరద నీటిని చిలికా సరస్సులో కలిపివేసినవి. సాత్‌పడా, బలభద్రపుర్, మాణిక్‌పాటనా మొదలగు ద్వీపములలోని ఇండ్లు వరద నీటివలన ఒకదానినుండి ఒకటి విడిపోయి వందలాది ద్వీపములఆ భ్రాంతిని కలిగిస్తున్నవి. తండాకినార్‌కు పరిసరములందున్న జహింకుదా, రసకుదా మొదలగు గ్రామములు నీటి మయమైనవి. ఆ గ్రామముల ప్రజలు ఆత్మరక్షణకొరకు లోగడ వలెనే ఆంధారీ పరగణాకు వెళ్ళిపోయినారు. తండాకినార్ కూడ చాల వరకు నీటి మయమైనది. వర్షాగమనమును సూచిస్తూ పశ్చిమ శీతల వాయువు వీస్తున్నపుడు చిలికాసరస్సులోని ఉత్తుంగ తరంగముల వలన వట్టివేరు మొక్కలు మునిగిపోతున్న మనిషి రక్షణకొరకు చేతులు ఆడిస్తున్నట్టుగా తమ తలలను ఆడిస్తున్నవి. తండాకినార్ ఒడ్డున ఉన్న సరివి, పున్నాగ, మామిడి మొదలైన వృక్షముల శాఖలు గాలి తీవ్రతకు చిలికా సరస్సు మీదికి వంగి వచ్చినట్లుగా ఉన్నవి. జాలరుల, నోలిఆల చిన్న తెప్పలు చచ్చిన మొసళ్ళవలె అనేకముగ ఒడ్డున పడి ఉన్నవి. చిలికా సాగర తరంగములు ఒకదాని వెనుక ఒకటి వచ్చి తెప్పలను ఢీకొని తమ నురుగును, చెత్తాచెదారమును ఒడ్డున వదలి మరలి పోతున్నవి.

సముద్రనకు చేరువలోనే ఒక చిన్న నావ తలక్రిందులై పడిఉన్నది. ఏరా పక్షి ఒకటి ఎక్కడి నుండో వచ్చి దానిపై వ్రాలి రెక్కలను విదల్చినది. ఒక ఉత్తుంగ తరంగ తాకిడికి నావ జరిగినంతనే అది ఎగిరిపోయినది.

ఆ ఒంటరి వాతావరణములో ఎక్కడినుండో ఎగిరి వచ్చిన ఆ పక్షి తప్ప అన్యప్రాణి జాడ కానవచ్చుటలేదు. మేఘమ్లానమైన ఆకాశములోను, వరదవలన పొంగిన ఆ చిలికా సరస్సులోను అంతా పరి సమాప్తమైనట్లున్నది.

సృష్టి స్థితులు ఇక్కడనే లయమైనట్లుగా ఉన్నది. దేశపు సర్వ నాశనము ఇక్కడనే ప్రారంభమయేలాగున్నది. ఆ ఏరా పక్షి ఎగిరి పోయినంతనే ఆ అగాధ శూన్యతలో సర్దేయా హృదయము ఆర్తితో నిండి పోయినది.

"ఒరే జగునీ!..." అని పిలుచుటకు సర్దేయీ కంఠము కంపిస్తున్నది. జ్వర నీరసమువలన అమెలో శక్తిలేదు. అమె కంఠము నుండి వెలువడక పూర్వమే ఆ పిలుపు నీరవ మయిపోయినదని ఆమెకు తెలియనే తెలియదు. నాలుకకు రుచి తెలియడము లేదు. దాహము తీరుట లేదు. పెదవులు ఎండి పోతున్నవి.

అసహాయురాలి వలె చేతితో లలాటమును నిమురుకొని, సర్దేయీ చిక్కి వడిన ముంగురుల సవరించుకొన్నది జ్వరము మరల అధికమయ్యే టట్టున్నది. శరీరములో బాధ అధికమవుతున్నది. నొసలు కాలిపోతున్నవి.

శీతల వాయువు సర్దేయీ పైటను ఎగురగొట్టినది. వక్షస్థలము బయల్పడి నది. ఆమె ఆదరిపడి పయ్యెదను సరిచేసికొని, అక్కడనే గోడ నానుకొని కూర్చున్నది

మూడు నాళ్ళుగ జగుని జాడ తెలియలేదు. ఈ యేడు సత్రములోని కార్య కలాపములన్నీ బంద్ అయినవి. వానికి ఏమైనదో తెలియదములేదు. వాడేమి చేస్తున్నాడో వాడికే తెలియాలి. రోజూ తెల్లవారు జామున చుక్క పొడవగానే నావను తీసికొని వెళ్ళినవాడు రాత్రి రెండు ఘడియలు గడిచిన తర్వాత గాని తిరిగిరాడు. ఒక్కొక్కనాడు అసలు రానే రాడు. అడిగినను చెప్పడు. బాలూ గ్రామములోని జగుని కాడు పీడ. అప్పటికిని ఇప్పటికిని వానిలో ఎంతో భేద మున్నది. సర్దేయీ కలలోనైన ఊహించనంత మార్పు వానిలో కనిపిస్తున్నది. మొదట్లో జగుని ఉదాసీనత యెడల సర్దేయీ అప్రసన్నురాలయి కోపగించుకొను చుండేది. కాని రానురాను ఆమెకు అతని యెడల ఎందువల్లనో ఈర్ష్య, అసహ్యము ప్రారంభ మయినవి. కాని యిపుడామెలో అవి ఏవీలేవు. కేవలము విస్పృహతో కూడిన ఉదాసీనత మాత్రమున్నది. అయినప్పటికీ ఈ నిర్జన సత్రమును పోలిన తన శూన్య జీవితమునకు ఏకైక ఆలంబనమైన జగుని తనకు అకస్మాత్తుగ దూరము అయినందు వలన తన ఆత్మవిశ్వాసమును, సంతోషమును, కర్మ ప్రవణతను పోగొట్టుకొన్నట్టు సర్దేయీ భావించినది.

సత్రమునకు యాత్రికులు వచ్చినట్లయితే ఇబ్బంది కలుగుతుంది. నిళ్ళయితే సర్దేయా తెచ్చి ఇవ్వగలదు, అన్నము కూడ వండిపెట్టగలదు. కాని ఆహార పదార్థములను సాత్‌పడా అంగడి నుండి ఎవరు తేగలరు? కట్టెలను ఎవరు కొట్టి ఇవ్వగలరు? ఇతర చిల్లర పనులను ఎవరు చేయగలరు? ఇదంతయు జగుని పని. కాని, పిచ్చివానివలె జగుని యిక్కడకు అక్కడకు తిరగడము ప్రారంభించి నప్పటినుండి సత్రము మూతపడినట్లే అయినది. ఈయేడు ఈ రస కుదాలో మరి రెండు క్రొత్త సత్రములు నెలకొన్నవి. జగుని ఉద్దేశ్యా మేమిటో జగునికే తెలియాలి. తండా కినార్‌కు వచ్చే యాత్రికులను గూడ ఆతడు వేరు సత్రములకు తీసికొనిపోతున్నాడు

ఆనాడు తెల్లవారక ముందే వేపుడు నెనగలను బుట్టనిండా నింపుకొని, భుజమున చుక్కాని పెట్టుకొని జగుని బయలుదేరుతుండగా "అరే జగునీ! నాకేమో జ్వరముగా ఉన్నది, చాలమంది యాత్రికులు వచ్చి వెళ్ళిపోతున్నారు, ఇప్పుడు బాహుడా యాత్రికుల రద్దీ ఎక్కువగా ఉన్నది, ఇవాళ నీవు ఏక్కడకు వెళ్ళవద్దు" అని జ్వరము వలన వణికిపోతూ సర్దేయా అన్నది.

"ఇప్పుడే ఒక ఘడియలో వస్తాను" అని చెప్పి వెళ్ళిన జగుని మూడు రోజులయినను తిరిగి రాలేదు. వాడు వెళ్ళిననాటి సాయంత్రమునుండి వర్షము కురియ నారంభించినది. ఆ మరునాడు కుండపోతగా వర్షము పడినది ఆ తరు వాత విడవకుండా నర్షము పడినది. మరి వర్షము ఆగదేమో ననిపించినది.

వర్షము ప్రారంభమయిన మరునాడు సర్దేయాకి నిర్జలోపవాస మయినది. జ్వరముతోనే అమె ఏకాదశి స్నానము చేసినది. దాని వలన జ్వరము అధిక మయినది. జ్వరమువలన ఆమె బాగుగా నీరసించినది. బయట విడవకుండగ వర్షము పడుతున్నది. తుఫాను జోరుగా ఉన్నది. ఆ వర్షములోనే కొంతమంది యాత్రికులు వచ్చి రాత్రి అంతా సత్రములో బస చేసినారు.

శ్రీ క్షేత్రమును వదలి జగన్నాథుడు ఎక్కడికో అంతర్ధాన మయినాడనీ, పెద్ద కాకుర్ తాలధ్వజ రథమువైన గరుడునివంటి ఒక పెద్ద గ్రద్ద వచ్చి

వాలినదనీ, దాని రెక్కలు చేటలంత పెద్దవిగా ఉండినవనీ, ముక్కు మూర కంటె ఎక్కువ నిడుపుగా ఉండినదనీ...ఇంకా ఇటువంటి అనేక విషయములను యాత్రికులు చెప్పుకొనగా సర్దేయీ విన్నది. ప్రక్క గదిలో బసచేసిన యాత్రికులు తమలోతాము ప్రసంగించుకొంటున్నారు. ఈ వర్షము ఇంక ఆగదనీ, ఈ చీకటి ఇంక వీడదనీ, సముద్రము చిలికా సరస్సు ఏకమవుతవనీ, భూమి దానిలో లీనమయి పోతుందనీ వారు చెప్పుకొంటున్నారు. జగన్నాథుడు యింతవరకు భూమిమీద ఉండినాడు గనుకనే భూమి నిలిచి ఉండినదనీ, ఇప్పుడు జగన్నాథుడు భూమిని వీడిపోయినాడు గనుగ ఇంక కలియుగము అంతము కాగలదనీ, అలా కాకపోయినట్లయితే వర్షము ఎందుకు ఆగడములేదనీ వారు ప్రసంగించుకొన్నారు.

జ్వరముతో పలవరిస్తుండిన సర్దేయీకి మధ్య మధ్య స్పృహ తప్పిపో తుండెను. ఉదయమే యాత్రికులు అందరు వెళ్ళిపోయినారు. తెల్లవారు సరికి వర్షము కొంచెము తగ్గినది. అందువల్లనే ఏలాగో యాత్రికులు బయలుదేరి వెళ్ళి నారు.

కలియుగాంతమునకు ముందు తమ తమ బంధు మిత్రుల ముఖములను ఒకసారి చూడవలెనని వారందరు ఆతృత పడినారు. కాని సర్దేయీకి మాత్రము గుండెను చీలుస్తున్న ఆ ఒకే ఒక వాక్యము పదే పదే జ్ఞాపకము వస్తున్నది- "జగన్నాథుడు శ్రీక్షేత్రమును వదలి ఎక్కడికో అంతర్ధానమయినాడు." శ్రీవత్స ఖండకాలలోని రత్నసింహాసనమును వీడి జగన్నాథుడు ఎక్కడ దాగుండినాడో తెలియదు.

అయ్యో! ఎటువంటి దురదృష్టవంతురాలు, ఎంత పాపిష్టిది తను! చివరకు జగన్నాథుని అదృశ్యుడైనాడు. కాని వాని అభయప్రదమైన శ్యామ శ్రీ ముఖమును దర్శించే భాగ్యమునకు తాను నోచుకోలేదు. ఈ సత్రములో తాను ఉంటూ ఉండగా ఏంతోమంది యాత్రికులు వచ్చినారు, వెళ్ళినారు. తాను వారందరకు సేవ చేసినది. అందరు ఇక్కడ నుండే పూరీ వెళ్ళినారు. కాని

తాను మాత్రము పూరీ వెళ్ళలేకపోయినది. జగన్నాథుడు మాత్రము పతితపావనుడు అయితాడు. ఎంతమంది పాపులకో, పతితులకో ఆయన దర్శనమిచ్చినాడు. ఎంతోమంది ఆయన శ్రీఅంగ స్పర్శ చేసి మోక్షమును పొందినారు. కాని తనకు ఆ భాగ్యము ఎక్కడిది? రథముమీద చతాడోలాను చూస్తూ నిల్చున్న తనను యాత్రిక సమూహములో ఎవరు గుర్తించగలరు? తానే బాలూగ్రామ సర్దేయా అనీ, కులనాశిని అనీ, మొగల్ సైనికుడు తన ధర్మాన్నే కొల్లగొనినాడనీ ఎవరికి తెలుసు ?

మొగల్ సైనికుడు ఆమె తలపునకు రాగానే వాని పాప బీభత్స విగ్రహము ఆమె మనోకాశముపైన కారు మేఘమువలె వ్యాపించినది.

సర్దేయా ఆర్తనాదము చేస్తున్నట్టుగ "జగునీ, జగునీ !" అని హీనస్వరముతో పిలువసాగినది.

తీవ్రమైన గాలి వచ్చి ఆ పిలుపును మోసికొనిపోయినది. చిలికా సాగర కోలాహలములో ఆ పిలుపు ఎక్కడో లీనమైపోయినది.

మరల జ్వరము తీవ్రము కాజొచ్చినది. ఆమె తన లలాటమును, వక్షస్థలమును నిమురుకొన్నది. ఒడలు కాలిపోతున్నది. దూరముగ క్షితిజము వద్ద మేఘములు యుద్ధ నావలవలె కనుపిస్తున్నవి. ధూమ్ర వర్ణపు మేఘములు క్రమక్రమముగా నల్లబడసాగినవి. గగన వీధిలో ఎగురుతున్న తెల్లకొంగల పంక్తి మల్లెపూల మాలవలె కనుపిస్తున్నది.

సర్దేయా యింక కూర్చుండ లేకపోయినది. తడబడుతున్న కాళ్ళతో నెమ్మదిగ అడుగులు వేసికొంటూవచ్చి ప్రక్కమీద పడి స్పృహ కోల్పోయినది. తిరిగి అనేక మృతుల ముఖములు ఆమె మనోనేత్రములకు గోచరించ సాగినవి.

స్వప్నములో చూచిన ఆ ముఖాకృతులు ఇప్పటికీ ఆమెకు జ్ఞప్తియందున్నవి... ఆ ముఖములే యిపుడు ఆమె కంఠముందు కదలాడ సాగినవి.

అంధురాలు, బధిరురాలు అయిన తన అత్తగారి రూపము ; శరీరము ఎండిపోయినది. చర్మము శ్లేష్మాడుచున్నది. తెల్లని రూక్షకేశములను ముడివేసి

కొన్నది. వెదురు కర్రను ఊతగా గొని ఆమె నడుస్తున్నది. ఆ అంధకారములో "ఏమే కోడలా!... ఓ సరూ!..." అన్న విలపు వినవచ్చినది. బహుశా తన అత్తగారు తన కొరకు వెదకుచున్నారేమో! వెనుకటివలె ఆమె తిట్ల వర్షమును కురిపించుటలేదు. తనవద్దనే నిల్చుని స్నేహపూర్వకముగ "ఎంత సంతోషముతో నిన్ను కోడలుగ తెచ్చుకొన్నానే! ఒకసారి మా వియ్యంకుడుగారు 'ఈ సరూ మీ కోడలు కాదు, మీ కుమార్తె' అని అన్నారు అందువలన మన బాంధవ్యము ఆలాగే ఉండాలి. ఈ ప్రపంచములో నీకు ఎన్ని విపత్తులు, దుర్ఘటలు సంభవించ లేదు!...బిడ్డా!...బంగారమువంటి నీ శరీరము కాలి బొగ్గు అయినది... అందువలన నిన్ను తీసికొనిపోవలెనని వచ్చినాను...రా అమ్మా! రా! నావెంట రా!...నాతోగూడ నిన్ను తీసికొని వెళతాను," అని ఆ అత్తగారు అన్నది.

ఉదయ కాలపు మంచుపొగవలె ఆమె రూపము ఎక్కడనో విలీనమయి నది. ఆ తరువాత తన భర్త రూపము వచ్చి ముందు నిల్చున్నది. అదే ముఖము! నల్ల చలువరాతితో తయారైనట్లుగా ఉన్న సుందర సుదృఢ ముఖాకృతి! వెనక ఆమె తన భర్తను సరిగ చూడనైనా లేదు, ఇంతలో అతడు అదృశ్యుడైనాడు. శోభనము నాటి రాత్రి తాను చూచిన ఏ కండ్లలో ప్రేమ తొణికిసలాడినదో, ఆదరము, మమతా తొంగి చూసినవో ఆ కండ్లను ఇప్పుడు సర్దేయీ చూడడము లేదు. ఇప్పుడు కనబడుచున్న అతని కండ్లలో అగ్ని వర్షిస్తున్నది. ఆమెను అతడు నెట్టి వేస్తూ, "పో! దూరముగ తొలగిపో! ఇక్కడ నీకు స్థానములేదు. నీవు జాతిని పోగొట్టుకొన్నావు. నీవు సత్రము మనిషిని. దారిన పోయేవారికి నీవు శరీరమును అమ్ముకొన్నావు. లేకపోయి నట్లయితే నీలమణి జడితమైన ఉంగరమును "నీవు ధరించగలవా?" అని అంటున్నాడు.

మసక చీకటిలో సరూ ఆ ఉంగరము కొరకు వెదకసాగినది. అప్పుడు ఆమెకు జ్ఞప్తికి వచ్చినది, తాను అసలు ఆ ఉంగరమును ధరించనైనా లేదనీ, అది పెట్టెలోనే ఉన్నదనీ.

సర్దేయీ తిరిగి స్మృతిని కోల్పోయినది. చేతనారాహిత్యపు అగాధ సాగరములో ఆమె ఒక నీటి బుడగవలె ఎక్కడనో విలీనమైనది. మరల చాల నేపైన తర్వాత ఆమెకు స్పృహ ఎప్పుడు వచ్చినదో తెలియదు.

కాని అదంతా స్వప్నమో లేక యథార్థమో ఆమెకు తెలియడము లేదు.

బయట తుఫాను చాల తీవ్రముగా నున్నది. అది ఆగే సూచనలు కానరావడము లేదు. ఆకస్మాత్తుగ అంధకార మయమైన గగనములో లక్ష చంద్ర వత్తులు వెలిగినట్లయినది. అనేకమంది మాట్లాడుకొంటున్నట్లుగా ఆమెకు అనిపించినది. ఎవరు ఏమి అంటున్నది ఆమెకు స్పష్టముగ వినిపించలేదు. ఆమె ఏమీ తెలిసికొనలేక పోయినది. తండా కినార్‌లో అనేకమంది నావికుల బసలు ఉన్నవి. రాత్రులందు నావలను కొల్లగొట్టిన బందిపోటు దొంగలు ఆమె సత్రము వద్దకు అప్పుడప్పుడు వచ్చి మాట్లాడుకొనడము కద్దు. అటువంటివారే ఇప్పుడు వచ్చి మాట్లాడుకొంటున్నారని తలచి ఆమె భయముతో చెవులను మూసికొని కొయ్యబొమ్మవలె పడియుండినది.

కాని ఇది అంతా యథార్థమా!

ఇంతలో ఆమెకు జగుని కంఠస్వరముగూడ వినవచ్చినది. ఆ బందిపోటు దొంగల నాయకునివలె జగుని మాట్లాడుతున్నాడు. "అరే సంబాళించుకో... అదిగో ఎదురుగా సత్రమున్నది...అరే ఇక్కడ కాదు; అక్కడ!...వద్దు... ఆ గది వద్దు...లోపలనుండి బంధించబడలేదు," అని జగుని సూచనలను ఇస్తున్నాడు.

మనుష్యులు చాలమంది ఉన్నారు. ఏదో బరువైన దానినే ఎత్తి తీసికొని వచ్చినట్లున్నారు. వారు తీసికొని వచ్చిన కాగడాలవలన నలువైపులా కాంతి ప్రసరిస్తున్నది.

కాదు, ఇది స్వప్నముకాదు, కాజాలదు. కళ్ళతో చూచినట్లుగ, చెవులతో విన్నట్లుగ అంతా జ్ఞప్తికి వస్తున్నది.

ఆ సమయమందు నలుదిశల అపూర్వ సువాసన అలుముకొన్నది. ప్రభాత సమీరమందుగూడ ఆ సుగంధ ఛాయలు నిలిచి ఉన్నవి.

ఆమె పిచ్చిదై పోతున్నదా? స్వప్నము-సత్యముల మధ్య ఆమె విడదీయ జాలనిది ఏదైనా ఉన్నదా?

"ఇక్కడ ఉంచినట్లయితే అంతా బట్టబయలు అవుతుంది. తెల్లవారక ముందే చిలికా సరస్సులోనికి తీసుకొని పోవాలి." అని వారిలో ఒక రుఅంటున్నారు.

ఆ కంఠస్వరము పరిచితమైన దానివలె సర్దేయాకి తోచినది.

సుదూరమైన గతము జ్ఞప్తియందు లేకపోవడము వలన ఆ కంఠధ్వని ఆమె హృదయాంతరాళములో ప్రతిధ్వనిస్తున్నట్లుగా ఉన్నది. "ఆ కంఠధ్వనిని తాను ఎన్నడు, ఎచట విన్నది?"...సర్దేయా సుదీర్ఘముగ ఆలోచించసాగినది. జ్ఞప్తికి తెచ్చుకొనుటకు ప్రయత్నించసాగినది...తల తిరుగ నారంభించినది. నలుదిశలను అంధకారము వ్యాపిస్తున్నట్లు అయినది.

ఆ తర్వాత—

"ఈ వర్షములో, ఈ చీకటిలో చిలికా సరస్సులో దారి తెలిసికొనడము చాల కష్టము. కొద్ది సేపటిలో తుఫాను ఆగిపోవచ్చును. వేగుచుక్క పొడిచి నంతనే పునము బయలుదేరుదాము" అని జగుని అంటున్నట్లు వినిపించినది.

వీరు నిశ్చయముగ బందిపోటు దొంగలు; భయమువలన, ఉద్వేగమువలన ఆమె తిరిగి తెలివితప్పి పడిపోయినది. అయినప్పటికీ ఆమెకు అస్పష్టముగ అనుభూతి కలుగసాగినది...ఎవరో తన వద్దకు వచ్చినారు...తన నొసటిని సాదరముగ స్పృశించినారు... గొంతులో నీరుపోసినారు... కాని తీరని దాహము....అదికూడ కలకావచ్చును.

శీతల ప్రభాత వాయువు స్నేహపూర్వకముగ కాలుచుండిన ఆమె లలాట మును స్పృశించినది.

ఆకాశము నిర్మలమైనది.

బాల భాస్కరుని కిరణములు స్వర్ణ పుష్పములవలె చెల్లాచెదురుగ వ్యాపించి నవి.సర్దేయా పడకమీదినుండి లేచి కూర్చున్నది శరీరములోని సమస్త అలసటను, విషాద భారమును ఎవరో గతరాత్రి తీసి వేసినట్లుగ తోచినది. ఆమె లేచి నిల్చుని గోడను ఊతగా గొని, తడబడుచు బయట వసారాలోనికి నడచి వెళ్ళినది. సర్దేయా ఆశ్చర్యముతో అదరిపడినది.

అచేతనావస్థలో ఆమె గత రాత్రి నలువైపులనుండి అనుభవించిన చందన, కస్తూరీ, పుష్ప సుగంధము తన చిత్తమును పులకింపజేస్తూ అచట గాలిలో నిండి యున్నది.

ఇంత ఆనందమును, ఇంత కాంతిని, ఇంత కలకల ధ్వనిని, ఇంత సంభ్రమమును తన దుఃఖదగ్ధ నిరర్థక జీవితములో ఎన్నడూ ఆమె అనుభవించ లేదు. ఇంత కంపనము, ఇంత గగుర్పాటు ఒకే ఒకసారి ఆమె శరీరములోని ప్రత్యణువును ఆవరించినవి. అదీ ఆ శోభన సుముహూర్తపు రాత్రియందు ఆమె భర్తృ గృహమందు, చతుర్థీ ప్రదీపమును భర్త ఆర్పివేసినప్పుడు:

చతుర్థీ ప్రదీపమును ఆర్పివేయుట అపచారము.

మేలి ముసుగులో ముఖమును చాటు చేసికొని "చతుర్థీ ప్రదీపమును ఎందుకు ఆర్పివేసినారు:" అని భయముతో అస్పష్టముగ సర్దేయా అడిగినది.

కాని సిగ్గుపడన, భయమువలన ఆమె మేలి ముసుగు చాటున కంపించి పోయినది. నేడు అదే స్మృతి ఘనీభవించి సర్దేయా కండ్లలో నిండి పోయి నట్లున్నది. కాని ఇప్పుడు దానిలో ఆ వేదనాగ్ని లేదు. ఒక విచిత్ర గగుర్పాటుతో ఆమె మనశ్శరీరములు ఉల్లసితమవుతున్నవి.

నేడు ఎటువంటి సువర్ణ సుప్రభాతము!

నాలుగు పగళ్ళు, నాలుగు రాత్రులు ఎడతెరపి లేకుండ వర్షము కురిసిన తరువాత నేడు ఉదయాకాశము స్వచ్ఛముగ నున్నది. చిలికా సరస్సులోని

ఉన్మత్త ప్రమత్త తరంగములు శాంతించినవి. విలాసినుల తరంగాయిత బాహా వుల వలె చిలికా సాగరములోని అలలు ప్రశాంతముగ నాట్యా మాడుతున్నవి. అన్నివైపులా ఫేనిల తరంగముల అనంత అగాధ కోలాహలము మాత్రమే కన్పి స్తున్నది.

జలసారసములు, చక్రవాకములు, ఏరాలు, కాలీ గడిదుణీలు మొదలగు అనేక రకములైన పక్షులు తడిసిన ఇసుక పర్రలపైని గుమిగూడు చుండెడివి. తరువాత ఎక్కడికో ఎగిరిపోవు చుండెడివి. ఆనంద భండారమును కొల్లగొట్టుటకు అవి వెనుకంజ వేసెడివి కావు. ఆ పక్షులు ఇప్పుడు ఎక్క డున్నవి?

ఉదయ సూర్యుని కాంతిలో తన ఉడుపులను సర్దేయీ చూచుకొన్నది. ఆ ఆనందమయ, సౌరభమయ వాతావరణములో జ్వరమువలన చెమటకు తడిసి మలినమైన ఆమె ఉడుపులు శోభారహితముగ నున్నవి.

సర్దేయీ లోపలకు వెళ్ళి తన పెట్టె తెరచినది.

తను బాలికగా ఉన్ననాటి ఆట వస్తువులు, వివాహ సమయమందు పొందిన వస్తువులు మొదలుకొని రణ రంగమునుండి జ్ఞాపక చిహ్నముగా తిరిగి వచ్చిన తలపాగ, ఆ అపరిచిత వ్యక్తి పాల ఖరీదు క్రింద కుదువ బెట్టిన ఉంగ రము వరకు.....జీవితములో తను పొందిన, ఐశ్వర్యమును, వేదనలను కలివి ఆ పెట్టెలో దాచి పెట్టినది. సర్దేయీ ఇపుడు పెట్టెను తెరచి ఆ వస్తువుల నన్నిటిని తొలిసారి చూస్తున్నట్లుగా ఆమె చూడ సాగినది.

చిరిగిన గుడ్డల మూటను విప్పి, అందులోనుండి ఉంగరమును తీసి సర్దేయీ తన వ్రేలికి పెట్టుకొన్నది. జ్వరము వలన చిక్కిన తన చేతి వ్రేలికి ఆది వదలైనది. ఎర్రంచు, వాసంతీ రంగు చీరను ఆమె వెదకి వెదకి బయటకు తీసినది. అది తన పుట్టింటి నుండి తెచ్చుకొన్నది. అప్పటినుండి అది పెట్టె లోనే ఉన్నది. దానిని ధరించుటకు అవకాశమే చిక్కి లేదు. జగుని వధువు కొరకు దానిని ఆమె భద్రముగ దాచి ఉంచినది. కాని నేడు దానిని ధరించవలె

నని ఆమెకు మనసు అయినది. ఆ తరువాత అద్దము, దువ్వెన తీసికొని గది మధ్య కూర్చున్నది. తల దువ్వు కొనుటకు ప్రారంభించినంతనే ఆమె తల తిరిగినట్లయినది. వెంటనే అన్నిటిని పారవేసి నేలపై పరుండవలెనని ఆమె శరీరము కోరినది. కాని ఆమె మనస్సు అంగీకరించలేదు. నేటి ఈ ఆనందమయ ప్రభాత సమయములో ఆ రోగ శయ్యపైని పరుండుటకు ఆమెకు మనస్కరించలేదు.

సర్దేయీ కూర్చుని చాలసేపు తల దువ్వుకొన్నది. తల వెంట్రుకలు బాగుగ ఊడిపోతున్నందు వలన చిక్కుతో దువ్వెన నిండి పోతున్నది. ఇంతకు ముందెన్నడూ సర్దేయీ తన ముఖమును ఇంత ధ్యాన పూర్వకముగ బహుశా చూసికొని యుండదు. ప్రప్రథమముగా నేడే తన ముఖ ప్రతిబింబమును చూసికొంటునట్లు ఆమెకు అనిపించినది. అందువలన ఆమెకు తన్మయత్వము కలిగినది తన చెక్కిలిపైన పచ్చబొట్టు చుక్కను ఎప్పుడు ఎవరు పొడిపించి నారో తెలియదు. అది ఆమె మలిన ముఖముపైన మృత చంద్రునివలె కనిపిస్తున్నది. సర్దేయీ కొప్పు వెట్టుకొని, భుజముపైద చీరను వేసికొని, చంకను కుంద వెట్టుకొని తండా కినార్ నీలాటి రేవుకు బయలు దేరినది.

జల సారసములు కొన్ని గుంపులుగా సముద్రము వైపునుండి వచ్చి చిలికా సరస్సులో వ్రాలినవి. ఇంత ఉదయముననే ఈ పక్షులు ఎక్కడనుండి వచ్చినవి? బాలు గ్రామమును వదలి వచ్చిన తరువాత ఆమె వాటి కాకలీ స్వరమును వినలేదు, వాటిని చూడలేదు. ఆ పక్షులన్నియు గానము చేస్తున్నవేగాని శ్రోత ఒకడుకూడ లేడు.

సత్రము ముందు తడి యిసుకలో అనేక పాద ముద్రలు కనిపిస్తున్నవి. అవి చాల చిందర వందరగ నున్నవి. సముద్రము వైపు నుండి సత్రము వరకు అవి ఉన్నవి. తన సత్రమునుండి అవి చిలికా సరస్సు వైపుకు సాగి యున్నవి. గత రాత్రి వచ్చిన ఆ మనుష్యుల పద చిహ్నములు కావుకదా యివి? గత రాత్రి తను విన్న మాటలు గుర్తుకువచ్చి సర్దేయీ కంపించి పోయినది.

ఆహా! ఈ నిర్జన ప్రదేశమునకు ఈ పూల గుచ్ఛములు, మాలలు ఎక్కడ నుండి వచ్చినవి? నాగకేసరి పూవులు, మొగలి రేకులు నేలపైన చిందరవందరగ పడి ఉన్నవి. తెల్ల గులాబి, దవనపు మాలలు కూడ పడి ఉన్నవి. దవనపు మధుర సుగంధము నలు దిక్కులకు వ్యాపిస్తున్నది. జగన్నాథునికి ప్రియమైన ఈ దవనము ఇక్కడకు ఎలా వచ్చినది? సర్దేయికి సమాధానము లభించలేదు. ఆమె ఆ యిసుకలో కూర్చుని అమూల్యమైన ముత్యములను, మణులను ఏరుకొన్నట్టుగ ఆ పూలను ఏరుకొన సాగినది.

ఈ నిర్జన తండా కినార్‌కు గత రాత్రి ఎవరు వచ్చినారు? తమ వెనుక ఈ పూల సువాసనను, కాంతిని, కాకలిని వదలి వెళ్ళినారు! అయ్యో! అభాగ్య రాలా! నీకు ఇంత సమీపమునకు ఏ రూపమయుడు, రసమయుడు ఆశ్రయము వెదకుకొంటూ వర్షములో వచ్చినాడో గదా! నీవు చూడనైనా చూడలేక పోతివి!

సర్దేయీ తల మరల తిరుగ నారంభించినది. తలనుండి పాదముల వరకు ఝునఝున మంటున్నది. ఆమెకు జగుని గుర్తుకు వచ్చినాడు. వర్షము ప్రారంభమగుటకు ముందు వెళ్ళినాడు. కాని ఇంతవరకు వాడు మరలి రాలేదు. "జగునీ! జగునీ!.....ఒరే జగునీ!" అని సాధారణ ధోరణిలో ఆమె విలువ సాగినది.

ఆమెకు తెలియకుండగనే అశ్రువులు రాల జొచ్చినవి. అవి ఇసుకలో పడి ఇంకి పోతున్నవి.

సర్దేయీ సత్రము తలుపులను తెరచి వచ్చినది.

సర్దేయీ స్నానమాడి ఆ వాసంతీ చీరను ధరించి వచ్చినది. వసారా మెట్లు ఎక్కుతూ శక్తి విహీనురాలై నరకబడిన చెట్టువలె నేల కూలినది. తడిసిన శిరోజముల క్రింద ఆమె ముఖము వర్షార్ద్రమైన పుష్పమువలె కనుపిస్తున్నది.

చందన కస్తూరీ సుగంధ పుష్పముల పరిమళము సత్రమంతా వ్యాపించినది. క్రిందపడి యున్న ఏ పుష్ప రసాస్వాదన చేసివచ్చినదో తెలియదు, తుమ్మెద ఒకటి వచ్చి సర్దేయీ ముఖ పద్మము చుట్టు తిరుగాడ సాగినది. దానిని క్రోలు

కొనటకు కూడ సర్దేయా చేతులలో శక్తిలేదు. వక్షోజముల పైనుండి తొలగి పోయిన పైటను సరిచేసికొనుటకు కూడ ఆమె అశక్తురాలయి పోయినది.

ఆమె ఎప్పుడో గోడమీద పసుపు, బియ్యపు పిండి, బొగ్గు పొడితో చిత్రించిన జగన్నాథుని చిత్రము ఆమె కండ్లముందు ఉజ్జ్వలముగ ప్రకాశించ సాగినది. అచేతనముగ జ్వరముతో పడి ఉన్నప్పుడు విన్న మాటలు ఆమెకు జ్ఞప్తికి వచ్చినవి. ".....జగన్నాథుడు అంతర్ధాను డైనాడు! శూన్యమయుడు శూన్యు డైనాడు!"

"అదంతా ఆసత్యము! అన్నీ యాత్రికుల కపోల కల్పితములు." జగన్నాథుడు శూన్యుడు కాలేదు. మహాశూన్యయోగ మిథున లగ్నమందు ఆయన మహాపూర్ణు డైనాడు జగన్నాథుని రెండు 'చకాడోల'లోను ఆ మహాశూన్యత లేదు. నవ ప్రేమిక దృష్టివలె ఆ రెండు నేత్రములు మధురముగ కన్పిస్తున్నవి. ఆనావృతమైన ఆమె స్తనములపైన, కుటిలాలకలచే ఆచ్ఛన్నమైన ముఖ మండలమువైన ఆ స్వామి పద్మ నేత్రములు స్థిరముగ నిల్చి యున్నవి. అభిమానముతో ఆమె అధరములు కంపిస్తున్నవి. .....ఓ కఠోరుడా! ఓ మమతా రహితుడా! ఎలా చకితులను చేసి వస్తున్నావు! ఎలా వెళ్ళిపోతున్నావు! నిత్యమైన, అనంతమైన, ఊహాతీతమైన జన్మ జన్మముల అశ్రువులను మాత్రము మాలో ఉంచి వెళ్లుతున్నావు!

సర్దేయాలోని చైతన్యము మెల్ల మెల్లగ లుప్తము కాజొచ్చినది. పొగ మంచు ఆమెను చుట్టుముట్టి నలు వైపులా వ్యాపించ సాగినది. నిబిడమైన ఎవరి ఆలింగనము వలననో ఆమె శరీరములో ప్రత్యణువు మథిత మగుచున్నట్లుగా ఉన్నది.....క్రమముగ శ్వాస రుద్ధము కాజొచ్చినది.....అదే మృత్యువు!

సర్దేయా మరి చూడలేక పోయినది. ఆమె నేత్రములు నిమీలితములు కాజొచ్చినవి. సహింపరాని వేదన వలన ఆ నేత్రములనుండి జలజల రాలిన రెండు అశ్రు బిందువులు మంచు కణములవలె మెల్లగ కరగి ప్రవహించినవి.

2

ప్రహరీ గోడవలె నర్కుల్ గడ్డి, సర్కండా వనము కలిగిన గురువాయీ ద్వీపము.....బాణ్‌పుర్ చివరి రాజు హరిసేవక్ మూనసింహ్ పదునెనిమిదవ శతాబ్ది శేష భాగములో ఖోర్ధా రాజు చేత నీలాద్రి ప్రసాద్‌గఢ్‌నుండి వితాడితుడై ఇక్కడకు చేరి తన క్రొత్త రాజధానిని నెలకొల్పినాడు. అంతవరకు ఈ ద్వీపము జన శూన్యముగా ఉండేది.

అనేక గుల్మ, తరు, తృణ సమూహములతో పరివేష్టితమైన ఈ ద్వీపము ఒక దుర్గమారణ్యమువలె ఉండేది. మూణిక్ పాటనా ముఖ ద్వారము మీదుగా పాలూర్, గంజా రేవులకు వెళ్ళే ఓడలను కొల్లగొట్టు బందిపోటు దొంగలకు ఇది ఆశ్రయముగా ఉండేది. చిలికా సరస్సులోని ఏరా పక్షులకు ఇది చిర పరిచయము గల ప్రదేశము.

ఈ గురువాయి ద్వీపమే నేడు తకీఖాన్ ఉపద్రవము వలన జగన్నాథునికి ఆశ్రయ స్థలమయినది.

ఆడవి చెట్ల తలలమీద నుండి క్రమక్రమముగ బాల భాస్కరుడు తన ఎఱని కోమల కిరణములను ప్రసరింప జేస్తున్నాడు. అయినప్పటికీ గత రాత్రి కురిసిన వాన, అంధకారము ఇంకనూ అరణ్య మధ్యములో ఘనీ భూతమయి ఉన్నది. ప్రభాత సూర్యుని అభినందించుటకు పక్షులు కిలకిల ధ్వనులతో ఎగురు తున్నవి. వాటి రెక్కలకు విరామము లేదు, ఆలసట లేదు.

సాత్‌పడా బలభద్రపుర్ నుండి ఎవరికిని తెలియని జలమార్గము ఒకటి ఆ గహనారణ్యమును ఛేదించుకొంటూ సాగి వచ్చినది. ఆ జల మార్గమునకు యిరు తటములందు సర్కండా, వేము, చెరకు యొక్క ఎత్తైన దుబ్బులు చుట్టుముట్టి ఉన్నవి. అందు వలన ఆ మార్గము యితరులకు కనబడదము అసాధ్యము. ఆ జల మార్గము గుండా నావమీద ఆరణ్యమును దాటి మరికొంత దూరము ముందుకు వెళ్ళిన యెడల అక్కడొక ఇసుక ద్వీపము కనబడుతుంది. అక్కడొక సువిశాల

మైన వట వృక్షము అనంత కాలమునుండి జటలను సారించి శాఖోపశాఖలుగా వెరిగి ఒక గహనమైన ఛాయారణ్యమును సృష్టించుకొని ఉన్నది. ఆ మర్రిచెట్టు కింద ఒక శిలా వేదిక ఉన్నది. తకీఖాన్ శని దృష్టి జగన్నాథునిపైన ప్రసరింప నున్నదని సూచన ప్రాయముగ గ్రహించినంతనే రామచంద్రదేవ్ అనేక అన్వేషణలు జరిపి జగన్నాథునికి దీనిని అనువైన ఆశ్రయ స్థలముగ నిర్ణయించినారు. కొంతమంది విశ్వాస పాత్రులైన జగన్నాథ సేవకులు మరియు ఖండాయతులకు, జగునికి తప్ప అన్యులకు దీని ఉనికి తెలియదు.

ప్రాతఃకాల మగుసరికి జగన్నాథుడు ఆ వేదికపైన విరాజమానుడయినాడు. రామచంద్రదేవ్, సాన్‌పరీఛా విష్ణుమహాపాత్ర, రాజగురువైన లక్ష్మీ వరమగురు, దయితాలు తప్ప ఇతరు లందరూ తిరిగి వెళ్ళినారు. ఆప్పటి కింకను వేదికకుడిగువన అఖండ ప్రదీపమును వెలిగించ లేదు. గత రాత్రి నుండి మండుతున్న కట్టె చెట్టుకు కట్టబడినది. పగటి వెలుగులో అది కాంతి హీనముగ నున్నది.

ఆ గహనారణ్య నిశ్శబ్దములో ఎక్కడినుండో ఒక కళింగ పక్షి స్వరము పలికినది. వటవృక్షము పైనుండి ఒక కాకి దానికి సమాధానముగ కూసినది.

తను నుదుటిపైన చిందర వందరగ పడియున్న కేశములను చేతులతో వెనకకు నెట్టి రామచంద్రదేవ్ చుట్టూ చూసినారు.....అటువంటి నిర్జనత్వము, నిస్సంగత్వము, శూన్యత్వము ఆయన అంతకు పూర్వము అనుభవించి యుండ లేదు.

స్నానము, వస్త్రధారణ, మంగళ హారతి ముగిసి ఈ పాటికి ప్రభువుకు ప్రభాత పూజ జరుగుతూ ఉండేది. కాని ఇక్కడ పూజకు కావలసిన వస్తు సామగ్రులు లేవు దైనందిన విధి నిర్వహణలకు వలసిన వస్తు సామగ్రులను భద్రపరచిన పెట్టె మాణిక్ పాటనా ముఖ ద్వారము వద్ద జడి వానవలన పడి వతోపాటు మునిగి పోయినది. ఏ ఒక్క వస్తువు కూడ మిగుల లేదు.

ప్రభువు అంగ వస్త్రము, ఉత్తరీయము బురదతో మలినమైనవి. మాలలు, మొదలగునవి ఛిన్నాభిన్నమై పోయినవి. ప్రభువు వారి శ్రీఅంగము ఆపాదమస్తకము ఆవరణ హీనముగ గోచరిస్తున్నది. శ్రీఆంగమునుండి మరికి వస్త్రములను తొలగించుటకు దయితాలలో ఏ ఒక్కరికి సాహసము లేదు. ఏమి చేయుటకు తోచక వారు ఒకరి ముఖము ఒకరు చూసుకొంటున్నారు.

వేదికకు సమీపములో ఒక ఇసుక తిన్నెపై కూర్చుని రామచంద్రదేవ్ తదేక దృష్టితో జగన్నాథుని వీక్షిస్తున్నారు ఓరియా జాతి సౌభాగ్యముకూడ ఇదే స్థితిలో ఉన్నదని వారు మనస్సులో అనుకొన్నారు. ప్రభువు వలెనే నేడు ఓరియా జాతి కూడ శ్రీహీన, సర్వస్వాంత. ఉన్నదంతా పోయినది. కేవలము దుర్జయమైన ఒక్క అభిమానము మాత్రము మిగిలి యున్నది. బురదతో కూడుకొన్న జగన్నాథ విగ్రహమును రామచంద్రదేవ్ తదేక ధ్యానముతో చూస్తున్నారు.

చాల కాలముగ క్రమాగతమైన పరిశ్రమ, ఉత్తేజనము, ఉత్కంఠ, ఆశంకల వలన కిసలయ సదృశమైన వారి సౌమ్య సుందర శరీరము వర్షక్లాంతమైన వనస్పతివలె వాడి వడలినట్లు కనిపిస్తున్నది. మాసిన గడ్డము, పెరిగిన మీసము, బిరుసెక్కిన కేశములు, మలినమైన ఎర్రని కండ్లు ఇవన్నియు చేరి వారి కొక భ్రష్ట కాపాలిక రూపమును చేకూర్చినవి.

ఓహో! నేడు జగన్నాథుడు గూడ మహా భైరవు డయినాడు!

ఉత్కళ జాతికి శిరోమణి, గౌరవ చిహ్నము. జగత్పతి అయినటువంటి జగన్నాథుని రత్నసింహాసనా డంబరమును వీడి ఈ నిర్జన వన భూమికి వేంచేసినాడు.

ఈ విధమైన ఆలోచనలు కలిగి నంతనే రామచంద్రదేవ్ విస్మయ విషాదములతో మ్లాన వదను లయినారు. వారికి కొలది దూరములో అలసి ఉన్న సాన్ పరీచా విష్ణు కబాట్ మహాపాత్ర కూర్చుని కూర్చుని నిద్రలోనికి జారి

పోయినాడు. దయితా లిరువురు జీవచ్ఛవములవలె వేదిక వద్ద నిల్చుండి పోయినారు.

ఇప్పుడు ప్రభువుకు పూజ, ఆరతి మొదలగు విధులను ఎట్లు నిర్వర్తించ వలెనని వారు ఆలోచిస్తూ చింతాక్రాంతు లైనారు.

ఆ కిం కర్తవ్య విమూఢ స్థితిలో లక్ష్మీ పరమ గురు జగన్నాథుని ఎదుట దండాయమానులై నిల్చుని ఉచ్ఛ స్వరముతో ఆవృత్తిచేయ నారంభించినారు-

"నీల జీమూత సంకాశః పద్మపత్రాయ తేక్షణః
శోణాధర ధరః శ్రీమాన్ భక్తానా మభయంకరః
బలభద్ర స్తథా సవ్య ఫేణో వికట మస్తకః
కున్దేన్దు శంఖ ధవళః ప్రకాశోహమమ్బుజ లోచనః
గుప్త పాదకరాంభోజ సముత్తోలిత సద్భుజః
భక్తానా మవనా యేవ తథా భద్రావి భద్రదా॥"

కాని రామచంద్రదేవుని మనస్సు ఎంత దుర్భావనా రహితముగ నున్నదో అంతకన్న అధికముగ ఒక ఉత్పాదకమైన విస్మయము వారి మనస్సును ఆవరించి యున్నది

ఏ సమాధి రహితమైన గహన రహస్యముయొక్క ప్రతి రూపము ఈ జగన్నాథుడు? సృష్టియొక్క ఏ ఆదిమ ప్రభాతములో, ఏ ప్రళయ పయోధి యొక్క విధ్వంసక లీలలో ఈ శేష దేవుడు దారువు రూపములో కొట్టుకొని వచ్చినాడు?

చరిత్రలోని మహాపదనందుని మొదలుకొని రక్తబాహు మొదలగు యవన సేనాపతులు ఎంత మంది ఈ గహన రహస్యమును ఛేదించుట కొరకు ఎన్నెన్ని దండయాత్రలు చేయలేదు!

ఒకప్పుడు దుర్గమ వన కాంతారములకు పలాయితుడయితే వేరొకప్పుడు భూమిలో 'పాతాళి' అయినాడు యీ జగన్నాథుడు. మరొక్కప్పుడు మహా

ప్రళయ పయోధిలో నివసించినాడు. అయినప్పటికిని శూన్య వేదిక నుండి యవనిక తొలగింపబడి యీ విధముగ శూన్య రూపమున బయల్పడలేదు. నాశ రహితమైన ఆత్మయొక్క అపరాజేయమైన విగ్రహము అది. దుర్వినీతుడైన మానవుడు దానిని ఎలా స్పృశించగలడు?

బలవంతుని అత్యాచారములను, బాధలను వంచల కొలచిగ సహించి సహించి మానవ శరీరము మాటి మాటికి వినాశన మౌతున్నది. కాని మానవుని ఆత్మ మాత్రము అపరాజేయముగ నిల్చి ఉంటున్నది. మృత్యువుయొక్క శత శత పూత్కారములను తుచ్ఛముగ త్రోసివేసి జీవన దీపము నాశ రహితముగ వెలుగొందుచున్నది. వినాశనము యొక్క శత ప్రమత్త తాండవములలో గూడ సృష్టియొక్క ప్రేరణా స్రోతస్సు ఇంకనూ అగాధముగనే ఉన్నది. ఆ మహా ముక్తియే, ఆ మహా పూర్ణత్వమే శ్రీ జగన్నాథుడు. ఆ మహాశూన్యత యొక్క అనిర్వచనీయమైన, ఆద్యంత రహితమైన భావ మూర్తియే జగన్నాథుడు.

జగన్నాథుడు సమస్త ఒరియా జాతియొక్క పుంజీభూతమైన గౌరవము. ఆ జాతియొక్క అపరాజేయతకు ఆరాధ్య దైవము. దాని సర్వ శుభాశుభములకు 'జయ జగన్నాథ్' ఆయన

తన తుచ్ఛమైన అభిమానమును పరిరక్షించుకొనుటకు శ్రీవత్స ఖండాల మందిర రత్న సింహాసనమునండి జగన్నాథుని లేవనెత్తి జాలర్ల నావలలో చిలికాలోని యీ సర్కండా వనములోనికి తీసికొని వచ్చి నందుకు రామచంద్రదేవ్ మనస్సులో చాల పరితాపము చెందుతున్నారు.

అమీన్‌చంద్ శ్రీమందిరమతో అధికారము చేపట్టి, పురుషోత్తమ క్షేత్రముపైనున్న సమస్త అధికారములను తాము కోల్పోయినంత మాత్రమున వచ్చు నష్టమేమున్నది? తమ ఆత్మ గౌరవము కొరకు జగన్నాథుని ఆట బొమ్మను జేసి ఇక్కడకు తీసికొని రావడము అపచారము కాక మరేమిటి అవుతుంది?

సాన్ పరీచా సహాయముతో జగన్నాథుని పతిత పావనునిగ చేసిన కపట నాటకమును గురించి స్మరించినంతనే రామచంద్రదేవుని పశ్చాత్తాపము ఎక్కువ గంభీరము, దుర్భరము కాజొచ్చినది.

కాని, ఓడ్ర జాతియొక్క అపరాజేయతకు సంకేతము జగన్నాథుడే కదా!

తుచ్ఛమైన స్వచ్ఛంధత మరియు నిరాపదత్వము కొరకు కొంత మంది మానవ ద్రోహుల చేతులలో జగన్నాథుడు అవమానము పాలు కానున్నప్పుడు ఆయనను వడలి వచ్చి పెట్టు!

కాని ఇంతకు తాను ఎవరు?

మత భ్రష్టుడైన హాఫిజ్ కాదరా! లేక జగన్నాథుని రాజ సేవకుడైన రామచంద్రదేవా?

ఒక దుర్బల చిత్తుడుగా, మత భ్రష్టుడుగా, జగన్నాథ ద్రోహిగా తన పేరును చరిత్రకారులు చిత్రించవచ్చును. కాని చరిత్రకు అతీతుడుగా ఏ అంతర్యామి, సర్వద్రష్ట ఉన్నాడో ఆయన ఒక్కడే ఈ రామచంద్రదేవుని మానసిక క్షోభలు, సంఘర్షణలు, విషాదములు, కష్టములు తెలిసికొనగల సర్వశక్తి సంపన్నుడు.

బురదతో నిండిన జగన్నాథుని వస్త్రములను ఉతికి శుభ్రపరచుట అవసరము. కాని వాటిని తీసివేసిన మరి స్వామివారికి వేరు వస్త్రములు? దయితాలు ఏమి చేయుటకు తోచక చింతాక్రాంతులైనారు. వారిలో వారికి చర్చ ప్రారంభమయినది.

"వస్త్రములను ఉతికి శుభ్రపరచే వరకు స్వామి దిగంబరుడుగానే ఉంటాడా?" అని ఒక దయితా వేరొకనిని అడిగినాడు.

లక్ష్మి పరమ గురు పెద్ద పెట్టున నవ్వి "మహాపాత్రజీ! సముద్రము ఎవరికి వస్త్రముగా ఉంటున్నదో; గాలి ఎవరికి ఉత్తరీయముగ ఉంటున్నదో, ఆకాశము ఎవరికి చంద్రానసముగా ఉంటున్నదో, అట్టి ప్రభువును గురించి మీరెందుకు చింతిస్తున్నారు? ఆలోచనలు ఎందుకు?" అని అనినారు.

ఒక దయితా వేదిక మీదకు ఎక్కి జగన్నాథుని అంగవస్త్రమును విప్పి అందిచ్చినాడు.

ఆవరణ రహితమైన విగ్రహములు దిగంబరమైన విశ్వాత్మవలె హఠాత్తుగ ఉద్భానితమైనవి. విగ్రహములను అనావృతము చేసిన సేవకులు గూడ స్తబ్ధులై శిలవలె నిల్చుండి పోయినారు. ఆ తరువాత ఏమి చేయవలెనో ఎవరికిని తోచ లేదు. ఈయన పీతాంబర పరిధానుడు, నీల జీమూత రసరాజు అయిన జగ న్నాథుడు కాడు.....దిగంబరుడైన మహాభైరవుడు.

స్వామి వారికి విధులు క్రమ ప్రకారము నిర్వర్తింపబడుచుండెనివి. దయితాలు కుండలతో తీర్థజలమును తెచ్చేవారు. దంత ధావన సామగ్రిని, స్వర్ణ పాత్రలను భండారవు "సుఆర్ ఐదు"లు తెచ్చేవారు. ఇదే విధముగ ఖటులీ సేవకుడు పీట, 'దర్పణ' అద్దము, 'ఆఁవేలా ఘటుఆరి' ఆమలక చందనాదులు, కర్పూరము మొదలగునవి భండార్ మేకాప్ తీసికొని వచ్చి ప్రభు సేవకు సిద్ధముగా ఉండేవారు. ప్రత్యేక విధికి, ప్రత్యేక సామగ్రికి, సముచిత ఏర్పాటులను కావించుటకు ప్రత్యేక సేవకులు ఉండేవారు.

కాని ఇప్పుడు అవన్నియు అసంభవము. అయినను కనీసము దంత ధావనము, ముఖ ప్రక్షాళనము జరుగవలెను కదా?

పల్లుతోము పుడకలను, ఫల మూలాదులను వెదకికొని వచ్చుటకు జగుని నియోగింపబడినాడు. తరువాత గోపాల వల్లభ భోగము జరుగవలసి ఉన్నది. సేవకులు యీ విషయము లన్నిటిని గురించే చర్చిస్తున్నారు.

ఆవరణ హీనమైన జగన్నాథుని దిగంబర మూర్తిని రామచంద్రదేవ్ తదేక దృష్టితో చూస్తూ ఆలోచిస్తున్నారు. ఆ లలాట ఫలకమువైన మణిమయ తిలక శోభ ఏది? ఏదీ ఆ నీరద సదృశ్యమైన చక్కని మేని కాంతి? అరుణా ధరములైన ఆ రహస్యమయ మందహాస మేదీ?

జగన్నాథు డిపుడు నిఖిల మానవాళి యొక్క ఆత్మవలె ఆడంబరముల నన్నిటిని పరిహరించి, ఈ దుర్గమ వన ప్రాంతరములో సత్యముయొక్క నిష్కా పట్యము, సంగ్రామము యొక్క అపరాజేయతల మధ్య ఒక కఠోర కాంతితో దీప్తివంతుడైనట్లుగా ఉన్నాడు.

ఎవని సంగ్రామ-కఠోరమైన జీవితములో ముక్తిని అన్వేషించుటకు కూడ సమయము లేదో, ఎవని చీకటి రాత్రికి ప్రభాతము లేదో, ఎవని దుర్గమ పథమునకు అంతములేదో అట్టి అభిశప్త మానవునివలెనే జగన్నాథుడు కూడ ఉన్నాడా?

హే మహాబాహో! నీవు దారితప్పినవానికి దారి చూపిస్తున్నావు, అగాధ జలములో మునిగి వానిని లేవనెత్తుతున్నావు...నీవు మానవ జీవిత రథసారథివి!

మానవ జీవితము నిర్మమ మయితే నీవు నిర్మమ తరుడవు, జీవితము వంచితమయితే నీవు అందరి కన్నను ఎక్కువగ వంచితుడవగుచున్నావు.

ఆవేగము వల్లనో, మరెందువల్లనో గాని రామచంద్రదేవుని కండ్లనుండి అశ్రుధార ప్రవహించినది.

అడవి తుప్పలలో ఏదోశబ్దము వినవచ్చినది. వెంటనే అందరూ ఆదిక్కునకుచూసినారు.భుజమువైన ఒక నేరేడు కొమ్మను పెట్టుకొని,చేతులలో రకరకములయిన పువ్వులను తీసికొని అమితానందముతో హనుమంతునివలె వస్తున్నాడు జగుని. ఒక దుర్గమును స్వాధీనపరచుకొన్నంత సంతోషముగా ఉన్నాడు.

నేరేడు కొమ్మను నేలమీద వెట్టి "ఈ అడవిలో ఈ నేరేడు తప్ప ఇంకేదీ లేదు." అని అన్నాడు జగుని.

ఆ కొమ్మ స్వచ్ఛమైన ఫలములతో నిండుగా ఉన్నది. వీటితోనే ప్రభాత పూజ, గోపాలవల్లభ భోగము, మధ్యాహ్న భోగము, బడ్‌సింహార్ ఆరాధన, 'ఛప్పన్ పటి' భోగము కూడ జరిపించవలసి ఉన్నది.

ప్రభువుకు దంతమార్జనము, స్నానాడకములు చేయించి, ఒక దొన్నెలో జంబూ ఫలములను వెట్టి సేవకులు పూజా ప్రయత్నములు చేస్తున్నారు. పంచోపచారములతో పూజ కావించి, నేరేడుపండ్ల భోగమును జరుపుటకు ముందు మట్టిపైన సేవకులు జలసేచనము చేస్తున్నారు.

రామచంద్రదేవ్ వేదికకు చాలా దగ్గరలోనికి వచ్చినారా?

రథము మీద చేశాపహరా, యితర రాజ విధులను నిర్వర్తించుట వేరు విషయము. కాని పూజా సమయమందు వారు విగ్రహములను ఎట్లు తాకగలరు? వారు షతాంతరులై నందుకు ఇంతవరకు వారికి ప్రాయశ్చిత్త కర్మకాలేదు.

"ఛామూ! ఇప్పుడు భోగము జరుగుతుంది తమరు కొంచెము ప్రక్కకు తప్పుకొనండి!" అని ఒక సేవకుడు అనినాడు.

బెత్తముతో దెబ్బ తిన్నట్టుగ రామచంద్రదేవ్ వైదొలగినారు. అలిగిన కుర్రవానివలె "ఓ స్వప్న సంభవా! నీవు చేరువలో ఉంటూ కూడ చాల సుదూరుడవుగా ఉంటున్నావు! నీ ఇచ్ఛానుసారము నీవు బాగా చేరువయినప్పుడు, అంజలియే శూన్యము అవుతున్నది!...నీకు పూజ, ఆరాధన అశ్రువులతోనే జరుగుతున్నది." అని ఆయన తన మనస్సులోనే అభియోగము చేయ సాగినారు.

వనభూమిని నినదింపజేస్తూ లక్ష్మీ పరమగురు

"ఓం మధువాతా ఋతాయతే, మధుక్షరంతి సింధవః
మాధ్వన్ సంతౌషధి మధునక్తం ఉతోఽసఖౌ
మధుమాన్నో వనస్పతే మధుమాన పార్థివో రాజః
మధు ద్యిరోష్టినో పితా మాధ్వీర్గావో భవంతునః
ఓం మధు మధు మధు -"

అని మంత్ర పఠనము గావించ సాగినారు.

చివరకు ఏది ఏమైనప్పటికిని జగన్నాథుడు ప్రస్తుతము యిక్కడ నిరాపదుడుగ ఉంటాడు. మాల్‌ద్‌ఫౌజ్‌దార్ కాని, అమీన్‌చంద్ గాని ఈ రహస్య స్థలమును సులువుగ తెలిసికొనలేరు.

కాని దీని తరువాత ఆయన ఎక్కడకు వెళ్ళతాడు?

అక్కడ నుండి పచ్చి చిలికా సరస్సులోని ధూసర జలరాశివైపు తదేకముగ చూస్తూ ఈ విషయమే రామచంద్రదేవ్ ఆలోచిస్తున్నారు. సర్కండా

వనమును అనుకొని చిలికా సరస్సులోని తరంగములలో నావ ఒకటి తేలియాడు తున్నది. ఒక దుర్భరమైన బరువు తలపైనుండి దిగినట్టుగా ఉన్నది. అయినప్పటికి స్వస్తియొక్క ప్రపుల్ల ఛాయలు కానరావడము లేదు. రామచంద్ర దేవ్ మనస్సులో మనస్సులోనే క్లాంతులయి పోతున్నారు.

కాని విశ్రాంతి ఏదిఁ దారి ఎక్కడ ?

సర్కండా వనతీరమున తరంగాయ మానముగ చిలికా సరస్సు నాట్య మాడుతున్నది. రామచంద్రదేవ్ నడచి వెళుతున్నారు. వారి వెనుకనే జగుని నడుస్తున్నాడు. కాని అది గమనించే మానసిక స్థితిలో వారు లేరు.

"ఎక్కడకు వెళుతున్నారు?" అని జగుని అడిగినాడు. చుక్కాని భుజానవేసికొని వాడు ఎక్కడకు బయలుదేరినాడో తెలియదు.

వర్షముతో తడసిన సర్కండా వనమును, లతా కుంజములను రామచంద్ర దేవ్ తిలకించి ఆలోచిస్తున్నారు— ఇక్కడ యీ చెట్లనీడల క్రింద చల్లని ప్రశాంతి ఉన్నది...కాని ఇక్కడ ఆయన వంక్రిబాహ్యాలు...వారికి ఇక్కడ స్థానమేదిఁ ఎదుట అనంతమైన సంగ్రామము.

ఒడ్డున ఉన్న ఏరావతి ఒకటి తన అలసిన రెక్కలను ఆడించుకొంటూ ఎగిరి వెళ్ళిపోయినది.

రామచంద్రదేవ్ నావ తీసికొని బయలు దేరినారు. కాని ఎక్కడికి వారి ప్రయాణముఁ ఏమోఁ

జగుని సర్కండ వనతీరము వెంబడినే నావను నడిపిస్తూ, "ఎక్కడకు వెళతారుఁ...ఎటువైపుఁ" అని అడిగినాడు.

ఎదుట దరిలేని అగాధమైన ధూసరవర్ణపు చిలికా సరస్సు, పైన మేఘరహితమైన వినీల ఆకాశము...ఒకనీల మరు భూమి...

— —

శబ్దార్థ సూచిక

ఆంకము, అబ్దము - రాజుగారు సింహాసనము నధిష్ఠించిన సంవత్సరము.

ఆజసర్ పీఠ్ - జగన్నాథుని విశ్రామ స్థలము.

ఆమలాబేకి - ఆలయపు విశేషాంశము మరియు అలంకరణము.

ఆషర్ఫీ (ఆశర్ఫీ) - మొగలుల కాలమునాటి ఒక బంగారు నాణెము.

ఆంబకషి - పుట్టింటి గ్రామపు బాల్య సఖిని ఆదరముతో పిలుకరించు ఆత్మీయ సంబోధన.

ఇమాంబాడా - మహమ్మదీయుల తాజియాలు ఉంచు స్థలము, మహమ్మదీయులగోరీల దొడ్డి.

ఉమ్రావ్ - రాజ సభాసదుడు

ఏరా - సముద్ర తీరమందు నివసించు ఒక రకమైన పక్షి

ఓఢ - వెడల్పయిన తొనలుగల ఒక రకమైన పుల్లని పండు

కాజీ - ముస్లిమ్ న్యాయాధికారి

కాఫిర్ - ముసల్మాను మతానుసారము అల్లాను (ఈశ్వరుని) అంగీకరించనివాడు, ముసల్మానుల అభిప్రాయములో హిందువు.

కాలసీ - ఒక దేవీ విశేషము

కాలీఆ ఠాకుర్ - నల్లనిప్రభువు, నీల చక్రవర్తి, కృష్ణుడు

కాహాణ్ - ఒరిస్సాలోని ఒక నాణెము - ఒక అణా

కుడు ఆ - జగన్నాథుని మహా ప్రసాదమును ఉంచు ఒక మట్టిపాత్ర

కోర్నిష్(శ్) - వంగి చేయు సలాము

కౌడీ - గవ్వ, పైస

ఖలీఫా - ముసల్మానుల సర్వ ప్రధానమైన మత పెద్ద, అనుభవజ్ఞుడు, వంటవాడు, మంగలి

గత బంధన్ - వివాహ సమయమందు పధూవరుల వస్త్రపు కొంగులు కలివి.

వేయు ముడి - కొంగుముడి.

గాఁవ్ - గ్రామము, ఊరు

గోటి పుఅ - ఒక రకమైన నృత్యము - స్త్రీ వేషమును ధరించిన తరుణ నర్తకుడు

గోప పుండరీక్ సాడి (చీర) - ఖోర్ధా రాజుయొక్క రాజ్యాభిషేక సమయములో జగన్నాథుని అంగీకార సూచకముగా ఆయన వద్దనుండి అభించు తలపాగ వస్త్రము లేక శిరో వస్త్రము

చకా డోలా - చక్ర బాలకుడు (జగన్నాథుడు), (నేత్ర) చక్రచాలనము

చర్యా గీతిక - 84 గురు సిద్ధాచార్యులచే వ్రాయబడిన బౌద్ధమత (సహజ యానము) ఆచరణ విధులతో కూడిన కవిత

చార్ - రథము పై నెక్కుటకు వేయు పెద్ద నిచ్చెన

చితా - దేవతా విగ్రహముల నొసటను ధరింపచేయు తిలకము

చోగా - కంఠము నుండి పాదముల వరకు తొడుగుకొను అంగరక్ష లేక గౌను

ఛపన్ పడీ - జగన్నాథాలయములో ప్రతి దినము నివేదింపబడు అన్న మహా ప్రసాదముయొక్క పరిమాణము-సుమారుగ 5600 సేరులు

ఝాటీఆ - రాజావారు వెళ్లుచున్నపుడు వేత్రము (బెత్తము)ను ఆడించుచూ ఎదుటి జన సమూహమును ప్రక్కలకు తొలగించు కర్మచారి

ఛాము - సమ్మాన సూచకముగ రాజావారిని సంబోధించు పదము

ఛేనా - పాలను విరిచి నీటిని తీసివేయగా వచ్చు జున్ను - పాలవిరుగు జున్ను

ఛేనా పహరా - జగన్నాథుని రథయాత్ర సందర్భములో రథముల మీద చందనము చల్లి బంగారు చీపురుతో రాజుగారు ఊడ్చు విధి.

జణాణ - ఒరియా భక్తి గీతము

జేనామణి - యువరాజు

టాహి ఆ - వివిధ పుష్పములతో అలంకరించి తయారు చేసిన స్వామివారి పెద్ద పుష్ప కిరీటము

చెంచే ఇ ఆ - చెంటా పక్షి - పొడుగు ముక్కుగల ఒక రకమైన పక్షి

డాహుక్ - క్రౌంచ పక్షి

ధవఘర్ - నజరానాల రూపములో చెల్లించు వస్తువులను ఉంచు స్థలము

తట్టు, (టట్టూ) - పొట్టి గుర్రము

ధడాపాను - ధరిత్రి, భూమి

దారోగా - పోలీసు ఇనస్పెక్టర్

దిగాల్ - రాజు

దీవాన్-ఏ-ఆమ్ - ప్రజలందరు రాజును చూడగల దర్బారు

దీవాన్-ఏ-ఖాస్ - రాజుయొక్క ప్రత్యేక లేక ప్రధాన కొలువు కూటము

దేయి, దేయా - దేవి

ధోయా ములక్ - ఏటా వరదలకు గురి అగు మహానదీ డెల్టాకు పార్శ్వమందున్న ఇలాకా లేక జమీందారీ ప్రాంతము

నర్కుల్, నర్, నర్కట్ - వేమువంటి ఒక చెట్టు

నరేంద్ - పూరీ జగన్నాథాలయములోని నరేంద్ర పుష్కరిణి

నాజిమ్ - మహమ్మడీయ పరిపాలనా కాలములోని గవర్నరు లేక సూబేదారు

నాయబ్ - ముఖ్య సహాయకుడు

నాయబ్ నాజిమ్ - లెఫ్ట్‌నెంట్ గవర్నర్

నిమక్ భాహాల్ - సముద్ర జలముతో ఉప్పు తయారు చేయు స్థలము, ఉప్పు రాబడి నిచ్చు ఇలాకా

పంచకము - కార్తీక మాసములోని చివరి ఐదు రోజులు

పండా - పూజారి

పహండీ - ఠాకుర్‌లను రథముల వద్దకు తీసికొనివచ్చు ఉత్సవ యాత్ర

పహడ్ - శయనము, శయనోత్సవము

పాంజిఆ మహంతి - పంచాంగమును గుణించువాడు

పాట్ జోడ్ - పట్టు వస్త్రముల జత

పాతాళ(ళి) - భూ గర్భములో దాచుట, దాగుండుట

పాని - నీరు, వర్షము, కాంతి, వీర్యము లేక పుంస్త్వము, పాణి లేక చేయి, లజ్జ, గౌరవము, పదును లేక ధార, రసము, మలాము లేక పూత, వైరము, సంవత్సరము, ద్వంద్వ యుద్ధము, వాతావరణము

పాయిక్, పాఇక్ - వంశపారంపర్యముగ భూసంపత్తి లేక భత్యమును పొందుచున్న జగన్నాథ సైనికుడు

పాహాడా - నైవేద్య పీఠము మరియు యితర దైవ పీఠముల మీద పరచబడు రత్న కంబళము

పీర్ - మత గురువు, మహాత్ముడు

పైగంబర్ - ప్రవక్త, ధర్మమార్గ ప్రవర్తకుడు

పోఖరీ - పుష్కరిణి, చిన్న చెరువు

పోడ్‌పిఠా - పాల విరుగుతో చేయు ఒక విధమైన మిఠాయి

ఫౌజ్‌దార్ - మహమ్మదీయ సేనాపతి లేక కమాండర్

బఉల్ - చూ ఆంబకషీ

బడ్/ఇద దాండ్ - జగన్నాథాలయమునుండి మాఉసీ ఆలయము వరకు ఉన్న రాజవీథి, రథయాత్ర జరుగు విశాల వీథి

బడ్/ఇద పరీఛా - శ్రీమందిరపు లేక జగన్నాథాలయపు ప్రధాన సంచాలకుడు

బాయాస్ పావచ్ఛ(లు) - జగన్నాథాలయపు నాలుగు ప్రవేశ మార్గములందు ఉన్న యిరవై రెండు పావంచాలు లేక మెట్లు - ఈ సంఖ్య ఒక ఆధ్యాత్మిక విలువకు ప్రతీకమని ప్రజల నమ్మిక

బేఁగ్ బాఇద్ - కప్ప తోలుతో మూయబడిన ఒక పిల్లల ఆట వాద్యము

బోయిత్ - నావ, బోటు, పడవ

భండార్ ఘర్ - సరకులగది

భటువా(ఆ) - తాంబూలపు వస్తువులుంచుకొను అరలుగలచిన్ని గుడ్డసంచి

భరణము - 400 సేర్ల పరిమాణము గల ఒక తూనిక

మలాంగీ - అనేక నావలను కట్టి తయారుచేయు తెప్ప

మహేంద్ర ముహూర్తము - మంచి ముహూర్తము

మాజణా మండపము - స్నాన మండపము

మాదలా పాంజి - పదకొండవ శతాబ్దినుండి జగన్నాథాలయము, గజపతి రాజులు మరియు ఆయా కాలములనాటి పరిస్థితుల గురించి కాలానుక్రమముగ వ్రాయబడిన వివరణ గ్రంథము- "మాదల్" అనగామర్దల్ లేక మద్దెల ఆకారములో కట్టబడి యున్నందున దానికి మాదలా పాంజి అను పేరువచ్చినది

మియాఁ - మహాశయుడు,వృద్ధ ముసల్మానుడు

మీర్ - మత నాయకుడు, ప్రధానుడు, సర్దార్

ముక్తి మండపము - జగన్నాథాలయములోని విశిష్టమైన దిగ్గజ పండితుల సభ. ఆచట న్యాయాన్యాయ విచారణ జరుగుటకు తోడు ఆలయ విధులు, క్రమశిక్షణ కూడ నిర్ధరించ బడుతవి

ముజాహిద్ - మత యోధుడు

ముసాహిబ్ - నవాబు లేక రాజుతో యిచ్చకము లాడుతూ వాని వెంట నుండేదర్బారీ లేక రాజసభాసదుడు

లష్కరు - లస్కరు, సిపాయిదండు, మహమ్మదీయ సైనిక శిబిరము

వజీర్ - మంత్రి

వాకియా నవీస్ - వార్తా విలేఖరి

విశ్వావ(బ)సు - శ్రీ క్షేత్రమైన పూరీలో విరాజమానుడగుటకు పూర్వము జగన్నాథుడు యీ శబర భక్తుని ద్వారా శబరీ నారాయణ రూపములో పూజింప బడుచుండేవాడు

శరధా బాలీ - శ్రీజగన్నాథుని శ్రద్ధాకుకంపలతో నిక్షమైన బిడ్డాండ్ధూళి

శాసన్ - బ్రాహ్మలకు రాజులు దానమిచ్చు అగ్రహారము.

శ్రీనవర్ - రాజ ప్రాసాదము

శ్రియా - జానపద గాథలలో వర్ణించబడిన లక్ష్మి భక్తురాలయిన ఒక చండాలిని

షహీద్ - మతము లేక ఆదర్శము కొరకు ఆత్మ బలిదానము గావించుకొన్నవాడు

సయీద్ - సుముహూర్తము

సర్కండా - శరములు తయారు చేయుటకు ఉపయోగపడు ఒక రక మయిన వృక్షము

"సీలశైల" కథావస్తువు ఒరిస్సాయొక్క పద్దెనిమిదవ శతాబ్దపు చరిత్రనుండి సంగ్రహించ బడినది. అందులో ఆ కాలమునాటి ముసల్మాన్ పాలకుల మత లేక ధార్మిక అసహిష్ణుత యొక్క వర్ణన మనకు లభిస్తుంది. కటక్‌లోని ముసల్మాన్ సూబేదారు తకిఖాన్‌కు హిందువుల ధార్మిక భావనలపట్ల యిసుమంతైనా సహానుభూతి లేదు. అతడు ఎల్లప్పుడు జగన్నాథుని సంపదను దోచుకోవాలని పొంచి ఉండేవాడు. మరొక వైపు మతాంతరుడైన తోర్హా ముస్లిమ్ సూబేదారు షేఖ్ హాదర్‌బేగ్ జగన్నాథ ప్రభుని పరమ భక్తుడుగా ఉండేవాడు. ఆయన జగన్నాథ సంప్రదాయపు ప్రశంసకులలో ఉత్తమోత్తముడని చరిత్ర చెప్పుతున్నది. జగన్నాథుడు మాత్రము వ్యక్తిగత ప్రార్థనలకు కరగిపోయి మనోభీష్టసిద్ధిని లభింపజేసే ఈశ్వరుడుగానే కాకుండా ఏశ్వ్యాపుత్తై సర్వాతీతుడుగా కూడ ఉంటాడు.

శ్రీ సురేంద్ర మహాంతి (జననం 1922) ఒరియా భాషలో పేరు చెందిన రచయితే కాకుండా పత్రికా రచయిత కూడ. ఒరియా సాహిత్యములో వీరికొక విశిష్ట స్థానమున్నది. వీరి "సీలశైల" నవలకు 1969వ సంవత్సరములో సాహిత్య అకాడెమి వారి పురస్కారము లభించినది.

అనేక మనోరంజక ఘట్టాలతోను, అనుపమ పాత్రలతోను నిండియున్న యీ నవల ఎంతో రుచిపూర్ణముగాను, పఠనీయముగాను ఉంటుంది.

Rs. 13-50

నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా

A32

Check List

Book Number	MBOIJ200	Date	23/11/21
Front Cover	NO	Back Cover	YES
Blank Pages	43, 424		
Missing Pages	I, II, 151 to 178		
Prepared By	Sireesha	Cutting By	Sireesha
Scanned By	Maveni	Pages	423